

శ్రీ
శ్రీనివాస్
వాయిల్స్
లాన్స్
ప్రింట్స్
పాప్లిన్స్
ఆకర్షణ కలిగించు వస్త్రాలు
SN/C/23

ఆంధ్రపత్రిక

శుభకృన్నామ సంవత్సరాదిసంచిక

[ఏబదిమూడవ సంచిక]

[1962 - 63]

★

సంపాదకులు:
శివలెంక శంభుప్రసాద్

★

వెల రూ. 2

ఆంధ్రపత్రికా కార్యాలయమున ముద్రితము.

శుభకృన్నామ సంవత్సరాది సంచిక

విషయానుక్రమణిక

త్రివర్ణ చిత్రాలు

ADVERTISER'S INDEX

ఓమ్

ప్రస్తావన

అనంతమైన కాలములో ఒక్క సంవత్సరమన్నది అత్యల్పమైనట్టిది. కాని కొన్ని అట్టి అల్పములైన సంవత్సరములు గడిచినచో శతాబ్దమగుచున్నది. అనగా అల్పములైన విషయములతో అనంతములైన విషయములు సందర్భపడుచున్నవి. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక ఇప్పటికి ఏబదిరెండు ఏండ్లక్రిందట నెలకొల్పబడి ఏయేటి కాయేడుగా ఏబదిమూడవ సంవత్సరమున ప్రవేశించినది. ఈ అర్థశతాబ్దమునకుపైగా ఈ సంచిక ఆంధ్ర సాహిత్యాభివృద్ధియందేమి, సమాజాభ్యుదయమందేమి, రాజకీయరంగములోనేమి ఆంధ్రుల మేధాసంపత్తికి అభివ్యక్తిని చేకూర్చుటలో వేదికగా నమకూడియుండుటయందు నిర్వహించిన భూమికను మాకు మేమై చెప్పకొనరాదు. ఆ విషయ మాంధ్రుల కందరికిని తెలియును

దశమున కవిత్వమేమి, శిల్పమేమి, కాలమునకు వ్యాఖ్యానములవంటివని వేరుగాచెప్పవలసిన యవసరము లేదు. గతసంచిక అనంతరము అట్టి కాలములో పండ్రెండు నెలలు గడిచిపోయినవి. ఈ కాలములో సాహిత్యమునసేమి, చరిత్రలోనేమి, ఇంకను ఇతర రంగములలోనేమి ఎన్నియో మార్పులు జరిగినవి. సాహిత్యములో నూతనసృష్టి జరుగుచున్నదిగాని దాని కింకను ఒక స్పష్టమైనరూప మేర్పడలేదు. పరివర్తనము చెందిన పరిస్థితులలో వ్యక్తి తన్నుతాను వెదికికొనుచున్నట్లే, సాహిత్యముగూడ తన్నుతాను వెదికికొనుచున్నది. సాంకేతికయుగము మనదేశమున గూడ ప్రారంభమైన కారణమువలన దానితోడికల్గు సత్ఫలితములు,దుష్ఫలితములు గూడ పొటమరించుచున్నవి. అవి ఇంకను ప్రస్ఫుటమగు పరిపక్వస్థితి యేర్పడని కారణమున యుగసంధిలోవలె వ్యక్తి, అతనితోపాటు కాలమును, తమ ఉనికియొక్క ఆవరణమునుగూర్చి, అర్థమునుగూర్చి పునఃపర్యాలోచనము చేసికొనుట జరుగుచున్నది. విచిత్రమేమనగా ఈ సాంకేతికయుగావతరణము తెచ్చిన, తెచ్చుచున్న మార్పులు నిగూఢములై, జనుల జీవితముపై తమ ప్రభావమును చూపుచు, అందువలనకల్గు అనుభవమును మాత్రము వ్యక్తికి, కాలమునకు అందని పరిస్థితిని కల్పించుచున్నవి. అందువల్లనే కొందరు దానిని పరామర్శించక వ్యతిరేకించుటయు, కొందరు ఆ మార్పే అభివృద్ధియనుట జరుగుచున్నది. వారు అనభిజ్ఞులు. అభిజ్ఞులైన పండితులు, ప్రతిభావంతులయిన సాహితీపరులు ఈ సంధికాలపు రహస్యములను అవగతము చేసుకొని, వానిని సాహిత్యరూపమున వ్యక్తముచేయ కల్గుచో తెల్గుసాహిత్యము విధిగా మారాకుహత్తగల్గుననుటకు అభ్యంతర ముండవలసిన అగత్యము కన్పించుటలేదు

రాజకీయముగాగూడ దేశములో మార్పులు వచ్చుచున్నవి. ఈ సంవత్సరమున జరిగిన ఎన్నికలలో కాంగ్రెసుపక్షము నెగ్గినను ప్రతిపక్షములుకూడ పూర్వముకన్న అధికముగానెగ్గుట తటస్థించినది. ఇందులోగూడ కాలములోవచ్చిన మార్పు ద్యోతకమగుచున్నది. అది యేమనగా ఇది ఇట్లుజరుగునని చెప్పుటకు ఎవ్వరికి సాధ్యముకాకుండ నుండుటయే. ప్రజల మనస్సులలో వారికి తెలిసిగాని, తెలియకగాని సాంకేతికయుగావతరణమువలన కల్గిన పరివర్తనమునకు, తోచిన మార్పునకు ఇది చిహ్నము. రాజకీయవేత్తలలో కొందరు భవిష్యమున సుఖమననుభవించువారికొరకు త్యాగము చేయమనుచున్నారు. కొందరు భవిష్యసుఖమును సద్యఃసుఖముతో ననుసంధింపవలయుననుచున్నారు. సాంకేతికయుగావిర్భావమువలన దేశములో ఏర్పడిన భావఘర్షణముయొక్క స్వరూప మిట్లున్నది. ఇది పైకి కన్పించునట్టిది. దీనికి అంతరమున బహురహస్యములు, బహు చిత్తవృత్తులు, బహు మానసిక విపరిణామములు, పరిణామములు విద్యమానముకానిస్థితిలో నున్నవి.

వాని నావిష్కరించుటయు సాహిత్యవేత్తలయు, ఇతర మేధావులయు కర్తవ్యము. అట్లుచేయుట జాతికి, దేశమునకు ఆత్మావబోధమును కల్గించుటయగును. అందుకు కవి శబ్దవాచ్యులగుటకు సమర్థులైన ప్రతిభావంతులు పూనుకొందురుగాతమని, ఆంధ్రజాతీయ జీవనరంగమున మరియొక నూతనశకమునకు అంకురార్పణము చేతురుగాతమని ఆశించుచున్నాము.

తక్కిన పత్రికలకును, ఉగాది సంచికకును ఎన్నియో భేదము లున్నవి.

చాలపత్రికలు రస్కిన్ చెప్పిన Books of the hour వంటివి. సంవత్సరాది సంచిక ఆయనయే చెప్పిన Books of all Time వంటిది. తెలుగునాట ఏ రంగమున ఏమిపని జరిగినను, జరుగుచున్నను దాని కింగ్లో సాహిత్యరూపమున స్థానము లభించుచున్నది మరి తెలుగు చిత్రకళను పోషించుటయందు నిరంతరకృషిని చేయుటయు ఈ సంచిక చేయుచున్నది.

ఈ సంచికకు రాష్ట్రమునందలి ప్రసిద్ధ రచయితలు తమ రచనలను పంపి మాయందు తమకుగల అవ్యాజానురాగమును ప్రకటించిరి. అట్లే కొందరు నూతన రచయితలు గూడ తమ రచనలతో ఈ సంచిక నలంకరించిరి. వీరందరకు మేము ఈ సందర్భమున మా కృతజ్ఞతను తెలియజేయుచు, ముందుగూడ ఈ ఆంధ్రులను మాయం దిట్టి ఆదరమునే చూపగలందులకు కోరుచున్నాము.

పూచిన వసంతం

శ్రీ దాశరథి

(గజల్)

తోటలో, ఎలమావి పూవుల కోటలో
కంటికే కనరాని కోకిల పాటలో
నవవసంతము పొంగి వచ్చెను చూడవే!
పాడవే, మైమరచి నాతో ఆడవే!

వలపు కల వలె వచ్చినది నవవత్సరం
వయసు మనసుల హెచ్చినదిలే మత్సరం
మోదుగులు పూచినవి దీపజ్వాలలై
విరహిజనముల హృదయ తోరణ మాలలై

వెలదివలె మలయానిలమ్మదె వచ్చెను
గుండెలో క్రొవ్వాడి బాకులు గ్రుచ్చెను
పరిమళమ్ములు చిమ్మ నీ నిట్టూర్పులు
నాకు కలిగించినవి కన్నీర్ గార్పులు

ఎందుకే దూరాలలో నివసింతువు?
కానుపించిన యంతనే తలవంతువు?
సిగ్గుపరదా చుట్టివేసె వసంతుడు
బుగ్గపై ఒకచిటిక వేసెను కంతుడు

ముసలిలోకము యౌవనముతో పొంగెను
శిశిరఋతువుగుండె సాంతము క్రుంగెను
ముండ్లు కూడా పూలలాగా విచ్చెను
బాధలోనూ తీయదనమూ హెచ్చెను

నీవు విసరిన ఓరచూపుల బాణము
తీయనున్నది క్షణములో నా ప్రాణము
కండ్లలో మిన్నాగులెందుకు దాతువే?
విషముకురిసే చూపులేలా చూతువే?

నీవు నడచిన దారిలోనే నందనం
నీ పదమ్ముల క్రింది మన్నే చందనం
నీదు మేను పదారు వన్నెల కుందనం
నీకు లోకము సేయుచున్నది వందనం

నడచిరా ముండ్లైన పూవులు పూయగా
కదిలిరా రాళ్ళైన రాగములీయగా
సాగిరా చీకట్లు వెన్నెల కురియగా
వేగిరా దుఃఖాల నవ్వులు విరియగా

ఎడదలో ముత్యాలమూటలు దేనికే!
కనులలో రత్నాలరాసులు దేనికే!
ప్రణయ భిక్షుకుదోసిటను పడవేయవే
మోముపై సాభాగ్య రేఖలు వ్రాయవే

నాకు దొరికితివా కుబేరుడ నాదును
నన్ను విడిచితివా కుచేలుడ నాదును
నీవు మెచ్చిన నేను పెద్ద నవాబును
నీవు మెచ్చని నాడు పట్టి గరీబును

తెలుగు జగతికి నేడు కొత్త ఉగాదిలే
వలపుపూవులమేడ కిదియె పునాదిలే
కురియవే కరుణాకటాక్షము దండిగా
'దాశరథి' సుమనః కటాహము నిండగా

కర్ణాటక సంగీతము: దాని భవిష్యత్తు

★ శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావు

కర్ణాటక సంగీతము అనుమాట వాడుకలో వచ్చినది దక్షిణ భారత దేశములో వాడుకలోనుండి హిందూస్తానీ సంగీతానికి భిన్నంగా ఉంటూవచ్చిన పద్ధతికి కర్ణాటక సంగీతము అనవచ్చును. బ్రిటీషురాజ్య పరిపాలన, మొఘలు సామ్రాజ్యము ఆదిగా వెలసిన మహమ్మదీయ పరిపాలన భారతీయ సంగీతముపై పెద్ద మార్పుల తీసుకొని వచ్చినవి కొన్ని వందల సంవత్సరములకు పూర్వమే కాళిదాస మహాకవి, వాల్మీకి, భాసుడు, శూద్రకుడు తమ కావ్యాలలో సంగీతవిద్య యొక్క ఉత్తమస్థితిని తెలుపు సందర్భాలను రమ్యముగా వర్ణించియున్నారు భారతీయ సంస్కృతి ఎంత పురాతనమయినదో, ఈ సంగీత విద్య కూడా అంత పురాతనమయినది భగవద్గీత, ఉపనిషత్తులు పురాణములు ఆసేతుహిమాచల పర్యంతము ఒక రీతిగా వర్తించునట్లు సామవేదమునుండి సముద్ధరింపబడిన సంగీతము కూడా భారతదేశమున కంతకును వర్తించియుండెను భరతముని నాట్యశాస్త్రము, శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరము నేటికినీ భారతదేశములో రెండు సంప్రదాయములకూ లక్షణములన్న సంగతి గమనింపతగినది మహమ్మదీయులు తెచ్చిన అరబ్బీ, పారశీక దేశముల సంగీత రీతులను కలుపుకొని, ప్రత్యేకముగా, క్రొత్త క్రొత్త రుచులను, మార్గములను అనుసరించి కాలక్రమముగా ఉత్తర భారతదేశపు సంగీతము నేటి హిందూస్థానీ సంగీతముగా రూపొందినది

దక్షిణదేశములో విజయనగర సంస్థానములో విద్యారణ్యులు, రామామాత్యులు, సంగీత విద్యకు ఒక లక్షణ స్వరూపమును ప్రసాదింప యత్నించిరి విజయనగర సామ్రాజ్యము అత్యున్నతస్థితిలోనున్నప్పుడు వ్యాసరాయలు, వారి దాసకూటమునకు చెందిన కర్ణాటక హరిదాసులు సంగీత విద్యను ప్రజలలో బాగా వ్యాపింపజేసిరి వీరిలో ప్రముఖులు పురందరదాసులవారు వీరిని గురించి సుబ్బరామ దీక్షితులవారు, తాము ప్రచురించిన సంగీత సంప్రదాయ ప్రదర్శిని అను గ్రంధములో ఇట్లు వ్రాసియున్నారు

“ సంగీత సాహిత్యములలో మిక్కిలి ప్రజ్ఞ గలవాడై యొక్కొక్క సందర్భమందును జేసిన కీర్తనములచే శ్రీపాండురంగ విఠ్ఠలుని ప్రసన్నతను పొందినవాడై యుండెను ఇతని యద్భుత చరిత్రములు నెవరికినీ వ్రాయ నలవిగాదు ఇప్పటికిని వాడుకలోగల సరళి (సర్వావళి) వరుసలు, అలంకారములు, పిళ్లారి గీతములు – ఇవి ఈ మహానుభావునివలన నేర్పడినవిగానున్నవి . ఇతనివలన జూడబడిన (చేయబడిన) సూళాదులు పెక్కులు గలవు ” మాయామాళవగౌళ రాగమును మొదట స్వరముల పాఠమునకు ఏర్పరచిన మహిమ పురందరదాసులకు దక్కినది. సూళాదులు ఏడు తాళములందునున్న లక్షణగీతములను బోలిన సంగీత రచనలు. సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో ప్రచురించబడిన రెండు మూడు తప్ప, ఇతర సూళాదులు సాహిత్యావశిష్టములై యుండుట ఎంతయు తీరని నష్టము! సంగీతము వేదవిద్యవలె కర్ణాకర్ణిగా శిష్యాపారంపర్యములు దీక్షతో కాపాడవలసిన అమూల్య ధనము సాహిత్యమును మాత్రము వ్రాసియుంచి, ప్రచురించినందువలన మనకు సంగీతము దక్కదుకదా దాసులవారు ప్రసాదించిన వేలకొలది కీర్తనలు సులభశైలిలో ప్రసిద్ధ రాగముల మూల స్వరూపములుగా ప్రజలలో సంగీత జ్ఞానమును వ్యాపింప జేసినవి రాగ తాన స్వర విస్తారములకు పునాదిగా ఏర్పడినవి పురందరదాసులవారి స్వరావళులు, అలంకారములు, గీతములు.

శార్ఙ్గదేవుల కాలమునకు భరతముని నిర్వచించిన లక్షణ లక్ష్యములు పాతబడి శిధిలములయి అలభ్యములయినవి. అట్లే శార్ఙ్గదేవుల కాలమునాటి ప్రబంధములు రాగ రచనలు వెంకటమఖి కాలమునకు ప్రాచీనములయిపోయినవి.

శార్ఙ్గదేవుల కాలమునకు భరతముని నిర్వచించిన లక్షణ లక్ష్యములు పాతబడి శిధిలములయి అలభ్యములయినవి అట్లే శార్ఙ్గదేవుల కాలమునాటి ప్రబంధాదులు, రాగరచనలు, వెంకటమఖి కాలమునకు ప్రాచీనములయిపోయినవి కాని, నేటి కర్ణాటక సంగీతమునకు లక్షణ రూపముగా నిలచినది వెంకటమఖి రచించిన చతుర్దండి ప్రకాశిక అట్లే లక్ష్యములుగా దక్కినవి పురందరదాసుల పదములు, ఆరంభ పాఠావళి, క్షేత్రయ్య పదములు, భక్తిగానములో సామాన్య స్థితియందు లభించు రామదాసు కీర్తనలు, తరంగములు, తదితరములు. లక్షణ గీతములు సుమారు యేబది సంవత్సరములకుమునుపువరకూ విద్యాభ్యాసమున ముఖ్యముగా నుండెడివి. ముత్తయ్య భాగవతులు, టైగర్ వరదాచార్యులవారి తరముతో లక్షణ గీతముల ప్రాముఖ్యము క్రమముగా తగ్గిపోయినది. ప్రబంధములు ఇంకా అరుదు. కొన్ని ప్రబంధములు రాగమును పరిపూర్ణముగా చిత్రించు పెద్ద గానరచనలు; సుమారు అప్ప చెప్పుటకే అరగంట పట్టెడిది. ‘ఇవి మునుపు ఆంధ్రులు తమ సర్వస్వము అని కాపాడుకొని రాజులఎదుట పాడుచుండిన ముఖ్యమయిన సంగీత రచన’ లని సుప్రసిద్ధ ఆంధ్ర గాయకులు చెప్పగా విన్నాను.

సంగీత విద్యయొక్క చరిత్రమును మూడు భాగములుగా విభజింపవచ్చును. భరతుని కాలమునుండి వెలువడిన సంగీత శాస్త్ర గ్రంథములు. సంగీత రత్నాకరము, దానిపై చతురకల్లినాధుని వ్యాఖ్యానము—వీనియందు మన సంగీతములోని మూల సూత్రములు, రాగముల మూలాధారములగు జాతులు, గాయక లక్షణములు, వాగ్గేయకారుల లక్షణములు, గ్రామ మూర్ఛనముల వివరణ—లభించును. ఈరోజు మనకు లభ్యమయిన సంగీతము ఎట్లు ఏ రూపాంతరములనుజెంది నేటి స్థితికి రాగల్గినది అన్న ప్రశ్నకు ఏదో కొంత సమాధానము దొరికిన దొరకవచ్చును. నేటి సంగీత వాద్యములను గురించిన పుట్టు పూర్వోత్తరములు లభించవచ్చును. శ్రుతుల నిర్ణయము, స్వరముల భేదములు, తాళముల అధ్యాయములు, గమకముల వైవిధ్యములు వాటికీ, నేటికీ మారకుండుట ఆశ్చర్యకరమయిన సంగతే. పురాతన సంస్కృతగ్రంథములను పరిశోధకులు చదివి, వాటిని వడపోసినట్లయితే మనకు లభించునది సంగీత చరిత్రము యొక్క పూర్వ రంగము మాత్రమే ఇప్పుడు, అమలులోనుండు సంగీత లక్షణముల వివరణకూ పనికిరాక, లక్ష్యముల కనలే ప్రయోజనపడని చెత్త గ్రంధములను ప్రచురించినందువల్ల ఏమియూ లాభములేదు. సంగీత రత్నాకరములోని లక్ష్య లక్షణములు, వాడుకను వీడిపోయినవని వెంకటముఖి నిర్వచించినాడు.

ఇక రెండవభాగమనదగునది సంగీత త్రిమూర్తులకు పూర్వము, వెంకటముఖి పురందరదాసుల తరువాతి యుగము విద్యారణ్యులు ఏర్పరచిన విజయనగర సామ్రాజ్యము రాయల ఏలికలో అత్యున్నత స్థితినందుకొన్నది. కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసులవారు మాయా మాళవ గౌళ స్వరములను ధ్వనించు రాతిస్థంభములను విఠ్ఠలరాయని దేవాలయమందు నిర్మించిరి. చిన్న రాతితో కొట్టినను ఖంగుమని మ్రోగి పామరులకుగూడ ఆ స్వరస్థానములు బోధపడగలవు. నాదమును ధృవపరచిన ఇట్టి స్తంభములు శిధిలమయిన విఠ్ఠలరాయల దేవాలయములో కొల్లలుగా నున్నవి. శారీరసాధనకు, స్వరజ్ఞానమును, తాళజ్ఞానమును అలవరుచుకొనుటకు స్వరావళులు అమూల్య సాధనములు. ఇట్టిది హిందుస్థానీ పద్ధతిలోలేదు. సర్వసామాన్యులు అందుకొని, పాడగల చిన్నచిన్న పాటలు, పెద్ద విద్వాంసులు గూడ తెలుసుకొని పాడతగిన పదములు కొన్ని వందలుగా పురందర దాసులు, ఇంకా ఇతర హరిదాసులును ప్రసాదించిరి. ఆంధ్ర కవితా

పితామహులు ఇంకా వచ్చి యుండలేదు భజనపద్ధతికి మూలపురుషులగు అన్నమాచార్యులు—పద కవితా పితా మహులయి, అప్పటికి అర్థ శతాబ్దమయినది.

"తాళ్లపాక చిన్నయ—ఇతడు తెలుగు బ్రాహ్మణుడు. వెంకటాచలపతి భక్తుడు తిరుపతిలో నుండినవాడు వెంకటరమణని విషయమై సంప్రదాయముగా వాడుకలోగల ఉత్సవ పద్ధతి నేర్పరచిన పుణ్య పురుషుడు దానిలో తోడయము, మంగళము, శరణు, హెచ్చరిక, కీర్తనములు, వసంతోత్సవ కీర్తనములు, స్వామిని మేలుకొలుపుటకయి కీర్తనములు, ఇవి మొదలయినవియూ ఉన్నవి ఇవిగాక, విడి కీర్తనములునూ గలవు ఇతని భక్త్యతిశయమువలన మాటి మాటికి వెంకటరమణుడు ఇతనికి సాక్షాద్దర్శనమిచ్చి, మాట్లాడినట్లు పెద్దలు చెప్పుచున్నారు. భజన పద్ధతికి ఇతడే మూల పురుషుడు ఇతడు రామామాత్యులకు ముందటివాడని జెప్పుచున్నారు"—అని సంప్రదాయ ప్రదర్శినిలో వ్రాయబడియున్నది వీరి భజన కీర్తనలను పాడు తీరు మన కబ్బలేదు కర్ణ పరంపరగా దాసులవారి పదములు పాడుటను పరిశీలించి, కొద్దిగా సంస్కరించి పాడిన మంచి వర్ణమట్లు లభింపగలవు ప్రసిద్ధరాగములందు ఈ పదముల మట్లు కొన్ని శతాబ్దముల తరువాత త్యాగయ్యగారి చేతులలోను, ముత్తుస్వామి దీక్షితులవారి కీర్తనములందును, అత్యుత్తమ దశనుపొందినవి ప్రజాసామాన్యమునకు ఉపనిషత్సారములను, ఇతిహాస పురాణముల సారాంశములను, సంఘసంస్కరణకు పనికివచ్చు నీతి నియమములను సులభముగా అర్థమగు శైలిలో వారి వారి మాతృ భాషలలో వందలు వేలుగా లభింపజేసి, ప్రజల సంస్కారమును ఉద్దీపింపజేసినవి. రామదాసు కీర్తనలు, తరంగములు, దాసుల పదములు, ఇంటింటను, దేవాలయములందును పాడుచుండిన రోజులవి ప్రజలకు మన సంగీతములోని జీవనదీసదృశములగు రాగములు గుర్తుపట్టుశక్తి యుండెడిది. మృదంగపు వరసలను అనుకరించు ఛందస్సు, పదజాలము ప్రజల హృదయములను ఆకర్షించినవి అట్టి ఉత్తమ సంస్కారమును క్రమముగా మత, భాషా వ్యామోహములో కృశింపచేసిరి. ఇప్పుడవి అందరాని పండ్లు. క్షేత్రయ్య పదములు ఏవో కొన్ని వాటి సంగీతముతో దక్కినవి.

ఆ శతాబ్దమునందే విజయనగరము పతనము చెందినది అప్పటికే "రహిబుట్ట రాళ్లగరగించు విమలగాంధర్వంబు విద్య మాకు" అన్న అల్లసాని పెద్దన, సంగీత కళా రహస్యనిధి రామరాజ భూషణుడు సంగీత పరిభాషను తమ ప్రబంధములలో స్వతంత్రముగా ధారాళముగా వాడుకొన్నారు మను చరిత్రలో 'వాలారుం కొనగోళ్ల" అను పద్యములో నాటకుమేళంబైనవిపంచి దేశాక్షి రాగమును వాయించ వలసిన ప్రాతఃకాలములన గాలిలో 'అవేళను' ధ్వనించుచున్నది ఆ వీణను దేశాక్షికి మేళవింపగదవే అని వరూధినిసఖి అన్నది పెద్దనామాత్యుని కాలమందు వీణ మేరువులను ఆ యా మేళములకు వీలుగా మార్చెడి వారన్నమాట, నేటి సితార్ వాద్యమువలె

అటు తరువాత విజయనగరమునుండి మన హిందూ సంస్కృతికి రక్షణ దొరకడము తంజావూరులో హిందూస్థాని, కర్ణాట సంగీతములు రెండును బాగుగా తెలిసిన పురందరదాసులవారి క్రమశిక్షణా పద్ధతి, పదములు మన సంగీతపు వైశిష్ట్యతను తురుష్క సంప్రదాయముల ధాటినుండి సంరక్షించినవి.

తంజావూరిలో రాయలు ఏలుబడిలోనున్న 'నాయక' సంస్థానాధిపతులు కళలను, హిందూ సంస్కారమును కాపాడ జొచ్చిరి. గోవింద దీక్షితులు, వారి పుత్రులు వెంకటముఖి వీణావాదనమునకుపద్ధతులను ఏర్పరచిరి వీణమేరువులను నేటి పద్ధతిగా ధృవముగానుంచు పద్ధతినివారు ఏర్పాటుచేసి యుందురని ఊహింపవచ్చును అటు తరువాతనే స్వరస్థానముల రుచులు పెరిగి, రాగ రూపము నేటి వైవిధ్యము నందుకోగల్గినది. అనుస్వరము అను క్రొత్త అందమును వీణ స్వర స్థానమును క్రిందిస్వరమునుండి ఈడ్చిపట్టి వాయించు నిపుణత అబ్బినది మన సంగీతమునకు ఇది గొప్ప మార్పును అందచందములను సమకూర్చి పెట్టినది ఈ కాలమందు ప్రసిద్ధముగా వాడుకలోనున్న రాగములను, ఇంకను వూహింపగల రాగములను, క్రొత్త రాగములను అన్నింటిని చేర్చి అర్థము చేసికొనుటకు వీలగు డెబ్బదిరెండు మేళకర్తలను వెంకటముఖి ప్రసాదించిరి మన సంగీతమునకు నిర్దుష్టమైన ఒక వ్యాకరణప్రాయమగు ప్రాతిపదిక ఆ నాడే ఏర్పడినది. అట్టి దానిని కొద్దిగా మార్చి దిద్ది కొన్ని దశాబ్దములకు మునుపు భాత్ఖండే హిందూస్థాని సంగీతములో ప్రవేశపెట్టిరి మేళములకు 'థాట్' అను నామాంతరము నుంచిరి. నేటికినీ హిందూస్థానీ రాగములు లక్ష్య ప్రధానములయి కొన్ని సందర్భములందు లక్షణములకు అంతగా సరిపడని రూపములను పొందుచున్నవి. లక్షణ ప్రధానముగా మారిన మన రాగములు, లక్ష్యములవల్ల మాత్రమే ఊహింపదగు రాగములు, తమ స్వరూపమును పోగొట్టుకొని, వట్టి స్వరవిస్తారపు గడబిడలక్కు గురియయి, రస రహితమయి పోవుచున్నవి. అట్లు మన కట్టెదుట అదృశ్యమగుచున్న రాగములు మాంజి, నారాయణగౌళ, గౌరి, సాళంగనాట మొదలగునవి. పాడుటకు వీలుగానున్న పాటలు, రాగ ఆలాపనలు, తరచుగా గాయకుల చెవిలో పడకున్న, రాగములు స్వరూపమును గోల్పోవుట కద్దు స్వరములను, ఆరోహణ అవరోహణ క్రమములను, ఇతర లక్షణములను సహాయముగాగొని ఎంతటి ప్రతిభావంతుడయినను రాగ స్వరూపములు ఊహించి నిర్మించుట కల్ల పూర్వి, గౌళిపంతు, సైంధవి ఇంకా ఎన్నో రాగము లట్టివి. 'ఏమే భామా వాకిలి తీయవు' అన్న పాటను వినివుండనివారు, ఉన్న లక్షణమంతా విడమరిచి చెప్పినా, మంగళ కైశికిని పాడజాలరు. లక్ష్యమునకు మనము ఇవ్వవలసిన ప్రధాన్యత ఇవ్వడము లేదు

కర్ణాటక సంగీతమునకు అత్యున్నత స్థితిని దెచ్చినది సంగీత త్రిమూర్తుల కీర్తనలు రాగ ప్రధానము సంగీతమన్న ఉక్తికి వీరి కీర్తనలు ఆధారము లయినవి. పురాతనపు ప్రబంధ రచనలను తగురీతిగా తీర్చి,తిద్ది, రాగ రచనలందు క్రొత్త క్రొత్త మార్గములను కనుపింపచేయు కీర్తనలు—దేవుని పరముగానుండి పాడుటకు అనువయిన శైలిలో—త్రిమూర్తులని విఖ్యాతిగాంచిన శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు, త్యాగరాజస్వాములు, వందలాదిగా సృష్టించిరి సాహిత్యమును అసలు సరకుచేయక రాగమును విస్తరించు భాండీర భాషలోని లక్షణ గీతములు, ప్రబంధములు, ఈ కీర్తనల సృష్టితో ప్రాచీనము లయినవి. లక్షణ గీతములలోని రాగ సంపదను, పదములలోని సాహిత్యపుష్టిని, ప్రబంధములలోని రాగ విస్తరణను, మీదు మిక్కిలి అంద చందములతో, లయ సొగసులతో అత్యద్భుతమయిన రక్తిని పుట్టించు త్రిమూర్తుల కీర్తనలు అంతకు మునుపున్న రచనలను వెనుకకు త్రోసిపుచ్చినవి భావ ప్రధానములయిన త్యాగయ్యగారి భక్త్యతిశయమున కల్గు అనుభవములు వారి కీర్తనలందు ప్రతిబింబించినవి నాదోపాసన ముక్తికి మార్గమని త్యాగయ్య చాటెను నాదము సంగీతమునకు మూలవస్తువు నాద శిల్పము సంగీతము రాగతాళములందుగల చిత్ర విచిత్ర కల్పనతే సంగీత రచనలకు ఉత్తమ కళా సృష్టిని కల్పించును సంగీతముతో సాహిత్యార్థమును విశదీకరించుట ఒక ప్రయోజనము—నాటకములందు, పదములను పాడునప్పుడు, శ్లోకములను పాడునప్పుడు, భక్తి గీతములను పాడునప్పుడు సాహిత్యమునగల భావమును పెంపొందించి, వివరించుటకు సంగీత ముపకరించును. అట్టి సందర్భములందు మనకుగల ఆనందము సాహిత్యము, సంగీతము రెండును పంచుకొనగలవు అట్టివిగాక, రాగమునే ముఖ్య వస్తువుగాగొని సంగతులతో రాగ విస్తరణనుచేసి నవీనములగు కల్పనలతో రాగ సౌధములను నిర్మింపచేసిన ప్రయత్నములు త్రిమూర్తుల కీర్తనలు సంగీత విద్యకు ఇప్పుడు లభించిన ప్రశస్తి ఇంకెప్పుడూ లభింపలేదు

వెంకటముఖి కలలు పండినవి ఆయన సూచించిన రాగముల మేళము లన్నిటియందును, ముత్తుస్వామి దీక్షితులవారు, త్యాగయ్యగారు కీర్తనలు రచించిరి ప్రసిద్ధ రాగములందు అనేక కీర్తనలు రచించిరి అదివరకు వాడుకలోనున్న అనేక రాగములయందు రచించిరి భజన సాంప్రదాయపు కీర్తనలు, జానపదగేయ ఫణతులు—అన్నియు వీరి రచనా శిల్పమునందు అత్యద్భుతమయిన రూపమును పొందినవి తోడి, శంకరాభరణము, కాంభోజి, భైరవి, కల్యాణి జీవనదులై ప్రవహించు రాగ వాహినులు చక్కని రూపమును హృదయాకర్షకముగా ప్రతిధ్వనించు నాద మహిమముగల రాగములు ఆనంద భైరవి, అఠాణా, బిలహరి, సురటి, ధన్యాశి, సావేరి—వంటివి వీటియందును వారు అనేక కీర్తనములను చేసిరి లయ సొగసులు, మృదంగపు నర్తనము సౌందర్యములు, సాహిత్య శైలి యందును, స్వర విస్తారమందును ఉట్టిపడునట్లు త్యాగయ్య పంచరత్నములు, శ్యామ శాస్త్రులవారి స్వరజతులూ వెలువడినవి. 'సంగతులు' అను అపూర్వ

అభరణమును సంపాదనముచేసి, త్యాగయ్యగారు తమ ప్రతిభవలన సంగీత రీతులకు నూతన వైభవమును కల్పించిరి సాహిత్యపు అర్థమును అనేక రీతులు అధికరింపచేసి, రాగ భావములను వివిధ రీతుల విస్తరించుటచే త్యాగయ్యగారి కీర్తనలు వీనులకు విందయి, బుద్ధికి మేారాకుహత్తి, ఆత్మకే వికాసమును కల్గించినవి సౌలభ్యముతో ఆధ్యాత్మికమైన ఆత్మానందమును కల్గించుటలో త్యాగయ్యగారి కీర్తనములు నిరుపమానములు తాళ మాధుర్యపు పటిమమును శాస్త్రులవారి 'చాపుతాళ' కీర్తనలయందు విరివిగా అనుభవింపవచ్చును నాదరూపుడగు పరమేశ్వరుడే త్రిమూర్తుల రూపమున అవతరించి నాద విద్యను అంత ఉత్కృష్ట దశకు దెచ్చెనేమో! త్రిమూర్తుల కీర్తనలతో సరితూగు నాదసృష్టి అంతకుపూర్వముగాని, అటు తరువాతగాని లభించుట అరుదైనది

దశవిధ గమకములతో వాది సంవాది స్వరముల స్పష్టీకరించు విస్తరణతో విళంబకాలపు మహిమను చాటుచూ, ప్రౌఢమయిన పద జాలముతో, అద్వైత మతసారమును వెదజల్లు ప్రబంధ రీతుల నమరిన కీర్తనలు దీక్షితులవారివి మన సంగీతమునకు పద్ధతి ఎట్లు ఉండవలయునో, అట్లు నిదర్శనములుగా నుండు రీతిని దీక్షితులవారు రాగభావ పూరితములయి, నాదపుష్టియందు వీనులను శ్రుతియందు నిమగ్ననుచేయురీతినిము కీర్తనలను నడిపించిరి హిందూస్థానీరాగములయందు 'ధ్రుపద్' శైలితో దక్షిణాత్యులకు పాడుటకు వీలగు కీర్తనలు రచించి, భారతీయ సంగీతము ఎంతవరకు అందరకీ సామ్యముగా నుండగలదో చాటిరి వీణ శైలిపై ఆధారపడియున్న దీక్షితుల పద్ధతి, సంప్రదాయజ్ఞులు అత్యుత్కృష్టమయినదని చెప్పుదురు దీక్షితుల కీర్తనలను కర్ణాకర్ణిగాపాడి, ఆ కీర్తనలయందున్న 'పట్లను' గమక శుద్ధముగా పలుకునట్లు గొంతును బాగుగా మర్దించి, విళంబలయ—గొంతులోనూ, చేతిలోనూ బాగుగా నిలచునట్లు సాధనచేసి పాడినచో, హిందుస్తానీ సంగీతములోని మేల్మియయిన అంశములు మనము దక్కించుకున్నవారము కాగలము అందులకై మన దాక్షిణాత్య రాగ స్వరూపములను అనుస్వరములను వదలుట పొరబాటనెడి సత్యమును గూడ నిరూపించుచూ కల్యాణి, సావేరి, ఆనంద భైరవివంటి రాగములలో దీక్షితులవారి కీర్తనలు దక్షిణాత్య పద్ధతికి అచ్చమయిన పెన్నిధులయి అలరారుచున్నవి ఈ కీర్తనలను కర్ణాకర్ణిగా పాఠముచేసి, గళ పారిశుద్ధ్యముతో, సంస్కారమును సూచించు ఉచ్చారణతో, రాగము, స్వరము, నెరవు, విస్తారములయందు గంభీరమయిన మనోధర్మముతో పాడినన్నిరోజులు కర్ణాటక సంగీతము అత్యున్నతశ్రేణియందే నిలిచియుండును త్రిమూర్తుల కీర్తనలు, వర్ణములు, పదములు, జావళీలు, తిలానలు—మన సంగీత సంపద; ఈ సంపదను కాపాడుటకు గాయకులును, రసికులును కలసి ప్రయత్నించవలసియున్నది

దీనికయి గాయకులు నెరవేర్చవలసిన విధులేవి? రసికుల విధులేమిటి? అని కొంత విచారణ చేయువలసియున్నది కేవలము ప్రజాదరణపొంది ధనమును గడించి 'కచ్చేరీ'లు చేయుటమే పరమావధిగాగొన్న అసంఖ్యాక గాయకులు సంగీత విద్యకు తీరని నష్టము చేకూర్చుడము జరుగుచున్నది విద్యను అభ్యసించునప్పుడు విద్యార్జనయే ఏకైక లక్ష్యముగా నుండవలయును కొంత సాహిత్య సంస్కారమును గడించుకొని, అనుక్షణమును చదివి, పాడునదేమో తెలుసుకొని, పాడవలయును పండిత పామర రంజనముగా నుండుటకు ఎన్ని అంశములను అలవరుచుకోవలయునో అన్నిటినీ అలవరుచుకొనుటకు ప్రయత్నము యావజ్జీవము కొనసాగించుచుండవలయును పండితులకు నచ్చనిపాట బహుకాలము నిలువదు పామరులను అసలు సరకు జేయని సంగీతము అందములేని వ్యర్థమయిన గడబిడ

మన సంగీత సంపద ఎంత గొప్పది! దానిని కాపాడి, దాని మహిమను ప్రజలకు అందజేయు శక్తి సామర్థ్యములను గాయకులు అలవర్చుకోవలయును కచ్చేరీకి పనికివచ్చు మధ్యమకాల కీర్తనలు మాత్రము సాధన చేసిన క్రమముగా పుష్టిగల మనోధర్మము అరుదయి, సినిమా సంగీతమునకు చేరువయయి, తన గాంభీర్యమును గోల్పోవును ఇది తీరని నష్టము కీర్తనలను వ్రాసి, స్వరపరచి, ప్రచురించి, మహనీయులతో పాడించి, రికార్డుల భద్రపరచియుంచుట ఒక ఎత్తు అనుదినానుష్ఠానముగా శారీరమును త్రిస్థాయిలందు సహజ గంభీరముగా, నిండుగా, శ్రుతిశుద్ధముగా నుండునట్లు తయారుగా నుంచుకొని,

ఎక్కువ కాలము సర్వ జనులకు తృప్తినిచ్చు మధ్యమకాలపు సులభమయిన నడక లందుగల కీర్తనలు పాడినను, అప్పుడప్పుడు 'ఓరంగశాయి', 'గిరిపై నెలకొన్న', 'రామబాణ', 'త్యాగరాజాయ నమస్తే'—మొదలగు పెద్ద కీర్తనలు గొప్ప మనోధర్మములో ప్రౌఢమయిన స్వర కల్పనలతో పాడి పండితులను మెప్పించుచూ, పామరులకు గూడ సంగీత మహిమను దెల్పు ప్రయత్నము ఎడతెగక, కొనసాగవలయును. దీనికి పారమార్థికదృష్టిగల్గి, త్రిమూర్తుల కీర్తనలను, ఆ కీర్తనలకున్న మహిమను తగ్గించక, మార్చక, పారముచేసి సంసిద్ధులయి యుండుటకు గాయకులు పెద్ద ప్రయత్నమును చేయవలయును పదములను పాడువారు అరుదయి పోవడము ఎంత నష్టము! తానము అంతకంతకు నామమాత్రావశిష్టమగుచున్నది "స్వర విస్తారములందు, నెరవలు రాగ ఆలాపనలు చేయునప్పుడు తప్పనిసరిగా, మనోధర్మము బాగుగా అగుపడవలయును. పాడెడి కీర్తనలు యధామాతృకముగా నుండవలయును కాని ఇదేమి విపరీతము! కీర్తనలందు మనోధర్మము మితిమీరిపోవుచున్నది ఎవరికివారు వారి వారి గొంతులకు, బుద్ధికి సరియగునట్లు పెద్ద కీర్తనలను మార్చి పాడుచున్నారు. కానిరాగాలాపన, తానము—స్వర విస్తారము బాగుగా 'చిట్టు' చేసుకొని అప్పజెప్పుచున్నారు ఇది పెద్ద లోపము" అన్నారు ముసిరి సుబ్రహ్మణ్యఅయ్యరు పెద్ద సభలో కృత్రిమ కల్పనలతో శారీరమును ప్రదర్శించు వింత రాగముల విస్తరణతో మన సంగీతమునకు జీవనాడులనదగు ప్రసిద్ధ రాగముల స్వరూపమును గూడ ప్రజలకు తెలియ నిచ్చుటలేదు పదే పదే ప్రజలు మన రాగములను విని, పెద్దల కీర్తనలందలి గొప్పదనమును విని గుర్తించవలయును సంగీతము విన్నప్పుడు త్యాగరాజ కీర్తనల సాహిత్య మేమని తర్కించుట పొరబాటు అందలి సంగీతమును ముఖ్యముగా విని, ఆనందించుటకు కొంత ప్రయత్నించవలయును ఉత్కృష్టమయిన సంగీత ప్రదర్శనలకు నేటికంటెను ప్రజాదరణ ఎక్కువగా లభింపవలయును సామాన్య ప్రజలు కుటుంబమునకు కొంత ఇట్టి విషయములకు డబ్బును పొదుపు చేసుకొని, గాయకులకు మంచి దోహదమివ్వకున్న, త్వరలో మన సంగీత సంపదను అందుకొని, కాపాడు శక్తిగల విద్వాంసులే అరుదయిపోగలరు.

మన కర్ణాటక సంగీతమునకు ఎట్టి భవిష్య మున్నదో చెప్పుట ఊహాతీతముగా నున్నది కాని, లలిత సంగీతము, పాశ్చాత్య సంగీతము, జానపద గేయ రీతులు, హిందుస్థానీ సంగీతముతోటి పరిచయము ఇప్పుడు ఏర్పడినట్లు ఇంకెప్పుడూ ఏర్పడియుండలేదు వీటి సంపర్కమువలన బాగోగులు ఏర్పడకతీరదు. మంచిని గ్రహించుశక్తి మన సంప్రదాయజ్ఞులపై నున్నది అట్టి శక్తినలవరుచుకొనునట్లు చేయు భారము రసికులకుపై నున్నది లలిత సంగీతమునకయి ప్రత్యేకించిన గోష్ఠి ఏర్పడవలయును తాత్కాలికముగా ప్రజల నాకర్షించి, రెండు, మూడు నెలలలో మారిపోవు సంగీతమును విను సన్నివేశములు చాల అవసరము శాస్త్ర సంగీతమును పాడువారట్టి ప్రయత్నమునకు పూనుకొన్న ప్రయోజనము నున్న లలిత సంగీతము బరువయి, కర్ణాటకము నాటకమయి, రెండును చెడి క్షీణించును కర్ణాటక సంగీతము ప్రజలలో బాగుగా ప్రాకవలయును. దీని చరిత్ర, దీని విశేషములు ప్రజలు గుర్తించునంతటి బాగైన రచనలు, సంగీత ప్రదర్శనలు జరుగవలయును తమ బుద్ధి దౌర్బల్యముననో, సంస్కారవిహీనతవల్లనో మొదట రెండు మూడు పర్యాయములు వలదు అని అసహ్యపడిన వారు కూడ—క్రమముగా శాస్త్రీయ సంగీతమునందు అభిరుచిని పొందుట లోకవిదితము. ఇందుకు ప్రభుత్వమువారు, దేవాలయములందలి ధర్మకర్తలు అప్పుడప్పుడు ఉత్తమ రకపు సంగీతపు కచ్చేరీలను ఏర్పాటు చేయించిన—దేశమందలి గాయకులకు పోషణ లభించును ప్రజలలో ఇట్టి ఉత్తమ రకపు రసాస్వాదనకు తగిన అభిరుచియూ ఏర్పడును ఇది ప్రజాదరణకై దీక్ష బూనిన మన ప్రభుత్వము కొన్ని రోజులు రుచిని కల్పించినచో తరువాత ప్రజలే సంగీతమును విని ఆనందించి, కాపాడగలరు దీనికి వలయు వాతావరణము సంప్రదాయ సంగీతమును బాగుగా అలవరుచుకొన్న విద్వాంసుల కృషి ఫలితముగా ఏర్పడవలయును. నాదలోలురై మన ప్రజలు బ్రహ్మానంద మొందుదురు గాక!

తడిమంటకి పొడినీళ్లు

శ్రీ బుచ్చిబాబు

నీళ్లకోసం నదిఒడ్డు కొచ్చింది అలిమేలు ఆకాశ మంతా మబ్బుతో కమ్ముకున్నా పశ్చిమాన్ని తెరతీసినట్లు నిర్మలమైన ఆకాశం ఎఱ్ఱటితామరాకులా కొండవెనుక దిగిపోతున్న సూర్యబింబం కిరణాలవెలుగులో గర్భాలయంలో ఒంటి దీపంలా మెరుస్తూంది. ఆ కిరణాల ఎరుపు అలిమేలు మొహాన్ని కప్పించి, జడలో దాక్కుంది. లేత మబ్బురంగుఛాయ, స్ఫుటంగా ముందుకు సాగారి ఒంపుతిరిగిన కనురెప్పల కింద తెల్లచేప పిల్లలల్లే సంధ్యలో చిట్లించి కదిలిమెరిసే కళ్లు, సన్నటి, పొట్టిముక్కు, తీర్చిదిద్దిన సన్నటిపెదవులు, పల్చటి చెక్కిళ్లు, క్రమంలేకుండా దువ్వినజడ—ఇవన్నీ అమాయకంగా కనబడేటట్లుచేసినా, మొత్తం శరీరంచూస్తే అనుభవంగల వ్యవహర్తలా కనిపిస్తుంది, అలిమేలు. ఎత్తైన విగ్రహం, గుండ్రంగా, బలంగా కనబడేభుజాలు, స్తనాలు, పిరుదలు,—ఆ పాత తెల్లచీర మడతల్లో ఇమడక, వాటివునికిని ప్రతికదలికలోనూ బుజువుచేస్తున్నట్లుంటుంది.

కొండకింద దిగే సూర్యుడంటే అలిమేలుకిష్టం బిందెకిందపెట్టి, సంధ్య వెలుగుకి ఎఱ్ఱబడిన చేతులు చూసుకుని సంతోషపడింది ఇంకా ఎరుపుగావుంటే ఎంతబావుండును, తను. కర్మ, అమ్మనలుపు అయ్యకూడా నలుపేనట, అమ్మ చెబుతుంది.

ఊరికే ఆ పొద్దంతా, ఆ ఎంకడు జొరపడుతూండాడు ఆలోచనలోకి. ఆసైకిలు కొట్టు వెంకటేశ్వర్లు ఈమధ్య మరీ గర్వంగా, హుషారుగా వున్నాడు వాళ్లెవళ్లతోనో తిరుపతివెళ్లి, వెంకటేశ్వరస్వామిని చూసి వచ్చాడంట అందుకు ఆ మిడిసిపాటు మాబాగా అయింది! సైకిల్ పోటీలోపడి కాలుకి గాయం తగిలింది కట్లు కట్టి కుంటుకుంటూ తిరుగుతూండా డా ఎంకన్న. మిడిసిపడే వాళ్లకి తగిన శాస్తి చేస్తాడు ఆ ఏడుకొండలవాడు. కాని పాపం మంచోడు—వెంకటేశ్వర్లు—వెంకన్న, తనికి ఒక చందనం బొమ్మ—స్వామిది—తెచ్చి ఇచ్చాడు. వెంకన్న బాగుంటాడు, భలేనవ్విస్తాడు, నవ్వుతాడు—నవ్వితే మరీ బాగుంటాడు—మాంచి నునుపైన ఛాతీ—

ఈ ఆలోచన కూడదు. దాన్ని తొలగించడం కోసం అమ్మనిగురించి అనుకోవల్సి వస్తూంది. అమ్మ మంచిది తనంటే పంచ ప్రాణాలూను పొద్దు ననగా వెళ్లింది సంతకని—ఆ ఎంకడితో—మళ్లా వెంకడి ఆలోచనా? ఇంకా రాలేదేం చెప్మా. తనని తిరుపతి తీసుకెడతానంది— పెండ్లయినాక పెళ్లేంటి తనకి ? కనపడ్డవాడి నల్లా అడుగుతుంది వెఱ్ఱిది—'కాపీ పుచ్చుకోకుండా కట్టుకుంటావా' అని.

తలెత్తి దూరంగా చూసి అదిరిపడింది అలిమేలు అదేమిటి అంత లావుగా పొంగిపోతుండే నది—ప్రొద్దుటాళ అంత లేదే 'అమ్మో'—గుండెల మీద చెయ్యి పెట్టుగుని నిర్ఘాంతపోయి చూస్తోంది. నీళ్లు ఎఱ్ఱగా, ఎత్తు అలలగా లేచి రొదిస్తూ విరిగిపడుతున్నాయి భలే జోరు—సైకిల్ పోటీలా. నురుగు గుండ్రంగా గాలిలో పత్తిలా తిరిగిపోతూంది చలిగా ఉంది. సూర్యుడు లేడు. కొండెనక దిగి, రోతతో పూసినట్లు విచ్చిన తాడిపండెల్లే ఉండాడు ఆ మూల ఆకాశరామన్న

నీళ్ల కెట్లా దిగేది ? చీరకొంగు చుట్టూ లాక్కుని బిగించి, సిద్ధపడింది నీళ్లెట్లా తాగేది ? రోతనీరు అంతా కంకరమన్ను రంగు ఓ యబ్బ, అవన్నీ తంప, కొమ్మలు, ఆకులు, దూలాలు, ఎక్కడనించో కొట్టుకుపోతూన్నాయి. భయంలేదు. మనుషు లున్నారు లెక్కపెట్టింది. ఏడుగురు మనుషులు—సిద్దీల్లాంటి వాళ్లు, నల్లదూలాలల్లె. ఒడ్డుకెళ్లి నీళ్లల్లో కొట్టుకొచ్చే గంప, పీచునార, దూలాలు పట్టుకుని ఒడ్డుకి చేర వేస్తున్నారు, ఎందుకో ఇంకెందుకు పొయ్యిలోకి కట్టెలకోసం, ఆళ్ల బండబడ, భయం లేదేం—లోనకి పోతూ ఉన్నారు.

ఆ నల్లటి కడ్డీశరీరంమనుషులు దూలాలు ఒడ్డుకి చేరెయ్యడంలో, కూడబలుక్కున్నట్లు, కొంత లయతో కలిసి పనిచెయ్యడం చూసి, అలిమేలు నదిగొడవ మరిచిపోయింది. బలమైన జబ్బలు, పిక్కలు, కండలు తిరిగి, కదలడంలో లయక్రమం చూసి విస్తుపోయింది. చూడ్డానికి బాగుంది. వాళ్ల మొహాలు ఎల్లా గుంటేనేం శరీరం అంతా బాగుంటుందా—అవన్నీ ఎముకలా, కండలా — కాల్చి వొంచిన గునపాలా, బిందె, ఎత్తి, దించి, తన చేతుల కండలకేసి చూసుకుంది. తన వల్లా లేవు అళ్లు మొగాళ్లు—మోటగా ఉంటారు మోటతనం తనకు లేదుగా, అందుకని అదంటె యిష్టం. మరి వెంకన్న అల్లా లేడేం ! ఏమో, ఆడు కష్టపడి పనిచేస్తుంటే తను చూడలేదు ఈమారు చూడాలి చ, ఛ—ఆడి గొడవొద్దు. ఇంకా అమ్మ రాలేదేం చెప్మ వెనక్కి తిరిగి చూసింది. దూరంగా జనం పరుగులెడుతున్నారు, కందిరీగలల్లే—కందిరీగ కుట్టినవాళ్లకి మల్లే—

మరో రెండడుగులు ముందుకేసింది అలిమేలు. "అటెళ్లమాక, చస్తావు— కొంపకెళ్లు" అని అరిచాడు, నల్లశరీరంమనుషులలో వొకడు.

"ఏం ?"

"కళ్లులా—కబోదివా ? నీ రొస్తావుంది. లగెత్తు. పోవేం."

కసిరాడు నల్లటయ్య తనకి భయంగా లేదు అక్కడ కూర్చుని, ఆ నది రొదవింటూ, నురుగు విరిగే గమ్మత్తు చూస్తూ, ఆ నల్లటోళ్ల పిక్కల చమత్కారం చూస్తూవుండాలనిపిస్తుంది

వాళ్లు మళ్లా కసిరారు

ఇంటికేసి బైలు దేరింది అలిమేలు, వొక్కసారి గంగమ్మతల్లికి నమస్కరించి ఆ త్రోవమ్మట రోజూ అంత రద్దీ ఉండదు— ఊరికి మూడు మైళ్ల దూరంగా ఉండటం మూలాన. ఆ సాయంత్రం అందరు జనం, బళ్లు, సైకిళ్లు, కార్లు పోవడం చూస్తూ, తనూ వేగంగా నడవడం సాగించింది దోవ తొలిగి, అడ్డగాళ్లల్లో పడి గంటలు మోగుతూ ఎడ్లబండ్లు పోటీలమీద పోతున్నాయి అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడానికి ఎవరూ నిలబడరు ఏమిటి చెప్మా ! ఇదంతా నదిలో నీటికి భయపడే వెనక్కి తిరిగిచూసింది. ఎన్నడూ చూడని దృశ్యం చూసింది,—నీళ్ళు నది వొడ్డు మట్టంకి సమంగా, అక్కడక్కడ వొడ్లు పొర్లిపోవడం—తనెప్పుడూ చూడలేదు

"ఇదిగో—ఏమిటబ్బాయ్—ఎక్కడికి పోతావున్నారు ?" అని కేక పెట్టింది.

ఆ కుర్రాడు పరుగెడుతున్నాడు.

"నది గండి పడిందంట—అంతా కొట్టుకు పోతుందట ...."

ఒక్కసారి వూపిరి నిల్చినట్లయింది. అంతా కొట్టుకు పోవడమే అలిమేలికి నవ్వొచ్చింది. అరుగో ఆ ముష్టోళ్లు—నిదానంగా చెట్టుకింద చిదగులు పోగుచేసుకుంటున్నారు. వాళ్లకి లేని భయం, వీళ్లందరికీ ఎందుకో. ఇంతకీ అమ్మేదీ ? పొద్దుపోయినా రాదేం ? నది పొంగుతూందని అటకాయించారా ? వెంకటేశ్వర్లు ఎంటుండంగా అమ్మకేం భయం ? అళ్లనీ ఈళ్లనీ అడుగుతుంది కాని, వెంకటేశ్వర్లుని అడగదేం—అదే, తన పెళ్లి విషయం ? ఆడికి—వెంకటేశ్వర్లుకి వోమారు పెండ్లయిందంట, మరే మొచ్చిందో, దాన్ని ఇడిచేసినాడుట. ఆ ఇడిచేసిన దాన్ని చూడాలనుంది తనకి. తనకంటె ఎరుపా ? బావుంటుందా ? చూసి బుజాన చెయ్యేసి 'అయ్యో పాపం' అని, తర్వాత, గట్టిగా లెంప పగలెయ్యాలనుంది ఎందుకో. తనకెందుకో, ఇష్టం ఉన్నవాళ్లని సముదాయించి, బుజ్జగించి, ఆపైన లెంప

పగలెయ్యాలనుంటుంది, అదేం చిత్రమో. తనని చేసుకుంటే, మరొకతె వచ్చితే తనని ఇడిచేస్తాడు వెంకటేశ్వర్లు—అదీ అమ్మ భయం. మరే, తనంత లొక్కా ? తాను చేసుకోకేం. 'చేసుకోను' అన్నాడంటె, ఆడి చెంప పగలదూ ! చేసుకుని ఇడిచేస్తే, చంపెయ్యనూ ? తన మనస్సు ఎలాంటిదో అమ్మకి తెలియదు. ఆ మధ్య నూపరెంటు సూరయ్యగారింట్లో పనికి కుదుర్చు కోమని, ఆరే కబురంపితే, అమ్మ వొల్లకాదంది. సూరయ్యగా రబ్బాయి—శివుడంట—పోకిరబ్బాయంట. అవుతే—తనకి ఆరింట్లో పని కుదరాలనుంది, ఆ పోకిరితనం ఏమిటో చూద్దామని. శివయ్య భలే ఆయన. భలే బట్ట లేసు కుంటాడు. ఎగదువ్వ క్రాపింగు, వాచి, కళ్లజోడు, ముస్తాబుగా ఉంటాడు. ఏమన్నా చేస్తే చెంప పగలేసి సర్దా తీర్చుకోవాలనుంది. కాని అమ్మ వొప్పదు.

కారు హారన్ మోతకి అదిరిపడింది అలిమేలు. నిలబడి తేరబారి చూసింది. కార్లోంచి దిగింది శివయ్య—ఆయనే—నూపరెంటు సూరయ్యగా రబ్బాయి. అదేమిటి అమ్మని చెయ్యి వూపుతున్నాడు ! అలుముకుంటూన్న చీకటిలో తనకి ఆశ్చర్యంగా ఉంది. ఏం చేస్తా డేమిటి. వెళ్లింది.

"ఇదుగో—కారు తోస్తా ?"

తలపంకించింది.

"ఏమిటి తోస్తావా తొయ్యవా ?"

"ఎందుకు ?"

"చెడిపోయింది."

"సిన్నే "

దగ్గరగా వొచ్చాడు సదాశివరావు— జేబు రుమాలుతో మొహం తుడుచు గుంటూ. గుప్పున పరిమళం కమ్మేసింది.

వింత వాసన.

"ఎక్కడికి ?"

"అదుగో మా యింటికి—ఎరగవు? ఆ కొండమీద రెండు ఫర్లాంగులు "

"నాచేత కాదు."

"ఇంతేనా—అంత ఎత్తుగా లావుగా ఉన్నావు."

కారు వెనక మరో ఇద్దరు మనుషు లున్నారు.

"రా, రా—వో చెయ్యి వెయ్యి" అని వాళ్ళ తొందర చేస్తున్నారు. "ఊ" అని సదాశివరావు, ఆమె చెయ్యి పట్టుకు లాగాడు. అతని అరిచేతి చెమట తన చేతికి తగిలి చీకాకు పడింది. చేతినిండా మట్టి— తనూ వెనక్కి వెళ్లి, కారుని తొయ్యడం సాగించింది. శివయ్య లోపలి కెక్కాడు.

"అక్కడ కాదు, ఇక్కడ"

తనని పక్కకి వచ్చి తొయ్యమంటున్నాడు.

వందగజా లొచ్చేశారు. అక్కడ నుండి ఎత్తు ప్రారంభం.

"ఇక్కడ" అని ఆమె చెయ్యి వుచ్చుకుని, ముందుకి లాగాడు శివయ్య. తన బుజాన పడింది చెయ్యి. ఎల్లాగో ఉంది. లేకుంటే యీపాటికి చెంప పగలెయ్యదూ ?

ముందు తలుపు ప్రక్కన తోస్తోంది. కాళ్లకింద మట్టి, అక్కడక్కడ కంకరరాళ్లు, పాదాలను కోసేస్తున్నాయి ఆయాసంతో ఒగర్పు పైకి కనపడకుండా బిగపెడుతోంది కాని ప్రయోజనం లేదు—బిగపెట్టిన వూపిరి విడిచేసినప్పుడు, ఏదో ధ్వని కూడా వస్తోంది కంఠంలోంచి. 'అంత ఎత్తుగా, లావుగా ఉన్నావు' అని వెక్కిరించాడు. తను లావా ? ఆ మాట పీకుతోంది. ఎంత సన్నటి నడుం తనది—నాజూకైన వక్షం, నునుపైన బుజాలు—తను లావా—చీరలో లావుగా ఉంటాను కాబోలు—ముతకచీర, పాతది—చుట్టి చుట్టి బొడ్డుకాడ బిగించింది——మరి బొడ్డుకింద కాస్తంత ఎత్తుగా ఉంది నిజమే. అదంతే—అమ్మకీ అంతే. అందరికీ అంతే. అసలీ మొగాళ్లకి తెలవదు. ఇంటికెళ్లి చూసుకోవాల—లావో కాదో. ఆయాసంతో రొప్పుతోంది—నీటిమీద నూదంటిగాలి పొడుస్తున్నా, చెమటల్లు పట్టేస్తున్నాయి. చెమటంటే తనకి గిట్టదు. ఎండపాటేల కూడా, స్నానం చేస్తుంది. ఏసంగిలో నాలుగు దఫాలు—చెమటంటే రోత. కాని ఈ అలుపు చెమటకి వాసన లేదు అదేంటో; విలిచి పమిటతో మొహం, మో చేతులు తుడుచుకుంది.

"ఇంతేనా—ఐపోయింది ?" అన్నాడు సదాశివరావు. పళ్లిగిలించి నవ్వుతున్నాడు. తెల్లగా ఉన్నాయి పళ్ళు—కండ్లజోడు బాగుండలేదు. అదేదో దయ్యంలా గుండాడు. చెయ్యి వెయ్యబోతుంటే తొలిగివట్లు మరో అడుగు వెనక్కి వేసింది.

"ఇంకెంత, మరో వంద గజాలు."

అలిమేలు నిలబడింది. ఆమెతోబాటు, వెనక తోస్తున్న మనుషులు కూడా నిలిచిపొయ్యారు. రాళ్లమీద కూర్చున్నారు. తనూ దూరంగా వెళ్లి కూర్చుంది. తలని మోకాళ్లమీద ఆనించింది. నక్షత్రాలు మెరుస్తున్నాయి. కీచురాళ్ల ధ్వని పైన నక్షత్రాలదగ్గర నుండి వస్తున్నట్లుగా ఉంది. జనం అలజడి లేదు. నిశ్శబ్దంగా ఉంది. అలసట తీర్చుకోడంతో అలిమేలు పంచ ప్రాణాలు కుదుటపడి మనస్సు నిర్మలంగా ఉన్న ట్లనిపించింది. ఆ క్షణంలో—ఎవ్వరి ప్రమేయమూ పట్ట లేదు—తను తానుగా ఎరుగున్నట్లు, తనలో 'తన తనం' గుప్పట్లో బిగించి చూసుకుని, వోదార్చి, బుజ్జగించి, చివరికి ఫెడీలున శిరంపమీద కొట్టిన ట్లయింది. శివయ్య సిగరెట్టు ముట్టించాడు. హారనేశాడు. ఇద్దరు మను షులు లేచి తొయ్యడం మొదలెట్టారు.

"ఊ—లేవండి—ఒచ్చేశాం" అన్నాడు శివయ్య.

తనూ లేచింది. తొయ్యడం మొదలెట్టింది. పాదాలకింద గులకరాళ్ళ చక్కలిగింతలు పెడుతూ ధ్వనిస్తున్నాయి. గాలి జోరైంది—చిరు వెంట్రుకలు, జెడ కొప్పులోంచి విడి, మొహాన్ని కప్పుతుంటే ఒకచేత్తో తొలిగిస్తూ, మరొక దానితో తోస్తూంది.

"ఇంతేనా—? అలుపొచ్చిందేం"

అంటున్నాడు శివయ్య. ఆమెలో ఒక ఆవేశం వొచ్చింది. ఎందుకు తొయ్యలేదు—తనొక్కత్తే తొయ్యగలదు, పట్టింపుకొస్తే. బలాన్ని పూరించుగుని ఒక ఉద్వేగంతో అవయవాలకి వేరే ప్రత్యేకంగా రోషమొచ్చి తిరగబడినట్లు తన శక్తంతా యీ కాస్త పనికోసమూ ధారవోసినట్లు, ఏదో పూనకం ఒచ్చినట్లు తోసుకుంటూ పోతోంది. జడ వూడిపోయింది బొడ్డు కింద కుచ్చెళ్ళ విడిపోతున్నాయి. కొంగు రొమ్ముని విడిచేసి తెరచాపలాలేచి వెనక్కి తోసేస్తున్నది ఆమె గమనించలేదు. తన రక్తం, మాంసం, ఎముకలు పరాయి సొమ్మైనట్లు—తనకి చెందనట్లు, తనొక యంత్రంగా దేన్నో, ఎందుకో, ఎక్కడకో లాక్కెళ్లడమే లక్ష్యం కానట్లు తోసేస్తోంది.

"ఒచ్చేశాం—మరో ఇరవై గజాలు కూడా లేదు. నేనూ వస్తున్నా."

అని సదాశివరావు, సిగరెట్టు పారేసి, కార్లోంచి దిగి, ఆమె వెనకగా నిలబడి తొయ్యడం మొదలెట్టాడు. అతను తగలకుండా, తాను కొంచెం ముందుగా వెళ్లి తోస్తోంది. తన ఆయాసం, ఒగర్పు అంతా బాగా వింటాడు, ఎట్లా ?

'అమ్మో' మని పెద్ద కేకతో కింద పడింది అలిమేలు. కాలు మడత పడింది. రెండు జబ్బలూ పుచ్చుగుని ఆమెని లేవదీశాడు శివయ్య. జబ్బలు దులుపుకొని, రెండోవైపుకి వెళ్లింది సిగ్గేసింది. తను వోడిపోయింది.

"దెబ్బ తగిలిందా ?"

లేదన్నట్లు, వినిపించుకోనట్లు కారు తోస్తోంది అలిమేలు ఆమె తోస్తున్నవేపు కొచ్చాడు శివయ్య. అదేమిటి అట్లా మీదిమీది కొస్తాడు· అట్లా రావడం ఇష్టమే నని అనిలిమేలు వొప్పుకోలేక పోవడం, నవ్వుగా ఉంటుంది. కానప్పుడు నవ్వే వోపిగ లేదు —ఏడ్చేటందుకూ వోపిగలేదు.

"ఇంద"

శివయ్య ఒకనోటు పైకి తీశాడు.

ఏరకం నోటో ఆమెకి కనబడ్డంలేదు.

"తీసుకో."

తీసుకుంది. తీసుకుంటే తప్పేమిటి—కష్టానికి కూలి. ఏమనాలో తెలీదు. నవ్వుతే అతనికి చీకట్లో కనబడదు. ఆకాశాన ఇంకా మబ్బులే—కాస్త తెరిపియ్య కూడదు ? దగ్గరగా తన నవ్వు చూసునుగా.

ఎనకాల తోస్తున్నవాళ్లకి కూడా చెరో నోటూ యిచ్చాడు. వాళ్లూ తీసుకున్నారు, తనలాగే తప్పులేదు. అమ్మ కిస్తుంది. అమ్మేది ? ఇంటికాడ కూడొండాలి—వెళ్లాలి— వెళ్లింది అలిమేలు.

"ఇదిగో నిన్నే"

వెనక నుండి శివయ్య కేకేస్తున్నాడు.

వినిపించుకోకుండా తనింటికేసి పరుగెట్టడం మొదలెట్టింది అలిమేలు. పరుగు నిర్చింది. బలం అంతా అయిపోయింది. ఒక్కొక్క అడుగే మెల్లగా వేస్తూ ఇంటికేసి నడుస్తోంది. ఎవ్వరూ జనం లేరు. కారు గెంటిన వాళ్ళు కొండ అవతలవైపు నుండి వెళ్లివారు కాబోలు. అక్కడ ఆ రాళ్ల మధ్య పడిపోయి, నక్షత్రాల కేసి చూస్తూ ప్రాణం విడిచెయ్యాలనుంది అలిమేలుకి. కాని అమ్మో, పాణం ఇడిచెయ్యడమే. తనంటే తనకి అంత ఇష్టం. ఇష్టం గలదాన్ని చెంప పగలెయ్యాలిగా మరి—అందుకని తన బుజాన్ని ఎడం చేత్తో గట్టిగా చరుచుకుని, నడవడం సాగించి, పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంది అలిమేలు.

మబ్బు పెద్దదై అంతవరకు మినుకు మినుకు మంటున్న పది పన్నెండు నక్షత్రాలు కూడా కనపడడం లేదు. చీకటివలలో చిక్కుకున్న చేపలా, నలుదిక్కులా భయంతో చూస్తూ యింటికి చేరుకుంది. నోటు విషయం అమ్మకి చెప్పకూడదు.—కూకలేస్తుంది. చెప్తే మాత్రం ఏం? తనేం తప్పుచేసింది? పనిచేసి కూలి సంపాదించింది. అమ్మ మాత్రం ఆపని చెయ్యడంలా—ధాన్యం దంపుళ్ల కెడుతుంది, మిషను కుట్లు కుడుతుంది. ఊళ్లోవాళ్ల ఊరగాయలకి అమ్మ చెయ్యి చేసుకోవాలి. ఎవ్వరూ జనం కనబడరేం? దూరంగా చెట్లకింద ముష్టివాళ్ల వెలిగించిన మంట ఆరిపోతూంది—పిలిచింది ఎవరన్నా పలుకుతారేమోనని. అమ్మని కేకేసింది. ఇల్లుదాటి ఫర్లాంగు ముందుకెళ్లి అమ్మని కేకేసింది. నది హోరు వెక్కిరించినట్లు, వెన్నుమీద చరిచినట్లు వినబడుతోంది.

ఇంట్లో కొచ్చింది. తనకి ఆయాసంగా ఉంది. ఆకలేస్తోంది. అగ్గిపుల్ల కోసం తడుముతోంది. బియ్యం పడెయ్యాలి. రొయ్య పొడుండబ్బా చేతికి తగిలింది. దాని ప్రక్కనే అగ్గిపెట్టె పుల్లగీసి ఇలాయి బుడ్డి వెలిగించింది. అది అప్పుడే ఆరిపోయింది. మరో పుల్ల గీసి, లాంతరు ముట్టించింది. ఊపి చూసింది. కాస్త మిగిలిన కిరసనాయిలుతో లొకలొక లాడింది. తన కాకలేస్తోంది. ఉండబట్టలేక, రొయ్య పొడుం తింది, పూగిసలాడే మంచం పట్టెమీద కూర్చుని. కిందినుంచి పరిగెత్తిన ఎలుకని చూసి ఉలిక్కిపడింది. ఇలాయిబుడ్డి తగిలించే చోట, గోడమీద నల్ల డాగులో కదుల్తున్న బల్లి నల్లగా ఉంది.

కళ్లు మూసింది అలిమేలు. తనొక్కత్తె ఉండడం వింతగా ఉంది. ఇంకెవరూ లేరు—తను, ఆ ఏడుకొండలవాడు—అంతే. తనమీద తనకి జాలి, భక్తి, విశ్వాసము కుదరడం వొక అనుభవం. పెట్టెమీది అద్దంముక్క చీరతో తుడిచి, లాంతరు దగ్గరగా లాక్కుని, అద్దంలో తన మొహం చూసుకుంది. ఎంత బాగుంది తాను. తను మొగాడైతే, అద్దంలో మనిషిని గట్టిగా ముద్దు పెట్టుకుని మరి వొదలదు. నిరుడు తిరణాల కెళ్లినప్పుడు, ఆ మొగాళ్ల మంద తనవెంట బడటం అమ్మ కూడా చూసింది. ఆలయంకాడ జనం వొత్తిడిలో ఆడెవడో పోకిరీ వోడు. ఎదురంగా పరుగున వొచ్చి రొమ్ముమీద ఢీకొన్నాడు. తనకి జ్ఞాపకం. ఆ నరయ్యోకడు. అమ్మ అందుకనే వాళ్లింటికి పోవొద్దంటుంది. ఆ నరయ్య వోపాలి, దూడలపాక దగ్గర, ముల్లు గుచ్చుకుని కింద పడబోయినట్లు తూలి నడుం గట్టిగా పట్టుకుని—ఓయబ్బ—ఇక్కడ గిల్లేశాడు—మోట సచ్చినాడు. పమిట తొలిగించి తన స్థనాలు చూసుకుంది. నిండుగా, గుండ్రంగా మధ్య సూది పట్టేటంత యడం కూడా లేకుండా—తనని లావంటాడా—శివయ్య. శివయ్య పీల, రొయ్యలా గుంటాడు—నవ్వుతో అద్దంలో నోరు వొంకరైంది.

పెద్ద చప్పుడుతో నదిలో నీళ్లు పొంగి, ఇంట్లో కొచ్చివేశాయి. గేద్దాడ మాయలా భ్రమించింది. కాదు—ఆ రొదేమిటి. అమ్మో తడి—ఇంట్లోకే నీళ్లు—దూరంగా గుమ్మంలోంచి చూసింది అంతా నీరే—నల్లగా, వలలా, మొసలి నోరు తెరుచుకున్నట్లుగా, కాళ్లని చుట్టేసింది. డబ్బాలు, గిన్నెలు, కుండలు, డిక్కిడిక్కిమని కొట్టుకుని ఎగురుతున్నాయి, తేలుతున్నాయి. తన పాదాలు మునిగి పోయినాయి. ఎలుకలు కిచకిచమంటూ మంచంమీద పరుగులెడుతున్నాయి. మంచం పట్టెమీదకి పాకుతున్నాయి నీళ్లు. అమ్మో, కొంప మునిగింది. కెవ్వున కేక పెట్టి, గుమ్మంకేసి గెంతి, కింద పడింది. లేచింది. లాంతరు బుజాన తగుల్చుకుని దొడ్డివైపు వైపు కొచ్చింది. అక్కడికీ వొచ్చేశాయి నీళ్లు. కొంప మునిగిందర్రో అని పెద్దగా అరిచింది. అమ్మని పిలిచింది. ఇరుగు పొరుగు వారి పేర్లు పిలిచింది. ఎవ్వరూ పలకరు., ఇదేమిటి యీ ఆపద—ఇంత ఉపద్రవమా—ఎక్కడికి పోవడం? ఎటూ. "ఇటు", 'ఇక్కడికి' అన్నట్లుగా నీళ్లు, తుక్కు, దూగర, ఆకుఅలమ, కట్టెలు, బొగ్గులు, గుడ్డపీలికలు—అన్నీ నీళ్లలో కలిసి, తన మోకాళ్లని పీకేస్తున్నాయి. చలిగాలేదు. కాళ్లు కాల్తున్నట్లుయింది. నీటి వడిని ఎదుర్కొని ఇంటిలోపలి కెళ్లింది. ఉట్టి తాడుకి వేళ్లాడుతూన్న రవికని తీసుకుంది. అది పాతది—చినుగుది. ఉతుక్కి తీసి, తనకి పట్టడంలా. గట్టిగా బిగించి తొడుక్కుంది. జడలో పిన్ను తీసి, గుచ్చి, తడిసిన గుడ్డపీలికను పిండి, మెడ వెనక జారిన జెడని బిగించి కట్టింది. నీరు నడుందాక వొచ్చేసింది. ఇది తమాషాలాగుందే. మంచం పక్కన నీటిమీద వెంకటేశ్వరస్వామిది—కర్రబొమ్మ ఆడుతోంది. దాన్ని తీసుకొని, పళ్లల్లో బిగించి, దొడ్డివైపు కొచ్చింది. చచ్చిపోతానా? ఇంక ఆఖరే—వెంకటేశ్వర స్వామికి దయలేదా. తనని చంపేస్తాడా? ఏం పాపం చేశానని అంత కోపం. చచ్చిపోవడం అంటే ఇదా—ఇంతేనా— కాసిని నీళ్లు తాగి గుటుక్కు మనడమేనా! తను చావదు. చావంటే అంత సుళువా—అంత ఎత్తయిన, లావైన శరీరం,—అంత జోరుగా కొట్టుగునే గుండెలు—గుండెమీద చెయ్యి వేసి చూసుకుంది. చేతి వేళ్లు ఆ వేగానికి అదిరిపోతున్నాయి. చప్పుడు వినవొస్తోంది—గుండెకాయ కంఠంలోకి చొరపడ్డట్లు. దొడ్డివైపు కొచ్చి నలుమూలలా చూసింది. అంతా నీరే,— మోకాళ్లదాకా వొచ్చేసింది. చీర పైకి లాగి, గోచీలా బిగించి వెనక్కి మడిచి కట్టింది. దొడ్లో రాక్షసిలా ఎదిగిపోయిన చింతచెట్టుంది. దానిమీద కెక్కితే తనకి బెంగలేదు. కాని ఎక్కడం ఎట్లా? దాని మొదలు తనకంటే రెండింతలు ఎత్తునుంది. ఆపైకి వెడితే. పెద్ద కొమ్మలుగా చీలింది. ఆ కొమ్మలు కుర్చీ బల్లలా, ఏటవాలుగా ఉన్నాయి. ఇంటి చూరుకింద గోడలో, అక్కడక్కడ ఇటికలు వూడగా కంత లేర్పడి పాదానికి పట్టుగా ఏర్పడ్డం, యత్నించి చూసింది. నోట్లో చందనం బొమ్మ, భుజాన లాంతరు, రెండు చేతులతో పై ఇటుకలు పట్టుగుని, పాదాన్ని కంతలో ఆనించి, వొకడుగు పైకి వేసింది. కింద నీటి ప్రవాహం.

పైని నెత్తికి తగిలే చూరు. ఎట్లా పైకెళ్లడం? చూరులో పొడుంగా విడిపోతున్న రెల్లు, రెపరెపమని చిరిగిపోతూన్న తాటాకులు, ఆ మట్టలు చేతికి చిక్కాయి. కుడికాలు పైకి మడిచి, ఒక్క వూపుతో, చూరు పైకి చేరుకుంది. ఆయాసంతో, భయంతో చెమట్లు పోసేస్తున్నాయి. ఆ తాటాకులమీద, ఆ రెల్లు గడ్డిలో మొహం దాచుకుని, ఏడ్చేసింది అలిమేలు. తను బ్రతుకుతుంది—చావకూడదు. దేవుడు కటాక్షించాడు. కాని ఆ లాంతరొకటి. జారి పడితే గడ్డి అంటుకుంటుంది. అంటుకుంటే అంటుకోనీ—ఇంత నీళ్లుండంగా—కొంప తగులడితేనేం, మునిగితే నేం,—'అమ్మో' అని మరో పెద్ద కేక వేసింది—తను కిందికి జారిపోతోంది. ఆ తాటాకులలో, రెల్లులో పట్టు లేదు—ఏటవాలుగా, కిందికి జారిపోతోంది. మరో క్షణంలో కింద నీళ్లల్లో పడిపోను. లేచి కూర్చుని మోకాళ్లని, తాటాకులలోనికి జొనిపి, మెల్లగా లేచి విలబడి, చేతికి అందీఅందకుండా అడుగు దూరంలో ఉన్న చింతచెట్టు కొమ్మని బలంగా పట్టుకుని, రెండు కాళ్లూ ఒక్కసారి పైకి ఎగరేసి, చెట్టు మ్రాను మధ్యలోకి గెంతిపడింది. కళ్లు గట్టిగా మూసుకుంది. చచ్చానా, బ్రదికానా? పొట్టకింద గోకి చూసుకుంది. 'అమ్మో' మని మరో పెద్ద కేక వేసింది. వెన్నుమీద లాంతరు చిమ్మి చుర్రుమంది. చిత్రం ఆరిపోలేదు. చేతులు తనవే. కాళ్లు తనవే. చేతులకి ఒక్క గాజు లేదు—ఉన్న నాలుగూ గోడకి తగిలి విరిగిపొయ్యాయి కాబోసు. మెళ్లో గొలుసు లేదు. ఆ పెట్టెలో ఉండిపోయింది. నెత్తికి కట్టిన గుడ్డ తీసేసింది. జుట్టు విడిపోయి, గుబురుగా మెడవెనక్కిపడేసి, సరిచేసి, తడిని ఆరబెట్టేటట్లు, చేతులతో చప్పుడు చేస్తూ, జడని పాయకింద లాగి, మ్రానుకింద సన్నగా లేచిన చిరుకొమ్మకి తాడులా బిగించి కట్టేసింది,

మరో పాయిని లాంతరుకి ముడేసింది వెన్ను ప్రమాను మధ్యగా ఆనించి, కాళ్ళు మరో కొమ్మకి తగిల్చి, ఆకాశంలోకి చూసింది అలిమేలు అది ఆకాశం కాదు—తను పడిపోకుండా పైన కాసుకొని చూస్తున్న ఒక శక్తి, ఒక వింత—తనెన్నడూ ఎరగని అనుభవం. తన పేరు, ఊరు, అమ్మ, కొంప, వెనక, ముందు, డబ్బు దసకం, తిండి తిప్పలు—ఇవన్నీ మరిచిపోయి, కేవలం కండలో ఎముకలో సజీవంగా, ఊపిరి పీల్చి, ఉండడమే, ఆ వింత అనుభవం నరాలు, గుండెలు, రక్తం, శరీరంలో ప్రతి అణువు, నోరిప్పి పలకరించినట్లు, కన్నులాగై తనలోనికి చూస్తున్నట్లు, నోళ్లయి తనని తాకి, ముద్దెట్టుకొన్నట్లు—తను తనలా కాక, మరొకరిలాగ, ఆ మరొకరు తనుగా అయిపోయి, తన్ను తాను కౌగలించుకొని, ఆనందంతో ఒక్క పెట్టున ఏడవడం ఆ వింత

కొమ్మమీద జార్లబడి కళ్ళు మూసుకుంది అలిమేలు కళ్ళు మూసుకున్నా, తెరుచుకొన్నా ఒకలాగే ఉంది రెప్పలకింద కెరటాలు, రంగురంగులవి ఇసుకని కోసినట్లు కవ్వించి, చక్రాల కింద ఒకదాని వెనక ఒకటి పెద్ద చక్రంగా మారుతూ చంద్రుడుగా, సూర్యుడుగా, కోటి రంగుల సముద్రంగా పైకి లేచి ఆకాశంలో అంతర్ధానమైపోతున్నట్లు ఆలోచన లేదు—అమ్మని గురించి ఊహ లేదు. ఆకలి లేదు—సజీవమై ఉండి కూడా నిర్జీవంగా మిగిలిపోవడంలాగుంది

అది కల కాదు—కింద నీళ్ళు, కాలు జాచితే అందేటంత పైకొచ్చాయి చెట్టు మొదలు కనబడడం లేదు ఇంకా పైకొస్తే, ఎక్కడి కెక్కడం—ఆ కొమ్మ చదునుగా, తిన్నగా ఉంది—పైకి ఎక్కేటందుకు పట్టు దొరకదు కిందంతా నీరు—పైన మబ్బు మాసినదుప్పటిలా ముడతలు పడి, ఆకాశాన్ని నీటిమయంగా చేసేసినట్లుంది కింద, పైనా అంతా ఒకటే—తేడా లేదు. నిశ్శబ్దంగా ఉన్నా, మరణానికి ముందు రోదించినట్లు ఓపిగలేని మేఘాలు ఢీకొని అయిష్టంగా ఉరిమినట్లు, నది నీళ్ళు పల్లంలోకి జారి పోతూ సిగ్గుతో మొహాన గుడ్డ కప్పుకుని కింద రత్నాలని, మణిమాణిక్యాలని చీపురుతో తుడిచేసినట్లు — తనకోసం, తనపైకి — కడసారి త్యాగాన్ని నోరు విప్పి అడిగినట్లు ధ్వనిస్తూ పొంగి, పొరలి విచ్చలవిడిగా విర్రవీగి పొగారిపోతూవుంది

గుండె దడ తగ్గింది—తనకి తెలిని మార్పుతో శరీరం స్థిమితపడుతోంది. చావడానికి తగినంత ధైర్యం చిక్కింది అమ్మ లేనిది తను బ్రతికి ఏం ప్రయోజనం ఒక్క క్షణం, వూపిరి బిగపెట్టి, రెండడుగులు దిగితే, అయిపోతుంది

అమ్మో—ఎందుకు చావాలి ? అమ్మకేం—ఏ లోగిలిలోనో నిక్షేపల్లా ఉంటుంది. చిన్నప్పటినుండి తనెరుగున్న శరీరాన్ని—పాపం గంగపాలు చెయ్యడమా. అదేం చేసిందని ?

కెవ్వున కేక పెడుతున్నా రెవరో—అదిరిపోయింది అలిమేలు మళ్ళా గుండెదడ ప్రారంభమైంది అదిరిపాటులో లాంతరు కొమ్మకి తగిలి, ఆలో లక్షణా అన్న చప్పుడుతో టప్పుమంది చిమ్ని బీటతీసింది—

ఎవరిదో కేక పెద్దదైంది మూలుగు, రోద కాపాడమని—అయ్యో, బాబోమని—అరుపు అది మొగాడి కంఠం నిలబడి నాలుగు దిక్కులా చూసింది. ఒక కంప తన చెట్టు వెంపుకు కొట్టుకొని వస్తోంది అందులోంచి ఎవరో చేతులు పైకెత్తి మొరెట్టుగుంటున్నారు దగ్గర కొచ్చేసింది. రెండు చేతులతో కొమ్మని గట్టిగా పట్టుకొని, కాళ్ళు కిందికి నీళ్ళు తాకేటట్లు చాచింది కొట్టుగుపోతోన్న కంపలోంచి పైకి కనబడుతోన్న ఆ చెయ్యి ఆమె పాదాలని గట్టిగా పట్టుకుంది చాలా బరువు కొమ్మని తన పట్టు నిలవడంలేదు—జారిపోతోంది

ఆమె మోకాళ్ళు పట్టుగుని ప్రమానుమీద ఒక కాలుంచి, ఆ వ్యక్తి కొమ్మ మొగలో ఆమె ప్రక్కనే కూలబడిపొయ్యాడు

"గట్టిగా పట్టుకో వొదలకు " అని వొగరుస్తూ సదాశివరావు ఆమె నడుం గట్టిగా పట్టుగున్నాడు నీళ్ళు నోట్లోంచి బైటకి వొచ్చేస్తున్నాయి

"కాసేపుంటే వచ్చేవాడినే .."

'హయ్యో' అని ఆయాసంతో హైరాణ పడుతున్నాడు.

"మీరా ?" అంది అలిమేలు తెల్లబోయి

"నేనేమిటి, నువ్వేమిటి చస్తూంటే "

"మెదలకుండా వుండండి—ఇదుగో ఈ కొమ్మకి కాలు ఆనించండి—ఆ—అల్లాగ—ఆవైపు కొమ్మని నడుం ఆనింది పట్టుకోండి—మాట్లాడకండి" అంది అలిమేలు, నడుం పైనుండి అతని చేతులు తొలిగిస్తూ అతని నవదలు, అంకెళ్ళు తడికీ, చలికీ నొక్కుకుపోయి మాట్లాడలేక పోతున్నా, ఏదో చెప్పాలని, బిగ్గరగా ధ్వనులు చేస్తూ, యత్నం చేస్తున్నాడు

"ఆఖరికి నువ్వే దిక్కయ్యావు "

డ్రైవర్ ఉడాయించాడు—నౌకర్లు లగెత్తారు—చివరికి—అది—సువర్ణ కూడా—ముందే తెలుసుకుంది కాబోలు,—ఈ నది గండి పడి వుపద్రవం జరుగుతుందని—ఎప్పు డెళ్లిపోయిందో—జాడలేదు నేను—నేను "

అలిమేలు ఆశ్చర్యంతో చూస్తోంది కళ్ళు పూర్తిగా తెరుచుకుని—మొహం అంతా ఒక కన్నైనట్లు

"మాట్లాడకండి "

"మాట్లాడకపోతే చచ్చిపోనూ, భయంతో మాట్లాడి తీరాలి—ఇంకా బిగ్గరగా మాట్లాడతాను నేను, నాలుగింటికి క్లబ్బు కెళ్లాను. చీట్లాట అంటే పేకాట రమ్మీ అంటారులే—నీకు తెలీదు ఇరవై కాజేశారు మరో గంటుంటే అదంతా రాబడుదును ఈ లోగా టెలిఫోన్లు మోగాయి,—నీళ్లొచ్చేస్తున్నాయని కార్లో ఇంటికి బైలుదేరాను కాస్త దూరంలో కారు చెడింది—వాళ్లనీ, వీళ్లనీ పోగుచేసి కారుని కొండ పైకి జేరేశాను ఇంట్లో ఎవ్వరూ లేరు అవి ఇవి సర్ది, డబ్బు పర్సులో పడేసి కారు రిపేరు పూర్తిచేసి బైట కొచ్చేటప్పటికి, అప్పుడే నీళ్ళు కిటికీ దాకా వొచ్చేశాయి కార్లో కూర్చున్నా—గరాజ్ తలుపు లూడి తేల్తున్నాయి గట్టి కర్ర—మందంగా ఉన్నాయి తాళ్లతో రెండు తలుపులనీ ఒకటిగా కట్టి—వాటిమీదకు గెంతాను నువ్వేకదూ—కారు తోసింది—అట్లా చూస్తావేం ?"

ఎవర్నో అన్నట్టు, వెనక్కితిరిగి చూసింది అలిమేలు తననే అంటూంట ఏమనాలి ? ఏమీ మాట్లాడలేదు కండ్లకి జోడు లేదు కళ్ళు చిన్నవిగా, లోపలగా ఉన్నట్లున్నాయి క్రాపింగు నుదుటిమీద పడింది—చొక్కా తడిసింది నెత్తిన కప్పిన తువ్వాలు తీసి నడుంకి బిగించాడు ఆ తువ్వాలు తన కిమ్మని సంజ్ఞ చేసింది ఇచ్చాడు బాగా పిండింది. నీళ్ళ వొదిలేటట్లు కొమ్మలకేసికొట్టి అతనిచేతి కందిచ్చింది

"ఏం—అప్పుడు—చూస్తూ చూస్తుండగా, నీళ్లల్లో తేలిపోతూ, కిందికి పడవలా జారుతూ వొచ్చేశాయి. ఏదో కంపకో, రుప్పకో తగులుకుని నిలిచిపోయింది ఇరుక్కుపోయింది అప్పుడు మొదలెట్టింది భయం.

.అన్నీ ముళ్ళు కదుపుదామంటే ఆ కంపనే పట్టుకు కూర్చోవాలి. కేకలెట్టాను అందులో ఏ పామో కరిస్తే—చస్తాను అరుపులు, ఏడుపులు"

"నాలాగ భగమంతుణ్ణి తల్చుకోలేక పొయ్యారూ ?"

"చావు రానుంటే భగవంతుడు కూడా తప్పించలేడుగా ప్రాణం రక్షించుకొనే సమయంలో నా కెవ్వరూ జ్ఞాపకం రాలేదు—ఆవిడ, నాన్న, అమ్మ, నౌకర్లు—నాకు నేనే—ఆలోచన లేదు—బుర్ర లేదు— ఊ భయం, ఏడుపు, అనుకో అమ్మో—చచ్చాను "

అని మోచెయ్యి పట్టుగుని బాధపడుతున్నాడు సదాశివం

"ఏమిటది ?"

"ముళ్ళు—అన్నీ ముళ్లే—చస్తాను " అలిమేలు రవికకి బిగించిన పిన్ను —కాస్త పక్కగా తిరిగి, బైటకి తీసి అతని మోచెయ్యి దగ్గరగా లాక్కుని, ముల్లుని కెలుకుతోంది 'బాబోయ్', 'అమ్మోయ్' అంటూనే ఉన్నాడు అతను మెల్లగా బైటకి లాగింది చీకిపోయిన ముల్లుని

"వొద్దు—ఆ బాధ కంటె ఈ బాధ ఎక్కువగా ఉంది—వొద్దు "

"ఫరవాలేదు "

"ఇదుగో" భుజం చూపించాడు— చొక్కా మెడ కిందికి తోసి, బజాన ఉన్న ముల్లు కోసం వేళ్లతో తడుముతోంది అలిమేలు. దొరికింది

పిన్నుతో కెలికుతోంది అతను పెద్ద కేకపెట్టి ఆమెమీద వొరిగిపోయి గట్టిగా నడుం బిగించి పట్టుకున్నాడు ఆమె స్తనాలు అతని వక్షం ఎడమ భాగానికి తగుల్తున్నాయి—తడిగా, వేడిగా అల్లాగే ఉండిపొయ్యాడు

కదలడేమిటి ? బుజం పట్టుకుని వూపి దూరంగా కూర్చోపెట్టింది.

"వొదలకు—నన్నొదలకు—వొదిలావంటే చస్తాను భయంగా ఉంది." అని మళ్ళా ఆమెని గట్టిగా పట్టుకుని, చేతులతో ఆమె శరీరాన్ని నిమురుతూ, దేనికోసమో వెదుకుతున్నట్లు ప్రతి అవయవాన్నీ స్పృశిస్తున్నాడు. ఆమె కిదంతా వింతగా ఉంది, ఎల్లాగో ఉందబ్బా చక్కిలిగింతగా ఉంది—ఇదేమిటి, పొయ్యేకాలం—ఇట్లా చేస్తాడు ?

అతని క్రాపింగ్‌కి, బట్టలకి ఏదో బురద—మడ్డి— తనకి రాసేస్తున్నాడు. నుదురు స్తనాల మధ్యగా ఆనించి పొడుస్తాడేమిటి ? పెదవులతో చర్మం పట్టుకుంటున్నాడు—ఇదేం మనిషి—రోతగా ఉంది తనకి తెలీకుండా అతని తలలో వేళ్ళుపెట్టి తడుముతూ, మడ్డిని తొలగిస్తోంది. ఇంకా గట్టిగా నడుం బిగించివేస్తున్నాడు—అబ్బ—ఎంత బరువో మొగాడు! తోసేస్తే కింద నీళ్లలో పడతాడు ఇద్దరూ పడతారు ఎట్లా జుట్టు వేళ్లల్లో బిగించి, తల పైకెత్తింది అమ్మో అంటూ లేచాడు—కళ్ళు తెరవడు—మైకంలో ఉన్నాడా ? తాగాడా ? చస్తాడా ఏమిటి ? తను చంపేసిందంటారా ఏమిటి కర్మ—ఏమిటి చెయ్యడం ? చుట్టూ చూసింది. అన్ని వైపులా గుడగుడమని ప్రవహిస్తూ నీళ్ళు ఆకాశంలో శవంపై కప్పిన గుడ్డలా మబ్బులు అమ్మో, బొడ్డుపైన పళ్ళు తగుల్తున్నాయి జుట్టట్టుగుని తలపైకి లేవదీసి గట్టిగా లెంపకాయ కొట్టింది—పూనకంవోళ్ళని కొట్టడం తను చూసింది

కళ్ళు తెరిచాడు తేరిబారి చూశాడు

"నువ్వు, నువ్వా కొట్టింది ? నువ్వే ?"

"తెలివిగా వున్నారో లేరో నని"

నవ్వింది అలిమేలు

"నాకేం తెలీదు భయంగా ఉంది మనిషి కావాలి నువ్వు కావాలి నీవొళ్ళు భలే వేడి—నిప్పులా—చలిమంటలా—మెత్తగా, గట్టిగా రబ్బరు బంతిలా ."

ఇంకా చెబుతూండగానే రెండో లెంపమీద మరో దెబ్బ వేసింది.

'అబ్బ!' అని అదిరిపడ్డాడు

అతనికి కోపం వచ్చేసింది

"ఎందు కట్లా కొట్టావు—"

"మెలుకువగా ఉన్నారేమోనని"

"ఛ, ఛ—కొడతావూ—తోసేస్తే నీళ్లలో పడి చస్తావు"

"నాకేం భయంలేదు—మీకే భయం నే నీళ్లలో పడితే, మీరు ఒంటరిగా ఉండగలరూ—నా వెనకే దూకుతారు"

"నిజమే—వొంటిగా ఉండలేను—"

అని మళ్ళా ఆమె వక్షంలో మొహం దాచి, శరీరం స్పృశిస్తూ, గట్టిగా కౌగలించుకున్నాడు

"వొదలద్దు—నీ కేది కావాలంటే అదిస్తా—మేడా—కారా—నగలా—నీ వొళ్ళు ఎంత బాగుందో నువ్వెరగవులే—వొక పెద్ద శిథిలమైన కోట మధ్యలో తలదాచుకున్నట్లుంది. నీ చేతులు, కాళ్ళు ఫారానాళ్లు. నీ రొమ్ములు కత్తులు—నీ జుట్టు వల. నీ కళ్లూ, శత్రువుల జాడ తెలుసుకునేందుకు కోట గోడలో కంతలు—"

"ఇయ్యేం పనులు—మంచి బుద్ధులే"

అని దూరంగా జరిగి పట్టు వొదిలించుకోవాలని పెనుగులాడుతూంది అలిమేలు

జుట్టు పీకింది మొట్టికాయలు మొట్టింది—

'బాబోయ్' అని లేచాడు—

చేతికి తగిలిన చందనపు బొమ్మ పైకి లాగాడు.

"బుగ్గకి పొడుచుకుంది—నీ మొల్లోది—ఇదేమిటి ?"

"ఎంకటేశ్వరసామి బొమ్మ—మొల్లో దాచా—బాగా అయింది—మరి లేకుంటే అయ్యేం పోకడలు ?"

బొమ్మ లాక్కుంది

"ఎందుకా బొమ్మ ?"

"ఉండాలి. దేవుడు"

సదాశివరావు బిగ్గరగా నవ్వుతున్నాడు. మూఢభక్తి కాబోలు కాని నవ్వు క్షణంలో నిల్చిపోయింది నీళ్ళు 'కసకస' మంటూ పాదాలకి తగిలేటంత పైగా వొచ్చేశాయి పెద్ద కేకతో ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

"అమ్మో" అంది అలిమేలు

"ఇంక చావడమే. నీళ్ళు పైకొచ్చేస్తున్నాయి ఎట్లా ?"

దిక్కుమొగం పెట్టి ఏడుస్తోంది. చెట్టుపైకి చూశారు పైకొమ్మ అయిదా రడుగుల దాకా, సాఫీగా, తిన్నగా—ఎక్కడా పట్టు లేకుండా పైకి లేచి ఆపైన వొంకర తిరిగి సన్నగా ఒంగిపోయింది ఆ ఐదా రడుగులూ పైకి వెళ్లడం ఎట్లా ?

ఒకరి మొహాలు వొకరు చూసుకున్నారు మేఘాలు కూడా తలలు కొట్టుకుని ఏడుస్తున్నట్లు, ఒకసారి గర్జించి—బురద కన్నీటి ధార వర్షంగా వారి నెత్తిన అవతరిస్తున్నాయి

అతని కళ్లల్లో మృత్యువంటే భయం ఎట్లాంటిదో చూసింది. కాసేపు మూసుకుపోయి, ఆ మూతలో కాస్త తెరుచుకుని నల్లకొలికలో తెల్లపాప, నల్లటడివి మధ్యలో సెలయేరులో ఎగిరిపడిన చేపలా తళుక్కుమని, మళ్లీ చీకటిలో కరిగిపోయిన, 'భయం' అనే గుడ్డుని చూసి ఇదివరకెన్నడూ ఎరగని జాలితో అతని తల లాక్కుని, తన వక్షంమీద ఆనించుకొని ఏడ్చేస్తోంది అలిమేలు. అంతటా తడి—నీరు—చెమ్మ—ఒకరిలో ఒకరు దాక్కుని, కలిసి పొడి చేసుకున్న ఆ కాస్త చోటు తప్ప—అక్కడే జీవం లంగరు వేసుకున్నట్లు, కాసేపు వూపిరి సలుపుతోంది—తడిలోంచి, నీటిలోంచి, అగ్ని పుట్టించినట్లు—రెండు ప్రాణులు ఒక్క శరీరాన్ని నిలబెట్టినట్లు—ఆమె మోకాళ్లమీద అతని పాదాలు—ఆమె రొమ్ములమీద అతని మోకాళ్ళు—ఆమె భుజాలపైన అతని తొడలు—ఎక్కడికో పైకి పారిపోతున్నాయి, జలగల్లా పట్టుకుని, ఆకాశంలో తొర్రని వెదుకుతూ—చేతులు ఆమె నెత్తిన పెట్టాడు—పాదాలు భుజాలపైన,—నిలబడ్డాడు—ఆ వొంగిన కొమ్మ మొదలు చేతికి చిక్కింది పట్టుకున్నాడు—కాళ్ళు పైకి లాక్కుని, ఆపై కొమ్మమధ్య కూలబడి, గట్టిగా పట్టుకుని, ముక్కుతూ, మూల్గుతూ సజీవంగా ఉన్నాడు సదాశివరావు

అలమేలు ఏడ్పు మానేసింది ఏడవడం సాధ్యం కావడంలేదు పైకి చూసింది పీడ విరగడైనాడు, సక్కంగా—మారాజు బ్రదికాడు అమ్మయ్య వూపిరి వొస్తోంది తొక్కి, నలిపేసేసి చంపేశాడు—నీళ్ళు పైకి రానీ, ఎంతవర కొస్తాయ్యో చూస్తాను చస్తాను, అంతేగందా—ఆడి చేతుల్లో, కాళ్ల కింధ పడి చావడం కంటె, గంగపాలవడం మంచిది ధీమాగా కూర్చుంది

"రా, రా, పైకి, రా" అంటున్నాడు పైనుండి

రానన్నట్లు కిందికి చూస్తూ తల వూపడం అతనికి కనపడ్డంలేదు.

"భయమేస్తోంది. ఇదిగో—నా కాలట్టుగో."

"నే రాను"

"కోపమా ?"

"ఏడుపు"

నవ్వాడు సదాశివరావు ఏమిటో అర్థంలేని సంభాషణ తను ఇష్టంగా ఉండడం మూలాన వర్షం ఆమెమీద పడుతున్నట్లు లేదు జుట్టు విడదీసి దులుపుకుంటోంది

"ఇదిగో—తీసుకో"

పైకి చూసింది చేతులో ఏదో ఉంది కనబడ్డంలేదు.

"నుంచో—రాకపోతే, నేనే దిగుతాను—"

"వొద్దు ఇద్దరం పడి చస్తాం"

"''ఇద్దరం చస్తే భయంలేదు"

కాళ్ళు ఆమె బుజాలకి తగుల్తున్నాయి.

"తీసుకో."


త్వరలో!
లలితా శివజ్యోతి వారి.....
లవకుశ
(పూర్తి గేవాకలర్ చిత్రం)
డైరెక్షన్: సి. పుల్లయ్య, సి. యస్. రావు

కాళ్ల వేళ్లలో ఏదో ఉంది తీసింది. తడిసిన రూపాయల నోట్లు. తనకంత కోపం ఉన్నట్లు తెలుసుకుని ఆశ్చర్యపడింది అలిమేలు. ఆ నోట్లు తీసుకుని ముక్కలు ముక్కలుగా చించి నీళ్లల్లో పారేసింది

"చాలా—ఇవిగో—ఇంకా ఉన్నాయి. దిగుతున్నా." అంటూనే కిందికి దిగాడు సదాశివరావు ఆమె పక్కగాతొలిగి కొమ్మని పట్టుగుని నుంచుంది. వర్షం నిలిచింది. కింద నది రొద ఎక్కువైంది. నీళ్ల వేగంగా కదిలి పోతున్నాయి హెచ్చిన వేగంతో రొద పెరిగింది. ఏవేవో చప్పళ్ళు. తాటాకులు కాలినట్లు, డబ్బాలు ఢీకొన్నట్లు, దూలాలు విరిగి పడ్డట్లు. తన ఇంటి కప్పు కూలిపోవడం చూసింది అలిమేలు. గోడ విరిగి, కరిగి జారిపోయింది. ఇంటి భాగాలు నీళ్లల్లో పోతున్నాయి—అటుకేసి, నదికేసి, దూరంగా, ఇంకా దూరంగా చీకట్లోకి భయంతో వణికిపోతూ కూలబడి ఆమె తొడలు పట్టుకుని కూర్చున్నాడు ఆమె వొంటిమీద మిగిలిన చీర చాలా భాగం వూడే పోయింది ఒక చేత్తో ఆమె స్తనాలు కప్పుకుంది, రెండోదానితో అతని పట్టు విదిలిస్తోంది. మరికొన్ని నోట్లిచ్చాడు. తీసుకొని చించి, నోట్లో నమిలి, నీళ్లల్లోకి వూసింది.

"అదేమిటి—?"

"ఉమ్మ్"

"ఛీ, ఛీ—డబ్బు పారేశావా—ఏం ఇదిగా ఉంది. ఎవరవనుకున్నావు ?"

"చచ్చినదా న్ననుకున్నాను."

"డబ్బు చేదా ?"

"విషం."

అతని భుజంపైన పాదా లానించి, లేచి నిలబడి పై కొమ్మలోకి ఎగ బాకి, మధ్య తొర్రలో కూలబడింది.

"నన్నొదిలేసి పోతావా ?"

"నువ్వొదిలెయ్యలా ?"

ఆశ్చర్యపడ్డాడు. భయంవల్ల కోపం ప్రకటించలేక పోతున్నాడు అది కోపం కూడా కాదు—అదొక ఉన్మాదం—ప్రాణి మరో ప్రాణిని వెదుక్కుని, నిలబడేందుకు చేస్తున్న ఆరాటం అని కూడా అతనికి తెలియదు ఆమె కావాలి—ఆక్షణాన అతను పొందిన అనుభవం—అదొక ప్రశాంతత, ప్రకృతి గుండెల్లో జొరబడి తను నాడై కొట్టుకుంటున్నట్లు—ఇదివర కెన్నడూ ఎరగడు దానికి స్వరూపం లేదు—అది కామం కాదు, వాంఛ కాదు సృష్టి రహస్యం తనలో వుంచుకొని దానిలో ఐక్యత పొంది సజీవు డైనట్లు—ఏమో—కావాలి ఇంకా కావాలి—లేకపోతే చచ్చిపోతాడు—ఆ కౌగిలింపుతో చావడం ఎంతో అవసరంగా తోచింది. అతని వొళ్ళు తడిమంటలాగుంది ఆమె పొడినిరుగా—ఏమో—అర్థంలేని ఆలోచనలు.

"వొస్తున్నా—పైకి" అన్నాడు

అతని కంఠమే మారిపోయింది నది రొదలా వినిపించింది ఏవో అరుపులు, ధ్వనులు—భ్రమా, నిజంగానా ? మేఘాలు విడిపోతున్నాయి తొందరగా కదిలి మధ్యలో నిర్మలమైన ఆకాశం పచ్చటి గాజుపెంకులా, పధ్యం వుచ్చుగున్న చందమామ వెలుగులో మెరుస్తోంది. నీరసమైన చెట్లనీడలు నల్లగా నీళ్లల్లో పడి కొట్టుకు పోతున్నాయి. ఆ చందమామ చప్పగా ఉంది—కాని అదొక వెలుగులా, శరీరానికి వెచ్చగా తగిలినట్లనిపించింది అతనికి ఇంక దిగిపోతోంది చందమామ—వెలుగు పిలుపు వినిపించుకొని నల్ల మేఘాలు, వొంటిమీద కాల్చి వాతపెట్టినట్లు అంచులమీద వెలుగునీడ మోసుగుపోతున్నాయి పైకి చూశాడు ఆ వెలుగులో ఆమె మొహంమీద నీడలు పడుతున్నాయి అది నోరు, అది ముక్కు రంధ్రం, వొంపు కాబోలు—స్తనాలపైన సన్నటి కాంతికి, కింద వికృతంగా నీడలు సాగుతున్నాయి జుట్టు భుజాలమీద పడేసుకుంది. అది నడుం వొంపు—నునుపుతో, గుండ్రంగా మెరిసిపోతున్నాయి తొడలు—లేచి నిలబడ్డాడు— ఆమె రెండు పాదాలు తన మొహంమీదికి లాక్కుని, తల ఆమె వొడిలో దాస్తున్నాడు

ఏదో చప్పుడు. త్రుళ్లిపడ్డాడు దూలాల మోత మనిషి అరుపు—పెద్ద పెద్ద కేకలు—దూరంగా—నలుదిక్కులా పరకాయించి చూశాడు.

"ఏమిటది—అరుపు—వినబడుతోందా ?"

సమాధానం లేదు.

"విన్నే"

ఆమె మిగిలిన చీరని నడుం చుటూ బిగించుకుంటోంది ఆమెకి అతన్ని చూస్తే జాలి పుడుతోంది. పాపం—బ్రదికాడు—భలే కౌగిలించు కుంటాడు తనకి అదో లాగుంది మనిషి తాకిడి కావాలి చలి, భయం, బాధ. మొగాడి వొళ్ళు భలే ఉంటుంది—ఆ బుజాలు, కండలు— ఆ కంఠం, చేతులు, వెచ్చగా, తడిగా, వేడి రక్తం—నది వొడ్డున నల్లటి మనుషుల కండలు కదలిక జ్ఞప్తి కొస్తోంది. చెయ్యిపెట్టి తాకాలనుంది మోటగా ఉంటుంది. మోటతనం తనకి గిట్టదు—కాని అదే కావాలనుంటుంది ఎందుకో ఆయ నంటే రోత—గిట్టదు కాని ఆ శరీరం అల్లా తాకితే హాయిగా ఉంటుంది. ఆ తలలో వేళ్ళుపెట్టి, వెండ్రుకలని పీడించి, లెంప పగలెయ్యాలనుంటుంది——ఇదంతా ఏమిటో వెంకటేశ్వర్లు జ్ఞప్తికొచ్చాడు—పెద్దోడే—ఆడి వొళ్ళు ఈసారి బాగా తాకి చూడాలి ఇంతైనాక, తనకేం భయం ? ఇదంతా బ్రతికి బైట పడింతర్వాత గదా—ఈలోగా, ఈయె నెట్లా—ఏదో చేసేలాగున్నాడు—ఇదేం కర్మ—అప్పుడు, అక్కడ, ఎవరు ఎవర్ని ఏంచేస్తే ఏంగాను—ఎవరి క్కావాలి ఎవళ్ల బ్రతుకులు వాళ్లవి.

ఎవళ్లకీ తెలియదు అమ్మకి తెలియదు, వెంకటేశ్వర్లుకి తెలి . ..

"అలిమేలూ" అంటూవున్న కేక విని నిలిచిపోయింది మళ్లా మళ్లా 'అలిమేలూ' అని పిలుస్తున్నా రెవరో. అవును తనపేరే ఎటు ? ఎక్కడ నుంచి ? అటూ ఇటూ చూస్తోంది నీళ్లు కిందికి దిగిపోతున్నాయి బాగా బాగి కిందికి—మరీ వేగంతో నదివైపు పల్లంలోకి

ఎవళ్లో గంగమ్మతల్లి పీక నులిమినట్లు, ఏడుస్తూ, రోదిస్తూ, బాధనుండి తప్పించుకు పారిపోతున్నట్లు, ఏమీ చేతకాక కసితో అన్నింటినీ పాడుచేసి పోవడం మంచి దన్నట్లు, నీళ్లు అందినదాన్నల్లా తోసి, త్రవ్వి, తన్ని, తన వెన్ను మీదికి లాక్కుని ఉడాయిస్తోంది. ఆ కేక అటు నుంచి—అన్ని రుప్పలు, వుంతలు, చెట్లు చేమ, డబ్బాలు, పెట్టె, దూడ, మేక, క్రకంప, వేగంతో తను కూర్చున్న చెట్టు మొదలు చుట్టూ ప్రదక్షిణం చేసి, బలికెళ్లే మేకపిల్లలా, పీకతెగిన కోడిలా తిరిగి తిరిగి, కొట్టుకుపోతున్నాయి తన పేరు స్పష్టంగా వినబడుతోంది సందేహంలేదు

"ఎవరది ?" అని కింద నుంచి సదాశివరావు

మళ్లా పిలుపు 'అలిమేలూ' అని

'ఆ' అని బిగ్గరగా పలికింది పలికింది కాని కంఠంలోంచి మాట పైకి రాలేదు. నొక్కుకుపోయి గాలి మాత్రం బైటకొచ్చింది గొంతుకు సవరించుకుని, మరోసారి 'ఆ' అన్నది. కంఠంలో జీర—కత్తితో ధ్వనిని చీల్చి నట్లు, దుప్పటి కప్పి పీకని నులిమినట్లు—'ఆ' అంటే లాభంలేదు ఏదో అనాలి

'ఉ నేనే—ఇక్కడ' అన్నది అలిమేలు. కొన్నిధ్వనులు, బైటపడ్డాయి. ఇంక ఫరవాలేదు. అదుగో ఆ కొండవైపునుండి ఏదో ఆకారం, తమ చెట్టు వైపుకి వొస్తున్నట్లుంది మళ్లా 'అలిమేలూ' అని కేకలు.

"ఆ, ఇక్కడ—ఇక్కడే' అని బిగ్గరగా పలికింది

"నోరు మూసుకో అరవకు" అంటున్నాడు శివయ్య

మళ్లా, మళ్లా 'అలిమేలూ' అన్న కేక పెద్ద దవుతోంది ఆ ఆకారం—దేనిమీదో నిలబడి—పిలుస్తున్నట్లుంది దూలాలు కాబోలు—ఏదో పడవలా గుంది అతనే—వెంకటేశ్వర్లు పిలుపు తన వెంకటేశ్వర్లు తబ్బిబ్బుగా లేచింది—బొడ్డుకింద చీర కొంగు బిగించింది. అమ్మయ్య. వెంకటేశ్వర స్వామి బొమ్మ భద్రంగా ఉంది

"ఇక్కడ—ఇటు" కేకలేస్తోంది

అది పడవలాగుంది. ఇటొస్తున్నాడు.

"ఇక్కడ—నేనే—రా, రా, ఇటు"

అంటోంది. దిగాలి—కింది కొమ్మలోకి దిగాలి ఈ సదాశివయ్య లేచి నిలబడితే బాగుండును భుజంమీద కాలుపెట్టి దిగొచ్చు దిగాలి.

"ఇదిగో చూడు ."

అతను తనకేసి చూడ్డంలేదు. ఎట్లా ?

...చ్చు, వొచ్చె" అని అరుస్తున్నాడు వెంకటేశ్వర్లు. దగ్గర కొచ్చేశాడు.

"ఇటు, ఈ చెట్టుమీద" అన్నది అలివేలు

చెట్టు మొదల్లో దూలం పడవ తగులుకుని చప్పుడైంది. లేచి నిల బడ్డాడు వెంకటేశ్వర్లు.

నెత్తికి ఏదో తుమాలు లాంటిది కట్టుగున్నాడు. చొక్కా లేదు. పొట్టి లాగు—వాడే—

"ఇక్కడ" అంది.

చెట్టు మొదట్లో తడుముతున్నాడు—పట్టుకోసం.

"అమ్మేదీ—నువ్వు బాగుండావా ?"

"అమ్మ బాగుందిలే ...."

ఏవో ధ్వనులు చేస్తున్నాడు. మూల్గుతూ, రొప్పుతూ. పట్టు చిక్కిన ట్లుంది. పాదం ఆనించాడు, ఒక చేత్తో కొమ్మ మొదలు పట్టుగుంటు న్నాడు. ఒకచేత్తో క్రబొమ్మ గట్టిగా పట్టుగుని, రెండోదానితో కొమ్మని కౌగలించుకుని, మెల్లగా కింది కొమ్మలోకి జారింది అలివేలు. శివయ్య వెన్ను మీద పాదం ఆనింది. ఏదో పెద్ద చప్పుడైంది. అదిరి కిందికి చూసింది— ఏడి ? వెంకటేశ్వర్లు లేడు. 'దబ్బు' మని చప్పుడు—పడవేది ? అటుఇటు మంటూ దూలంపడవ కొట్టుకుపోతూంది—మనిషి లేడు—ఏడి ?

"తోసేశావా ?"

అంది, సదాశివరావుకేసి కోరగా చూస్తూ

అతని చెయ్యి ఆమె నోటమీద పడింది. రెండో చెయ్యి రొమ్ముమీద పెనవేస్తోంది. చేతిని కొరికింది 'అమ్మో' అన్నాడు సదాశివరావు తేరుకుని చూసేసరికి ఆమె లేదు. నీళ్లల్లో చప్పుడైంది. దూకేసింది. పడిపోయింది— నీళ్లల్లో కొట్టుకుపోతూంది. తన్నుకులాడుతోంది. జలజల కొట్టుకుంటూంది —'అమ్మో!' 'వెంకటేశ్వర్లూ'—'అయ్యో' అని కేకలు పెడుతోంది అదేదో రుప్పలాగుంది. అందులో ఇరుక్కుంది. తను దూకితే—? దూకగలడా ? దూకి ఏం ప్రయోజనం ? మొహం మోకాలుమధ్య దాచుకొని, అయి ష్టంగా, కళ్లు సగం తెరిచి ఆమె కొట్టుకుపోతూన్న దృశ్యం, తనెరగనట్లు, తనకి తెలీనట్లు చూస్తూ, గజగజ వొణికిపోతూ కూర్చున్నాడు సదాశివరావు.

ఇంక మరి కేకలు లేవు. అరుపులు లేవు. వెనక్కి మళ్లుతున్న నీటి రొద తప్ప అంతా ప్రశాంతంగా ఉంది.

గుండెలు కొట్టుకోడం లెక్కపెడుతూ కాలం తెలుసుకోలేకపోతున్నాడు.

నీళ్లు గబగబా జారిపోతున్నాయి వొస్తువుల, కళేబరాలు శిల్పాలల్లే బురదలో ఇరుక్కుని నిల్చిపోయ్యాయి—పల్చటి పొరలా నీరు అక్కడక్కడ పారుతోంది—పాము కూసంలా—ఆ చెట్ల మధ్య, ఈ రాళ్ల మధ్య, దూరంగా కొండ కనబడుతోంది. దానిమీద మిగిలిన తన బంగళా—నుదుటిమీద చుట్టు కాల్పు మచ్చలాగు. అక్కడక్కడ బురద మరకలు చందమామ లేడు— గాలి స్తంభించింది. ఆకాశం, పసివాడి వొంటిమీదనుంచి కప్పు తీసేసినట్లు ముడుచుకొని తన్నుకునేటందుకు వోపిగ లేనట్లు, నిశ్చలంగా ఉంది. అది కాకి రెక్క—ఇది కుక్క కాలు, అది కంప, ఇవి గుడ్డపీలికలు. నాగరికత ముసుగు లోంచి బైట పడగా మిగిలిన ప్రకృతి—తనొక్కడే సజీవుడై ఉన్నాడు.— ఉన్నాడా? కళ్లు విప్పి చూశాడు—వొంటిని గిల్లి చూసుకున్నాడు. ఊపిరాడు తోంది. ధ్వనులు వినబడుతున్నాయి. కనబడుతున్నాయి. దూరంగా ఆ కొండపక్క ఒకదీపం. మనుషుల అలజడి—అస్పష్టమైన కేకలు, ఏడ్పులు తెప్పలమీద జనం అటూ యిటూ నదినైపున వొస్తున్నారు. అక్కడ నీరు పల్చబడింది. అటు

ఎత్తు. పడవలు నిలిచిపొయ్యాయి. తను కూర్చున్న చెట్టు కింద నీరు అంత లోతు లేదు దిగి చూడొచ్చు ఆ మడ్డిలోకి, రొంపిలోకి ఎట్లా దిగడం ? తనకింకా ధైర్యం లేదు. ఆ పిల్ల ఏమైందో ? ఎక్కడో ఇరుక్కుని ఉంటుంది వాడు ? వాడేవిటి మధ్యలో—ఎందు కొచ్చినట్లు. భలే సాహసం—రక్షించాలని వచ్చినట్లున్నాడు. ఏమైంది ? కాలుజారి పడిపొయ్యాడా ? 'నువ్వు తోశేసావా ?' అన్న అలిమేలు ప్రశ్న వినబడుతోంది తనెందుకు తోస్తాడు ? తన కాలుకి వాడి చెయ్యి తగిలి పట్టు సడలి పడిపొయ్యాడా ? అంతేనా ? తొయ్యలేదు. ఏమో. తనకేం జ్ఞాపకంలేదు. అసలు ఆ పిల్ల చెప్పేవరకూ వాడు పడ్డట్టే తెలియదు

"తోశేసావా ?" అని ఆమె ప్రశ్న కంటె, ఆ ప్రశ్న అడిగినప్పుడు ఆమె కళ్లల్లో చూపు అతన్ని మరింత బాధిస్తోంది—నిజంగా తను తోసేసి నట్లు, నమ్మేటట్లు చూసింది. కోరగా, నల్లపాప ఒక మూలగా లాగి, తన బలాన్నంతా ఆ తెల్లపాప మధ్యలోకి పూరించి, నల్లటి ఆకాశం మధ్యలో విరిగిన మెరుపులా, ఆ క్షణం వొక జ్వాలగా ప్రజ్వరిల్లి దహించినట్లు—అబ్బ !—ఆ అబలకి, అమాయకపు పనిపిల్లకి,—అంతటి శక్తి, బలం ఉండడం తను తట్టుకోలేకపోతున్నాడు శరీరానికి, తెలివికి ఏం సంబంధం ఉన్నట్లు ? ఆ చూపులో ఆమె నిజస్వరూపాన్ని దర్శించినట్లు సిగ్గుతో తల వొంచుకున్నాడు కొన్ని కోట్ల కన్యలు అతనికేసి వేలు చూపి, వొక్కసారి కసరి చూసి, పురుషజాతికి ఆ క్షణాన ఏకైక ప్రతినిధిగా ఉన్న తనని, నేరస్థుడిగా తీర్పుచేసి, శిక్ష విధించి అంతర్థానమైన అశరీర శక్తిలా—అత నది మరచిపోలేడు. కళ్ళు గట్టిగా మూసుగున్నాడు సదాశివరావు.

వెన్ను విరుచుకుని లేవడానికి సిద్ధంగా ఉన్న సూర్యుడి పయనం తెలుపుతూ, బాకాలతో పాటింపుకి బైలుదేరినట్లు కిరణాల కొనలు ఆకాశాన్ని తాకి, మైల పడుతున్నట్లు, వెలవెల బోయి, నీరసించి, క్షీణించి మంచాన పడిన ప్రకృతిని బలాత్కారంగా లేపి కూచోబెడుతున్నట్లు—అలిమేలు ఆఖరిచూపు, అతన్ని తనలోకి నెట్టి, మరిలేవక అణగార మన్నట్లు స్తబ్ధుగా కూర్చుండిపొయ్యా డతను—ఆ తీక్షణమైన చూపులో. ఆమె రొమ్ములపోటు, బుజాల వొత్తిడి, పొత్తి కడుపులో—మృదువైన బింకం, ఆ తొడల తొక్కిడిలో మెత్తదనం—అతన్ని ఆ చూపులోంచి పరకాయించి చూసి, తనలో తనని బంధించి, ఆ చీకటి కూపంలోంచి, కోటి సూర్యుల కిరణాల ఫహరాగానం లేవనెత్త లేవేమో

ప్రపంచంలో మనుషులు రెండే తెగలు—చంపేవారు, చంపలేనివారు. తాను రెండో తెగవాడు. కాని, కాని అలిమేలు ఫిర్యాదు ? ఇంతకీ ఎవరూ చావందే తన కెందుకా భయం ? వాడు—వా డెవడో వొచ్చాడు—ఆమెని తీసుకెడదామని—ఏమవును ? చస్తే మాట. ఇద్దరు చద్దురు. ఆ అవాంతరం తను తప్పించాడా ? చోటుకోసం తన్నుకులాడుకుని, ముగ్గురూ నీళ్లల్లో పడి చస్తే, ఎవరు ఎవర్ని చంపినట్లు !

కళ్ళు మూతలు పడవు—కాని చూపు ఆనదు. ఇంక ఆలోచన లేదు. నత్తగుల్లలో పురుగులా మనస్సు మడతలు పడి, వొంటి అవయవాల మధ్య ముడుచుకుంది. ఎక్కడో మరో లోకంలో ధ్వనులు—మరో యుగంలో దృశ్యాలు—మనిషి రాకపూర్వం భూమిపై తిరుగాడిన ప్రాచీన జంతుజాలంక ళేబరాలు, కొండ రాళ్ళ మధ్య ఇరుక్కుని, కోటి సంవత్సరాలకి కొండ పగిలిమధ్య జాడ మిగిల్చినట్లు—ఏవేవో కనబడతాయి—దూరంగా దీపాలు—మనుషుల గుంపులు—బృందాల ఏడ్పులు—స్మశానంలో మంటలు—వస్తువులు, మట్టినీరు, తడిమంటలో తెల్లగా మెరిసిన ఎముకలు ఆర్పుతూ పాడిసీళ్ళపడుతున్నాయి ఆకాశంలోంచి.

పక్షుల అరుపు కాదు—మనుషులు—

"దిగండి."

తల పైకెత్తి చూశాడు మిగిలిన కంటితో. మనుషులు. మనుషులు—తనకోసం—డ్రైవరు—తనెరుగున్న పోలీసు—నౌకర్లు—ఇంకా ఎవరో—పంచులు, కర్రలు, తాళ్ళు. "దిగండి..." దింపుతున్నారు—దేనిమీదో పడుకోబెట్టారు. ఎటో తొక్కుపోతున్నారు. వెలుగు వెంటాడి, పెరిగి మూలల్లో విరిగిపోతోంది. కింద నీరు, బురద, ఆకులు, చెమ్మ—బంక—వడ్డి—పెట్టె, కుక్కతోక, మేక కాలు, గంపకింద కోళ్ళ—అది సూర్య కిరణం, కంటి రెప్ప కింద—రెప్పకింద తారట్లాడు తున్నది—ఆమె కంటిలో చివరి చూపు. —వేళ్లతో రెప్పని పైకి నెట్టి, క్షణం చూశాడు—అదిగో ఒక గుంపు—మధ్యలో ఎవరివో కాళ్ళ—ఎవరివో చేతులు—మట్టూ మనుషులు—

"చచ్చింది పాపం—"

ఎవరో అంటున్నారు. ఎవరో.

చేతులో కర్రబొమ్మ—

వెంకటేశ్వరస్వామి కర్రబొమ్మ—చేతిలో

ఉండిపోయింది. ఎవరో అంటున్నారు.

'అదే—అలిమేలు.'

'ఆడికేం—అడుగో ఆ సైకిల్ కొట్టువాడు—వెంకన్న' 'అమ్మ కొంపలో లేదుగా సంత కెళ్లింది' 'దానికేం' 'ఇది' 'ఒకర్తె' 'పాపం—చచ్చింది.'

మరి .... ఈనకేం—ఆమె ముందుగావే .... "సువర్ణమ్మగారు పదిలంగావే ఉన్నారు. ఇంటికి వొచ్చేశారు.

లేచి కూర్చున్నాడు సదాశివరావు. గుంపు దూరమై పోయింది. ఆ విక్కరేసుకున్నవాడేనా వెంకటేశ్వర్లు ! బాగావే ఉన్నాడే.

సముద్రంపై ఒక ఆవిరి తెర ఆకాశంలోకి లేచినట్లు, అతని మనస్సులో ఒక భాగం ఎక్కడికో లేచిపోయింది. ఊపిరి సాఫీగా రావడం లేదు—కాలిపోతున్న ఎడారి ఇసుకలో, ఎక్కడ పడినా కరిగిపోతానని భయపడి కిందికి పడని మంచుకణంలాగు, గుండె తటపటాయిస్తోంది.

ఆకలేస్తోంది కర్మ. ఇంటికి వొచ్చేశారు—

పీటి మేడ, తడి మంటలో కాలిపోతోంది—

చర్మం పీకిం తర్వాత ఎర్రటి మటూచి మచ్చ—కిరణాల తాకిడితో కొన వూపిరితో నిలబడిన తవిల్లు—ఏకాంత మహా సంగ్రామంలో చావగా మిగిలిన తను—కంటి నీరు పొడిగా కారుతోంది పొడి పీటితో ఆతడి మంటని చల్లార్చగలడా ?—చల్లార్చగలగడం వింతలలో వింత.

అశ్వఘోషుని చరిత్ర

శ్రీ కొడాలి లక్ష్మీనారాయణ

భారతవర్షము చరిత్రకు దెలిసిన కాలమునుండి మత, వేదాంత భావపూరితదేశమై విలసిల్లినది ఇది గ్రీసు, ఇంగ్లాండులవలె చారిత్రక భావసంపదలో (Historically Conscious) విలసిల్లిన దేశము కాదు మహాయాన మతప్రచారకుడగు అశ్వఘోషుని వంటి మహాత్ముని చరిత్ర మనకు నామమాత్రముగా మాత్రమే లభ్యమగుట విచారకరము దేవ, కుమారలబ్ధ, అశ్వఘోష, నాగార్జునులు ప్రపంచములోని నాల్గు జ్యోతులని 'హౌనుత్సాంగు' వ్రాసెను కుమారలబ్ధకుని బదులు 'వసుబంధుని' పేరు 'తారానాధు' డుదాహరించెను మహాయానశాఖను ప్రబోధించిన ఆరు గురు గురువులలో నశ్వఘోషుడు, నాగార్జునుడు, ఆర్యదేవుడు మున్నగువారి పేర్లున్నవి. నాగార్జునుని గురువు అశ్వఘోషుడని కొందరు వ్రాసిరి అతి ముఖ్యమైన ప్రజ్ఞాపారమితసూత్రములపైన నాగార్జునుడు 'మహా ప్రజ్ఞా పారమిత శాస్త్రము' అను వ్యాఖ్య వ్రాసెనని ఇందులో 'శూన్యత' గలదని, దీనికి ఆరంభకుడు అశ్వఘోషుడని, తర్వాత నాగార్జునుడని, ఐరోపీయ విద్వాంసులు వ్రాసిరి 'వాటర్సు' అను విద్వాంసుడు 'ఈ గొప్ప బౌద్ధుడు,పార్శ్వ శిష్యుడని, క్రీస్తుశకము రెండవశతాబ్దములో నివసించె నని, కవి, సంగీత పాఠకుడు, విద్వాంసుడు, తీవ్రమైన బౌద్ధ భిక్షువు, మతములో ప్రాచీన శాఖకు జెందినవాడు క్రమశిక్షణను జక్కగా భావించినవాడు' అని ప్రశంసించెను [1] ఇంకను ఈయన, 'అశ్వఘోషుడు 'పార్శ్వ' అనువాని శిష్యుడని, కనిష్కసభలో నీయన ప్రముఖ పాత్ర వహించెనని' వ్రాసెను నాగార్జున రచిత గ్రంధములలో గూడ 'కనిష్క, [2] కిలిక, అశ్వఘోషుల పేర్లున్నవి. ఆధునిక విద్వాంసుడైన 'ఘోషు' కూడ 'ఈయన కవి, గాన విశారదుడు, నైతిక విద్యావంతుడు, తత్వవేత్త, నాటకకర్త, కథాకారుడు— ఈ కళలన్నీ కనిపెట్టినవాడు, అన్నిటిని మించినవాడు, 'మిల్టను, గేటి, కాంట్, వాల్టయిరుల స్మృతిపథమునకు దెచ్చువాడు' అని పలువిధముల మతించెను 'జాన్‌సన్' అను విద్వాంసుడు అధికమైన వక్తృత్వము [3] గల లేక ఆశుధారగల కవియని, యోగియని, అధ్యాపకుడని' ప్రశంసించెను ఇట్టి మహనీయుని చరిత్ర నాగార్జున, దేవులయొక్క [4] చరిత్రలతోబాటు చైనీయభాషలో లభ్యమగుచున్నవి వీని ఆంగ్లానువాదము లందందు కొలది మాత్రమే లభ్యమగుచున్నవి ఐరోపీయవిద్వాంసులు పలు శ్రమలు చేసి, 'మంగోలియా, చైనా, టిబెట్టు'లలో లభ్యమైన బౌద్ధ వాఙ్మయమును బరిశోధించి నిరంతర కృషి సల్పి, ఈయన జీవితమును గూర్చి కొన్ని చారిత్రక సత్యముల బ్రసాదించిరి అశ్వఘోషరచిత గ్రంధములనుబట్టి, కనిష్కుని శాసనములను బట్టి కొన్ని చారిత్రక సత్యములు బయల్పడినవి ఒక చారిత్రక సత్యము ఒక జాతి సంపద యని (National asset) అది విశ్వసత్యమని గుర్తెరుంగుడు ఈ చారిత్రక సత్యముల బ్రసాదించు విద్వాంసులు, జాతికి, జగతికి, ఎంత ఉపయోగకారులో తెలుసుకోవలయును కుమారజీవరచితమైన అశ్వఘోష, నాగార్జున, ఆర్యదేవుల చరిత్రలు, చైనీయ భాషలోనికి క్రీ. శ. 387—418 మధ్య మార్చబడెను వీనిని ఆంధ్రభాషలోనికి మార్పించి, తెలుగు పత్రికాధిపతులు ప్రచురించెదరని నమ్ముచున్నాను సాహిత్యసేవ చేయు 'భారతి' పత్రికాధిపతి ఈ కార్యము నకు బూనుకొన్న మేలు చేసినవా రగుదురు.

అశ్వఘోషులెందఱు?

కనిష్కుని ఆస్థానవిద్వాంసుడైన 'అశ్వఘోషుని' తలిదండ్రులు, విద్యాభ్యాసము, గురువులు జన్మస్థలము, స్థిరనివాసము, అంత్యకాలము, శిష్యులు—వీనిని గూర్చి సమగ్రముగా దెలియకున్నది. నిస్వార్థపరులైన ఇమ్మహనీయులు తమ ఆత్మచరిత్రనైన వ్రాసికొనరైరి. చరిత్రలను వ్రాయ గల్గిన యిమ్మహనీయులు ఐహికవాసనల వదలి పరమునందే దృష్టి బరపి నట్లు కాన్పించుచున్నది సమకాలీనుడైన నాగార్జును డిట్లు ప్రశ్నించు చున్నాడు "కళలు, చేతివృత్తులను బోధించుశాస్త్రము జీవనోపాధి కుపయోగించు శాస్త్రమై యున్నది కాని ప్రపంచము నుండి విముక్తిని బొందు మార్గమును బోధించు శాస్త్రము, నిజమైన శాస్త్రము కాదా ?" [5] 'సుజకి' అను విద్వాంసుడు 'మహాయాన శ్రద్ధోత్పాద'రి యను గ్రంధ మును బట్టి భిన్నకాలములలోని ఆరుగురు అశ్వఘోషులను బేర్కొనెను. "బుద్ధుడు చనిపోవుముందు ఒక అశ్వఘోషునిలో మాటాడెను. బుద్ధుడు చనిపోయిన 300 ఏండ్లు తర్వాత ఒక అశ్వఘోషుడు జన్మించును బుద్ధ నిర్యాణానంతరము 600 ఏండ్లకు, అశ్వఘోషుడు 96 శాఖలు గల బౌద్ధ మును బోధించును బుద్ధ నిర్యాణము తర్వాత 100 ఏండ్లకు అశ్వఘోషు డను మహాసత్వుడు వచ్చి, ధర్మ సంస్థాపన చేసి, బౌద్ధ ధ్వజమును బ్రతిష్ట చేయును బుద్ధుని తర్వాత 800 ఏండ్లకు ఒక అశ్వఘోషుడు గల్గి ధర్మ మేర్పరచును తీర్థకుడు కాలనక్షత్రకుడనువాడు, బుద్ధుని 86000 ప్రశ్నల నడుగును ఈయనను 'తథాగతుడు', 'ఓ అశ్వఘోష శ్రమణా'యని నంబోధించెను. ఈవిధముగా నారుగురు అశ్వఘోషులు కాన్పించుచున్నారు" [6] అని సుజకి వ్రాతల సారాంశము.

---

1. Watters—Hiuen Tsiang's travels Vol. 1- p 104 "This great Buddhist, who apparently lived in the second century of our era, was a poet, musician scholar, religious controversialist and zealous Buddhist monk, orthodox in creed, and a strict observer of discipline."

2. Ibid-p 209— "Aswaghosha was a pupil of Parswa, who took a leading part in Kanishka's council "

3. K. N. Ghosh — Early History of India p. 209 — "He was a poet, musician, preacher, moralist philosopher, playright, tale-teller; he was an inventor of all these arts and excelled in all, In his richness and variety, he recalls Milton, Goethe, Kant and Vol taire."

4 E. H. Johnson— "Great eloquent poet, the mendicant, and teacher "

5. Nagarjuna's Pragna Danda-M S. Folio 15. "The science which teacheth arts and handicrafts
Is merely science for the gaining of a living
But the science which teacheth
Deliverance from worldly existence
Is not that the true science?"

6' Suzuki — Awakening of Faith.

మన అశ్వఘోషుడు క్రీ శ 125—152 కాలము వరకు బాలించిన కనిష్క మహారాజు ఆస్థానకవి కనుక తథాగతునికి దాదాపు 800 ఏండ్ల తర్వాతివాడు. ఈయనయే ఆరవ అశ్వఘోషుడు

జన్మస్థలము–తలిదండ్రులు–గురువు

ఈయన జన్మస్థలమును గూర్చి సరిగా తెలియదు ఈయన తర్వాత 1300 ఏండ్లకున్న 'తారానాథుడు' అశ్వఘోషుని జననము కాశ్మీర మనెను కాని తూర్పు హిందూదేశములోని 'సాకేత పురము' ఈయన జన్మభూమి యని చెప్పవచ్చును ఈయన వ్రాసిన తొమ్మిది అంకముల నాటకము 'సారిపుత్ర ప్రకరణము' (శారద్వతీ పుత్ర ప్రకరణము) "సారిపుత్ర, మౌద్గల్యాయనులను శిష్యులను తథాగతుడు బౌద్ధమతములో నెట్లు జేర్చినది యిందు వర్ణించబడినది ఈ వ్రాతప్రతి 'మధ్య టర్కీ స్థానములోని 'టర్ఫాను' (Turfan) లో మరి రెండు వ్రాతప్రతులతో బాటు సమగ్రముగా లభ్యమైనది ఇది భూర్జ పత్రములపైన వ్రాయబడినది ఆచార్యవర్యుడు 'లూడర్సు' (Professor Luders) కృషివలన ఈ మూడు నాటకములు బయల్పడినవి పై నాటకముయొక్క అంతిమపత్రము సురక్షితముగా నున్నది ప్రాచీన నాటకము బౌద్ధులదే యని బయల్పడినది 'సువర్ణాక్షి పుత్రుడు' 'అశ్వఘోషుడు' అని యిందుల్లేఖించబడుటచేత, ఈయన తండ్రిపేరు "సువర్ణాక్షి' యని తెలిసికోవచ్చును తల్లిపేరు ఏ గ్రంథములోను లేదు పారమార్థికచింత గల 7 యిమ్మహనీయునకు జననీ జనకులతోను, గురువులతోను నిమిత్తములేదు కాబోలు ఈయన గురువుపేరు 'పార్శ్వ' యని ఈయన కూడ కనిష్కుని మహా సంగములో ప్రముఖ పాత్ర వహించెనని తెలియుచున్నది 9 వ వాడు పార్శ్వ, 10 పుణ్య యశస్సు, 11 అశ్వఘోషుడని బౌద్ధ గురువుల జాపితా తెల్పుచున్నది కొందరు 'పుణ్యయశస్సు' గురువని వ్రాసిరి ఆర్యదేవుడు అను నాగార్జునుని శిష్యుడు మంత్ర శాస్త్ర సంబంధమగు కళానైపుణ్యమున అశ్వఘోషుని ఓడించెనని 'తారానాథుడు' వ్రాయుచున్నాడు సత్యమైనచో ఇది పాటలీపుత్ర రాజు ఆస్థానములో జరిగియుండవలెను మహాయాన బౌద్ధులైన వీ రిరువురి కేల వాదన జరిగెనో తెలియకున్నది దీనిని ధ్రువపరచుట కితర చారిత్రకాధారములు లభ్యము కాలేదు ఆర్యదేవుడు బ్రాహ్మణమత బద్ధవిరోధి యని, భిన్న మతావలంబకులకు వ్యతిరేకి యని విద్వాంసులు వ్రాయుచున్నారు కొన్ని గ్రంథములలో 'అశ్వఘోషుని శిష్యుడు నాగార్జునుడు8' అని కలదు కాని ఆయన ప్రభావ మితనిపైన ప్రసరించినట్లు కాన్పించుచున్నది కాని మాటిగా శిష్యుడు కాడు పార్శ్వకు అశ్వఘోషునికి గల సంబంధము మాత్రము కొన్ని 9 చోట్ల కాన్పించుచున్నది అశ్వఘోషుని, గురువగు పార్శ్వ యిట్లు ప్రశ్నించెను "విశ్వములో శాంతి గల్గుటకు, దీర్ఘాయుర్దాయము గల్గుటకు, విస్తారముగా లభ్య మగుటకు, మానవులకు దుఃఖనివారణ గల్గుటకు నేమి కోరవలెను ?"

పాటలీపుత్రరాజు ఆస్థాన విద్వాంసుడు

అజాతశత్రునిచే నిర్మించబడిన 'కుసుమ పురము' తర్వాత కాలములో పాటలీపుత్ర మైనది క్రీ శ 130 ప్రాంతములోని పాటలీపుత్ర ప్రభువు ఒక బౌద్ధుడు ఈయన అశ్వఘోషుని ఆదరించి, అభిమానించి ఆయన వాగమృతధారల గ్రోలుచు, బౌద్ధ ధర్మ శ్రవణాసక్తుడై నిరంతరము కాలక్షేపము చేయుచు, ఆస్థానమున రత్నమువలె నున్న అశ్వఘోషుని మర్యాద చేయుచు ప్రకాశించు చుండెను సర్వ శాస్త్రముల కూలంకషముగా జదివి సకల శాస్త్రపారంగతుడని పేర్గాంచిన, ఈయన ప్రతిభా సంపత్తిని గూర్చి, ఈయన ధీశక్తిని గూర్చి, కుషాను రాజగు 'కనిష్కుడు' కర్ణాకర్ణిగా విని యుండెను బౌద్ధ ధర్మాభిమాని, రెండవ అశోకుడని పేర్గాంచిన ఆ నృపతి అశ్వఘోషుని ఆహ్వానించుచు, స్నేహపూర్వకముగా నొక జాబు వ్రాసెను అప్పటికే జరాభారముచేత కృశించిన 'అశ్వఘోషుడు' ఈ యాహ్వానము నంగీకరించజాలక తన శిష్యుడైన జ్ఞానయశుడను వానిని తనకు బదులుగా బంపెను. కాని కనిష్కుడు దీనికి తృప్తి జెందినట్లు కాన్పించలేదు 10 ఈ విషయముపైననే కాబోలు కనిష్కునికి పాటలీపుత్ర రాజుకు సంకుల సమరము జరిగెను ఈ యుద్ధములో పాటలీపుత్ర రాజు పరాజితు డాయెను. యుద్ధ పరిహారముగా, కనిష్కునికి పాటలీపుత్ర రాజు అశ్వఘోషుని సమర్పించెనని, ఆయన సంతుష్టాంతరంగుడై గెల్చిన రాజ్యమును వదలివేసి, స్వదేశమున కేగి, అశ్వఘోషుని నిండు ప్రేమతోను, గౌరవ మర్యాదలతోను జూచు చుండెనని, అశ్వఘోషుడు కాశ్మీరములోని తన నూత్న నివాసములో దన పరిశోధనల సాగించుచుండెనని, తారానాథుడు, వాటర్సు మున్నగు వారి వ్రాతలు తెల్పుచున్నవి 11 ఇత్సింగు అను చైనీయ లేఖకుడు కూడ, ఉత్తర హిందూస్థానములోని బౌద్ధమత శాఖా స్థాపకులలో నీయన అందరికంటె ముందరి ప్రధాన గురువని, ఈయన 12 వ గురువని, నాగార్జున, కణ్వదేవులు 14, 15 వ వారని వ్రాసెను

'బీల్'12 (Beal) అను విద్వాంసుడు, 'కండన కనిష్క' యను 'తుఖార రాజు' లేక గాంధార రాజు' ముగ్గురు విజ్ఞానవేత్తలతో నెయ్యమొనర్చెనని, వారు వరుసగా 1 'బోధిసత్వ అశ్వఘోష' యని 2 మంత్రి మోచలో (మాతర) యని, 3 వైద్యుడు 'చే—లో—చి—యో' (చరక) యని (Jurka his chief physician) వ్రాసియున్నాడు ఈ విషయము Fu–Fat – Sang – Yin – Yuan – Chuan – అను గ్రంథమును బట్టి కూడ తెలియును కనిష్కుని సైన్యములు పాటలీపుత్రము వైపుకు బోయెను కనిష్కుడు ధైర్యసాహసోపేతుడు ఆయన 90 కోట్ల బంగారు నాణెముల గోరెను పాటలీపుత్ర ప్రభువు అశ్వఘోషుని, బుద్ధుని భిక్షాపాత్రను, ఒక సుందరమైన కోడిని, 90 కోట్ల బంగారు నాణెములతో సమర్పించుకొనెను వీనిని గైకొని 'కనిష్కుడు' అమందానందమున స్వదేశమున కేగెను ఈ కథ 'కుమార జీవుని' అశ్వఘోష చరిత్రలోను గలదని వ్రాయుచు సంయుక్త రత్న పిటకములో 93, 94 కథలలో గూడ కలదని 'బీల్' వ్రాసెను పాటలీపుత్ర రాజు నుండి కనిష్కుడు, అశ్వఘోషుని కాన్కగా13 నంగీకరించెనని పలువురు విద్వాంసులు వ్రాసిరి

---

7 వేదవ్యాస్—సంస్కృత సాహిత్యకా ఇతిహాస్ (హిందీ) పుట 96 Also see Maedonall–India's past p 102 "Manuscript Manuscripts of this drama have been found at Turfan in Central Asia "

8 E. J Eitel–A handbook of Chinese Buddhism p 42 "Aryadeva a famous antagonist of Brahmanism and a great opponent of heretics "

9 Suzuki–Awaking of Faith p 43 'It is very doubtful when Nagarjuna as told in a Chinese tradition, was a personal disciple of Aswagosha–Probably he was influenced by him."

10 V A Smith—Early History of India–p 243,

11 Ibib–" That the saint was given to Kanita (Kaniska perhaps) king of the yueti, as part of the wer indemnity This king treated the Bhikshu with much kindness and esteem and Aswaghosba continued his labours in his new place of abode in Kashmir ''

12 Takakusu—A record of the Buddhist Religion (Its ng) p 181 "As a patriarch of the Northern Buddhism, however Aswagosha has an earlier place than the rest, he is the 12th pitriarch while Nagarjuna and Deva 14 th and 15 th respectively "

13. S. Beal–Indian antsquery-IX p. 353,

మహాయాన మత ప్రచారకులైన దార్శనికుల పేర్ల14లో అశ్వఘోషుని తర్వాత, నాగార్జున, ఆర్యదేవ, వసుబంధుల పేర్లు ప్రఖ్యాతి గాంచి యున్నవి భారతీయ బౌద్ధమత సంక్షిప్త గ్రంథములో (Manual of Indian Buddhism) 'కెరన్' (Kern) వీరిని విశేషముగా ప్రశంసించెను.

కనిష్కుడు బౌద్ధధర్మ దీక్షగైకొనుట

కనిష్కుడు ప్రథమములో హిందువుగా నుండెనని, తర్వాత బౌద్ధు డాయెనని ఈ విషయము అతని జీవితములోని చివరభాగములో జరిగెనని, నాణెములపై నున్న సూర్యచంద్ర శాక్యముని ముద్రల బట్టి విదిత మగు చున్నదని విద్వాంసులు వ్రాసినారు శాక్యముని పేరు గ్రీకు అక్షరములలో నుండుటచేత భారతీయ వాఙ్మయములో గ్రీకు భాషా ప్రభావము కాన్పించు చున్నది. ఒకమారు పార్థియను రాజు కనిష్కు నెదుర్కొనెను కాని దీర్ఘ కాలము పోరాటము, రక్తపాతము జరిగిన తర్వాత, అశ్వఘోషు డీయనకు బౌద్ధధర్మ ప్రబోధము చేసెను ఈ విధముగా కనిష్కుడు బౌద్ధు డాయెను. మరియొక ప్రమాణమును15 బట్టి పార్శ్వ లేక పార్శ్వక అను బౌద్ధుని వలన కనిష్కుడు బౌద్ధు డాయెనని, నిత్యము బౌద్ధధర్మ బోధల నాయన వద్ద వినుచుండెనని బౌద్ధ ధర్మములు పరస్పర విరుద్ధములుగా నుండెనని, వీని నన్నిటిని సరిచేసి సంహితల వలె కూర్చుటకు, సభ నేర్పాటు చేసిరని, సభానంతరము, సభవారు తేర్చిన అంశములను వ్యాఖ్యలలో గీర్వాణ భాషలో సాహిత్య నైపుణ్యముతో వ్రాయుటకు, శ్రావస్తిలోని సాకేత పురము నుండి అశ్వఘోష డాహ్వానించ బడెనని 'టూకాకుసు' అను విద్వాంసుడు వ్రాయుచున్నాడు 'పార్శ్వ' వలన బౌద్ధ ధర్మ బోధలను గ్రోలి, బౌద్ధ గ్రంథములలోని 16 విభిన్న శాఖలను క్రోడీకరించి పరిశుద్ధ ప్రతిని తయారు చేయుటకు ఆ కాలములో బేర్గాంచిన అశ్వఘోషుని సాయమును గోరియుండుట ఖాయము

బౌద్ధులసభకు అశ్వఘోషుడు ఉపాధ్యక్షుడు

కనిష్కుడు బౌద్ధమతములోని విభిన్న శాఖల బరిశీలించి, క్రోడీక రించుట కొక సభ లేక 'మహా సంగము' నేర్పాటు చేసెను ఈ సభకు 500 మంది బౌద్ధ విద్వాంసులు హాజరైరి ఈ సభాధ్యక్షుడు 'వసుమిత్రుడు', ఉపాధ్యకు డు 'అశ్వఘోషుడు' హీనాయాన మతమునకు జెందిన 'సర్వాస్తివాదులు' ఈ సభకు హాజరైరి 'పార్శ్వ లేక పార్శ్వక' యొక్క సలహా మీదనే ఈ 'సంగము' జరుగుచుండెను. వైద్యశాస్త్ర పారంగతుడు చరకుడు కూడ ఈ కాలపువాడే

సభాస్థలమును గూర్చి మొదట వాదవివాదములు చెలరేగెను ఈ సభ 'కాశ్మీరము' లోని జలంధరులో జరిగెనని 'శాస్త్ర చింగోల కెరిగ్లిచి',

14 Sreenevasachary-History of Inadia-"According to a Chinese work, he accepted Aswagosba as a gift from the defeated king of Pataliputra"

15 K. Sreenivasachary — Ancient History of India — 'Later on, the Parthian King attacked Kanishka but was defeated after a bloody struggle and then Aswagosha expounded the Bouddha Dharma to him"

N N. Ghosh—Aswargosha, who evidently impressed him with his character and scholarship"

16 V A. Smith-Early History of India--p 250. "According to him, Aswaghosha was invited from Saketa in the Sravasti province for the purpose of applying his well known literary skill to the redaction of the commentaries. drafted by the council. (Takakusu—J. R. A S, 1905,)

'పనంగ పత్సేన' అను గ్రంథమును బట్టి 'గట్చీన్ కునశన' యనుచోట జరిగెనని తెలియుచున్నది తారానాధుని వ్రాతల ప్రకారము, ఈ సభ కాశ్మీరులోని 17 కుందలవనవిహారములో జరిగెనని తెలియుచున్నది కొందఱు జలంధరులోని 'కువన సంఘారామము' లో జరిగెనని వ్రాసిరి హుయాన్‌సాంగు, జలంధరును దర్శించెను కాని, ఈ విషయమును బేర్కొనలేదు. మంగోలియా, చైనా, టిబెట్టు గ్రంథము లీ సభా వృత్తాంత మును బేర్కొనెను. కాని సింహళద్వీపచరిత్రలు వీనిని బేర్కొనలేదు

టిబెట్టులోని 'కాగ్యర్' అను గ్రంథము బుద్ధని బోధనలను గూర్చుట కేర్పడిన 'మూడవ సంగము' అని పేర్కొనెను 'టాంగ యూరు' అను గ్రంథము వత్సిపుత్రుని ప్రోత్సాహమున నీ సభ బౌద్ధ ధర్మ ముల క్రోడీకరించుట కేర్పడిన దనెను. చైనీయ భాషలోని 'కంరహార్' కూడ దీనిని పేర్కొన్నది ఈ సభలో, బౌద్ధ మతములోని 17 శాఖలలో గల భేదాభిప్రాయములను పరిష్కరించి, వానిని పూర్వాచార సాంప్రదాయము లని చెప్పి, త్రిపిటకములను పరిశుద్ధము చేసి, వ్యాఖ్యలతో రాగిరేకులపైన వ్రాసి, కనిష్కుని ఆజ్ఞ ప్రకారము ఒక స్థూపములో నుంచిరి భారతీయ రాజ్యాంగముపైన సంతకము లున్నట్లు, ఈ రేకులపైన అశ్వఘోషాది విద్వాంసుల సంతకము లుండవచ్చును. మన జాతీయ సంపదయైన ఈ రాగి రేకులు, శ్రీనగరు ప్రాంతములో నెచటనైన వెదకినచో లభ్యము కావచ్చునని ఆశ గల్గుచున్నది. అట్టి ఆశ 'స్మిత్' అను విద్వాంసునికి కూడ గల్గెను 18

ఈ 'మహాసంగము' లో వృద్ధుడైన 'అశ్వఘోషుడు' పాల్గొని వ్యాఖ్యల నన్నిటిని విభాగముచేసి ఆయా శాఖల క్రింద విభజించి, సభవారి ఆజ్ఞ ప్రకారము బుద్ధని బోధల నన్నిటిని లిఖితరూపములోనికి గైకొని వచ్చెను.19 'వసుమిత్రు' డను మరియొక విద్వాంసుడు బౌద్ధ తత్వశాస్త్ర మునకు విజ్ఞాన సర్వస్వము అని పేర్గాంచిన, 'మహావిభాష'ను రచించెను ఇది నేటికిని 'చైనా దేశములో' నున్నది క్రీ పూ 2 లో ఒక 'యూచి రాజు' అనేక బౌద్ధ గ్రంథములను ఒక చైనీయ ఉద్యోగి కొసంగెను '(శ్రావస్తవాది' శాఖకు జెందిన మూలగ్రంథమగు 'జ్ఞాన ప్రస్థాన మాత్రము' మీద వ్యాఖ్యయే వసుమిత్ర గ్రంథము అగు 'మహా విభాష మాత్రము' అని విద్వాంసులు వ్రాసిరి. అశ్వఘోషుడు సంస్కృతము లోనే వ్యాఖ్యలను రచించెను

మహాసంగము జరిగిన తర్వాత, త్రిపిటకములకు వ్యాఖ్యలతో సహా రాగిరేకులపైన వ్రాయించి ఒక స్థూపములో బెట్టించి, అశోకు డిచ్చి నట్లు కాశ్మీరును దిరిగి బౌద్ధ సంఘమున కొసంగి, కనిష్కుడు బార మూల కనుమగుండ స్వదేశమున కేగినట్లు 'స్మిత్' వ్రాయుచున్నారు 20

'లెవి' వ్రాత ప్రకారము, బౌద్ధ ధర్మ పోషకుడైన 'కనిష్కుని మర ణము 'మాతర' యను మంత్రి కుట్రవలన జరిగినట్లు తెలియుచున్నది. 'శ్రీ ధర్మపిటక' మను గ్రంథమును బట్టి, కనిష్కునికి జబ్బు చేసినప్పుడు పైనికు లాయనను మంత్రి దుర్బోధలలో, నొక దూది బొంతలో బెట్టిరని, దానిపైన ఒక వ్యక్తి పైభాగమున నిల్చుండెనని, రాజు ఊపిరాడక వెంటనే చనిపోయెనని తెలియుచున్నది

అశ్వఘోష రచితగ్రంథములు

అశ్వఘోషుడు రచించిన గ్రంథములు (1) కావ్యములు, (2) చరిత్రలు, (3) సాంఘికములు, (4) తత్వశాస్త్రములు, (5) రూపకములు—మున్నగు వివిధ శీర్షికల క్రిందికి వచ్చును కనిష్కుని కాలమునాటికి (క్రీ శ 125—52) 'బుద్ధ చరిత్ర' కు సంబంధించినవి 'మహావస్తు', 'లలిత విస్తర' అను గ్రంథములు గలవు 'అశ్వఘోషుడు' గీర్వాణభాషలో బుద్ధ చరిత్రను మహాకావ్యముగా రచించెను ఇందలి ఉత్కృష్టశైలిని, చక్కని వర్ణనలను పండితులు శ్లాఘించినారు. తిరుపతి వేంకటకవులు దీని ననుస రించియే బుద్ధచరిత్ర వ్రాసిరి క్రీ శ 414—421 మధ్య కాల ములో దీనిని చైనీయ భాషలోనికి మార్చిరి దీనిని 'మూలరామా యణము' తో పోల్చుచుందురు రామాయణమును నమూనాగా గైకొని ఇది వ్రాయబడెనని 'వింటర్ నిడ్జి' అను విద్వాంసుడు వ్రాసెను. 21 దురదృష్ట శావత్తు నేడు కొందరు పండితులు వర్తమాన రామాయణ మంతయూ జదివి అది అంత సత్యమైన చరిత్రగా వాల్మీకి రచితముగా భావించి దాని నుండి మన సంస్కృతిని రాబట్టుచున్నారు వర్తమాన రామాయణమునుండి ప్రక్షిప్త భాగములు విడగొట్టి వాల్మీకి రచయిత 'మూల రామాయణమును' గూర్చినచో నది చరిత్ర, కావ్యము గూడ నగును బుద్ధచరిత్రవలె నది ప్రామా ణిక గ్రంథమగును. లేనిచో చారిత్రక ప్రామాణము కాజాలదు బుద్ధచరి త్రకు గొప్ప ప్రఖ్యాతి గలదు దీనిని 'రఘువంశము' తోగూడ పోల్చెదరు.

(2) సౌందరానందము :—ఇక్ష్వాకు కుమారులు కపిల గౌతముని వద్దకు వచ్చిరని, శాకవృక్షముల క్రింద నివాసము లేర్పరచుకొనిరని అందువలన శాక్యులను పేరు వచ్చినదని, కపిలుని ఆశ్రమమున్న చోట వీరు నగర నిర్మాణ మొనర్చిరని అందువలన కపిలవాస్తు అను పేరు గల్గినదని వీరు వ్రాసిరి ఇది చారిత్రక సత్యముగనే కాన్పించుచున్నది ఈయన కావ్యములలో రసజ్ఞానసంబంధమగు వాసనలు, సౌందర్యము, భావము, చిత్తవృత్తి కాన్పించునని పండిత వేదవ్యాస్ వ్రాసెను

(3) సూత్రాలంకారము —ఇది టిబెటీయభాషలో నున్నది ఈ గ్రంథము అశ్వఘోష రచితమని పలువురు వ్రాసిరి కాని ఇది కుమార లత రచితమని ఆచార్యవర్యుడు లూడర్సు వ్రాయుచున్నాడు.

(4) వజ్రసూచి :—('వీరసూచి) —దీనిలో వర్ణవ్యవస్థను ఘోర ముగ ఖండింపబడెను

(5) మహాయాన శ్రద్ధోత్పాద శాస్త్రము :— (విజ్ఞానవాదము).— దీనికి తత్వశాస్త్రములలో గొప్ప పేరు గలదు అద్భుతమగు వాదములతో నిండియున్నది ఈ గ్రంథమును బట్టి అశ్వఘోషుడు గొప్ప దార్శనికు డని తేలుచున్నది. ఇది 'భూత, తథతా దర్శనమని' పేరు గాంచినది 'నాగార్జు నుడు' దీనిపైన గొప్ప వ్యాఖ్యానమును రచించెను దీనినిబట్టి నాగార్జు నుడు అశ్వఘోషుని శిష్యుడని కొంద రూహించుచున్నారు

(6) శారిపుత్ర ప్రకరణము :—దీనితోబాటు మరి రెండు నాటక ములు లభ్యమైనవి ఇవి కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయము, మృచ్ఛ కటికమువలె ఉన్నవని వ్రాసిరి బుద్ధచరిత్రలో మొదట 28 అధ్యాయ ములు గలవని చైనీయ, టిబెటీయగ్రంథములను బట్టి తెలియు చున్నదని, అది సంపూర్ణమైన బుద్ధని జీవితచరిత్ర యని, ఇందులో మనకు నేడు 13 అధ్యాయములే లభ్యమగుచున్నవని, 19 వ శతాబ్దము లోని యొక కవి మరి నాల్గు అధ్యాయములు చేర్చెనని 'కీత్' అను విద్వాం సుడు వ్రాయుచున్నాడు 22 నగర వర్ణన, రాజు, రాణి, ప్రపంచము—వీని వర్ణనలు ఆశ్చర్యము గొల్పుచున్నవని పాశ్చాత్యులు వ్రాసిరి. సౌందరనందములో స్త్రీలను గూర్చి వ్రాసిన శ్లోకము పాశ్చాత్యులకు నవ్వు గల్గించినది. "There is honey on their lips but deadly poison dwells in their hearts" వీరు పయోముఖవిషకుంభములని నిర్దాక్షిణ్యముగా వ్రాసెను విమర్శనలో గూడఁ కరుణార్ద్ర హృదయ మవసరము (sympathy).

---

17 V A Smith-Oxford History of India-p 250


18. V A. Smith-Early History of India p 250- "It is possible that these precious records may still exist buried under some mound near Srinagar, and that a lucky chance may reveal them."

19 C. S. Srinivasachary—"Aswghosha arranged and systematized the commentaries on the canon drafted by the council."

20. V. A. Smith—Early History of India,

21 Winternitz—History of Indian Literature Vol. I—p 513 "Ramayana served as a model."

22. A. B. Keith—Classical Sanskrit Literature, p. 21.



నైతిక భావములకు విరుద్ధముగా నెవరు వ్రాసిన, వది జీవితము పైననే దాడి యగుచున్నది. బౌద్ధధర్మ అనుయాయి యైన ఈ కవి నైతిక ధర్మముల జక్కగా బోషించెను గొప్ప దార్శనికు డగుటచేత ఆ భావములనే తన కవితలో బ్రయోగించి గొప్ప కవియాయెను 23 అవదాన శతకమును బట్టి, ఒకమారు 'శోభావతి రాజు' ఎదుట దక్షిణ హిందూస్థాన నాటక సమాజమువారు ఒక బౌద్ధ నాటకమును బ్రదర్శించిరని తెలియు చున్నది. ఈ నాటకము ప్రాయశః అశ్వఘోషుని నాటకమే కావచ్చును. ప్రథమ నాటకకర్తయైన 'అశ్వఘోషుడు' పుక్కిటికథ కాకుండ బుద్ధుని శిష్యుల సత్యమైనచరిత్రను గ్రహించి హేతుబద్ధమైన నడకతో (Rational) పాత్రాపోషణ చేయుచు, సంభాషణను చక్కగా వర్ణించుచు, తన రూపక, కవితా చమత్కృతిని బ్రదర్శించెను ఈ విధముగా అశ్వఘోషుడు రంగస్థల ప్రదర్శనార్హమగు నాటకముగా జేసి, నటుని కళా నైపుణ్యమును జక్కగా పోషించెనని విద్వాంసులు వ్రాసినారు. 'అరిష్టాటిలు' వ్రాసినట్లు ఒకసారి వినుటతోడనే (Asingle reading) భావములు చిత్తంబున హత్తుకొనును. అశ్వఘోషుని ధీశక్తి, (Genius) ధర్మ ప్రచారము ద్వారానే కాకుండా, నాటకములు, రంగస్థలములు, పాత్రాభినయముల ద్వారా బౌద్ధ ధర్మము ప్రచారము గావచ్చునని, భిన్నమార్గముల ద్రొక్కెను

అశ్వఘోషుడు విమర్శకుడు, చరిత్రకారుడు, భా వ వి ప్ల వ కా రు డు

క్రీ. శ. 2 వ శతాబ్దములోని 'అశ్వఘోషుడు' ఆ కాలపు సమాజము నధిగమించి, ముందుకు నడచెను. అప్పటి బ్రాహ్మణ మతములో వర్ణాధిక్యత, కర్మ సిద్ధాంతము, నమ్మకము మున్నగు లక్షణము లున్నవి విమర్శకుని లక్షణము 'ఇది ఎన్నటికిని కాదు' అని పలుకుటయే. 24 ఆ కాలమును, అప్పటి భాష ననుసరించి అశ్వఘోషుడు నూత్న యుగమునకు బనికివచ్చు నూత్న గ్రంథరచన చేయసాగెను (New works of new days). 260 గ్రంథముల రచించిన వాల్టయిరును గూర్చి వ్రాయుచు హడ్సను యిట్లు ప్రశ్నించుచున్నాడు "ఆయన ఏపని కొరకు నిలబడెను ? ఆయన లక్ష్యములేవి ? పద్ధతు లేమి ? సాధించిన కార్యము లేమి ? చరిత్రరీత్యా మాత్రమే ఆయన కార్య మెంతవరకు ముఖ్యమైనది ? దానిలో శాశ్వతమైన విలువ గలదా ? ఎంతవరకు ?". దాని కిచ్చిన జవాబు, అశ్వఘోషుని విషయములో గూడ సరిపోవు చున్నది 'వాల్టయిరు' వలె, అశ్వఘోషుడు సాంఘిక, చారిత్రక, కావ్యములు, నాటకములు, చరిత్ర, జీవితచరిత్ర, తత్వశాస్త్రము, దార్శనిక సిద్ధాంతములు రచించి శాశ్వత యశఃకాయు డాయెను 'శూన్యత' పదము నీయన, తర్వాత నాగార్జునుడు ప్రయోగించిరి పరిశోధన కలవి గాని క్షేత్రములలో (Unexplored territory) నాయన విహరించెను ఉభయులు ధీశక్తి సంపన్నులు 'ఆర్నాల్డు' వచించినట్లు వీరు ధీశక్తిగల యధార్థమైన వ్యక్తులు' (Real men of genius). 'వాల్టరయిజము' పారిసు నుండి లండనుకు పలాయనమై పోయినట్లు, అశ్వఘోషుని శక్తి, బౌద్ధమత దార్శనికశాస్త్రము, అది పుట్టిన భారతదేశము నుండి చైనా, టిబెట్, మంగోలియాలకు పలాయనమై పోయెను 25 'వజ్రసూచికోపనిషత్తు' లోని ఈయన విమర్శన, ప్రసిద్ధ సంఘసంస్కర్తల బోధన వలె నున్నది మౌల్టన్ చెప్పినట్లు, "విమర్శన విజ్ఞాన శాస్త్రములోని శాఖ యగుచున్నది కాని సారస్వత సంబంధమగు శాఖ కాదు 26

ఈ విమర్శనలో ఖచ్చితమైన శాస్త్రీయదృష్టి శాస్త్రీయమగు నిష్పక్షపాత బుద్ధి అవసరము వర్ణభేదమును ఖండించిన ఈ ఉపనిషత్తును 'వీబరు' అను విద్వాంసుడు 1860 లో ఆంగ్లేయ భాషలోనికి మార్చి ఇట్లు వ్రాసెను. "దీనిలో ఈయన బ్రాహ్మణమతసంబంధమగు వర్ణభేదమును, బ్రాహ్మణమతవాఙ్మయమునుండి అనేక ప్రమాణములను గైకొని ఖండించెను." 27 'ఋష్య శృంగో మృగ్యాః, కౌశికః కుశాత్, జాంబుకో జంబుకాత్, వాల్మీకో వల్మీకాత్, వ్యాసః కైవర్త కన్యకాయాం, శశపృష్ఠాత్ గౌతమః, వశిష్ఠ ఊర్వశ్యాం, అగస్త్యః కలశేజాత ఇతిశ్రుతత్వాత్." 28 బుద్ధదేవునివలె ఆ కాలపు సమాజమునకు ఎదురుతిరిగి బ్రాహ్మణత్వము పుట్టుకచేత రాదని పై ఋషులందరూ బ్రహ్మజ్ఞానమువలన బ్రాహ్మణులైరని వాదించి తన సిద్ధాంతమును శాశ్వతముగా నుండుటకు ఉపనిషత్తులోని కెక్కించెను. ఈ విధముగా భావవిప్లవకారుడై వర్ధిల్లెను. బౌద్ధమతమును పామర జనమునకు ఆకర్షకముగానుండుటకు ప్రజల కందుబాటులో నుండునట్లు సంస్కృతములో వ్రాసి మొదటినాటక కర్త యాయెను లౌకిక సాహిత్యమునకీయన సంస్కృతము నుపయోగించెను. బౌద్ధధర్మమును సాహిత్య రూపములో రచించుట కీయనయే ఆరంభకుడు. కాళిదాసుకూడా ఈయన ననుకరించెనని ఈయన వర్ణనల, సమాసముల, కథావిధానముల, ఊహలగైకొనెనని అందుచే అశ్వఘోషునకు చాలాఋణపడెనని బహువిద్వాంసులు అభిప్రాయము. ఎంతవరకు అనుకరించెనో విద్వాంసులు పరిశీలించవలెను. అపుడు కాళిదాసు గొప్పతనమంతయూ అశ్వఘోషునిదేయని చెప్పవలసివచ్చును బుద్ధచరిత్రవలన సారిపుత్రప్రకరణవలన అనేకచారిత్రక సంఘటనలు బయల్పడుచున్నవి "చరిత్ర సత్యమైనది కాన నది అమూల్యమైనది" అని రస్సెల్ వ్రాయుచున్నాడు 29 చాలామంది కవుల కావ్యములు ప్రామాణికత్వములేక (Lack of authenticity) రాణించకున్నవి, కాని అశ్వఘోషుని మనస్సు చారిత్రక దృష్టికోణముతో (Historically conscious) సత్యాంశములతో నైతికధర్మ బోధతో నిండియున్నది. చారిత్రకదృష్టితో కావ్యము, నాటకము వ్రాయడమే ఒక విప్లవము ఈయన వ్రాసిన బుద్ధచరిత్ర చారిత్రక సత్యములతో నిండి యుండుటచేత 'ఇత్సింగు' కాలమున (క్రీ శ 672—688) బౌద్ధవిద్యాలయములలో పఠనీయ గ్రంథమై విలసిల్లెను

---

23. Coleridge—"No man was ever yet a great poet without being at the same time a prefound philosopher."

24. W. H. Hudson — An Introduction to the study of Literature-p. 293, critic "This will never do.'

25. Ibid p 47 — "Voltairism may be said to have begun from the flight of its founder from Paris to London

26 Moulten — "Criticism-not as a branch of literature but as a branch of science.'

27. Weber—Indian Wisdom p 161—"It is not Jati (Birth) Varna (colour) Panditya (Learing) but the Brahmavid (He Who knows Brahman) is alone a Brahmana. "This portion has been used by a Buddhist (Aswaghosha) almost literally against the system of caste in general.

28 ఈశాద్యుపనిషద్ — p 222 — వజ్రసూచికోపనిషద్ published by Nirnaya Sagara press,

29 Russell—"History is valuable to begin with because it is true."

అద్వైతశేఖరము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

పాత్రలు:

పోతన్న	—	నారయ్య
తిప్పయ్య	—	సింగన్న
కేతన	—	సదానందకవి

ఆమె (గంగయ్య తాత కూతురు)

ఇది పోతన్నగారిని గూర్చిన నాటకము ఆయనను గూర్చి పలుకథ లున్నవి భాగవతము నలుగురిచేత వ్రాయబడుటకు పలుకథలున్నవి చరిత్ర దృష్టితో జూచినచో హేతుదృష్టితో జూచినచో నే కథలునునిలువవు అందుచేత నీ నాటకమునందు వేరొక కల్పన చేయబడినది ఈ కల్పనలోని విషయము మాత్రము నిల్పునా యన్నచో నిలుచును, నిలువక పోవచ్చును కాని వెలిగిందల నారయ, వేర్పూరి సింగన్న, గంగన్న, పోతన్నగారల కవితా లక్షణమును మాత్రము నిస్సంశయముగ ప్రకాశింప జేయును.

పోతన్న శ్రీ కైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్ దానవో
ద్రేకస్తంభకు కేళిలోలవిలసద్దృగ్జాలసంభూత నా
నాకంజాతభవాండకుంభకు మహా నందాంగనా డింభకున్ . ..

అన్నగారూ, ఎందుకీ పద్యము చదువుమంటిరి . .?

తిప్పయ్య ఏదీ, నీవు గోదావరి యొడ్డున జపముచేసి కొనుచుండగా ...

పోత ఎప్పుడు ..?

తిప్ప సోమోపరాగమునాడు . శ్రీరామచంద్రుడు భాగవతమును వ్రాసి తన కంకిత మిమ్మని నిన్నడిగిన నాడు ...

పోత అప్పుడేమి?

తిప్ప నీ కొక రాజముఖ్యుడు గన్పించెను ....

పోత ఆయన తానే రామభద్రుండనని చెప్పినాడు. చెప్పి మ న్నామాంకితంబుగా శ్రీ మహా భాగవతమ్ము తెనుగు సేయుమన్నాడు

తిప్ప . మఱి నీ యీ భాగవతపు మొదటి పద్యము నందాగనాడింభకు పరముగా నున్నదేమి ?

పోత : రామునకు కృష్ణునకు భేదమేమి?

తిప్ప · అయినచో రాముడు వచ్చి యడుగుట యెందులకు? మఱియు నీ షష్ఠ్యంతములు చదువుము

పోత అవియు కృష్ణపరముగానే యున్నవి ...

తిప్ప చదువవయ్యా ..

పోత : అన్నగారి యాజ్ఞ. .....

హారికి నందగోకులవిహారికి చక్రసమీరదైత్య సం
హారికి భక్తదుఃఖపరిహారికి గోపనితంబినీ మనో
హారికి దుష్టసంపదపహారికి ఘోషకుటీపయో
హారికి బాలకగ్రహమహాసురదుర్వనితాప్రహారికిన్.....

తిప్ప : నాయనగారేదో చెప్పనెంచినట్లున్నారు....

కేతన్న అన్నాదమ్ములు మీరిద్దరు మాటాడికొనుచున్నారు తిప్పయ్యా, తమ్ముని నిరకటములో బెట్టుచున్నావు పోతన్నా, నంద . డింభకుని కైవల్యపదమ్ము గోరి చింతించినాడోయి గీతోపదేష్టయైన కృష్ణుడు కైవల్యనాథుడు బ్రహ్మపదార్థము వాసుదేవమైన మహస్సు. దాని రహస్యమది

పోత నాయనగారి చరణములకు ప్రణామములు ...

తిప్ప పోతన్నా! బంధువులు వచ్చినట్లున్నారు నీ భాగవతము, నీశిష్యులు, నీదొక గోల, సంసారపు గొడవను నేను చూచుకొనవలయును ఎవరు వచ్చినది, ఓహో, గంగయ్య తాతకూతురా ఏమమ్మా, యిట్లున్నావు?

ఆమె మామయ్యా నాకర్మ మిట్లు కాలినది వారు చనిపోయినారు నేను తిండిలేక వారి పంచలబడి తిరుగుచున్నాను

తిప్ప మంచి తిండిగల కొంపకు వచ్చినావు

కేతన్న నీ భర్త పరమదుర్మార్గుడు వానికి దీర్ఘాయుర్దాయ మెట్లుండునే ..

పోతన్న శ్రీమద్భక్తచకోరక
సోమ వివేకాభిరామ సురవినుతగుణ
స్తోమ నిరలంకృతాసుర
రామాసీమంతసీమ రాఘవ రామా ...

ఆమె మీరు తిండి పెట్టుదురని రాలేదు చిన్న మామ మహాభక్తుడు మహాకవి భాగవతము వ్రాయుచున్నాడని విన్నాను అందుకని వచ్చినాను నేను వచ్చినదానికి చారితార్థ్యము గలిగినది పోతన్న మామా! నీ దయవలన నా భర్తను శ్రీరామచంద్రుడు సంహరించినట్లయినది ఖరాదులవలె నాభర్తకూడా మోక్షమునకు బోవునుగదా ...

కేత ఓసి పతివ్రతా ఇచ్చటనే యుండుము. మాతోపాటు కలో గంజో త్రాగుదువుగాని .

తిప్ప పోతన్నా! ఒక్కొక్క పద్యమున కొక్కమూర్తిగా నీవు భాగవతము ఎన్ని ఏండ్లు వ్రాసెదవు

కేత తిప్పయ్యా . నీవు దేశద్రిమ్మరివి . . ..

తిప్ప · యీ సంసారము గడుపుటకు నేనట్లు కావసి వచ్చినది మే మిద్దరము నీకు గొడుకులమే పోతన్న రామనామము చేయుచు గూర్చుండును నేను ఒహుగ్రామధామముగా దిరుగుచుందును.

కేత పోతన్నా, ఉన్న రెండెరకముల కొంద్ర డయుత్రొక్కించుచున్నాడుగదవయ్యా!

తిప్ప · అతడు రాముని ధ్యానించుచున్నాడు. అతనికి రాముడు గన్పించుచున్నాడు. అతడు కృష్ణుని కీర్తించుచున్నాడు నాయనగారూ! నేను సంపాదించి పోషించుచున్నాను మీకు పోతన్నమీద నెక్కువప్రేమ.

కేత : భాగవతమంతయు పోతన్న వ్రాయుటలేదు సింగన్న షష్ఠస్కంధము వ్రాయుచున్నాడు గంగన్న పంచమస్కంధము వ్రాయుచున్నాడు.

తిప్ప : వెలిగిందల నారయ్య ఏమి వ్రాయుచున్నాడు?

కేత · ఏకాదశ ద్వాదశ స్కంధములు వ్రాయుచున్నాడు.

తిప్ప . అతడు దశమస్కంధము వ్రాయవలయును.

పోత దానిని నేనే వ్రాయవలయును.

కేత నారయ్య సోమరి అతడు దశమస్కంధమును వ్రాయునా?

తిప్ప : యోగి సోమరి గాక కార్యశీలి యగునా ?

కేత · నారయ్య యోగియా ?

తిప్ప · నేను వెలిగందల వెళ్లి వచ్చితిని. వెలిగందలలో పూర్వము గణపతిదేవ చక్రవర్తి కట్టిన కోట నేడు తురకల అధీనములో నున్నది అది చాల గొప్పదుర్గము. శత్రులకు అనిర్భేద్యమైన దుర్గము. ఆ దుర్గాధిపతి యున్నాడు. అతని పేరు హసనలీ.

కేత · ఈ తురుష్క ప్రస్తావన ఎందులకు ?

తిప్ప అతడు గాయకుడు గొప్ప గవాయి గాయకులైన తురుష్కులు తురుష్కులు కారు అతడు గొప్ప శివభక్తుడు పాల్కురికి సోమనాథుడు రచించిన బసవ పురాణ మతడెప్పుడును పఠించుచుండును

కేత · ఆ గ్రంథము మహాగ్రంథమని వినుటయే గాని నే నెన్నడును చూడ లేదు

తిప్ప నా కందులో కొన్ని పంక్తులు వచ్చును.

క్షీరాబ్ధిలోపల క్రీడించు హంస
గోరునే పడియుల నీరు ద్రావంగ?
జూత ఫలంబులు జుంబించు చిలుక
భాతి బూరుగుమ్రానిపండ్లు గన్గొను నె
రాకామలజ్యోత్స్న ద్రావు చకోర
మాకాంక్ష చేయునే చీకటి ద్రావ
విరిదమ్మి వాసన విహరించు తేటి
పరిగొని సురియునే బబ్బులితరుల

పోతన్న : మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దోగు
రాయంచ ననునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు
కోయిల చేరునే కుటజములకు
పూర్ణేందుచంద్రికాస్ఫురిత చకోరకం
బరుగునే సాంద్ర నీహారములకు
అంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్త మేరీతి నితరంబు చేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల.

తిప్ప : ఇది యెవ రన్నారు ?

పోత ప్రహ్లాదు డన్నాడు.

తిప్ప అప్పుడే సప్తమస్కంథముదాక వెళ్లితివా ?

కేత : నాయనా ! అతడు సర్వ స్కంథములందు, సర్వ కాలములందు సమానముగా విహరించుచున్నాడు. ఇంతకును నారయ్య యోగియన్నమాట చెప్పలేదు.

తిప్ప వెలిగందలలో నత డొక బైరాగుల మఠమును స్థాపించినాడు వారందరు నిత్య యోగాభ్యాస రతులు. నారయ్య యా మఠములోనివాడు

కేత దొరకక దొరకక మంచి శిష్యుడు దొరికినాడు

తిప్ప ఇచ్చట భాగవతము పూర్తియే కాదు అత డేకాదశ ద్వాదశ స్కంథముల వ్రాసి తీసికొని వచ్చును

పోత అయినచో భాగవతము పూర్తి యైనట్లే కదా.

తిప్ప : అడుగో నారయ్య . .. మీ త్రిప్పలు మీరు పడుడు. నే బోవుచున్నాను. యీ పతివ్రత యొక్కర్తుక వచ్చినది. ఇది ఇంకొక్క పోరు ....

కేత : మరియొక కడుపు నాయనా.

తిప్ప · నాయనగారూ . ఆమె పతివ్రత, అట్టనకుడు.

పోత : అన్నగారు పరమ పరిహాసశీలి.

ఆమె : యోగు లట్లే యుందురు.

నార : గురుసత్తమా! పరమ భక్తాగ్రేసరా! పోతన మనీషి! నా కప్పజెప్పిన రెండు స్కంధములు వ్రాసి తెచ్చితిని

ఆమె : తిప్పయ్య మామా . .. మీ రిద్దరు వెళ్లలేదు.

తిప్ప : భాగవతమును పూర్తిగా వినిపోదుము

కేత · అప్పుడే పూర్తి చేసితివా ? నీ కిచ్చిన భాగము చాల గడ్డయిన భాగము. అందులో రాజ వంశము లున్నవి అది జ్యోతిశ్శాస్త్రముతో గూడిన పని ఖగోళ విజ్ఞానముతో గూడిన పని

నార · నే నంతయు నెక్కువ వచనములోననే వ్రాసితిని

నార . ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబులోపలన్
మానుము సంభవంబు గల మానవకోట్లకు చావు నిత్యమౌ
గాన హరిం దలంపు మిక గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ చెందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్

పోత ఓయి నారయ్యా! యీ పద్యము నేను ప్రథమస్కంథములో వ్రాసితిని గదా!

నార గురుసత్తమా .... పేరు నాది గాని భాగవత మంతయు తమరు వ్రాసినట్లే గదా.

తిప్ప భాగవతమును జపమాల వలె చేసినా డన్నమాట ఆద్యంతములు గలిపినాడు భాగవత మందలి తత్త్వ మిదియే గదా . నారయ్య యీ పద్యమును భాగవత మహామాలారత్నమును చేసినాడు

కేత నారయ్యా! నీవు వ్రాసిన రెండు స్కంధములలోని వైలక్షణ్యమేమో చెప్పుము

నార పరమగురూ! చెప్పుమందురా ? నేను చెప్పుట న్యాయముగాదు

తిప్ప . నారయ్యా! వ్రాసిన వాడవు నీవు చెప్పవూ. చదివెడివారము మాకు దెలియదు; యీ ముడి యెట్లు వదులును ?

నార నే నహంకారి యనిపించుకొనుటతో వదలును

తిప్ప నీవు యోగివి నీ వనిపించుకొనుట ఏమి లెక్క ? అనిపించుకొనుము.

ఆమె · నేను చెప్పెదను.

పోత · నీకెట్లు తెలియును.

ఆమె : నేను తిప్పయ్యమామకును నారయ్యయోగికిని శిష్యురాలను చెప్పుచున్నాను. నారయ్యగారి కవిత్వములో నాంధ్రభాషయందలి వచన రచనకు వరవడి కలదు పోతన్నమామ పద్యరచన యెట్టిదో, నారయ్యగారి వచన రచన యట్టిది.

కేత · నారయ్యా! నీవుగా వ్రాసిన పద్య మొకటి చదువుము

నార : నారాయణుని తపోవిఘ్నము చేయుటకు దివిజకామినులను, బలభేది పంపించెను నారాయణుడు చలించలేదు. భగవంతుడైన యచ్యుతుడు వృషభునకు నాత్మయోగము చెప్పెను

వచనం. అట్టి పరమేశ్వరుని లీలాగృహీతంబులగు మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన రామ రఘురామ బుద్ధ కల్క్యాద్యవతారంబు లనేకంబులు గలవు వాని నెరిగి నుతియింప శేష భాషాపతులకైన నలవి గాదు

సర్వ లఘుసీసం ·

నవవికచ సరసిరుహ నయనయుగ నిజచరణ
గగనచర నదిజనిత నిగమవినుత
జలధిసుతకుచకలశ లలితమృగమదరుచిర
పరిమళిత నిజహృదయ ధరణి భరణ
ద్రుహిణముఖసురనికరవిహితనుతికలిత గుణ
కటి ఘటిత రుచిరతర కనకవసన
భుజగరిపువరగమన రజతగిరిపతివినుత

వితతజపరత నియమనరణిచరిత
తిమి కమఠ కిటి నృహరి ముదితబలినిహ
తవద పరశుధర దశవదనవిదళన
మురదమన కలికలుష సుముదపహరణ
కరివరద ముని నర సుర గరుడ వినుత.

వచనం . ఇవ్విధంబునన్ ప్రవర్తిల్లిన శ్రీమన్నారాయణమూర్తి విలాసంబు లనేకంబులు గలవు

కేత • ఏమి ? యీ పద్యము నీ రచనయంతలో గొప్పది యందువా ?

వార స్వామీ! పూర్వాపరములు కలిపి చూడవలయును.

కేత నా కర్థ మగుటలేదు

ఆమె తాతగారూ, అచ్చట నేమియును లేదు శబ్దముచేత భావము ధ్వనించు శిల్పమందున్నది. ఆ సీసపద్యము సర్వ లఘువు అందు భగవంతుని యనేక లీలావిలాసము లున్నవని వారయ్యగారు చెప్పుచున్నారు ఇది యొక శిల్పము భగవంతుడైన నారాయణునకే సర్వ ప్రపంచము లఘువని యర్థము ఈ సృష్టి యర్థరహితమని తాత్పర్యము ఆ పద్యములో నేమియును లేదు భగవంతుని గూర్చిన స్తోత్ర మున్నది యీ సృష్టిలో భగవంతుని స్తుతించుట తప్ప యింకొక ప్రయోజనము లేదని దాని తాత్పర్యము.

కేత • నీ వింతటి తెలివిగలదాన వెట్లయినావు ?

తిప్ప . నాయనగారూ, దాని కొక హేతు వున్నద ఈమె భర్త బతికి యున్న ప్పుడు వారి తగులము పట్టరానిదిగ నున్నది వా రిద్దరు నంతకాముకులు . అంతటి లిప్పతో వర్తించినారు అందుచేత నిప్పు డంత వైరాగ్య మామెకు గలిగినది. అంతటి తెలివి గలిగినది.

పోత : రాజు రాజముఖిని రతిదేల్చె బంగారు
మేడలందు తరుల నీడలందు
కోటలందు రత్న కూటమ్ములందును
కొలకులందు గిరుల కెలకులందు

వచనం అంత నయ్యిద్దరకు తగులంబు పెంకొని, ..
ఒకదిక్క గాని చన బో
కొకచోటన గాని విలిచియుండరు దమ లో
నొకటియుగాని తలంపరు
నొక నిమిషము పాయలేరు నువిదయు ఱేడున్ .:
దయ్య మెరుంగున్ వారల
వెయ్యంబులు మక్కువలును నిజమరితనముల్
దియ్యములును వెడనందిని
బయ్యెద కొంగడ్డమైన ప్రాణము లెడలున్.

వచన : ఇట్లూర్వశియున్ బురూరవుండు నొండొరులవలన మక్కువలు చెక్కు లొత్తన్ పగళులు రేలు ఎల్లెడల విహరింప.

తిప్ప : ఇది నవమస్కంధములోని వృత్తాంతమా ?

పోత : చిత్తము .. .

(అయ్యో, అయ్యో అని కేకలు)

కేత • తిప్పయ్యా, ఆ విలాప మేదియో చూచిరమ్ము ..

తిప్ప : మన యూరి గ్రామాధికారి కుమారుడు బావిలో పడినాడు.

ఆమె : అయ్యో పాపము.

తిప్ప : భయములేదు. .... గొల్ల కుర్రవాడు సింహమువలె నూతిలోనికి దూకి పిల్లవానిని పైకి తీసెను.

పోత : వచనం : కృతనిశ్చయుడై పూర్వజన్మ భాగ్యంబులన్ తన చేరణ స్పర్శంబు నకు యోగ్యంబై తత్సమీపమున విశాల విటపశాఖా కదంబంబులతో నున్న కదంబ భూజంబునెక్కి,
కటిచేలంబు బిగించి పింఛమున జక్కం గొప్పు బంధించి డో
స్తట సంస్ఫాలన మాచరించి చరణద్వంద్వంబు కీలించి త
త్కట శాఖాగ్రము మీదనుండి యురికెన్ గోపాల సింహంబు ది
క్తటముల్ మ్రోయ హ్రదమ్ములో గుభగుభధ్వాన మ్మనూనంబుగన్.

తిప్ప • ఇది కాళియమర్దన ఘట్టమా

పోత చిత్తము

తిప్ప ఓసి యోగినీ, నీ వింటిలో నుండుము. నేను వెళ్ళచున్నాను.

ఆమె అరుగో ఏర్చూరి సింగయ్యగారు వచ్చుచున్నారు

కేత : ఏమయ్యా సింగయ్యా . .. షష్ఠస్కంధము పూర్తి చేసితివా ?

సింగ • చిత్తము స్వామీ

పోత • ఎట్లు ప్రారంభించితివి . ?

సింగ • వచనం శ్రీ మహా భాగవత పురాణమ్మునందు షష్ఠస్కంధం బాంధ్ర భాషన్ రచియింపం బూని యీ కృతికిం పతిగా నెవ్వేల్పుండు కలండని వితర్కించి కవిత్వ మహత్వంబు సంప్రాప్తంబగు కాలంబు దలచి, నారాయణుండు దైవంబని యెఱింగితిని .... ఒకనాడు విద్రపోవు చుండగా

ఉరువడి ప్రాగ్విధి నుదయించు మార్తాండ
కోటి బింబచ్ఛాయ కూడినట్లు
హరిహర బ్రహ్మ లయాత్మలలోనుబ్బి
కరుణ యొక్కట మూర్తి బెరసినట్లు
ఖరకర కరతీవ్రగతిని గరంగుచు
హేమాద్రి చెంత బె ల్లగసినట్లు
ఫణిరాజ ఫణరాజి మణిగణ విస్ఫూర్తి
సుషిరంపు వెలి తలచూపినట్లు
ఉట్టిపడినట్లు కట్టెట్టి నూదినట్లు
తేజ మెసగంగ నా మ్రోల దివ్యవాణి
పూని సాక్షాత్కరించి సంపూర్ణదృష్టి
జూచి యిట్లని పలికె మంజులముగాను ...:

కేత • ఆమె ఏమన్నది ?

సింగ . ఆటలు పాటలున్ జదువు లద్భుతముల్ విన నొప్పు వాద్యముల్
పోటి దలంపరాని బలు సాములు మున్నగు విద్యలెల్ల నీ
కాటలు బాటలయ్యె విను మన్నిటికిన్ మెఱుగిడ్డ భంగి నా
బాటున చాటుకార వద సాధు కవిత్వము జెప్పు మింపుగన్.
అప్పుడు నే నొక్క శ్లోకమ్మున నామెను స్తుతించితిని.

పోత : ఏదీ, ఆ శ్లోకమును చదువుము

సింగ : హంసాయ సత్వనిలయాయ సదాశ్రయాయ
నారాయణాయ నిఖిలాయ నిరాశ్రయాయ
సత్యంగ్రహాయ సగుణాయ సదీశ్వరాయ
సంపూర్ణ పుణ్య పతయే హరయే నమస్తే ....

కేత : ఇది యేమయ్యా, కనిపించినది సరస్వతీదేవి, నీవు స్తోత్రము చేసినది నారాయణుడైన భగవంతుని .

సింగ : ఈ శ్లోకం బద్దేవి యంగీకరించె .... (వచనం)

కేత : బాగుగా నున్నది .... మీ రందరూ నొక్కటియే జాతి.

పోత : ఆ నారాయణుడును సరస్వతియు నొక్కటియే జాతి. సింగయ్యా! నారాయణ కవచము యీ భాగములో నున్నది. దాని నెట్లు వ్రాసితివి ?

సింగ : గురూత్తమా .... కోటి కృష్ణ మంత్రమును జపించి వ్రాసితిని.

పోత : అట్లనా ? ఆంధ్రజాతి తరించునట్లు చేసితివి. ఆంధ్రులు సర్వమైన యీనత్కాలములయందు భవ్రదచితమైన నారాయణ కవచమును జదివి భూతప్రేతపిశాచాది బాధల నుండి విముక్తు లగుదురుగాక

సింగ : అడవుల సంకటస్థలుల నాజిముఖంబుల నగ్ని కీలలం
దెడరులనెల్ల నాకు మతి కెక్కగ దిక్కగు గాక శ్రీ నృసిం
హుడు సురశత్రుయూథప వధోగ్రుడు విస్ఫురి తాట్టహాస వ
క్త్రుడు నిజదంష్ట్రపావక విధూత దిగంతరుడు డప్రమేయుడై.

పోత ఓయీ, మీరు వ్రాసిన భాగములు మీరు వ్రాయుటయే బాగున్నది

సింగ అడుగో గంగన్న వచ్చుచున్నాడు

కేత : గంగన్నా . .. నీవు పంచమస్కంధమును బూర్తిచేసి వచ్చితివా ?

గంగ : చిత్తము పరమగురూ.

కేత : నీవు పంచమస్కంధ మేల తీసికొంటివి ?

గంగ . స్వామీ, అందులో భరతోపాఖ్యాన మున్నది భగణ విషయ మున్నది. అది యంతయు నద్వైతవిషయము, ఖగోళ విషయము గుర్వులు భక్తిచేత నొడలు మరచిపోయి వ్రాయుదురు ఆ తత్వమును తత్వముగా భాసింప జేయవలయును. భగవంతుడైన వేదవ్యాసుడు భాగవతమునందు భిన్న స్థలముల జ్ఞానమునుజ్ఞానముగా భక్తిని భక్తిగా దీర్చినాడు

కేత . ఆ యేవరో వచ్చినారు చూడుము.

సింగ . పరతత్వరసాయనమ్ము వ్రాసిన యీశ్వర శేషభట్టును శ్రీ సదానంద కవి యోగీశ్వరులును వచ్చినారు. సింహాసన ద్వాత్రింశిక వ్రాసిన కొఱవి గోపరాజుగారు వచ్చినారు. మరియు నెందఱో సత్కవులు వచ్చినారు.

పోత : మహాకవులారా ! దయచేయుడు. దయచేయుడు. మా గృహము పవిత్రమైనది

సదానంద భక్తసత్తమా! నీవును నీ శిష్యులును గలసి యాంధ్రమున మహాభాగవతము రచించినారు మీ దర్శనార్థము మే మందఱము వచ్చినారము

పోత మహాప్రసాదము తమ ముందు నే నెంతవాడను.

సదా మే మందఱము మి మ్మొకటి యర్థింప వచ్చినారము.

పోత దయచేసి తెలుపుడు.

సదా · సర్వజ్ఞసింగ భూపాలుడు తమ భాగవతము నంకితము గ్రహింపవెంచుచున్నాడు.

పోత మహాయోగీ, తమరు కూడ నట్లు వాక్రుచ్చవచ్చునా ? నేను భాగవతము మొదట నిట్లు వ్రాసితిని

ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరమువాసి కాలుచే
సమ్మెటవ్రేటులంబడక సమ్మతితో హరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.

అయ్యో నాకీ యూహ వచ్చినప్పుడెల్ల సరస్వతిదేవి కన్నీటితో గన్పించుచున్నది .

కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనునిగాదిలికోడల యో మదంబ యో
హాటకగర్భురాణి నిను నాకటికిం గొనిపోయి యల్ల క
ర్ణాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ.



తిక్కన తెనుఁగు తెన్నులు

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

మహాకవి తిక్కనవాడిన లోకోక్తులను, జాతీయములను, ఆయన రచనలోని ప్రయోగ విశేషములను ఏర్చి కూర్చి 'తిక్కన తెనుగు తెన్నులు' అనుపేర నొక గ్రంథముగా ప్రకటింపవలెనన్న కుతూహలముతో, నేను కొంతకాలముగా కృషిచేయుచున్నాను. అందుకు నేను సంతరించుచున్న సామగ్రి యెట్టిదో, నా వివరణ విధాన మెట్టిదో విజ్ఞుల కెరుక పరిచి, వారివలన నా రచనా ప్రణాళికకు వలయు సదుపదేశములను పొందవలెనన్న యభిలాషముతో మచ్చుకు కొన్ని యంశము లీ వ్యాసమున నిచ్చుచున్నాను

తిక్కన పాఠములు అచ్చు ప్రతులలో ఎడ నెడ మారియున్నవి ఆయన ఉపయోగించిన సామెతలు—పలుకుబడులు నిఘంటువులకు సరిగా నెక్కలేదు టీకాకారులు చెప్పిన అర్థములు కొన్ని పట్టులలో అసమంజసముఁగా నున్నవి మరియు తిక్కన తెనిగింపులో మెఱుగులతోపాటు, క్వాచిత్కముగా తఱుగులును దొరలియున్నవి ఈ యెల్ల విషయములును, సత్య నిర్ణయ తాత్పర్యముతో ఇందు పరామృష్టము లగుచున్నవి పండితులు సహృదయతతో పరిశీలింతురుగాక

లోకోక్తులు ; జాతీయములు

వక్త తన భావమును విస్పష్టముగా వెలార్చుటకును, ఎదుటివారి హృదయమున కెక్కించుటకును లోకోక్తులు, జాతీయములు జీవగఱ్ఱలు తెనుగువారి నిత్యవ్యవహారమునను సామెతలు స్వాభావికముగానే దొరలుచుండును అవి లేక వ్యవహారము సాగదన్నను అతిశయోక్తి కాదు జాతీయము కాని వాక్కులో రుచి తక్కువ. భావ స్ఫూర్తియు నెలితియే ఈ తత్త్వము నెరిగినవాడు గావున తిక్కన తన కవిత్వమున సామెతలను, పలుకుబళ్లను సందర్భోచితముగా—విరివిగా నుపయోగించినాడు అందువల్లనే ఆయన రచన చొక్కమగు తెనుగుదనముతో నిండారి మూలము కంటెను మనోరంజకమై, ఆంధ్రావళికి మోదముం బొరయించుచు, భాషకు పట్టుగొమ్మయై విరాజిల్లుచున్నది

తిక్కన తన కృతిలో మూడు పాళ్లు తెనుగు నుడులనే వాడి, 'తెనిగింపు' అను మాటను సార్థకము చేసినాడు ఆ మహాకవి శాస్త్ర విషయములను గూడ తేటతెనుగు మాటలతోనే సూటిగా వివరించును అది అనితర సాధారణమైన ప్రజ్ఞ. మరియు నా మనీషి కవనములోని నుడికారము లనేకము ఆయన సొంత సృష్టియే భాషా సృష్టికర్త కావుననే 'కవిబ్రహ్మ' యనిపించుకొన్నాడు

తిక్కన లోకమునుండి సంతనచేసి, గ్రంథమున పొందుపరిచిన లోకోక్తులే, ఆయన నుడికారములే పిమ్మట కవులకు ఆధారములును—మార్గ దర్శకములును అయినవి సామెతలతోను, జాతీయములతోను ఆమెతలు పెట్టు పద్యములు కొన్ని మూదలించి, వాటిని గూర్చిన విశేషములు యథామతి మనవి చేసెదను

1. 'సాదురేఁగిన తలపొలమున గాని నిలువదు'

"అనుజులకు నడ్డపడి యే
మిని జేయఁగ నీమిఁ జూచి మెచ్చితిగా కీ
వును సాదు రేఁగెనే నిన్
వీను తల పొలమునన కాని నిలువదు సుమ్మీ"
(ఉద్యో. 2—13)

ఇది సంజయుడు ధృతరాష్ట్రునితో అన్నమాట—

'ధర్మరాజు తాలిమితో నున్నాడు గావున మీ దుండగములు సాగిపోవుచున్నవి. ఆయనకే ఆగ్రహము వచ్చెనా—కౌరవుల నందరిని తుద ముట్టించిగాని శాంతింపడు' అని భావము

మూలమున సంజయుని సంభాషణములో ఈ వాక్యము లేదు సందర్భానుగుణముగా తిక్కన చేర్చినాడు

"యావ త్పరః కామయతేఽతి వేలం, తావ న్నరోఽయం లభతే ప్రశంసామ్" (31 14) అని మూలము

'బలవంతుడైన శత్రువు ఉపేక్షించియుండు నంతవరకే, ఎవడైనను (దుర్బలుడు) మొనగా డనిపించుకొనుట' అని యర్థము—'బలవంతుడు చేయి చేసి కొనెనేని, బలహీనుడు నశించి తీరు'నని అందలి భావము

తిక్కన ఆ భావమునే గ్రహించి, "సాదు రేఁగెనేని తల పొలమునగాని నిలువదు' అన్న లోకోక్తితో చెప్పినాడు

'సాధువైన పశువు చెలరేగి పరుగిడ సాగెనేని, తా నుద్దేశించినచోటికి చేరిగాని, ఆగ'దని లోకోక్తి కర్థము సాధు స్వభావముగలవానికి కోపము వచ్చెనేని, ఎంత చేయవలెనో అంత చేసిగాని మాన డని భావము

సూర్యరాయ నిఘంటువు 'తలపొలము' క్రింద, ఈ సామెతను తెలిపి, అర్థమును వివరించినది

ఉద్యోగ పర్వమునకు టీకా తాత్పర్యములు వ్రాసిన నే పార్థసారథి అయ్యంగారు,—"సాధు రేఁగెనేనిన్=మెత్తనిది రేఁగినచో, తలపొలముననకాని=తుద వెడలఁ దఱిమికాని, నిలువదు సుమ్మీ=నిలువదుసుమా" అని యర్థముచెప్పి, "తమ్ముల కడ్డపడి యాతం డేమియు నపకారము చేయకుండుటచే నీ వాతనిం గొని యాడితివి కాని, సాధువుగనుండునది రేఁగినచోఁ దుదముట్టఁ దఱుమక నిలువదుసుమా" అని తాత్పర్యము వ్రాసినారు

'సాధు' అనుట తప్పు 'సాదు' అనుట ఒప్పు కావున వారి పాఠము, అర్థ తాత్పర్యములును సరియైనవి కావు

2. మెత్తని పులి

"వశీకృతచిత్తుఁడు ధర్మసూతి,మెత్తనిపులి యెల్లవారలు నధర్మము నీవయిఁ బెట్టునంతకున్, వినఁడును గానఁడుం బిదప నీకును నాకు మరల్ప వచ్చునే?"
(ఉద్యో 2—14)

'మెత్తని పులి' యనుమాటకు 'మెత్తదనము వహించియున్న పులి' యని యర్థము 'శౌర్యవంతుఁడయ్యును శాంతుడై యున్నవా'డని భావము

సూ ని "మెత్తని పులి—పైకి సాధువుగా గనఁబడుచు తీక్ష్ణభావము గలవాడు" అని యర్థము చెప్పినది ('పులి' క్రింద)

ధర్మజుడు సాధువుగా కనబడుటయే కాదు, నిజముగా సాధువే. పరాక్రమముండియు, 'వశీకృత చిత్తుడు' గావున కోపము నణచుకొని యున్నవాడు అదే సాధు లక్షణము శక్తిహీనుడును కోపము నణచుకొనును కాని, వానిని సాధు వనరు లసమర్థు డందురు అసమర్థుని 'మెత్తని పులి' యను వారుండరు.

కాబట్టి, 'మెత్తని పులి' యను జాతీయమునకు, 'శౌర్యవంతుడయ్యును శాంతుడై యున్నవా'డని చెప్పుట యుచితము గాని, 'పైకి సాధువుగా కనబడుచు తీక్ష్ణభావము గలవా'డనిచెప్పుట యుచితము కాదని నా యభిప్రాయము.

3. 'చెవులు చీములుగట్టు'

"పుడమి జనంబు లెల్ల విసఁ బ్రువ్వఁగఁదిట్టఁగ వించు మ్రుక్కి వొ
చ్చెడు మది యెప్పుడున్ జెవులు చీములు గట్టెడుఁ గౌరవేశ్వరా"
(ఉద్యో 2—10)

'చెవులు చీములు గట్టెడు' అనగా 'ప్రజలు నిన్ను తిట్టు తిట్లు విని విని, మా చెవులు పుండ్లుపడి, చీము పట్టినట్లు బాధపడుచున్న'వని యర్థము. 'మే మా తిట్లు విని సహింప లేకున్నా'మని భావము

"చీములు గట్టు=(చెవులు) చీము పట్టినట్లు బాధపడు" అని సూ. వి. పట్టి చెవులు చీము పట్టుట ఉండదు గావున, ఈ యర్థ ముచితము కాదు.

"చెవులు, చీములుగట్టెడుస్=పుండ్లై చీము కూడినట్లు నొచ్చెడుమ" అని టీక ఇదే సరియైన అర్థము.

4. 'మాకు కుడుము-మీకు వ్రక్క'

"ఎదిరిం దమ యట్టుల కా
మది దలఁచినఁ బోనగుఁ గాక మాకుం గుడు మిం
డిదె మీరు వ్రక్కఁ గొనుఁడని
చదు రడిచిన మనసుపొందు చక్కంబడునే?" (ఉద్యో. 1—312)

ఇది ధర్మరాజు సంజయునితో అన్నమాట దీనికి—

"య థాత్మనః పశ్యతి వృత్త మేవ
తథా పరేషా మపి సోఽభ్యుపైతు" (25—9)

అని మూలము 'అతడు (ధృతరాష్ట్రుడు) తన విషయము నెట్లో అట్లే యిత రుల విషయమును గూడ నాలోచింపవలె'నని యర్థము అట్లాలోచింపక, స్వార్థ పరుడై ప్రవర్తించిన సంధి కుదురదని భావము.

ఆ భావమును తిక్కన 'మాకు కుడుము—మీకు వ్రక్క' అను సామెతతో విశదము చేసినాడు 'మాకు కుడు మిచ్చి, మీరు ముక్క తీసికొను'డని, చదురడిచినన్=ఏమో తెలివిగా మాటలాడిన, మనసుపొందు చక్కబడునే=మనసులు కలిసి పొత్తు కుదురునా? అని పద్యార్థము

'మాకు కుడుము—మీకు ముక్క' అనునది స్వార్థపరత్వము దెల్పు లోకోక్తి. మాకు పెద్ద భాగము, మీకు కీసపాలు—అని దాని భావము.

సూ. వి. శ. ని కూడా 'కుడుము—మోదకము, భక్ష్య విశేషము' అని యర్థము చెప్పి, ఆ యర్థమున కీ పద్యము నుదాహరించినవి. నిఘంటువులు తెలుపవలసినది లోకోక్తిని గాని, దానిలోని ఒక పదమున కర్థము గాదు. 'కుడుము'న కర్థము తెలిసినంత మాత్రమున లోకోక్తి భావము తెలియదు అది తెలియక పద్య మర్థముకాదు.

5. 'చూపి చెప్పు'

"మాకుం గుడు మిం డిదె మీరు వ్రక్క గొను డని, చదురడిచిన మనసు పొందు చక్కంబడునే?"—"అని చూపి చెప్పి వెండియు" అన్నచోట, టీకా కర్తలు—"చూపి చెప్పి—పొడిచి పలికి" అని అర్థము వ్రాసినారు

ఆ యర్థము సరియైనదిగా నాకు తోచలేదు 'చూపించి చెప్పి' అను అర్థమును అక్కడ పరివడదు నిఘంటువులు 'చూపు' 'చెప్పు' అను పదముల కర్థము చెప్పినవేగాని, 'చూపి చెప్పు' ఒక పదముగా తీసికొని అర్థము చెప్పలేదు.

కాని, నిజానికి అది ఒక పదమే. అది ఒక విధమైన పలుకుబడి 'పట్టి యిచ్చు' వంటిది తిక్కన మరియొకమారును ప్రయోగించియున్నాడు.

"ఏ నట్లు చూపిచెప్పితిఁ
గాని యది రణంబు సాడి గామి యెఱుఁగుదున్
రానిను నీదువయి దు
శ్శైనికులను వెఱవ కాయితము గమ్ము నృపా"
(శల్య. 2—105)

ఇది మడుగు వెడలి వచ్చిన దుర్యోధనునితో ధర్మరా జన్నమాట

దుర్యోధనుడు—"మీరు పలువురు నేనొక్కడను. మీ రందరును ఒక్కమాటుగా నామీద కవియుట ధర్మమా?" అన్నాడు

ధర్మజుడు—"ఈ ధర్మమును అభిమన్యుని వధించుటలో నీవు పాటించితి వటోయి?" అని యెత్తి పొడిచినాడు

దుర్యోధనుడు నిరుత్తరు డైనాడు అతని దీనస్థితినిచూచి, మరల ధర్మరాజు, "ఓయీ, నీ రణ ధర్మ మే పాటిదో తెలియుటకు—అభిమన్యుని వృత్తాంతము చూపి చెప్పితిని—తార్కాణించితిని కాని, అది ధర్మముకాదని యెరుగుదును నేను ధర్మమునే పాటింతును నీవు భయపడవలదు యుద్ధమునకు సిద్ధముక"మ్మన్నాడు.

కాబట్టి, "చూపి చెప్పు" అనునది—'తార్కాణించు' దృష్టాంతీకరించు' అను నర్థము నిచ్చు పదబంధముగాని, 'చూపు—చెప్పు' అను నర్థముల నిచ్చు రెండు క్రియలు కావు.

తిక్కన పద్యము ఆయన సొంత రచన. మూలములో ధర్మరాజు ఆవిధముగా అన్నట్లు లేదు.

"య ద్యేకశ్చ హంతవ్యో బహుభి ర్ధర్మ మీవ తు
త దాభిమన్యుం బహవో నిజఘ్ను స్త్వ న్మతే కథమ్"

అన్నంత వరకే యున్నది. (33—58)

కాబట్టి 'చూపి చెప్పుట' తిక్కన సొంతము.

మొదటి పద్యమునను,—'చూపి చెప్పి=(ధృత రాష్ట్రుని వర్తనము 'మాకు కుడు మిచ్చి—మీరు ముక్క తీసికొను' డన్న ట్లున్నదని) దృష్టాంతీక రించి' అనియే అర్థము.

ఇది భాషాభిజ్ఞులు పరిశీలించి పరిష్కరింపవలసిన క్రొత్త విషయము.

6. 'పిల్లిపట్టిన యీలువు'

విదురుడు ధృతరాష్ట్రునితో నన్న మాట—

"నీవుఁ గొడుకు వారి నెఱిలేక పఱిచితి
రదియు చాలు, నుచితమ్మైన పాలు
వంచి యిండు; పిల్లి పట్టిన యీలువు
సేసియున్న నేల చెల్ల నేర్చు" (ఉద్యో 2—25)

పెక్కు ప్రతులలో పాఠ మిట్లే యున్నది 1917—వావిళ్ల ప్రతిలోను, 1925 నే పార్థసారధి అయ్యంగారి టీకాసహితప్రతిలోను 'యీరువు' అను పాఠమున్నది. 'ఈలువు' అను పాఠముకంటెను, 'ఈరువు' అను పాఠమే సాధువన దగియున్నది. ఎట్లనగా.—

ఈలువు అనగా పాతివ్రత్యము —

"ఎత్తికోలు ప్రయత్న, మీలువు మానంబు" (ఆంధ్రనామశేషము—53). పాతివ్రత్యమునకును, పిల్లికిని సంబంధములేదు మరియు, భాషలో 'నోము పట్టుట' 'వ్రతము పట్టుట' కలదుగాని 'పాతివ్రత్యము పట్టుట'లేదు. కనుక 'పిల్లి పట్టిన యీలువు' అను పాఠమున అర్థము సరిపడదు.

'ఈరువు' అనగా మాంసము—

"పిల యీరు వెఱచి నంజుడు
పిల నన నివి పరఁగు మాంసమునకు"

(ఆం సం తిర్యగ్వర్గ—19)

మాంసమునకును, పిల్లికిని సంబంధము సహజము కనుక 'ఈరువు' పాఠమే పద్యార్థమునకు సరిపడునది.

ఈ 'పిల్లి పట్టిన యీరువు' నే, గౌరన తన 'హరిశ్చంద్ర'లో 'పిల్లి పట్టిన దొబ్బ' అని వాడినాడు

"కడుబంద ధూర్త నక్షత్రకు నోరు
దొడుకుట పాపంబు; దుర్మార్గుఁ డితఁడు
ఖిల్లిదు చేతిలోఁ బడిన ధనంబు
పిల్లి పట్టిన దొబ్బ, ప్రిదులక పోయె
నింకఁ గౌశికు ఋణ మేమిటఁ దీర్తు" (ఉ భా 1310)

'దొబ్బ' యన్నను మాంసమే—

"తారసించినచోట దారునఁ జొరఁబాఱి
యొకటి రెంటిని దొబ్బ లురల నడుచు"

(మను 4—42)

'పిల్లి పట్టిన దొబ్బ' అన్న గౌరన రచనను బట్టియు 'ఈరువు' పాఠమే సరియైనదని యేర్పడుచున్నది ఈ పాఠమున, కౌరవుల వశమైయున్న పాండవ రాజ్యభాగము, పిల్లిపట్టుకొన్న మాంసపు ముక్కవంటిదని అర్థము

మాంసపు ముక్కను పట్టుకొనిపోయిన పిల్లి, మూలను చేరి మూలుగు చుండునే గాని, అదలించినను, ముక్కను వదలిపోదు. అట్లే కౌరవులును, పాండవుల భాగము నాక్రమించుకొని, ఇమ్మన్న నియ్యక పేచీలు పెట్టుచున్నారని భావము.

మీ రీ విధముగా పేచీలు పెట్టుట, 'ఈరువుఁ బట్టిన పిల్లి' కథగానున్న దనియు, ఇది చెల్లదనియు పద్యమున విదురుడు ధృతరాష్ట్రునితో నన్న వ్యమునవాక్యార్థమ్ము

ఒక విశేషము—గట్టిగా రెండు తగిలించితే, పిల్లి మాంసపు ముక్కను వదలి పారిపోవును ఆ విధముగానే కౌరవులును దండోపాయముచేత, పాండవు, భాగమును వదలుదురేగాని, మంచి మాటలతో ఇయ్యరన్న వ్యంగ్యము కూడా; ఈ లోకోక్తిని ప్రయోగించుటలో ఉన్నది.

ఈ లోకోక్తియొక్క సరియైన రూపము, సరియైన అర్థము ఇంత కాలముగా పండితుల దృష్టికి రాక మరుగుపడియున్నవి. 'ఈరువు జేసి' అని టీకా కర్త పాఠము అది సరికాదు 'ఈరువుసేసి' (ఈరువుగా చేసి) అని సరియైన పాఠము ఈ పాఠమే అన్ని ప్రతులలోను ఉన్నది

"పిల్లికిఁ బట్టిన గజ్జివలెఁ జేసి యున్నచో" అని వారి టీక.

"పిల్లికిఁబట్టిన గజ్జివలె గట్టిపట్టు పట్టిరేని పని యెట్లుసాగును" అని వారు వ్రాసిన తాత్పర్యము

'ఈరువు—గజ్జి' యనుట సరికాదు. కావున వారి అర్థము తాత్పర్యము గూడా సరియైనవి కావు

లోకోక్తితో గూడిన యీ భారతపద్యమును సూ. ని. వా. ని. 'పిల్లి'ల 'ఈలువు', 'ఈరువు', అను పదములలో దేని క్రిందనైనను ఇచ్చియుండవలసి నది. కాని ఇయ్యలేదు.

పదబంధ పారిజాతము—"పిల్లి పట్టిన యీలువు—విడదీయరానిది" అని అర్థము చెప్పి, ఈ భారత పద్యమునే ఉదాహరించినది.

7. 'తిండి కాఁడు'

సూ ని వా ని కూడా "తిండికాఁడు" = 1. తిండిపోతు మిక్కిలి తిను వాడు (శ ర) 2 దురాశావంతుఁడు, లోభి" అని యర్థముచెప్పి, ఈ క్రింది రెండు పద్యములను ఉదాహరించినవి.

"విను కొడుకుగొన్న వేఁదుఱు
కొని కొట్టిన తిండికాఁడు కుటిలుం డతఁ డా
జనపతి చందము ధర్మజా
ననుపమశీలంబు నెఱుఁగు దది యట్లుండెన్"
ఉద్యో. (1—56)

"జున్ను డెప్పరంపుఁ జొబ్బైన చఱి నున్నఁ
జూచి విఱుగఁబడుట చూడ కాత్మఁ
దీవుఁ గోరి యుఱుకు తిండికాఁడును బోలె
నయితి వగచు టింక ననుచితంబు"

(స్త్రీ 1—19)

'తిండిపోతు' అను నర్థము ఈ రెండు పద్యములలోను సరిపడదు కనుక ఆ యర్థమున కీ పద్యములను చూపుట యుచితముకాదు 'దురాశావంతుఁడు' అన్న అర్థము సరిపడి యున్నది కాని, 'కొట్టిన తిండికాఁడు' అనగా అర్థమేమో యేర్పడుట లేదు.

1917 వావిళ్ల ప్రతిలో 'క్రొవ్విన తిండికాఁడు' అను పాఠాంతర మున్నది. 'రాజ్య సంపదచేత మదించిన దురాశావంతుడు' అని యర్థము చెప్పవచ్చునేమో! కాని, అదియును సరియైన పాఠముగా తోచుటలేదు. ఏమైనను 'కొట్టిన' అనుట కంటెను 'క్రొవ్విన' అనుటే కొంత మేలేమో నని నా యభిప్రాయము.

'కొట్టిన, క్రొవ్విన' అను విశేషణముల మాట అట్లుండగా, 'తిండికాఁడు' (దురాశావంతుడు) అను పదమును ప్రయోగించుటకును మూలములో ఆధారములేదు.

అందు, 'కౌరవులు ధృతరాష్ట్రుని యెఱుకమీదనే పాండవులను వంచించినారు. విదురు డెంతగా బోధించినను వినక ధృతరాష్ట్రుడు కొడుకునే అనుసరించుచున్నాడు' అని మాత్రమే యున్నది

"ధృతరాష్ట్రస్య విదితే వంచితాః పాండవాః పరైః
విదురే ణానునీతోఽపి పుత్రమే వానువర్తతే"
(ఉద్యో. 5—6)

అని మూలము దురాశాపరుడైన కుమారు ననుసరించుటనుబట్టి ధృతరాష్ట్రుడును దురాశాపరుడే యన్న భావముతో తిక్కన 'తిండికాఁడు' అను పదమును ప్రయోగించి యున్నది

రెండవ పద్యమునకు మూల మిది —

"మధు యః కేవలం దృష్ట్వా ప్రపాతం నానుపశ్యతి
స భ్రష్టో మధులోభేన శోచ త్యేవం యథా భవాన్"
(స్త్రీ 1—38)

'తేనెమీది యాశచేత, తాను పడిపోవుట నాలోచించుకొనక పైకెక్కి పడిపోయినవాడు నీ వలెనే విలపించును' అని యర్థము

ఇందులో, తేనె నాశించు భ్రష్టుడైనవాడు ఉపమేయముగను, పాండవ భాగము నాశించి, చెడి, పశ్చాత్తప్తుడై యున్నధృతరాష్ట్రుడు ఉపమానముగను చెప్పబడినది. తిక్కన సందర్భోచితముగా మార్చివేసినాడు

మూలములోని మధులోభినే తిక్కన 'తీపిఁ గోరి యుఱుకు తిండికాఁడు' అన్నాడు. కనుక పద్యములోని 'తిండికాఁడు' అను పదానికి 'దురాశావంతుడు, లోభి' అని సూ ని చెప్పిన యర్థమే సరియైనది. తిక్కన ప్రయోగించు పదములకు—ఆయన హృదయము ననుసరించి అర్థము చెప్పవలెనేగాని, మన మామూలు అర్థములు చెప్పిన కుదురదు ఈ తత్త్వమును సూ ని కనిపెట్టినది శ. ర కనిపెట్టలేదు

తిక్కన 'తిండిపోతు'ను, 'తిండిపో'తనియే అన్నాడు.

"తిండిపోత నీకు భండనం బేటికిఁ
గడవఁ జేరి మనసు కాంక్ష దీఱ
నోపు కొలఁది మ్రింగి యూరక నీ వింటి
కడన యుండు మింక నడిచి వడక"
(ద్రోణ 4—239)

ఇది కర్ణుడు భీము నెత్తి పొడుచుచు నన్నమాట

'తిండిపో'తని భీము ననుట యుచితమేగాని, ధృతరాష్ట్రు ననుట యుచితముకాదు కావున, ఆతని విషయమున తిక్కన వాడిన 'తిండికాఁడు' అను మాటకు 'తిండిపో'తని యర్థము వ్రాయరాదు

8. 'డెందానం జేయివెట్టుకొని నిద్రించును'

"కాన యవశ్యముఁ బెనకువ
గాని యుపాయమున *బగను గడతేర్చు ధృతిం
బూని నడచు నెవ్వఁడు డెం
దానం జెయి వెట్టికొని యతఁడు నిద్రించున్"
(ఉద్యో 3—19)

'రొమ్మున చెయ్యిపెట్టుకొని నిద్ర పోవును' అనుట వాడుక 'హాయిగా నిద్ర పోవును' అని యర్థము 'ఎట్టి విచారము లేక సుఖముగా నున్నా'డని భావము

"సుఖం ప్రశాంతః స్వపితి హిత్వా జయ పరాజయౌ
జాతవైర శ్చ పురుషో దుఃఖం స్వపితి నిత్య దా"
(71—59)

'ప్రశాంతుడు జయ పరాజయముల మాట పెట్టుకొనక సుఖముగా నిద్రించును. వైరచింతగలవానికి సుఖ నిద్ర ఉండనే ఉండదు' అని యర్థము

'డెందానం జెయి వెట్టుకొని నిద్రపోవును' అను లోకోక్తిలోనున్న రుచి 'సుఖముగా నిద్రించును' అనుటలోలేదు. అందుకే తిక్కన లోకోక్తిని వాడినాడు. తిక్కనకుముందే నన్నయభట్టు వాడినాడు.

"వినుత ధనుర్విద్యా విదు
షునగర్ణుఁ సహాయుఁ బడసి కౌరవ విభుఁడ
ర్జును వలని భయముసెడి లో
మ్మునఁ జేయిడి నిద్రపోయె ముదితాత్ముండై"
(ఆది 6—63)

ఈ పద్యమునకు మూల శ్లోక మిది—

"దుర్యోధన స్యాపి తదా కర్ణ మాసాద్య పార్థివ
భయ మర్జున సంజాతం క్షిప్ర మంతరధీయత"
(138—24)

'కర్ణుడు సహాయుఁడు కావడముతోనే దుర్యోధనునకు అర్జునునివలని భయము తొలగిపోయినది' అని యర్థము

'భయముపోయి దుర్యోధనుడు సుఖ పడ్డాడు' అను నర్థము వచ్చుటకు నన్నయ లోకోక్తిని వాడినాడు.

సూ. ని యీ లోకోక్తిని గుర్తించి, నన్నయ తిక్కనల పద్యములనేగాక, యీ క్రింది పద్యమును గూడా ఇచ్చినది

"తాఁ బ్రజయు నొవ్వ, కయ పగఱగాత్రములనె చీకాకు పఱుచు, నృపతి డెందానఁ జేయిడి నిద్ర వోవు" (ఆము. 4—261)

9. 'ముక్కుఁద్రాటఁ గాలు గ్రుచ్చుట'

రాయబారిగా వచ్చిన కృష్ణుని, దుర్యోధనుడు తన ఇంట భుజింపవలసినదిగా కోరినాడు కృష్ణుడు, "దుర్యోధనా! దూతలు తాము వచ్చిన పని అనుకూలముగా నెరవేరిన తరువాత, విందు లారగించుటయు, పూజలందుటయు నుచితము కావున నేను వచ్చినపని అనుకూలము కానిమ్ము, పిమ్మట నీవును—నీ మంత్రులును చేయు మర్యాదలను నేను గ్రహింతును" అన్నాడు

అప్పుడు దుర్యోధనుడు, "కృష్ణా! నీ వట్లనుట యుక్తముకాదు నీవు వచ్చినపని అనుకూలము కావచ్చును, కాకపోవచ్చును అది యెట్లైనను ని న్నర్చించుట మాకు ధర్మము" అన్నాడు

"కృతార్థా భుంజతే దూతాః పూజాం గృహ్ణంతి చైవ హ
కృతార్థం మాం సహామాత్యం సమర్చిష్యసి భారత" (90—19)
"న యుక్తం భవ తాస్మాను ప్రతిపత్తు మసాంప్రతమ్
కృతార్థం వాఽకృతార్థం చ త్వాం వయం మధుసూదన (,,—20)
యతామహే పూజయితుం దాశార్హం న చ శక్నుమః" (,,—21)

అని మూలము. ఈ మూలములోని దుర్యోధన వాక్యమును తిక్కన యీ క్రింది విధముగా చెప్పినాడు

"వేగపడుట మేలె! వినుము కార్యము దీఱు
దీఱకుండు దాని తెఱఁగు దగిన
యప్పు డాడరాదె! యిప్పుడు ముక్కుఁద్రాటఁ
గాలు గ్రువ్వనేల కమలనాభ!" (ఉద్యో 3—220)

ఈ పద్యములోని 'ముక్కుఁద్రాటఁ గాలుగ్రుచ్చు' అను లోకోక్తిని అన్వయించుటలో పండితుల యభిప్రాయములు భిన్నముగా నున్నవి

(1) టీకాకారులు — "ముక్కుద్రాటన్ = ముక్కునం గుట్టియుండు త్రాటిలో, కాలు, గ్రువ్వంగన్—దూర్చుట, అగునె = సరిపడునా!—పని కావచ్చును, గాకయుం బోవచ్చును దాని విషయము సమయము వచ్చినప్పుడు మాటలాడరాదా? ఇప్పుడే ముక్కుత్రాటిలోఁ గాలుంగూడ దూర్చినట్లు త్వరపడవచ్చునా" అని చెప్పినారు

(2) పదబంధ పారిజాతము—"ముక్కుద్రాట గాలుగ్రుచ్చు అదేపనిగా తగాదాకు—పిలుచు అని అర్థము చెప్పి, ఈ క్రింది ప్రయోగమును ఇచ్చినది

---

* 'బగఱ' అని అచ్చుప్రతుల పాఠము. సరికాదు ఈవిషయమునుగూర్చి 'తిక్కన అనువాదములో అనుమానములు' అను వ్యాసములో నేను వివరించి యున్నాను. (మా. 1962—జనవరి 'సాహితి')

లబు బుక్కులు ఎట్ల ల దిన చెప్ప
గాదని ముకుఁ ద్రాటఁ గాలు దుయ్యకుము"

(హరి ద్వి భా 1482)

(హరి. ద్వి. భా. ఏ గ్రంథమో సంకేత సూచికలో తెలుపబడలేదు)

ఇక నా మాట—

కృష్ణా! నీవు పెట్టుకొని వచ్చినపని పెద్దది. కావున వేగిరపడుట మేలు గాదు అపని తీరవచ్చు తీరకపోవచ్చు దాని సమయము వచ్చినప్పుడు దానిమాట లాడుదువుగాక ఇప్పుడు నా ప్రార్థనమును తిరస్కరించి, ముకుఁ ద్రాటఁ గాలు ద్రుక్కనేల—నా మనసు నొప్పింపనేల?—అని యర్థము చెప్పుట ఉచితమని నా యభిప్రాయము

ముక్కుత్రాడు పశువునకు బాధ కలిగించునది. ఆ త్రాటిలో కాలిని దూర్చుట, ఆ పశువును మరింత బాధించుట యగును కాబట్టి, ముకుఁ ద్రాటఁ గాలు దూర్చుట—యనగాఁ బాధ కలిగించుట యనియే భావము

మరియు, దుర్యోధనుని పశువుగను, రాజ్యవ్యవహారమును ముక్కు త్రాడుగను, కృష్ణుని తిరస్కారము ఆ త్రాటిలో కాలుదూర్చుటగను భావింప వచ్చును

నాకు తోచినమాట మనవి చేసినాను పెద్ద లింకను విచారింతురుగాక

సూ ని "ముకుఁ ద్రాడు=నాథము, ఎడ్లకు ముక్కునఁ గుచ్చెడు దారము" అని అర్థము చెప్పి, ఆ యర్థమున కీ పద్యమును చూపినది ఏమి ప్రయోజనము?

"ముక్కుత్రాట కాలుదూర్చుకొన్నట్లు' అనుటయును గలదు అది స్వయంకృతాపరాధమును తెలుపుమాట

పశువు ముక్కుత్రాటిలో కా లిరికించుకొనుటయు, చూచినవారు తప్పించుటం అప్పుడప్పుడు తటస్థించుచుండును

10. 'మడుఁగు చీరయందు మసిదాఁకినట్లు'

"మడుఁగుఁ జీరయందు మసిదాఁకినట్లు మీ
పత్కులమునఁ గల్మషంబు కౌర
వేంద్రు కతనఁ బొందె నింతయుఁ బాపంగ
నీవ నేర్తు కార్యనిపుణ హృదయ!"

(ఉద్యో 1—295)

ఇది సంజయుని వాక్యము—'కార్యనిపుణ హృదయా ! ధర్మరాజా! దుర్యోధనుని దుర్వర్తనము వలన, మడుగు చీరకు మైలసోకినట్లు పవిత్రమైన మీ కులము కలుషితమైనది ఆ కాలుష్యమును పాపుటకు నీవే సమర్థుడవు' అని యర్థము యుద్ధము పాపహేతువు గావున, నీ వా పనికి తలపెట్టవలదని—యుందలి భావము

సంజయు డీ విధముగా నున్నట్లు తిక్కన చెప్పినాడు గాని, మూలములో నిట్లు లేదు

"ధర్మరాజా! మీరు మంచి కులమున జన్మించినవారు 'మృదు హృదయులు వదాన్యులు హ్రీమంతులు కార్యనిశ్చయజ్ఞులు' అని పేరు పడినవారు. మరియు మీ పరాక్రమము సాటిలేనిది ఇట్టి మీరు నీచ కార్యములకు పాలుపడుట భావ్యముకాదు. మీ వర్తనమున ఏ మాత్రపు లోపము పొటమ్మినను, అది శుభ్ర వస్త్రమున కంటిన కాటుక చుక్కవలె నెల్లరికిని తెల్లమై, మీ చరిత్రమునే కలుషితము కావించును యుద్ధము పాపకృత్యము నరక మూలము అదియును గాక, యుద్ధమున జయపరాజయములు నిర్ణయింపరానివి. కాబట్టి వీవు యుద్ధము మాట తలపెట్టవద్దు" అని యున్నది

"కులే జాతా హ్యనృశంసా వదాన్యా
హ్రీనిషేవాః కర్మణాం నిశ్చయజ్ఞాః" (24.5)
"న యుజ్యతే కర్మ యుష్మాసు హీనం
స త్వం హి వ స్త్వాదృశం భీమసేనాః
ఉద్భాసతే హ్యంజన బిందు వ త్
చ్ఛుభ్రే వస్త్రే యాద్భవే త్కిల్బిషం తే" (24.6)
"సర్వ క్షయో దృశ్యతే యత్ర కృత్స్నః
పాపోదయో నిరయో భావ సంస్థః
క స్తత్ర కుర్యా జ్జాతు కర్మ ప్రజానన్
పరాజయో యత్ర సమోజయశ్చ" (24.7)

నా బుద్ధికి సంస్కృత సంజయుడు చెప్పినదే సముచితముగా తోచినది తెనుగు సంజయుని ప్రసంగము ఆక్షేపమున కవకాశ మిచ్చుచున్నది కారణములు మనవి చేసెదను

దుర్యోధనుని దుశ్చేష్టితములవలన కళంకితమైనది అతని చరిత్రమే గాని, కౌరవ వంశ మంతయును గాదు నిష్కళంక చరిత్రుడు ధర్మజు డుండగా, వంశ మంతయు కళంకితమైన దనుట పొసగనిమాట

ఎవరికి వచ్చిన చెడ్డపేరును వారే పొపుకొనవలెగాని, ఇతరులు పాపజాలరు అది అసంభవము. కాబట్టి, "కౌరవేంద్రు కతన గలిగిన కల్మషంబు బాపంగ నీవ నేర్తు" వనుట యుక్తి యుక్తముకాదు

దుర్యోధనుడు మంచి మనసు చేసికొని, సమర సన్నాహము మాని, పాండవుల భాగము పాండవుల కిచ్చివేయవలె అప్పటికిగాని, అతనికి వచ్చిన చెడ్డపేరు పోదు అది పోయిననేగాని, కౌరవ వంశమునకు గలిగిన కల్మషము పోదు కనుక యుద్ధ ప్రయత్నము తగదని బోధింపవలసినది దుర్యోధనునకుగాని, ధర్మజునకు కాదు

ధర్మరాజు తాము పెద్దలన్నములు మరచియు, రాజ్యాశ వదలుకొనియు, త్యాగమూర్తి యనిపించుకొన నెంచియు, సంజయుని యుపదేశము ప్రకారము, చేతులు ముడుచుకొని యుండును గాక దుర్యోధనునివలన కులమునకు వచ్చిన అపఖ్యాతి పోవునా? ధర్మజుని సహనము, త్యాగము ప్రకటము లగునేగాని, ఆ యపఖ్యాతి పోదు పైపెచ్చు మరింత హెచ్చి, శాశ్వతముగా నిలిచిపోవును

కాబట్టి, దుర్యోధనునివలని దుష్కీర్తి పోవుటకు—నీవు యుద్ధము మానుకొమ్మని ధర్మజునకు బోధించుటలో ప్రయోజనము లేదు ఔచిత్యమును లేదు యుద్ధమునకు దిగినచో, మీ మంచి పేరుకు మచ్చువచ్చును గావున, నీ వా పనికి దిగవలదని బోధించుటలోనే ప్రయోజనము—ఔచిత్యమును ఉన్నవి

ఇది నా యభిప్రాయము. పెద్దలే మందురో!

11. 'నేలఁబెట్టి కాలఁజమరు'

"నిజఘటకు మిగిలి యుత్తరు
గజ మమ్మద్రేశు రథముఁ గదిసి తురంగ
వ్రజము పయి కడరి కడు న
క్కజముగ వెస నేలఁబెట్టి కాలం జమరెన్"

(భీష్మ 1—282)

'నేలఁబెట్టి కాలఁజమరు' అనునది, 'హింసించు, బాధించు' అను నర్థము లను దెల్పు జాతీయము ఈ పద్యమున కర్త ఏనుగు గావున, 'గుఱ్ఱములను కాలి క్రిందవేసి త్రొక్కినది' అన్న వాచ్యార్థము గూడా సరిపడుచున్నది

సూ. ని 'చమరు' అను పదముక్రింద, ఈ జాతీయమును తెల్పినది. కాని భావమును తెలుపలేదు అక్కడ ఈ పద్యమును గూడా చూపలేదు

నేలబెట్టి కాలరాచు' అని యీనాటి వాడుక సూ. వి ఈ వాడుకనో తెల్పి 'మిక్కిలి పీడించు' అని అర్థము చెప్పి, ఈ క్రింది పద్యము నిచ్చినది.

"నెఱియ సారసములు దమ్మి నేలఁబెట్టి
కాల రాచుచు నున్నాడు కలువల చెలిక

వెతలఁ బడఁజాల మిది రాహువేణి యనుచు
నతివ పదములఁ బడెనన నడుగు లమరు"

(బిల్హ. 2—117)

'చంద్రుడు కమలములను వేల బెట్టి కాల రాచుచున్నాడు'— అనుటలో గల శ్లేష చమత్కారమును పాఠకులు గుర్తింపగలరు.

12. 'గుండ్లు తేలి బెండ్లు మునిగినట్లు'

"పొదివిన య గ్గురు ప్రాపున భవదీయ సైనికులు గొందఱు కృష్ణులం జేరి పరాక్రమించుట గుండ్లు దేలి బెండ్లు మునింగినట్లయ్యె" (ద్రోణ 3 67)

ఈ సంగతి మూలములో లేదు. తిక్కన సొంత రచన

కృష్ణార్జునులకు వెరచి పరుగెత్తవలసిన కౌరవ సైనికులు పరాక్రమించి, కృష్ణార్జునులపై గవిసి రనియు, అది గుండ్లు తేలి బెండ్లు మునిగినట్లు—అపూర్వముగా కనుపట్టిన దనియు నర్థము.

'గుడ్లుతేలి బెండ్లు మునిగిన' వనునది విపరీత సంఘటనను దెల్పు జాతీయము. ఈ జాతీయమును నాచనసోముడును వాడినాడు.

"మనుజాంగనలం బట్టుట
దనుజాలకుం జెల్లగాక దనుజాంగనలన్
మనుజాలు పట్టుటకును దొర
కొనిరే! బెండులు మునింగి గుండులు దేలెన్"

(ఉ. హరి. 5 218)

సూ ని. 'గుండు' అను పదముక్రింద 'గుండ్లు తేలి బెండ్లు మునిగినట్లు' అను జాతీయమును తెలిపి, భారత వచనమును చూపి యుండవలసినది. చూపలేదు

'బెండు' క్రిందనైనను 'బెండులు మునిగి గుండలు తేలు' జాతీయ మని తెలుపలేదు 'బెండు=జీలుగు' అని అర్థము చెప్పి, 'ఉ. హరి'. పద్యము నుదాహరించినది. ఆ యర్థము, పద్య భావము తెలియగోరువారి కుపకరింపదు

'బెండు=జీలుగు" అనుటయును సరికాదు

'జీలుగు' చెట్టుగాని, 'బెండు' కాదు ఆ చెట్టు, ఎండిన పిమ్మట బెండగును. అప్పుడే నీటిపై తేలునది లోకములో జీలుగు బెండే కాదు జొన్న బెండు, సజ్జ బెండు మొదలగునవియు నున్నవి కాబట్టి 'బెండు=జీలుగు. జీలుగు భెండు' అని చెప్పుట సరికాదు.

సూ. ని. 'జీలుగు' క్రింద ఈ పద్యముల నుదాహరించినది.

"ప్రేలకు జీలుగు పెరిఁగిన
మూలెకుఁ గంబంబు గాదు" (ఉ హరి. 3 50)

"జీలువు పెరిఁగిన మూలెకంబము గాదు
గొడ్డుఁ బెంచినఁ బాడిఁ గోవు గాదు" (నీతి 70)

పెరుగుట చెట్టుగా నున్నప్పుడేగాని, ఎండి బెండైన పిమ్మట పెరుగదు కనుక 'జీలుగు=ఒక జాతి చెట్టు' అని చెప్పనగును జీలుగు చెట్టున కల్లువచ్చును 'జీలుగు'నే—నన్నెచోడకవి 'జీటీక' యని వాడినాడు

"జీటీక కల్లు ద్రావి.. ... వన్నెకాంతలు రమింతురు తద్విపినాంత రభూలన్" (కు. సం 6 45)

"జీటీక కల్లు=జీలుగు చెట్టు కల్లు" అని టీక ("వన్య కాంతలు" అని సూ. ని. సవరణ)

13. 'కప్పయెలుఁగు పాము'

"నిను నవలీల దాఁటి ప్రజ నేలకుఁ గోలకుఁ దెచ్చుచున్న య
ర్జును దలయెత్తియైన నటు మూడవు పాండవ పక్షపాతి! నీ
మన మటుగాన యెప్పుడును మాదెసఁ గప్ప యెలుంగుఁ బామవై
యునికి యెఱుంగవచ్చె, నటు లూఱటగా వర మిచ్చినాఁడవో!"

(ద్రోణ 3 107)

"అతిక్రాంతే హి కౌంతేయే భిత్వా సైన్యం పరంతప
జయద్రథస్య గోప్తార స్సంశయం పరమం గతాః" (94. 8.)

"జానామి త్వాం మహాభాగ పాండవానాం హితే రతం
తథా ముహ్యామి చ బ్రహ్మన్ కార్యవత్తాం విచింతయన్"

(,,—11)

"అస్మా న్న త్వం సదా భక్తా నిచ్ఛ స్యమితవిక్రయ
పాండవాన్ సతతం ప్రీణా స్యస్మాకం విప్రియే రతాన్" (,,—13)

అని మూలము 'ఏమయ్యా! అర్జునుడు మన సైన్యమును భేదించుకొనియే పోయినాడా? ఎవరైననూ నమ్మదురా? నీవు పాండవప్రియుఁడవు నే నెరుగుదును ఎరిగియు కార్యార్థినై నిన్ను నమ్ముచున్నాను మేము నీకు భక్తులమై యున్నను, నీవు మ మ్మిచ్చగింపవు మాకు విరోధులైన పాండవులను ప్రేమింతువు'—అని యర్థము

ఈ యర్థమే తిక్కన పద్యములో,—'పాండవ పక్షపాతి' అను సంబోధనమువల్లను, 'అర్జునుడు మన సేనను నేలకు కోలకు తెచ్చుచున్నను తల యెత్తియైనను అటుచూడవు', 'నీ మనస్సెప్పుడును ఆటే', 'నీవు కప్ప యెలుగు పామువు'; 'మాకు ఊఱటగా వరమిచ్చినావటయ్యా?' అను జానుతెనుగు పలుకుబళ్ల వల్లను—ఏంతో మనోహరముగా రూపొందినది

నేలకు—కోలకు తెచ్చుట' యనగా ఛిన్నాభిన్నము చేయుట

'కప్ప యెలుగుపాము' అనగా, కప్పవలె అరచుచు, దగ్గరకు వచ్చువారిని కాటువేయు పామువలె, మంచి మాటలతో నమ్మించి, ద్రోహము చేయువా డని భావము

ద్రోణుడు సైంధవుని రక్షింతునని చెప్పి, అర్జునునిచేత చంపించినా డని దుర్యోధనుని దెప్పుడు మాట

'కప్ప యెలుఁగుపాము' జాతీయము సూ ని, పద పారి చెప్పినవి. ఇట్లే 'మేక వన్నె పులి' అనుటయును కలదు

"తెలియ నిది మేక వన్నియపులి యటంచు" (రాధికా 3—19)

'పయోముఖ విషకుంభము', 'గోముఖ వ్యాఘ్రము' అను సంస్కృత లోకోక్తులను ఈ భావమును తెల్పునవే

"తనకు నేల యమృతధామాఖ్య గోముఖ
వ్యాఘ్ర మనఁగ నిట్టివాడె సుమ్ము" (కళా. 6.268)

14. 'తేనె పూసిన కత్తి'

"నిను నమ్మి యొండు వలనికిఁ
జనక జయద్రథుఁడు నిలిచె సైన్యములో నా
తనిఁ జంపెడు దేనియ పూ
సిన కత్తివిగాక మానిసివె యూహింపన్"

(ద్రోణ 3—108)

ఈ పద్యమును మూలమునకు భావానువాదమే. మూలములోని భావమిందు సంగ్రహింపబడినది 'తేనె పూసిన కత్తి' యనునది మాత్రము మూలములోని మాట.

"న హ్యహం త్వాం విజానామి మధు దిగ్ధ మివ క్షురమ్" (94 14)

"న దాస్యచ్చే ద్వరం మహ్యం భవాన్ పాండవ నిగ్ర హే
వావారయిష్యం గచ్ఛంత మహం సింధుపతిం గృహాన్" (,,—15)

"మయా త్వాశంసమానేన త్వత్త స్త్రాణ మబుద్ధినా
ఆశ్వాసిత స్సింధుపతి ర్మోహా ద్దత్తశ్చ మృత్యవే" (,,—16)

తేనె పూసిన కత్తి, తేనెను చూపి, ఆశ కల్పించి, నాకినంతనే నాలుకను తెగగోయును దానిని బట్టి, అనుకూలమగు మాటలు చెప్పి, అటుపై మోస గించువానిని 'తేనె పూసిన కత్తి' యనుట లోకోక్తియైనది

"సైంధవుని రక్షింతునని మాట యిచ్చి నమ్మించి మోసగించిన వాడవు. "నీవు తేనె పూసిన కత్తివి" అని ద్రోణుని నిందించుచు దుర్యోధనుడన్నమాట.

పై లోకోక్తిని తెనాలి రామకృష్ణుడును, అట్టి భావములోనే ప్రయో గించినాడు

'తేనె పూసిన కత్తి ధాత్రీసురుండు" (పాండు 3—46) సూ. ని.; పద పారి. ఈ లోకోక్తిని గ్రహించినవి

15. 'నేలకుఁ గోలకుఁ దెచ్చు'

'నేలకు గోలకుఁ దెచ్చు' అనునది రూఢ్యర్థముగల ఒక పలుకుబడి. 'చిందర వందరచేసి చెండాడు, చంపు' అని యర్థము ఈ పలుకుబడిని తిక్కన పలుమారు వాడినాడు

"బాలుఁడవైన నీ వరిది బంటు తనంబునఁ బ్రౌఢ వీర భూ
పాలురఁ గుంభజ ప్రభృతి బాహుబలాఢ్యులఁ గిట్టి నేలకుం
గోలకుఁదెచ్చి యు ట్లగుటకున్ వెఱఁగందుచు వంతఁ బొందుచున్
లోలతఁ జూడకున్నె జన లోకము నీదగు రూపురేఖయున్"

(ద్రోణ 2—333)

"నిను నవలీలదాఁటి ప్రజ నేలకుఁ గోలకుఁ దెచ్చుచున్న య
ర్జును దలయెత్తియైన నటు చూడవు" (ద్రోణ 3—107)

శ ర "నేలకుఁ గోలకుఁ దెచ్చు—క్రిందు మీదుచేయు" అని చెప్పినది. సూ ని లో ఈ క్రియయే లేదు

వా ని ఈ క్రియను చెప్పి, భారతపద్యముల నుదాహరించినది

పద. పారి "నేలకు కోలకు తెచ్చు=1 నానా బీభత్సము చేయు. 2 చంపు" అని అర్థము చెప్పి, ఈ క్రింది పద్యముల నిచ్చినది

"నీ యవలోకనం బొదవ నేలకుఁ గోలకుఁ దెచ్చినట్టి వాఁ
డా యెలనాగబోంట్లు తెలియ న్వినిపింతురు నాకు నెంతయున్"

(కళా. 7—35)

"అరాతి బలము నేలకుఁ గోలకుఁ దెత్తురు" (కర్ణ. 2—88)

16. 'పువ్వుల కోలసాఁచు'

మూలములో, అభిమన్యు మరణమునకు దుఃఖించు ధర్మరాజును వ్యాసు డి ట్లూరడించినాడు

"యుధిష్ఠిర మహాప్రాజ్ఞ సర్వ శాస్త్ర విశారద
వ్యసనేషు నముహ్యంతి త్వాదృశా భరతర్షభ (52 9)
స్వర్గ మేష గత శ్శూర శ్శత్రూన్ హత్వా బహూన్ రణే
అబాల సదృశం కర్మ కృత్వా వై పురుషోత్తమః
(,,—10)
అనతి క్రమణీయో వై విధి రేష యుధిష్ఠిర
దేవ దానవ గంధర్వాన్ మృత్యు ర్హరతి భారత" (,,—11)

"యుధిష్ఠిరా! నీవు శాస్త్రములు చక్కగా చదివినప్రాజ్ఞుడవు ఆపదలందు నీవంటివారు ధైర్యమును కోల్పోరు కుమారుడు శూరులైన శత్రువు లను పలువురను పరిమార్చి స్వర్గమున కేగినాడు. అతడు చేసిన పని మహా వీరుడు చేయదగినదిగాని, బాలుడు చేయజాలినదికాదు మృత్యువు దేవ దానవ గంధర్వులనైనను హరింపక మానదు'—అని యర్థము

ఈ యర్థమును తిక్కన, ఈ క్రింది పద్యములో మరియొక తీరు లో చెప్పినాడు.

"పలువురు రాజులం దునిమె బల్లిదుఁ డాతఁడు పిన్న పాపఁడే
యలుఁగుల పాలుసేయ కభియాతులు పువ్వులకోల సాఁతురే
కలఁగుదురే విపద్దశల కాఁడియ నార్యులు? సావు లింత విం
తలె? గరుడోరగద్యుచరదానవకోటుల చావుఁ జూడమే!

(ద్రోణ 2—149)

"అభిమన్యు డెంతోమందిని అంత మొందించి పోయినాడుగాని, అనామ కముగా—దీనవు చావు చావలేదు అతడు బల్లిదుడుగాని, పసివాడుకాడు రణమున పగవారు బాణములతో పడగొట్టక, పూలతో పూజింతురా? చా వొక వింతా? గరుడ గంధర్వాదులును చచ్చుట మన మెరుగమా! ఎరిగియును మీవంటి ఆర్యులు దుఃఖించుట యొప్పదు" దీని పద్య భావము

'పువ్వులకోల సాఁతురే'—జాతీయము. తిక్కన ఈ క్రింది పద్యములోను వాడినాడు

"జనపతి పంపఁ గేశవుఁడు సంధికిఁ బోయెడు నప్డు నీవు చె
ప్పిన గరువంపు రాజసపు బెట్టిదపుం దగు మాట లెల్ల నె
మ్మనమున నెక్కొనన్ నిలుపుమా వగవం బనియేమి? సంగరం
బునఁ బగవారు పేర్చి పొరిపుచ్చక పువ్వుల కోలసాఁతురే!"

(సౌప్తి. 2—90)

భీముడు అశ్వత్థామ శిరోమణిని తీసికొని ద్రౌపది కడకు వచ్చినాడు ఆమె పుత్రులను తలచుకొని, దుఃఖించుచున్నది అప్పుడు ఆమె మనసుకు దిటవు కలిగించుటకై, భీము డన్నమాట యిది

దీనికి మూల మిట్లున్నది—

"ఉత్తిష్ఠ శోక ముత్సృజ్య క్షత్ర ధర్మ మనుస్మర" (16—28)
"ప్రయాణే వాసుదేవస్య శమార్థ మసితేక్షణే
యా న్యుక్తాని త్వయా భీరు వాక్యాని మధుఘాతిని" (,,—29)
"ఉక్తవ త్యసి తీవ్రాణి వాక్యాని పురుషోత్తమం
క్షత్రధర్మానురూపాణి తాని సంస్మర్తు మర్హసి" (,,—31)

'శోకముమాని లెమ్ము క్షత్రధర్మమును స్మరించు సంధికి పోవునపుడు శ్రీ కృష్ణునితో క్షత్ర ధర్మాను రూపముగా నీ వాడిన తీవ్ర వాక్యములు జ్ఞప్తికి తెచ్చుకో" అని యర్థము

తిక్కన పద్యములోనున్న అర్థమును ఇదే అయినను—'ఆనాడు నీవు కృష్ణునకు చెప్పిన గరువంపు—రాజసపు—బెట్టిదపు మాటలు మనమున నెక్కొన నిలుపుమా' అను రచన, మూలము కంటెను జిగియు బిగియు గలిగి, సంభా షణ సమయోచితమై, శోకమయమై యున్న ద్రౌపది హృదయమున మరల వీరము మొలకెత్తింప జాలియున్నది దానికి 'సంగరమున పగవారు పొరిపుచ్చక పువ్వుల కోలసాతురే' అన్న అర్థాంతర న్యాసము మరింత వన్నె పెట్టినది

'పువ్వుల కోలసాతురే' అనునది 'పూజింతురా!' అను నర్థము నిచ్చు జాతీ యము 'పువ్వుల కోలసాఁచు' శబ్ద పల్లవక్రియ. కావున, 'పువ్వుకోల—పూల బాణమును, సాతురే—చావుదురా' అని ప్రతిపదార్థము చేయగూడదు. 'పూల కోల యేమి? చాచుటయేమి?' అని వితర్కించుటయును కూడదు

సూ. ని. ఈ జాతీయముతో గూడిన పై రెండుపద్యములను 'సాఁచు = చాపు' అను క్రియక్రింద ఇచ్చినది పద్యములలో 'సాఁచు=చాపు'అను అర్థము సరిపడదు కావున, ఆ క్రియక్రింద ఇచ్చుట సరికాదు

'పువ్వుల కోలసాఁచు' అను క్రియను మూలపదములలోనే చేర్చి, దాని క్రింద భారతప్రయోగములను చూపించవలె—పద. పారి అట్లే చూపించినది.

17. 'పాలలోఁబడిన బల్లి'

సంధికొరకు హస్తినకు పోవుచున్న కృష్ణునితో, ధర్మరాజు తమ తల్లిని తలచుకొని, యిట్లన్నాడు.

"అడవికి నేగునాఁడు మము నంపఁగ నెంతయు దవ్వు వచ్చిన
ప్పుడు దనమోము దైన్యమునఁ బొందెడు న్రశులుఁ జూచి చూచి యు
ట్లోడఁ బడి డించి పోవలసె నుమ్మలికమ్మున గొంతి యింతకున్
బడుగయి పాలలోఁ బడిన బల్లి విధంబున నుండకుండునే?"

(ఉద్యో 3—135)

"ప్రవ్రజంతో౾భిధావంతీం కృపణాం పుత్రగర్ధినీం
రు దతీ మపహా య్మైనా మగచ్ఛామ వయం వనమ్ (82—44)
న నూనం మ్రియతే దుఃఖైః సా చే జ్జీవతి కేశవ
తథా పుత్రాధిభి ర్గాఢ మార్తా హ్యనర్త సత్కృతా" (,,—45)
"అభివాద్యాచ సా కృష్ణ త్వయా మ ద్వచనాత్ విభో" (,,—46)

అని మూలము—ఇందులో, ధర్మరాజు—"కృష్ణా! మా తల్లి దుఃఖముల చేత మృతిపొందియే యుండును జీవించి యున్నను మా కష్టములను తలచు కొని దుఃఖించుచుండును" అన్నట్లున్నది

తిక్కన, ఈ యర్థమునే—'పాలలోఁ బడిన బల్లి విధంబున నుండకుండునే' అని జాతీయమ్మైన భాషలో చెప్పినాడు

"పాలలోఁ బడిన బల్లి' సంకట స్థితిని దెల్పు జాతీయము

పాలకుండలో బడిన బల్లి బయటికి వచ్చుటకు వీలులేదు పాల జి డ్డంటు కొని కాళ్ళు జారిపోవుచుండును కనుక కుండ కెగ్రబాక నను వు పడదు అందు వలన, ఆ పాలతోనే ప్రాణధారణ చేసికొనుచు, గతి గల్గు వరకును, అందులో పడి యుండవలసినదే కనుకనే, సంకటస్థితి సూచకముగా 'పాలలోఁబడిన బల్లి' అను జాతీయము పుట్టినది

ఈ జాతీయమును శ్రీనాథుడు వాడుకొన్నాడు

"పడితిమి కుక్కలుం బడని పాటులు, దుర్భరమ్మైన వృత్తి వెన్
బడితిమి గర్వయాచకులభంగిదరిద్రత చుట్టుకొన్న, లో
బడితిమి పాలలోఁ బడిన బల్లుల కైవడి, నెల్ల వెంటలం
జెడితిమి యేమి చెప్ప సరసీరుహసంభవ! దుష్ట దైత్యుచేన్"

(హర 3—15)

సూ ని "బల్లి=గృహ గోధిక, తఱచుగ నిండ్ల గోడలపై ప్రాకుచుండెడి ఒక జాతి సరీసృపము (ఇది శకునమును దెలుపును)" అని వివరించి,—"ఉమ్మలి కంబున గొంతి" అను 'ఉద్యోగ' పద్యము నుదాహరించినది

పద్యములో నున్నది వట్టి బల్లికాదు 'పాలలోఁబడిన బల్లి'. కవి అట్టి బల్లిని ఉపమానముగా చెప్పుటలో భావమేమో, సూ ని వివరణము వలన తెలి యదు ఆ నిఘంటువు అది జాతీయ మని గుర్తింపలేదు

పద పారి. జాతీయమును చెప్పి, అర్థభావములను చక్కగా వివ రించినది.

18. 'ముల్లు ముంటఁబుచ్చుట'

"కలహంబుల్ దమలోనఁ జెసిన నుపేక్షా నైపుణం బొప్ప శ
త్రులఁ జూడందగు భూత దానవుల పోరుంజూచిన ట్లెమ్మెయిన్
ములు ముంటం దగఁ బుచ్చు భంగిగలుగున్ భూనాథ కీడైన మం
త్రుల యేపున్ విభుఁ డిట్ల మాపునది నేర్పుం బెంపుఁ బొల్పారఁగన్"

(శాంతి 2—418)

ఈ పద్యమున మూడు పంతులు తిక్కన సొంతము 'కీడైన మంత్రుల యేపు మాపునది' అను వాక్యము మాత్రమే మూలము లోనిది

"అధర్మదర్శీ యో రాజా బలా దేవ ప్రవర్తతే
క్షిప్రమే వాపయాతోస్మా దుభౌ ప్రథమ మధ్యమౌ (92—8)
అస త్పాపిష్ఠ సచివో వధ్యో లోకస్య ధర్మహా
సహైవ పరివారేణ క్షిప్రమే వావసీదతి" (,,—9)

అని మూలము

ముల్లు ముంటఁ బుచ్చుటయనగా దుర్మార్గుని దుర్మార్గుని చేతనే మడి యించుట—తనకు గిట్టనివారు తమలో తాము కలహించుచున్నప్పుడు, రాజైన వాడు అందులో జోక్యము కలిగించుకొనక, చూచీ, చూడనట్లుండవలె ననియు, అట్లున్నచో, శత్రువు శత్రువుచేతనే హతు డగునని యు, అది ముంటిని ముంటి తోనే తీసివేసినట్లగునని యు పద్యభావము

'ముల్లు ముల్లుతోనే తీసినట్లు' అని వాడుక ఈ వాడుక సూ ని కెక్క లేదు పద పారి ఈ వాడుకను చూపి, 'చెడుగును చెడుగులోనే సాధించు' అని అర్థము చెప్పి, ఈ క్రింది పద్యమును గూడా ఇచ్చినది

"అనవుడు నింతి యీ యెడఁ బ్రయాస పడం బనియేమి యంచు వే
గన ములు ముంటఁ బుచ్చుటయ కార్యముగాఁ దలపోసి"

(విక్ర 1—45)

19. 'ఎడ్డకత్తెర-నాలుకబెల్లము'

"వికచముఖుఁ డగుచు శాత్రవు
లకు హితులగు నట్టి వారలం గని భూపా
లకుఁ డెడ్డ కత్తెరయు నా
లుక బెల్లము నై మనంబులుం గనవలయున్"

(శాంతి 3—268)

ఎడ్డ=ఎడఁద, హృదయము—'నాలుక బెల్లము, ఎదకత్తెర' అని వాడుక తియ్యగా మాటలాడుతూ, హృదయమున కఱకుగా నుండుట

రాజు శత్రుపక్షమువారితో మంచిగా మాటలాడుచు, వారి మనసు మర్మ ములను కనిపెట్టుచుండవలెనని యు, శత్రు వ్యవహారమున మాత్రము మన మున కఱకుదనము కలిగియుండవలె నని యు పద్యమున భావము

"వాఙ్మాత్రేణ వినీత స్యాత్ హృదయేన యథా క్షురః
శ్లక్ష్ణ పూర్వాభిభాషీ చ కామక్రోధౌ చ వర్జయేత్" (140 13)

అని మూలము

సూ ని 'నాలుక' అనుపదముక్రింద—"నాలుక బెల్లము—వాఙ్మాధు ర్యము, మాటల తీపి" అని చెప్పి, ఈ పద్యము నుదాహరించినది కాని, 'ఎడ్డ' అను పదముక్రింద' 'ఎడ్డ కత్తెర' యన నేమో చెప్పలేదు "ఎడ్డ—ఎడఁద" అని మాత్రమే చెప్పినది

నిఘంటువు 'ఎడ్డకత్తెర నాలుకబెల్లము' అను జాతీయమును 'ఎడ్డ' క్రిందనే చూపి, దాని భావమును తెలుపవలెగాని, ఆ జాతీయమును రెండు ముక్కలు చేయుటయు, అందు రెండవ ముక్కను 'నాలుక' క్రింద చూపి మొదటి ముక్కను వదలి వేయుటయు సరిగాదు

పద పారి యీ పద్యమునే ఉదాహరించి—"ఎడ్డకత్తెర నాలుకబెల్ల ము—లోపల యేమున్నా పైకి ప్రియముగా మాట్లాడు పయోముఖ విష కుంభము లాంటిది" అన్నది

పయోముఖవిషకుంభము—'వంచకుడు' అను నర్థమునిచ్చునది వంచన వానికి సహజలక్షణము

పరపక్షమువారితో మంచిగా మాటలాడుచు, వారి మనస్తత్వము గమ నించుచు, ఆత్మ రాజ్యరక్షణమున జాగరూకత గలిగి యుండుట రాజైనవాడు నేర్చుకొనవలసిన లక్షణము అందువలననే రాజు కాబోయే ధర్మజునకు భీష్ముడు బోధింపవలసి వచ్చినది అది రాజనీతి

ఆ నీతిని కృష్ణరాయలును అనువదించినాడు.

"గడినృపుల రాయబారుల యెడఁ గొలువున
సరస సల్లాపములు రాజు సలుపవలయుఁ

గార్య ఖడ్గము లనుచరుల్ గానఁ బలుక
వలయు; నవి మై(త్రిఁ దాఁ దేలఁ బలుక వలయు''

(ఆము. 4.259)

వంచకుడు—అందరి విషయమునను 'పయోముఖ విషకుంభము' గానే వర్తించును. రాజు రాజనీతి ననుసరించి, పగవారి విషయమున మాత్రమే 'నాలుక బెల్లము—ఎద కత్తెర'గా వర్తించును. కాబట్టి, 'పయో........భము' అను మాట, రాజు నెడ వర్తింపదని నా యభిప్రాయము.

20. 'నిడుత్రాట పోవనిమ్ము'

"కుడువ నిచ్చు తఱియుఁ గురవర (క్కించు
నవసరంబు నెఱిఁగి యరి నృపాలు
నీవు ధీరవృత్తి నిడుఁద్రాట బోనిమ్ము
(కమ్మ కపిల యనఁగఁ (గమ్మ చెలువు." (ఆ(శ. 1.72)

ఈ పద్యమున కర్థము నాకు సరిగా గోచరించలేదు. '(కమ్మ కపిల యనగ (గమ్మ చెలువు'—అను తుదిపాదము భొత్తిగా బోధపడలేదు. పాఠములో తప్పేమైన నుండునా? అన్న సందేహము వచ్చినది.

సూ. ని. లో 'నిడుఁద్రాడు' అను పదము(కింద ఈ పద్యముదాహృతమై యుండదా! అక్కడ పాఠ సందేహము తీరదా? అనుకొని చూచితిని—"నిడుఁద్రాడు =పొడుగు(త్రాడు" అని చెప్పి, ఈ పద్యమునే యిచ్చినది. కాని, తుదిపాదము నియ్యలేదు. 'నిడుఁద్రాట బోనిమ్ము' అన్నంతవరకే యిచ్చినది.

'కపిల' (కింద ఇచ్చినదేమోనని చూచితిని. అక్కడను ఇయ్యలేదు. అర్థము దుర్బోధముగా నున్నందున, ఆ పాదము నుదాహరించుటే మాని నట్లున్నది. తిక్కన మూడు పాదములైనను అర్థమైనవా? అర్థమయ్యే యున్న యెడల 'నిడుఁద్రాట బోనిమ్ము' అను జాతీయమును తెలిపి, దాని భావమును వివరించియుండునుగాని, 'నిడుఁద్రాడు' అను పదమునకు మాత్రమే అర్థ మేల (వాయును? 'నిడు'—'(త్రాడు' అను మాటల కర్థ మా నిఘంటువులోనే యున్నది. కాబట్టి అది యొక పదముగా చూపుటయు, అర్థము (వ్రాయుటయు ననవసరమే.

మొత్తముమీద తిక్కనపద్యము చిక్కుగానే యున్నది. మూలమును చూచినను అర్థమగుటలేదు. మూలమునకును—పద్యమునకును—పొత్తు లేదు.

"తుష్ట పుష్టబల శ్శత్రు రాత్మవా నితి చ స్మరేత్" (7—2)
పర్యపాసన కాలేతు విపరీతం విధీయతే
అమర్శకాలే రాజేంద్ర వ్యపసర్పే త్తతః పరమ్ (,,—3)
వ్యసనం ఖేదనం చైవ శత్రూణాం కారయే త్తతః" (,,—4)

అని మూలము.

పద్యమున కర్థము నా కొక విధముగా పొడకట్టినది. కాని, సమన్వయ మగుటలేదు. అర్థము తెలిపినచో పండితులు సమన్వయింతురన్న తలపుతో తెలుపుచున్నాను.

'కపిల' అనగా, ఒక జాతి, జల జంతువు. ఈ యర్థము సూ. ని. లోనే యున్నది. 'నిడు (త్రాట పోనిమ్ము' అను నానుడి జలజంతువుల వేటను బట్టి పుట్టినదే. అది యెట్లనగా:—

వేటకాడు నిడుపైన (త్రాటికి గాలము కట్టి, దానికి, 'ఎర'ను గ్రుచ్చి, నీటిపై వదలును. ఆ జంతువు మాంసాశచేత గాలమును (మింగి పట్టుపడును. అప్పుడది తాడు (తెంపి తప్పించుకొని పారిపోవుటకు పెనగును, పరుగులు పెట్టును. వేటకాడు దానియిష్టము (ప్రకారము కొంతదూరము పోనిచ్చి, మెల్లగా తన వంకకు లాగుకొనును. అది కొంతవరకు వచ్చి, మరల పరుగెత్తును. వేటకాడు మరల లాగును. ఈవిధముగా ఆ జంతువు అలసిపోవు వరకును బాధించి, తరువాత వాడు దానిని గట్టునకు లాగివేయును. ఇదే 'నిడు(త్రాట పోనిచ్చుట' యనగా—బలవంతుడైన శత్రువునకు స్వేచ్ఛ యొసగుచునే—వశపరుచుకొనవలె నని తిక్కన పద్యమున భావము. ఈభావమును తెల్పునదే—Give him a long rope అను ఇంగ్లీషు జాతీయము.

మరియు, తిక్కన పద్యమునకు వ్యాఖ్యానమో అన్నట్లు, ఆముక్త మాల్యదలో ఈ (కింది పద్యమున్నది.

"బెదరి చేరని బలియుని బిగియఁ బట్ట
కతని మైవడినే వచ్చి పొత్తుఁ జేత
(కమము, పెనగెడు బలుమీను (త్రాటఁ జేదు,
నొడ్డుగాలవు వేటకాఁ డునువు గాఁడె?" (4—25)

ఇట్లు అన్వయమునకు రాక అణకలు వేయు పద్యము లింకను గలవు. తిక్కన వాడిన పదములు, పదబంధములు, వ్యవహారమునుండి జారిపోయినవి. అందువలన ఆయనగారి రచన సరిగా బోధపడుటలేదు. పండితులట్టి పట్టులను గుర్తించి, అర్థములు వివరించుట అవసరము. నే నిందు కొన్ని సూచించినాను. నా యీ (వ్రాతలో—(పజ్ఞా లోపమువల్లను, (ప్రమాదము మూలముననను పెరసులు పొరలి యుండవచ్చును. సహృదయులు దయతో సవరింతురు గాక.

ధాత్రీవందనము

శ్రీ టి. బి. యం. అయ్యవారు

యుగయుగమ్ములు-నీ పవిత్రోదరమున
విసువకయె-నన్ను మోసిన విశ్వధాత్రి!
గిరివరకిరీటధారిణీ! తరళసింధు
హారిణీ! అందుకో మన్నమస్కారశతము

ఎన్నొజన్మలనెత్తియుండెదను త
ల్లి! స్వచ్ఛశైతల్య సం
పన్నం బుజ్వల హేమరత్న నివహా
వ్యాలోల శోభాచ్ఛటా
చ్ఛన్నంబౌ-భవదీయగర్భమున-స్వే
చ్ఛావృత్తి క్రీడించుచున్-
వన్నెల్ చిన్నెలు సారెసారెకును సం
పాదించుకొంచున్ ధృతిన్.

సురభిళ లతాంతములు-గిరిఝుసలు-బర్హ
భూషితమయూర నివహమ్ము-ముగ్ధశశ క
దంబకమ్మును-నేను సోదరుల మమ్మ!
ఇంతకంటె సౌభాగ్యమింకేమి వలయు!

కవినై పచ్చికబీళ్ల నీ యొడలి సిం
గారమ్ము మెచ్చంగ-పత
న్నవ నీహార పృషన్మనోజ్ఞ పదబం
ధ శ్రేణి నీనాడు-భూ
ధవమూర్తిన్-భవదీయవక్షమున మ
త్తారాతి రక్తమ్ముఁ బ్రా
గ్భవమందుం బ్రవహింప జేసినను-నన్
బాలింతు వేశాకృతిన్ -

పుప్పుట్టమ్ములతోడ మెత్తనగు నీ
పొత్తిళ్ల బాంధవ్యమే
ను విడంజాలను-జన్మజన్మలకు న
న్నుం గన్న తల్లీ! వృథా
దివిషన్మార్గ విహారవల్గనములన్ -
దీవ్యద్గృహావాసభో
గ విలాసమ్ములఁగాని కోర-శిశురే
ఖన్-నీ యొడిన్ దూగుచున్.

కలలో మనిషి

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

గోడ గడియారం 'టంగ్' మని ఒక్కసారి మ్రోగి దీక్షగా పని చూసుకుంటున్న చంద్రమౌళి ఏకాగ్రతను భంగం చేసింది. ఆయన తలయెత్తి గడియారంవంక చూశాడు అయిదున్నర అయింది ఆఫీసులో మిగిలినవాళ్ళు కూడా వెళ్ళిపోయినట్టున్నారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ప్యూను రాఘవులు గుమ్మం ముందే కూర్చుని ఉన్నట్టున్నాడు అతని నీడ గాజు తలుపుమీద పడుతున్నది

చంద్రమౌళి తాను చూస్తున్న కాగితా లన్నింటిని ఎక్కడి వాటి నక్కడ సర్దివేసి పని ముగించుకుని నిట్టూర్చి, విశ్రాంతిగా రివాల్వింగ్ కుర్చీలో వెనక్కు వ్రాలి, ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు. ఇంతలోనే ఎన్నో దినాలుగా తనకు చిరపరిచితమైన 'టక్‌టక్' మనే ధ్వని వినిపించి ఆయన కళ్ళు తెరచి కిటికీలో నుంచి క్రిందికి చూసేసరికి మళ్ళీ ఆ కుర్రవాళ్ళిద్దరూ క్లబ్ కోర్టులో టెన్నిస్ ఆడుతూ కనిపించారు. ఆయన ప్రతి రోజూ వలెనే వారిని ఆసక్తితో గమనిస్తూ కూర్చున్నాడు.

ఆ ఆఫీసు పక్కనే ఒక క్లబ్బు ఉంది చంద్రమౌళి ఆఫీసు గదిలో నుంచి చూస్తే ఆ క్లబ్బు ప్రక్కభాగంలోని టెన్నిస్‌కోర్టు కనిపిస్తూ ఉంటుంది అసలా క్లబ్బులో టెన్నిస్ అంటే మోజు గాని, ఆసక్తి గాని ఉన్నవా రెవరూ లేరు. దాదాపు అందరూ అక్కడికి కేవలం పేకాట ఆడేందుకు వచ్చేవారే మూడు నెలల క్రిందట ఆ క్లబ్బుకు ఒక ప్రఖ్యాత రాజకీయ నాయకుడు రావడం జరిగింది ఆయనచేత అక్కడ ఏదో ఒక ప్రారంభోత్సవం చేయించుకుంటే ఆయనను బాగా గౌరవించిన ట్లవుతుందనీ, ఆ ప్రారంభించబడే విశేషమేదో ఆయన పేరుమీద చిరస్థాయిగా నిలబడి క్లబ్బుకు పేరు ప్రఖ్యాతులు తెస్తుందనీ ఎవరో సూచించారు అంతా ఆ ఆలోచన బాగున్నదనే అన్నారు కాని "దేనికి ప్రారంభోత్సవం చేయించాలి ?" అన్న మీమాంస వచ్చినప్పుడు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. 'మన క్లబ్బులో ఏం తక్కువ ? పేకాటకు ఎంతమంది వస్తే అంతమందికి కావలసిన ఏర్పాట్లు యిప్పుడూ జరుగుతూనే ఉన్నాయి ఇప్పుడు మనకు లేని దేమిటి?" అని కమిటీ మెంబర్లందరూ దీర్ఘంగా ఆలోచించారు చివరకు ఇతర వూళ్లలో రకరకాల క్లబ్బులను చూసిన ఒక మెంబరు "మన క్లబ్బులో లేనిదేమిటో నేను చెబుతాను. ఎన్నాళ్లనుంచో మీలో కొందరితో వ్యక్తిగతం గానూ, సమిష్టిగానూ కూడా యీ విషయం ప్రస్తావించాను. కాని మీ రెవ్వరూ దానిమీద ఆసక్తి చూపించనే లేదు ఇప్పుడు మన క్లబ్బులో ముఖ్యంగా లోపించినవి 'ఔట్‌డోర్ గేమ్స్'. ఏ బాడ్మింటనో, టెన్నిసో, వాలీబాలో ఆడుకోవటం మన మెంబర్లలో చాలామందికి యిష్టంలేక పోవచ్చు రాత్రింబవళ్లు పేకాట తప్ప మరేమీ వారికి రుచించకపోవచ్చు. కాని నామ మాత్రానికైనా అవి చాలా అవసరం ఇప్పుడు మన మెలాగూ ఈ రాజకీయ నాయకుణ్ణి పిలిచి సత్కరించి ఒక పార్టీ ఏర్పాటు చెయ్యాలనుకుంటున్నాం. ఒక టెన్నిస్ కోర్టు తయారుచేయించి ఆయనచేత ప్రారంభోత్సవం చేయిద్దాం. అది బాగుంటుంది" అన్నాడు. మిగిలినవా రందరూ దానికి తలలూపి "అవును. మీరు చెప్పింది బాగానే ఉంది" అన్నారు. వారిలో ఒకాయన సందేహిస్తూ "అవునండీ. ప్లాను బాగానే ఉంది. కాని యిక్కడ మన కెవరికీ టెన్నిస్ కోర్టు పొడవు, వెడల్పులే సరిగా తెలియవుకదా ? ఇప్పు డెలా ?" అని అడిగాడు. మిగిలినవారు "అదీ నిజమే" అన్నారు. అప్పు డా మొదటి మెంబరు "అది అసలు సమస్యేకాదు మనకు ఆలోచన ఉండాలే కాని చిటికె వేస్తే పనులు జరుగుతాయి మా యింట్లో అద్దెకున్నవారి అబ్బాయి యూనివర్శిటీలో చదువు పూర్తిచేసుకుని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ యిప్పుడు యిక్కడే ఉన్నాడు. అతని దగ్గర టెన్నిస్ బ్యాటు ఉంది. ఏమీ తోచక చాలా బాధపడిపోతున్నాడు నేను అతనితో మాట్లాడుతాను. ఆ బాధ్యత అంతా నామీద ఉంచండి" అన్నాడు. అంతా "సరే" నన్నారు తర్వాత త్వరత్వరగా పనులు జరిగిపోయాయి ఆ రాజకీయ నాయకుడు వచ్చే వేళకు టెన్నిస్ బాగా ఆడగలిగిన వారి నిద్దరిని సమకూర్చ గలిగారు ఈ విధంగా ప్రారంభమైన ఆ టెన్నిస్‌కోర్టు తర్వాత తర్వాత చాలా నిర్లక్ష్యంపాలైంది నిజానికి అక్కడివా రెవరికీ, పేకాటకు ఉపయోగించవలసిన అమూల్యమైన తమ కాలాన్ని యీ క్రొత్త ఆటకోసం వ్యర్థం చెయ్యటం యిష్టంలేదు. అందువల్ల ప్రారంభోత్సవంనాడు ఏ యిద్దరు యువకులు ఆడారో చివరకు వా రిద్దరే మిగిలారు సాయంకాలం అయిదున్నర అయ్యేసరికి క్రిందినుంచి 'టక్ టక్' మని ఆ ధ్వని వినరావటమూ, చంద్రమౌళి కొద్దిసేపు వారి ఆటను గమనించటమూ చాలా రోజులుగా జరుగుతున్నది.

టెన్నిస్ ఆడుతున్న యిద్దరిలోనూ ఒక వ్యక్తికి యిరవైనాలుగు సంవత్సరాల వయస్సు ఉంటుంది అతడు యూనివర్శిటీలో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగప్రయత్నాలు చేస్తూ యింట్లో తల్లిదండ్రుల దగ్గరే ఉన్నాడు. బొద్దుగా ఆరోగ్యంగాఉండి ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా ఉంటాడు

రెండవవాడు చంద్రమౌళి ఆఫీసులోనే దాదాపు పదిహేను రోజుల క్రిందట ఉద్యోగంలో చేరాడు. అతడు అంతకుపూర్వం కూడా రోజూ సాయంకాలంవేళ టెన్నిస్ ఆడుతూ ఉండేవాడు చంద్రమౌళి టెన్నిస్‌కోర్టు ప్రారంభం అయిన నాటినుంచి అతన్ని జాగ్రత్తగా గమనించాడు అతనికి యిరవైయేళ్ళు ఉంటాయి సన్నగా, పచ్చగా ఉంటాడు అందమైన ముఖం జుట్టు పెడసరంగా ఉండి ఎప్పుడూ నుదుటిమీదికి పడుతూ ఉంటుంది. అతడు పెద్దగా నవ్వటం ఎవరూ చూసి ఉండరు చాలా గంభీరంగా ఉంటాడు ప్రతి పనినీ ఎడమచేతితో చేస్తాడు. అతడు టెన్నిస్ బాగా ఆడగలడు మెరుపువలె కోర్టంతా తానై విజృంభించి, ఎడమచేత్తో ఆడుతూ ప్రత్యర్థి కళ్ళు బైర్లు కమ్మించగల వేగం వుంది అతని దగ్గర

టెన్నిస్‌కోర్టు ప్రారంభోత్సవం జరిగిన తర్వాత దాదాపు నెల రోజుల పాటు ఆఫీసుటైము కాగానే యిలా క్రిందికి చూస్తూ వారి ఆటను గమనించటం చంద్రమౌళికి బాగా అలవాటైంది ఇంతలోనే తమ ఆఫీసులో మరో టైపిస్టు కావలసివచ్చి ప్రకటన చేయటమూ దానికి ఒక డజను అప్లికేషన్లు రావడమూ జరిగింది చంద్రమౌళి ఆ పన్నెండు మంది లోనూ యోగ్యులైనవారిని ఆరుగురిని ఎన్నుకుని వారికి 'యింటర్వ్యూ' కార్డులు పంపించాడు. ఒక ఆదివారంనాడు ఉదయం 'యింటర్వ్యూ' లు ప్రారంభమైనాయి ఒక్కొక్క అభ్యర్థితో దాదాపు యిరవై నిముషాలు మొదలుకొని అరగంట వరకు సంభాషించి మంచిచెడ్డలు తేల్చుకున్నాడు. వారిలో ఆరవవాడుగా చివరకు యీ ఎడమచేతి టెన్నిస్ ఆటగాడు లోపలికి వచ్చాడు. రాగానే చంద్రమౌళికి ఎదురుగా నిలబడి నమస్కారం చేశాడు. చంద్రమౌళికి రోజూ తాను చూస్తున్న యీ టెన్నిస్ ఆటగాణ్ణి

ఉద్యోగం కోసం వచ్చిన అభ్యర్థిగా చూడవలసి రావటం చిత్రంగా ఉంది. ఆయన అతనికి తన ఎదురుగా ముందున్న కుర్చీ చూపించి 'కూర్చోండి' అన్నాడు అతడు బిడియపడుతూనే కూర్చున్నాడు. చంద్రమౌళి అతని అప్లికేషను తీసి చూసి "మీపేరు పార్థసారధి కదూ ?" అని అడిగాడు. అతడు 'అవున' ని తల వూపాడు తర్వాత ఆయన అతని సర్టిఫికేట్లన్నీ చూశాడు 'టైపు, షార్టుహ్యాండు" లలో అతని యోగ్యతను పరీక్షించాడు తాను మాట్లాడుతూ ఉంటే అతడు ముందు 'షార్ట్‌హ్యాండ్' లో వ్రాసుకోవలసిన అవసరం లేనివాడివలె టైపు మెషీను ముందు కూర్చుని, తాను చెబుతూవున్న దాన్ని వింటూనే టైపు చెయ్యటం ప్రారంభించాడు తాను వేగం ఎంత హెచ్చినా అత డెక్కడా తడుముకున్న జాడ అయినా కానరాలేదు అతని సన్నని వ్రేళ్ళు అద్భుతంగా, అతి వేగంగా 'టైపు మెషీను' మీద కదులుతూ ఉంటే చూడటం చాలా ఆసక్తి కలిగించింది తాను చెప్పడం ఆపిన తర్వాత అతడు 'మెషీను' లో నుంచి కాయితాలు తీసి ఆయన కిచ్చాడు చదివితే ఒక్క అక్షరం కూడా పొల్లుపోకుండా అంతా అలాగే ఉంది చంద్రమౌళి తన ఆశ్చర్యం పైకి కనుపించకుండా జాగ్రత్తపడి ఆ కాయితాలను బల్లమీద ఉంచి 'బాగానే ఉంది' అంటూ తల పంకించాడు. ఆయువకుడు చంద్రమౌళితో "మీరు అన్యథా భావించకపోతే ఒక్కవిషయం చెబుదా మనుకొంటున్నాను నేను చాలా బాధలలో ఉన్నాను. 'ఇంటర్మీడియేట్' ప్యాసయి రెండు సంవత్సరా లయింది. అప్పటినుంచి టైపు, షార్టుహ్యాండూ నేర్చుకుంటూ ఎన్నో ఉద్యోగాలకు అప్లయిచేశాను కానీ, నాకే ఉద్యోగమూ దొరకలేదు. నే నందుకు బాధపడనూ లేదు బహుశా ఆ ఉద్యోగాలు నాకన్నా అర్హులైన వారికే లభించి ఉంటాయని నన్ను నేను సమాధాన పరచుకున్నాను కాని యిప్పుడు నా పరిస్థితులు మరింత విషమించాయి. నాకు ముసలి తల్లి దండ్రు లున్నారు. మా నాన్నగారికి కళ్ళుకనిపించవు అరవైయేళ్ళు వచ్చాయి మా అమ్మ జబ్బుమనిషి ఎన్నో ఏళ్ళనుంచీ దగ్గుతో బాధపడుతున్నది మనిషి చిక్కి శల్యమైపోయింది ఇన్నాళ్ళూ ఆసరాగా ఉన్న కొద్ది భూమినీ పదిరోజుల క్రిందటనే అమ్మి బాకీలు తీర్చాము ఇక ఇప్పుడు నాకు రెక్కలే ఆధారం నా సొద అంతా అనవసరంగా చెప్పుకుని మిమ్ములను బాధపెడు తున్నానేమో ! నా పరిస్థితిని కాస్తసానుభూతితో చూడండి" అన్నాడు.

చంద్రమౌళి అతనివంక నిశ్చలంగా చూశాడు తర్వాత బల్లమీదికి వంగి "నే నేమీ అనుకోను మీ యోగ్యతలు చెప్పుకున్నారు మీ బాధలు చెప్పు కోవడమూ మంచిదే. అయినా మిమ్ములను నేను రోజూ ఎక్కడో చూస్తు న్నాను" అంటూ ఏదో జ్ఞాపకం చేసుకుంటున్నట్లు నటించాడు. ఒక్క క్షణం ఆగి "అవును జ్ఞాపకం వచ్చింది. ఈ కిటికీలో నుంచి క్రిందికి చూడండి. ఈ ప్రక్కనే ఉన్న క్లబ్బు టెన్నిస్ కోర్టు యిక్కడికి కని పిస్తూ ఉంటుంది రోజూ సాయంకాలంపూట మీరు టెన్నిస్ ఆడుతూ ఉండగా నేను చూస్తున్నాను టెన్నిస్ చాలా భాగ్యవంతుల వినోదం ఖర్చుతో కూడిన వ్యవహారం మీరేమో 'చాలా బీదవాళ్ళ' మని చెబుతున్నారు నాకు చిత్రంగా ఉంది ...." అన్నాడు. ఆ యువకుడు నిట్టూర్చి "అవును అదీ నిజమే. కాని నేను ధనవంతుణ్ణయి వుండి విలాసంకోసం ఆడటంలేదు దాని కోసం నేను రాగి కానీ కూడా ఖర్చు చెయ్యటంలేదు నిత్యమూ ఇంట్లో జరుగుబాటే కష్టంగా ఉన్న నాకు ఆట పాటల కోసం డబ్బు ఖర్చు పెడదా మనేది కలలోనైనా ఊహించరాని విషయం ఆ టెన్నిస్ బ్యాటును నేను కొనలేదు 'అది నా దగ్గరి కెలా వచ్చింది ?' అనేది చాలా బాధాకరమైన ఒక కథ అది తలుచుకున్నప్పుడల్లా నాకు గుండెల్లో చేయి వేసి కెలికినట్టుగా ఉంటుంది ఇప్పటికే కాలం వృథా చేస్తున్నానేమో నని నా కసలే బాధగా ఉంది ..." అంటూ ఆగిపోయాడు చంద్రమౌళి చేతి గడియారం చూసుకుని "ఫరవాలేదు మీరా విషయం కూడా చెప్పవచ్చు కావలసినంత వ్యవధి ఉన్నది నాకు" అన్నాడు. ఆ యువకుడు బాధ ధ్వనించే గొంతుకతో, "నేను రెండు సంవత్సరాల క్రిందటనే 'ఇంటర్మీడియేట్' ప్యాసయినాను. నేను చదువుకునే రోజులలో ఎవరితోనూ కలవకుండా ఒంట రిగా ఉండేవాణ్ణి. ఎవరితోనూ స్నేహం చేసుకోవాలనీ, కలిసి తిరగాలనీ ఉండేది కాదు. 'నా చదువే లోకంగా' నాపాటికి నేను కాలం గడుపుతూ ఉండేవాణ్ని. నేను రెండో సంవత్సరం చదువుతూ ఉండగా ఒక కొత్త కుర్రవాడు మా క్లాసులో చేరాడు. అతని పేరు మధు చాలా చలాకీగా, హుషారుగా ఉండే వాడు. ఎక్కడో మొదటి సంవత్సరం చదివి వాళ్లనాన్నగారికి ట్రాన్స్‌ఫర్ కావడంవల్ల వచ్చి రెండో సంవత్సరంలో చేరాడు వచ్చిన రెండు, మూడు రోజులలోనే అందరి పరిచయమూ పొంది నలుగురి అభిమానము సంపా దించుకొన్నాడు అతడు నన్ను మాట్లాడించి నాతో స్నేహం చేసుకోవాలని చూశాడు. కాని నేను బెరుకు బెరుగ్గా మాట్లాడటంతో నా తత్వం అతడు వెంటనే కనిపెట్టి మరీచనువుగా స్నేహంగా ప్రవర్తించటం ప్రారంభిం చాడు అలా ఒక వారంరోజుల స్నేహంతోనే నన్ను పూర్తిగా మార్చి వేశాడు అతని నవ్వు అంత అద్భుతమైనది అతని మాట అంత శక్తి కలది. అతడు 'తన నవ్వుతో ప్రపంచా న్నంతటినీ జయించగలడ'నిపించేది. తర్వాత మా స్నేహం బాగా పెరిగింది "ఒకరిని చూడకుండా మరొకరం ఉండలే మన్నంత" దూరం వచ్చింది అతనికి టెన్నిస్ అంటే చాలా అభి మానం సాయంకాలం అయ్యేసరికి పొట్ట లాగూ, బనియనూ వేసుకొని టెన్నిస్ బ్యాటు చేత్తో వూపుకుంటూ వచ్చేవాడు నన్ను కూడా తనవెంట రమ్మని గొడవ చేసేవాడు. అతడు ఆడుతూఉంటే చూసేందుకు ఎంతో అద్భుతంగా ఉండేది. అంత వేగంగా, అంత నేర్పుగా టెన్నిస్ ఆడేవా రెవరినీ నేను చూడలేదు అతడు నన్ను కూడా ఆడమని ప్రోత్సహించేవాడు తనతో ఆడేవారు మరెవరూ లేని సమయంలో నాకు దాన్ని బోధపరిచేవాడు తర్వాత తర్వాత నాకు తన బ్యాటు యిచ్చి నేను ఆడుతూ ఉండగా చూస్తూ నుంచునేవాడు తనకేదైనా పనివున్న రోజులలో తన బ్యాటు నాకు యిచ్చి నన్ను 'ఆడుతూ ఉండమని' చెప్పి వెళ్లేవాడు ఈ విధంగా రెండు మూడు నెలలు గడిచేసరికి నాకు ఆట బాగా వచ్చింది నేను ఎడమచేతితో ఆడటం అతని కెంతో ముచ్చటగా ఉండేది. నాతో ఆడుతూ తాను కావాలని ఓడి పోతూ, ఆ ఓటమిలోనే ఆనందిస్తూ ఉండేవాడు తర్వాత పెద్ద పరీక్షలు దగ్గరికి రావటంవల్ల నేను నా దృష్టి నంతటినీ చదువుమీదనే కేంద్రీకరిం చాను అతడు కూడా కష్టపడి చదువుతూ ఉండేవాడు సాయంకాలంపూట టెన్నిస్ మాత్రం మానేవాడు కాదు పరీక్ష లైపోయి ఫలితాలు తెలిశాయి. నేను అన్ని సబ్జక్టులలోనూ ప్యాసైనాను మధు గ్రూపులో తప్పాడు ఫలి తాలు తెలిసిననాటి సాయంకాలం టెన్నిస్ బ్యాటు తీసుకుని నా దగ్గరికి వచ్చాడు ఇద్దరం నా గదిలో చాపమీద కూర్చున్నాము నాకేం మాట్లా డాలో తెలియలేదు. అతడు ఒక్క క్షణం ఆగి గాద్గదికంగా "ఈ బ్యాటు నువ్వు తీసుకో సారధీ ! నేను మళ్లీ పరీక్షలకు వెళ్లి గ్రూపులో ప్యాసయ్యే వరకూ టెన్నిస్‌కోర్టులో దిగను" అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది తర్వాత అతడే నెమ్మదిగా అన్ని విషయాలూ చెప్పాడు ఇంట్లో వాళ్ల నాన్నగారు పరీక్షా ఫలితాలు చూడగానే చాలా గొడవ చేశారుట 'ఆటలలో పడి చదు వును నాశనం చేసుకున్నావ' ని చాలా నిష్ఠూరంగానూ, కఠినంగానూ మాట్లా డారుట "ఆత్మాభిమానం లేశమైనా ఉంటే ఆట కట్టిపెట్టి యీసారి అయినా జాగ్రత్తగా చదివి ప్యాసయినా వనిపించుకో" అన్నారుట మధు కాస్సేపు కూర్చుని తర్వాత వెళ్లిపోయే సమయంలో "నేను మళ్లీ కాలేజీలో చేరబోవడంలేదు టైపు నేర్చుకుంటూ, ఏదైనా ఉద్యోగం చూసుకుందా మనుకుంటున్నాను నువ్వు ఎప్పుడైనా సరే నా దగ్గరికి రావచ్చు" అని చెప్పాను "అలాగే" అని తలవూపి వెళ్లిపోయాడు కాని ఆ తర్వాత అతడు నాకు చాలా అరుదుగా మాత్రమే కనుపించేవాడు నేను రోజూ టెన్నిస్ ఆడుతూ ఉండేవాణ్ణి. ఆ ఆటలో బాగా నైపుణ్యం సంపాదించి ఆ వూళ్లో క్లబ్బు నిర్వహించిన పోటీలలో నెగ్గాను కూడా ఆ పోటీలు జరిగేటప్పుడు మాత్రం మధు వచ్చి నన్ను ప్రోత్సహిస్తూ ఉండేవాడు. బహుమతి తీసుకుని యివతలికి రాగానే నన్ను కౌగలించుకుని "నువ్వు పెద్ద ఛాంపియన్‌వోయ్ ! పరీక్ష లైపోగానే నేను మరోబ్యాటు కొంటాను మనిద్దరం ఆడాలి" అంటూ నన్ను అభినందించాడు. తర్వాత రెండు, మూడు సార్లు మాత్రమే నేను అతన్ని కలుసుకో గలిగాను. అతడు రాత్రింబవళ్లు చదవటం ప్రారం

ఖించాడు. ఆ చదువు అతన్ని పీల్చి పిప్పిచేసింది బాగా చిక్కిపోయాడు.. కాని ఆ చిరునవ్వు మాత్రం అలాగే ఉండేది నేను తర్వాత ఉద్యోగ ప్రయత్నాలలో ఏవో వూళ్ళకు వెళ్ళవలసి రావడంవల్ల అతన్ని కలుసుకోలేకపోయాను నేను తిరిగి వచ్చేసరికి పరీక్షలైపోయాయి. టెన్నిస్ బ్యాటు తీసుకుని చివరి పరీక్ష రోజున సాయంకాలం వారి యింటికి వెళ్ళాను పరీక్షలెలా వ్రాశాడో కనుక్కుని బ్యాటు యిచ్చి మళ్ళీ కులాసాగా కలిసి కాలక్షేపం చేద్దామని వెళ్ళాను నేను వెళ్ళేసరికి యిల్లంతా బోసిగా దీనంగా ఉంది పంచలో ఏభైయేళ్ళ వ్యక్తి ఒకాయన వాలు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. నేను ఆయనను పిలిచి "ఏమండీ మధు ఉన్నాడా యింట్లో ?" అని అడిగాను ఆయన నన్ను 'గేటు దాటి లోపలికి రమ్మ'న్నాడు. వెళ్ళగానే కుర్చీ చూపించి 'కూర్చోమన్నా'డు. నేను కూర్చుని "మధు .." అంటూ ఉండగా ఆయన దుఃఖం పొంగిపొరలిరాగా ముఖాన్ని చేతులలో కప్పుకున్నాడు. "ఏదో దారుణం జరిగిపోయింద"నుకున్నాను. ఆయన కాస్సేపాగి కళ్ళు తుడుచుకుని విషయమంతా చెప్పాడు నేను వింటూ రాతిబొమ్మ వలె కూర్చుండిపోయాను. నా చేతిలోని 'టెన్నిస్ బ్యాటు' చేతిలో ఉన్న పామువలె తోచింది దాన్ని క్రింద పడేశాను మధు పరీక్షలు రెండు రోజులలో ప్రారంభమవుతాయనగా, ఒకనాడు చదువుకుంటున్న వాడల్లా లేచివచ్చి "నాన్నా ! నాకు గుండె నొప్పిగా ఉంది" అన్నాడట. ఆయన "యిక చదువు చాలించి పడుకో. ఏదైనా అతి పనికిరాదు" అన్నాడట. అతడు వెళ్ళి పుస్తకం మూసివేసి పడుకున్నాడట. తెల్లవారి ఎంతకూ లేచిరాకపోయేసరికి వెళ్ళి చూస్తే చలనంలేని కట్టె పడి ఉంది వెంటనే డాక్టరును తీసుకువచ్చారు కాని, "అంతా మించిపోయింది చేసేదేమీలేద"ని డాక్టరు వెళ్ళిపోయాడు. ఆయన తర్వాత చేతులలో ముఖాన్ని దాచుకుని "నేనే నా బంగారు తండ్రిని చేతులారా చంపుకున్నాను" అంటూ దుఃఖించాడు నేను చాలా కష్టంమీద తేరుకోగలిగాను , తర్వాత ఆ బ్యాటు ఆయన ముందు ఉంచి, "దీన్ని మీ మధు తన పరీక్షలైపోయేదాకా నా దగ్గర ఉంచమని యిచ్చాడు 'పరీక్షలు కాగానే మళ్ళీ యిద్దరం కలిసి ఆడుకుందామ'న్నాడు దీన్ని మీ దగ్గరే ఉంచండి" అన్నాను. ఆయన దాన్ని చూచేందుకైనా యిష్టపడక "ఒద్దు నాయనా ! దీన్ని నువ్వే ఉంచుకో వాణ్ణి జ్ఞాపకం చేసే వస్తువును దేన్నీ నేను భరించలేను. నిరంతరం దాన్ని చూస్తూ ప్రేగులు తోడివేసే యీ దుఃఖాన్ని భరించలేను దీన్ని తీసుకుపో" అన్నాడు. నేను చేసేదేమీ లేక దాన్ని చేతుల్లోకి తీసుకుని వచ్చేసాను" అని చెప్పి ఆగాడు చంద్రమౌళి అంతా విని కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా కూర్చుని "సరే ఏ విషయమూ నేను తర్వాత తెలియజేశాను మీరిక వెళ్ళవచ్చు" అన్నాడు ఆ యువకుడు లేచి చంద్రమౌళికి నమస్కరించి వెళ్ళిపోయాడు తర్వాత ఆ ఆరుగురు అభ్యర్థులలోను పార్థసారధి తనకు యోగ్యుడుగా కనిపించినందువల్ల అతనికే 'అపాయింట్మెంట్ ఆర్డరు' పంపించాడు పార్థసారధి వెంటనే ఉద్యోగంలో చేరి, అప్పటి నుంచీ చాలా శ్రద్ధగా పనిచేస్తూ చంద్రమౌళి అభిమానాన్ని యిట్టే సంపాదించాడు.

చంద్రమౌళి కిటికీలోనుంచి క్రిందికి చూస్తున్నవాడల్లా 'బాబుగారూ' అనే పిలుపు వినిపించి వెనుదిరిగి చూశాడు ప్యూను రాఘవులు నిలబడివుండి "నాపని అంతా అయిపోయింది బాబుగారూ ! డ్రైవరు కారు తీసుకుని వచ్చి వాకిట్లో కూర్చుని ఉన్నాడు మీ రిప్పుడు బయలుదేరరా ?" అని అడిగాడు చంద్రమౌళి లేచి ఒక్క క్షణంసేపు నుంచుని, తర్వాత రాఘవులు అందించిన తాళాలు అందుకుని యివతలికి వచ్చాడు ఆయన కూర్చుని తలుపు వేసుకోగానే కారు వేగం అందుకుని పరుగెత్తడం ప్రారంభించింది.

* * * *

చంద్రమౌళి మొహమూ కాళ్ళూ చేతులూ కడుక్కుని వాలు కుర్చీలో కూర్చుని దినపత్రిక చేతిలోకి తీసుకుంటూ ఉండగా ఒక చేతిలో కాఫీ కప్పుతో, మరొక చేతిలో ఒక పోస్టు కవరుతో అక్కడికి వచ్చింది శ్రీదేవి. చంద్రమౌళి కవరు విప్పకుండా దాన్ని బల్లమీద అలాగే ఉంచి కాఫీ కప్పు అందుకున్నాడు. శ్రీదేవి ఆయన కెదురుగా స్టూలుమీద కూర్చున్నది. ఆమెకు ముప్పయి రెండేళ్ళ వయస్సుంటుంది చాలా అందమైన మనిషి ఆమె కాపురానికి వచ్చినప్పటినుంచి చంద్రమౌళి ఆ ఆనంద సముద్రంలో మునకలు వేస్తూ తన వెనుకటి జీవితాన్నీ, వెనుకటి విషయాలనూ మరిచేపోయాడు.

శ్రీదేవి, భర్త కాఫీ త్రాగుతున్నంతసేపూ నిశ్శబ్దంగా కూర్చుని తర్వాత ఖాళీ కప్పు అందుకుంటూ 'మన మురళి ఉత్తరం వ్రాశాడు, చూడండి' అన్నది. చంద్రమౌళి అప్పుడు కొడుకు వ్రాసిన ఉత్తరాన్ని చదువుకుని "ఏమున్నదీ ? ఎప్పుడూ వ్రాసే సంగతులేగా ? హాస్టల్లో తిండి సరిగా లేదనీ, ఆ క్రమశిక్షణ తనకు చాలా బాధాకరంగా ఉందనీ, ఇష్టం వచ్చినట్టు వూరిమీద బడి తిరగనివ్వరనీ, గోల చేసేందుకు వీలులేదనీ యివి ఎప్పుడూ ఉన్న ఆరోపణలేగా ! అయినా అటువంటి కట్టుబాట్లకు లోబడి చదువుకోవటంలో ఉన్న లాభం యిప్పుడు తెలియదు వాడలా వ్రాస్తున్నాడని నువ్వు దిగులుపడకు చదువుకునే రోజులలో అలా గట్టి కట్టుబాట్లలో ఉండటం మంచిదే" అన్నాడు

ఆమె నిట్టూర్చి "ఏమో ! ఆరు నెలలయింది పిచ్చి తండ్రిని చూసి" అన్నది చంద్రమౌళి "మరొక రెండు నెల లాగితే ఎలాగూ వాడి పరీక్షలైపోయి యిక్కడికి రానే వస్తాడు ఇంతలోనే ఆరాటం ఎందుకూ ? . ఒక్క సంవత్సరం తల్లిదండ్రులనూ, వున్నవారినీ వొదిలి, చక్కని క్రమశిక్షణ క్రింద ఒక కాలేజీ హాస్టల్లో ఉండటం వాడికి అంత బాధగా ఉంది. నా విషయం చూడు నాకు వూహ తెలియకముందే నా తల్లిదండ్రులు చచ్చిపోయారు వారాలు చేసుకుని, వారినీ వీరినీ ప్రార్థించి చందాలు పోగుచేసి జీతాలు కట్టి చదువుకున్నాను ఒక యిల్లనీ వాకిలి అనీ లేకుండా ఒక్కొక్కప్పుడు వీధి లాంతరు క్రింద కూర్చుని చదువుకున్నాను ...." అంటూ ఆలోచనలో పడిపోయాడు.

శ్రీదేవి మరేమీ మాట్లాడలేదు మరొక నిముషంసేపు అలాగే కూర్చుని తర్వాత లేచి "నేను పేరంటానికి వెళ్ళి వస్తాను కాస్త పొద్దుపోతుందేమో ? మీరు ఇంట్లోనే ఉంటారా ? ఎక్కడికైనా వెళ్ళదలుచుకున్నారా ?" అని అడిగింది ఆయన తల వూపి "ఎక్కడికీ వెళ్ళను" అన్నాడు. "అయితే నేను సిద్ధమై వస్తాను ఒక్కసారి కిందికి వచ్చి, తలుపు వేసుకుని పైకి వెళ్ళద్దు గాని " అంటూ శ్రీదేవి క్రిందికి వెళ్ళిపోయింది

తూర్పున పూర్ణచంద్రబింబం వెన్నెలలను వెదజల్లుతూ ఉదయించింది. తెల్లని శరత్కాలపు మేఘాలు దూది పింజలవలె ఆకాశంలో అక్కడక్కడ కదులుతున్నాయి ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్ల ఆకులు వెన్నెల పూతతో వెండి కత్తులను ఒకదానిప్రక్కన మరొకటిగా పేర్చినట్టు ప్రకాశిస్తున్నాయి. పక్క డాబామీద పండు వెన్నెలలో యిద్దరు పిల్లలు పరుగులెత్తుతూ ఆడుకుంటున్నారు.

చంద్రమౌళి కొద్ది నిముషాలపాటు దినపత్రికలో విశేషాలు చూసి తర్వాత తల ఎత్తగానే ఆకాశంలో ఆయనను ముగ్ధుణ్ని చేసే అపురూపమైన దృశ్యం కనుపించింది పెద్ద ప్రమిద ఆకారంలో ఉన్న పలుచని మబ్బు ముందు ఉజ్జ్వలంగా కాంతు లీనుతున్న ఖరీదైన మంచి ముత్యం వలె ఉన్నది చంద్రబింబం పక్క డాబామీద ఆడుకుంటున్న యిద్దరు పిల్లలలో మగపిల్లవాడు "మల్లికా ఆ మబ్బు చూడవే దీపపు ప్రదిమలా లేదూ ?" అంటున్నాడు.

చంద్రమౌళి ఆలోచనలో పడ్డాడు. ఆయన నలభై అయిదేళ్ళ జీవితంలోనూ ఎన్నడూ గతాన్ని నెమరు వేసుకోవలసిన అవసరం కాని, సందర్భంకాని, లేకపోయింది పుట్టగానే తల్లినీ, తండ్రినీ దూరం చేసుకుని ఎవరో బీద దూరపు బంధువులు దగ్గరికి తీసి పెంచగా బాల్యం గడిపాడు. తర్వాత ఫస్టుఫారం నుంచీ బి ఏ వరకూ వారాలు చేసుకుంటూ కాలం గడిపాడు, అదృష్టం బాగుండటం వల్లనూ, నోరు మంచిది కావడం వల్లనూ మంచి ఉద్యోగమే దొరికింది. వారూ వీరూ సంకల్పించి వివాహం చెయ్యగా నిక్షేపంగా మారు మాటాడకుండా బుద్ధిగా పెళ్ళి చేసుకున్నాడు. అత్యంత అనుకూలవతి అయిన భార్యతో, చదువుకుంటూ పైకి

వస్తున్న కొడుకుతో, జీవితం ఆయనకు చక్కని సిమెంటు రోడ్డుమీద కారు ప్రయాణంవలె అన్ని విధాలా హాయిగా ఉన్నది వివాహమైన తర్వాత ఎన్నడూ ఆయన తన పూర్వజీవితాన్ని గురించి ఆలోచించనే లేదు ఎవరైనా బీద పిల్లలు ఏదైనా సహాయం కావాలని వస్తే వారిని ఎక్కువగా మాట్లాడించకుండా చేతనైన సహాయం చేసి వెంటనే పంపివేసేవాడు

ఇప్పుడు తీరికగా కూర్చుని ఆకాశంలో ప్రమిద ఆకారంలో ఉన్న మబ్బును చూస్తూవుండగా, పక్క డాబామీద వెన్నెలలో యిద్దరు పిల్లలూ పరుగులెత్తుతూ ఆడకుంటూ ఉండగా, ఆయనకు ఎన్నడో జరిగిన విషయాలు జ్ఞాపకం రావడం ప్రారంభించాయి తానూ యిలాగే శుభ్రజ్యోత్స్న ప్రపంచాన్ని ఆహ్లాదంలో ముంచెత్తుతూ ఉండగా ఆటలాడుకున్నాడు ఇలాగే వింతవింత ఆకారాలలో ఉన్న మబ్బులను మరొకరికి చూపిస్తూ "ఆ మబ్బు మొసలిలా లేదూ ? ఈ మబ్బు గిన్నెలా లేదూ ? అక్కడ ఆ మబ్బు మొగలి పొదలా లేదూ ?" అంటూ ఉండేవాడు. తన పక్కన అప్పుడు తన మాటలు వింటూ పన్నెండేళ్ల పిల్ల ఉండేది అవును పన్నెండేళ్ల బంగారు బొమ్మ .... సృష్టికర్త తన సర్వశక్తులనూ వినియోగించి ఎంతో దీక్షతో, విశ్వల బుద్ధితో మలచిన పుత్తడి బొమ్మ . . ఆ పిల్ల నవ్వుతూ ఉంటే ముత్యాలూ రత్నాలూ జలజల రాలుతున్నట్టుండేది

చంద్రమౌళి భార్య పిలుపు విని వెనక్కు తిరిగి చూశాడు శ్రీదేవి మెట్ల దగ్గర నిలబడి ఉండి "మీరు క్రిందికి వచ్చి తలుపు వేసుకోండి. నేను వెడుతున్నాను" అన్నది ఆమె కనకాంబరం రంగు సిల్కు చీర కట్టుకుని పేరంటానికి పోయేందుకు సిద్ధమై ఉన్నది. ఆయనే లేచి క్రిందికి వెళ్లి ఆమె కారులో ఎక్కి వెళ్లిపోగానే, తలుపు గడియ వేసుకుని మళ్లీ పైకి వచ్చి వాలు కుర్చీలో కూర్చున్నాడు ఆకాశం యిప్పుడు నిర్మేఘంగా ఉన్నది. ప్రక్క డాబామీద యింతవరకూ ఆడుకుంటున్న పిల్ల లిద్దరూ క్రిందికి వెళ్లిపోయారు కాబోలు—చుట్టుప్రక్కల అంతా నిశ్శబ్దంగా ఉన్నది

చంద్రమౌళి మళ్లీ ఆ విషయాన్నే మననం చేసుకోవడం ప్రారంభించాడు ఆయన అప్పటికి పధ్నాలుగేళ్లవాడు. పట్నంలో ఉండి వారాలు చేసుకుని చదువుకుంటూ ఒకసారి వేసవి సెలవులలో తన బీద బంధువుల వూరికి వెళ్లాడు అది ఒక చిన్న పల్లెటూరు ఆ వూరి చుట్టూ బంగారం పండే సారవంతమైన భూము లుండేవి ఊరికి కొద్ది దూరంలో నది ఉండేది. నది ఒడ్డునే ఒక పాడుబడిన ప్రాచీన కట్టడం ఉండేది దాని చుట్టూ ఒక పెద్ద కొబ్బరితోట చంద్రమౌళికా వూళ్లో ఏమీ తోచేదికాదు ఇంత నిశ్శబ్దంగా 'మనుష్యు లెలా జీవించగలరా ?' అనిపించేది ఆ వూళ్లో పగలే ఏమీ సందడి ఉండేది కాదు. పైగా తన యీడువా రందరూ తమ పనులమీద తాము ఉండేవారు ఒకవేళ ఎవరైనా తనను కలుసుకోవటం తటస్థించినా వారి అభిరుచులూ, తన అభిరుచులూ వేరుగా ఉండేవి వారు మాట్లాడే విషయాలు తనకు మొరటుగా ఉండేవి తాను మాట్లాడితే వారికి వింతగా ఉండేది అందువల్ల ఎవరి ప్రమేయమూ పెట్టుకోకుండా అతడు వూరికి దూరంగా నడిచి వెళ్లి నదిఒడ్డున ఉన్న మండపం దగ్గర ఏదో చదువుకుంటూ కూర్చునేవాడు ఒకనా డతడు అక్కడ స్తంభాని కానుకుని కూర్చుని ఉండగా ఆ అమ్మాయి అటువైపు వచ్చింది ఆమె వెంట అయిదేళ్ల పిల్లవా డొకడు చేతిలో కొయ్యబొమ్మతో నడిచి వచ్చాడు వాళ్లిద్దరూ అక్కడ మరొక వైపున కూర్చుని ఆడుకోవటం ప్రారంభించారు చంద్రమౌళి ఆ పిల్లను ఉద్దేశించి 'మీ యిల్లెక్కడ ?' అని ప్రశ్నించాడు ఆ పిల్ల వెనుదిరిగి తన విశాల నయనాలను మరింత పెద్దవిగా చేసి అతనివంక చూసింది తర్వాత వూరివైపు చూపిస్తూ 'అక్కడ' అని చెప్పింది చంద్రమౌళి మళ్లీ "వీడు మీ తమ్ముడా ?" అని అడిగాడు ఆ పిల్ల 'అవును' న్నట్టు తల వూపింది. అతడు ఒక్క క్షణం ఆగి మళ్లీ 'నీపే రేమిటి ?' అని అడిగాడు 'ఉషాబాల' అని సమాధానం చెప్పిందా పిల్ల

గాలి మంద మందంగా హాయిగా వీస్తున్నది సూర్యుడు తన ప్రతాపం చాలించి పడమటి దిక్కున అస్తమిస్తున్నాడు. ఆకాశం రంగులంగుల మబ్బులతో నిండి చిత్రలేఖనంలో ప్రాథమిక సూత్రాలైనా తెలియని పసివాడు తన చిత్తం వచ్చినట్టు రంగులు పూసి వ్రాసిన చిత్రరువు వలె ఉన్నది. కొద్ది నిముషాలలోనే సూర్యాస్తమయం అయి, దేవకన్యలు తమలో తాము ఆడుకుంటూ విసిరిన బంగారు బంతివలె చంద్రబింబం ఉదయించింది

ఉషాబాల ఆట చాలించి తమ్ముణ్ణి వెంటబెట్టుకుని బయలుదేరింది. చంద్రమౌళి కూడా వెంట నడిచాడు. నడుస్తూ ఎన్నో విషయాలు కనుక్కున్నాడు. ఆ పిల్ల తల్లి అయిదేళ్ల క్రిందట చనిపోయింది. భార్య పోయి సంవత్సరం తిరగ్గానే ఆ పిల్ల తండ్రి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. వెంటనే భార్యను కాపురానికి కూడా తీసుకుని వచ్చారు మొదట్లో సవతి తల్లి యీ పిల్లను బాగానే చూసేది కాని కాలం గడిచేకొద్దీ ఆమెలో మార్పు వచ్చింది. ఆమెలో కోపమూ, అసహనమూ ఎక్కువయి ఆ పిల్లను కొద్దిగా బాధపెడుతూ ఉండేది. ఆ పిల్లకు శక్తికి మించిన పనులను చెప్పటమూ, సరిగా చెయ్యలేదని సాధిస్తూ ఉండటమూ సాగించింది. ఏ పని అయినా చెప్పేదాకా చెయ్యకపోతే "నేను చెబితేగాని చెయ్యవన్నమాట" అనేది. చెప్పకుండా చేసుకుపోతే "నేను చెప్పనిదే ఎందుకు చేశావు ?" అని సాధించేది. తర్వాత ఆమెకు కూడా ఒక మగపిల్లవాడు పుట్టాడు అప్పటినుంచి ఆమె ఆ పిల్లను కొంచెం ప్రేమగానే చూడటం ప్రారంభించింది అయినా సాధింపూ, కోపమూ, అసహనమూ మాత్రం పూర్తిగా పోలేదు. ఆ పిల్ల చాలా దీనంగా ఉండేది ఎప్పుడో చచ్చిపోయిన తల్లి తనకు గుర్తులేదు సవతి తల్లిలో మాతృప్రేమ కనిపించటంలేదు తండ్రి తనవిషయం అసలు పట్టించుకోడు అంతా విన్నతర్వాత చంద్రమౌళి గుండె ద్రవించింది. అతడు నిట్టూర్చి "నీకు నాన్న అయినా ఉన్నాడు నా సంగతి మరీ అన్యాయం. మా నాన్నా, అమ్మా నేను పుట్టిన రెండు మూడేళ్లలోనే పోయారు. వాళ్ల ముఖాలైనా నాకు గుర్తులేవు" అన్నాడు. ఈసారి జాలిపడటం ఆ పిల్లవంతు అయింది దీనంగా ఉన్న అతని ముఖాన్ని ఆమె చాలా ఆర్ద్రమైన దృక్కులతో చూసింది చంద్రమౌళి వారి యింటి వరకూ వెళ్లి వారిద్దరూ యింట్లోకి వెళ్లిన తర్వాత తన దారిన తాను వచ్చేశాడు

ఆ నాటినుంచి వారిద్దరూ నది ఒడ్డున ఉన్న కొబ్బరితోటలో కలుసుకునేవారు పశ్చిమాద్రిన క్రుంగిపోతూ సూర్యబింబం తన కిరణజాలంతో లోకానికి బంగారుపూత వేస్తూ ఉండే సమయంలో వారిద్దరూ కొబ్బరి చెట్ల మధ్య పరుగులెత్తుతూ ఆడుకునేవారు దేవలోకంలోని అప్సర కన్యలు ఉపయోగించే నిర్మలమైన గుండ్రని అద్దం వంటి చంద్రబింబం తన చల్లని కిరణాలతో లోకానికి వెండిపూత వేసే సమయంలో మంటపంలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. జలతారు వస్త్రం మడతలలో దాచి ఉంచబడిన మంచి ముత్యం వలె పలుచని తెలి మబ్బులలో చంద్రుడు చిక్కుబడినప్పుడు వారిద్దరూ అటే చూస్తూ కూర్చుని "అదుగో చంద్రుడు మబ్బుల్లోకి పోయాడు ఇటు మళ్లీ యివతలికి వస్తున్నాడు మళ్లీ ఆ మబ్బు చంద్రుణ్ణి మింగేందుకు వస్తున్నది" అనుకుంటూ ఉండేవారు.

ఒకనాడు వారు ఒకరి వెంట ఒకరు పరుగులెత్తుతూ ఆడుకుంటూ ఉండగా ఆకాశం ఉన్నట్టుండి మేఘాలతో నిండిపోయింది అంతవరకూ నిరంకుశంగా ఆకాశ సామ్రాజ్యాన్ని పరిపాలించిన వేసవి బలహీనమై పోయింది. ఏ చిన్న మబ్బుతునక విప్లవం ప్రారంభించిందో తెలియదు ఉన్నట్టుండి చిన్న చిన్న మబ్బు లన్నీ కలిసి మహా శక్తిగా రూపొంది వేసవిని గద్దె దింపి తమ పరిపాలన ప్రారంభించాయి. ఆకాశం నల్లగా నిండు కుండవలె ఉన్నది. అంతవరకూ మిలమిలలాడిన నక్షత్రాలు మాయమైపోయాయి ఒక దిక్కున మేఘాలు తమ విజయచిహ్నంగా చేస్తున్న జయ ధ్వానాల వలె ఉరమటం కూడా ప్రారంభించాయి.

ఉషాబాల ఆకాశం వంక చూసి "అమ్మో ! వర్షం వొచ్చేట్టున్నది. మా పిన్ని 'వూరుకోదు నేను వెళ్లిపోతాను బాబూ ?" మెట్లు దిగటం ప్రారంభించింది చంద్రమౌళి, పదారు వన్నె పసిడి పాదాలు కనిపించేట్టు పరికిణీ కుచ్చెళ్లను పైకి పట్టుకుని త్వర త్వరగా క్రిందికి దిగిపోతున్న ఉషా

బాలను చూస్తూ కూర్చున్నాడు అలా ఆ పిల్ల కొన్ని మెట్లు దిగేసరికే తన నెవరో తరుముకుని వచ్చినట్టు వాన రానే వచ్చింది మళ్లీ ఆ పిల్ల త్వర త్వరగా పైకిరాక తప్పలేదు. ఆక్కడి నుంచి వానజల్లు వారి నిద్దరినీ మంటపం లోపలికి తరిమివేసింది. ముందు ఉషాబాలా, వెనక చంద్రమౌళీ వాన రొద వింటూ అలాగే నిలబడిపోయారు ఉషాబాల పండుతమలపాకుల వంటి తన చేతులలో పైనుంచి పడుతున్న వాన నీటిని పట్టుకుని ఒక్కసారిగా చంద్ర మౌళి మొహాన చల్లింది చంద్రమౌళి మొహం తుడుచుకుంటూ 'ఊరుకో ఉషా ! మరీ అల్లరి వేషాలు వెయ్యకు నేను రేపు పొద్దున్నే వెళ్లిపోతు న్నాను'' అన్నాడు ఆ పిల్ల మళ్లీ నీళ్లు అతనిమీద చల్లబోతూ ఆగింది ఒక్క క్షణం పూరుకుని చేతిలోని నీటిని నేలమీద చల్లింది చేతులు పరికి ణీకి తుడుచుకున్నది. తర్వాత కళ్లలో అమాయకత్వం వొలుకుతూ ఉండగా ''మళ్లీ రావా ?'' అని అడిగింది అతడు ''రాకేం?' మళ్లీ సంవత్సరానికి . ఉషా ! నేను నీకు గుర్తుంటానా ?'' అని అడిగాడు ఆ పిల్ల ఏమీ మాట్లాడ లేదు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా కూర్చున్నది అతడే మళ్లీ ''నేను అక్క డికి వెళ్లి మళ్లీ వారాలు ఏర్పాటు చేసుకోవాలి ఈ సెలవులలో ఎవ రున్నారో .... ఎవరు వూరు వదలి పోయారో పోయిన సంవత్సరం నేను ప్రతి శుక్రవారం జిల్లా జడ్జీగారి యింట్లో భోజనం చేసేవాణ్ని . ఈ చొక్కా, లాగూ యిచ్చింది కూడా ఆయనే అప్పటికే బదిలీ అవుతుందనే అను కునేవారు. ఇప్పు డున్నారో లేరో'' అన్నాడు ఉషాబాల ఏమీ మాట్లాడలేదు చంద్రమౌళి కూడా తర్వాత ఏమీ మాట్లాడకుండా మౌనంగా కూర్చు న్నాడు. వాన అలా కొంతసేపు, కుండపోతగా కురిసి తర్వాత కొద్దిగా తగ్గింది చంద్రమౌళి చేయి బయటికి చాపి చూసి ''వాన తగ్గింది యిక పోదాం పద'' అన్నాడు మెట్లు దిగుతూ ఉషాబాల అతన్ని అనుసరించింది ఇద్దరూ వూళ్లోకి వచ్చారు ఉషాబాల యింటిముందాగి చంద్రమౌళి ''రేపు ప్రొద్దున్నే వెళ్లిపోతాను నేను మళ్లీ కనిపిస్తావా ?'' అని అడిగాడు ఆ పిల్ల తల వూపి లోపలికి పోతూ ఒకసారి తన లేడి కళ్లను అతనివైపు తిప్పి చూసింది. తర్వాత యింట్లోకి వెళ్లిపోయింది చంద్రమౌళి నెమ్మదిగా నడిచి తన యింటికి వచ్చాడు

అతడా మర్నాడు బండ్లో ఎక్కి స్టేషనుకు వచ్చాడు ఉషాబాల అత నికి మళ్లీ కనిపించనే లేదు మళ్లీ సెలవులకు అతడా వూరికి వెళ్లేసరికి వారా వూళ్లో లేరు

చంద్రమౌళి గాఢంగా నిట్టూర్చాడు 'తర్వాత ఆమె ఏమయింది ? ఎలా బ్రతికింది ?'' అనే ప్రశ్నలకు సమాధానమే లేదు ఇదంతా తన మన స్సులో ఎక్కడో అట్టడుగున పడిపోయిన విషయం తన చదువూ, ఉద్యో గమూ, ప్రమోషన్లూ, పెళ్లీ, అత్యంత సంతృప్తికరమైన వైవాహిక జీవి తమూ, వీటి అడుగున ఎక్కడో పడి యున్నాళ్లకు యీ పిల్లల ఆట చూస్తూవుండగా యిది బయటికి వచ్చింది

ఆ తర్వాత ఆయన కొన్ని నిముషాలపాటు అలా నిశ్శబ్దంగా కూర్చు న్నాడో లేదో క్రిందినుంచి శ్రీదేవి పిలుపు వినవచ్చింది ఆయన వెంటనే క్రిందికి దిగి వచ్చేశాడు.

* * * *

ఉదయం చంద్రమౌళి ఆఫీసుకు వెళ్లి తన కుర్చీలో కూర్చోగానే రాఘవులు ఒక కాయితం తెచ్చి యిచ్చాడు 'పార్థసారథిగారు యిమ్మని చెప్పా రండీ' అన్నాడు.

పార్థసారథి 'తన తల్లికి అకస్మాత్తుగా ప్రాణంమీదికి వచ్చింద' నీ, 'అర్ధరాత్రివేళ ఆసుపత్రికి తీసుకు వెళ్లవలసి వచ్చిందనీ, రెండు గంటలు ఆలస్యంగా ఆఫీసుకు వచ్చి అన్ని విషయాలూ మాట్లాడగలననీ', వ్రాశాడు చంద్రమౌళి ఆ కాయితాన్ని ప్రక్కనే ఉంచుతూ రాఘవులతో ''సరే నువ్వు వెళ్లవచ్చు'' అన్నాడు.

తర్వాత ఆయన తన పనిలో లీనమైపోయాడు పన్నెండు గంటల వేళ రాఘవులు కాఫీ తెచ్చి యిచ్చాడు చంద్రమౌళి విశ్రాంతిగా కూర్చుని కాఫీ త్రాగుతూ ఉండగా పార్థసారథి లోపలికి వచ్చాడు అతని ముఖం చిన్నబోయి ఉంది

చంద్రమౌళి ''కూర్చోండి మీ కాగితం చూశాను ఎలా ఉన్నది మీ అమ్మగారికి ?'' అని అడిగాడు పార్థసారథి దీనంగా ''ఎలా ఉన్నదని చెప్పను ? డాక్టరు ఏ విషయమూ రెండు రోజులు గడిస్తేగాని చెప్పలే నంటున్నాడు రాత్రి ఉన్నట్టుండి దగ్గు ఎక్కువై అపస్మారక స్థితి వచ్చింది. పలకడం మానివేసింది మన స్పృహ లేదు మేము అప్పటి కప్పుడే ఆసు పత్రికి తీసుకుపోయాము డాక్టరు పరీక్షచేసి ఏవో యింజెక్షనులు యిచ్చాడు. కాని యింతవరకూ మన లోకంలోకి రాలేదు అలాగే చలనం లేకుండా పడి ఉన్నది మా నాన్నను చూస్తూఉంటే నా కడుపు తరుక్కు పోతున్నది. . అక్కడే ఒక ప్రక్కగా మోకాళ్లమీద తల వాల్చుకుని కూర్చుని ఉన్నాడు. ఆయన పెద్దవాడు పైగా కబోది '' అన్నాడు

చంద్రమౌళి జాలిగా ''అయితే మీరు అక్కడ ఉండటం చాలా ముఖ్యం వెంటనే వెళ్లి దగ్గరే ఉండండి అన్నట్టు మీ అమ్మగారి వయ సెంత ?'' అని అడిగాడు పార్థసారథి ''ముప్పయి అయిదో నలభయ్యో ఉంటాయి అయినా దాదాపు అయిదారేళ్ల నుంచీ ఉన్న దగ్గును నిర్లక్ష్యం చేసి యీ స్థితికి తీసుకువచ్చింది నా చదువు కోసం 'ఎలా డబ్బు సమ కూర్చడమా' అన్న ప్రశ్న తప్ప నా తల్లిదండ్రులకు యిన్ని ఏళ్లుగా మరొక ఆలోచనే లేదు. మా నాన్న తాలూకా ఆఫీసులో చీకటి గదిలో టైపు చేస్తూనే జీవితమంతా గడిపాడు రిటైరయ్యే వయస్సు వచ్చేసరికి చూపు మందగించి పోయింది ఇప్పుడు పరిస్థితు లిలా విషమించి పోయాయి'' అన్నాడు

చంద్రమౌళి ''మీకే సహాయం కావలసి వచ్చినా సంకోచం అక్క ర్లేదు ఇక్కడికి రండి. నాకు చేతనైన దంతా చేయగలను'' అన్నాడు. పార్థసారథి ఆర్ద్రమైన కళ్లతో, ''కృతజ్ఞుణ్ని'' అని చెప్పి వెళ్లిపోయాడు ఆ నాటి సాయంకాలం పని పూర్తి అయిన తర్వాత చంద్రమౌళి కిటికీలో నుంచి క్రిందికి చూస్తే క్లబ్బు టెన్నిస్‌కోర్టు నిర్మానుష్యంగా బోసిపోయి కనిపించింది

* * * *

మర్నాడు సాయంకాలం ఆఫీసు మూసివేసే సమయంలో చంద్రమౌళి వాకిట్లో నిలబడి ఉండగా పార్థసారథి రిక్షా దిగివచ్చాడు అతడు మరీ దీనంగా ఉన్నాడు అతడు రిక్షావాడికి డబ్బులిస్తూ ఉండగా చంద్రమౌళి ''ఏమండీ ! ఎలా ఉన్నది మీ అమ్మగారికి ?'' అని అడిగాడు పార్థసారథి కళ్లు చెమ్మగిలుతూ ఉండగా ''ఏం చెప్పను ? ఈ రాత్రి గడవటం కష్టమే నంటున్నాడు డాక్టరు ఆమె అప్పుడప్పుడు మాత్రం కళ్లు తెరచి చూస్తు న్నది ఏవో కొత్త ఇంజెక్షనులు కావాలని వ్రాసి యిచ్చాడు డాక్టరు. మిమ్ములను అడుగుదామని వచ్చాను''అన్నాడు చంద్రమౌళి వెనుదిరుగుతూ ''అలా అయితే లోపలికి రండి డబ్బు యిస్తాను తర్వాత నా కారులో ఎక్కితే మిమ్ములను దోవలో ఆసుపత్రి దగ్గర దింపి నేను వెళ్లిపోతాను'' అంటూ లోపలికి నడిచాడు పార్థసారథి ఆయన వెంటనే వెళ్లాడు

చంద్రమౌళి మూరు రూపాయల నోటు నొకదాన్ని అతని చేతికిచ్చి ''ఇది సరిపోతుందా ?'' అని అడిగాడు. పార్థసారథి తలవూపి, ఆ నోటు అందుకున్నాడు ఇద్దరూ బయలుదేరి హాస్పిటల్ ముందుకు వచ్చేసరికి కారు ఆపి చంద్రమౌళి ''మీరు దిగండి'' అన్నాడు అంతవరకూ దీనంగా మరో ప్రపంచంలో ఉన్నట్టున్న పార్థసారథి వెంటనే క్రిందికి దిగి ''నాకేమిటో భయంగా ఉన్నదండీ దయచేసి మీరు కూడా రారాదూ ?'' అన్నాడు

చంద్రమౌళి ''వస్తాను కాని మీరలా అధైర్య పడకూడదు. ఇటువంటి సమయాల్లో ధైర్యం చాలా అవసరం మరీ అంత నీళ్లుకారి పోకూడదు'' అంటూ దిగి అతని వెంటనే లోపలికి వెళ్లాడు.

అది పెద్ద ఆసుపత్రి ముందు పెద్ద వరండాలో వరుసలుగా మంచాలు ఉన్నాయి అక్కడొక్కటీ అక్కడొక్కటీ పడకలు ఖాళీగా ఉన్నప్పటికీ మిగిలిన అన్ని మంచాలలోనూ రోగులు పడుకుని కొందరూ, కూర్చుని కొందరూ ఉన్నారు డ్యూటీలో ఉన్న నర్సు ఎవరి అవసరాలు ఏమిటో కనుక్కుంటూ అటూ యిటూ తిరుగుతున్నది మిగిలినవి ప్రత్యేకమైన గదులు వాటిలో రెండేసి మంచాలు ఉన్నాయి. ఒక గదిలో పెద్ద గొడవ జరుగుతున్నది ఒక రోగిచేత మందు త్రాగించడం కోసం యిద్దరు నర్సులూ డాక్టర్లూ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు అతడు మాత్రం అందరినీ తోసివేస్తూ "మీరు నాకు విషం పోస్తున్నారు నేను తాగను గాక తాగను" అని అరుస్తూ కేకలు పెడుతూ గందరగోళం చేస్తున్నాడు చంద్రమౌళీ, పార్థసారధి ఆ గదిముందు ఓ క్షణం ఆగారు పార్థసారధి నవ్వి "అతడొక లక్షాధికారి తనను ఎవరో ఒకరు విషంపెట్టి చంపేసి తన ఆస్తిని కాజేస్తారని ఎప్పుడూ భయపడుతూ ఉండేవాడు ఇంట్లో అందరిమీదా, చివరకు కట్టుకున్న పెళ్లాంమీద కూడా అనుమానమే ఇప్పుడేమో జబ్బుచేసింది ఇక్కడికి వచ్చినప్పటినుంచీ యింతే నానా హంగామా చేస్తున్నాడు" అని చెప్పాడు. చంద్రమౌళికి నవ్వు వచ్చింది ఆయనకీ ఆసుపత్రి వాతావరణమే కొత్తగా ఉంది తనజీవితంలో ఎన్నడూ ఆయన యింతవరకూ ఆసుపత్రి ఎరుగడు ఎప్పుడైనా అడపా దడపా చిన్నచిన్న జ్వరాలూ, జలుబులూ వస్తే శ్రీదేవి తన పరిచర్యతో, చిన్న చిన్న గృహవైద్యాలతో తనను సేదదీర్చేది వారిద్దరూ అలా నడుస్తూ చివరి గదుల దగ్గరికి వచ్చారు ఒక గది ముందు ఆగి పార్థసారధి "రండి లోపలికి" అంటూ తాను ముందు నడిచాడు చంద్రమౌళి గుమ్మం దాటి లోపలికి వెళ్లి చుట్టూ చూశాడు

ఆ గదిలో ఒకే మంచం ఉంది మంచానికి దిగువగా చాపమీద ఒక ముసలి, పడుకుని నిద్రపోతున్నాడు అతని గడ్డం పండి వుంది గదిలో నేల అంతా తెల్లని నాపరాతితో శుభ్రంగా వుంది

పార్థసారధి రోగి మంచానికి ప్రక్కగా ఉన్న కుర్చీని యువతలికి లాగి చంద్రమౌళి నుద్దేశించి "కూర్చోండి" అన్నాడు చంద్రమౌళి కూర్చుని రోగి వైపు చూశాడు

ఏళ్ల తరబడి దగ్గుతో, ఆయాసంతో, కృశించిపోయిన బలహీనమైన శరీర మామెది చాలా నెమ్మదిగా, బరువుగా గాలి పీలుస్తున్నది ఆరిపోతున్న దీపశిఖవలె చావూ బ్రతుకుల మధ్య ఊగులాడుతున్నది

చంద్రమౌళి ఒక్క నిముషం ఆగి తర్వాత లేచి నుంచుని "మీరు ధైర్యంగా ఉండండి మన మంతకన్నా చేయగలిగింది ఏమీ లేదు మనం అలవరచుకోవలసినదల్లా ధైర్యంగా నిలబడటమే" అన్నాడు పార్థసారధి దుఃఖిస్తూ "ఏం ధైర్యమో ! ఎంతగా ప్రయత్నించినా యీ బాధ తన్నుకుని పైకి వస్తున్నది ఉన్న ఆ ఒక్క దిక్కూపోతే యీ కబోది తండ్రీ, నేనూ ఎన్ని అగచాట్లపాలు కావలసి వస్తుందో !" అన్నాడు ఇంతలో చాపమీద పడుకునివున్న వృద్ధుడు లేచి మాటలు వినవస్తున్న వైపు మొహం తిప్పి దీనంగా కూర్చున్నాడు చంద్రమౌళి యువతలకు వస్తూ మళ్లీ తల తిప్పి రోగివైపు ఒకసారి చూశాడు ఆమె యిప్పుడు కళ్లు తెరుచుకుని మగతగా పడుకుని ఉన్నది

చంద్రమౌళి నడవటం ప్రారంభించాడు పార్థసారధి వెనకనుంచి 'నేను ఉండిపోతానండీ' అనటం వినిపించింది బయట చీకట్లు అలుముకుంటున్నాయి వరండాలో అక్కడొక మనిషి అక్కడొక మనిషి తప్ప సందడేమీ లేదు. చంద్రమౌళి బూట్ల చప్పుడు కూడా వినపడనంత నెమ్మదిగా నడుస్తున్నాడు ఆమె ముఖమే ఆయనకు చిరపరిచితమైనదిగా మాటిమాటికీ జ్ఞప్తికి వస్తున్నది ఒక అద్భుత శిల్పం చెయ్యి విరిగీ, కాలు విరిగీ వికృతమైపోయినట్టూ పసి పిల్లవాడు ఎంతో ఆపేక్షగా చూసుకుంటున్న ఆటబొమ్మ పగిలి ముక్కలై పోయినట్టూ, చిత్రకారుడు తాను జీవితమంతా శ్రమచేసి, తన నైపుణ్యం అంతా ధారపోసి చిత్రించిన రమణీయ చిత్రం మీద ఒక మూర్ఖుడు రంగులు పులిమినట్టూ ఉన్నది గాజా కొంపలో ఉండి బయటి ప్రపంచాన్నీ మనుష్యులనూ చూసేవాడికి అన్నీ చాలా అస్పష్టంగా కనిపించినట్టు ఏదో అస్పష్టరూపం ఆయన మనస్సులో తెలిసీ తెలియకుండా యిబ్బంది పెడుతున్నది

చంద్రమౌళి కారు దిగి యింట్లో ప్రవేశించగానే శ్రీదేవి ఎదురుగా వచ్చి "ఏమిటండీ అలా ఉన్నారు ?" అని అడిగింది ఆమె తన భర్త ఎన్నడూ పరధ్యానంగా ఉండటం చూసి ఎరుగదు ఆయన "ఏమీ లేదు" అని చెప్పి దుస్తులు మార్చుకుని పైన వాలు కుర్చీలో కూర్చుని ఉండగా ఆమె కాఫీ తీసుకువచ్చి అందించింది

చంద్రమౌళి కాఫీ త్రాగుతూ పక్క డాబా మీదికి చూశాడు. అప్పుడే ఉదయిస్తున్నది చంద్రబింబం. ఆ యిద్దరు పిల్లలూ రోజూ వలెనే మళ్లీ పరుగులెత్తుతూ ఆడుకుంటున్నారు ఆ ఆడపిల్ల ఒక్కసారి ఆగి "అదుగో ! ఆ మబ్బు చూడు రఘూ ! చెట్టులాగా లేదూ ?" అన్నది

చంద్రమౌళి ఏదో స్ఫురించగా, చేతిలో ఉన్న కాఫీ కప్పు క్రింద ఉంచేసి వ్యాకులహృదయంతో "శ్రీదేవీ ! ఆ తలుపు మూసి నువ్వు క్రిందికి వెళ్లిపో నన్ను కాసేపు ఒంటరిగా ఉండనివ్వు" అన్నాడు

ఆమె నివ్వెరపోతూ కాఫీ కప్పు చేతిలోకి తీసుకుని, తలుపు వేసి, నెమ్మదిగా క్రిందికి వెళ్లిపోయింది. ఆయన కళ్లు మూసుకుని వాలు కుర్చీలో విశ్రాంతిగా పడుకుని ఏమీ ఆలోచించకుండా ఉండేందుకు ప్రయత్నం చేశాడు

* * * *

మరునాడు ఉదయం శ్రీదేవి, భర్త ముఖం చూసి ఆశ్చర్యంతో "అలాఉన్నా రేమిటి ? రాత్రి నిద్ర సరిగా పట్టలేదా ?" అని అడిగింది ఆయన నవ్వి "ఎలా ఉన్నానూ ? రాత్రి వళ్లు మరచి నిద్రపోయానే" అన్నాడు కాని అది అబద్ధం శ్రీదేవి ఆయన మాటలను నమ్మనూ లేదు ఆయన రాత్రిఅంతా జాగ్రదవస్థకూ సుషుప్త్యవస్థకూ మధ్య బాధపడ్డాడు కన్నుమూస్తే ఏవో అర్థంలేని పిచ్చి పిచ్చి కలలు వచ్చి నిద్రను ఎన్నడూ లేనంతగా పాడుచేశాయి శ్రీదేవి "ఏమో ! రాత్రి మీరు రోజూలాగా ఆదమరచి నిద్రపోలేదు ఒకసారి కెవ్వున కేకవేసి లేచారు కూడా. నాకెంతో భయం వేసింది అప్పుడు గడియారం చూస్తే సరిగ్గా రెండు గంటలైంది రాత్రి అంతా భయంతోనే గడిపాను" అన్నది

తర్వాత ఆయన ఆఫీసుకు వెళ్లగానే రాఘవులు ఒక కాయితం తెచ్చి అందించాడు అందుకుని చూస్తే అది పార్థసారధి సెలవు దరఖాస్తు. తన తల్లి రాత్రి రెండు గంటల వేళ మరణించిందనీ, తనకు ఒక పది రోజుల సెలవు అత్యవసరమనీ వ్రాశా డతడు

చంద్రమౌళి ఆ పూట అంతా ఒక్క కాయితమైనా చూడకుండా ఆఫీసులో వాలు కుర్చీలో పడుకుని నిద్రపోయాడు, రాఘవులతో, 'ఎవ్వరినీ లోపలికి రానివ్వవద్ద'ని చెప్పాడు

ఆయనకు మెలకువ వచ్చేసరికి గాజు తలుపుమీద దీపపు వెలుగు పడుతున్నది అవతల ఎవరున్నారో స్పష్టంగా తెలియడంలేదు కాలింగ్‌బెల్ నొక్కగానే రాఘవులు త్వరత్వరగా వచ్చి "కారు వచ్చింది బాబుగారూ !" అన్నాడు. చంద్రమౌళి లేచి ఒళ్లు విరుచుకుని "త్వరగా తాళంచెవులు తెచ్చి యివ్వు" అంటూ బయటికి వెళ్లాడు

రెండు నిముషాలతర్వాత వేగంగా పోతున్న కారులో కూర్చుని ఆయన "కలలలో ఎవరెవరినో చూస్తూ ఉంటాము అలాగే యిదీనూ ... ఎప్పుడెవరిని కలుసుకుంటామో . ఎప్పుడు విడిపోతామో తెలియదు" అనుకున్నాడు తర్వాత కారులో ఉన్నంతసేపూ ఆయన ఆలోచనలన్నీ శ్రీదేవి మీదనే ఉన్నాయి. "రాత్రి ఎంతో బాధపడి ఉంటుంది నా పిచ్చి శ్రీదేవి" అనుకున్నా డాయన తర్వాత పెద్దగా "రాజా ! మరి కాస్త త్వరగా పోనివ్వ వోయ్" అన్నాడు రాజా "అలాగేనండీ" అంటూ కారు వేగం హెచ్చించాడు.

అష్టగ్రహకూటపు దుమారము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

వీధినాటకములలో వీరపురుష పాత్రధారులు రంగస్థలమునకు రానుండగా, గొప్ప కోలాహలము బయలుదేరుట సామాన్యానుభవము జోడు తప్పెట్ల ఫెళఫెళలు, సజ్జరసపు దివిటీల తళతళలు, కప్పతాళముల ఘణఘణలు, బిరుసు బాణాల భుగభుగలు, వెనుకపాటగాండ్ర తోంత తబ్బిబలు, అన్నియు చేరి, అనిర్వాచ్యమయిన గొప్ప కలకలము బయలుదేరనిదే, నటుడు రంగస్థలమునకు కుప్పళించి వచ్చి నాట్యమాడడు తరువాత కొన్ని నిముషములు కాళ్లతీటి తీర్చుకొని, చల్లబడి, అతడు ఏమూలకో పోయి విశ్రమించుకొనును

కడచిన ఫిబ్రవరి 5 వ తేదీనాటి అష్టగ్రహకూటపు నాటకములో సయితము ఇట్లే జరిగినది రానున్న గ్రహకూటపు ఫలితములను గూర్చి సిద్ధాంత రాద్ధాంతములు కొన్ని నెలలకు ముందే వార్తాపత్రికలలో ఆరంభ మయినవి అదో, ఇదో, ప్రపంచయుద్ధములో ఆటంబాంబులు ప్రేలు నని, యుద్ధములలో రాజులు, రాజ్యములు నశించునని, భూమి రక్తమయ మగునని, అగ్నిపర్వతములు, నదీప్రవాహములు, భూకంపములు మున్నగు మారణ యంత్రసామగ్రి చెలరేగి మానవులను అపారముగా కబళించునని, ఆర్తనాదములు బయలుదేరినవి మూలమూలలనుండి జ్యోతిశ్శాస్త్ర విశారదులు పలువురు ప్రాచీనసంహితలనుండి సూత్రములను ఉదహరించి, ఘోరవిపత్తు రానున్నదని హెచ్చరించసాగినారు ఖండాంతరములలో సయితము ఇట్టి గోలలు సమృద్ధిగా వినవచ్చినవి యాగములు, హోమములు, పూజలు మొదలగు శాంతిక్రతువులు జరుపుట గ్రహకూట బాధా నిరావారణమునకు అత్యవసరములని లోకహితైషులు పలువురు సభలలో ఉపన్యసించినారు లక్షల కొలది ద్రవ్యమును చందాలెత్తి ప్రోగుచేసి, దేశభక్తు లనేకులు పుణ్యక్షేత్ర ములలో జపములు, అభిషేకములు మొదలగు శాంతికర్మలు చేయించినారు ఫిబ్రవరి 3, 4, 5 తేదీలలో ఏ ప్రళయ వార్తలు వినబడునో, ఎట్టి ఘోర సంఘటనలు చూడవలసి వచ్చునో అని అనేకులు వణకసాగిరి మరణ శాసనములు సయితము వ్రాసియుంచినవారు లేకపోలేదు "ఇట్టి గ్రహ కూటములు ఎన్నియో వచ్చినవి. ఎన్నియో పోయినవి గొప్ప ప్రమాద మేమీ జరుగ" దని అనుభవశాలురు కొందరు అభయ మిచ్చినారు ఏ నిముషమున ప్రపంచయుద్ధము పొటమరించునో యని నానా దేశములు బాహాటముగనో, మారుపేర్లతోనో, సైనికసన్నాహములు చేయకపోలేదు

"నేను గ్రహకూటమునకు ఏమీ భయపడను. అది నన్ను ఏమీ చేయదు ఇది అంతా మూఢ విశ్వాసము!" అని భారత మహాప్రధాని శ్రీ నెహ్రూ పండితుడు ఎడపా దడప ఎలుగెత్తి హెచ్చరించుచుండినా, ఈ కోలాహలములో అతని మాటలు అణగిపోయినవి కాక, ఔరంగజేబు సంగీత శాస్త్రమును ద్వేషించినట్లు, శ్రీ నెహ్రూ పండితుడు జ్యోతిశ్శాస్త్రమును ద్వేషించుచున్నా డనుట సుప్రసిద్ధ విషయము అగుటచే, అతని అభిప్రా యములు జనసామాన్యమునకు విలువలేనివి

పోనిత్తము అష్టగ్రహకూటము మెల్లగా రానే వచ్చినది, చల్లగా పోనే పోయినది కూడా! కాని, ప్రళయము కాని, ప్రపంచయుద్ధము కాని రాలేదు. చెప్పుకోదగినట్టి ఘోరపరిణామ మేమియు కలుగలేదు. యథా పూర్వముగా ప్రపంచము తనపనులను జరుపుకొనుచునే యున్నది. గ్రహ కూటమునుగురించి భయపడినవారిమూఢ భక్తిని ఆధునిక విజ్ఞానవేత్తలు కొందరు ఎగతాళిచేయసాగినారు.

"ఏకరాశౌ యదాయాంతి,
చత్వారః పంచఖేచరాః,
ప్లావయంతి మహీం సర్వాం,
రుధిరేణ, జలేనవా."

ఈ మొదలయిన సంహితావాక్యములు నాలుగయిదు గ్రహములకూటము వలననే భూమండలము రక్తప్రవాహమందో, జలప్రవాహమందో, మునుగు ననుచున్నవే! వాని ఫల మేమైనదని జ్యోతిష్కులు బిత్తరపోయి ఆకాశమును చూచుచున్నారు. "అప్పుడే ఏమైనది? ఆరు నెలలు చూడండి" అన్నారు కొందరు సమయస్ఫూర్తికల చతురులు. తాము సాధించిన శాంతిక్రతు వుల ఫలముగా దైవానుగ్రహము కలిగి దుష్ఫలము తగ్గిపోయినదని కొందరు తృప్తిచెందు చున్నారు ఎవరికి తోచినట్లు వారి వ్యాఖ్యానము!

ఏది ఎట్లయినా అష్టగ్రహకూటమేమో కడచిపోయినది యుద్ధము కానీ, ప్రళయము కానీ రాలేదు దినపత్రికలలో రైళ్ల ఉపద్రవములు, విమానపతనములు, పడవల ప్రమాదములు, బస్సుల ఢీకొనుట మొదలగు వానివలన ఏవో కొన్ని మరణములు సంభవించుచుండుటను గూర్చి ఇంచు మించుగా అనుదినమును చదువుచున్నాము దినమునకు సరాసరి అరువది వేలకు పైగా హెచ్చుచున్న జనసంఖ్యగల ఇప్పటి ప్రపంచములో, ఈ మరణ ములు ఏమి లెక్క? గ్రహకూటములు లేని కాలములో సహా ఇట్టివి జరుగు చునే యున్నవి ఇట్టి స్వల్ప విషయములను అష్టగ్రహకూటఫలమునకు చెల్లుగట్టుట నగుబాట్ల చేటు!

మరి, అష్టగ్రహకూటము కలుగనే లేదా? లేక, మహనీయుడు మన మహాప్రధాని సెలవిచ్చినట్లు, దానికి ఫలము శూన్యమేనా? ఇది అంతా మూఢ విశ్వాసమేనా? లోకకల్యాణ కాంక్షతో మహర్షులు చెప్పిన సంహితావాక్య ములు నిష్ప్రయోజనములా? అను సందేహములు పుట్టుటకు సమృద్ధిగా అవకాశ మేర్పడినది

కొన్ని గ్రహములు ఒకచోట చేరినచో గ్రహకూట మందురు. నెల కొక్కమారు భచక్రములో ఏదో ఒక రాశిలో రవి, చంద్రులు చేరుచుందురు కదా? దీనిని చిన్న గ్రహకూట మనవచ్చును ఇదే అమావాస్య ఆనాడు ఏక రేఖలో రవిచంద్రు లుండుటచేత, అతి ప్రబలమగు ఆకర్షణశక్తి బయలు వెడలి భూమండలమును లాగగలదు. కావుననే ఆ సమయమున సముద్ర ములు హల్లకల్లోలముగా ఘూర్ణించుట! ఆ రవిచంద్ర సంయోగస్థానము ఏ వ్యక్తియొక్క లగ్నముపైననో, చంద్రస్థానముపైననో నికరముగా పడెనేని, త్వరలో ఆ వ్యక్తికి ఆరోగ్య భంగమో, క్లేశమో కలుగుచుండుట అనుభవ సిద్ధము అట్లు జన్మ చంద్రునిమీద రవి చంద్ర సంయోగము కలిగినప్పుడు, అది విషనాడీప్రదేశమే అయినచో, ప్రాణాపాయకరమని వశిష్ఠమహర్షి చెప్పెను.

"యస్య జన్మర్క్షగశ్చంద్రో,
విషనాడ్యాం కుహూర్భవేత్,
అభిచారేణ కిం తస్య,
స్వయమేవ మరిష్యతి." అని.

ఇట్టి అమావాస్యలలో రాహువో, కేతువో రవిచంద్రులను చేరినచో, సూర్యగ్రహణ మగును. దీనిని గ్రహత్రయకూటమ మనవచ్చును అమావాస్య లలో ఇది అధికశక్తి కలది. జన్మనక్షత్రమందు ఇట్టి పర్వము వచ్చినచో, పీడాకరమగునని ప్రాచీనులు చెప్పిరి.

> "గ్రహణం జన్మనక్షత్రే
> జాయతే చంద్రసూర్యయోః
> యశ్య, తస్యా శుభంహానిః
> వైరం, రోగో, పరాభవం"

గ్రహణముల ఆకర్షణశక్తి దుష్ఫలప్రదమయినచో అది మానవు లందరికి సమానముగా అన్వయించవలయు గదా ? అని కొందఱి అధి క్షేపము. ఇది అవిచారరమణీయమగు ప్రశ్న పిడుగు మహాభయంకరమైనదే. అయినా అది ఎచ్చట పడునో, అచటనే కదా దాని వేధాప్రభావము వ్యక్తము కాగలదు ? అట్లే, వ్యక్తి జాతకములలో దుస్థానములలో గ్రహణములు పడి నపుడు మాత్రమే వారి జీవితములలో క్లేశము సంభవించగలదు జాతక మందలి 1, 7, 8, 12 భావములలో పడినచో గ్రహణ ఫలము కష్టతర మని, 3, 6, 10, 11 భావములలోపడినచో శుభఫలము కలుగునని, ఇతర భావములలో మధ్యఫలమని, భృగుమహర్షి సూచించినాడు. అతని వాక్య మిది .—

> "కష్టతరం జన్మభగం
> గ్రహణం పుంసాం తథాష్ట సప్తాంత్యం
> ఉపచయగం శుభదం స్యాత్
> మధ్యఫలం ద్విత్రికోణబంధుగతం."

అది యట్లుండె

రవికి సమీపమందే సంచరించువా రగుటచేత, బుధ, శుక్రులు ఒక్కొ కప్పుడు రవిచంద్రసంయోగముతో చేరవచ్చును. అప్పుడు చతుర్గ్రహకూటమో పంచగ్రహకూటమో అగుచున్నది. ఇక కుజ గురు శనులు జట్టుగా పర్వములలో చేరుట అరుదు ఎన్నియో సంవత్సరములకు కాని, వీరందరు ఒక రాశిలో చేరుట అసంభవము. గత 32 సంవత్సరములలో షష్ఠగ్రహ కూటములు మూడుమార్లు, సప్తగ్రహకూటములు రెండుమార్లు సంభవించినవని ఖగోళ శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు. అన్నిగ్రహము లొక్కచోట చేరినచో, వాని నుండి బయలుదేరు ప్రచండ శక్తులు ఏకమై సమష్టిగా ఆకర్షించుట కారణ ముగా భూమండలమున గొప్ప సంచలనము జనించుట వింతకాదు ఆ ఆకర్ష ణము ఏ భూభాగమునకు వ్యాపించునో, ఆ ప్రాంతములో అశాంతి, ఈతి బాధలు, భూకంపాదులుకలుగుట ప్రకృతిసిద్ధమగు సహజధర్మము కనుకనే గ్రహకూటములకు ప్రాచీనులు దుష్ఫలములను సూచించినారు

కడచిన ఫిబ్రవరి 5 వ తేదీనాడు వచ్చిన గ్రహకూట మెట్టిదో చూతము 4 వ తేదీన అర్ధరాత్రి తరువాత 10 నిముషములకు (ఇది గ్రినిచ్ మధ్యమ కాలము) అనగా భారత కాలమానములలో 5 వ తేదీ ఉదయము 5—40 A. M. (IST) గంటల సమయములో రవి చంద్ర సంయోగము కలిగినది అప్పటి గ్రహస్థితి ఈ క్రింది చక్రము చూప గలదు —

సాయన కుంభరాశిలో కుజ, శని, రవి, చంద్ర, బుధ, శుక్ర, కేతు, గురువులు చేరినారు. నిరయన సంప్రదాయముతో గమనించినచో, ఈ గ్రహము లన్నియు మకరములో ఉన్నట్లగును

మన భారతదేశమునకు సంబంధించినది మకరరాశి అని పాశ్చాత్య శాస్త్రవేత్తల మతము. మనది కన్యారాశి అని భారత జ్యోతిర్వేత్తలు భావించు చున్నారు. ఈ రాసులు సాయనరాసులా, నిరాయనరాసులా అను విషయము అవ్యవస్థగా నున్నది ఎంతో పరిశోధనము చేయవలసిన అంశ మిది ఆపని

గు 18–37 కే 18–7 శు 17–47 బు 16–55(వ) ర 15–43 చ 15–43 శ 3–48 కు 2–32	(సాయనము) — గ్రహకూటపు పర్వము — (సాయనము) — గ్రహకూటపు పర్వము		
			రా 18–7 వ 29–2 (వ)
		ఇ 13–28	య 9–26(వ)

చేయు శక్తిగల ప్రముఖులు పలువు రున్నారు. కాని, వారితో ఆ కార్యము చేయించు యోజకులు లేకున్నారు పోనిండు

ఈ గ్రహకూటమునుగురించి కొందరు ప్రముఖుల అభిప్రాయముల సంగ్రహ మిది —

హిందూ దేశములో గొప్ప రాజకీయ సంక్షోభము, ఘోరమగు భూకంపము వలన ఉత్తరప్రదేశమందలి నగరములలో జననష్టము, చైనావారి దండ యాత్ర, ఇంగ్లండు రాణిగారికి, భారత మహాప్రధానికి సహా క్లేశము సంభ వించుట, అనునవి ఈ గ్రహకూటపు ఫలములని, శ్రీ సి. నిక్సన్ అను ఆంగ్ల పండితుడు వ్రాసెను దేశము నిర్మానుష్యమగునని సూచించు శాస్త్ర వాక్య ములను కొందరు భారత పంచాంగ కర్తలు ఎత్తిచూపిరి గొప్పగా ఉప్పెనలు పొంగి కొన్ని భూభాగములను ముంచివేయునని, అతివృష్టి, అనావృష్టి కారణ ముగా క్షోభ కలుగునని, ఏదో అంత నాడీ గ్రంథములో నున్నదట ! కాని, హిందూదేశము కర్మభూమి అగుటంబట్టి, ఈ గ్రహకూటమువలన దానికి గొప్ప దుష్ఫలము రాదని ఆ నాడిలో నున్నదట ! మన పుణ్యము !

సిరిల్ ఫ్యాగన్ అను ఆంగ్లేయుని దృష్టిలో, ఈ గ్రహకూటమువలన లండన్ నగరము చాలా అభివృద్ధికి రాగలదట ! సంగీత సాహిత్య శాఖల ప్రశస్తి హెచ్చునని, ప్రపంచ యుద్ధము వచ్చు భయము లేదని ఇతని జోస్యము ఇండొనీషియా, వియత్నాం, ఫార్మోసాలకు ప్రబలముగా విషమ ఫలము తగులుననియు, మధ్యప్రాచ్యదేశములలో (ఈజిప్టు, జోర్డాన్, ఇస్రాయిల్, ఇరాన్) అశాంతి వాతావరణపు దుమారము రేగి అణ్వస్త్రము లతో ప్రపంచ సంగ్రామము వచ్చునను భీతికి అవకాశ మున్నదనియు, భారత మహాప్రధానివంటి అంతర్జాతీయ రాజనీతి విశారదుల ప్రయత్నముల వలన ఆట్టివిపత్తు సంభవించదనియు, రఘువీర కృష్ణ దైవజ్ఞుని అభిప్రాయము (ఇందలి , లౌకికము మెచ్చదగినది). అంతః కలహములు, విప్లవములు, కారణ ముగా క్లిష్ట పరిస్థితులు ఏర్పడి ఇండియా, పాకిస్థానములు కలిసిపోవచ్చు నని, రష్యా దేశములో నిరంకుశ ప్రభుత్వమునకు మారుగా ఏదో రీతిలో, ప్రజాసత్తాక ప్రభుత్వము ఏర్పడునని, (కోరికలు మంచివే) ఆర్ద్వోలావగ్నాని

అను పాశ్చాత్య దైవజ్ఞుడు సూచించినాడు. సాంక్రామిక వ్యాధులవలన జననష్టము, సమ్మెల తొందరలు, దేశద్రోహ శక్తుల విజృంభణము, శాంతి భద్రతా భంగములు, నీలిసంత వ్యాపారాల ద్వారా ప్రభుత్వమునకు ధననష్టము, చట్టా బేరముల వలని దివాలాలు, విద్యాసంస్థలకు కష్టములు మన దేశములో సంభవించునని S·I సాంబశివయ్యరుగారి సూచన. (గ్రహకూటము లేకనే యివి యున్నవి) ఇంగ్లండులో రాజ్యాంగమున గొప్ప మార్పులు వచ్చునని,, రష్యాతో వైరము పెరుగునని, అమెరికాలో తుఫానుల బాధ, రైళ్ల ప్రమాదములు, గనుల ప్రేలుళ్లు, జననష్టము సంభవించునని ఈ పండితుని అభిప్రాయము.

ఇంగ్లీషు శాస్త్రవేత్త 'డి. జే. టిక్కర్‌గారి దృష్టిలో ఈ గ్రహకూటము వలన గొప్ప దుష్టఫలము ఏమీ రాదట రోము పండితుడొకడు ఈ గ్రహకూటమునకూ ఫలమేమీ లేదనెను సోవియట్ యూనియన్, పోర్చుగల్లు సిరియా, గ్రీసు, ఇథియోపియా, ఇరాన్ దేశములకు దెబ్బ తగులగలదని పారశీక శాస్త్రవేత్తలు కొందరు సూచించారు.

ఫిబ్రవరి 3, 4, 5 తేదీలలో నదీప్రవాహముల పొంగులు, భూకంపములు, ఉప్పెనలు, అగ్నిపర్వతముల ప్రేలుళ్లు మున్నగు ఈతిబాధల వలని క్షోభ పశ్చిమ అమెరికా, తూర్పు చైనా, మధ్య ప్రాచ్య దేశములు, పశ్చిమ ఆఫ్రికా, ఇండొనీషియా, ఇటలీ, మెక్సికో, బీహార్, అస్సాం, గ్రీసు ప్రాంతములలో సంభవించగలదని శ్రీ బెంగుళూరు వెంకటరామన్‌గారి అంచనా. భారత మహాప్రధాని తన ఆరోగ్యమును, తన క్షేమమును సహా, చాలా జాగరూకతతో గమనించవలసి యుండునని వీరి సలహా (సదా విమాన ప్రయాణములు చేయుచుండు వ్యక్తికి ఈ సలహా యుక్తమే). అంతర్జాతీయ కారణములవలన ఎన్నికలు ముందుకు వాయిదా పడవచ్చునని ఇతడూహించెను (ఇది జరుగలేదు) ఎన్నికలు జరిగినా, కాంగ్రెస్సు పక్షము బాగా దెబ్బతినగలదట (జనసామాన్యాభిప్రాయ మిది) ప్రస్తుత రాజనీతి దేశాభివృద్ధికి భంగకారి యని ఇతని జోస్యము (కాంగ్రెస్సు ప్రతిపక్షుల వాద మిది). ఈ గ్రహకూటపు ఫలము అధమపక్షము రెండున్నర సంవత్సరములు దీర్ఘకాలము వ్యాప్తిలో నుండునని ఇతని అభిప్రాయము (ఈ కాలావధి ఎంతో ఉపయోగకరము) కాని, ఈ మధ్యకాలములలో వచ్చు గ్రహణములు సంక్రాంతులు మున్నగువానికి ఫలము లేదనుట సాహసము.

ఈ గ్రహకూటపు ఫలము శుభకరమే యని చైనా, ఇండొనీషియా జ్యోతిష్కులు కొందరు ఉద్ఘాటించినారు

ఈ విధముగా పలువురు పలువిధములగు భావములను ప్రకటించియున్నారు వీరిలో కొందరు సాయనవాదులు, మరికొందరు నిరయనవాదులు వీరు వ్రాసిన వ్రాత లన్నియు ప్రకటించుటకు గొప్ప గ్రంథ మగును స్థాలీపులాకన్యాయముగా ఇంత జాలును. పండిత నెహ్రూ గారి దృష్టిలో బుద్ధిహీనులు, మూఢ విశ్వాసపరులును అగు భారతీయ కార్తాంతికులు మాత్రమే కాక, ఆధునిక విజ్ఞానధనులగు పాశ్చాత్య దేశములందలి శాస్త్రవేత్తలు సయితము అనేకులు (దాదాపు 30 మందికి పైగా) ఈ గ్రహకూటపు ఫలమును గూర్చి భిన్నభిన్న దృక్పథములతో విమర్శించినారని సూచించుటకై మాత్రమే ప్రముఖుల అభిప్రాయములు కొన్ని యిచట సంగ్రహించుట! వీరి అభిప్రాయములకు ఐకమత్యము లేదనుట వాస్తవము భిన్న దృక్పథములు, భిన్నాదర్శములు, భిన్న పక్షపాతములు, దానికి హేతువులు— అంతేకాని శాస్త్రము కాదు,.

సనాతన ధర్మముపైన అచంచల విశ్వాసము, దైవభక్తి కలవారు భారతభూమి యందలి సామాన్య ప్రజలు. గ్రహకూట దుష్ఫల నివారణమునకై యాగములు, పూజలు, శాంతులు వారు జరిపించుట దాని ఫలము శాంతులవలన గ్రహవైషమ్యము తగ్గునని వారి విశ్వాసము. కాని హోమముల పేరుతో, అంత మంచినేయి అన్యాయముగా అగ్నిలో పోసి పాడుచేసినారే యని నెహ్రూ పండితుడు, పాపము, ఎంతో ఆరాటపడినాడు. సువాసనకల పూలమాలికలను మణుగుల కొలది ప్రోగుచేసి, బండి చక్రములవలె పెద్దగా చుట్లు చుట్టి, ఎన్నడో చచ్చి మంటపాలైనవారి గోరీల (అథవా, సమాధుల) మీద నిరర్థకముగా పేర్చుటవలన, సుమంగలుల కేశపాశములనో, మహనీయుల కంఠసీమలనో, అలంకరించవలసినయున్న కోమల సురభిపుష్పజాలము ఎంత పాడైపోవుచున్నదో, పాపము, అతనికి తెలియదు! ఆ పూవుల సువాసనలకు చనిపోయినవారు ఆనందించునట్లు, హోమముల ద్వారా గ్రహాధి దేవతలు తృప్తిపొందకూడదా? ఎవరి పిచ్చి వారి కానందము!

అది యట్లుండనిత్తము

గ్రహకూట మనగా, ఏదో ఒక రాశిలో, పరస్పరముగా ఎంతెంత దూరముగా నయినా సరే, గ్రహములు చేరుటే అని భావించుట, నా దృష్టిలో శాస్త్రసమ్మతము కాదు యోగమనగా, ఒకటే భాగ (డిగ్రీ) లో గ్రహములు కలియుటే అని ప్రాచీన శాస్త్రకారులు స్పష్టముగా చెప్పినారు.

"ఏకారాశౌ స్థితైర్యోగః"
"యోగస్త్వేకాంశ సమాగమోక్తః"

అని మున్నుగా ప్రమాణము లున్నవి అట్లుకాక, ఆ గ్రహములు పరస్పరముగా దూరమందున్నచో, అట్టి యోగములకు ఇచ్ఛామాత్రమే ఫలమని రల్ల మహాశయుని సూక్తి —

"యోగా యథోక్తఫలదాః
కలార్ధ భాగైక సంస్థితానాంచ
అప్రాప్తానాం
ఇచ్ఛామాత్రం ఫలం భవతి"

ఇదే సందర్భమున ఆచార్య వరాహమిహిరుడు సయితము యిట్టి నియమమునే విధించియున్నాడు చూడుడు —

"ఏకర్క్ష కలాంశగతో,
యథోక్త ఫలద శ్శశీ గ్రహవశేన,
అన్యర్క్షగత స్స్వప్నే,
మనసావా, భావనం కురుతే" (అ 2)

ఖగోళములో సంచరించు తారాగ్రహములకు, భూమినుండి చూచినచో అట్టి ఆత్యంతిక సంయోగము చూపట్టినప్పుడు, దానికి "గ్రహయుద్ధ" మను సాంకేతిక నామమును శాస్త్రకారులు అనుగ్రహించిరి. ఇట్టి గ్రహయుద్ధములు వృష్టినాశనము, శస్త్రాగ్నిభయము, కలహములు మొదలగు క్లేశములను సూచించునట! ఆకాశరంగమునందు ఏకకాలమున అనేక గ్రహములకు అట్టి యుద్ధము కలిగెనేని, భూమిపైన ఘోర సంగ్రామములు, భూకంపములు, క్షామములు, మొదలగు ఈతి బాధలు చెలరేగుట వింతకాదు.

మరి, ఇప్పటి అష్టగ్రహకూట మెట్టిదో, పాఠక మహాశయులు గమనించగలరు. రవి, చంద్రులకు ఒక భాగ అంతరములో బుధుడు, రెండు భాగలు దాటి శుక్రుడు మూడుభాగలదూరములో గురువు, నిలిచియున్నారు మరియొకవైపున శని, కుజులు 12, 13 భాగల దూరములో నున్నారు. సాయనముగా చూచినా, నిరయనముగా గమనించినా, ఈ అంతరములలో ఏమియు వ్యత్యాసము రానేరదు కనుక, దీనిని అష్టగ్రహకూట మనుట నిర్హేతుకము. ఈ గ్రహము లన్నియు ఒకటేరాశిలో నున్నవనుట సత్యమే. కాని, అంతమాత్రమున గ్రహకూటము కాదు ఆలోచించిచూడుడు. శ్రీకాకుళములో ఆంధ్రు లున్నారు. చిత్తూరులో ఆంధ్రు లున్నారు. సరి కదా? వీరందరు ఆంధ్రప్రదేశవాసులే అంతమాత్రపు ఉపపత్తితో ఆంధ్ర మహాజనసభ సమావేశమై కార్యక్రమము జరుపుచున్నట్లు భావించుట ఏమి న్యాయము? ప్రశంసలోనున్న గ్రహకూటము సయితము ఇట్టిదే స్థూలముగా చెప్పినచో, రవి, చంద్ర, బుధ, శుక్ర, గురువుల కూట మనవచ్చును.

పంచగ్రహకూటమయినా, విషమ ఫలప్రదమే కదా అందురేమో ? కాని పర్వ కాలములో గ్రహములు యుద్ధమునకు దిగినపుడే, వాని కూటము ప్రపంచ మునకు అహితమును సూచించగలదు గ్రహయుద్ధము లేని కేవల సంయో గము—అందులో శుభగ్రహముల కూటము— దోషకారి కాజాలదు. అయినా రవితో చేరిన కారణమున ఈ చంద్ర, బుధ, శుక్ర, గురువులు తమ సహజ సౌమ్యత్వమును కోలుపోయి పాపులయినారని పూర్వ పక్షము రావచ్చును. కాని, రవి, చంద్ర, బుధ, శుక్ర, గురువుల సమాజమునకు ప్రాచీన శాస్త్ర కర్తలు చెప్పిన ఫలము ఇట్లున్నది —

"యంత్రజ్ఞో, బహువిభవో,
నృపసచివో, దండనాయకోవా, స్యాత్,
ఖ్యాత, శ్శుభకీర్తి యుతో,
బుధేందు రవి జీవ శుక్రైశ్చ." (హోరావళి)

"రాజమంత్రీ, భూరివిత్తో,
యంత్రజ్ఞో, దండనాయకః,
ఖ్యాతో జనే, యశస్వీచ,
జీవార్కేందుజ్ఞ భార్గవైః" (మానసాగరి)

ఈ ఫలములు వ్రాసిన శాస్త్రజ్ఞులకు చంద్ర, బుధ, శుక్ర గురువులకు రవి సంయోగ మున్నదని తెలియదనుకొనుట మహాసాహసము, ఈ ఫలములలో దుష్ఫలము లనదగినవి ఏవియు చూపట్టవు. యంత్రజ్ఞుడు, దండనాయ కుడు, రాజమంత్రి, యశస్వి, ప్రఖ్యాతుడు, అను విశేషణములు గమనింప దగినవి. ఈ ఫలములు వ్యక్తిజాతక పరములయినా, ప్రపంచమునకు సంయు తము అన్వయించవచ్చును. ఏ భూభాగమున కీ గ్రహకూటఫల మన్వయిం చునో, అచటి నాయకులు యంత్రసాహాయ్యముతో, ఆర్థిక సౌకర్యము లతో, సైనిక సన్నాహములతో, నేతృత్వ శక్తితో, కార్యశూరులై, విజయ పతాకములెత్తి ఖ్యాతి నార్జించగలరని అర్థము చెప్పవచ్చును ఈ గ్రహ కూటము శుభఫలప్రదమే అని చైనా, ఇండొనీషియా దేశముల జ్యోతి ష్కులు చెప్పుటకు కారణమిదే కాబోలు ? పోతే, ఇప్పుడు అగ్రరాజ్యముల వారి రాజనీతిలో, సన్నాహములలో, వాదోపవాదములలో, స్పష్టముగా కని పించునవి ఇట్టి భావములే కదా ?

చెప్పవచ్చిన దేమన, ప్రశంసలో నున్న గ్రహకూటమువలన భయం కరమగు గొప్ప దుష్ఫలము ప్రపంచమునకు కలుగు ననుటకు కారణము చాల దనుట

ఇటీవల వెలువడిన వార్తలలో, జబ్బల్‌పూరు, భోపాల్ ప్రాంతములలో ఫిబ్రవరి 5, 6 తేదీలలో వాతావరణమునందు ఒక్కసారి హఠాత్తుగా మార్పు వచ్చెనట ! 4 వ తేదీ మధ్యాహ్నమునుండి భూవలయము చుట్టు అయ స్కాంత శక్తి చాలాఉద్ధృతముగా ఉండినదట ! ఇవి ఈ గ్రహకూట ఫలమేల కారాదు ? కాని, భారతీయ వాతావరణ శాఖోద్యోగులు ఈ మార్పులకు సామాన్య కారణములే చాలునని సెలవిచ్చిరట ! అనగా, గ్రహకూటముతో దీనికి నిమిత్తము లేదనుట ! మరి, వారి సామాన్యకారణములు ఎట్టివో ? గ్రహ

కూట ఫలమని యొప్పుకొన్నచో, తమ శాస్త్రమునకు న్యూనత కల్గుననియో, రాజకీయ ప్రముఖవ్యక్తుల ఆగ్రహమునకు గురి అగుదు మనియో వారి భయమను టే ఆ సామాన్య కారణ మగునేమో ?

మరియొక వింతవినుడు. విమానములలో ప్రయాణము చేయుచు గ్రహములకు దగ్గరగా ఎంతో ఎత్తున అనుదినమును ఎగురుచుండినా, గ్రహకూట ప్రభావము తనపైన ఏమియు కానరాలేదనియు, ఇది అంతా వచ్చి మోసమనియు, శ్రీ నెహ్రూ పండితుని సుభాషితములు. గ్రహములలో అతి సమీపములో నుండు బుధుడే భూమికి 8 కోట్ల, 80 లక్షల కిలోమీటర్ల దూరములో నుండెనని ఖగోళశాస్త్ర పండితులు తెలుపుచున్నారు ఇట్టి పరిస్థితులలో అతని విమానము 8 వేలు, అథవా 80 వేలు, అడుగుల ఎత్తునకు ఎగిరి యుండినా, "ఉట్టికీ, స్వర్గమునకూ" ఉన్నంత అంతర మగును కదా ? ఇంత దూరవ్యాప్తి గల ఊహలు అంతర్జాతీయ రాజనీతిలో పనికి వచ్చునేమో తెలియదు

జ్యోతిశ్శాస్త్రమునకు సంబంధించిన పండితనెహ్రూగారి పరిహాసములు, ఎగతాళి మాటలు, ఎత్తిపొడుపులు, ఆక్రోశములు అన్నియు అతని రాజనీతి ప్రభావముయినచో, కొంత మట్టుకు సహేతుకములు కావచ్చును అనేక సమయములలో జ్యోతిష్కులు కొందరు ప్రకృత సందర్భమునకు అనవసరములు, శాంతిభద్రతలకు భంగకరములు, అరాజక విద్రోహశక్తుల విజృంభణమున కనుకూలములు అగు అభిప్రాయములను జ్యోతిష్యము పేరుతో ప్రకటించుచున్నారు ప్రజల శాంతిభద్రతలను సంరక్షించు బాధ్యత వహించి యున్న రాజకీయప్రముఖ వ్యక్తుల యోగక్షేమములకు, వారి కార్య కలాపములకు, ఇట్టి ప్రకటనలు ఎంతో హానికరములు కావచ్చునని సులభముగా మనము ఊహించగలము పాకిస్థానముతో యుద్ధము రాగలదని, ప్రముఖ రాజకీయ వ్యక్తులపైన హత్యా ప్రయత్నములు జరుగునని, చైనా సేనలు దండెత్తి వచ్చునని, మొదలుగా జ్యోతిషఫలములని వ్రాసి వార్తాపత్రికలలో ప్రచారము చేయుట రాజనీతి దృష్టిలో క్షంతవ్యముకాని మహాపరాధ మగుట వింతకాదు మేరువువూసవంటి ఉదాహరణ మొకటి, మచ్చునకు చిత్తగింపుడు. 1962 వ సంవత్సరము ఫిబ్రవరినెలకు ముందే నెహ్రూ పండితునికి రాజకీయముగా అధఃపతనము పరిపూర్తి యగునని ఒకానొక జ్యోతిష్కుడు 26—7—1957 వ తేదీన నాటి "భారతజ్యోతి' పత్రికలో ప్రకటించెను ఇట్టి పిచ్చి వ్రాతలు శాస్త్రమునకు అపకీర్తిని సంపాదించుటకు మాత్రమే పనికివచ్చుచున్నవి కదా ? ఎంత రాజనీతి దురంధరుడైనా, ఎంతటి సహన శక్తి కలవాడైనా, నెహ్రూ పండితుడు మానవమాత్రుడే ! అతనికి మాత్రము కోపతాపము లుండవా ? ఒకవేళ జాతకసూచనలు అట్టివే అని ఆ కార్తాంతికుడు పొరబాటున నమ్మి యుండినా, అవి ప్రకటించుట మాత్రము వివేకమనజాలము వాస్తవ స్థితిలో రాజకీయ రంగమునందు మన మహా ప్రధాని ప్రభావము అత్యున్నత స్థాయి నందుకొనుచున్న కాలమిది లోకసభ మొత్తము అతని అరచేతిలోనున్నది అతని బలమును తగ్గించు ఆశతో సర్వసన్నాహములు చేసిన ప్రతిపక్ష నాయకప్రముఖులు ఎన్నికలలో రూపనామక్రియలు లేకుండునట్లుగా అణగిపోయినారు రాష్ట్రములలో అతని ఆదేశమునకు ఎదురులేదు సత్యమును విచారించితిమేని దేశపరిపాలనలో అతని నిరంకుశాధికారము పరాకాష్ఠ నధిరోహించిన కాల మిదే అనవచ్చును అతని జాతకమునకు దేవమానదశలో చలితలగ్నము పరాక్రమస్థాన మందలి వరుణుని సంయోగమునకు వచ్చియున్న వయస్సుది అధికారమును సంపాదించుకొని యున్నవారికి ఈ దశ అప్రతిద్వంద్వమగు పౌరుషమును అనుగ్రహించగలదు ఆ ఫలమే చూపట్టుచుండుట !

ఇటీవల అనర్థకరములగు జాతకఫలం ప్రకటనల సంఖ్య చాలా పెరిగిపోయినదని పాఠక మహాశయులు ఎరుగుదురు. మహాప్రధాని వీనిని గూర్చి అసహ్యపడుట యుక్తమే ! అయినా, అట్టి ఫలాదేశములు చేసినవారిని ప్రత్యేకముగా తగు రీతి మందలించుట కర్తవ్యము అగును. కాని, జ్యోతిశ్శాస్త్రమునే మోసమనుట, జ్యోతిష్కులను మోసగాండ్రనుట మాత్రము అసంగత మనక తీరదు.

ప్రకృత మనుసరింతము. రవిచంద్ర సంయోగముతో (అనగా పర్వముతో) సంబంధించనిదే గ్రహకూటము గొప్ప ఫలము నీయజాలదు. అందులో పర్వశక్తితో గ్రహయుద్ధజనిత విషమశక్తి చేరినపుడే, భూమండలమున గొప్ప క్షోభ జనించగలదు. ఆ పర్వము ఏ రాశిలో వచ్చునో, ఆ రాశి భూమండలమున ఏ దేశమునకు సంబంధించునో, అందుమాత్రమే ఫలము వ్యక్తము కావలసి యుండును సాయనపద్ధతిలో, ఇంగ్లండు, జర్మనీలకు మేషమని, రష్యాకు కుంభమని, అమెరికా సంయుక్తరాష్ట్రములకు మిథునమని, ఇండియాకు మకరమని, మొదలుగా పాశ్చాత్యులు నిర్ణయించిరి మన జ్యోతిష్కులు, నిరయనముగా, కన్యారాశి హిందూదేశమునకు సంబంధించినదని భావించుచున్నారు. ఇందు ఎవరి మతము సాధువో ? ఏ రాశి అయినా దానియందలి ముప్పది భాగల ప్రదేశ మంతయు ఆ దేశమునకు ఫలము నిచ్చునని విశ్వసించుట కష్టము. ఇది గొప్ప అవ్యవస్థ ! ఈ విషయమై ఎంతో పరిశోధన జరుగవలసి యున్నది

కనుక, ప్రపంచ ఫలితములట్లుంచి, వ్యక్తి జీవితములకు గ్రహకూటము ఎట్లు అన్వయించునో, కొంత పరిశీలింతము. గ్రహకూటము ఎంత దుష్టమయినా, ఏ దేశమున కది వ్యాపించినా, అచటి జను లందరికిని అది విషమ ఫలము నిచ్చు ననుకొనుట అవిచారరమణీయము. పర్వము ఏ ప్రత్యేక బాగలో ఏర్పడునో, ఆ భాగకు, దాని నవమసప్తమ బాగకు, గ్రహకూట ఫలము వ్యాపించుట సహేతుకము కాగలదు ఆ విశిష్టభాగలలో ఏ వ్యక్తి జాతకమందలి గ్రహములు ఉండునో, ఆ గ్రహ భావ ధర్మముల ననుసరించి, ప్రస్తుత దశానుగుణముగా, అతని జీవితములో, మంచిదో, చెడ్డదో, ఫలము సంభవించును. కాని ఆ వేధ నికరముగా లేనిచో ఫలము కలుగదని ప్రాచీనులు చాటి చెప్పిరి

"వాలాగ్రేణాపి యథా
దృక్పులనే వేధకస్య లక్ష్యాగ్రాత్,
ఫలు సిద్ధ్యతే న సోర్థః,
తద్వద్వే ధోపి విభ్రమః" (రల్లడ

లక్ష్యశుద్ధి వెంట్రుక మందము తప్పినా, వేధకు ఫలము లేదనుట ! వేధభాగ మాత్రమునకైనా నికరముగా నున్నచో, రెండు, అథవా నాల్గు, వారముల లోపలనే ఫలానుభవము కల్గును. నెలలు, సంవత్సరములు, కాచుకొని యుండు నని యుండదు

ఈ క్రింది ఉదాహరణములు కొన్ని చూడుడు:—

(1) శ్రీయుత వి కే కృష్ణమీనన్ గారికి ఎన్నికల పోటీలో బొంబాయి నగరమున మహత్తర విజయము కలిగినది కదా ? అతని జాతకములో ఇపుడు చలిత రవి శుక్ర సంయోగము కర్కాటకరాశిలో $16\frac{1}{2}^\circ$ లో అతని పుణ్యసహమమునకు (కన్యారాశిలో $16\frac{1}{2}^\circ$) నికరముగా గుప్తమిత్ర దృష్టితో నున్నది. ఈ రెండును ప్రశంసలో నున్న పర్వస్థానము (కుంభము 16°) మీద తులాభారము తూగుచున్నవని పాఠక మహాశయులు గుర్తించగలరు. మీనన్‌గారికి ఉపచయ స్థానమందే ఇప్పటి గ్రహకూటము సమావేశ మగుట ! అఖండ విజయలక్ష్మి అతని నేలవరించదు ? మరియొక్క విశేషము ! పైన వివరించిన తులాభారమునకు ఆధార స్థానము సింహములో $16\frac{1}{2}^\circ$ కదా ? మహాప్రధానిగారి జన్మలగ్న జన్మ చంద్రుల మధ్య బిందుస్థాన మదే యని మనము గమనించితిమేని, మీనన్‌గారి విజయమునకు ఆధార మెందున్నదో కరతలామలకముగా బోధపడగలదు.

(2) హిందూదేశమునకు రాజకీయ స్వాతంత్ర్యము లభించిన ముహూర్తపు జాతకమున రాజ్యస్థాన (దశమ) కేంద్రము కుంభరాశిలో $15\frac{1}{2}^\circ$ లలో నుండినది అప్పటి చతుర్థ భావము (సింహము) లో బుధ, యమ, శని, శుక్ర, రవులతో చిన్న గ్రహకూట మొకటి ఏర్పడి ప్రజాసత్తాక రాజ్యమునకు అంకురార్పణమును సూచించెను. ప్రశంసలో నున్న గ్రహకూటము ఆనాటి

గ్రహకూటమునకు సమసప్తక వేథలో నుండగా, ఇప్పటి పర్వము ఆనాటి రాజ్య స్థానములో (ఉపచయ స్థానము) పడినది. గ్రహకూటానంతరము జరిగిన ఎన్నికల ఫలముగా, రాజ్యాంగము పటిష్ఠమై నిరంకుశ ప్రభుత్వముగా అభివృద్ధికి వచ్చుటకు, భూస్వాముల యొక్కయు, కృషీవలుల యొక్కయు, అతృప్తి హెచ్చుటకును, బీజావాపము జరిగినదని సూచన

(3) ఒకానొక వృశ్చికలగ్నపు బాలిక జాతకములో సింహమందలి బుధునికి (15° —8') సమసప్తకవేధ ఈ పర్వము వలన ఏర్పడినది అప్పటినుండి ఆ బాలికకు జ్వరము, కోరింతదగ్గు.

(4) మరియొక వృశ్చిక లగ్నపు బాలికకు జన్మ చంద్రునికి (సింహములో (16° —8') సమసప్తకవేథ ఈ పర్వము వలన కలిగినది అప్పటినుండి ఆ బాలిక జ్వరబాధతో నలిగినది

(5) లోకసభా సభ్యత్వమును సంపాదించిన ఒకానొక మాననీయునికి జన్మ లగ్నము సింహము. లగ్నాధిపతి రవి, కుంభములో 16°—43' లో నుండుట ! ప్రశంసలో నున్న పర్వము ఆ రవి స్థానమునకు ఉత్తేజనము నిచ్చినది అభివృద్ధికరమగు మహదాశ్రయము లభించునని సూచన

(6) శ్రీయుత నీలం సంజీవరెడ్డిగారి జాతకములో 'అభివృద్ధి' సహమము కుంభములో 16°—15' లో నున్నది. ప్రశంసలో నున్న గ్రహకూటపు పర్వమువలన ఆ సహమమునకు అపూర్వమయిన ఉత్తేజనము లభించెను అంతఃకలహముల భారముచే అల్లాడుచున్న ఆంధ్రప్రదేశ రాజ్యాంగ నౌకను అపాయములపాలు కాకుండునట్లుగా గడుపుటకు తగిన కర్ణధారుడితడేయని భారతమహాప్రధాని నిర్ణయించినాడు ఎవరికి రుచించినా, ఎవరికి రుచించకపోయినా, అతని ఆజ్ఞకు ప్రతిలేదు. అనాయాసముగా శ్రీ సంజీవరెడ్డి నాయకపట్టమును సంపాదించగలిగెను. ఆంధ్రప్రదేశ పరిపాలనము అభివృద్ధికరముగా కొనసాగగలదు

(7) ఒకానొక ధనుర్లగ్నపు రాజకీయోద్యోగిపైన కొన్ని యేండ్ల క్రిందట ఏదో నేరము ఆరోపించబడి, అతని ఉద్యోగము వూడిపోయినది. నెమ్మదిగా నాలుగయిదు సంవత్సరములు అభియోగము విచారణ జరిగి, తుదకు న్యాయస్థానములో అతనికి కారాగార శిక్ష విధించబడెను జీవనోపాయము కోలుపోయి నానాబాధలకు లోనై, అతడు అప్పీలు చేయగా, ఈ పర్వము వచ్చిన వారములోనే, అతడు నిర్దోషి యని ఉన్నత న్యాయస్థానములో తీర్మానమైనది. ఆ వ్యక్తి జాతకములో ఉపచయ స్థానములో నున్న రవి (కుంభములో 16°) పైన ఈ పర్వము వచ్చుటవలన కలిగిన ఫలమిది.


(8) ఒకానొక వృషభలగ్నపు తరుణికి దేవమాన దశలో ఇపుడు చలిత దశమకేంద్రము కుంభములో 16½° లో నున్నది అది ఆమెకు ఉపచయ స్థానము ప్రశంసాపపర్వము ఆ కేంద్రమునకు ప్రోద్బలము నిచ్చినది. గ్రహకూట మందలి బుధుడు ఆమెకు పంచమాధిపతి శుక్రుడు లగ్నాధిపతి. గురువు లాభాధిపతి వారము తిరుగక పూర్వమే అత్రముగా ఆమెకు వివాహము జరిగెను. విధిలేని పరిస్థితులు ఏర్పడుటవలన, పెద్దలు ఆకస్మికముగా ఆమెకు రహస్యవివాహము జరిపినారు

గమనించినచో సమృద్ధిగా ఉదాహరణములు లభించగలవు కాని, మచ్చునకు ఇవి చాలు

సారాంశ మేమన, గ్రహకూట పర్వముతో జాతకమందలి విలువగల స్థానములకు స్పర్శరానిదే, శుభమయినా, అశుభ మయినా, దాని ఫలమంటదు. కాక, పర్వములనాడే ఫలమునకు ఎదురు చూడరాదు. పర్వానంతరము ఆయా వ్యక్తుల దైనిక జాతక కేంద్రములు ఫలప్రద స్థానములను చేరుకున్ననాడే వారికి ఫలప్రాప్తి. సాధారణముగా ఇది మరల పర్వము వచ్చులోపల జరుగగలదు వ్యాసము పెరిగిపోవునని, పై ఉదాహరణములకు జాతకములను కాని, దైనిక కేంద్రచలనసమన్వయమును కాని, ఇచట చూపనైతిని క్షంతవ్యుడను.

ఒక్కమాట ! ఈ గ్రహకూటపు ఫలము తనకు ఏమీ తగులలేదని నెహ్రూ పండితుడు సెలవిచ్చినాడు వాస్తవమే అతని జాతక గ్రహములకు ఈ పర్వస్పర్శ రాలేదు మరి, అతనికి ఫల మెట్లు వచ్చును ? అతని జన్మ చంద్రుడు సింహములో 10° లో నుండుట గ్రహకూటపర్వము కుంభములో 16° లో. ఏమి సంబంధము ? పృష్ఠతాడనదంతభంగన్యాయమగును గదా ? కాని, తనకు ఫలములేదను కారణమున ఇతరు లెవరికీ ఫలము ఉండదని అతడు భావించు పట్ల, అది శాస్త్రీయ దృక్పథము కాదనిమనవి

"పర్యాయ యోగా ద్విహితం విధాత్రా,
కాలేన సర్వం లభతే మనుష్యః." —(మహాభారతము.)



ధనుర్దాసు

శ్రీ బొడ్డు బాపిరాజు

ఇల్లాలి వాలుగనుల సోయగం వసివాడకుండా గొడుగుపట్టి శ్రీరంగని తిర్నాళ్ళలో తిరిగే మల్ల వీరుడు ధనుర్దాసుని ఏకాగ్రత ఆచార్య రామానుజుల ఆభక్తినీ అనుగ్రహాన్నీ ఆకర్షించుకున్నది. 'భాగ్య హేమాంగి కన్నులకన్నా చక్కని విక జగత్తులో లేవన్న ఆ సౌందర్య పిపాసికి శ్రీరంగనాథుని దివ్యలోచన సందర్శనం ప్రసాదిస్తారు ఆచార్యులు. ఆ దివ్యదర్శనానంద పరవశుడు ధనుర్దాసు—

ఊరేఖాంకిత సౌందర్య
స్నేహ సుధా సాగరములు; నిర్వేల జగ
న్మోహన కాంతి స్ఫారము
లోచనా! శ్రీరంగ విభుని లోచన శోభల్!

ఎంత నెయ్యపుచూపు లెల్ల సౌందర్యముల్
కొలువున్న పసిడి చెంగలువ పూవు;
లివి జన్మజన్మల తృష్ణలార్చెడు సుధల్
తొలకించు కారుణ్య జలధరములు;
కోటి పున్నమి రేల గుండె చల్లదనాలు
నిండించుకొన్న వెన్నెల మడుంగు;
లీ కొండ గుహను వెల్గించి మోహపు గాఢ
తిమిరముల్ పోకార్చు దీపశిఖలు;

మానినీ మత్త దృగ్వలమాన మాన
సాంబు నిధి తరంగాంత రంగంబు నందు
వెలువడిన క్రొత్త మీనులు వేయి వేయి
జన్మ లలరించు నీ రంగశాయి కనులు

ఎన్నాళ్ళన్ వృథచేసుకొంటి నిటు తండ్రీ! అర్థ సంగా భ్రమ
చ్ఛన్న స్వాంతుండ—క్షుద్ర పల్వల జల స్నానాను రక్తుండ, నా
కన్నన్ లేడు దరిద్రు డెవ్వడు, భవత్కల్యాణ నేత్ర ద్వయిన్
కన్నారం గనజాల నీ యమిర లావణ్యా ప్రసుపాతమ్ములన్!

స్వామీ! జన్మసహస్ర సంచిత తపస్సంప్రాప్త పుణ్యోదయం
బీ మాధుర్యము నెట్లు దాచుకొనుటో యీ చిన్ని డెందాన తం
డ్రీ! మన్నింపు మెరుంగజాలను, కృపాస్నిగ్ధంబు ఏతాదృశ
శ్రీ మద్దృగ్విభవంబు పాడుకొను టెట్లీ రుద్ధకంఠమ్మునన్?

నవనీలోత్పల దళముల
సవరించు సుధాంశు కిరణ సౌందర్యమ్ముల్
నవి ప్రభుని వెడద కన్నుల
రవణించు దరస్మితాంశు రమ్ములు దలతున్ !

అంగనచూడ్కు లుత్పలములంచు, నవాంబుజ ఖంజరీట సా
రంగములంచు, మన్మథ తురంగములంచు, విలాస వీచికా
రింగణలోల బాలశఫరీ భ్రమరీకుల మంచు మెచ్చు ను
ద్భంగ వచోధనుం డితడపత్రప పల్కనులేదు, సామి శ్రీ
రంగని దివ్యలోచన హిరణ్మయ దీధితి నోలగించుచున్.

మరు మరీచిక కొరకు ముమ్మరపు తృష్ణ
పరచు నజ్ఞాన హరిణశాబకము బట్టి
చేర్చితివి చల్లనగు నర స్థిర భూమి
ఆరని పిపాసలెల్ల చల్లార్చుకొనగ.

గడపితివో ప్రియాననమున కౌముదిలో సొగసున్-వయస్సు, మా
కుడుగనివంట, లవ్వలపు టూయెల పాయని జంటలంచు; ఇ
ప్పుడు విలపింతు నిన్నుగని, పోయినకాలము కూడిరాని ది
య్యెడ నని, పంకజాక్ష! క్షమియింపుము నా యవివేకమాంద్యమున్ !

దేవ! త్వదీయ దృగ్గగ దధీనుడు వీడొకడంచు నేమి? బృం
దావన గోపికాజనమనః ప్రణయ ప్రకటైక భోగలీ
లా వివశంబు లిట్టి నయనాంబుజ రేఖలలో ద్రవించియున్
బోవని రాతిగుండియలునున్ గలవొక్కొ? సిరంగనాయకా !

సత్యం బాత్మ వెలింగె నేడు; తరుణీ సౌందర్య సంసేవనా
జాత్యంధత్వము లారె; తీరిన వభీష్టస్వప్న సంచారముల్
నిత్యానందరసప్రవర్ధనము లీ నీరేజ పత్రాక్షు సాం
గత్యంబుల్ గలిగెన్, మనోమధుపకాంతా సుప్రభాతంబులై !

కావేరీ లహరీ పరీమళము లంగశ్రేణికిన్ నిత్యమున్
పావిత్ర్యమ్ము ఘటింప, మీ భవనభాస్వద్గోపురం బాత్మలో
సౌవర్ణచ్ఛవినింప, పూర్వకృతమత్ సర్వాఘముల్ ప్రత్యుషః
కైవారమ్ము లడంపగా ప్రభుకటాక్ష శ్రీల జీవింపనో !

కడలిరాయనిపట్టి కరము పట్టిన నాడు
ఎలనవ్వులను ప్రేమజిలుకు కనులు
పగవాని తమ్ముని తెగువ నేలిన నాడు
నిండువాత్సల్య మందించు కనులు

కొలువులో మగువ కొందలము మాన్పిన నాడు
అభయ ముద్రాంకము లయిన కనులు
ములుకునాటిన యంచ యళుకు తీర్చిననాడు
జీవకారుణ్యముల్ చిందు కనులు

రేబవల్లను పూలుపూయించు కనులు
రెప్పలార్పక శ్రితుల పాలించుకనులు
ప్రథిత సౌందర్యధునులు, కృపా ప్రకాశ
ఖనులు, మత్తపోవనులు, రంగయ్య కనులు

రమణీ చంచల లోచనాంచల చలద్రాగ స్మితం బాతప
శ్రమకున్ వాడకయుండనెత్తె మును ఛత్రం బే ధనుర్దాసు, వా
డమరించున్ ప్రభు సుందరాక్షి జలజాగ్రక్షోణి ముక్తాతప
త్రముగాగా తన జీవితం బిపుడు శ్రీరంగా! జగన్మంగళా!

ప్రవహించెన్ గొరగాని యీ చవిటిపఱ్ఱన్ దివ్యగంగాఝరీ
నివహమ్ముల్, చిటిముత్తెపున్సరులు పండింపంగ; కానిమ్ము, నీ
వవలోకించెదు గాక! దాసునికృషి ప్రావీణ్య, మప్పంట వై
భవమెల్లన్ వెలకట్టి నాణెమును దెల్పన్ సార్థవాహుల్ ప్రభూ!

నవశృంగారతరంగ రానరతిధన్యమ్మన్య, మిచ్ఛావిహా
రవిధా మత్తగజేంద్ర మియ్యది; యదల్పన్ జాలు భవ్యాంకుశం
బవు నీ దివ్య కటాక్ష వీక్షణము; రంగా! త్వత్పదాలానబం
ధవమున్ పట్టపు టేన్గు జేసుకొనగా నర్థింతు నీదాసుడన్

శ్రీరామానుజ కరుణా
సారసమాలబ్ధ రంగశాయిస్మితదృ
క్సారస సౌరభములు వి
స్ఫారగ మత్ప్రాణ పథములం దయిదింటన్!

సంస్కృత రాఘవ పాండవీయములు

శ్రీ ఈయుణ్ణి వెంకట వీరరాఘవాచార్యులు

"రమ్యా రామాయణీ మైషా భారతీ సైవ భారతీ,
అర్ధనారీశ్వరమయీ మూర్తి శ్శేత్ర శోభతామ్."
(కవిరాజసూరి: రా. పా. I–42)

మానవ ప్రతిభ యూహింపగల కవితా చమత్కారములన్నియు సంస్కృత కావ్యోద్యానమున లభించును ఇవి వృత్తద్వయమును అర్ధనారీశ్వర శరీరన్యాయమున క్షీరనీర న్యాయమున, ఏకనాళావలంబియగు ఫలద్వయమువలె, కావ్యముననామూలాగ్రవ్యాప్తముగా పెనవేసి రచింపబడిన కావ్యము ద్వ్యర్థికావ్యము, ద్విసంధానకావ్యము అని వ్యవహరింపబడును. ద్వ్యర్థికావ్యమును పఠించి,ఆనందించుటకు పర్యాప్తమగు సాహిత్యసంస్కార మవసరము వ్యుత్పన్నుడగునట్టి యధికారి రామాయణ కథాజిజ్ఞాసతో రాఘవ పాండవీయము వంటి యుత్తమ ద్వ్యర్థి కావ్యమును పఠించినచో మనఃక్లేశము నంతగా కల్గింపక, ఆ కావ్య మంతయు తదనుగుణముగా నన్వయించును. భారతకథ నెరుగు సంకల్పముతో పఠించిన నా కావ్య మంతయు నట్లే విశదమగును ఇది ద్విసంధాన కవుల పరమ లక్ష్యము కాని ఈ కావ్యము లెంతటి వ్యుత్పన్నుల కైనను వ్యాఖ్యాన సాహాయ్యము లేనిచో మనఃక్లేశ జనకములే యని చెప్పవచ్చును ఉత్పన్నములు, అజ్ఞాతములు, కించిద్ విస్మృతములు అగు రాఘవపాండవీయములను గూర్చి యిట కొంత వ్రాయబడును.

1

<u>ద్వి సంధానము—(ఆచార్యదండి—క్రీ 6 వ శతాబ్ది).</u>

భోజుడు శృంగార ప్రకాశమున (9వ ప్రకాశము)
'దండినో ధనంజయస్య వా ద్విసంధానమ్
"ఉదార మహిమా రామః ప్రజానాం హర్షవర్ధనః
ధర్మప్రభవ ఇత్యాసీత్ ఖ్యాతో భరత పూర్వజః" '1

అనుచు దండిదియో, ధనంజయునిదియో 'ద్విసంధానము'ను పేర్కొనుట యేకాక, యందలి శ్లోకమొకటి యుదాహరించెను ధనంజయుని 'ద్విసంధానము'న నీ పద్యము కానరాదు కావున నిది లుప్త మనదగు దండి 'ద్వి సంధానము'లోని దనియు నీ కృతియందలి యితి వృత్తము రాఘవ పాండవీయ కథయే యనియు నూహింప జనును కావ్యాదర్శము(దశకుమార చరితము) అవంతి సుందరీ కథయు దండి యితర కృతులు.

2

<u>రాఘవ పాండవీయము (కవిరాజ సూరి—11 వ శతాబ్ది)</u>

కవిరాజసూరి, తత్కృతులు, కాలములను గూర్చి నేను విపులముగ రచించిన ఆంగ్లాంధ్రవ్యాసములు రెండు పుష్కరములకు, పూర్వముననే ప్రకటింపబడినవి 2 కుతూహలముగల పాఠకు లా వ్యాసములను చూచెదరు గాక. 'కామదేవాంక' మగు కవిరాజసూరి 'రాఘవ పాండవీయము'న 13 సర్గములును, మొత్తము 672 శ్లోకములును కలవు కవి రాజును, ద్విసంధాన కావ్యమును నిర్మించిన జైన ధనంజయుడు నించు మించుగా సమకాలికులు కావచ్చును సంస్కృతమున ద్వ్యర్థి కావ్యమును రచించిన వారిలో కవిరాజు రెండవవాడు కా వోపును ఈతని మఱి యొక కృతి 'పారిజాతహరణ'మను పది సర్గల మహా కావ్యము.3 ఇది యింకను ముద్రితము కాలేదు కవిరాజ 'రాఘవ పాండవీయము'పై వ్యాఖ్యలు రచించిన వారు

1. చారిత్రవర్ధనుడు
2. పద్మనంది
3. పుష్పదంతుడు.
4. ప్రేమచంద్ర తర్కవాగీశ భట్టాచార్యుని 'కపాట' విపాటిక (ముద్రితము)4
5. రామభద్రుడు.
6. లక్ష్మణపండితుని 'సార చంద్రిక' (ముద్రిత)5
7. విశ్వనాథుడు
8. శశధరుని 'ప్రకాశము' (ముద్రితము)6

---

1. Sri M. Ramakrishna Kavi's Introduction (p. 6) to Sri Avvari Subrahmanya sastri's Telugu Trans. of Dandin's <u>Kavyadarsa.</u> (1929)

2. (a) <u>Dvyarthi & Tryarthi Kavyas in Sanskrit Literature</u> – in the <u>K B. Pathak Cammemoration Volume</u> – p p. 367—81–Poona. (1934).

   (b) 'కవి రాజసూరి కాలనిర్ణయము'(ఆంధ్ర పత్రిక—'ఉగాది సంచిక' విభవ సంవత్సరము 1928)

   (c) 'కవి రాజసూరి కాలనిర్ణయము'—ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక—ప్రభవ, మార్గశిర—ఫాల్గున మాసములు, సంపుట 16 సంచిక 5—6. డిసెంబరు 1927—మార్చి 1928)—పుటలు 247—55

   (d) 'సంస్కృత రాఘవపాండవీయ విమర్శనము'—)ఆం సా ప పత్రిక సంపుట 17. సంచిక 2 పుటలు 65—72 సంచిక 3 పుటలు 127—137)—1927 ఏప్రిల్—జులై.

   (e) 'సంస్కృత సారస్వత చరిత్రము—ద్వ్యర్థిత్ర్యర్థి కావ్యములు'—(ఆం సా. ప పత్రిక. సంపుట 23. సంచిక 5 పుటలు. 193—200. భావ, మార్గశిర పుష్యములు—డిసెంబరు 1934—జాన్యువరి—1935)

   (f) ఆం సా ప ప సంపు 24, సంచిక2 పుట 49—64 (జూన్—జులై 1935)

3. <u>A Triennial Catalogue of Mss</u> —Vol. IV.

4. (1) <u>Bibliotheca Indicae d</u>-pp.4+435+2. Sanskrit Press, Calcutta. –(1854A D.)
   (2) Reprint of the above ed by Bhavadeva Chatterji (B I ed)-Calcutta (1892)
   (3) In Telugu tye -Demy pp 2+1+1—286. Sriniketana Press, Madras (1892)

5. Grantharatna-mala ed, with the <u>Sarachandrika-com</u> by Laksmana Pandita-Bombay (1889)

6. <u>Kavyamala No 62</u> with the com <u>Prakasa</u> by Sasadhara N. S. Press, Bombay–(1897)

9 (మరాళశ్రేణి కృత 'ప్రకాశ' వ్యాఖ్య)

పై వ్యాఖ్యలనుబట్టి కవిరాజు కృతి వాఙ్మయ ప్రపంచమున నెంతటి ఖ్యాతి నందెనో యూహింపఁదగును కవిరాజు కావ్యమునుండి మచ్చునకు—

1. 'నిఃశ్రేణ్యో బ్రహ్మలోకస్య, వాగ్దేవ్యాః కర్ణకుణ్డలే
ధర్మద్రుమ మహామూలే వాల్మీకి వ్యాసయోః కృతీ'

2 'పురాణ రామాయణ—భారతాది—
క్షీరాణి సంయోజిత భక్తి వత్సైః
పురాతనై ర్యా దుదుహే కవీంద్రైః
సా భారతీ కామదుఘా మ మాస్తు' (రా పాండవీయ I, II, 12)

3

ద్విసంధానము[7] (—రాఘవ పాండవీయము) జైన ధనంజయుఁడు

ఈ ధనంజయుఁడు 'నామమాలి'యను ధనంజయ నిఘంటువును కూర్చుటచే నీతనిని నైఘంటుక ధనంజయుఁ డనవచ్చును ఈతని తల్లి శ్రీ దేవి, తండ్రి వాసుదేవుడు[9] ధనంజయుని 'ద్విసంధానమును' 'శృంగార ప్రకాశము'న భోజుఁడు (క్రీ 1005—62) పేర్కొనుటచే నీతనికంటె ధనంజయుఁ డించుక పూర్వుఁడో సమకాలికుఁడో కావచ్చును

ముంజుని సభను (క్రీ 975—95) అలంకరించిన ధనంజయుడు బ్రాహ్మణుఁడు, విష్ణుని కుమారుడు, దశరూపక నిర్మాత, నైఘంటుక ధనంజయునికంటె భిన్నుఁడగు నీతనిని దశ రూపక ధనంజయుఁడనవచ్చును.

డాక్టర్ కాశీనాథ బాపూ పాఠక పండితుడు 10—

కొన్ని గ్రంథస్థ ప్రమాణములనుబట్టి, కొన్ని కన్నడ శాసనములను బట్టియు జైనధనంజయుఁడు క్రీ 1123—40 నడుమ ద్విసంధానమును నిర్మించి యుండునవియు, ఈతనికి శ్రుతకీర్తి యను ఉపనామము కలదనియు వ్రాసియుండెను. డాక్టర్ వింటర్‌నిట్జ్[11] డాక్టర్ ఎ బి కీత్[12] యం డఫ్. పండితులు[13] తమ సంస్కృత వాఙ్మయ చరిత్రలయందును, భారతీయ గ్రంథ గ్రంథకారుల కాలవిచారమునందును పాఠకపండితుని మతమునే ప్రమాణీకరించుకొనిరి

కాని, జైన ధనంజయుడు, శ్రుతకీర్తియు, భిన్న వ్యక్తులనియు, ధనంజయుడు క్రీ 960—1000 నడుమ ద్వి సంధానమును రచించియుండుననియు, శ్రుతకీర్తి త్రైవిద్యుడు గత ప్రత్యాగత విధానమున రాఘవ పాండవీయమను నొక మహా కావ్యమును నిర్మించియుండెననియు, ప్రమాణ పురస్సరముగ సిద్ధాంతీకరించి, వింటర్‌నిట్జ్, పాఠకపండితుల యభిప్రాయమును

---

7 కావ్యమాల—49. వ్యాఖ్యతో (1895)—బొంబాయి

8 వావిళ్లవారి ప్రతి—తెనుగు లిపి, తెనుగుటీకతో (మద్రాసు)

9 ద్విసంధానము VIII 146 (పై కావ్యమాలా ప్రచురణము)

10. Dr. K B. Pathak 'Journal of the Bombay Branch of the Royal Asiatic Society-Vol XXI pp ff.

11. Dr. M. Winternitz History of Indian Literature - Vol. III. p. 75 (In German)

12 Dr. A B. Keith 'History of Sanskrit Literature p. 137 (1928 A. D)

13. M. Duff Chronology of India.

ఖండించుచు, డాక్టర్ పి వెంకట సుబ్బయ్యగారు 35 సంవత్సరముల క్రిందట నొక వ్యాసమును ప్రకటించియున్నారు [14] నేనును, వెంకటసుబ్బయ్యగారును భిన్న మార్గముల ననుసరించి, వడసిన జైన ధనంజయుని కాల మేకీభవించు చున్నది.

ధనంజయుని ద్విసంధానమున 18 సర్గములు, 1105 శ్లోకములును కలవు. కవిరాజు "రాఘవ పాండవీయము' కామదేవ పదాంకమగుచో, ధనంజయుని 'ద్విసంధానము' ధనంజయ పదాంకము ఇట్టి కావ్యచిహ్నములను గూర్చియు, ఈ ద్విసంధానమును గూర్చియు నా రచించిన 'సంస్కృత ద్వ్యర్థి—త్ర్యర్థి కావ్యములు'—అను వ్యాసమును పరిశీలింపవచ్చును [14]

సంస్కృత కవులు కొందఱు తమ కావ్యముల కాద్యంతములందుకాని, అంతమున కాని స్వనామమునో, అందలి యాద్యక్షరములనో, స్వపోషక నామమునో, తమ కిష్టములగు శ్రీ,లక్ష్మీ మిత్యాది శబ్దములనో, అనురాగ—ఆనంద—కర్ణి కాకర—కామదేవ—జిన—ధనంజయ—రత్న—రామ—లక్ష్మీ—విజయ—శ్రీ—సంపదానంద — సారస్వతశ్రీ — హరిచరణ సరోజ — ఇత్యాది శబ్దములనో కావ్యలాంఛనములనుగా వాడి యుండిరి అందు స్వనామాంకత కుదహరణములు

1. జినరత్నసూరి—నిర్వాణ లీలావతి జినాంకము.
2. ధనంజయుని ద్విసంధానము.
   ధనంజయాంకము.
3. రత్నాకరుని—హరి విజయము.
   రత్నాంకము.
4. రాజశేఖరుని—హరివిలాసము
   (ఉత్పన్నము) రాజశేఖరాంకము.
5. విజయ (విజయాంక) కృతి
   విజయాంకము.

ద్విసంధానముపై వ్యాఖ్యలు.

1. కవిదేవర—వ్యాఖ్య[15] రామభట్టు తనయు డగు నీతడు అరలు శ్రేష్ఠి ప్రోత్సాహమున పై వ్యాఖ్యను నిర్మించెను (అముద్రితము)

2 నేమి చంద్రుని—'పదకౌముది'. ఈతడు దేవనంది, వినయ చంద్రుల శిష్యుడు. పద కౌముది—9000 గ్రంథాగ్ర పరిమితిగల విపుల వ్యాఖ్య. దీనిని సంగ్రహించి, బదరీ నాథపండితుడు 'కావ్యమాల' యం దీకావ్యమును ప్రకటింప జేసెను

3. పుష్పసేన శిష్యుని వ్యాఖ్య [16] (అముద్రితము)

ఇతి వృత్తభేదము గల యీ క్రింది ద్విసంధాన కావ్యములను కూడ నిట పేర్కొనదగును

(1) ద్విసంధానము (లేక నేమినాథ చరిత్ర) సూరాచార్య కవి [17]

ధారాధినాథు డగు భోజుని సంస్థానమున ద్రోణాచార్యుని శిష్యుడగు సూరాచార్యుడు పై కావ్యమును క్రీ శ 1034 (సంవత్—1090) వ వత్సరమున పూర్తి చేసెను. నేమి—ఋషభ దేవుల వృత్తాంతము క్షీరనీరన్యాయమున నీ కావ్యమున సంధానింపబడెను రాఘవ పాండవీయ కర్తయగు కవిరాజసూరి, ద్విసంధాన నిర్మాతయగు నైఘంటుక—ధనంజయుడును, పై సూరాచార్యుడు సంచుమించుగా సమకాలికులని చెప్పవచ్చును.

(2) ద్విసంధానము (నేమి ద్విసంధానము లేక నాభేయనేమి కావ్యము)[18]

కర్త హేమచంద్రుడు. ఈతని గురువు అజిత దేవుడు. పరమగురువు బృహద్గచ్ఛకు చెందిన మునిచంద్రుడు పై కావ్యమునందువలెనే యిందలి యితివృత్తము కూడ నేమి—ఋషభదేవుల కథయే. ఈ కావ్యమును కవిచక్రవర్తి యగు శ్రీపాలకవిరాజు పరిష్కరించెనట.

రాజశేఖర మహాకవి ద్విసంధాన—ధనంజయుని ప్రశంసించుచు రచించిన యీ క్రింది శ్లోకము జల్హణుడు కూర్చిన సూక్తిముక్తావళియందును, హరి కవి సంధానించిన సుభాషితహారావళియందును ఉల్లేఖింపబడి యున్నది.

(1) "ద్విసన్ధానే నిపుణతాం సతాం చక్రే ధనంజయః
యయా జాతం ఫలం తస్య స తాం చక్రే ధనంజయః"

ధనంజయుని ప్రతిభా పాండిత్యములను, కవిత్వ మహత్త్వములను సూచించు నీ క్రింది మూడు పద్యములును ఆ కవిశేఖరుని నిఘంటువున(=నామమాలలో) ఉప సంహార పద్యములుగా కన్పట్టుచున్నవి.

2 'ప్రమాణ—మకలంకస్య, పూజ్య పాదస్య లక్షణమ్
ద్వి సంధాన కవేః కావ్యం రత్నత్రయ—మపశ్చిమమ్

3 జాతే జగతి వాల్మీకే శబ్దః కవి రితి స్మృతః
కవీ ఇతి తతో వ్యాసే కవయశ్చేతి దండిని

4. కవయః కవయ శ్చేతి బహుత్వం దూర మాగతమ్
వినివృత్తం చిరా దేత త్కలౌ జాతే ధనంజయే"

—(II—48—50)

పై శ్లోకములు మూడును ధనంజయుడే స్వయముగా రచించెనో లేక ఏ కవియో రచించినవానిని, నామమాలా పరిష్కర్తలా నిఘంటువున చేర్చిరో విమర్శింపవలసి యున్నది

4

రాఘవపాండవీయము (నేమి చంద్రకృతము)[19]

ఈ కావ్యము బరోడా నగరమున కాంతి విజయ భాండారమున ప్రాచీ ప్రతిగా నున్నది నేమి చంద్రుడు పై ద్విసంధాన కావ్యమునే కాక, జైన ధనంజయకవి రచించిన ద్విసంధాన మనబడు రాఘవపాండవీయమునకు 'పదకౌముది' యను టీకను రచించెను

రాఘవ పాండవీయము (కర్త—అరలశ్రేష్ఠి)[20]

జైన కవియగు అరలశ్రేష్ఠి రచించిన పై కావ్య మముద్రితము దీని 'గ్రంథాగ్రము' 12,000 శ్లోకములు (అనగా నీ కావ్యమునం గల అక్షరముల సంఖ్య 38,400) కన్నడ లిపిలో వ్రాయబడిన యీ కావ్యము 'ఆరా' పట్టణమున (Arrah) 'జైన సిద్ధాంత భవన'మను దిగంబర భాండారమున కంఠగత ప్రాణముతో నున్నది ధనంజయుని ద్విసంధానముపై కవిదేవర పండితుడు, అరలుశ్రేష్ఠి ప్రోత్సాహమున నొక వ్యాఖ్య నిర్మించెను ఈ అరలు శ్రేష్ఠియు రాఘవ పాండవీయకర్తయగు అరలశ్రేష్ఠియు ఒక్క వ్యక్తి యనియే తోచుచున్నది

రాఘవ పాండవీయము (కవిపేరు తెలియదు)[21]

అముద్రితమగు దీని వ్రాతప్రతులు రెండు కలవు. కన్నడ లిపిలోనున్న ప్రతి 'జైన సిద్ధాంత భవన' మను దిగంబరభాండారమున కలదు నాగరి

14 ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక—సంపుట—24. సంచిక 2 (పుటలు 50—54) జూన్—జూలై, 1935.

14 J. B. B. R. A. S (New Series) Vol. III. P. P. 134-47- (1927.)

15 - 17 Prof. H. D. Velankar. Jina - Ratnakosa Page 185 (1944 A. D.) Poona

18 Jina - Ratnakosa - p. 185.

19-20 జిన రత్నకోశము

21. Jina - ratna - ko'sa

లిపిలో నున్న ప్రతి శ్రీహంసవిజయిజీమహారాజ గ్రంథ సంచయములోనిది. ప్రకృతము బరోడాలోని 'కాంతి విజయ భాండారము'న కలదు.

పై కావ్యమునకు 3 వ్యాఖ్యలు కలవు

1. మరాలశ్రేణి కూర్చిన 'ప్రకాశ' వ్యాఖ్య 'జైనసిద్ధాంత భవనము'న నున్నది.

2. పద్మనంది రచించిన వ్యాఖ్య 7,500 శ్లోకముల పరిమితి కలది. రైస్ (Rice) పండితుని—లిఖిత సంస్కృత గ్రంథ సూచికలో నిది పేర్కొనబడెను.

3 పుష్పదంతుని వ్యాఖ్య దీని గ్రంథాగ్రము 3000. ఇదియు రైస్ పండితుని సూచికలో నుల్లేఖింపబడియున్నది

కవిరాజసూరి రచించిన రాఘవ పాండవీయమునకు పద్మనంది, పుష్పదంతుడును రచించిన వ్యాఖ్యలు రెండు కలవు ఈ యిరువురును పైని పేర్కొనబడిన యిరువురును అభిన్నులే కావోవు అట్లే యగుచో కవి నామరహితమగు పై 'రాఘవ పాండవీయము' కవిరాజకృతమే కావచ్చును అట్టియెడ కవిరాజసూరి రచించిన 'రాఘవ పాండవీయము'పై మరల శ్రేణి కూర్చిన 'ప్రకాశ' వ్యాఖ్య (శశధరుని 'ప్రకాశ' వ్యాఖ్యకాక) ఒకటి కలదని తెలియుచున్నది ఈ విషయము పరిశీలింపవలసి యున్నది

7

రాఘవ పాండవీయము· (ఇట్టికేల—లేక—ఇష్టకల కృష్ణ పండిత కృతము)

కృష్ణ పండితుని రాఘవ పాండవీయ మింతవఱకు ననూర్యంపశ్యవలె అడయార్ గ్రంథాలయమున తాళీదళసంపుటములలో అజ్ఞాతవాసము చేయుచున్నది సంస్కృత సారస్వత గవేషణపరులలో నే కొలదిమందికో తప్ప దీని సంగతియే యెవరికిని తెలిసినట్టులు లేదు రామాయణ, భారత కథలు రెండును పెనవేయబడిన యీ ద్విసంధాన కావ్యమున 8 సర్గలు కలవు. కవి ఆనంద తీర్థులనబడు మధ్వాచార్యులవారి శిష్యుడని గద్యమునుబట్టి తెలియుచున్నది మధ్వాచార్యులవారి కాలము క్రీ. శ. 1199—1278—79 (మతాంతరమునుబట్టి క్రీ శ. 1237—1318) కనుక మన కవి క్రీ 13 వ శతాబ్దమునకు చెందియుండునన వచ్చును ఈయన జనకుడు అనంత పండితుడు, జనని లక్ష్మీదేవి గృహనామము ఇటికేల, ఇష్టకల లేక ఇటికిల కవి 'శ్రీ హయగ్రీవాను గ్రహ నుగ్రహ సమగ్ర కవితా వైభవుడు' ఇంటిపేరునుబట్టి యీత డాంధ్రుడనం దగును. మతమునుబట్టి వైష్ణవుడు ఈ కావ్యమునకు 'కల్పవల్లి' యను వ్యాఖ్య కలదు. దీనిని రచించిన పండితుఁడు డేగరమూడి రామసూరి ఈయన నందర (వ?) రాన్వాయతిలకుడని, శ్రీవత్స గోత్రజుడనియు వ్యాఖ్యారంభ శ్లోకములనుబట్టి తెలియుచున్నది. కవివలెనే వ్యాఖ్యాతయు (ఇంటిపేరునుబట్టి) ఆంధ్రుడనియే చెప్పవచ్చును వ్యాఖ్యాత తండ్రి సింగయ్య పితామహుడు మాధవార్యుడు. ప్రపితామహుడు భైరవుడు

పై యంశము లీ క్రింది గద్యాదులనుబట్టి విశదమగును.

౧. "ఇతి శ్రీ హయగ్రీవానుగ్రహ ముగ్రహ సమగ్ర కవితా వైభవస్య ఇటికిల కుల మండితయో ర్లక్ష్మీదేవ్యనన్త పండితయో స్తనూభవస్య శ్రీమదానన్ద తీర్థ గురు కరుణాలబ్ధ వైష్ణవ కలావితానస్య, కృష్ణ పండితాభిధానస్య కృతౌ సకలసుకవి సమ్భావ్యే రాఘవపాండవీయే మహాకావ్యే అష్టమ స్సర్గః"22

౨. వ్యాఖ్యాతృ గద్యము.

"ఇతి డేగరమూడి—రామసూరి విరచితాయాం రాఘవపాండవీయ వ్యాఖ్యాయాం కల్పవల్లీ సమాఖ్యయా మష్టమః సర్గః"23

3. వ్యాఖ్యా భూమికా పద్యములు 24

(1) 'అధిగత శరవాపో రామభూపాల మేఘో
మహితమహితనూజావిద్యుతాలిఙ్గితాఙ్గః
నివసతు హృదయే మే వర్ధయన్నఙ్కురాణి
ప్రవిమల కరుణామ్బోధారయా చిన్మయాని.

(2) రామాయణ భారత శేషః కథితః వు రేతి వార్తా
ఇట్టికేల వంశతిలకః ప్ర(స?)త్కావ్యం కృష్ణపణ్డితః కృతవాన్.

(3) శ్రీమన్నన్దరాన్వవాయతిలకః శ్రీవత్స గోత్రోద్భవః
ఖ్యాతో డేగరమూడి భైరవసుతః శ్రీ మాధవార్యః ప్రభుః
సన్మాన్యం సుషువే సుతం గుణనిధిం శి(సి?) ఙ్గాభిధానం చ యః
సోఽహం రామకవిః కరోమి ....తాం తస్యాః కృతే ర్వ్యాక్రియామ్.

(4) పూర్వం పద్యే కథా వృత్తా యా సా సా ద్వయ ముచ్యతే
వేదానాం సర్వశో వృత్తా శ్రోతౄణాం సుఖబుద్ధయే.

(5) అత్ర పూర్వకథా భాగాద్ వక్తవ్యం యది విద్యతే
ద్వితీయస్మిన్ వివేకోఽస్మి తేషు మన్వాస్తి పూర్వవత్'

4 మచ్చునకు కావ్యమునందలి పద్యములు కొన్ని చూపబడును.

(6) 'కల్యాణం మే విధత్తాం కమలజజనకః
సృష్టి సంస్థాన పాతుః (హేతుః?)
కాన్తో గౌర్యాఙ్గ కాన్త్యద్యుతతరకమలా
వానతానుప్రసిద్ధః
నిశ్శేషామ్నాయవాహః శుచివతదృషభా
రోహ . . త్రయా నః
సత్యా వాణ్యా శ్రియా వా పతిరభినువతాం
సర్వ సంపత్ ప్రదాయాః

(7) ఉన్మనోరథహరిద్విరదో గ్రైః
స్వర్బలైః (పరబలైః)న సమగ్రైః
యుద్ధ మాకలయతే స్మ విశఙ్కం
పార్థివో ధృతివిముక్తకలఙ్కన్

(8) ఈ క్రిందిది ఉపసంహార శ్లోకము:
"శ్రీ ధాన్వై ర్యాష్ట్రమాష్యౌత్సకలభువి తదా
వర్ష దబ్దో యథేష్టం
గొసస్యాద్వైర్యర్జుష్మేక్షితిరరివితతి
ర్నామ శేషా బభూవ,
వాస్త్రం రోగావమృత్యూ శ్రుతిమలభత నో
జారచోర ప్రవృత్తి:
వృత్తి ర్వర్ణాశ్రమాణాం వ్యజయత చరగో
రాన్త ధర్మ శ్చతుర్భిః'

ఆంధ్రులు రచించిన రాఘవ పాండవీయములు మూడింటిలో రెండాంధ్ర ప్రబంధములు, ఒకటి సంస్కృత కావ్యము ఆంధ్ర రాఘవ పాండవీయ

---

22 23. A Triennial Catalogue of Manuscripts—Vol V. Part I, Sanskit A–R. No. 4282 b—Pages 6312–13 (1932) Govt. O. Mss. Library, Madras

24 Descriptive Catalogue of Sanskrit Mss. in the Adyar Library Vol. V. No. 292, pp101–02—(1951) Madras.

ములు రెండింటిలో వేములవాడ భీమకవి రచించినది ఉత్పన్నమైనది రెండవదియగు పింగళి సూరన్నది మాత్రమే సజీవమై పఠిన పారముల నున్నది పై రెంటికి మధ్య కాలమున రచింపబడిన కృష్ణ పండితుని కృతి మాత్రము కొనయూపిరితో చెన్నపురి యందలి రెండు లిఖిత గ్రంథాలయములయందు తాళీదళ సంపుటములయందు గాఢ నిద్రయందున్నది. దీనిని మేలుకొల్పి, వాఙ్మయ ప్రపంచమున విహరించునట్లు చేయు బాధ్యత ఆంధ్ర సాహిత్య సంస్థలది

రాఘవ పాండవీయము శ్రుతకీర్తి త్రైవిద్యకవి 25.

పై కావ్యము గత ప్రత్యాగత విధానమున రచింపఁబడెను ఇట్టి వానిని ప్రతిలోమకావ్యము లనియు, విలోమ కావ్యము లనియు వ్యవహరింతురు సామాన్య ద్వి సంధాన (లేక ద్వ్యర్థి) కావ్యములందు పదము అనులోమపద్ధతినే పఠింపబడి, శ్లేషాది మహిమచే ఇతివృత్తద్వయమున కన్వయింపబడును విలోమ కావ్యములందు పద్యము అను లోమ క్రమమున నొక కథకును, ప్రతి లోమ క్రమమున రెండవ కథకు నన్వయించును

ఈ ప్రతిలోమ కావ్య ముత్పన్న కల్పము సంస్కృత వాఙ్మయమున గల గతప్రత్యాగత కావ్యముల నామముల నిట పేర్కొన దగును

(1) నల హరిశ్చంద్రీయము . కవి పేరు తెలియదు (అముద్రితము)

(2) యాదవ రాఘవీయము : వేంకటాధ్వరి (విశ్వ గుణాదర్శకర్త)

(3) రసిక రంజనము 26 . రామచంద్రకవి (క్రీ 1524)

(4) రాఘవ పాండవీయము · 27 శ్రుతకీర్తి

(5) రాఘవ యాదవీయము : వింజమూరి 28 సోమేశ్వర కవి.

(6) రామకృష్ణ విలోమ కావ్యము29 దైవజ్ఞ సూర్యసూరి

రాఘవపాండవీయము—(వాసుదేవకవి)

వాసుదేవకవి కేరళ దేశవాసి పై కావ్యము (వ్రాతప్రతి) గంజాం మండలమున లభించెనట. వి. రాజరాజవర్మ మళయాళ భాషయందు రచించిన 'కేరళీయ సంస్కృత చరిత్ర' 30 అను గ్రంథమున దీనిని గూర్చి కొన్ని యంశముల వివరించెను కాలాంతరమున నీ యంశములు విశదీకరింపఁబడును

సంస్కృతమున గల తక్కిన ద్విసంధాన, త్రిసంధాన, చతుస్సంధాన—పంచసంధాన, సప్తసంధాన—శత సంధాన కావ్యములనుగూర్చి వేఱొక వ్యాసమున కాలాంతరమున వివరింపబడును

'కతి కవయః, కతి కృతయః కతి లుప్తాః
కతి చరన్తి, కతి శిథిలాః' (నీలకంఠ దీక్షితులు)

---

25 E V V Ragbavacharya's "Dvyarthi and Tryarthi Kavyas in Sanskrit—(Pathak Commemoration Volume—1934) p 380—81

26 Kavyamala— Part IV No 5—R Schmidt's ed with German Trans (1896)

27 J B B R A S (N. Series) Vol III pp 134—47 (Dr A V Subbiah's Paper)

28 Printed in Telugu type, at Kakinada (adout 1938)

29 Jnanasagara Press, Bommay, — 1905 A D. (Samvat 1962)

30 Keraliya-Samskrta Sahitya-Caritram - Vol. I p-552 ff. Also-Vide Dr. K K Raja's 'The Contribution of Kerala to Sanskrit Literature-published by the Sanskrit Department of the University of Madras. (1958).

అభిసరణము

శ్రీ వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు

గంధము కప్పురంబు మెయికందువ లందునలంది గోపికల్
చిందములన్ హసించు గళసీమల ముత్తెపుఁ బేర్లు దాల్చి యిం
దిందిర నీలదేహుని బ్రదీప్త తమాల వనాంత వీథు లం
దందు రతి ప్రసంగములయందున జ్యోత్స్నికలందుఁ గూడరే!

పసిఁడిసలాక లొక్కపరి ప్రాయపుమేలిమి సిగ్గునిగ్గులం
దోసపరి కర్బురాంబరు సముజ్జ్వల నీలశరీరుఁ గాంచి త్రో
క్కిస పడినారు కామునకు గీమునకుం దొలగంగలట్టి వా
రసలుకు పడ్డి పాఱు వలపాఁగని వారు త్రపన్ హసింపఁగన్

మేలిపసిండి తీవలు నిమీలిత నేత్ర సరోజయుగ్మల
వ్వేళఁ జరింప శైవలిని వేడుక వారి పదాబ్జనూపు రో
ద్వేల విరావభంగులను దేలిచివైచె సమీరపోత క
ల్లోలిత భంగ నృత్యముల లోలవిలోచన లెల్ల మెచ్చఁగన్

శారదవేళా విషణ్ణ కేకికుల పిం
ఛచ్ఛవుల్ నెఱులలో సాగిపోవ
తత్కాల సముపాత్త ధావళ్య కుల్యా జ
లమ్ముల నోరయు హాసంబుతోడ

తత్కాల మాంసల తరుణరథాంగాహ్వ
యములఁ ద్రోసెడి యురోజములతోడ
తత్కాల సమధికోత్సాహ భరిత వరా
టీ నృత్తభంగుల టెక్కుతోడ

దశ దిశార్పిత మంద గంధవహా చలిత
క్రమ వక్షోజక్ష్ణప్రాంశుకమ్ముతోడ
కటకజితమారచాపటంకార యగుచు
అభిసరించెను రాధ బర్హావతంసు

అశలు కన్నుకోనల ముదశ్రు ప్రవాహముగాఁగ రాధ, దూ
ర్వాశయనంబుపై నిదురరాని నిశల్ కలిగించినట్టి ర

శ్యాకల తళ్కు బెళ్కులు త్వదర్థమురా యని యల్లుగుజ్జ భో
గశ్రమఁదీర్చి స్విన్నమృదుగండ యుగంబును దుడ్చిపయ్యెదన్

ఓ హరినీలరత్నశకలోజ్జ్వలకైశిక! నాప్రభూ! జగ
న్మోహనమూర్తి నీవయిన ముద్దులు మామక గండభాగ భా
క్ప్రీ హావణిల్లు పత్రముల క్రేవల స్ఫారిత దంతరోచులై
కోహటిలన్ వలెన్ గపులకోరకమయ్యె నదేమి మోమురా

ప్రేయసి! నీ ముఖమ్మునయి పెట్టిన కస్తురిబొట్టు శీర్ణమై
పోయుగముల్ వెలార్చు నినుజూచిన పూచును ప్రమోదువాఱు నా
యీ యెద నా విలాసముల యిక్కకు నీకు శ్రమంబు తీరఁగాఁ
దోయద నీలదేహ! పరితుష్ట వ్రజాంగన! వీతువయ్యెదన్

మారవృషత్కభిన్న సుకుమారశరీరలు గోపికాంగనా
వారము ప్రోదినీతటవిభాస్వర శాద్వలశయ్యమీఁద నా
చేరువ నిన్ను గాంచెదరు చిక్కణగల్లవిలోచనాంచల
స్ఫారిత హాసరోచులయి శ్యామలమూర్తి యొకింత పల్కరా.

పలుకరాదో? ముక్తామణులొలుకఁబోవు
యాదవక్షీరజలధి శుభ్రాంశుబింబ!
చిలుకరాదో! గానామృతశీకరముల
వల్లవవధూ తటిల్లతా వారిదంబ!



అరవయ్యేళ్ల ఆంధ్రసాహిత్యం

శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు

1

ఇరవయ్యో శతాబ్ద ప్రారంభంనుండీ నవీనాంధ్ర సాహిత్యం సువిశాలమై, ఎన్నో సొగసులు పోయినది. ఈనా డేయర్థంలో విమర్శయందు సాహిత్యమనే పదం వాడబడుతూవుందో అదే యర్థంలోనే ఈ వ్యాసంలో ఆపదం వాడబడినది. సారస్వత వాఙ్మయ పదాలకున్న అర్థంకంటె భిన్నమయిన అర్థంలో సాహిత్యపదం ఇట సంభావింపబడినది ఆ అర్థాన్ని ఆధారంగా తీసికొని నవీనాంధ్ర సాహిత్యాన్ని, బహుముఖాలుగా విస్తరించినదాన్ని, సింహావలోకనం చేయాలనే ప్రయత్నం—సమగ్రంగా కాకపోయినా, ఇందు గోచరిస్తుంది అరవైయేండ్లు నిండిన సాహిత్యాన్ని ఒక్క యూపులో, పరిమిత పరిధిలో క్షోదక్షమంగా పరిశీలించి, తక్కెడలో పెట్టి తూచి మంచి సెబ్బరలను ఎంచటం దుశ్శకమన్న విషయం సహృదయులకు వేరుగా చెప్పవలసిన పనిలేదు వారికి తెలియనిదీగాదు కేవలం నూతన భావోద్యమాలు ప్రతిబింబించిన సాహిత్యమే ఈ వ్యాసంలో పరామర్శింపబడుతుంది. ప్రాచీనాంధ్ర సాహిత్యంకంటె ఏ యే భావోద్యమాల మూలంగా నవీనాంధ్ర సాహిత్యం భిన్న స్వరూపంలో కనబడుతూ వున్నదో ఆ భావాల పోకడలు చూపబడునని సారాంశం అందుచే ఈ అరవైయేండ్లలో సుగృహీత నామధేయులయిన గ్రంథకర్తలందరనూ గూర్చి ప్రత్యేకంగా చెప్పటం కుదరదు అవసరమూలేదు ఆ యా గ్రంథ కర్తలనుగూర్చి సమర్థులైన వారెందరో ప్రత్యేకంగా విమర్శలు వ్రాశారు అవసరమయిన దానికంటె ఎక్కువగా భూషించారు! దూషించారు కూడ! నూతన భావ పథంలో విహరించినవారు మాత్రమే ఈ వ్యాసంలో కన్పిస్తారు. కాని ఉదాహృతులయినవారు కొలదిమందే యుంటారు

అయితే ప్రాచీనాంధ్ర సాహిత్యంకంటె నవీనాంధ్రసాహిత్యం భిన్నరూపంలో కన్పడుతూందా యను ప్రశ్న కల్గవచ్చు భిన్నరూపంలోవుందనే సమాధానం. సాహిత్య ప్రపంచంలో ఒకానొక నవయుగం ప్రారంభమయినదనే చెప్పాలి. శ్రీ విద్వాన్ విశ్వం ఈ యుగాన్ని గూర్చి ఏమన్నారో చూడండి

“ఏ జాతి చరిత్రలోనూ, ఏటేటా వసంతం విరియదు. ఒక్కొక్క శకంలో అఖండప్రతిభాసమున్మేషం జాతి జాతినీ సమగ్రంగా సర్వతోముఖంగా సముత్తేజితంచేసి నవయుగానికి నాందీవాచకమవుతుంది.

అలాంటి తరుణాన్నే మనం స్వర్ణయుగమనీ, నవయుగమనీ భావిస్తాము. ఏందులోనో ఒకందులో ఏ కొంతో మార్పు వచ్చినపుడెల్లా నవశకోదయం అనుకోము. ఏ ఒక కొత్త ఉద్యమమో ఆరంభమైనపుడెల్లా దానిని నవయుగ ప్రాదుర్భావమని తలంపము

ఆ మార్పేదో అంతదాకా నడుస్తున్న జీవన గతిని కొత్తదారుల్లోనికి గబాలున కొంపోయినప్పుడూ, ఆ మార్పేదో ఒక రంగానికి పరిమితంగాక సర్వతోముఖమయినప్పుడూ, ఆ పరిణతి ప్రభావం ఆనాటికే పర్యాప్తంగాక, కొన్నేండ్లదాకా జాతి ప్రగతి పథ ప్రయాణానికి పాథేయ మివ్వగలిగినప్పుడూ అదే నవయుగంగా నవశకంగా సంభావిస్తాము.

తెనుగుజాతి మనుగడనే మాన్యం చేసిన మహాత్మకాలం గనుకనే ఇరవయ్యో శతాబ్ది ఆరంభ కాలంలో అటూ, ఇటూ ఉన్న సమయాన్ని మనమెంతో అపురూపంగా అంగీకరిస్తున్నాము.” (తెలుగు వాఙ్మయము, పుటలు 196—197.)

ఇతి వృత్త స్వీకారంలో, దాన్ని తీర్చి దిద్దటంలో గ్రంథ పరిమాణంలో గ్రంథకర్తల లక్ష్యంలో ప్రక్రియాభేదంలో నవీ నాంధ్రసాహిత్యం ఎన్నో గడుసరి తీరులను ప్రదర్శించినది స్వాతంత్ర్య శుభావతార సమయాన్ని హద్దుగా భావించి, ఆ తీరు తెన్నుల వన్నెలూ, చిన్నెలూ చూపటం జరుగుతుంది. సౌలభ్యాన్నిబట్టే స్వాతంత్ర్యసిద్ధి వేళనుహద్దుగా భావించటం జరిగినదే కాని అన్యథాకాదు ఏ వాణి తెలుగు మాగాణం నాలుగు చెరగులా ప్రతిధ్వనించి ఉర్రూతలూగించినదో ఆ వాణీ ప్రతిధ్వనుల ప్రతిధ్వనులు ఇంకా వినిపిస్తూనే వున్నవి. దాని నింకా కొందరు ఆలాపించుతూనే వున్నారు. ప్రాచీన సాహితీ సంప్రదాయాలు పల్లవించటం కూడా జరిగినది జరుగుతూనే వున్నది

ఇరవయ్యో శతాబ్ద ప్రారంభంనుండీ నూతన రీతుల్లో నడిచిన సాహిత్యానికి దోహదం పందొమ్మిదవ శతాబ్దం చివరి రెండు దశాబ్దాల్లో జరిగినదనే చెప్పాలి ఆ శతాబ్దం చివరి నాళ్లలో వున్నవారే ఇరవయ్యో శతాబ్దంలో గూడా జీవించరు మారు మూలల్లో కుంటు కుంటూ, నడిచిపోయే ఆంధ్ర సరస్వతిని చేరదీసి, లాలించి, పాలించి నలుగురిలో తలయెత్తుకొని తిరిగేటట్లు చేశారు. కొందరు శక కర్తలు. సర్వసతీదేవికి నూతనాలంకారాల్ని సమకూర్చారు వారు. రాబోయే రెండు మూడు తరాల గ్రంథకర్తలమీదా అశేషప్రాభవాన్ని చూపారు వారు. ఆ మహా మనీషులు కందుకూరి వీరేశలింగముపంతులు, గురజాడ అప్పారావు, తిరుపతి వేంకటేశ్వర కవులు, గిడుగు వేంకట రామమూర్తి, కాశీనాథుని నాగేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు, కట్టమంచి రామలింగారెడ్డిగారలు. నూతన సాహిత్య ప్రక్రియలు సృష్టించి, కావ్య తత్త్వచ్ఛందోరీతుల్లో కొత్తదనాన్ని చూపి, కవితా కన్యను పూరూరా త్రిప్పి, “అద్యత నాంధ్రకవి ప్రపంచ నిర్మాత”లై, భాషా పరిణామ ప్రాగల్భ్యాన్నిచాటి, ఆంధ్రదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి బీజావాపం చేయుటమేగాక, అండగా నిలబడి, తెలుగువారికి విజ్ఞాన పీయూష ధారాపాత్ర లందించి, సాహిత్యానుభవ శక్తి సంపాదనమునకు బాటలు చూపిన విరాణ్మూర్తులు వీరు తెలుగువారు ఇలువేల్పులుగా ఆరాధింపదగినవారు వీరు ఈ శేముషీసంపన్నుల అపార వాగ్వైభవాన్ని పుణికి పుచ్చుకొని స్వసంస్కార పరిపాకంతో తరువాత వచ్చినవారు నవీనాంధ్ర సాహితీ మందిరంలో నూతనప్రతిష్ఠలు గావించారు

—

“సామాన్యముగా జాతీయ జీవనము తద్వాఙ్మయమున బ్రతిబింబితంబై యుండునను విషయము నితర భాషా వాఙ్మయ పరిచితిలేని కేవల హైందవ విజ్ఞాన దురంధరులగు మనవారు కొందరు పాటింపరేమోకాని, పాశ్చాత్య వాఙ్మయములను నచ్చటి విమర్శకాభిప్రాయములను పరిశీలించిన వారి కెల్లరకును నది వాఙ్మయ విషయమున నొక ముఖ్య తత్త్వముగ గోచరింపక మానదు. ఏ తత్తత్త్వావగాహనకు దేశ చరిత్ర జ్ఞానము కూడ కొంచెమవసరమని తోచెడిని. దేశమున నొక్కొక్క కాలమున గల్గు వివిధ రూపంబులగు విప్లవములు జాతీయ జీవనము నెట్లు మార్చు చుండునో యట్లే భాషా వాఙ్మయములను గూడ మార్పు గలిగి యుండును ఒకవేళ మన వారీ విషయము నంతగా గమనింపకున్నను, దేశచరిత్ర రచనా విషయమున నాదినుండియు దూష్ణీంభావము వహించి, యెల్లప్పుడును బరమార్థ చింతా తత్పరులయిన వీరి యెడల నిది యంత యాశ్చర్య జనకము కా”దని కోరాడ రామకృష్ణయ్యగారన్నారు నవీనాంధ్ర సాహిత్యాన్ని అర్థం జేసుకోవాలంటే ఈ శతాబ్ద ప్రారంభంనుండీ తెలుగునాట తెలివికి పాదులు కట్టిన ఆ యా ఉద్యమాల్ని పరిశీలించాలి.

ఆంధ్రదేశంలో క్రమ్మిన కారుచీకట్లను పంచబంగాళంచేసి, సాంస్కృతిక పునరుజ్జీవన రోచిస్సులను ప్రసరింప జేసిన భావభానూదయాన్ని గూర్చి తెలుసుకోవాలి.

రాజకీయంగా తెల్లదొరల ఏల్బడి నిలువరం సంపాదించుకొన్న తర్వాత భారతదేశంలో సాంస్కృతికంగా వికాసరేఖలు మోసులెత్తటం మొదలైనది దేశంలో విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. వర్ణవిచక్షణత లేకుండా ఎల్లరూ చదువుకోవటానికి అవకాశం ఏర్పడినది. రాజభాషయైన ఆంగ్లభాష జీవనోపాధికైతేనేమీ, నాగరికతా లక్షణంగా నైతేనేమీ, భారతీయులకు అవశ్య పఠనీయమయినది ఆంగ్లసాహితీ వాఙ్మయ సౌధంలో వున్న నూతనోదారభావకోశాల్ని దేశీయులు వేయి చేతులా దోచుకున్నారు ఏదో ఒక నూతన ప్రపంచ దేవత విరాడ్రూపంతో భారతీయుల కనులముందు సాక్షాత్కరించినది ఆ సాక్షాత్కారావేశంలో విశ్వమోహనంగా సాహితీ గానం చేయటానికి పల్లవి అందుకొన్నారు భారతీయులు ఇదే సమయంలో జాతిభేద దోష దూషిత ఒద్దులుగాని పాశ్చాత్య పండితుల నిర్విరామకృషిమూలంగా ప్రాపకం కోల్పోయిన సంస్కృతసాహిత్యం సర్వాంగీణ వైభవ పదాన్ని సంతరించుకొన్నది సంస్కృత సాహితీ పరనం పాళీ ప్రాకృత సాహితీపరనం శరవేగంతో కొనసాగినవి కె వి. గోపాలస్వామిగారు చెప్పినట్లు "అటు ఆంగ్ల సాహిత్యం ఇటు సంస్కృత సాహిత్యం—ఈ రెండిటి అధ్యయనంవల్ల భారతీయుల ఆధునిక వాఙ్మయానికి అంకురార్పణజరిగింది'

ఈ యుగంలో పెద్ద ఉప్పెనలాగా నింగి ముట్టి దేశాన్ని ముంచెత్తిన—కొందరను కలవరపెట్టిన—ఉద్యమం సాంఘిక సంస్కారోద్యమం భారతదేశం మహమ్మదీయుల రాకతో తన సంఘం చుట్టూ అభేద్య దుర్గాల్ని నిర్మించుకొన్నది బాహ్యప్రపంచంతో సర్వ సంబంధాల్ని తెగతెంపులు చేసుకొన్నది అల్బెరూనీ వ్రాతలే మనకు తార్కాణాలు తత్ఫలితంగా భారతీయ సమాజం ఉదార దృక్పథాన్ని ఉజ్జగించినది అనర్థకములయిన దారుణాచారాల్ని, శ్రేయోదూరములయిన సిద్ధాంతాల్ని సృష్టించుకొన్నది విజ్ఞాన వ్యాప్తి శూన్యం చైతన్యంలేదు పురోగమనం హుళక్కి ఆంగ్లేయుల ఆగమనంతో బిర్రబిగిసి ముసుగుదన్ని పండుకొన్న—నిద్రపోవటమే సుఖదాయకమనుకొన్న—భారతీయ సంఘం జాగృతమైనది ప్రాక్ప్రతీచీ సభ్యతా సమ్యక్సమ్మేళనమూర్తిగా నిలిచిన రాజారామమోహనరాయలు ఈ సాంఘిక సంస్కారోద్యమానికి ఆదిమ తీర్థంగా అవతరించాడు బ్రహ్మ సమాజాన్ని నెలకొల్పాడు దూరదృష్టిగల ఆ పండిత ప్రకాండుని అడుగు జాడల్లో నడిచి, సర్వ శక్తులా కృషి చేసిన ఆంధ్రులు కందుకూరి వీరేశలింగంపంతులు, రఘుపతి వేంకటరత్నం నాయడూ. పంతులుగారూ, నాయడూ తమ తర్వాతితరం పడుచువాండ్రమీద ప్రబల ప్రభావాన్ని చూపారు

సాంఘిక సంస్కారోద్యమంతోపాటు హైందవ జాతీయోద్యమం కూడా అప్పుడే ప్రారంభమైనది ఈ ఉద్యమాన్నిగూర్చి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు చక్కగా చెప్పారు "ఈ మానవోద్యమం గాక, నవభారతంలో ఈ యుగంలో మరో మహోద్యమం బ్రహ్మండంగా విజృంభించింది, హైందవ జాతీయోద్యమం. ఇది దయానంద రామకృష్ణ—వివేకానందులతో ఉజ్జ్వలంగా ప్రారంభమై, లోకమాన్యునితో ఉన్నత శిఖరా లందుకొంది చిరదాస్య నిద్రనుంచి మేల్కొన్న భారతీయుని దృష్టి ఒక్కసారి పూర్వకాలంలోకి చొచ్చుకొనిపోయింది అభిమానంవల్ల, ఆత్మ విశ్వాసంవల్ల ఈ దృష్టి మరీ నిశితమై ధగధగా తొందర తొందరగా మెరసి పోతూ పరుగులెత్తింది కవికి ఆత్మీయానుభవం కలిగించినంత ఆవేశమూ, వేడీ యీ జాతీయోద్యమం కలిగించింది. ఎంతో ఆప్తంగా అయిపోయాయి మన పూర్వ గాథలూ, విజ్ఞాన సంస్కృతులున్నూ ఏ లోపమూ లేక సమగ్ర సుందరంగా శాశ్వత సత్యాలుగా కనపడ్డాయవి "ప్రాత కొత్తల మేలిక లయిక" అని అనడంకన్న, "ప్రాత వాటికన్న నీవు పొడిచే దేముంది? వాటిని మళ్లీ శుభ్రపరచి సుస్థాపితం చేసి కొమ్మం"టుంది ఈ ఉద్యమం

ఈ ఉద్యమానికి ఉత్తమ ప్రతినిధులు వంగ సాహిత్య క్షేత్రంలో బంకించంద్ర, ద్విజేంద్రలాల్ రాయులు, ఈ ఉద్యమానికి చెందిన నవ్యాంధ్ర కవిత్వ క్షేత్రంలో ఉన్నత శిఖరంగా సాక్షాత్కరించేవాడు విశ్వనాథ సత్యనారాయణ"

(భారతి రజతోత్సవ సంచిక)

మహాశక్తి సంపన్నమయిన జాతీయోద్యమం గూడా సాంఘిక మతోద్యమాల సరసనే బయలు దేరినది ఆంగ్లేయులు భారత దేశాన్ని రాజకీయంగా దొప్పహిూమగుండంగా చేశారు భారతదేశ సంపత్తి అంతా బకింగ్‌హామ్ రాజప్రాసాదంలోవున్న ఏలికసాని లేక ఏలిక పాదాల ముంగలకప్పం మాదిరిగా సమర్పింపబడినది పారిశ్రామికంగా దేశం అభివృద్ధి పొందక పోవటంగాక, భారత సవిత్రికి వెన్నెముక అయిన రైతు ప్రత్యక్ష రౌరవనరకాన్ని అనుభవించాడు. అట్టి పరిస్థితుల్లో కొందరు విద్యావంతులు ఉత్తమ ప్రభుత్వం కొరకు మాత్రమే పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థంలో రాజకీయోద్యమాన్ని ప్రారంభించారు. 1905 వ సంవత్సరం వచ్చేసరికి జాతీయోద్యమం మరొక ఘట్టంలో పడింది. 1905 వ సం లో వంగ రాష్ట్ర విభజనం జరిగింది 1913 వ సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్రోద్యమం ఆవిర్భవించినది గాంధీగారి రాకతో జాతీయోద్యమం సమగ్రస్వరూపాన్ని ధరించినది ఆనాటి భారతదేశంలో అనేక విధాలుగావున్న జాతీయ శక్తుల నన్నిటినీ సమన్వయించిన మహాత్ముడాయన సత్యాహింసాశ్వాలను పూంచిన జాతీయోద్యమ స్యందనానికి సారధి ఆయన. బాపూజీవిశ్వవాణి దివ్య సందేశం నవ్యాంధ్ర సాహిత్యాన్ని సమున్మిషితం చేసినది

ఆ సమయంలోనే రవీంద్రుని అవ్యక్తమధురవాక్కు వంగదేశంనుండి విన్పించినది. ఆవాక్కులో విశ్వమానవతావాదం దోబూచులాడింది విశ్వ సౌందర్యదేవతా సౌభాగ్యం పిసాళించినది తరతరాలుగా చెల్లుతూవున్న భారతీయోపషత్సారం, తథాగతుని సర్వజనతా సమతావాదం, కాళిదాస కవితారామణీయకం, పాశ్చాత్య సభ్యతా చైతన్యం సర్వమూ రాశీభూతమై రవీంద్ర భారతిగా ఆవిష్కరింపబడినది ఆ గురుదేవుని సాన్నిధ్యసుఖాన్ని అనుభవించినవారు, ఆ మహాకవి సాహిత్యామృతాన్ని ఆస్వాదించినవారు తదితర భాషాసాహిత్యాలలో నూతన శకాలను సృష్టించారు.

ఇంత యెందుకూ? ఇరవయ్యో శతాబ్దానికి ముందువెనుకలుగా భారతదేశంలో వచ్చిన యావద్భావపరిమాణామంతా ఏదో ఒకరూపంలో నవీనాంధ్ర సాహిత్యంలో ప్రతిబింబించినది.

3

ఒకవైపు సంస్కృతాంగ్ల సాహిత్యాధ్యయనమూ, మరొకవైపు జాతీయోద్యమాదులూ విద్యావంతుల దృక్పథంలో విపరీత పరిమాణాన్ని తీసుకొని వచ్చాయి అంతకుముందు కనీవిని ఎరుగని భావప్రవంతులు విద్యావంతుల హృదయ క్షేత్రాల్లో ప్రవహింపసాగాయి తత్ఫలితంగావారు నూతన సాహితీ ప్రక్రియాసస్యసంపదను సరస్వతీదేవికి సమర్పించారు! నవీనాంధ్ర సాహిత్యంలో ఈ నూతన ప్రక్రియా వైవిధ్యమే బృహద్రూపంలో కొట్ట వచ్చినట్లు కన్పట్టుతూ వున్నది ఒకనాడు సంస్కృత సాహిత్యంమాదిరిగా ఈనాడాంగ్ల సాహిత్యం అనుకార్యమయినది ఆంధ్రసాహిత్యంలో ఈనూతన ప్రక్రియావతరణం ద్విముఖంగా కొనసాగినది. ప్రాచీనులచే ఉపేక్షితములయిన సాహిత్యప్రక్రియలను ఆంధ్రసాహిత్యంలో సృష్టించటం ఒక పద్ధతి ఆంగ్లసాహిత్య ప్రభావితులై ఆంధ్ర సాహిత్యంలో ఇంతవరకూ అచుంబితములైన ప్రక్రియలను సృష్టించటం రెండవపద్ధతి మొదటి పద్ధతులవల్ల—ఇతర హేతువులవల్ల—ఆంధ్రరూపకావతారం, వచనసృష్టి, హాస్య రచనలు ప్రారంభమైనవి. రెండవ పద్ధతివల్ల నవల ఖండకావ్యం, ఏకాంకిక, కథానిక, వ్యాసము, విమర్శ మున్నగునవి చోటుచేసుకొన్నవి ఈ రెండు పద్ధతులవల్లా ఆంధ్రసాహిత్యం సువిశాలమూ, పరిపుష్టమూ అయినది ఇక్కడ ఒకవిషయం చెప్పాలి ఏకాంకికలు, కథానికలు, ఖండకావ్యాలు మనకు క్రొత్తవిగావని కొందరంటున్నారు అగ్నిపురాణంలో కథానికవంటిది పేర్కొనబడినదనీ, పురాణేతిహాసాలలోవున్న ఆఖ్యానాలన్నీ కథానికలవంటివేనని, భాసుడు ఏకాంకికులు ఏనాడో రచించాడనీ, ప్రబంధాలలోవున్న వర్ణనలన్నీ ఖండ కావ్యాలవంటివేననీ, కాదంబరీ కళాపూర్ణోదయంలాంటివి—ఏకావ్య

ఖేదం అయితేనేమి—నవలలేనని, ఇకపోతే ఆంగ్లసాహిత్యంవల్ల భారతీయ సంస్కృతి కలుషితమైపోవటంతప్ప ఒరిగిందేమీ లేదనీ—ఆత్మసంతృప్తి కొఱకు—వారు నొక్కి వక్కాణిస్తున్నారు ఏకాంకికాదులు క్రీస్తుపూర్వం కొన్నివేల సంవత్సరాలనుండీ మనదేవభాషలో వర్ధిల్లిన వర్ధిల్ల వచ్చుగాక ఆసాహిత్య ప్రక్రియలన్నీ ఆంధ్ర సాహిత్యంలో అవతరించటానికి ఆంగ్ల సాహిత్యమే దోహదం చేసినది ఆంగ్లవాఙ్మయ ప్రభావితులైనవారే తత్సృష్టికి పూనుకొన్నారు ప్రతిసాహిత్య ప్రక్రియనూ సంస్కృతానికి ముడిపెట్టటం తగదు ఈ సిద్ధాంతం వివిధ సాహిత్యప్రక్రియోపాధులను—వైదేశికములుగా అంగీకరించటానికి అంతరాత్మ మారాం చేయటంచేత—సంస్కృత సాహిత్యంలో అన్వేషించటంవలన పుట్టినదేతప్ప నవీనాంధ్ర సాహిత్యపరిణామాన్ని గమనించి చెప్పినదిగాదని వ్రాస్తున్నందుకు పరిణత బుద్ధులు మన్నించాలి

ప్రాచీనకాలం నుండీ చెల్లుతూవున్న సాహిత్య సంప్రదాయాల విచ్ఛేదం ఈ శతాబ్దంలో ఎక్కువగా గోచరిస్తున్నది ఈ సంప్రదాయ విచ్ఛేదానికి ఆంగ్లసాహిత్య పరనం—దానితోపాటు మారుతూవున్న జీవనగతీ—బాగా వుసికొల్పినది అయితే సంప్రదాయ విచ్ఛేదం అన్నది వెఱ్ఱితలలు వేసిందన్న విషయంకూడా మనం విస్మరింపరాదు సంప్రదాయ విచ్ఛేదానికి వుదాహరణంగా పద్యకావ్యగతిని తీసికొందాం సంస్కృతభాషలో అలంకారశాస్త్రం బహుముఖాలుగా విస్తరిల్లినది దానిలో కావ్యహేతువులు, కావ్య భేదాలు, కావ్యాత్మలు, నాయికా నాయక భేదాలు, రసమీమాంస, కావ్యకర్త్రధికారము, శబ్దార్థాలంకారాలు, శబ్దార్థ దోషాలు చక్కగా నిరూపించబడ్డాయి అలంకారశాస్త్రం ప్రోక్త లక్షణాలతో వ్రాస్తేనే కావ్యనామం సార్థక మవుతుందని తచ్ఛాస్త్రవేత్తలు వాదించిన రోజులుకూడా వున్నాయి కాని నవీనాంధ్రకావ్యకర్తల్లో ఎక్కువమంది ఆ సాహిత్యశాస్త్రనియమ చోదితులు కాలేదు ఇదియొకముఖ్య భావ పరివర్తనం. ఈభావ పరివర్తనానికి పెట్టనికోటగా నిలబడినది కట్టమంచి రామలింగారెడ్డిగారి కవిత్వ తత్త్వవిచారం దానిలో రెడ్డిగారు ప్రబంధ దుర్గుణాల్ని ఎలుగెత్తి చాటారు నవీనకవులందరు ఆప్రబంధావగుణాల్ని పరిహరించటానికి ప్రయత్నించారు కావ్యరసపరిపాలనం విషయంలో కూడా మార్పు వచ్చినది శృంగార రసంతోపాటు తదితరసాలకూ సమప్రాధాన్యం లభించినది నవీనకావ్యాల్లో చమత్కారం రసమనిపించేటంతగా ప్రబలినది కావ్యహేతువుల్లో వ్యుత్పత్తికంటే ప్రతిభాభ్యాసాలకే ప్రాచుర్యం లభించినది ఇతివృత్త వైవిధ్యం వున్నది అది స్వల్ప విస్తృతి పొందినది. ఈ మార్పువల్ల లఘు కావ్యాలు అసంఖ్యాకంగా ఆవిర్భవించాయి ఈ మార్పునుచూచి శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారిలాంటి వారే మహాకావ్యాలు రచించేకాలం నిష్క్రమించిందని భావించటం జరిగినది కొత్తకొత్త నాయికా నాయకులు కన్పించారు లొడారిబుచ్చిగాడు మొదలు లోకోత్తరపురుషుని వరకువున్న నాయకులు, అక్కమ్మ, ఎంకీ మొదలు అరుంధతి వరకూ వున్న నాయికలూ కావ్యాలో సాక్షాత్కరించారు అంతేగాక ఆదర్శవాదం కంటే వాస్తవికవాదం కళారంగంలో గజ్జెకట్టినది ప్రతిసాహిత్య ప్రక్రియలోనూ ఈ మార్పు కన్పడుతున్నది మహాకావ్యాలు లేవనిగాని, సంప్రదాయ పరిపాలనం చేసినవారు లేరనిగానీ ఎవరూ ఈవాక్యాలు చదివి భావింపరాదు. ముఖ్య లక్షణాన్నే ఇక్కడ వివరించటం జరిగినది

ఈ సంప్రదాయ విచ్ఛేదానికి సంబంధించినదే వ్యావహారిక భాషోద్యమం. దీని ప్రభావం నవీనాంధ్ర సాహిత్య ప్రపంచంలో బాగా ద్యోతకమవుతుంది ఈ వుద్యమ పితామహులు గిడుగు రామమూర్తి పంతులుగారు ప్రాచీనకాలంనుండి సాహిత్యనామాంకితమైన దంతా గ్రాంధిక భాషావకుంఠనాన్నే ధరించినది చిన్నయసూరి బాలవ్యాకరణము, బహుజనపల్లి సీతారామచార్యులవారి శబ్దరత్నాకరము మనపండితుల పాలిటికి అపౌరుషేయములయిన లక్షణ శాస్త్రమూ, నిఘంటువూ అయినాయి బాలవ్యాకరణం అంగీకరింపని శబ్దరూపము, శబ్దరత్నాకరం స్వీకరింపని పదమూ

అసాధువులని వెలివేయబడ్డాయి ఎంత ప్రాచీనగ్రంథస్థ ప్రయోగాన్నయినా చిన్నయ్యసూరి బాలవ్యాకరణావరణంలో వున్నదాలేదా, శబ్దరత్నాకరానికి అంగీకార్యమా, కాదా అని మన మహామహోపాధ్యాయులు ఆలోచించి బహూకరించటమో, నిరాకరించటమో జరిగేది వారు సూరిగారినీ, అచార్యులుగారిని విశ్వసించినంతగా శ్రీనాథాది కవులను—వారి గ్రంథాలలోని ప్రయోగాల విషయంలో కూడా—విశ్వసింపలేదు ఎందరో పూర్వకవులు తమ కావ్యాల్లో వాడిన మాటలను బాలవ్యాకరణానికనుకూలంగా తిద్దటంలో మనపండితులు ఎంతో సాహసమూ, సామర్థ్యమూ ప్రదర్శించారు. జీవద్భాష మారిపోతూ వుంటుందనీ, పదాలు అర్థశబ్దవిపరిమాణాన్ని పొందుతాయని అమార్పులన్నింటినీ శాస్త్రకర్త నియమబద్ధం చేస్తాడనీ అంగీకరించటానికి మాత్రం మనపండితులకు సాహసం లేక పోయినది తత్వాన్ని దర్శించే సామర్థ్యమూ కొఱవడిపోయినది భాషావిషయంలో అవక్రవిక్రమాన్ని, సత్య దర్శనాసక్తినీ ప్రదర్శించినవారు గిడుగు రామమూర్తి పంతులుగారు. ఆ ప్రజ్ఞామూర్తి పాండిత్యపాటవం వల్ల గ్రామ్యపదాలుగా ఈసడింపబడిన పదాలెన్నో పురాణ వైభవాన్ని, పరమప్రామాణ్యాన్ని సంధించుకొన్నాయి. నవీన సాహితీ పదస్వరూపము మారినది. కావ్యకర్తలు, తదితరులూ శిష్ట వ్యావహారిక రూపాలను అంగీకరించారు సకలసాహిత్య ప్రక్రియలూ వ్యావహారిక భాషలో వెలువడ్డాయి ఈ వాదం రామమూర్తిగారి కాలంలోనే ఆయనకూడా గుర్తుపట్టలేనంత వ్యావహారిక భాషావాదంగా రూపాంతరప్రకృతిని అలవరచుకొన్నది

సంప్రదాయ విచ్ఛేదంతోపాటు వ్యక్తి స్వాతంత్ర్యమూ మానవతావాదమూ అనురెండు సిద్ధాంతాలాకూడా నవీనసాహిత్య గతిని నిర్ణయించాయి ఆంగ్లసాహిత్య పరనంవల్ల ఈరెండుసిద్ధాంతాలను అంగీకరించి ప్రచారం చేసినవారి సంఖ్య బహుళమయినది వ్యక్తి, అతని అంతరాత్మ, అతనిసుఖదుఃఖాలు, అతడు పుట్టిపెరిగిన చుట్టుపట్టులు—వీని పరిశీలనం ఎక్కువైనది వ్యక్తిత్వమను తత్త్వం మన్నెతికం చేయసాగినది. ఆత్మాశ్రమయిన సర్వసాహిత్య ప్రక్రియలకూ ఇదే మూలం మానతావాదం విజయయాత్ర సాగించినది ఈవాదం ప్రకారం వ్యక్తికీ వ్యక్తికీ, సంఘానికీ సంఘానికీ, జాతికీ జాతికీ మధ్యవున్న భేదాలు అనుచితాలు, అర్థరహితములునూ. ఏవిషయాన్నయినా సరే దేశకాల పరిస్థితుల్నిబట్టి ఈవాదం పరిశీలిస్తుంది "తూర్పు తూర్పే పడమర పడమరే ఈరెండు ఏనాడూ కలిసికోవు" అని కిప్లింగ్ వంటి వారు చేసే వితండవాదాలు ఈమానవతావాదాను యాయులకు గిట్టవు ప్రతిజాతి స్వకీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని భంగపరచుకోకుండా బ్రతకాలనీ ఆనాడే భూమిమీద దివి అవతరిస్తుందని ఈ వాదం నేర్పుతుంది.

4

నవీనాంధ్రసాహిత్యంలో ప్రక్రియా వైవిధ్యాన్ని పరిశీలించేముందు దానికి విత్తునాటిన వారినిగూర్చి కొంతయినా వ్రాయాలి ఈసాహిత్యగతిని మార్చిన ముగ్గురు వ్యక్తులు హిమవత్పర్వత శృంగాల్లాగా వుంటారు కందుకూరి వీరేశలింగముగారు, గురజాడ అప్పారావుగారు, రాయప్రోలు సుబ్బారావుగారు ఆముగ్గురు వ్యక్తులు. కందుకూరి వీరేశలింగంగారు నవలకూ, స్వీయ చరిత్రకూ, వ్యాసమునకూ, ప్రహసనాలకూ, ఇంకా ఇతరములయిన వానికీ శ్రీకారం చుట్టారు వారేది వ్రాసినా సంఘ సంస్కారం ప్రధానం తదితర సాహిత్య గుణాలు గౌణం. రసానందంకంటె ప్రక్రియలో ఉపదేశం చాలా ముఖ్యమన్నరీతి వీరివల్ల బలపడింది

కావ్య తత్త్వచ్ఛందోరీతుల్లో విప్లవకములయిన పోకడలు పోయిన వారు గురజాడ అప్పారావుగారు. నిర్మలమయిన హాస్యాన్ని తెలుగువారి కందివ్వటానికి ప్రయత్నించి కృతకృత్యులయినవారు వారు. అప్పారావుగారు లక్ష్య శుద్ధితో కథానికలు వ్రాసిరి "ప్రబోధ కావ్యము, ఆత్మ పరకావ్యము ప్రేమ గీతము, కథాకావ్యము—అన్నీ తరువాత తరంవారికి మచ్చున కందించినట్లు ఆయన వ్రాశారు." గురజాడవారి రచనల్లో మానవతావాదము గూడుకట్టుకొన్నది. అప్పారావుగారి "కన్యాశుల్కం" ఇతి వృత్తసమ్మానంలో పాత్రచిత్రణంలో, పాత్రోచిత సజీవభాషలో ఎన్నో ఒయ్యారాలు ఒలికించినది

ఆదేసమయంలో ఆంధ్రసాహితీ రంగస్థలంమీద రాయప్రోలు సుబ్బారావుగారు కన్పించారు. సుబ్బారావుగారి మార్గం అప్పారావుగారిమార్గం కంటే భిన్నమయినది రాయప్రోలు సుబ్బారావుగారు రవీంద్రుని అంతేవాసి. వారిని దిద్దితీర్చినది శాంతినికేతనం రవీంద్రుని ఛాయలు రాయప్రోలు గ్రంథాల్లో, వెంకట పార్వతీశ్వర కవుల "ఏకాంతసేవ" లో రూపొందాయి. గురజాడ వ్యక్తిత్వంలోకంటే రాయప్రోలు వ్యక్తిత్వంలో భారతీయ సంస్కృతి ముద్ర ఎక్కువ "పాశ్చాత్య సాహిత్యపరిచయ పాండిత్యాలూ వంగకవితా భంగిమలు, మననాట ముమ్మరంగా అలముకొన్న రాష్ట్రాభిమానమూ వర్తమాన సాంఘికసమస్యలూ, ఇవే రాయప్రోలునూ కదిపినదివి గురజాడవారి మానవప్రేమనూ, తోడివారిని బాగుపరచవలె నన్న మహోద్యత్నాన్నీ, మనసున ఉంచుకొని తనకవితను కేవల ప్రాచీనపద్ధతికి భిన్నంగా జానపదకవిత అంత నిరాడంబరం, నిర్మలంగాకున్నా, అంత సులభ సుందరమైన పద్ధతిని మలుచుకున్నాడు ప్రబంధశిల్పాన్ని, వస్తువునూ కాదన్నా, భాషాచ్ఛందో రీతులలో పూర్వమర్యాదను మన్నించినాడు. ప్రేమను తన మూసతో పోసుకొని, నిష్కామప్రేమరూపులయిన పాత్రలను పోతపోసుకుని, ఆనాటి స్త్రీ దుస్థితిని—మరొకతీరువ ఆమెను దివ్యనుగా చూపుటద్వారా—తీర్చుటకై యత్నించినాడు. (విద్వాన్‌విశ్వం. తెలుగు వాఙ్మయము పుట. 217) ఆచార్య లక్ష్మీరంజనం గారన్నట్లుగా "మధ్యతరగతి సంసారుల జీవితవృత్తము కథావస్తువుగా ఆంగ్లభాషాపరిచితిచే సమాసన్నమైన ప్రకృతి తత్త్వ కథన ప్రీతితో హృద్యమయిన స్వభావోక్తితో ఖండకావ్యమని క్రొత్త ప్రక్రియ సుబ్బారాయకవి ప్రచారమునకు తెచ్చి "తృణకంకణము" మొదలగు లఘుకావ్యములను సృష్టించెను" (తెలుగు సంస్కృతి. పుట. 622)

సాహిత్య ప్రక్రియా వైవిధ్యం నవీనాంధ్రసాహిత్యంలో బాగా కన్పడుతుందని ముందే మనవిచేశాను అన్నిటి ఆవిర్భావమూ, పరిణామమూ సర్వతోముఖంగా నిరూపించటం సాధ్యంకానిపని. ఆయాభావోద్యమాల రీతులను వర్ణించేటప్పుడు కొన్నిటి ప్రస్తావనవుంటుంది 1947 వ సంవత్సరం తర్వాత వెలసిన సాహిత్యాన్ని సమీక్షించేటప్పుడు కొన్నింటిని స్థూలంగా పరిశీలించటం జరుగుతుంది అన్ని ప్రక్రియలను మించి సర్వవ్యాప్తమైవున్న ఆంధ్ర వచనపద్ధతిని వివరించటం సాధ్యంగాదు ప్రస్తుతానికి రూపక పరిణామం, నవలతీరులు, కవితారీతులు, హాస్యరచనాభంగిమలు చూపటంతో సంతృప్తి చెందకతప్పదు –

(క) ప్రాచీనాంధ్రసాహిత్యంలో రూపకాలులేవు సంస్కృతంలోవున్న నాటకాలు కావ్యాలుగా రచింపబడ్డాయి కాని యక్షగానమనే ప్రక్రియమాత్రం పామరుల్లో మెలుగుతునే వున్నది. పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థంలో నాటకరచన జరిగినప్పటికీ, ఆనాటకాలకు బహుళప్రచారం లభించినది ఇరవయ్యో శతాబ్దంలోనే ఉద్దండులయిన పండితులచే సంస్కృతాంగ్ల నాటకాలు పరివర్తింపబడ్డాయి ఆ తర్వాతగాని స్వతంత్ర నాటకాలు రచింపబడలేదు ధర్మవరం కృష్ణమాచార్యులుగారు, కోలాచలం శ్రీనివాసరావుగారు నాటకకళలను ఉన్నత స్థానంలో అధిష్ఠింపజేశారు. వీరిరువురూ పౌరాణిక చరిత్రాత్మక నాటకాలు సృష్టించి వాటిని స్వయంగా ప్రదర్శించారు. "విషాదసారంగధర" తొలి విషాదాంత నాటకం. శ్రీమంతులు సైతమూ ఈనాటక కళను ఎంతో అభివృద్ధికి కొంపోయారు. "గయోపాఖ్యానం" "హరిశ్చంద్ర" "తారాశశాంకం" పానుగంటి వారి నాటకాలు ఆంధ్ర దేశంలో బహువారాలు ప్రదర్శింపబడి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నాయి. పౌరాణిక రూపకరచన తిరుపతి వేంకటకవుల పాండవజనన—ప్రవాస—ఉద్యోగ—విజయ—అశ్వమేధములతో శిఖరాగ్రాన్ని చేరుకొన్నది పౌరాణిక నాటకాలలోని పద్యాలు నిరక్షరాస్యులనాల్కలపై నాట్యంచేశాయి. చరిత్రాత్మకరూపకాలుకూడా

రచింపబడ్డాయి కోలాచల శ్రీనివాసరావుగారి "రామరాజు", చారిత్రాభాస రూపకమయిన "ప్రతాపరుద్రీయం", శ్రీపాదవారి "బొబ్బిలి" గుండిమెడ వేంకట సుబ్బారావుగారి "ఖిల్జీరాజ్యపతనం", కొప్పరపు సుబ్బారావుగారి "రోషనార" అతి ప్రశస్తి పొందాయి. "రోషనార" వల్ల ఆంగ్లప్రభుత్వం చారిత్రక నాటకాలను నిషేధించటంకూడా జరిగినది. సాంఘిక సంస్కారం ప్రతిబింబించిన రూపకాలు "కన్యాశుల్కం" "కంఠాభరణం" "చింతామణి" "వరవిక్రయం" "మధుసేవ" "రంగూన్ రౌడీ" మున్నగునవి

ఈ రూపక రచన ఎన్నో మార్పులకు లోనయినది. ప్రాచీన సంస్కృత నాటకాలను అనుసరించి కొందరూ, ఆంగ్లరూపక ప్రభావితులై కొందరు రూపక రచన చేశారు. రాగతాళయుక్తము లయిన పాటలు, పద్యములు, గ్రాంథికభాష, కొన్ని రూపకాల్లో ప్రధానస్థానం వహించాయి క్రమక్రమంగా కేవల వచనరూపకాలూ, వ్యావహారిక పాత్రోచితభాషలో కూడినవి రాసాగాయి. అంకాల విభజనంతో పాటు రంగవిభజనం జరగటం ఒక మంచి మార్పు ఈ రూపక రచనతోపాటు ప్రదర్శన సంఘాలు కూడా అభివృద్ధి పొందాయి

1929వ సంవత్సరంలో ఆంధ్రనాటక కళాపరిషత్తు స్థాపింపబడినది అయినా అది 1933వ సంవత్సరంలోనే ప్రాముఖ్యానికి వచ్చినది ఈ పరిషత్తు 1941వ సంవత్సరం నుండీ నాటక ప్రదర్శనంలో పోటీలు నిర్వహించినది. దీనితో ఆంధ్ర రూపక రచన వినూత్న స్వరూపాన్ని ధరించినది "పాలేరు" "కులంలేనిపిల్ల" "ఎదురీత" మొదలైన రూపకాలు చాలా రచింపబడ్డాయి సాంఘిక సమస్యలు ప్రబలంగా ఇట్టి రూపక గతిని నిర్ణయించాయి 1949వ సంవత్సరం తర్వాత ఆంధ్రనాటక కళాపరిషత్తు గౌరవాన్ని వాంఛించటం వల్లగానీ, స్థానిక ప్రదర్శనార్థంగానీ శతాధికంగా రూపకాలు రచింపబడ్డాయి డి వి నరసరాజు, పినిశెట్టి, ప్రఖ్య శ్రీరామమూర్తి, కొర్రపాటి మున్నగువారు రూపక రచనలో తమ నైపుణ్యాన్నిచాటారు "బెల్లం కొండ" ప్రభృతులు రచించిన రూపకాలు ఆంధ్రదేశ సంఘాన్ని ప్రతిబింబించుతున్నాయని చెప్పటం కష్టం. వావిలాల సోమయాజులుగారి "నాయకురాలు" ప్రసిద్ధిపొందిన చరిత్రాత్మకరూపకం. ఎన్నో సంగీత రూపకాలు కూడా ఈ సమయంలో విన్పించాయి "తెనుగుగడ్డ" మున్నగునవట్టివి "నాగసేన" "రాగమంజరి" "ఉషోరాగం" మొదలైనవి నృత్యగీత రూపకాలు రేడియోకోసం శ్రీ రజని "చండీదాసు" మున్నగునవి రచించారు సందర్భాన్ని బట్టి 1947 తర్వాత వచ్చిన రూపకా లుదాహృతాలైనాయి

నవీనాంధ్ర సాహిత్యంలో నవలఅవతరించటం ఒక మహాపరిణామం ఆంగ్ల సాహిత్యప్రభావం మనసాహిత్యంమీద ఎట్లా పనిచేసినదో నవలే మూదలగా ఉన్నది వీరేశలింగం పంతులుగారి రాజశేఖరచరిత్రం నవలకు నాంది పాడినది వారి తరువాత ఈసాహిత్య ప్రక్రియకు మెరుగుపెట్టినవారు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు కొమర్రాజు లక్ష్మణరావుగారు విజ్ఞాన చంద్రికామండలి స్థాపించి ఈ ప్రక్రియను ఎంతో ప్రచారంచేశారు వంగభాష నుండి వచ్చిన నవలలు తెలుగువారికి సుధాభాండికలయ్యాయి చక్రపాణిగారివల్ల తెలుగు దేశాన్ని చూచిన శరత్ బాబు తెలుగువాడే ఐపోయాడు భోగరాజు నారాయణమూర్తి చారిత్రకనవలలు, కేతవరపు వేంకటశాస్త్రి సాంఘిక నవలలూ ఆంధ్ర దేశాన్ని ఆహ్లాదపరచాయి కాని బాల్యదశలో వున్న ఈ ప్రక్రియను పెంచి పెద్దచేసినవారు ఉన్నలక్ష్మీనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజుగారలు ప్రస్తుతానికి "మాలపల్లి"ని గూర్చి వ్రాయటం విరమిస్తాను ?

సత్యనారాయణగారూ, బాపిరాజుగారూ మహాప్రజ్ఞాన ధురీణులు అసాధారణ కల్పనాచాతురీ మూర్తులు విక్టోరియా మహారాణి కాలములో రచింపబడ్డ నవలల పోలికలు వీరువురి నవలల్లో స్పష్టంగా కన్పట్టుతూ వున్నాయి. "థాకరే" "హార్డీ" "గాల్స్‌వర్దీ" ప్రభావానికి అడవి బాపిరాజుగారూ, విశ్వనాథ సత్యనారాయణగారూ లోపడినవారే కానీవీరిరువురి మార్గాలకుఎక్కడా అందికా పొందికాలేదు. దానికి కారణం ఇరువురి వ్యక్తిత్వభేదం. సత్యనారాయణ బాపిరాజులు సాంఘిక నవలలూ, చారిత్రక నవలలూ చిన్నవిపెద్దవి రచించారు. "నారాయణరావు" "హిమబిందు" వంటినవలలను బాపిరాజుగారే వ్రాయగల్గుతారు సమకాలీన సంఘాన్ని, చారిత్రకయుగాల్ని, యధార్థమయిన భావుక దృష్టితో రసమయంగా దర్శిస్తారు బాపిరాజుగారు ఏయుగం సంఘమయినా దానిజీవనశక్తి బాపిరాజుగారి నవలల్లో సత్యసుందరంగా సాక్షాత్కరిస్తుంది. ఆజీవనశక్తిని వ్యక్తిత్వభేదంతో వారు సృష్టించిన పాత్రలు ప్రదర్శిస్తాయి. బాపిరాజుగారిదృష్టి ఋషి దృష్టి. అదృష్టికి ప్రపంచంలో సామరస్యం తప్ప మరొకటి కన్పించదు. సత్యనారాయణగారి దృష్టి అట్లాంటిదికాదు. సనాతన ధర్మ మమకారమూ, తదన్యధర్మనిరాకారమూ, సత్యనారాయణగారి నవలల్లో మూర్తీభవించినవి సనాతనధర్మ దృక్కోణమునుండి వారు ప్రపంచాన్ని పరిశీలిస్తారు. పాశ్చాత్య సభ్యతా సంబంధం వల్ల బహుధా పతనమైపోయినదని గ్రంథకర్త భావించిన ఆంధ్రదేశాన్ని "వేయిపడగలు" చూపిస్తున్నది. జమీందారీవ్యవస్థ, వర్ణాశ్రమధర్మవ్యవస్థ, దేవదాసీ విధానము—ఇవియే భారత జాతికి తరుణోపాయాన్ని ప్రసాదిస్తాయని విశ్వనాథ విశ్వాసం. వారి నవలన్నీ సమస్యా ప్రధానములయిన నవలల సాంఘికంగావచ్చు, చారిత్రకంగావచ్చు ఏనవల్లో అయినాసరే విశ్వనాథ సృష్టించిన పాత్రలు ఆర్షధర్మాభిముఖంగా ప్రయాణం చేస్తాయి అందుచేత అవి సజీవములుగా వుండవు. మరి గ్రంథకర్త చేతికీలు బొమ్మలులాగా వుంటాయి ఆర్షధర్మాన్ని అపౌరుషేయంగా నిరూపించటంకోసం సత్యనారాయణగారు బౌద్ధాదిమతదూషణం చేయటానికి వెనుకంజవేయరు. "ధర్మచక్రం", ఆదినుండి ఎంతో మనోహరంగా నడిచిన "ఏకవీర" వారి ఋజు నిరసనదృష్టిని తేటతెల్లంగా చాటుతున్నాయి. బాపిరాజు గారి నవలల్లోకంటే సత్యనారాయణగారి నవల్లో ఖంధమెక్కువ. కావ్యగుణాలు ఎక్కువ బెర్నార్డుషా వంటివారు సమస్యా ప్రధానములయిన ప్రక్రియలు సృష్టించారు కాని వారిరచనల్లో కన్పడే సహజసౌందర్యమూ, సరసచతురోక్తి సత్యనారాయణగారి రచనల్లో మనకు కన్పింపవు. సత్యనారాయణగారి వంటివారు బహువిధ ప్రక్రియాస్రష్ట మరెవరూ మనకు కన్పింపరు

(ట) ఈ యుగంలో కవితా విలాసిని ఎంతో హొయలు చాటినది. వివిధేతివృత్త వర్ణనాకావనసాన్ని ధరించి ఎంతో నాజూకుతనం చూపినది. ఈయుగం ఖండకావ్యయుగము, లఘుకావ్య యుగమూ ఐపోయినది ప్రతికృతీ లఘుకావ్యాలనూ, ఖండకావ్యాలనూ రచించాడు కట్టమంచివారి "ముసలమ్మమరణము" "రాయప్రోలు" వారి కృతులు ఆదర్శలఘుకావ్యాలైనాయి. ఖండకావ్యాలంటే లఘు కావ్యాలంటే నవయుగ కవిచక్రవర్తి "జాషువా" పేరు చెప్పున జ్ఞాపకం వస్తున్నది పిపీలికాది బ్రహ్మపర్యంతమూ వ్యాప్తమై ఉన్న జంగమస్థావర ప్రపంచం ఈ ఖండకావ్యాల్లో లలితాతి లలితరూపంలో కన్పట్టుతూంది పురాణేతిహాస చారిత్రక సన్నివేశాలకు నవయుగ భావస్ఫోరకంగా లఘుకావ్యాల్లో వ్యాఖ్యానాలు చేయబడ్డాయి తిరుపతి వేంకట కవుల కవితా సౌలభ్యమాధుర్యాలు ఈ ఖండకావ్యాల్లోనూ, లఘుకావ్యాల్లోనూ వెలకొని వున్నాయి. కృషీవలుని జీవనగతిని వర్ణించటం ఈ యుగవిశేషం రామిరెడ్డిగారి "కృషీవలుడు"తో ప్రారంభమైన ఈసరణి ఏటుకూరు వేంకట నరసయ్యగారి "క్షేత్రలక్ష్మి"లో చరమస్థాయి పొందినది రాధాకృష్ణుల ప్రణయ వృత్తాంతం, ఉమర్‌ఖయ్యామ్ తత్త్వం నవీనకవుల్ని బాగా ఆకర్షించినవి "శృంగారవీథి" "పానశాల" విలక్షణమైన కావ్యాలు

గురజాడ అప్పారావుగారు వృత్తాల్నివదలి, జాతులను వదలి "అంత వరకూవున్న జానపద గీతచ్ఛాయలో, కన్నడంలోని షట్పది "పార్శీలోని ఒక విధమయిన గజల్" కలయికతో, ఒకనిరాడంబరమైన రీతిని" గేయకవిత్వం సృష్టించారు. ఈ రీతి కవులకు అనుసరణీయమైనది. ఝటితిస్ఫూర్తిగల గేయాలను బసవరాజు అప్పారావు రచించారు తతిపి పల్లెజంట ముద్దులొలుకు పలుకును నండూరి సుబ్బారావుగారు "ఎంకిపాటలు"లో విన్పించారు భాషాభావాలలో నిరాడంబరత వీరిరువురి గేయాల లక్షణం. భావరామణీయకమంతా

కొలువుచేసిన పాటలు "కిన్నెరసానిపాటలు" తల్లావజ్ఝల శివశంకర శాస్త్రిగారు ఎన్నోగేయనాటికలు కావ్యవైభవంతో రచించారు

(త) హాస్యరసం అనేది నవరసాల్లో ఒక్కటిగా పరిగణింపబడినా ప్రాచీన సంస్కృతాంధ్ర సాహిత్యాల్లో అది ముఖ్య స్థానాన్ని పొందలేకపోయింది "మృచ్ఛకటిక"లో అనేకమార్గాలవల్ల జనించిన హాస్యం గోచరిస్తున్నది సంస్కృత వీధీ భాణప్రహసనాల్లో వుండేహాస్యం శుద్ధంగా వుంటుందని చెప్పజాలము ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ఎడనెడ చాటువుల్లో, యక్షగానాల్లో కావ్యాల్లో హాస్యం కన్పిస్తున్నది వీరేశలింగంగారి రచనల్లో, చిలక మర్తివారి రచనల్లో సాంఘిక సంస్కారానికి లోపడిన హాస్యము, చమత్కార ప్రధానమయిన హాస్యమూ వుంటాయి కేవలం హాస్యరసాన్ని ఆరాధించినవారు నవ్వులు గురజాడ అప్పారావుగారు స్వచ్ఛమయిన హాస్యరసాన్ని తెలుగువారికి రుచి చూపించారు "కన్యాశుల్కం"లోని పాత్రలు ఎటువంటి సన్నివేశంలో ఎట్లా మాట్లాడినా హాస్యరసం పొంగి పొర్లుతుంది పానుగంటివారి "సాక్షి" సంపుటాలు హాస్యరస నిలయాలు హాస్యరస ప్రయోజనాన్ని—దోషాల్ని బాహిరపుచ్చి సంస్కరించటం—గమనించి లక్ష్యసిద్ధి పడసినవారు పానుగంటివారు హాస్యరస ప్రధానంగా నవలలూ, నాటికలూ రచింపబడ్డాయి మొక్కపాటివారి "బారిష్టరు పార్వతీశం", "మోలియర్" ప్రభావంగల, మోతాదుమించిన హాస్యంతో నిండిన భమిడిపాటి కామేశ్వరరావుగారి నాటికలూ, చదివిన—చూచిన తెలుగువారు ఎంతగా కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వారో! సామాన్య సంసారాల్లో, లౌకికసన్నివేశాల్లో నిక్షిప్తమయిన హాస్యరసాన్నిచూపే "మునిమాణిక్యం" గ్రంథాలు చిరస్మరణీయాలు విమర్శలో తీవ్రతతో కూడిన హాస్యాన్ని చూపినవారు కట్టమంచివారుకాగా, అతిమృదువు, సాదువూఅయిన హాస్యాన్ని చూపినవారు చూపినవారు రాళ్లపల్లివారు

5

నవీనాంధ్ర సాహిత్యంలో నాలుగు భావోద్యమాలు బాగా పొతుకొని పోయాయి అవి భావకవితోద్యమమూ, జాతీయ రాష్ట్రోద్యమములూ, హేతువాదోద్యమమూ, అభ్యుదయకవితోద్యమమూ ఈ నాలుగుద్యమాలూ రెండు తరాలవారిని ఆకట్టేశాయి వానిలో ఒక్కొక్కదాన్ని సమీక్షించుదాము

(క) ఆత్మాశ్రయ కవిత్వం అనబడే ఈ భావ కవిత్వానికి ప్రథమాచార్యుడు రాయప్రోలు సుబ్బారావుగారు "సాహితీ సమితి" ఈ కవితాశాఖను బాగా ప్రచారం చేసినది ప్రతి వ్యక్తిలో ఏదో ఒక సార్వకాలికమైన, సార్వజనీనమయిన అమూల్యానుభవం వుంటుంది ఆ అనుభవాలను ఆశ్రయించి పెరిగినదీ భావ కవిత్వం షెల్లీ, కీట్సు మొదలయిన ఆంగ్ల కవులూ, రవీంద్రుడూ ఈ భావ కవులకు ఉద్దీప్తి కల్గించారు రాయప్రోలువారు మోహేతరమయిన దివ్యప్రేమను అభిలషించారు ఎన్నో పాత మాటలు వారి కావ్యాల్లో నూతనార్థాలను విరజిమ్ముతూ వుంటాయి నాయని సుబ్బారావు ప్రభృతుల భావ కవిత్వంలో ప్రకృతి ప్రవేశించినది ఈ శాఖలో నూటికి నూరుపాళ్లు భావకవి అయినవారు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు భావోద్వేగంతో, అక్షర రమ్యతతో, వినూత్నోపమానాలతో కృష్ణశాస్త్రిగారి కవనం వికాసం చెందినది ఆయన సృష్టి ఒక గంధర్వగానం ఈ రీతిగా ఇంకా కొంతదూరంపోయిన వారు వేదుల సత్యనారాయణశాస్త్రిగారు ఈ భావ కవిత్వంవల్ల కోకిలలూ, సెలయేరులూ మలయమారుతాలూ, అందరకూ ప్రియాతి ప్రియమైనాయి నూతన పద సంపుటలూ పద చిత్రాలు భాషలో బయలుదేరాయి కన్నె గులాబులూ, వెన్నెలదారులూ, మొయిలు దోనెలూ, పదాల గుస గుసలూ, భావాల పరిమళాలూ—ఒక్కటేమిటి ఈ విధమయిన వెన్నో భాషలో స్థిరపడిపోయాయి ఈ భావ కవితా లోకంలో పువ్వులు నవ్వుతాయి మూగ గుండెలు మాట్లాడుతాయి భావ కవులెంతోమంది యున్నారు "కాని వారిలో ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి, పిలకా గణపతిశాస్త్రి వంటివారి కొక స్థానం ఉన్నది వీరిలో ప్రాచీనతా సంస్కారం బలంగా కానవస్తూ, కొత్త పద చిత్రాలు అవి తక్కువైనా అందంగా వ్రాయడం అదొక స్థితికి గొంపోబడినది" (తెలుగు వాఙ్మయము పుట 233) ఈ పద్ధతికి తల్లావజ్ఝల శివశంకరశాస్త్రిగారు మగాల పురుషులుగా కన్పిస్తారు

అక్కిరాజు ఉమాకాంతంగారు ఆంధ్ర సాహిత్యంపట్ల మమతలేనివారు "నేటి కాలపు కవిత్వం" అనే విమర్శ గ్రంథంలో ఈ భావ కవితాశాఖను చీల్చి చెండాడారు వారి గ్రంథంలో పక్షపాత దృష్టి, సత్యమూ రెండూ కన్పడుతూ వున్నాయి భావ కవులందరూ సంఘాన్ని ఆడిపోసుకున్నవారే తమ వలపును అర్థం జేసుకోలేని లోకాన్ని ఈసడించిన ఈ కవులు రాను రానూ లోకంచేత ఈసడింపబడ్డారు ప్రజలకూ, భావ కవులకూ ఏమాత్రం పొత్తు లేకుండా పోయినది ఈ కవులు చుట్టూ గోడలు కట్టుకున్నారు భావ కవిత్వంలో రామణీయతకంటె అశక్తత అధికమైనది యతి ప్రాసలు నేర్చిన ప్రతివ్యక్తి అప్రాప్త మనోహారినిగూర్చి కవిత్వం వ్రాశాడు కాని, ఆమె కాలం గడిచినకొద్దీ దూర భూములకు తరలిపోయినది తీపి ఎక్కువైతే మొగం మొత్తినట్లు భావకవిత్వాన్ని అఖండంగా చదివిన ఆంధ్రజాతికి రోయింపు కల్గినది ఒకనాడీ భావకవుల మూగగుండెలే మాటాడాయి కాని తర్వాత వారు నోరే విప్పలేకపోయారు

(చ) జాతీయోద్యమంవల్లా, ఆంధ్రరాష్ట్రోద్యమంవల్లా దేశమంతా అట్టుడికి నట్టుడికిపోయిన రోజులవి పృథ్వీతలంపైన అణువణువునా వీరతాగుణం వెల్లివిరిసిన నాళ్లవి ఆనాడు కవి వీరులెందరో—కవిత్వమనే పదార్థం తక్కువైనా—పాటలు వ్రాసి, ప్రజలను ప్రబోధించి—కర్తవ్యోన్ముఖులను చేశారు గరిమెళ్ల సత్యనారాయణరావుగారి పాటలు వాడవాడలా మారుమ్రోగాయి. వర్తమాన ప్రభుత్వ విమర్శతోపాటు, ప్రాచీన భారత వైభవాన్ని నవీన కవులు వేనోళ్ల చాటారు. చరిత్ర సృష్టించిన వీరుల యశస్సునకు అక్షర రూపం కల్పించారు.

మహాత్మాగాంధి రాకతో భారత స్వాతంత్ర్యోద్యమంలో నూతనాధ్యాయం ప్రారంభమైనది ఆయన "పసిలేని సేన"తో సత్యాహింసలను అస్త్ర శస్త్రాలుగా అంగీకరించి, రవి యస్తమింపని మహా సామ్రాజ్యాన్ని వణకించాడు బాపూజీ అమరవాణిని ఆంధ్ర రచయితలు పాడారు. జాతీయోద్యమ ప్రభావంతో బయలు దేరిన నవలల్లో వేలూరి శివరామశాస్త్రిగారి "అహోబలీయం" ఉన్నవ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి" చాలా ముఖ్యమైనవి గాంధిగారి సిద్ధాంతాల్నితూ చా తప్పకుండా ఆచరించుచూ చూపాలని అహోబలీయ కథా నాయకుడు హోబయ్య ప్రయత్నించాడు "మాలపల్లి" హింసా హింసా సంగ్రామమూ, భక్తియోగమూ హరిజన పాత్రల ద్వారా చాటినది ఈ నవలలోవున్న ఇతివృత్తమంతా ఒక యెత్తూ, అందలి భాష మరొక యెత్తూను కండగల తెలుగు నుడికారానికి విడిది పట్టైనది "మాలపల్లి"

బాపూజీ దీనజన సేవానురక్తి, సత్యా హింసలూ తెలుగు కైసరులను పులకరింపజేశాయి బుద్ధ ధర్మోపదేశ గాథతో, గాంధీయ ధర్మావిష్కరణం ప్రాతిపదికగాగల మహాకావ్యం "సౌందరనందము" తద్రచయితలు పింగళి లక్ష్మీకాంతముగారు, కాటూరి వేంకటేశ్వరరావుగారు "కాటూరి" వారి "గుడిగంటలు" గాంధీయ ధర్మాన్ని వేంకటేశ్వరస్వామికే ప్రబోధించుతూ, గణగణ మ్రోగాయి మరి గాంధీ సందేశాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి, వ్రాసిన కవిత్వాన్నంతా దానితో నింపినవారు తుమ్మల సీతారామమూర్తిగారు వారు "బాపూజీ—ఆత్మకథ"ను తెనుగుగా చేశారు సీతారామమూర్తిగారు భారతదేశంలో గాంధీయుగాన్ని తమ కవిత్వంలో ప్రతిబింబింపజేశారు సర్వోదయరంగంలో గాంధీజీకి జోర నుడుగావున్న వినోబావాణి కూడా సీతారామమూర్తిగారిని కదలించినది తత్ఫలంగా వారి "సర్వోదయగానము" ఇటీవల వెలువడినది

ఆంధ్ర రాష్ట్రోద్యమమూ, తెలుగుకవులచేత కండల కదిలేటట్లు పాడించినది ప్రథమంగా దేశభక్తిని ప్రబోధించినవారు గురజాడవారుకాగా, ఆంధ్రాభిమానాన్ని చాటినవారు రాయప్రోలు సుబ్బారావుగారు "ఆంధ్రజాతి పూర్వోన్నత్యము, తరువాత తెనుగు పడుచుల ప్రణయాలు, నగలు, నోములు క్రీడలు" రాయప్రోలు అభిమాన కావ్య వస్తువులైనాయి కొడాలి సుబ్బారావుగారి "హంపీ క్షేత్రము" విశ్వనాథ "ఆంధ్రప్రశస్తి" ప్రబంధచ్ఛాయల్లో నడిచాయి. ఒక తుమ్మల సీతారామమూర్తిగారు ప్రాచీనాంధ్రత్వాన్ని ఒకవంక చాటుతూ, మరొకవంక ఆంధ్రోద్యమచరిత్రనంతా కావ్యగతం చేశారు రాళ్లపల్లివారి పెనుగొండపాట తేనెవాక పుట్టపర్తివారి "పెనుగొండలక్ష్మి" గిజ్జల రవళి తెలుగు నా డంతటా విన్పించినది

జాతీయరాష్ట్రోద్యమాలు ముమ్మరంగా సాగేసమయంలో ప్రాచీన వీరుల జీవన యశోగానం చేశారు తెలుగు కవులు రాయలసీమనుండి యిరువురు మహాకవుల కావ్యాల్లో చారిత్రకవాణి వీణ మ్రోగించినది గడియారం శేష శాస్త్రిగారి "శివభారతము", దుర్భా రాజశేఖర శతావధాని "రాణా ప్రతాపసింహచరిత్రము" "అమరసింహచరిత్రము" వీరరస పరిప్లుత శైలితో సాగినవి అభినవభారతంగా ఆంధ్రులహృదయాల్లో స్పందనం గలిగించే పల్నాటివీరుల చరిత్రను "వీరభారతము", "నాయకురాలు", "బాలచంద్రుడు" "మగువ మాంచాల" మొదలయినకావ్యాల్లో ఏటుకూరి వేంకట నరసయ్యగారు చిత్రించారు

(ట) పాశ్చాత్య నాగరకతా సంపర్కంవల్ల ఆంగ్ల సాహిత్య సమధ్యయనం వల్ల భారతీయ సంస్కృతిని నూతన దృక్కోణంనుండి సహేతుకంగా పరిశీలించటానికి ప్రయత్నించారు ఆంధ్ర రచయితలు ఈ ప్రయత్నంవల్ల భారతీయ సంఘం మూఢాచార కశ్మలభూయిష్ఠంగా, మానవతా గుణదూరంగా వారికి కన్పించినది. సాంఘిక సంస్కారోద్యమం కూడ దీన్ని బాగా ప్రోది చేసినది భారత దేశ చరిత్ర కూడా అనిదం పూర్వహేతుదృష్టితో పరిశీలించబడినది భారతీయ సంస్కృతి సౌధనిర్మాణంలో ఆర్యులనబడేవారేకాక, అనార్యులూ, శకయవనాది విదేశీయులూ తోడ్పడ్డారనే రహస్యం భూగర్భంనుండి బయట పడినది. ఆ సాంఘిక దృష్టితో, ఈ చారిత్రక దృష్టితో దేశంలో పెద్ద దుమారాన్ని లేపిన రచనలు చేశారు కొందరు అట్టివారిలో త్రిపురనేని రామస్వామిచౌదరి, గుడిపాటి వేంకటచలం ముఖ్యులు

రామస్వామిచౌదరిగారు ఆర్యానార్యద్విజాతి సిద్ధాంతంలో తీవ్రహేతు దృష్టితో భారతీయ పురాణేతిహాసాల్ని విమర్శించారు వారి "సూత పురాణము", "శంబుకవధ", "ఖూని", "భగవద్గీత", తెలుగువారి మనఃప్రపంచంలో భావవిప్లవాన్ని రేకెత్తించాయి శ్రీ ముద్దుకృష్ణ "అశోకము", చలం "హరిశ్చంద్ర", ఆమంచర్ల గోపాలరావు "హిరణ్యకశిపుడు" జి. వి. కృష్ణారావు "భిక్షాపాత్ర" కోటగిరి వేంకట కృష్ణారావుగారి "వేదవతి" ప్రాచీన కథలకు నూతన వ్యాఖ్యానాలు పి వి రాజమన్నారు నాటికలు కూడా భారతీయ సాంఘిక సూత్రాల్ని త్రెంచివేశాయి వారు రచించిన "తప్పెవరిది" పరంపరాగతంగా వచ్చిన ధర్మప్రవచనాల్ని అంగీకరింపలేదు

వేంకటచలంగారు తెలుగు దేశాన్ని ఒక్క వూపు వూపారు. చలంగారి రచనలన్నీ స్త్రీ పురుష సంబంధం కేంద్రం చుట్టూ తిరుగుతాయి స్త్రీ విలాస వస్తువు కాదని నిరూపించటానికి వారెంతో కృషి చేశారు కాని ఆంధ్ర దేశం వారి ధైర్యాన్ని ప్రశంసించినంతగా, రచనలను హర్షింపలేకపోయినది అవినీతిని వర్ణించటంలో నీతి సంపద బహిర్గతమౌతుందన్న సూత్రాన్ని సంఘం అంగీకరించాలంటే కొంతకాలం గడవాలి సజీవమయిన వ్యావహారిక భాష, భావ శబలతా, రచనా కళా, శిల్పదృష్టి చలంగారి రచనల్లో ఎలువుగా తెచ్చిన సొమ్ములు గావు

(త) అభ్యుదయ కవిత్వమూ, దానితోపాటు వచ్చిన అధి వాస్తవిక కవిత్వమూ రెండూ తెలుగు దేశంలో కొత్తగా అడుగు మోపాయి ఈ రెండు ఉద్యమాలకూ, ఆదికవి శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు 1930—1935 సంవత్సరాల మధ్యకాలంలో ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభవంతో హాహాకారాలు చేసినది ధనికవాద రాజ్యాలూ, వాటి వలసలైన భారతదేశంవంటి దేశాలూ ఈ సంక్షోభ భద్రకాళికి బలియైపోయాయి సోవియెట్ రష్యా సర్వోపద్రవాలకూ, అతీతంగావుండి, శరవేగంతో అభివృద్ధి సాధిస్తూ, ప్రపంచ పీడిత ప్రజాహృదయ క్షేత్రాల్లో ఆశాబీజాలు నాటినది దుర్భర జీవిత రథచక్రాలక్రింద జనం నలిగిపోతూవుంటే కవుల గుండెలూ నలిగిపోయాయి సోవియెట్ రష్యా సామ్యవాద భావాలు తెలుగు కవులను—ఈనాటికీ బయట పడకుండా వుండేటట్లు—తమ గుప్పిట్లోనికి లాక్కున్నాయి భావ కవిత్వం అభావ కవిత్వంగా పరిణమించిన ఆ రోజుల్లో అభ్యుదయ కవిత్వం ఆవిర్భవించింది ఆంధ్ర సాహితీ ప్రపంచానికి, "మరో ప్రపంచం" కన్పడినది ఆ మరో ప్రపంచానికి "మహా ప్రస్థానం" సాగించినవారు శ్రీ శ్రీ శ్రీ

"శ్మశానాలవంటి నిఘంటువులు దాటి, వ్యాకరణాల సంకెళ్లు విడిచి, ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి, వడిగా, వడి వడిగా" "వెలుగుల రవ్వల జడిగా" "నాలో కదిలే నవ్య కవిత్వం కార్మిక లోకపు కల్యాణానికి" అంటూ శ్రీ శ్రీ అభ్యుదయ కవిత్వం వ్రాశారు శ్రీ శ్రీ వాక్కు నూతనాతి నూతనమయిన వాక్కు మహా శక్తివంతమైన భాష ఆయనది ఆ వాక్కులో, ఆ భాషలో ప్రతిభా, ప్రత్యేకతా గోచరిస్తాయి ఒక ప్రత్యేక నూతన భావోద్యమానికి ప్రవక్త శ్రీ శ్రీ ఇంతే గాక, అధి వాస్తవిక కవిత్వం అనే ఒక నూతన కవితోద్యమాన్ని వారు ప్రవేశపెట్టారు సాహిత్యలోకంలో ఈ రెండు పద్ధతుల్లో కవిత్వం వ్రాసినవాడు శ్రీరంగం నారాయణబాబు "తెలుగు దేశంలో శ్రీరంగం శ్రీనివాసరావు నారాయణబాబుగార్లు అధి వాస్తవిక రచనలు సాగించారు కాని, యివి ప్రజామోదాన్ని పొందటంలేదు "మరో ప్రపంచం"లాంటి శ్రీ శ్రీ గేయాలను మెచ్చుకొన్న ప్రజలే ఆ శ్రీ శ్రీ వ్రాసిన అధివాస్తవిక రచనలను మెచ్చుకోడంలేదు. వాటి భావా లేమిటో నాకు బోధపడలేదు అధి వాస్తవికత పేరుతో మళ్లీ భావరహితమైన శబ్దాడంబరంకొరకు ప్రయత్నాలు—డ్రిల్లు జరుగుతున్నాయి" అని వ్రాసిన మద్దుకూరి చంద్రశేఖరరావుగారి వాక్యాలు సత్యములే. (ఆంధ్ర సాహిత్య పునర్వికాసం పుట. 58).

"అందాము ప్రహ్లాద కవిత్వ మిది అని, అందాము అందుకొని ఆదరి ద్దాము" అని అన్నాడు శ్లిష్ట్లా ఇక అక్కడనుండి అభ్యుదయ కవి పరంపర బయలుదేరినది రామదాసు, "వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి" అని అన్న అనిసెట్టి మొదలు రమణారెడ్డి వరకు ఎంతోమంది ధారాళంగా అభ్యుదయ కవిత్వం వ్రాసి, వ్యాప్తి చేశారు శ్రీ శ్రీ కున్న సంప్రదాయజ్ఞత, భాషాధికారమూ వీరిలో ఎంతో మందికి లేవు ప్రజా కవిత్వం అన్న నినాదాన్ని ఎక్కువగా చేసిన వీరు అభ్యుదయ భావాలను, కవితా స్ఫూర్తితో చెప్పలేకపోయారు నానాటికీ వీరు రాజకీయంగా సంకుచిత పరిధుల్లో విహరించారు అందుచే తర్వాత తర్వాత అభ్యుదయ కవిత్వంలో శ్రీ శ్రీ ప్రతిధ్వనులూ, వచన గుణమూ ఎక్కువైపోయాయి అది ప్రచార సాహిత్యంగా పరిణమించినది "ఆరుద్ర", "బైరాగి" మాత్రము అభ్యుదయ కవిత్వంలో బలపడిపోయిన పలుచదనాన్ని పరిహరించటానికి పాటుబడ్డారు. రమణారెడ్డిగారి "భువనఘోష" సాహిత్య భువనంలో ఒక ఘోషగానే మిగిలిపోయినది

అభ్యుదయ భావాలతో రూపక రచన ఉదాత్త రీతుల్లో జరిగినది దేశంలో అలజడి గలిగించిన రూపకాల్లో సుంకర, వాసిరెడ్డిగారలు రచించిన "ముందడుగు" "మా భూమి" ప్రత్యేకంగా పేర్కొనవలసినవి అనేక విధాలుగా ప్రజలను సతమతపరచే ఆర్థిక సమస్యల్ని, కళాత్మకంగా చూపాయి ఈ రూపకాలు కొన్నిచోట్ల వీటిలో కూడా రాజకీయ నినాదాలు లేకపోలేదు. శ్రీ ఆత్రేయ సుప్రసిద్ధ—అభ్యుదయ రూపక రచయిత ఆయన రచించిన "ఎన్ జి వో" నవీన రూపకాలలో అగ్ర గణ్యమయినది ఎటువంటి ఆర్థిక సమస్యనైనా ఎంత కళాత్మకంగా చిత్రింపవచ్చో ఋజువు చేసినదీ నాటకం "పరివర్తన, విశ్వ శాంతి, భయం" అనే రూపకాలను ఆత్రేయ రచించారు వీటిమీద ప్రపంచ సాహిత్య ప్రభావం బాగా వున్నది

6

1947 వ సంవత్సరం తర్వాత

1947 వ సంవత్సరం తర్వాత అని వ్రాశానేగాని, ఆ యా నూతన ప్రక్రియలను, వాని లక్షణాలనువివరించే సందర్భంలో, ఆయా భావోద్యమాలగతులను గుర్తించే సందర్భంలో సౌలభ్యం కొరకు స్వాతంత్ర్యానంతరం వెలువడిన సాహిత్యం కొంతకుకొంత పరామర్శింపబడినది ఆ పరామర్శను బట్టి చూస్తే, ఆయా భావోద్యమాలు ఇంకా తెలుగువారి మనస్సుల్లో పని చేస్తూ వున్నట్లు ద్యోతకమవుతుంది వ్యావహారిక భాషా గ్రాంధిక భాషా అనే చర్చలకు అవకాశం లేకుండా పోయినది రెండు రీతుల్లోనూ రచనలు సాగుతున్నాయి అయితే ఒకటి మాత్రం జరుగుతూ వున్నది. వ్యావహారిక భాషను వ్రాసేవారు దానిలో కృత్రిమ గ్రాంధిక భాషా లక్షణాల్ని జొనుపుతున్నారు గ్రాంధిక భాషలోనేమో, వ్యావహారిక భాషా లక్షణాలను అనుసరించుతున్నారు రచయితలు రెండు వాదలనూ మేళగించి సామరస్యం కల్గించుదామనుకుంటూన్నారో యేమో తెలియదు రచనల్లో వ్యక్తి స్వాతంత్ర్యము మరీ యెక్కువయినది ఏ నియమమూ కాలానుకూలంగా పాలింపబడుతూ వున్నట్లు కానరాదు మానవతావాదం అనేది కూడా అపమార్గాల్లో పడినది మానవతావాదం అని వాక్శూరత ప్రదర్శించటం జరుగుతున్నదే తప్ప, దానిని కళాత్మకంగా దర్శించే ధోరణి మృగ్యమైనది ఏదైనా ఒక నూతన భావోద్యమం బయలుదేరినదంటే దానిపట్ల ఏవగింపు కల్గేంతవరకూ దానిని పాడిగిస్తూ, పాడినదే పాడటం మన కలవాటైనది ప్రబంధ ప్రక్రియ, భావ కవిత్వోద్యమం, అభ్యుదయ కవిత్వం దీనికి తార్కాణాలు ఒకతరంవారు భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం వ్రాయటం మాని వేశారు. వారి తర్వాత వారు మరలా పాడటం మొదలు పెట్టారు. వానిని అనుసరింపగూడదని అనడంలేదు కాని ఒకతరంవారు ఏ యే రీతుల్లో అయితేపోయారో మరలా అదే రీతుల్లో ఆ కోకిలలనూ, ఆ మలయమారుతాలనూ, ఆరాబందులనూ ఆలోహాశ్యేనాలనూ పరివారంగా చేసుకొని, ప్రయాణం సాగిస్తే ఏమంత బావుంటుంది. ఏదైనా ఒక నూతన లక్షణం ఆపాదించి పూర్వ పూర్వ మార్గాలకు మెరుగులు తిద్దుకుంటూ, నూతన పదాలను అన్వేషించటం అభ్యుదయానికి చిహ్నం తాపీ ధర్మారావునాయుడుగారు, "కొత్తపాళీ"లో అన్నట్లు ఆంధ్ర రాష్ట్రంకంటె చిన్నదైన ఐరోపాదేశాల్లో నోబెల్ బహుమాన మందుకునే వారుంటే, మనలో— నోబెల్ బహుమానం సంగతి దేవునికి తెలుసు—తుదకు అఖిల భారత స్థాయిని గూడా పొందినవారు కరవయ్యారు ఈ వాక్యం వ్రాస్తూ, ప్రపంచ కధానికల పోటీలో ప్రధమ బహుమానం పొందిన పాలగుమ్మి పద్మరాజులు ఈ తెలుగు గడ్డ మీద వున్నారు అనే ప్రశ్న కూడా వెన్వెంటనే పుట్టుతున్నది. జాతీయ రాష్ట్రోదయ పర్వదినాలను పురస్కరించుకొని ఎంతోమంది కవికుమారులు ప్రాచీన వైభవాన్ని చాటుతూ, పద్యాలల్లుతూ వున్నారు నవ్యాంధ్ర సాహిత్యంలో ఈ శతాబ్దం రెండు మూడు దశాబ్దాల్లో సుప్రసిద్ధులయిన వారియందు—ఏ యిద్దరనో, ముగ్గురనో మినహాయించితే—మిగిలిన వారందరూ అస్త్ర సంన్యాసం చేశారు ఆ యా నూతన భావోద్యమాలు బయలు దేరటానికి ఏ చైతన్యం శక్తి ఆ యా రచయితలను ప్రేరేపించినదో ఆ శక్తి నానాడూ కొరవడుతూ వున్నట్లు ద్యోతకమవుతున్నది అయితే సాహిత్య విస్తృతి జరుగలేదా అంటే జరిగినదనే సమాధానం చెప్పాలి దానికి కారణం చైతన్యశక్తిగాదు. మరి భిన్నమైనది.

ఈ కారణాలను వెదకటంలో మనకు ముందుగా కన్పించేవి పత్రికలు. ఈనాడాంధ్రదేశంలో దిన, వార, పక్ష, మాస పత్రికలు చాలా వున్నాయి. విద్యావ్యాప్తివల్ల కొన్ని లక్షలమంది ఆ పత్రికలు చదువుతూ వున్నారు. ఆ పత్రికలు నిత్యమూ ఎన్నో నవలలను, ఖండ కావ్యాలను, ఏకాంకికలను, రూపకాలనూ, కథానికలను ప్రచురిస్తున్నాయి మాసం గడిచేటప్పటికి అన్ని సాహిత్య ప్రక్రియలూ వందకుపైగా కొత్తవి వెలువడుతున్నాయి ఈవిధంగా చూస్తే, గతించిన పదిహేనేండ్లలో ఆంధ్ర సాహిత్యం ఎంతగా విస్తృతి పొందినదో, ఎంతగా వైవిధ్యం సంతరించుకున్నదో అంతు లేకుండా వున్నది వస్తువును ఆధారంగా తీసికొని, సమీక్షించటంకంటె ఆ యా భావోద్యమాలను ఆధారంగా చేసికొనే ఈ సాహిత్యాలను సమీక్షచేయవలసి వున్నది ఆశాజనకమైన గొప్ప మార్పు గోచరిస్తున్నది అనేకులు నూతన రచయితలు నవ్యాంధ్ర సాహిత్య వీధుల్లో విహరించుతున్నారు పుష్కలంగా సాహితీ సేవ చేస్తున్నారు కాని, "ఇదిగో వీరు ఈ నూతన భావోద్యమాన్ని ప్రారంభించారు" అని మనం సగర్వంగా చెప్పుకోటానికి ఎంతమంది లభించుతారు? అని కూడా మనం ప్రశ్నించుకోవాలి గతం అంతా మంచిదనే ధోరణిలో ఈ వాక్యాలు వ్రాయటంలేదు కొత్త పుస్తకాలతోపాటు, కొత్త భావాలూ, సాహిత్యంలో ప్రవేశిస్తే అది బలుపవుతుంది లేకపోతేవాపవుతుంది రచయితలకు సన్మానాలెంత యెక్కువగా జరుగుతున్నాయో, ఆ నిష్పత్తిలో వారి గ్రంధాల్లో కొత్తదనం కన్పించటంలేదు ఇప్పుడు ఒకా నొక సంధి దశ గోచరిస్తూ వున్నది దీనిలోనుండి ఒక నూతన భావోద్యమం రాక తప్పదు సాహిత్యం ఎక్కువగా పెరిగిపోవటానికి, "ఆకాశవాణి" చాలా దోహదం జేస్తున్నది. "ఆకాశవాణి"లో వివిధ ప్రత్యేక కార్యక్రమాలు అనుదినమూ నిర్వహింపబడుతున్నాయి ఆ కార్యక్రమాల కొరకు ఎందరో రచయితలు ఎన్నో సాహిత్య ప్రక్రియలు సృష్టించుతున్నారు. ఇక మూడవ కారణం పుస్తక ప్రచురణ సంస్థలు ఇవి తెలుగునాట చాలా వున్నాయి. అవి చాలా గ్రంధాలను ప్రచురించుతున్నాయి స్వదేశ విదేశాల్లోని ఉత్తమ రచనలను అందిస్తున్నాయి అయితే మిగుల దారుణమైన విషయమేమిటంటే ఆ పుస్తకాల ఖరీదులు నానాడు ఆకాశాన్నంటుతున్నాయి ఏదైనాపుస్తకం ఖరీదుని నయాపైసాల్లోకి మారిస్తే, ఆ నయా పైసాల మొత్తంలో మూడోవంతో, నాలుగోవంతో పేజీలు మాత్రమే ఆ పుస్తకంలో మనకు కన్పిస్తాయి పరిశోధనా గ్రంథాలకు—కొనేవారూ, అవసరమైనవారూ తక్కువమంది కాబట్టి—అధిక మూల్యం నిర్ణయించటంలో ధర్మం గోచరిస్తుంది కాని ఈ పుస్తకాల ధరలు అట్లాగాదు చదివే వారెక్కువయిన కొలదీ ఈధరలూ ఎక్కువవుతాయి ప్రభుత్వ వైయక్తిక ప్రయత్నాలవల్ల మూడు పూలూ, ఆరు కాయలుగా గ్రంధాలయోద్యమం అభివృద్ధి చెందుతున్నది తత్ఫలితంగా పుస్తకాలధర లెంతగా మిన్నంటినా చెల్లుబడి అవుతున్నది

స్వాతంత్ర్యానంతరం నవీన సాహిత్యంలో అనువాద సాహిత్యం త్రివిక్రమ రూపం దాల్చినది ఈ శతాబ్దినుండీ అనువాద సాహిత్యం లేకపోలేదు. వేంకట పార్వతీశ్వర కవులూ, వేలూరి శివరామశాస్త్రిగారివంటి పెద్దలూ, తదితరులూ వంగభాషనుండి పాశ్చాత్య భాషలనుండి ఉత్తమ సాహిత్యాన్ని జాను దెనుగులో అనువాదం చేశారు. 1947 వ సంవత్సరం తర్వాత ఈ అనువాద సాహిత్యం పెరిగి

పోవటానికి పత్రికలూ, ప్రచురణ సంస్థలూ తోడ్పడ్డాయి తెన్నేటి సూరి, నండూరి రామమోహనరావు, విద్వాన్ విశ్వం, బెల్లంకొండ రామదాసు మున్నగువారు ప్రపంచ భాషలలోని గొప్ప గ్రంధాల్ని అనువదించి, ఈ సాహిత్యాన్ని ఎంతో పెంపొందింపజేశారు నవలలేకాక, ఏకాంకికలు, కధానికలు, రూపకాలు, ఆ యా ప్రపంచ సాహిత్యాలనుండి వచ్చాయి. క్రమ క్రమంగా ఒక మార్పు గోచరిస్తున్నది ప్రాచీన భారతీయేతి హాసాదులను, కావ్యాలను సులభమయిన వచనంలోనికి అనువదించటానికి రచయితలు ప్రారంభించారు దీనికి నాంది పాడినది "ఆంధ్రపత్రిక" దిన పత్రిక. శ్రీనివాస శిరోమణి వాల్మీకి రామాయణాన్ని అనువదించారు భారత భాగవతాలు అనువదింపబడుతున్నాయి కిరాతార్జునీయం, కాదంబరి, దశకుమార చరిత్రలు అనువదింపబడినవి కొంతకాలం నడిచిన "పరిశోధన" పత్రికలో రామచంద్ర వేంకట రమణయ్యల "లలిత విస్తరం" అనువాదం ప్రచురింపబడింది పై చెప్పిన గ్రంధాలలో కొన్నింటికి పూర్వకాలంలోను, నవీన కాలంలోను అనువాదాలు వుండవచ్చుగాక! కాని అక్షరాస్యుడైన వానికి విజ్ఞాన భాండాగార ద్వారకవాటాలను తెరచుదామనే ప్రయత్నం ఆ గ్రంధాల్లో కన్పింపదు మరి నేటి అనువాదాలు శిష్ట వ్యావహారిక భాషలో నడుస్తూ, నలుగురకూ అర్థం కావాలనే ధోరణిలో వున్నాయి

మనకు పాశ్చాత్య భాషా సాహిత్యాలతో, పరిచయమున్నంతగా ఆంధ్రేతర భారతీయ సాహిత్యాలతో పరిచయంలేదు ఇరుగుపొరుగు భాషలతోడి పొత్తు ఇప్పుడిప్పుడే నెలకొంటూ వున్నది ఆంధ్ర భాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందినప్పటికీ, తులనాత్మక సాహిత్యాధ్యయనం కుంటుపడింది దత్తమండలానికి చెందిన రచయితలు రామచంద్రవంటివారలు తులనాత్మక పరిశీలనం చేస్తూ వున్నారు తమిళ భాషలో అగ్రశ్రేణికి చెందిన కావ్యం "కంబ రామాయణం", "తిరుక్కురల్" సుబ్రహ్మణ్యభారతి కృతులు, రాజగోపాలాచారి గ్రంధాలు అనువదింపబడ్డాయి దక్షిణ భారత పుస్తక ప్రచురణ సంస్థవల్ల ద్రావిడ భాషల్లోని సాహిత్యం అనువదింపబడుతూ వున్నది ఈ ప్రచురణసంస్థ ప్రపంచ భాషల్లోని ఆ యా ప్రక్రియలను అందిస్తున్నది ద్రావిడ భాషా తులనాత్మక పరిశీలనా రంగంలో చల్లా రాధాకృష్ణశర్మగారు ప్రశంసనీయమయిన కృషిచేస్తున్నారు మరువూరు కోదండరామిరెడ్డిగారు శిలప్పదిగారాన్ని "మంజీర గాథ"గా సంతరించారు ఇక హిందీ మొదలయిన ఆర్యావర్త భాషల సాన్నిహిత్యం గూడా ఎక్కువైనది ప్రేమచందు జైనేంద్రకుమార్ల నవలలు తెలుగువారిని శరత్‌బాబు నవలల్లాగా లోగొన్నాయి పూర్దూభాషనుండి "గాలిబ్ గీతాలు" వచ్చాయి బుద్ధ జయంతి వలన బౌద్ధ సాహిత్యం రూపొందినది శత వార్షిక జయంతివలన రవీంద్రుడు సజీవుడయ్యాడు. ఒక వ్యక్తిగాదు ఒక ప్రచురణ సంస్థగాదు—ఎందరో వ్యక్తులు, ఎన్నో సంస్థలు రవీంద్ర సాహిత్యాన్ని ప్రబలంగా ప్రచారం చేయటానికి ప్రయత్నించటం జరిగినది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి బాగా దోహదం చేశాయి ఇదే సమయంలో రవీంద్ర సాహిత్యానువాదాల్లో రవీంద్రుని మూర్తి ఏ రూపంలో గోచరించుతూ వున్నదని మనం ఆత్మ పరిశోధనం జేసికొనటం గూడ మంచిది

తెలంగాణాలో జరిగిన సాహిత్య సృష్టిని ప్రస్తావించి, యీ భాగానికి భరత వాక్యం పలుకుతాను తగినంత ప్రచారం లేక, యితరులకు తెలియదుగాని, ఈ శతాబ్ద ప్రారంభంనుండి అచట ఎంతో గొప్ప సాహిత్య వ్యవసాయం జరుగుతూనే వున్నది. భారత ప్రభుత్వ సైనిక చర్యతో, ఆంధ్ర ప్రదేశావతరణముతో తెలగాణమునకు, సాగరాంధ్ర దత్తమండలములకూ ప్రగాఢ సంబంధం ఏర్పడినది తెలంగాణములో నవ్య యుగ శంఖమెత్తినవారు కొమర్రాజు లక్ష్మణరావుగారు వారి ప్రోత్సాహంతో నెలకొన్న శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయమూ, రాజనరేంద్ర భాషా నిలయమూ, విజ్ఞాన వ్యాప్తికి ఎంతో దోహదం చేశాయి తెలంగాణా సాహితీ పునరుజ్జీవనంలో నేడు దేవులపల్లి రామానుజరావుగారు సారధ్యం వహించిన "ఆంధ్ర సారస్వత పరిషత్తు" మహా పాత్ర నిర్వహించినది

పేరు తెలంగాణమయినా, ఆ ప్రాంతంలో కొలువు సింగారమై కూర్చున్నవాడు ఉస్మాన్ ఆలీఖాన్. మహమ్మదీయేతరుల చిరువేడి వెత్తురులను పన్నీటి

జిల్లుగా పరిగణించిన విలాస పురుషుడై ముక్కిడి యేలుబడిని కత్తులతో సాగించిన కుబేరు డాయన భారతదేశంలో సౌరభ్యాలను జిమ్ముతూవున్న సాంస్కృతిక పునరుజ్జీవన కమలం నైజాము నవాబు అర్ధచంద్ర ధ్వజంక్రింద ముకుళించుకొని పోయినది ఉర్దూను రాజభాషగాచేసి, తెలుగుపట్ల సవతితల్లి వలపును చూపి నా డా ప్రభువు తెలంగాణమునకు, శేషాంధ్ర దేశమునకు నెయ్యము బిగియకుండా నిరోధించినాడు ఆయినా కొందరు విజ్ఞానమూర్తుల నిర్విరామకృషి ఫలితంగా అంధకార బంధురమైన ఆ ప్రదేశంలో జ్ఞానద్యుతులు ప్రసరించాయి ఈ సందర్భంలో ప్రాతః సంస్మరణీయులయినవారు సురవరం ప్రతాపరెడ్డిగారు, మాడపాటి హనుమంతరావుగారు ఈ సంఖ్యావన్మణుల నిరంతర ప్రయత్నాలవల్ల తెలంగాణములో సారస్వతోద్యమమూ, ఆంధ్రోద్యమమూ, గ్రంథాలయోద్యమమూ, దిన దినాభివృద్ధిని పొందాయి ఇతరాంధ్ర దేశంలో సాహిత్యాభివృద్ధి వ్యక్తులను ఆశ్రయించితే, తెలంగాణంలో అది సంస్థలను ఆశ్రయించినది. అది అక్కడ ఒక నిర్మాణాత్మకోద్యమంగా భాసించినది గద్వాల మున్నగు సంస్థానాల్లో సంస్కృతాంధ్ర భాషా పండితసింహులెందరో వున్నారు

తెలంగాణంలో కూడా నూతన సాహిత్య ప్రక్రియలను తెలుగులో సృష్టించవలెననే ఉద్యమం బాగా వేరు దన్నినది ఈ ఉద్యమం ప్రారంభించినవారు మాడపాటి హనుమంతరావు సిద్ధహస్తులు కృష్ణా పత్రికలో వీ రెన్నో కథలు ప్రకటించారు సురవరం ప్రతాపరెడ్డిగారు ఒక జంగమ విజ్ఞాన సంస్థ. వీరూ కథానికలు రచించారు ప్రతాపరెడ్డిగారు రచించిన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర", "రామాయణ విశేషములు" సమస్తాంధ్ర దేశ విద్యావంతుల దృష్టిలో గొప్ప మార్పును తీసికొని వచ్చాయి లక్ష్మణరావుగారి అడుగుజాడల్లో నడుస్తూ, విశిష్ట చరిత్ర రచనలు గావించి, నిష్కామ సాహితీ సేవ గావించువారు ఆదిరాజు వీరభద్రరావుగారు. బూర్గుల రామకృష్ణారావుగారు సారస్వత వ్యాసములను రచించుటేకాక, ఉమర్ ఖయ్యామ్ రుబాయితులనూ, పండితరాయకృతులనూ అనువదించారు తెలంగాణములో ఆ యా ఉద్యమాల ప్రభావం కాలక్రమానగాని, స్పష్టంగా కన్పడదు కావ్యాలు, ఖండ కావ్యాలు, కథానికలు ఎన్నో నూతన పద్ధతుల్లో వెలువడినాయి. కథకులలో మిగుల ప్రఖ్యాతిగాంచినవారు భాస్కరభట్ల కృష్ణారావుగారు కథానికను ఒక మనోహర ప్రక్రియగా వీరారాధించుతున్నారు సమాజమందలి ఒడుదుడుకులను చిత్రించి, సాంఘికాభ్యుదయమును బోధించు కథానికలను, కావ్యఖండాలను పొట్లపల్లి రామారావుగారు రచించారు ధరణికోట శ్రీనివాసులుగారు "ముని మాణిక్యం" ప్రభావంతో సాంసారికసంఘటనలతో కూడిన కథలు రచించుతున్నారు ఇల్లిందల సరస్వతీదేవిగారు ఉత్తమ కథకులు రచించువారిలో ఒకరు.

అన్ని రకాల భావోద్యమాలనూ, జీర్ణము చేసికొన్నవారు దాశరథి కృష్ణమాచార్యులుగారు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అంటూ, "కింగ్ కోటీ" ప్రాకారం బ్రద్దలయ్యేటట్లు నాయెత్తి పాడినవారు దాశరథిగారు శ్రీ దాశరథి కవిత్వం చెప్పవేర్చిన కావయ్య నాయకుడు అభ్యుదయ కవిత్వధోరణి జాతీయ రాష్ట్రోద్యమాల గమనములూ, "అగ్నిధార", "రుద్రవీణ" "మహాంధ్రోదయం" కావ్యాల్లో కన్పించుతాయి బుద్ధ జయంతి సందర్భంలోవారు, "మహాబోధి" రచించారు. మరి నారాయణరెడ్డిగారిలో భావ కవితాభిమానం స్పష్టంగా కన్పడుతున్నది. స్వాతంత్ర్యానంతరం గేయ కవిత్వాన్ని శక్తివంతంగా సృష్టించిన వారిలో సర్వాంధ్రదేశంలోనూ నారాయణరెడ్డిగారగ్రగణ్యులు మాత్రానియతిని పాటించి, పాదాదియతిని వేసుకుంటూ, భావ బలోచితంగా నడక మార్చుకొంటూ, వీరి గేయ కవిత్వం రాణ కెక్కినది. ఆయన కవితా శక్తి "నాగార్జున సాగరము"లో కంటె, "కర్పూర వసంతరాయలు"లో బహుళంగా కన్పడుతున్నది. ఏకాలంనాటి యితివృత్తమైనా, మొదట నారాయణరెడ్డిగారు శృంగార రసప్రధానంగా రచన సాగించారు. "విశ్వనాథ నాయకుడు", "సమ దర్శనం" పై సూత్రానికి భిన్నంగా నడిచాయి. తెలంగాణాలో వుంటూ, అధి వాస్తవిక కవితా ప్రభావంతో వచన పద్య రచన సాగించేవారు కుందుర్తి ఆంజనేయులుగారు గేయకవులలో ఉక్తి వైచిత్రి, భావోద్రేకముగల ప్రజా కవి కాళోజీ నారాయణరావుగారు. సమకాలిక పరిపాలనా పద్ధతిని వ్యంగ్య రచనల ద్వారా వారు తూర్పార బట్టారు. వానమామలై వరదాచార్యుల రచనల్లో శ్రీనివాస సోదరుల రచనల్లో ప్రాచీన, నవీన కవితా సంప్రదాయ సమ్మేళనం కన్పడుతున్నది పల్లా దుర్గయ్యగారు "గంగిరెద్దు" అనే సాంఘిక కావ్యం రచించారు పద్యాలతో, గీతావళితో నిండినవారి "పాలవెల్లి" రమ్యమయిన ఖండ కావ్యము.

7

ఈ శతాబ్దంలో ఆంధ్ర భాషా పరిమాణాన్ని అవలోకిస్తే ఆశ్చర్యం కల్గుతున్నది ఆంధ్ర భాషా సరస్వతి నోచిన నోములు తక్కువయ్యో ఏమో కాని, ప్రాచీనకాలంనుండీ ఎందరకో దాని ప్రకృతి అంతు పట్టలేదు తెలుగులో కావ్యాలు రచించినవారు గీర్వాణ వైదగ్ధ్యాన్ని చూపించి, జోహారులందుకొన్నారు. ఇట్లాంటి వారిని జూచే కాచోలు మొల్ల

"మును సంస్కృతముల దేటగ
దెనిగించెడి చోటనేమి దెలియకయుండన్
దన విద్య మెరయ గ్రమ్మర
ఘనమగు సంస్కృతము జెప్పగా రుచి యగునే"

అని చెప్పినది శిల్పావిష్కరణానుకూలంగా సంస్కృత భాషను ఆదరింపవచ్చు కాని, సంస్కృత శ్లోకమా? తెలుగు పద్యమా? అని అనుమానం కల్గేంతవఱకూ పోయారు ప్రాచీనులలో కొంతమంది. మఱి ఇప్పుడు మనతలపై తాండవం జేస్తున్నది ఆంగ్ల భాష. ఆంగ్ల భాషా ప్రభావం ఎంతవరకు వచ్చిందంటే, "మనం ఇంగ్లీషు రచనచేస్తే తెలుగు మర్యాదలూ, తెలుగు రచనచేస్తే ఆంగ్ల మర్యాదలూ దొరులుతూ వుంటవి" తత్ఫలితంగా ఒక విధమైన "ఆంగ్లో—ఆంధ్రభాష" ఈ కాలంలో ఏర్పడినది ఒకనాడు దేవభాష తెలుగులో వున్న కొన్ని కొన్ని పదాలనే మాయం జేసినది ఈనాడు ఆంగ్లభాష సార్వభౌమాధికారాన్ని—రాజకీయంగా కాకపోయినా—రచనల్లో చలాయిస్తున్నది. ఇది చాలదేమో అన్నట్లు ఇప్పుడు హిందీ త్రుళ్ళ ఎక్కువైనది చూస్తూ, చూస్తూ వుండగానే తెనుగు నుడికారానికి సజీవ సమాధి ప్రాప్తిస్తున్నది. అన్య భాషా సంబంధం అక్కరలేదనిగాని, మడికట్టుకోవాలనిగాని నేననటంలేదు అన్య భాషా మైత్రివలన ఏ భాషకైనా పుష్టి కల్గుతుందేకాని, నష్టిరాదు కాని, ఆంధ్ర భాషా సంప్రదాయం అదృశ్యమైపోయేటంతగా ఇతర భాషల చుట్టరికాన్ని ఇచ్చగించటం నాగరక లక్షణమేమోకాని, విజ్ఞతకు తార్కాణంగాదు

ప్రతి భాషకూ, ఒక ప్రత్యేక స్వభావం వుంటుంది దానిలోవుండే నుడికారం, నానుడులూ, పదబంధాలూ తదన్యభాషల్లో కన్పడేవానికంటె భిన్నంగా వుంటాయి ఆ యా భాషల్లో వాక్య నిర్మాణం వివిధ విన్యాసాలు చూపుతుంది. జీవద్భాషఅయిన ఆంధ్ర భాషలో కూడ అంతే తెలుగు బాసలోని కారకం, వాక్య నిర్మాణం, జాతీయాలు, నుడికారం తత్స్వభావాన్ని తేట తెల్లం జేస్తాయి ఇవి మన భాషకు ప్రాణం వంటివి. ఈ ప్రాణం పోయేటంతగా భాషా శరీరానికి ఎన్ని అన్య భాషా సంప్రదాయాలంకారాలు తగిలించినా వ్యర్థమే. వ్యావహారిక భాష పేరుతో ఈనాడు మనం జేస్తున్నదంతా ఇదే. ఏనాడో ఈ విషయాన్ని గుర్తించిన కాటూరి వేంకటేశ్వరరావుగారు ఇట్లా చెప్పారు. "వ్యవహార భాషా వాదానికి సౌలభ్యము జీవగఱ్ఱ. భాషా సౌలభ్యం ప్రాజాపత్యమునకు జెలిమికత్తె అయ్యు, మన పూర్వాంధ్ర సాహిత్యము నీ వ్యవహార భాష మన బాల బాలికలకు దూర మొనర్చునేని, దాని సౌలభ్యానికి వేయి నమస్కారాలు. పోనీ భాషా స్వభావానికి తిలోదకాలు విడిచియైనా సౌలభ్యం సాధించగలిగామాఅంటే అదీ సందేహమే. ఆంగ్ల భాషావేత్తలకేగాని, మన రచనలు పూర్తిగా బోధపడవేమో అనుకుంటాను వ్యవహారంలోవున్న కొన్ని క్రియా రూపాలూ, కొన్ని అపభ్రంశాలూ వాడినంత మాత్రంచేత భాషకు సౌలభ్యమూ లభింపదు. వాటిని విడిచిపెట్టితే కాఠిన్యమూ ఏర్పడదు ఆంగ్లభాషా విదులుగాని జానపదులకు సులభంగా గ్రాహ్యమయ్యే భాషను గ్రంథకర్తలు నేర్చుకోవలసి వుంటుందని తోస్తుంది" (తెలుగు వ్యాసములు, పుటలు 155, 156). ఆంగ్లభాషే అవి అనుకుంటామేగాని, మన విడరాని నెయ్యమైన దేవ

భాషకూడా నేడేమీ తక్కువ అపకారం చేయటంలేదు. కొందరి రచనలు చదివితే ఆంధ్ర వాక్య నిర్మాణం ఎంత గీర్వాణ స్వభావాన్ని అలవరచుకున్నదో తెలుస్తుంది. ఈనాటి విద్యార్థుల పార్య గ్రంథాల్లో సంస్కృతాంగ్ల భాషా సంప్రదాయ ప్రయుక్తమైన ఆంధ్ర భాష సాక్షాత్కరించుతున్నది

ఈనాటి రచనల్లో సభ్యత అనేది కూడా మందుకైనా కానరావటంలేదు మనస్తత్వచిత్రణం పేర ఎంతో అనాహూతం జరుగుతూ వున్నది ఫ్రాయిడ్, యూంగ్ చెప్పిన మనస్తత్వ శాస్త్ర లక్షణాలపేర ఇతివృత్త గ్రహణంలో, పాత్ర పోషణంలో సన్నివేశ కల్పనంలో ఒక విధమయిన కృత్రిమగుణం ఎక్కువైనది కామము, ప్రేమా, ప్రణయం అన్న మూడు పదాలూ ఒకదాని కొకటి పర్యాయ పదాలు కావు ప్రథమ తత్వానికి పట్టంగట్టే రచనలు ఉద్వేగాన్ని పెంపొందించి, క్షుద్రాభిరుచులను ప్రకోపింపజేయటంతప్ప సాధించేదేమీ లేదు అట్లా చేయటం ఉత్తమ సాహిత్య లక్షణమూకాదు. కామాన్ని, సాహిత్యావరణంనుండి వెలి వేయమని ఎవరూ అనరు. మానవుడు సాధింపదగిన పురుషార్థాల్లో కామార్థం ముఖ్యమైనది బలీయమైనదీనూ అట్లాంటప్పుడు మానవుడు సృష్టించే సాహిత్యంలో దానికి అగ్రాసనం లేకుండా వుంటుందా? కాని ఆ మానవుడే సభ్యతఅనే సత్సంప్రదాయాన్ని కూడా నెలకొల్పుకొన్నాడు ఈ సంప్రదాయంవలన ఉపకారమే కాని అపకారం ఏ మాత్రమూ జరగదు. కాబట్టే దీన్ని త్యజింపరాదు దైనందిన వ్యవహార వేష భాషల్లో ఎంతో సభ్యతను—అవసరాన్ని మించి కూడా పాటించే మనం సాహిత్యంలో మాత్రం ఎందుకు దూరంగా వుండాలి? ఈ సందర్భంలో చాల మంది గుడిపాటి వెంకటచలంగారిని వుదాహరించుతారు బాగానే వున్నది. వెంకటచలంగారి రచనల్లో పాత్ర పోషణమూ, శిల్పదృష్టి లుప్తమైపోయి, కేవల ప్రత్యక్ష కామ వర్ణనలు మాత్రమేవున్న రచనలు ఎన్ని వున్నాయో వారిని ఉదాహరించేవారు పరిశీలించటం మంచిది సాహిత్యం కూడా మానవ జీవితం లాంటిదే మానవుని శరీరంలోగాని, గుణగణాల్లోగాని, ఏక దేశాభివృద్ధిని ఎవ్వరూ హర్షింపరు సర్వ విషయతుల్యాభివృద్ధిని మానవుడు వాంఛించుతాడు ఆతత్త్వం సాహిత్యంలో కూడా ప్రతిబింబించటం సహజము సుందరమూనూ. ముఖ్యంగా "సెంటిమెంట్" అనేది నానాటికీ రచనల్లో వికృతరూపం ధరిస్తున్నది. ఏ జాతికయినా, తాత్కాలికాభిరుచులతోపాటు, కొన్ని ముఖ్య ధర్మాలూ వుంటవి. ఈ ధర్మాలను చిత్రించుతూ, రచనలు సాగిస్తే, అవి సాహిత్యంలో శాశ్వతంగా నిలుస్తాయి. అంతేగాని, మనస్తత్వంపేర, కొత్తదనంపేర, కేవల క్షుద్రాభిరుచి వర్ణనాలు విచ్చలవిడిగా పెచ్చుపెరిగిపోవటం ఏమంత మంచిదిగాదు

ఈ యుగం పద్య కవిత్వానికి స్వస్తిచెప్పినదని అనుకుంటున్నామేగాని, ఆ సాహిత్య ప్రక్రియ కూడా ఎంతో పెరిగిపోతున్నది తెనుగుదనం మాత్రం తగ్గిపోతూ వున్నది కవిత్వానికి ఆత్మ అనేది ఒకటి వున్నదనీ, అక్షర రమ్యతవల్ల మాత్రమే అది కన్పడదనీ, ఎవ్వరూ గుర్తుంచుకోవటంలేదు ఖండంగాకావచ్చు, అఖండంగా కావచ్చు కవిత్వంలో రస భావములు, వూహ, ప్రతిభ విస్తరిల్లాలి. ఇవిలేనినాడది గణబద్ధమయిన శుష్క వచనం మాత్రమే అవుతుంది వచన పద్యాలనే నూత్న ప్రక్రియ ఈనాడు బహుళంగా కన్పిస్తున్నది ప్రాచీనాంధ్ర సాహిత్యంలో భక్తి భావోప బృంహితములైన "గద్య" లున్నాయి వానిలో భావ శబలత గోచరించుతున్నది ఎంచె ఈనాటి వచన, పద్యాలలో కానరావటంలేదు. తేలికగా వుండాలని పేలవమైన వచనపద్యాలను వ్రాస్తే ప్రయోజనం శూన్యం.

రచనల్లో వైయక్తిక రాగ ద్వేషాలు దట్టంగా నెలకొంటున్నాయి. జీవితంలో ఏవో ఒక సందర్భంలో ఇతురుల తంత్రాలవల్ల ప్రతి వ్యక్తీ దెబ్బతినటం జరుగుతుంది ఎవరు మంచివారనే చర్చ చేయటం దుర్లభం ఆ సందర్భంలో అశక్తత ప్రదర్శించిన ఆ వ్యక్తి లౌకికంగా ఏమీ చేయలేక పగబూని సాహిత్య ప్రపంచంలో కలం అనే కటారిని ధరించి, ప్రతీకారం చేయటానికి ప్రయత్నించుతాడు. పేరు పొందినవారే ఈ విషయంలో పెడత్రకంతలు పట్టారు. ఇతర వ్యక్తుల పట్ల, ఇతర సంస్కృతులపట్లవుండే అసూయా ద్వేషాలతో, స్వసంస్కృతి దురభిమానంతో ఆ యా ప్రక్రియలు వ్రాయబడటం గర్హింపదగినది.

8

(క) నవీన సాహిత్యంలో అనన్య ప్రచారం పొందిన సాహిత్య ప్రక్రియ కథానిక పాశ్చాత్య కథానికా నిర్మాణ సూత్రాలను అనుసరించి వస్తు వైవిధ్యంతో బహువిధ కథన నైపుణ్యంతో ఆంధ్ర కథానిక ఆకృతి వహించుతున్నది. వేలూరి శివరామశాస్త్రి మొదలు తాళ్లూరి నాగేశ్వరరావువరకూ వున్న రెండు మూడు తరాలవారు వేలకువేలు కథానికలు సృష్టించారు "కరుణ కుమార" సంపుటంలో వున్న సన్న జీవాల దుస్థితిని కరుణరస భరితంగా చిత్రించారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు హైందవాచార దుష్పలితాలను కన్నులకు కట్టినట్లు చూపారు. మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కథలు జానుతెనుగు సొయగంతో పరవశింప జేస్తాయి అడివి బాపిరాజు కథానికల్లో ఆంధ్ర సంస్కృతి రమణీయ భంగిమలతో కన్పట్టుతుంది త్రిపురనేని గోపీచందుగారు మిక్కిలి చిన్నవైన కథానికలు వ్రాశారు ఇతరులు పది వాక్యాల్లో చెప్పినదాన్ని గోపీచందుగారు ఒక్క వాక్యంలో చెప్తారు సమకాలీన రాజకీయార్థిక, సాంఘిక సిద్ధాంతాల శక్తి వారి కథానికలను నడుపుతూ వుంటుంది. మనస్తత్వ సిద్ధాంతములను ఆధారంగా చేసికొని, చిత్త ప్రవృత్తి పరిణామాలన్ని తిన్నగా సూచించే కథలను పాలగుమ్మి పద్మరాజుగారు, బుచ్చిబాబుగారు, హితశ్రీగారు రచించారు "రాజ తరంగిణీ" ఆధారంగా గణపతిశాస్త్రిగారు భావ బంధురమైన కథలు రచించారు. "భరద్వాజ" గారు చలంగారిని అనుసరించాలని ప్రయత్నిస్తున్నారు. పత్రికలు, కథా రచనకు ఎంతో ప్రోత్సాహం కల్గిస్తున్నాయి. కథానికల్లో ఆదర్శంకంటె వాస్తవికత ఎక్కువ ఇతివృత్త నాయికా నాయకుల విషయాల్లో ఏ భేదమూ పాటింపబడటంలేదు అభూత కల్పనలూ, అలౌకిక వర్ణనలూ నేటి కథానికల్లో కన్పింపవు. సమస్యా పరిష్కారం ప్రధానంగా కొన్నిటిలో కన్పిస్తున్నది. జరిగిన సంఘటనలో, జరుగబోయే సంఘటనలో కథానికల్లో వర్ణింపబడుతున్నాయి

(చ) పై వాక్యాలు ఏకాంకికలకు కూడా అన్వయించుతాయి 1943వ సంవత్సరం తర్వాత ఏకాంకికలు పుంఖానుపుంఖంగా బయలు దేరాయి. ముద్దు కృష్ణగారీ రంగంలో ఎంతో కృషి చేశారు. ఏకాంకికా పరిమాణంలో నార్ల వెంకటేశ్వరరావుగారి "కొత్త గడ్డ" ఒక మహా ప్రస్థానప్రాయమైనది. ఇది అన్ని విధాలా అచ్చమయిన తెలుగు రచన నవీన నాగరికతవల్ల గ్రామ జీవితం ఎన్ని మార్పులకు లోనైనదో, విద్యావంతుల దృక్పథంలో క్రమక్రమంగా ఎట్లా పరిణామం వస్తున్నదో "కొత్తగడ్డ" అద్దంలో చూపినట్లు చూపుతున్నది. "మాలపల్లి"తో మాదిరిగా, దీనిలో జానుతెనుగు ఎన్నో సొగసులు చిమ్ముతున్నది. మల్లాది అవధాని, విశ్వనాథ కవిరాజు, గోరాశాస్త్రి ఎన్నో ఏకాంకికలు రచించారు. మరి తర్వాతి వారిలో ఆంగర సూర్యారావు, రావికొండలరావు, కొండముది శ్రీరామచంద్రమూర్తి మున్నగువారు ఏకాంకికలు సృష్టించుతున్నారు పాశ్చాత్య భాషల్లో వెలువడిన ఏకాంకికలు మనవారికి ఉత్తేజాన్ని కల్గిస్తున్నాయి తదుత్తేజపూర్వాముల్లే, ఎన్నో ఏకాంకికలు వెలువడుతున్నాయి పాత్ర సృష్టిలో, రస భావ వర్ణనంలో, సంవిధానంలో ఇంకా అభారతీయ ఛక్కిక గోచరించుతూనే వున్నది. అయితే దీన్ని త్యజించాలనే ఆరాటమూ కన్పించుతూనే వున్నది

(ట) స్వాతంత్ర్యానంతరం ఎన్నో నవలలు రచింపబడ్డాయి మొదట విక్టోరియా మహారాణి కాలమునాటి నవలలు ప్రభావం గోచరిస్తే తర్వాత హక్స్లీ, సోమర్సెట్‌మామ్స్, బాల్జాక్, జాయిస్, జాన్‌పాల్ సార్త్రే, ఆల్బర్టో మురేవియా, డి. హెచ్. లారెన్స్ మున్నగువారు రచించిన నవలల తత్త్వానుసరణం కన్పిస్తున్నది నవలల్లో ఎక్కువ సాంఘికమైనవి చంఘిజ్ ఖాన్, ప్రతాపరుద్రీయం వంటి చారిత్రాత్మక నవలలు రాకపోలేదు సాంఘికనవలలు, సాంఘికరంగంలో వచ్చిన, వస్తూవున్న మార్పులను ఎక్కువగా చూపుతున్నాయి. గ్రామాలలో సాంఘికంగా, రాజకీయంగా వచ్చే మార్పులు, మధ్యమ తరగతికుటుంబాల దుర్భర పరిస్థితులు, స్త్రీ పురుషసంబంధ పర్యవసానమూ, వ్యక్తిగత జీవితంలో మహాపద సంభవించినపుడు తట్టుకొన్న—తట్టుకోలేని చిత్తప్రవృత్తి, కుల జాతి సామరస్యమూ, విద్యార్థి జీవన విధానమూ—ఇంకా ఎన్నో ఆయా నవలల్లో కథా బీజాలుగా వున్నాయి. కొడవటిగంటి కుటుంబరావుగారు చలంగారి పోకడలుగల

మనస్తత్త్వ నిరూపణం నిండిన నవలలు రచించారు వారి "చదువు" కె. ఏ. అబ్బాస్ "ఇంక్విలాబ్"లాగా నేటి భారతదేశ చరిత్రను తెలుపుతుంది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో వచ్చిన మార్పులను, గ్రామసీమ రంగపీఠంలా—ఫ్రాయిడ్ స్వప్నశాస్త్రం, నవీన విద్యార్థిమనస్తత్త్వం మేళవించి—జి. వి. కృష్ణారావు గారు "కీలు బొమ్మలు" రచించారు శిల్పమూ, తెలుగు పలుకుబడి పొంకమూ ఈ నవలలో రాటుదేలాయి ఉప్పల లక్ష్మణరావుగారు రచించిన "అతడు—ఆమె" స్త్రీ పురుష సంబంధాన్ని చిత్రించే నవల బుచ్చిబాబుగారి "చివరకు మిగిలేది" ఆంధ్ర రాష్ట్రోద్యమచ్ఛాయలు, నిశిత మనస్తత్త్వ పరిశీలనమూ కలది. "అసమర్థుని జీవయాత్ర" రచించిన గోపీచందుగారు ధారాళంగా నవలలు రచించుతున్నారు గోపీచందుగారి భావపరిణామం—మార్క్సిజంనుండి, భౌతికాధ్యాత్మిక వాదాల సమన్వయంవరకూ—వారి నవలల్లో ద్యోతకమవుతున్నది పి. శ్రీదేవి రచించిన "కాలాతీత వ్యక్తులు" పాత్ర చిత్రణంలో నూతన మార్గాలు అవలంబించినది రాపూరి సత్యనారాయణరావుగారి "నెలవంక" సమరసదృష్టిని బోధిస్తున్నది. పురాణం సూర్యప్రకాశరావు, పోతుకూచి సాంబశివరావు "జీవనగంగ", "అన్వేషణ" లలో కుటుంబవ్యవస్థప్రాతిపదికగా కథ స్వీకరింపబడినది. కొమ్మూరి వేణుగోపాలరావుగారి నవలలో సర్వ సుఖాలు కలిగియుండీ, ఏదో వెలితో బాధపడే పాత్రలు, ఒకానొక చిన్న సంఘటనవల్ల విపరీతానుభవాల్ని ఆకాంక్షించే పాత్రలు కన్పిస్తున్నాయి మధ్యతరగతి కుటుంబాన్ని కేంద్రంగా తీసికొని, పల్లెపట్టుల నడవడికలు నాగరాజుగారి "రజనీప్రియ"లో వర్ణింపబడ్డాయి పి. సుబ్బరామయ్యగారి "ధృవతార"లో ఒక వ్యక్తి జీవితం అనాథ శిశువువల్ల ఎట్లా మారిపోతుందో నిరూపింపబడినది. రసపుష్టి, లక్ష్యశుద్ధి లేక కామాచారవర్ణనం మాత్రమే వున్న నవలలు గూడా కొన్ని ఈమధ్య వస్తున్నాయి విశ్వనాథ సత్యనారాయణగారు కొన్ని నవలలు ఎందుకు రచిస్తున్నారో ఎవరికీ అర్థంగావటంలేదు వారి నవలలు రానురాను ప్రచార సాహిత్యంగా పరిణమించుతున్నాయి "పీరాజీ" విద్యార్థి జీవితాన్ని చిత్రిస్తారు. గంగినేని వేంకటేశ్వరరావుగారు కూడా అంతే మహీధర రామమోహనరావుగారి "కత్తుల వంతెన" మధ్యమ తరగతి కుటుంబానికి సంబంధించినది నేటి నవలల్లో అన్నిటినిగూర్చి వ్రాయటం సాధ్యంగానందుకు చింతిస్తున్నాను

కాలక్రమాన నవలలు రచించటంలో వ్యాపారదృష్టి విజృంభించుచున్నది. ఏదో వ్రాసి, పేజీలు నింపితే అమ్ముడుపోయే రోజులివి కొన్ని నవలల్లో నూరు—నూటయేభై పేజీల్లో పూర్తిగావలసిన కథ అనవసర—అనుచిత సన్నివేశాలతో పేజీలకొద్దీ పెంచబడుతున్నది. ఎన్నో నవలల్లో ప్రకృష్టమయిన బంధం కానరావటంలేదు భాషా విపర్యయమూ, హద్దు మీరుతున్నది. మన రచయితలలో స్వతంత్ర శైలిగలవారు ఎంతోమంది లేరు. ఆంగ్ల భాషాదుల్లో నవలలు రచించిన ప్రతి రచయిత శిల్పంకొఱకేగాక, ప్రత్యేక శైలి కొఱకు ఎంతో శ్రమించుతాడు. సోమర్సెట్‌మామ్ నవలలు చదివితే మనకీ రహస్యం తెలుస్తుంది భావాలలో పాశ్చాత్య పద్ధతులు ఎక్కువైనంతగా కళాసృష్టిలో ఎక్కువ కావటంలేదు. "నేటి నవలా కర్తలుగాని, కథకులుగాని తెనుగుదేశంలో నగరాలు, భారతదేశంలో దృశ్యాలు వర్ణించేటప్పుడు యథార్థాన్ని చూడరు రాజమహేంద్రవరంలో మెడికల్ కాలేజి పెట్టించిన ప్రబుద్ధులు, బెజవాడలో బీచీ షికార్లు చేయించిన రచయితలు, మద్రాసులో పర్వతాలు మొలిపించిన మేధావులు లేకపోలే"దని శ్రీ "శ్రీవాత్సవ" వ్రాసిన వాక్యాలలోని యథార్థ్యాన్ని మన రచయితలు గుర్తించటం మంచి దనుకుంటాను (1962—జనవరి భారతి పుట 67)

(త) ఆయా నూతనకవితోద్యమాల ప్రభావం ఇంకా గోచరిస్తూనే వున్నది ముద్దుకృష్ణగారి "వైతాళికులు" మాదిరిగా "ఉదయ ఘంటలు", "కల్పన", "నవ్య సాహితి" శతాబ్దప్రారంభంనుండీ ఈనాటిదాకా వెల్వడిన ఆ యా కవుల కావ్య ఖండాలను ఒకచో చేర్చాయి స్వీయ చరిత్రలు, పద్య కావ్యాలుగా వ్రాయటం జరుగుతూనేవున్నది బాలగంగాధరతిలక్, మాదిరాజు రంగారావు మున్నగువారు నవయుగసిద్ధికొఱకు ఆవేదనతో కవితాగానం జేస్తున్నారు. "ఆంధ్ర పురాణము" "కృష్ణకథావిపంచి", "అశోకచరిత్రము" చారిత్రకేతివృత్తాన్ని స్వీకరించాయి నారాయణచార్యులుగారి "మేఘదూతము" జాషువా కవి "గబ్బిలము" మాదిరిగా ఆంధ్రచరిత్ర వైభవాన్ని చాటుతున్నది. వారి

"శివతాండవం" ఆవేశమూ నాట్య కళా పెనగొన్న విలక్షణ గేయకావ్యం. వేమన పద్ధతిలో నార్లవెంకటేశ్వరరావుగారు నవయుగభావస్ఫోరకంగా "నార్లవారి మాట" రచించారు వారు ఏ కవితోద్యమానికీ, సన్నిహితులు కాకుండా, "జగన్నాటకం" వ్రాశారు కొత్త సత్యనారాయణచౌదరిగారు పురాణేతిహాసకథలను "కలి పురాణము"లో వ్యాఖ్యానించుతున్నారు కొండవీటి వేంకటకవిగారు "నెహ్రూ చరిత్ర"ను పద్య కావ్యంగా చేశారు బాలాంత్రపు రజనీకాంతారావుగారి "శత పత్రసుందరి" మంజుల భావ మరంద విన్యాసంతో కూడివున్నది కొవకళ్ల వేంకటరత్నంగారి "బంగారివామ పాటలు", "ఎంకిపాట"లతో తులతూగుతున్నాయి

విద్వాన్ విశ్వంగారు రచించిన "పెన్నేటిపాట", బోయి భీమన్నగారి "దీపసభ" వినూతనమైన కావ్యాలు రెండూ వాస్తవ సమాజాన్ని చిత్రిస్తున్నాయి. "పెన్నేటిపాట" రాయలసీమ దుస్థితిని చాటుతున్నది దీనిలో ప్రాచీన నవీన కవితాసంప్రదాయసమ్మేళనం జరిగినది అభ్యుదయ కవులు అందుకోలేని కవితాస్ఫోరకశక్తి "పెన్నేటిపాట"లో వున్నది సందర్భోచితంగా ఛందస్సును మార్చటం ఉచిత శబ్దార్థాలంకారా లుపయోగించటం దీనిలో కన్పట్టుతున్నవి భీమన్నగారి "దీపసభ" కథా కథనంలో నవ్యత ఆపాదించుకొన్నది. ఈ కావ్యం జాతీయ భావ బంధురమగుటయేగాక, దీన మానవావస్థను చిత్రిస్తున్నది పద్యాలు పరళంగా ఝుటితిస్ఫూర్తి కలిగివుంటాయి భీమన్నగారు "పైరుపాట" అనే సంగీత నృత్య రూపకాన్ని రచించారు

(ప) బాల సాహిత్యం కూడా నవీన కాలంలో లభివృద్ధి చెందినది దీనికి శ్రీకారం చుట్టినవారు చింతాదీక్షితులుగారు వారు రచించిన కథలు చిన్న పిల్లల మనస్తత్వాన్ని చూపుతున్నాయి దీక్షితులుగారి సూరి, సీత, శంపాలత, లీలాసుందరి మొదలయిన కథలు ఇందు కుదాహరణాలు శ్రీ గిడుగు సీతాపతి ఈ రంగంలో కృషి చేసి, ప్రభుత్వ బహుమానమందుకొన్నారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రాచీన బాలగేయ సాహిత్యాన్ని ప్రకటించారు నవీన కాలంలో బాల సాహిత్యం సర్వతోముఖంగా అభివృద్ధి కావటానికి చక్రపాణి నాగిరెడ్డిగారలు స్థాపించిన "చందమామ" ఎంతో తోడ్పడినది ఆ పత్రికవల్ల కథలేమి, గేయాలేమి అసంఖ్యాకంగా పిల్లల కొఱకు రచింపబడ్డాయి "ఆంధ్రపత్రిక" వారపత్రికలో బాలల కొరకు బొమ్మల పంచతంత్రం ప్రచురింపబడినది ఈనాడు ప్రతి పత్రికా బాల సాహిత్యాన్ని ఎంతో ప్రచారం చేస్తున్నాయి ఎన్నో పుస్తక ప్రచురణ సంస్థలు బాల సాహిత్యాన్ని ప్రకటిస్తున్నాయి ప్రభుత్వమూ పాటుబడుతున్నది ఈ సాహిత్య క్షేత్రంలో విశేషించి కృషి చేసినవారు బి. వి నరసింహారావుగారు ఆయనకు అధీనమైనట్లుగా బాల భాష ఎవరికీ అధీనం కాలేదు శిశు మనస్తత్వాన్ని చిత్రించే కావ్యం పద్మ మూడి గోపాలకృష్ణయ్యగారి "మానవుడు". "కవిరావు" నార్లచిరంజీవి, దాశరథి బాల సాహిత్యాభివృద్ధికై ప్రశంసనీయమైన కృషి చేశారు

9

స్వాతంత్ర్యసిద్ధికి పిదప భారతదేశం సర్వ సత్తాక రాజ్యమయినది కుల జాతి మత భేదాతీతమయిన రాజ్యాంగం కుదురుకొన్నది. సాంఘికంగా ఎన్నో అభ్యుదయకరమైన శాసనాలు చేయబడినాయి తత్ఫలితంగా కొన్ని కొన్ని ప్రాచీన విశ్వాసాలకు స్వస్తిచెప్పవలసి వచ్చినది ఈ సమయంలో సంప్రదాయాభిమాన శక్తులు విజృంభించుతున్నాయి హైందవ జాతీయోద్యమం ఈశక్తులను పోషిస్తూ వున్నది. పాశ్చాత్య భావకలుషితబుద్ధులూ, అభారతీయ సంప్రదాయ వ్యామోహోన్మాదచిత్తులూ భారతీయసంస్కృతి పరమరహస్యాలను అవగాహనంజేసుకోలేకపోతున్నారని ఈ యుద్యమానుయాయులు ఎలుగెత్తి చాటుతున్నారు వీరి సిద్ధాంతాల ప్రకారం భారతదేశంకంటె గొప్ప దేశంగాని, భారతీయ సంస్కృతికంటె పరమోత్తమమయిన సంస్కృతిగాని ఎక్కడాలేవు అట్లా వుండగూడదనే దైవనిర్ణయం సమస్త భాషలకూ, సంస్కృతం మూలం సమస్త దేశాలకూ సభ్యత పంచిపెట్టినది భారతదేశం—ఇదీ వీరి బడి అయితే దీనికి ప్రతిద్వంద్వమైన ఉద్యమము కూడా లేకపోలేదు. దీని సిద్ధాంతాలప్రకారం ప్రపంచ మహా సంస్కృతుల్లో భారతీయ సంస్కృతి ఒకటి ఇతర సంస్కృతుల మహా వైభవాన్ని కూడా మనం గమనించాలి భారతీయ సంస్కృతికి సామరస్య సాధన ప్రాణభూతం ఒకనాడు భారతీయ సంస్కృతి ఉత్తమంగావచ్చు భారతదేశ పునర్నిర్మాణానికి, పునరుజ్జీవనానికి అది ప్రపలాంతరాయాలు కల్పించేటప్పుడు దానిని త్రోసి రాజనటంకంటె గత్యంతరమేమీ లేదు ఒకనాడు సంస్కృత భాష విజ్ఞానాన్ని ప్రసాదిస్తే నేడా గురుతర కార్యాన్ని ఆంగ్లభాష నిర్వహిస్తున్నది. భారతీయ సంస్కృతి ఆర్య సంస్కృతి మాత్రమేగాదు మొదటి యుద్యమ భావాలను ప్రచారం చేసేవారు విశ్వనాథ సత్యనారాయణగారు రెండవ యుద్యమ భావాలను నార్ల వెంకటేశ్వరరావుగారు "సంస్కృతము—సంస్కృతి"లో ప్రచారం చేశారు. గోపీచందుగారి "పోస్టు చెయ్యని యుత్తరా"ల్లో తుమ్మల సీతారామమూర్తిగారి కావ్యాల్లో సమన్వయ దృక్పథం గోచరిస్తున్నది.

10

విశ్వనాథ సత్యనారాయణగారు ప్రతిభావ్యుత్పత్తులుగల కవి రసధ్వని సిద్ధాంతాభిముఖంగా కావ్యరచన సాగించేవా రాయన కావ్యం అంటే లలితకాంత పదావళీమయపద్యసమూహం కాదని, అది అనంతముఖ శిల్ప సమన్వితమని సత్యనారాయణగారు గుర్తించారు ఇట్లా గుర్తించిన నవీనకవు లింకెవరూలేరు శ్రీమద్రామాయణ కల్పవృక్షాన్ని వాల్మీకి రామాయణభాష్యంగా రచించాలని సత్యనారాయణగారి సంకల్పం విశ్వనాథలో నావ్యతోదర్శనీయమయిన భావుకత వున్నది తెలుగు మాటలను ఎక్కువగా వాడటం తెనుగుదనానికి గుర్తు కాదను సిద్ధాంతం ఒప్పుకుంటే, విశ్వనాథగ్రంథాల్లో తెనుగుదనం లేదనే చెప్పవచ్చు. నన్నయ, తిక్కనల కవితాకళకంటె, వారి కావ్యాల్లో ప్రబంధ కవితాపద్ధతులే బహుళంగా వుంటాయి. విశ్వనాథ కావ్యగత శిల్ప రహస్యాలను మిగిలిన కవులకంటె ఎక్కువగా తెలుసుకొన్నారేగాని, వానిని తనకావ్యాల్లో విస్పష్ట రీతులతో చూపటంలో అంతగా విజయం పొందలేదు అట్టి విజయం పొందినవారు నన్నయ, తిక్కనలు నిశ్చైతన్యమయిన, వర్ణాశ్రమధర్మమూలమైన భారతీయ సంస్కృతి విశ్వనాథగ్రంథాలలో మనకు ప్రత్యక్షమవుతున్నది. సామాన్య పౌరుడు గ్రహింపగల్గిన సాంఘికపరిణామాన్ని విశ్వనాథ గ్రహించటంలేదు భారతీయ సంస్కృతి పరిణామబద్ధంగాదు అది దైవహోదితం అని సత్యనారాయణగారి ప్రగాఢ విశ్వాసం కాని చరిత్రవారి విశ్వాసానికి భిన్నంగా సాక్ష్యమిస్తున్నది. ఆ సాక్ష్యాన్ని తీవ్రదురాక్రమణదృష్టితో ఖండించటానికి విశ్వనాథ వెనుకంజ వేయరు దానికి సాక్ష్యం పురాణవైరగ్రంథమాల ప్రచురణలు

మిల్టన్ "పారడైజ్ లాస్ట్"లో, షేక్స్పియర్ "మర్చంట్ ఆవ్‌వెనిస్"లో క్రైస్తవ మతసంస్కృతిని బోధించినట్లుగా భారతీయరచయిత భారతీయ సంస్కృతిని బోధింపవలసినదే మఱి ఏది భారతీయసంస్కృతి ? అని వెంటనే ఎదురు ప్రశ్నించాల్సిన ఆగత్యమున్నది. భారతీయ సంస్కృతి అంటే రాజారామ మోహనరాయలు, రామకృష్ణ, వివేకానందులు, మహర్షి అరవిందుడు చాటినదా? లేక కోటవేంకటాచలంగారు చాటినదా? విశ్వనాథ సత్యనారాయణగారు త్రికరణ శుద్ధిగా నమ్మినది కోటవేంకటాచలంగారు చాటిన దాన్నే. భారతీయ సంస్కృతి అంటే హైందవసంస్కృతి అని విశ్వనాథ సిద్ధాంతం ఈ సిద్ధాంతం తప్పు అది చారిత్రక సత్యాన్ని గుర్తించటంలేదు భారతీయసంస్కృతి అంటే హైందవ సంస్కృతిగాదు మరి అది భారతీయ సంస్కృతే దాని స్వరూపాన్ని రవీంద్రుడు చక్కగా చెప్పాడు రవీంద్రునికంటే గొప్పవారమనుకొనేవారు ఏమంటారో యేమో నాకు తెలియదు కాని ఆయన వాక్యాలు వేదవాక్యాల్లాంటివే రవీంద్రుడు భారతీయ సంస్కృతినిగూర్చి యిట్లా వ్రాశాడు.—

11

"The main river of Indian Culture has flowed in four streams-the Vedic, the Puranic, the Buddhist, and the Jain It had its source in the heights of the Indian Consciousness.

But a river belonging to a country is not fed by its own waters alone The Tibetan Bramhputra is a tributory to the Indian Ganges Contributions have similarly found their way to India's original culture The Muhammadan, for example, has repeatedly come into India from outside, laden with his own store of knowledge and feeling and his wonderful religious democracy bringing freshet after freshet to swell the current In our music, our architecture, our pictorial art, our literature, the Muhammadans have made their permanent and precious contribution Those who have studied the lives and writings of our medieval saints, and all the great religious movements that sprang up in the time of the Muhammadan rule, know how deep is our debt to this foreign current that has so intimately mingled with our life "

"The European culture has come to us not only with its knowledge but with its velocity Though our assimilation of it is imperfect and the consequent aberrations numerous, still it is rousing our intellectual life from its inertia of formal habits into glowing consciousness by the very contradiction it offers to our own mental traditions "

(The Centre of Indian Culture Page 34 35)

రవీంద్రుడు మ్లేచ్ఛబుద్ధితో, పరప్రత్యయనేయబుద్ధితో ఈ వాక్యాలు వ్రాశాడనటం సాహసమేకాగలదు

హైందవసంప్రదాయైకదృష్టితో చారిత్రకనవలలు రచించే వారు నోరి నరసింహశాస్త్రిగారు కవిత్రయంవారిని కథానాయకులనుజేసి, వారు మూడు పెద్ద నవలలు రచించారు నోరి నరసింహశాస్త్రిగారి నవలలలో సదా చారవర్ణన కథాకాలజీవశక్తిని మ్రింగివేస్తున్నది నవల ధర్మశాస్త్రగ్రంధము కాదుగదా ! కవులను, నాయకులనుజేసి, నవలలు వ్రాయటంమంచిదే కాని, చారిత్రక సత్యాలు తార్మారుకాకూడదు అదే "మల్లారెడ్డి"లో జరిగినది జైనుల పట్ల నోరి నరసింహశాస్త్రిగారికి ఏమాత్రమూ సానుభూతి లేనట్లు వారి 'నారాయణభట్టు", "రుద్రమదేవి" నిరూపించుతున్నవి శాస్త్రిగా రూహించినంతగా జైనులు ఆంధ్రదేశానికి ద్రోహంచేయలేదని కొమర్రాజు లక్ష్మణరావుగారి వ్రాతలూ, మల్లంపల్లి సోమశేఖరశర్మగారి వ్రాతలూ ఋజువు చేస్తున్నాయి అంతేగాదు ప్రతాపచరిత్ర, పాల్కురికి సోమనాధుని గ్రంధాలు, జైనసంహార గాథలనే చాటుతున్నాయి

12

మనదేశచరిత్రలో సంగమయుగంలోతప్ప నేటి "ఎకాడమీ"ల వంటివి సాహిత్యాభివృద్ధికి కృషిచేసినట్లు తార్కాణాలేమీలేవు ఫ్రాన్సుదేశంలో ఈ "ఎకాడమీ"లు సాహిత్యాభివృద్ధికి విశేషంగా దోహదంచేశాయి ఈనాడు ప్రతి దేశంలో, ప్రతిరంగమందూ ఒక "ఎకాడమీ" వున్నది స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ఎకాడమీలు స్థాపింపబడ్డాయి అఖిలభారతసాహిత్య—ఎకాడమీ భారతదేశ భాషల్లోని ఉత్తమసాహిత్యాన్ని ప్రపంచ భాషల్లోని ఉత్తమగ్రంధాలను అనువాదాలద్వారా అన్నిరాష్ట్రాలవారికీ అందిస్తున్నది. ఆంధ్రరాష్ట్రంలో కూడా సాహిత్య—ఎకాడమీ నెలకొల్పబడినది రచయితలకు ద్రవ్యసహాయము చేయుట, పోటీలు నిర్వహించి, ఉత్తమగ్రంధాలకు బహుమానాలిచ్చుట మన ఎకాడమీ చేస్తున్న గొప్ప పనులు ఆంధ్రదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి శక్తియుక్తులు ధారపోసిన కాశీనాధుని నాగేశ్వరరావు, కట్టమంచి రామలింగారెడ్డిగారల జీవనగాధకు అక్షరరూపం కల్పించాలని సాహిత్య—ఎకాడమీ ప్రయత్నిస్తున్నది "పదబంధపారిజాతము", "తెనుగుసామెతలు", "నన్నయ పద ప్రయోగసూచిక" ఆంధ్రసాహిత్య—ఎకాడమీచేత ప్రచురింపబడ్డాయి బ్రౌన్ దొర నిఘంటువును, పోతనభాగవతాన్ని ప్రకటించాలని, అది నిర్ణయించినది. మనసాహిత్య—ఎకాడమీ ఆంధ్రమహాభారతం వైపు చూపుసారిస్తే మంచిది ఈనాడు మనకు లభించుతూన్న ముద్రిత మహాభారతం ఎన్నో పాఠాంతరాలతో తప్పుల కుప్పయై వున్నది సమర్థులైన—కవిత్రయ హృదయాన్ని గుర్తింపగల పండితులను నలుగు రైదుగురను ఒక సంఘంగా ఏర్పరచి తాళపత్ర గ్రంధాల సాయంతో మహా భారత శుద్ధప్రతిని తయారు చేయించటానికి ఎకాడమీయే పూనుకోవాలి ఆంధ్రసంస్కృతి పరిణామాన్ని—సాంఘిక చరిత్ర, వేష భాషలు, ఆచారవ్యవహారాలు మున్నగువానిలో వచ్చిన పరిణామము—వివరించే చరిత్రగ్రంధాలను కూడా ఎకాడమీ వ్రాయించటం మంచిది

13

ఆంధ్రవిశ్వవిద్యాలయంవారు చారిత్రక నవలల పోటీలు నిర్వహించి, ఉత్తమ గ్రంధాలకు ఉడుగరలు పెట్టుతున్నారు వారు మన్నించిన అన్ని నవలలూ ప్రశస్తములయినవని చెప్పటం కష్టము ధూళిపాళ శ్రీరామమూర్తిగారు రచించిన "భువన విజయము", "గృహరాజ మేడ" ఉత్తమంగా వున్నాయి పాత్ర పోషణము, కథా కథన నైపుణ్యమూ, లక్ష్యశుద్ధీవారి నవలల్లో ముఖ్య గుణాలు "రాజశిల్పి"లో భావుకత పాత్రపోషణాదులకంటె బలంగా వున్నది "చిత్రశాల" "రఘునాధ విలాసను"లలో కథాబంధమున్నది "సప్తపర్ణి", "తంజావూరు పతనము"—ఇవి రెండూ చరిత్రను పక్షపాత సులోచనాలతో చూచినవి "సప్తపర్ణి" లో ప్రతి విషయమునకు వక్ర భాష్యం చెప్పుట బాగా గోచరిస్తున్నది కాకతీయ సామ్రాజ్య పతనమునకు మూలం అయిన యధార్థ హేతువులను చరిత్రకారులు చెప్పుచున్నవానిని త్రోసిరాజని వైయక్తిక రాగద్వేషాలు పేరు కొన్న కారణాలను వెతకటం దీనిలో కన్పట్టు తున్నది ఈనాడు ఆంధ్రదేశాన్ని పట్టి పల్లార్చుతున్న కులభేదాలను కాకతీయచరిత్రకు అంటగట్టడం "సప్తపర్ణి"లో జరిగినది ఆ నవలలో ఒకచోట ఒకపాత్ర "దేశమున ఏమయిన శిల్పాభిమానము గాని, విద్యాభిమానముగానియున్నచో నారెడ్లకే యున్నది కాని ప్రభుత్వము కమ్మ వెలమల చేతిలో నున్నది వీరిలో నీ కమ్మవారికి కావలసినది అధికారము. వెలమలకు నెత్తురు అంతియ కానివారికీ శిల్ప విద్యాభిమానములు లేవు" అని పలుకుతుంది కథా కాలాన్ని, సందర్భాన్ని ఎంతగా గమనించినా ఇట్లాంటి వాక్యాలు వ్రాయబడటం అనుచితం అనిపిస్తున్నది. "సప్తపర్ణి"లో పాత్రలు మాటి మాటికీ కులాల ప్రస్తావన తెస్తాయి ఈ గ్రంధంలో చిత్రింపబడినంతగా కుల ద్వేషం గుడారాలెత్తి, కాకతీయ సామ్రాజ్యపతనానికి త్రోవదీయలేదు మరి ఇతర కారణాలవల్ల ఆ సామ్రాజ్య పతనం జరిగినది ఆ కారణాలు వివరించటానికిది అదునుగాదు మరొకసారి వానిని వివరిస్తాను ఇట్టి గ్రంధాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం, "తేజస్వినావధీతమస్తు" అను వాక్యాన్ని తన చిహ్నంలో ఉట్టంకించిన కళాపరిషత్తు మూడుసారులు ఉపవాచకంగా నిర్ణయించినది ఇట్లాంటి నవలను పాఠ్య గ్రంధంగా నిర్ణయించటంవల్ల విద్యార్థులకు కలిగే మేలు శూన్యం వారి సంస్కారం ఏమాత్రమూ పెరగదు ఇట్టివానిని బోధించేటప్పుడు విద్యార్థు లెట్లాంటి ప్రశ్నలు వేస్తారో కళాశాలోపన్యాసకులకు అనుభవైకవేద్యం. కథ చారిత్రాత్మకంగావచ్చు సాంఘికం గావచ్చు దానిలో కుల ప్రస్తావన మితిమీరిపోకుండా చూడటం శివేతరములను తొలగించే సాహిత్యాన్ని ఆరాధించువారి కర్తవ్యం జాతీయ సమైక్యం కావాలని అందరు ఆరాట పడే ఈ రోజుల్లో "సప్తపర్ణి" పాఠ్య గ్రంధంగా నిర్ణయింపబడటం అతిమాత్ర శోచనీయం.

ప్రపంచం మొత్తమూ ఏక కుటుంబం గావాలని ప్రయత్నించే రోజులివి. ప్రపంచ దేశాలన్నీ ఇరుగు పొరుగు ఇండ్లైపోయాయి. ఎంతో భావ వినిమయము జరుగుతున్నది లయితే ప్రపంచం ఒక క్లిష్టఘట్టంలో పడినది బహువిధభావ సంఘర్షణ తారసిల్లుతున్నది మానవుని బుద్ధి హృదయాన్నిమించి వికసించుతున్నది మనోవేగాన్ని మించిన వేగంతో శాస్త్రవిజ్ఞానం ఉరకలు పెట్టుతూ వున్నది మన కనులముందే సాంఘిక తాత్త్వికరంగాలలో అనుక్షణ పరిణామం కలుగుతున్నది త్రికాలాబాధితాలని ఒకనాడు నమ్మిన సిద్ధాంతాలు సడలిపోతున్నాయి "పుడమి తల్లికి పురిటి నొప్పులు" వస్తున్నాయి. ప్రపంచమంతా మహోక పరిణామాన్ని పొందటానికి సిద్ధంగా వున్నది సమరస దృష్టితో రచనలుచేసి, మానవునకు దివ్య సందేశాలను వినిపించాల్సిన ధర్మం రచయితలది. ఈ ధర్మం అనుసరించాలంటే సంప్రదాయవిచ్ఛేదం విధిగా జరగాల్సిన అవసరమేమీలేదు ప్రాచీన భారతీయాలంకారశాస్త్రాన్ని, పాశ్చాత్యసాహిత్యశాస్త్రాన్ని ఉదాహరణకు తీసుకొందాం ఇవి రెండూ శతాబ్దాలు చెల్లిన కొలదీ పూర్వ పూర్వ సాహిత్య సిద్ధాంతాలకు మెరుగులు పెట్టుతూ, పురోగమించినవి ఇటు భారతీయాలంకార శాస్త్రాన్ని అటు పాశ్చాత్య సాహిత్య శాస్త్రాన్ని చక్కగా సమన్వయం చేసికొని, తదితర భాషా సాహిత్య ప్రక్రియా సౌందర్యాన్ని చూఱలాడి, భాషాసంప్రదాయాలను కాపాడుకొంటూ, ఎంతైనా నూతన సృష్టిచేయవచ్చు. ఆంధ్రరచయితలు తమ ధర్మాన్ని గుర్తిస్తారని పోయిన అరవైయేండ్లసాహిత్యమూ, సాక్ష్యం చెప్పుతున్నది ఈ దృష్టితో చూస్తే ఈనాడు సాహితీలోకంలో కన్పడే అవ్యవస్థ తొలగిపోక తప్పదేమో అని ఎవరికైనా పరిశీలనమీద తెలుస్తుంది.

* గోలి ★

ఉరుదూమూలం: కీ. శే. సాదత్ హసన్ మింటో
అనువాదం: శ్రీ దాశరథి

షఫ్కత్ మధ్యాహ్నం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి ఇంటినిండా బంధువులు వచ్చిఉన్నారు కుడివైపు పెద్దగదిలో ఆడవాళ్ళు కూచున్నారు. షఫ్కత్ భార్య ఆయషా వాళ్లకు అతిథిసత్కారాలు చేస్తున్నది

"అజీజుగారి భార్యా, వాళ్ళ కూతుళ్ళూ వచ్చారు" అంది ఆయషా అతనితో

హ్యాటు తలమీదినుంచి తీసి, ముఖంమీద చెమటను తుడుచుకుంటూ "అజీజుగా రెవరూ ?" అని అడిగాడు షఫ్కత్

"మీ నాన్నగారి స్నేహితుడండీ !" అంది ఆయషా మెల్లగా.

"ఒహ్హో అజీజు చిన్నాయనా ?"

"అవునవును ఆయనే"

"అయితే మరి ఆయన ఆఫ్రికాలో ఉంటున్నారుగా ?" అన్నాడు కొంచెం ఆశ్చర్యంగా షఫ్కత్

"కొంచెం మెల్లగా మాట్లాడండి మీరు ఊరికే గొంతు చించుకు మాట్లాడతా రెందుకూ ? అన్నట్టు ఆఫ్రికా వెళ్ళినవాడు తిరిగి రానేరాడా ? ఇందులో ఆశ్చర్యం ఏముంది ?" అంది నోటికి చేయి అడ్డుపెట్టుకుంటూ ఆయషా

"అదిగో, నువ్వు మాత్రం మెల్లగా మాట్లాడుతుంటేగా"

"సరే ఇక పోట్లాడకండి అజీజుగారు ఆఫ్రికాలోనే ఉన్నారు ఆయన భార్య తన కూతురుకి పెళ్లివ్యవహారం చూడ్డానికి వచ్చింది మంచి సంబంధం కోసం వెతుకుతున్నారు"

ఇంతలో లోపల్నుంచి అజీజు భార్య అంది—"అమ్మాయ్ ఆయషా ! అబ్బాయిని దారిలో ఆపి మాట్లాడుతున్నావేమే ! లోపలికి రాని ! రా వాయినా షఫ్కత్ ! ఎన్నాళ్ళయింది, ఎన్నాళ్లయింది నిన్ను చూడక !"

"వస్తున్నా పిన్నీ !" అంటూ షఫ్కత్ తన హ్యాటు మేకుకి తగిలించి గదిలోకి వెళ్లాడు "నమస్కారం పిన్నీ !" అన్నాడు అజీజు భార్య కుర్చీలోంచి లేచి అతన్ని దీవించింది తల నిమిరి కూర్చుంది షఫ్కత్ కూడా కూచున్నాడు కూచుంటుండగా ఎదట యిద్దరు చక్కని అమ్మాయిలు కనిపించారు. ఒకతె చిన్నది, ఇంకొకతె పెద్దది ఇద్దరి రూపూ ఇంచుమించు కలుస్తున్నది అసలు అజీజు చాలా భారీ మనిషి ఆయన భారీతనం ఈ ఇద్దరమ్మాయిలలో బలే చక్కగా విభజించినట్లు కనపడుతున్నది కళ్ళు తల్లివి. నల్లగా పొడుగ్గాటి జడలు చిన్నమ్మాయి ముఖం పెద్దదాని కంటె ఎక్కువ కళకళ్లాడుతున్నది పెద్దది మౌనంగా, గంభీరంగా కూర్చుని ఉంది

"అన్నయ్యకు నమస్తే చేయండి" అంది తల్లి వాళ్ల వైపు తిరిగి చిన్నమ్మాయి లేచి మంచుని నమస్కరించింది. పెద్దది కూర్చునే 'నమస్తే' అన్నది సన్నగా షఫ్కత్ వాళ్లకు మళ్లీ నమస్కరించాడు ఆఫ్రికాలో అజీజు వ్యవహారాల్ని గూర్చి ముచ్చట్లు మొదలైనై టాంగన్యికా, ఉగాండా, దారుస్సలాం వగైరా ప్రాంతాల్ని గూర్చి మాట్లాడారు గాలీ, నీరూ ఎక్కడ బావుంటుంది, ఎండ ఎక్కువగా ఎక్కడ ఉంటుంది, పూలూ, పళ్లూ పుష్కలంగా ఎక్కడ దొరుకుతాయి, ఇవన్నీ మాట్లాడుకున్నారు. పండ్లమాటొచ్చేసరికి—

"ఇండియాలో చెత్త పండ్లు దొరుకుతాయి" అంది చిన్నమ్మాయ్

"లేదండీ ! సీజన్‌లో చాలా మంచిపళ్ళు దొరుకుతాయి" అన్నాడు షఫ్కత్ ఇండియా గౌరవాన్ని కాపాడుతూ,

"అబద్ధం" అంది చిన్నమ్మాయ్ కోపంగా. "అమ్మా, నిన్న మార్కెటునుంచి నువ్వు తెచ్చిన మాల్టా పళ్ళు ఆఫ్రికాలోని 'మచింగా' పళ్లతో పోల గలవా ?" అంది తల్లితో.

"అబ్బాయి ! అది అనేమాట నిజమే. ఇక్కడి మాల్టా అక్కడి 'మచింగా' మీదికి రావు" అంది వాళ్ల తల్లి

ఆయషా అడిగింది చిన్నమ్మాయిని—"అమ్మాయ్ తలత్ ! ఈ మచింగా ఏమిటే—తమాషా పేరే ?"

తలత్ నవ్వి అంది—"వదినా ! ఆదోరకం పండు ఎంత రుచిగా ఉంటుందంటే, చెప్పలేము. ఇక దాని రసం, ఒక్క పండు పిండితే, అదుగో! ఆ పెద్దగ్లాసులేదూ, దాన్నిండా వస్తుంది"

షఫ్కత్ గ్లాసువేపు చూశాడు ఆ పండు ఎంతలావుంటుందో అంచనా కట్టడానికి ప్రయత్నించాడు.

"ఒక్క 'మచింగా' పండులోంచి అంత పెద్ద గ్లాసు నిండా రసం వెళ్ళతుందా ?" అనడిగాడు

తలత్‌గర్వంగా జవాబిచ్చింది "అవునండీ"—అవి

"అయితే పండు చాలా పెద్దగా ఉండి ఉండాలి !" అన్నాడు షఫ్కత్

తలత్ తల అడ్డంగా తిప్పి "లేదు, లేదు అంత పెద్దగా ఉండదు, అంత చిన్నగా ఉండదు ఒక మోస్తరుగా ఉంటుంది అయినా అంత రసం వస్తుంది అదే దానిలోని గొప్పతనం ఇంకా అక్కడి పైనాపిల్—కోసే ఒక్కొక్క ముక్క పెద్ద రొట్టెంత ఉంటుంది" అంది

చాలాసేపు పైనాపిల్ పండును గూర్చి చర్చ జరిగింది. తలత్ అతిగా వాగుతుంది ఆమెకు ఆఫ్రికా అంటే చాలా అభిమానం అక్కడి ఏ వస్తువైనా ఎంతో ఇష్టం. ఇంత చర్చ జరుగుతున్నా పెద్దమ్మాయి నిగ్హత్, మాట్లాడకుండా నిశ్శబ్దంగా కూచుంది. నిగ్హత్ మాట్లాడదెందుకు చెప్మా అనుకున్నాడు షఫ్కత్

"మీకు ఈ వాగుడు గిట్టదల్లే ఉందే ?" అని అడిగాడు ఆమెను.

"లేదు లేదు—అలా అనకండి చాలా యిష్టంతో మీ మాటలు వింటూ కూచున్నాను" అంది నిగ్హత్

"మరి మీరు మాట్లాడరేం ?" అనడిగాడు షఫ్కత్.

"దాని స్వభావమే అంత, నాయనా ?" అంది నిగ్హత్ తల్లి.

షఫ్కత్ అన్నాడు—"పిన్నీ ! ఈ వయసు పిల్లలు మాట్లాడకుండా కూచుంటే ఎట్లా ! నోటికి తాళం వేసుకు కూచుంటారా ?" అంటూ ఆ అమ్మాయి వైపు తిరిగాడు

"ఏమండీ ! మీరు మాట్లాడక తప్పదు" అన్నాడు.

నిగ్హత్ పెదవులమీద సిగ్గు కలగలిసిన చిరునవ్వు తొణికింది.

"మాట్లాడుతున్నాగా అన్నయ్యా !" అంది.

షఫ్కత్ నవ్వాడు—"మీకు ఫొటోలు చూడ్డం అంటే ఇష్టమేనా ?" అని అడిగాడు

"ఇష్టమే" అంది నిగ్హత్, కళ్ళు నేలకు దించి.

"అయితే పదండి, నా ఆల్బం చూపిస్తాను పక్క గదిలో ఉంది" అంటూ లేచాడు షఫ్కత్

---

* తుపాకీగుండు.

"రండి" అన్నాడు ఆమెతో.

ఆయుషా అతని చేతిని నొక్కింది భార్యవైపు చూచాడు షఫక్షత్ ఆమె తన చేతిని ఎందుకు నొక్కిందో అతనికి అర్థంకాలేదు ఆయుషా ఏదో సంజ్ఞ చేసింది కళ్లతో అదీ తెలియలే దతనికి ఇంతలో చిన్నమ్మాయి తలత్ గబగబా వచ్చి, "పదండి అన్నయ్యా! నాకు ఆల్బం చూడాలంటే చాలా సరదాగా ఉంటుంది. నా దగ్గర గూడా ఒక మంచి కలెక్షన్ ఉంది" అంది

తలత్‌తో కలిసి షఫక్షత్ పక్క గదిలోకి వెళ్లాడు

నిగ్హత్ నిశ్శబ్దంగా కూచునివుంది తలత్‌కు తాను తీసిన ఫోటోలు చూపించాడు, షఫక్షత్. ఆమె తనకు తోచిన కామెంట్స్ చేస్తూ పోయింది. కాని షఫక్షత్ మనస్సు మరోచోట ఉంది అతను నిగ్హత్‌నుగురించి ఆలోచిస్తున్నాడు ఎందు కావిడ అలా నిశ్శబ్దంగా కూచుంది ? ఫోటోలు చూడ్డానికి తనవెంట గదిలోనికి ఎందుకు రాలేదు ? ఫోటోలు చూడ్డానికి రమ్మని తాను ఆమెను పిలిస్తే తనభార్య తనచేతిని ఎందుకు నొక్కినట్లు ? కళ్లతో తన భార్య చేసిన సంజ్ఞకు అర్థం ఏమిటి ?

ఫోటోలన్నీ చూపించడం అయిపోయింది తలత్ ఆల్బం తీసుకుంది "అక్కయ్యకు చూపిస్తా వీటిని దానికి ఫోటోలు కూడబెట్టడం అంటే చాలా యిష్టం" అంది తలత్ అంత ఇష్టం అయితే ఆల్బం చూడ్డానికి ఆమె ఎందుకు రాలేదని అడుగుదా మనుకున్నాడు ఇంతలో తలత్ ఆల్బం తీసుకుని పక్క గదిలోకి పరిగెత్తింది అక్కా చెల్లెళ్లు ఆల్బం చూస్తున్నారు ప్రతి ఫోటో నిగ్హత్‌కు నచ్చింది కిటికీలోంచి షఫక్షత్, వాళ్లను చూస్తున్నాడు అంతవరకూ ఎంతో చింతగా కనపడ్డ నిగ్హత్ ముఖం ఆల్బం చూస్తూంటే మెరిసిపోతున్నది. కళాస్వరూపాలైన ఆ ఫోటోలు ఆమె మనస్సుకు ఉల్లాసాన్ని కలిగిస్తున్నాయి ఆమె కళ్లల్లో కొత్తకాంతి కనిపించింది. ఒక గుర్రం పక్కన ఒక ఆరోగ్యవంతమైన అమ్మాయి ఉన్న బొమ్మ ఆల్బంలో కనపడే సరికి ఆమె ముఖంలో మళ్లీ నిరాశ అలముకుంది నిరాశతో పెద్దగా నిట్టూర్చింది అమ్మాయి బొమ్మలన్నీ చూడడం అయిపోయింది నిగ్హత్, షఫక్షత్ వైపు చూసింది ఎంతో కమ్మగా "థ్యాంక్స్ అన్నయ్యా!" అంది నిగ్హత్ చేతులోంచి ఆల్బం తీసుకొని మేంటల్ పీస్ మీద పెట్టాడు షఫక్షత్ మనసులో ఏదో కలత పెట్టసాగింది ఆ అమ్మాయి జీవితంలో ఏదో విషాద ఘటన జరిగివుండా లనుకున్నాడు లేక విఫలమైన ప్రేమ ఘట్టం ఏదైనా ఉండి ఉండాలి

ఇంతలో టీ వచ్చింది "లెండి కాస్త టీ కలిపి ఇవ్వండి ఆ ప్రివిలీజ్ లేడీస్‌దేగా" అన్నాడు షఫక్షత్ నిగ్హత్‌తో

నిగ్హత్ మాట్లాడలేదు తలత్ చటుక్కున లేచింది

"నేను టీ కలుపుతా నన్నయ్యా!" అంది. నిగ్హత్ ముఖంలో నీలి మబ్బులు కమ్ముకొచ్చాయి కారణం తెలియలేదు అతనికి ఆమెముఖంలోకి దీక్షగా చూచా డతను ఆమె కళ్ళు దించేసుకుని పక్కకు తిరిగింది ఎందుకలా చేసిందో అతనికి అర్థం కాలేదు

టీ తాగుతూ తలత్ ఏమేమో మాట్లాడింది టెన్నిస్‌ను గూర్చిన ప్రసంగం వచ్చింది నైరోబీలో తాను నెంబర్ వన్ టెన్నిస్ ప్లేయర్ నని చెప్పుకుంది పదిహేను, ఇరవై కప్పులు గెల్చుకున్నదట కూడా! నిగ్హత్ మాట్లాడకుండా కూచుంది తాను మాట్లాడడం లేదని అందరు అనుకుంటున్నారని ఆమెకు తెలుసు కూడా

ఇద్ద రమ్మాయిల్లో నిగ్హత్ అంటే ఆమె తల్లికి ఎక్కువ యిష్టమని గమనించాడు షఫక్షత్ ఎంతో ప్రేమతో స్వయంగా తల్లి, నిగ్హత్‌కు టీ అందించింది మూతి తుడుచుకోడానికి తన టవల్ అందించింది. ఎంతో ఆప్యాయతతో తల నిమిరింది.

టీ అయిన తరువాత వెళ్లిపోవడానికి లేచారు తల్లీ కూతుళ్లూ. ముసుగు వేసుకుంది తల్లి 'ఆయుషా' ను కావిలించుకుంది షఫక్షత్‌ను గీవించింది పెద్ద కూతురు వద్దకు వెళ్లి కళ్ల నీళ్లు పెట్టుకుంటూ "పద అమ్మాయి పోదాం" అంది తల్లి ఒక చేయిపట్టుకుంది, చెల్లె లొక చేయి పట్టుకుంది మెల్లగా కదిలింది నిగ్హత్ శరీరంలో కింది భాగం చచ్చుపడ్డట్టుంది అది గమనించాడు షఫక్షత్. కాళ్ళు చచ్చుపడినట్లున్నాయి అది చూచి షఫక్షత్ గుండె ఝల్లుమన్నది. తనలో తాను సర్దుకున్నాడు

తల్లినీ, చెల్లెల్నీ ఊతగా పట్టుకుంటూ, వణుకుతున్న కాళ్లను ఈడ్చుకుంటూ, షఫక్షత్‌కూ, అతని భార్య ఆయుషాకూ నమస్కారం పెట్టి మొహం కుడిచేత్తో దాచుకుంటూ నిగ్హత్ వెళ్లిపోయింది ఎంత అందంగా, ఎంత ఒయ్యారంగా నమస్కారం పెట్టింది! ఆమె తనకు నమస్కరించడానికి ఎత్తిన చేయి తన గుండెల్లో బలంగా గుద్దినట్లు బాధ కలిగింది. ఎంత వింత ? దైవం ఆమెపట్ల ఎంత నిర్దయగా ప్రవర్తించాడు! అంత చక్కని అమ్మాయికి దైవం ఎంత ఘోరమైన అపకారం చేశాడు! ఆ అమాయకురాలు ఏం తప్పు చేసిందని ఈ ఘోరమైన శిక్ష!

అంతా వెళ్లిపోయారు వాళ్లను పంపించడానికి గుమ్మందాకా వెళ్లింది షఫక్షత్ భార్య ఆయుషా వేదాంతిలా ఏదో ఆలోచిస్తూ నుంచున్నా డతను. ఇంతలో మిత్రులు వచ్చారు నిగ్హత్‌ను గూర్చి భార్యతో మాట్లాడటానికి అప్పుడు అవకాశం దొరకలేదు మిత్రులతో పేకాటలో పడ్డాడు రాత్రయింది పనివాడు భోజనానికి పిలిచాడు. భోజనం చేస్తూ నిగ్హత్ ప్రసక్తి ఎత్తా డతను. "మొదట భోంచేయండి తరువాత మాట్లాడుదాం" అంది ఆయుషా

ఆయిషా, షఫ్ఖత్‌లకు పెళ్లయి ఆరేళ్లయింది. పిల్లలు కలుగలేదు. ఇద్దరు ఎప్పుడూ వేరేవేరే పడుకోలేదు. అసలు వాళ్ల గదిలో ఒకటే మంచం ఉంది పిల్లలు కలగడానికి ఆమె ఆపరేషన్ చేయించుకోవలసి ఉంటుందని డాక్టర్లు అభిప్రాయపడ్డారు. కాని ఆయిషాకు ఆపరేషన్ అంటే తగని భయం. వాళ్లిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉంటారు. వాళ్ల మధ్య ఎట్టి కలతలూ లేవు.

ఆరోజు కూడా కలిసి పడుకున్నారు ఆ రాత్రి అతనికి నిగ్హత్ జ్ఞాపకం వచ్చింది నిట్టూర్పు విడిచాడు "ఆయిషా! పాపం నిగ్హత్‌కు ఏమిటీ జబ్బు ?" అడిగాడు

ఆయిషా కూడా బాధగా నిట్టూర్చి—

"నిగ్హత్‌కు మూడోయేట పోలియో వ్యాధి సోకింది కాళ్ళ పడిపోయినవి" అంది విచారంగా. నిగ్హత్ అంటే ఎక్కడలేని సానుభూతి కలిగింది షఫ్ఖత్‌కు ఆయిషా వీపుకు తనరొమ్ము ఆనించి అన్నాడు —

"ఆయిషా! దేవుడు ఎందు కంత క్రూరుడయ్యాడు ?" ఆయిషా జవాబివ్వలేదు. ఆ పగలు జరిగిన ఘటనలన్నీ షఫ్ఖత్‌కు జ్ఞాపకం వచ్చినవి.

"ఆల్బం చూడ్డానికి రమ్మని నేను నిగ్హత్‌ను పిలిస్తే నీవు నా చేయి నొక్కింది అందుకే కదూ!" అనడిగాడు షఫ్ఖత్

"అవును మరి .... అందుకే. మీరేమో వూరికే దాన్ని పిలుస్తూ "

"దేవుడితోడు నాకు తెలీదు"

"పాపం ? దానికి తనలోని లోపం ప్రతి క్షణం జ్ఞాపకం వస్తుంటుంది"

"అది తెలిసి నా గుండెలో బాకు గుచ్చుకున్న ట్లయింది"

"నిగ్హత్ మనింటికి రాగానే దాన్ని చూచి నా మనస్సు చాలా బాధపడింది పాపం, దొడ్లోకి వెళ్లలేకపోయింది తల్లీ, చెల్లెలూ ఇంచుమించు ఎత్తుకు వెళ్లాల్సి వచ్చింది. లాగూ తాడువిప్పారు. మళ్లీ కట్టారు. ఎంత అందంగా ఉంది అమ్మాయి! పాపం!"

'కూచుని ఉంటే పోలియో వ్యాధి సోకిందని అసలు తెలీదు"

"చాలా అభిమానం గల పిల్ల."

"అలాగా ?"

"జీవితాంతం అవివాహితగానే ఉంటా నంటుంది" ఆమాట విని షఫ్ఖత్ కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు కాసేపు ఆగి అన్నాడు.

"అయితే తనను ఎవరూ పెళ్లి చేసుకోవడానికి అంగీకరించరనే విషయం ఆమెకు బాగా తెలుసునన్నమాట!"

షఫ్ఖత్ రొమ్ముమీద వెంట్రుకలను వేళ్లతో దువ్వుతూ "వికలాంగిని ఎవరు పెళ్లాడుతారండీ!" అంది ఆయిషా.

"అలా అనకు. అలా అనకు, ఆయిషా!"

"అంత పెద్ద త్యాగం ఎవరు చేయగలరండీ!"

"అవును నిజమే మరి!"

"అందమైన పిల్ల. సంపన్నులైన తల్లిదండ్రుల ముద్దుల కూతురు. అంతా బాగానే ఉంది కాని ......"

"నే ననుకుంటాను ... కాని ..."

"మగవాళ్ల హృదయాల్లో దయ ఎక్కడిది ?"

షఫ్ఖత్ మరోవైపు పొరిలాడు "అలా అనకు ఆయిషా!" అన్నాడు ఆయిషా ఇటు పొర్లింది. ఇద్దరు ఎదురు బదురుగా పడుకున్నారు

"నాకు అంతా తెలుసు. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకునే మగవాణ్ణి చూపండి! చూతాం" అంది ఆయిషా.

"అవును, ఎవరు చేసుకుంటారు!"

"పైగా పెద్దది చిన్నదాని పెళ్లికి ప్రయత్నాలు జరుగుతుంటే తన కెంత బాధ, చెప్పండి!"

"నిజంమాట"

ఆయిషా పెద్దగా నిట్టూర్పు విడిచింది.

"పాపం ఆపిల్ల జీవితాంతం అలా కుమిలిపోవలసిందేనా ?"

"లేదు, లేదు" అంటూ లేచి కూచున్నాడు షఫ్ఖత్.

"అంటే ?" ప్రశ్నించింది ఆయిషా

"నీకు ఆ అమ్మాయంటే సానుభూతి ఉందా ?"

"లేకేం! ఉంది"

"దేవుడిమీద వొట్టు పెట్టుకొని చెప్పు ?"

"ఇందులో వొట్టు పెట్టుకోవలసిం దేముంది ? ప్రతి మనిషికీ ఆ పిల్లంటే సానుభూతి ఉంటుంది"

కొన్ని క్షణాలు నిశ్శబ్దం తరువాత—

"అయితే నే నొకటి ఆలోచించాను" అన్నాడు షఫ్ఖత్.

"ఏమిటది ?" అడిగింది సంతోషంగా ఆయిషా.

"నువ్వు ఉన్నత భావాలు గల దానివనే మాటను రుజువు చేసుకున్నావు ఆయిషా! నేను .. నేను దేవుడు నాకు నా సంకల్పాన్ని నెరవేర్చుకునే శక్తిని ప్రసాదించాలి.. నేను నిగ్హత్‌ను పెళ్లి చేసుకుంటాను ఆ పుణ్యమంతా నీకే దక్కుతుంది, ఆయిషా!"

ఉలిక్కిపడి లేచి కూచుంది ఆయిషా.

"మీరు దాన్ని పెళ్లి చేసుకుంటే, దాన్ని తుపాకితో కాల్చి చంపేస్తా, తెలిసిందా" అంది ఆయిషా

తుపాకీగుండు వచ్చి తన గుండెలో బలంగా తగిలినట్లయింది షఫ్ఖత్‌కు. చచ్చి, తన భార్య ఒడిలో పొతుకుపోయాడు.

చాళుక్యవంశము: కొన్ని సంశయములు

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

బాదామి—వేంగి చాళుక్యవంశములలో నాకు గోచరించిన కొన్ని సంశయములు సూచించి, తోచిన సవరణలు విన్నవించెదను అందలి గుణదోషములను చారిత్రకులు నిర్ణయింప వేడెదను

బెజవాడ ప్రాంతము ముసినికుండ శాసనములో 'మంగియువరాజు తనయ కుబ్జ విష్ణు వర్ధన' సంబంధము వ్రాయబడియున్నది దీనిలో "స్వాదిత మార్గశీర్షమాస' కాలము లెక్కప్రకారము వి శ 684 తేదీకి క్రీ శ 627 సమకాలమగుచున్నదని ఆంధ్ర క్రానాలజి నిశ్చయించుచున్నది (ఈకాలము మొదట తెలిపిన మిత్రులు డాక్టరు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారికి ధన్యవాదములు) దీనికితోడు విప్పిరాల తెనుగుశాసన విజయరాజ్యసంవత్సరంబుల కాలము కూడ కలదన వీలున్నది

క్రింది పట్టికలో సామాన్య—విశేషకాలముల వ్యత్యాసము పోల్చి చూపడమైనది

చాళుక్య వల్లభ		— 6	543— 49
పులికేశి	1	—30	549— 79
కీర్తివర్మ		—18	579— 97
మంగలేశ		—12	597—609
కుబ్జవిష్ణువర్ధన		—18	609— 27
జయసింహ		30—33	627— 60
ఇంద్రభట్టారక		—7రో	660— —
విష్ణువర్ధన	2	— 9	660— 69
మంగియువరాజు		—25	669— 94
జయసింహ	2	—13	694—707
కొక్కిలి విక్రమ		—6మా	707— —
విష్ణువర్ధన	3	35—37	707—744
విజయాదిత్య	1	18—19	744— 63
విష్ణువర్ధన	4	35—36	763— 99
విజయాదిత్య	2	40—48	799—847
విష్ణువర్ధన	5	1½—1⅔	847— 48
విజయాదిత్య	3	—44	848— 92
చాళుక్య భీమ	1	—30	892—

పై పట్టికలో అందరికి అధిక విజయరాజ్యవర్షంబులే లెక్కించబడినవి తక్కువ కాలము సరిగాలేదు క్రీ శ 543 తేది చాళుక్య వల్లభుని కాలమును విడిచి, క్రీ శ 549 మొదటి పులికేశి కాలమునుండి క్రీ శ 892 మొదటి చాళుక్య భీముని పట్టాభిషేక కాలము వరకు లెక్కించినచో విప్పిరాల శాసనమందలి 'శ్రీమత్ సకల లోకాశ్రయ జయసింఘవల్లభ మహారాజులాకున్ ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబుల్ ఎణుంబొది అన్వేణ్ట (629—549 కాలము—80) లెక్కకాలము 627 తేదీ ముషినికుండ శాసనకాలముతో సమకాలమగుచున్నది.


క్రీ శ 543 తేది బాదామికోట శాసనకాలమునుండి క్రీ శ 892 తేది వందిపాకశాసనకాలమువరకు తెంపులేని చాళుక్య రాజ్యవర్షంబులు చారిత్రకముగా సరిపడుచున్నవి.

ఈ శాసనకాలము సరియైనదగుట కాక్షేపము లేనిచో, 'మంగి (యువ) రాజుతనయ కుబ్జవిష్ణువర్ధనః క్రీ శ 600—609 మధ్యకాలము' నాటికే వేంగి రాజ్యారంభము కలదనుటకు వీలున్నది.

మరియు, క్రీ శ 627 తేదీకి ముందున్న 'మంగి యువరాజు' క్రీ శ. 669 తేదీకి తరువాత ఉన్న 'మంగి యువరాజు' కాబోలనుట కాల దోషము.

మొదటి పులకేశి పుత్రుడు మంగి యువరాజు కాలమును రెండవ విష్ణువర్ధన పుత్రుడు మంగి యువరాజు కాలమును సమకాలములు కానట్లే, తాతల పేర్లుకూడా సరిపోవు

విష్ణువర్ధన (కీర్తివర్మ) పౌత్రుడు మంగియువరాజు మొదటివాడు కాగా ఇంద్ర భట్టారక పౌత్రుడు మంగి యువరాజు రెండవ వాడగుట కాలక్రమము. ఇందలి 'పౌత్ర' సంబంధమును 'పుత్ర' సంబంధముగా మార్చుట కవకాశము లేదు పోలికశాసనపట్టికలో పౌత్రసంబంధము తిలకింపుడు



ముషినికుండ శాసనములోను, కొప్పరము శాసనములోను కల— 'పౌత్ర' శబ్దము తప్పని అది 'పుత్ర' శబ్దవికారము కాబోలనుట కితరాధారము లేమి కలవో నాకు తెలియదు

కొప్పరం శాసనమం దస్పష్టముగా పేర్కొన్న 'పృథ్వీదు (యు)వరాజను ఐహోళె శాసనమందు స్పష్టముగా పేర్కొన్న 'యువరాజ విష్ణువర్ధన' రాజను భిన్న వ్యక్తులనుటకు పౌత్ర—ప్రపౌత్ర సంబంధము తోడువడుచున్నది. అయిహోళె శాసనములో కీర్తివర్మ (Son) కొడుకు యువరాజవిష్ణువర్ధన— విషమసిద్ధి పేరుండగా, నిడువ్రు శాసనములో కీర్తివర్మమునిమనుమడు మకర ధ్వజాపరనామ—శ్రీమత్—యుగిన విష్ణువర్ధన పేరు కలదు ఇందలి 'యుగిన' వంఖ్య 'యుగళ' శబ్ద వికారము కాబోలు. యుగళ (కుబ్జ) విష్ణువర్ధనుడును, యువరాజ విష్ణువర్ధనుడును భిన్న వ్యక్తులగుదురు. కుబ్జ విష్ణువర్ధనుడు ఇమ్మడి విష్ణువర్ధనుడైవట్లే, యువరాజ విష్ణువర్ధనుడు మొదటి విష్ణు వర్ధనుడు కాకపోడు

ఇతనికి జయసింహుడను మరియొక తమ్ముడు లేడనుట కవకాశమున్నదో లేదో తెలియదు లేనిచో విషమసిద్ధిని జయసింహుడనుట కవకాశమున్నది.

చీపురువల్లి శాసనములో పులకేశి కనీయుడు (తమ్ముడు) విషమసిద్ధి పేరున్నట్లు ఆంధ్ర క్రానాలజీ తెల్పుచున్నది.

తమ పినతండ్రి మంగి యువరాజాను (మంగళేశపృథ్వీయువరాజాను) యుద్ధములో పులకేశియు, తమ్ముడు విషమసిద్ధి యువరాజ విష్ణువర్ధనుడును చంపి, వేంగి రాజ్యమును జయించనిచో మరలా వేంగి రాజ్యమును మంగి యువ రాజ తనయుడు కుబ్జ విష్ణువర్ధనునకు కారణము లేక యిచ్చినట్లు చెప్పుట వహేతుకముకాదు

'స్వబాహునా వివక్షమండల(మ్) నిర్జిత్య స్వసుతాన్వయే ప్ర(తి) ష్ఠాపిత రాజస్య పృథ్వీ దు (యు) వరాజమ్ అనత్తు........స్వదత్తి రాజ్ఞాప్తి'.

'స్వసుతాన్వ(య)ప్ర (తి) ష్ఠాపితరాజ్య(మ్)' కావింప తలచినతండ్రి(మంగి) పృథ్వీ యువరాజాను తన యుడు (కుబ్జ) విష్ణు వర్ధనుడు పెద తండ్రి కొడుకులతో చేరి కుట్రచేసి చంపవలసిన అవశ్యకతలేదు. కాబట్టి, కీర్తివర్మ కొడుకు విషమసిద్ధి యువరాజ విష్ణువర్ధనుడును, మంగియువరాజుతనయుడు మకర ధ్వజ (కుబ్జ) విష్ణు వర్ధనుడును భిన్న వ్యక్తులనుట కవకాశమున్నది. ఈ (యుగిన) యుగళ విష్ణు వర్ధనులను—సమకాలికులను—గుర్తించుటలో పొరపాటు జరిగినట్లు తోచుచున్నది

కొప్పరం శాసనదానము'ప్రవర్ధమాన విజయ విజయరాజ్య సంవత్స(రం) ఏక వి (ం)శతి కార్తిక మా(సం) మహా (నవమి) బృహస్పతి వా(ర)ముహూ(ర్తం), కాలము క్రీ. శ. 600 ప్రాంత కాలమై యుండును.

యువరాజ్యకాలము 18 సంవత్సరంబులు, స్వరాజ్య కాలము 3 సంవత్సరంబులు కలసి మంగి యువరాజు 21 విజయ సంవత్సరంబులు, పరిపోవుచున్నవి ఇట్లు కానిచో ఏకవింశతి (21) లెక్క కుదరదు మంగి యువ రాజు 3—విజయ రాజ్య సంవత్సర కాలమునాటి దీ కొప్పరం శాసనమనిపించుచున్నది అప్పటికీతని యన్న కీర్తివర్మ మరణించి మూడు సంవత్సరములులైనది.

ఇందలి 'వల్లభ సమ(స్త)వస్థి(తి) విధి (వ)త్ సంప్రదత్తమ్ .... స్వదత్తి—ఆజ్ఞప్తి'..... అను చరిత్ర(మంగి) పృథ్వీ (యువరాజు) వల్లభుని దగునేకాని, పులకేశి పృథ్వీవల్లభుని దగుటకు విరోధము కలదు.

క్రీ. శ. 609 లో పినతండ్రి మంగళేశ పృథ్వీ వల్లభుని యుద్ధములో చంపిన పిదప పులకేశి రాజై, తన తమ్ముడు విషమసిద్ధి విష్ణు వర్ధనుని యువ రాజ విష్ణు వర్ధను కావించినట్లు కళ్యాణి చాళుక్య వంశ స్థాపన చెప్పుచున్నది.

ఇట్లే క్రీ. శ. 609 లో తన తండ్రిని పెదతండ్రి పుత్రులు చంపిన పిమ్మట మకరధ్వజకుబ్జ (యుగిన—యుగళ) విష్ణు వర్ధను డా కళ్యాణి చాళుక్యులతో యుద్ధము కావించి, సంధిలో వేంగి చాళుక్యవంశ స్థాపన చేసినట్లు తోచుచున్నది

తన తండ్రి కొప్పరం శాసనములో ఉద్దేశించిన, 'స్వసుతాన్వయ ప్రతిష్ఠాపిత రాజ్య(మ్)' అను బాదామి చాళుక్య రాజ్యవిభాగ చరిత్ర సమన్వము కుదురుచున్నది

"In the begining, Kubja Vishnu-Vardhana by the prowess resembling that of Vishnu wrested this earth forcibly from the Durjaya and ruled it for eighteen years."

—(దానర్ణవుని కండాయం శాసనము)

"His (Satyasraya's) younger brother, the renowned lord, named Vishnu Vardhana distroyed the Durjayas and obtained Vengi-Mandala."

—(గుణగ విజయాదిత్యుని కాట్లవ్రు శాసనము)

డాక్టరు శ్రీ నేలటూరు వెంకట రమణయ్యగారి వేంగి తూర్పు చాళుక్య రాజుల చరిత్ర (ఆంగ్లము)లో పై శాసన వాక్యము లున్నవి

"This yield* (*892-274*) A. D. *618* as the date of the establishment of the Eastern Chalukya Power in Vengi" (P. *49*)

ప్రియమిత్రులు శ్రీ నేలటూరు వా రూహించినట్లు, ఇందలి చరిత్ర సమన్వయమగుటలేదు.

విష్ణువర్ధనులు (యుగిన) యుగళ విష్ణువర్ధనులు కాబోలనుట ప్రాచీన శాసన వంశ సమ్మతము

ఈ విష్ణు వర్ధనుల జంట వేంగి దుర్జయులతో యుద్ధములు చేయుట సంధి తర్వాత చరిత్రగా సమన్వయమగుట కవకాశమున్నదో, లేదో చూడవలసి యున్నది

క్రీ శ 600—609 మధ్య కాలములో కళ్యాణి—వేంగి చాళుక్య వంశముల స్థాపనకుగా యుద్ధములు సాగినట్లు, సంధి కుదిరినట్లు చాళుక్య వంశ చరిత్ర సమన్వయమగునేమో సాధన సంపత్తిగల చారిత్రకులు చర్చించి తీర్మానించుట సంశయ నివారణోపాయము.

కళావతి

శ్రీ సహదేవ సూర్యప్రకాశరావు

పుణ్యకేతుఁ డాతండు; శ్రీమతి కళావ
తీ సతీమూర్తియామె, లేఁదీవపడఁతి
వేదనలవేగు తొలికాన్పువేళ, తలిరు
దారి వాహ్యాళి సేయుచున్నారు వారు.

అభినవామోద జాతిలతాంతపాళి
చాలు చాలుగా విరిసె వసంత వీథి
పరభృతమ్ముల కుహూకుహూ స్వరముతోడి
ముద్దురోజాలలోఁ దొలి ప్రొద్దుపొడిచె.

తరుణపత్రాల సందుల నొరిగియొరిగి
విరులకన్నెలు తనకళా గరిమకలర
రచనసేయసాగె విచిత్ర రంగవల్లి
అర్ద్రిసీమల నరుణారుణాంశుమాలి.

* * * *

కాళరాత్రుల కొండకోనలు
గఘురు వోవగఁగాఁ కింరువి
కాళనాట్యము గరళ గానము
కలఁ ధ్వనించెడినే!

గరళగానము కాళనాట్యము
డమరు ఢక్కా ఘాన్నినదము
వియ్యమందీ విలయమందీ
విరిసి పోయెడినే!

విన్నవారలు కొన్నవారే
కొన్నవారలు విన్నవారే
వన్నెగాంచిన ప్రతిమగాంచీ
కొనఁగఁ బోవుదురే!

ఇదియె మార్కండేయ లింగం
బిదియె శ్రీ మాహేశ్వరి ప్రభ
యిదియె రాజేశ్వరుని పదము
ముదము గూర్చెడినే!

వారణాశీ వప్రగోపుర
ప్రాకారోచ్చ రమ్యపాళిక
వన్నెవన్నెలు కన్నుఁగట్టెడు
వలయునే మీకున్.

నందె సొగసుల నవదరించీ
ప్రతిఫలించిన పరమ గంగా
తీర భూములతీరు తీయము
వీక్షించినారటవే

విన్నవారలు కొన్నవారే
కొన్నవారలు విన్నవారే
వన్నెగాంచిన ప్రతిమగాంచి
కొనగఁబోవుదురే!

ఉజ్జ్వలానందో ద్యానములు
బిందుమాధవు లీలావనులు
పూయుపూవై సొగుతీవై
పొలుపు మీరెడినే!

ఇతఁడు ఖండ శశాంకభూషణు
డితఁడు ప్రాక్తనరత్నేశ్వరుడు
ఇజ్యశైలకులేశ్వరుడితడు
వలయునేమీకున్

* * * *

తెనుగురంగోవ జీవులు తీరుతీయ
మొలయవ్రాసిన చిత్రాల లలితరీతి
గీతి వర్ణించు కొంచు సాగించుచుండె
బేరసార మానగరి బేహారియొకడు

పాట పదములలో నభివర్ణితమ్ము
కాశికా క్షేత్ర చిత్రాళి కలికిదనము
విని కళావతిసతి ధరావిభునిచూచి
యెఱుక సేసె చిత్రాళి వీక్షించునాన
వెలది మదిలోనికోరిక వెదవి విడెనో
లేదొ; మరునిమేషాన నాలేఖ్యవరుడు
వచ్చివ్రాలెను రాజదంపతుల యెదుట;
వింతయనురాగ మ్మాప్రియ కాంతమీద
వచ్చి కాశికా చిత్రాళి విచ్చియొక్క-
టొకటి పేరుపేరు వరుస నుజ్జ్వలాంధ్ర
భావనా చిత్రవైదుషీ వైభవమ్ము
వెలువరించె బేహారి వాగ్విభవ మొలయ;

* * * *

చూచితిరా దీని సొబగు; సంధ్యా నటే
శ్వర నగ్న తాండవ సౌష్ఠవమ్ము,
పరికించినారటే; పావనగంగా న
రి త్తటి ప్రత్యుషశ్ప్రశస్తి;
తిలకించితిరెమీరు దివ్యవాపీత్ర యీ
కలిత వారాణసి కళలరాశి;
వీక్షించినారె విశ్వేశ్వర గోపుర
మంజురేఖా పుంజరంజనమ్ము
కనుల కఱవార మనసారఁగాంచినారె
ఇది మహామణికర్ణికాపదము! దివ్య
వాహినీ పంచ సంతీర్థపదము లివియె!
"ఇది విధాతృశిరమ్ము వ్రాలిన పదమ్ము"

జ్ఞానవాపిక పుణ్యదీర్ఘిక
జ్ఞానవాపిక కల్పవాటిక
జ్ఞానవాపిక జ్ఞానతీర్థము
జ్ఞానోద మియ్యదియే!

జ్ఞానవాపికపూజ్య సంజ్ఞాతురమ్ము
వీను విందయ్యెనో లేదొ, కాని రాణి
జవజవాడి పాషాణ పాంచాలి యయ్యె
ఆపునీతాఖ్యలో నే మహస్సుగలదొ.

తెలిమొయిలు కౌగిలింతల కలగికలగి
పాలిపోయిన లేనెల బాలవోలె
అఖిల పరిచారికా జనాభ్యంతరమున
మూర్ఛమునిగి కళావతి పొలుపుదక్క-
ఏమిచేయంగ వలయునో ఎఱుక లేక
కువలయాధీశుమది కలగుండు వడియె
ఏమిచేయంగవలయునో ఎఱుకలేక
వణిజనాథుని మనసు విహ్వలతఁ జెందె

అబ్జపత్రాళి శిశిర హిమాంబుపూర్ణ
కనకపాత్రాళి హిమవాలుకా కరండ
పాళి; చందనగంధాళి; వరుసఁదెచ్చి
చేసె శిశిరోపచారముదాసికాళి

కన్నులరవిచ్చి యలనల్లగదలి హృదయ
దేవుకోసమ్ము దశదిశల్ దివియఁ జూచి
జ్ఞానవాపిక, జ్ఞానోద ఖండమనుచు
తేఱికొనె శ్రీమతి కళావతీవధూటి

తేఱికొనిన కాంతను, తఱితిపువోవ
కనులు విస్ఫారితమ్ములుగాఁ జూచి
హృదయ ముద్వేలమై రసోత్సవముగాగ
క్రుంగిపోయిన భూజాని నింగికెగసె

ఇంతికన్నుల సాకూత దృష్టిరేఖ
రాజరాజేశ హృదయసామ్రాజ్యపదవి
నలమి కలగింపువెట్టె; ప్రేయసినిజేరి
నవనవమ్ముగా బతి లాలనమ్ము సేసె

చేసి "ప్రేయసీ! ఇదియేటి చేష్టితమ్ము
కాశికాలేఖ్యపాళిక కలికిదనము;
ప్రతిభ" తిలకించి మెచ్చుకో వలయుగాని
ఇటుల విస్మృతిపాలౌట కేమికతము

జ్ఞానవాపిక జ్ఞానోదఖండమనుచు
బలికినావు ముమ్మారుఁ తత్ప్రతిమ విరచ
నాప్రశస్తి మనసునాటినదియొ, కాక
స్మృతికి దట్టెనో పూర్వజీవితపు గాథ?

2

"కలఁడొక ధరణీదేవుఁడు కాశికాపు
నీత విశ్వేశ్వరాలయ నికటసీమ;
అతఁడు నిత్యాగ్నిహోత్రి; పుణ్యప్రచారు
డాగమాధ్యాయి, హరిశర్మ నాగ బరగు

నడబెడంగుల నంచల నడబెడంగు
పలుకుదీపుల చిలుకల పలుకుదీపు;
మేనిచాయల ముత్యాల మేలిచాయ
దరహసించు సుశీలయాతనికుమారి

వేగుజుక్క వెలికిదోప, వేగుబోక
నెచ్చెలులు దానులేచి వినీతమొలయ
పరమపావని గంగాభవాని విమల
సలిలమందు నభ్యంగన స్నానమాడు.

ఆడి, శిరసార్చి, తెలిసరిగంచు చీర
దాల్చి, రత్నాలతాటంక తరళకాంతి
చెక్కుటనటింప, మంజీరశింజమొరయ
నలుపగాఁ బోవు విశ్వేశు చరణసేవ

ఆమెనును వ్రేలికొనలు నాట్యములు సలుప
కలువ, కెందమ్మి, సంపెంగ, కలికిచిలుక,
చిన్నిజాబిల్లిరేక, కాశీపురీశు
దివ్యవీథిక ముగ్గులు దిద్దితీర్చు
పూఁజాలుల మాలికల్ పోహళించి
గంధకస్తూరికాగురుకలితధూప
దీపికాపాళికల హారతెత్తి; ప్రణవ
భవ్యమంత్రాల సేవించు భవునినతము.

ఆమెకన్నులలో తరళాబ్జరేఖ
చికిలిబుగ్గల సంజ నజ్జకపుజాఁయ;
చూచి తలయూచి క్రొంగ్రొత్త సొబగుకాండ్రు
అడుగుచిన్నెల నర్చింతు రంజలించి

3

"అది ప్రశాంతవసంత నిశాంతరమ్మ
పుచ్చపువ్వుల లేతనవ్వుల పసందు
చిలుకువెన్నెల విరిసి వాసించుచుండె
మల్లియలతోడ; జాజి కుట్మములతోడ
కోటికోటి జాతీసుమ కోరకములు
విరిసిపోయిన వెన్నెల వెలుగులోన
ఇంటి మొగసాల పూఁబొదరింటి సరస
మృదుల శయ్యసుశీల నిద్రించుచుండె

సరసిలోఁ దెలిగల్వవాసనలచాయ
నల్లనిదురవోయెడు రాజహంసివోలె,
స్వచ్ఛ హృదయమ్ము ముఖసీమ ప్రతిఫలింప
మృదుల శయ్య సుశీల నిద్రించుచుండె.

కన్నెపడుచుల స్వప్నలోకమ్ములోన;
భ్రుకుటికుంచించి, ఏ సురలోక లోక
ములకు, ప్రణయరాగము నేకముగ రచించి
కలలదొంతర లెన్నెన్నొ గాంచుచుండె.

అమల చంద్రికాపాండు శయ్యాప్రసుప్త
కోమలామల రాగరేఖా మనోజ్ఞ
మూర్తి నామెను, సూనశరార్తు డగుచు
చూచినాఁడు విద్యాధర ఖేచరుండు.

ఒక్కపరి గాంచినాడొ లేదో రవంత
ఎన్ని ప్రేమానుభావము లెగసినవియొ,
ఏయలౌకిక సౌందర్యమేచి కొనెనో,
ధారుణీ తలిడిగ్గె విద్యాధరుండు.

చివురు నెత్తమ్మితూడు చంచువున దాల్చి
అభ్రవీథికి నెగయురాయంచవోలె
ఆ సుశీల నా విద్యాధరాధినేత
మృదుల హస్తాలదాలిచి మింటికెగసె.

ఎగసి యాకాశమార్గాన నెగసిమెగసి
లలిత చంద్రికాస్నపిత మండలము దరిసె,
గుళికమై యదృశ్యమ్మకా, గోపురాగ్ర
చిత్రరత్న విభ్రాజి కాశీపురమ్ము.

మృదుల హస్తాలలో నిదురించు నామె
ముగ్ధవదన లావణ్యమ్ము; ముకుళితాంబ

శముల చికిలి సోగదనమ్ము; కలయగాంచి
చంద్రు డీసుచే మబ్బుల చాయనొదిగె.

పాలవెన్నెల నురుగుల తేలితేలి
చిఱుత మబ్బు తునుకలదొంతరల తరలి,
గాలి తరఁగ పక్షాల తూగాడియాడి
స్వేచ్ఛ సుఖియింప వ్రాలెను వింధ్యశిఖరి
పొడపొడల వన్నెవన్నెల పొదలుఁబొదల
సితలతాంత శయ్యాంతమ్ము నతివఁజేర్చి
ముగ్ధమాధురీ సౌందర్య ముగ్ధుఁడగుచు
వెలది యరమూతగనుల చుంబింపనుండె.

అంతనొక పిశితాశి దివ్య ప్రసన్న
మృదులమైన యా సౌందర్యమింపునింప
జూచి, కామ తమస్సులఁ జొక్కిచొక్కి
కలికినొక్కట బట్టుకో కడగిమించె.

ఒకడు నక్తంచరుఁడు వేరొకడు దివిజుఁ
డా యిరువు రొక్క మర్త్యలతాంగికొఱకు
కదనమున నేర్చి పేర్చిరి కడిమి మెఱయ
అందమొందైన ప్రాణసుమార్చితంబె.

ఒకరి ముష్టిఘాతముల, వేఱొకరి పాద
తాడనమ్ముల రాయిడిధ్వనుల కులికి
అసదుకొనసివో లేచి, అదవదపడి
కడల బేడిస చూపుల గాంచెనబల.

ఇది కలయొ నిక్కువమొ ఏర్పరింపరాక
ఆ విభీతవిలోచన యట్టె నిలిచె
వెఱపుతో; నా జగద్వీరు లురలిపడిరి
వికల శీర్షులై నెత్తు రోడికలుగట్ట.

పడిన విద్యాధరేంద్రుడా వనితనరసి
ఏమియో చెప్పగాఁ బోయి మోమువాల్చె,
"ఇతఁడె కానోపు నన్ని వనితలాన
ప్రేమ మైఁ దెచ్చి డించిన వినయమూర్తి.

వనితకోసమ్ము నిండు జీవముల వీడి
నారు నిట్టూర్పు రేకగా వీరు; ఘోర
భీషణాభీల నీరంధ్ర విపినసీమ
ఇందు హింసారి రంసు లెందేని గలరు.

ఎవడు కరగృహీతము సేయు, నెవడుకనుల
నొత్త నిలువెల్ల పులకించు; నుదయమందు
భావనాపాళి; అతడెపో ప్రణయమూర్తి
అతడెపో ఏడుగడ హైందవాంగనలకు

అనితలచి; తల్లిదండ్రుల నాత్మ నెంచి,
అంబికాపతి హృద్వేధినంజలించి
అమరమూర్తి నాత్మేశుగా మమతనెంచి
అగ్నిరాజించె యతనితో ననుగమించ.

4

ఆమె నేనై జనించితి; నస్మదీయ
హృదయనాథుఁడా విద్యాధరేంద్రమూర్తి;
ఎన్ని జన్మాంతరములైన నెనగకున్న
వారణాశిశు భవ్యసేవాఫలమ్ము.

కాశికాపురీ చిత్రాళి గాంచినంత
స్మృతికి వచ్చెను పూర్వజీవితపుగాథ
తరతరమ్ముల రాగబంధమ్ముగాని
ఒక్కనాటి రాగమ్ము గాదోయి నాథ!



వికసనము

సిద్ధేశ్వరచరిత్ర-కాకతీయులనుగూర్చిన కొన్ని విశేషాంశములు

శ్రీ కె. హెచ్. వి. శర్మ

ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీ రంజనముగారు శ్రీ సిద్ధేశ్వర చరిత్రము నిటీవల చక్కగా పరిష్కరించి ప్రకటించి, చరిత్రకారులందరికిని మహోపకారము గావించిరి ఇది కాసె సర్వప్ప యను వానిచే సుమారు పదునారవ శతాబ్దమున ద్విపద కావ్యముగ రచింపబడినది సర్వప్ప గొప్పకవిగాని మంచి చరిత్రకారుడు గాని కాడు ఆంధ్రుల చరిత్ర ముఖ్యముగ నోరుగల్లు రాజధానిగా పాలించిన కాకతిమహారాజులచరిత్రను వెనుక నేకామ్రనాథుఁడు వచించిన కథను తాను నేర్చిన విధమున దేశి కవిత్వమున రచియించవలెనను అభిమానము గలవాడు తన కాలమున వాడుకలో నుండు పుక్కిటి పురాణములు, కట్టు కథలనుకూడ చరిత్ర పౌర్వాపర్యము లేక ఇందు గూర్చిపెట్టినాడు వాటి నుండి అసలైన చరిత్రాంశములను కనుగొనుటయే మిక్కిలి కష్టము శ్రీ లక్ష్మీరంజనముగారు తమ సంపాదకీయమున ఆ విషయము లన్నింటిని కడు సమర్థతతో చర్చించి ఆంగ్లమున విపులమైన పీఠిక నొకదానిని చేర్చిరి నాకు దోచిన మరికొన్ని యంశముల నీ వ్యాసమున దెలుపగలను

ప్రథమాశ్వాసమున ప్రమథు లందఱిచే ప్రార్థించబడినవారై పరమ శివుడు సిద్ధేశ్వరుడుగను, పార్వతీదేవి పద్మాక్షిగను యవతరించి హనుమకొండ సమీపమున గల గుట్టలపై ఈ సిద్ధ దంపతుల వెలయుట వర్ణించబడినది ప్రమథులను గూడ భక్తజనులై యచ్చటనె యుండుడని ఆ పురాణ దంపతు లానతిచ్చిరట

> పరమసంతోషులై పార్వతీశ్వరులు
> కరుణచేఁ బ్రమథులఁ గనుఁగొని "మీరు
> నచట భక్తజనంబులై యుండుఁడేము
> మదితాకృతుల నట్ల యుండుదు" మనుచు
> నప్పుడు సిద్ధేశుఁడయ్యె శంకరుఁడు
> చెప్పి పార్వతి దాను సిద్ధేశు నెదుర
> నుర్విలోపలఁ దాను నొప్పుల కుప్ప
> పార్వతి యెంతయుఁ బద్మాక్షి యయ్యె
> ప్రమథ వర్గంబులు భక్తులై రచట"

హనుమకొండలో నిప్పటికిని పద్మాక్షీసిద్ధేశ్వరుల గుట్టలు రెండును గలవు సిద్ధేశ్వర గుట్టపైన శిథిలమైన సిద్ధేశ్వరాలయము, లింగము, బావి మున్నగునవి గాన్పించును ఆ యాలయమున కెదురుగా శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు వెనుక భారతిలో ప్రకటించిన అపూర్వ శాసనకావ్యము చెక్కబడి యున్నది ఆలయము వెనక మరియొక శిలపై భైరవుని బోలి బహుశః సిద్ధేశ్వరుడే గావచ్చును చెక్కబడిగలదు ఈ సిద్ధేశ్వరుని గుట్ట ప్రక్కనే పద్మాక్షీదేవి గుట్టయు నున్నది కొండపైన పద్మాక్షి దేవాలయము, క్రిందుగ నొక కోనేరు పద్మాక్షి గుండమను పేర నిప్పటికిని గలవు ఈ గుట్టపై ననేక జైనతీర్థంకరుల విగ్రహము లుండుట, పై దేవాలయములోని యక్ష, యక్షిణీ విగ్రహములు, సమీపమున గల కన్నడ శాసనములో కాకతి రెండవ ప్రోలరాజు కాలమున నాతని మంత్రి భార్య మైలమ కడలాలయమున కిచ్చిన దానప్రశంసను బట్టి పద్మాక్షీదేవి జైన దేవతగ గుర్తించబడినది

కాకతీయుల శాసనములలో నెచ్చటను ఈ సిద్ధేశ్వర ప్రశంస లేదనియు, కాకతి సామ్రాజ్య మంతమొందిన ఏ రెండు, మూడు శతాబ్దముల తదుపరి ఏకామ్రనాథుఁడను జైనసిద్ధుడు మొదటి మారీ సిద్ధేశ్వరుని కల్పించి వ్రాసినట్లు చాలమంది అభిప్రాయము

ఏకామ్రనాథ విరచితమగు ప్రతాపచరిత్ర, సర్వప్ప సిద్ధేశ్వర చరిత్ర, కూచిమంచి జగ్గకవి సోమదేవరాజీయము వరుసగా నొకదాని కొకటి పుత్రికలు కాకతి ప్రతాపరుద్రుడు, యాతని పూర్వులను గూర్చిన ప్రధాన విషయ మగుటచే తనగ్రంథమునకు ప్రతాపచరిత్ర యని ఏకామ్రనాథుడూ, శ్రీ సిద్ధేశ్వర మహాత్మ్యమున వెలసి యాతని కరుణన పెంపొందిన సామ్రాజ్య మగుటచే సిద్ధేశ్వర చరిత్రమని కాసె సర్వప్పయు, సోమదేవ రాజు సంతతివారగు కాకతీయులవర్ణన గాన సోమదేవరాజీయమని జగ్గకవియు తమ తమ గ్రంథములకు నామము లిడినట్లు దెలియుచున్నది. ఏకామ్రనాథ విరచితమైన ప్రతాపచరిత్రములో పద్మాక్షీ, సిద్ధేశ్వరుల యవతరణ మింత విపులముగ వర్ణించబడి యుండలేదు సిద్ధేశ్వర చరిత్రమున ప్రమథులు పార్వతీపరమేశ్వరులను పద్మాక్షీ సిద్ధేశ్వరులుగ యవతరించమని ప్రార్థించుట మున్నగునవి కొంతవరకు సర్వప్ప కల్పితమే కావచ్చును.

కాకతిరాజుల శాసనములలో సిద్ధేశ్వరుని పేరింతవఱకు కాన్పించకుండుట వాస్తవమే యైనను వారి కాలముననే ఈ సిద్ధేశ్వరుఁడవతరించినట్లు శాసన, వాఙ్మయ ప్రామాణ్యము చాల గలదు హనుమకొండలోని సిద్ధేశ్వరుని గుట్ట కనతిదూరముననే గల మరియొకగుట్టపై బ్రహ్మాండమైన చక్కని శాసన కావ్య మొకటి తెలుగు లిపిలో చెక్కబడి యున్నది. ఒకానొక సుందర సిద్ధదంపతుల పరస్పరాలోకనము, శృంగార చేష్టలు, వియోగము, విప్రలంభము, వివాహము, సంభోగము మున్నగు అత్యద్భుత వర్ణనలతో గూడిన శృంగారరసభరితమైన చక్కని కావ్య మది దానిని రచించిన కవి నృసింహుడట ఈతని శాసనములు కొన్ని వరంగల్లు కోటలోని శంభుని గుడివద్ద కలవు అందొకదానిని బట్టి ఈతడు రెండవ ప్రతాపరుద్రుని యాస్థానము నలంకరించి యుండెనని స్పష్టమగు చున్నది కాదంబరీనాటకకర్త మరియు భాస్కర రామాయణ యుద్ధకాండ శ్వాసాంత గద్యములో పేర్కొనబడిన నృసింహుఁడీతడే యని వెనుక గుర్తించడ మైనది కాకతి ద్వితీయ ప్రతాపరుద్రుని యాస్థానము లోనివాడగు నీతడు సిద్ధదంపతులను గూర్చిన లపూర్వ కావ్యమును రచియించుటను బట్టి కాకతీయుల నాటికే సిద్ధేశ్వరుడవతరించినట్లు స్పష్టము విద్యానాథ విరచితమైన ప్రతాపరుద్రీయ నాటక ప్రకరణమున ప్రతాపరుద్రుని యభిషేకానంతర మపరవిష్ణువువలెనున్న యాతనిని గాంచి పురోహితులు పలికిన శ్లోకము చూడుడు.

"చిహ్నిన్యస్య పదాబ్జయోః పిశునయం త్ర్యర్థీశ్వరోపాస్యతాం
పాణీ సూచయత స్వచాపకులిశౌ ఉద్వాహ లీలాం భువః
నేత్రే శారదపుండరీకరుచినీ లీలావతారం హరే
రాఖ్యా తస్త్వదితీహ సిద్ధ వచనం ప్రత్యక్ష మీక్షామహే."

రత్నాపణ వ్యాఖ్యానమున కుమారస్వామి సోమయాజిట్లు దెల్పినాడు. "....శారద పుండరీకరుచినీ నేత్రే పుండరీకాక్షావతారమాఖ్యాతః కథయతః ఇతి యత్పూర్వోక్తం సిద్ధస్య కస్యచి దనాగత విదః పురుషస్య వచన మధునా ప్రత్యక్ష మీక్షామహే" కాకతీయుల నాటికే ఈ సిద్ధుని మాహాత్మ్య మందరికిని దెలియుననుట కిదియును నిదర్శనము కాగలదు. నరసింహుడు కావ్యరూపమున వర్ణించిన సిద్ధ దంపతులను గూర్చియే ఏకామ్రనాథుడు కొద్దిగ పేర్కొనియుండును. నర్సప్ప దానిని పెంచి చక్కని పురాణ పద్ధతిలో శివ పార్వతీ కల్యాణముతో గూడ తన ప్రథమాశ్వాసమున చేర్చి యుండును

ద్వితీయాశ్వాసములోని కథామూలము నారంభించునపుడు నర్సప్ప ఇట్లు దెల్పినాడు :

"శ్రీ మహాదేవుని జిన్మయాత్మకుని
నా మహేశానుని నఖిల లోకేశు
శ్రీ శుభలింగంబు శ్రీ హన్మకొండ
పాశమోచను సిద్ధపతి మతిఁ దల చి
వేగంబ తన కనురాగంబుగాఁగ
నాగనాథుని యడ్గులకు మొక్కి చాల
యతని యనుమతి నేకామ్రనాథుండు
మతిమీఱఁ జెప్పిన కత వచించెదను."

దీనినిబట్టి ప్రథమాశ్వాసములోని శివపార్వతీ కల్యాణము శ్రీ సిద్ధేశ్వరావతరణము మున్నగునవి గొంతవఱకు దన కల్పితమే నని గూడ తెలియుచున్నది. నాగనాథుని యడుగులకు మ్రొక్కి యాతని యనుమతిని వెనుక నేకామ్రనాథుడు చెప్పిన కాకతి రాజుల కథను వచించెద ననినాడు. తాను వ్రాసిన కాకతిరాజుల చరిత్ర యంతయు నేకామ్రనాథుడు పూర్వము రచించిన కథ ననుసరించినదే నని స్పష్టము ఏకామ్రనాథుడు ప్రతాపచరిత్రను రచియించుటనుబట్టి యాతడు ద్వితీయప్రతాపరుద్రుని యాస్థానము లోనివాడని కాకతీయ సంచికయందు తెల్పబడినది కాని ఇది సరికాదు నర్సప్ప ఏకామ్రనాథుని గురువుగ నొక నాగనాథుని పేర్కొనినాడు వరంగల్లుజిల్లా అయిన పోలి లోని రేచర్లవంశజుడగు అనపోత నాయకుని శాసన మొకదానిలో కౌశికగోత్రజుడు పశుపతిపండితుని పుత్రుడగు సుప్రసిద్ధ నాగనాథకవి యొకడు గలడు. ఆ శాసన కాలమునుబట్టి యాతడు క్రీస్తుశకము 1369 ప్రాంతము కాకతి ద్వితీయ ప్రతాపరుద్రుని యనంతరపు వాడని స్పష్టము ఏకామ్రనాథునిగురువుగ ప్రశంసించబడిన నాగనాథుడీతడే యైనచో నేకామ్రనాథుడు ప్రతాపరుద్రుని యాస్థానమున నుండుట యసంభవము. బహుశః ఆతడు కాకతి సామ్రాజ్యమంతమొందిన పిదప సుమారు పదినేనవ శతాబ్ద్యారంభమున నుండెనని తలంచవచ్చును

ఓరుగంటి కోటలో నుత్తరద్వారమునకు గల శాసన మొకదానిలో ననేక శాస్త్ర గ్రంథములను నంతరించినట్టియు, హ్రాద్గంధి గన్దచ్ఛిదుడగు నృసింహకవిచే నొక్క దినమున కాకతీయ చరిత్రమునం దెనిమిది సర్గలు రచించబడినట్లున్నది

"శాస్త్ర గ్రంథకృతా నృసింహ కృతినా హ్రాద్గంధి గన్దచ్ఛి దా
అహ్నా కేన హి కాకతీయ చరితే తేనాష్ట శిష్టాః కృతాః."

ఈ నృసింహకవి పైన వివరించిన సిద్ధ దంపతుల కావ్యమును రచించినవాడు, రెండవ ప్రతాపరుద్రుని యాస్థానములోనివాడు పై శాసన శ్లోకమును బట్టి కాకతీయ చరిత్రమును మొట్టమొదట వ్రాసినవా డీతడే యని తెలియుచున్నది సమకాలికు డగుటచే నీతని గ్రంథ మెంత యేని చరిత్రకారుల కుపయోగించెడిది మనదురదృష్టముచే నింతవఱ కది లభ్యము కాలేదు ఈతని కాకతీయ చరిత్రమునకు, ప్రతాప, సిద్ధేశ్వర చరిత్రముల కేమి యైన పోలిక లుండునేమో తెలియదు.

శ్రీశైలప్రాంతారణ్య ప్రదేశములనుండి ఎఱుకు దేవరాజు అను శూరుడు వచ్చి హనుమాద్రి నాక్రమించి రాజ్యము చేయసాగెనట. వాని పుత్రులు అనుమడు, కొండడు, గర్గశేయు డనువారు వరుసగా నూటయాభై సంవత్సరములు బాలించి గతించిన పిదప పద్మాక్షీదేవి వరప్రసాదమున కాకతి మహారాజులు ఏకశిలానగరమును నిర్మించి ఘన వైభవమున బాలించిరని గలదు ఎఱుకదేవరాజు కుమారులగు అనుమడు, కొండడు యనువారి పేర ననుమకొండ పట్టణము నిర్మితమైన దను నైతిహ్య మిప్పటికిని స్థానికముగ నున్నది

కాకతీయులు చంద్రవంశమువారని అత్రి, సుధాకర, బుధ, పురూరవ, భరత, పాండవ, పరీక్షిత్తు, జనమేజయ, శతానీక, క్షేమకులు పేర్కొనబడి వారివంశమునందు మూలపురుషుడగు సోమదేవరాజు జన్మించినట్లు గలదు గణపతిదేవుని పాకాల, పాలంపేట మున్నగు శాసనములలో దీనికి విరుద్ధముగ వారు సూర్యవంశజులని, మనువు, ఇక్ష్వాక, మాంధాత, సగర, భగీరథ, దశరథ, శ్రీరాములు వర్ణించబడి వారివంశమున నుద్భవించి కరికాలచోళ, దుర్జయుల యనంతరము కొంతకాలమునకు కాకతి ప్రోలరాజు జన్మించినట్లున్నది. విద్యానాథుడు ప్రతాపరుద్రీయమున కాకతీయ వంశమును గూర్చి అత్యర్కేందుకులమని, సూర్యసోమాన్వయమని వచించినాడు వీనినిబట్టి కాకతీయుల వంశమును గూర్చిన వాదము లిప్పటికిని సమసిపోలేదు గణపతిదేవుని పూర్వుల శాసనములలో నెచ్చట వారు సూర్య లేక చంద్రవంశపు క్షత్రియులని చెప్పబడలేదు సరిగదా వారు దుర్జయుని సంతతివారని పేర్కొనబడిరి శాసనములనుబట్టి దుర్జయులు సూర్యవంశపు క్షత్రియులలోను, చతుర్థవంశజులలో గూడ గలరని తెలియుచున్నది బేత, ప్రోల మున్నగువారి శాసనములలో కేవల దుర్జయుని సంతతివారని, మరియు వారికి చతుర్థవంశజులు, దుర్జయుని సంతతివారగు విర్యాల, మల్యాల మున్నగు వంశజులతో సంబంధ బాంధవ్యములు తెలుపబడినవి దీనినిబట్టి ప్రథమమున వీరు చతుర్థవంశజులేయైనను కాలక్రమమున స్వంతరాజ్యమును నెలకొల్పి ఆంధ్రదేశము నంతటి నేకచ్ఛత్రాధిపత్యముగ నేలునప్పుడు ఇతర యనేక రాజవంశములతో సంబంధము లేర్పడి వీరుగూడా క్షత్రియులుగానే పరిగణించబడియుందురు దాని కనుగుణముగ శాసన, వాఙ్మయ కవులు వీరికి క్షత్రియత్వము నారోపించి వంశవృక్షము నొకదానిని సృష్టించి సూర్యవంశమునకో, చంద్రవంశమునకో లేక రెండింటిని చేర్చి వర్ణించుట పరిపాటియైనది

కందారపతియగు సోమదేవరాజునకు కటకబల్లహునకు అవులమంద మేపుట మూలమున జరిగిన యుద్ధవర్ణన కాటమరాజు కథను, అట్లే ఆ యుద్ధములలో సోమదేవరాజు మరణించగా గర్భిణియగు నాతని భార్య సిరియాలదేవి యనుమకొండకు పారిపోవుట, మాధవశర్మ యను బ్రాహ్మణోత్తముడామెను గాపాడుట, ఆమెకు మాధవవర్మయను బాలు డుదయించి పద్మాక్షీదేవి వరప్రసాదమున రాజ్యలాభము వడసె ననునవి చాళుక్యుల మూలపురుషుని గూర్చిన కథలను తలపించుచున్నవి

కాకతీయుల మూలపురుషుడగు మాధవవర్మకు ప్రత్యక్షమై రాజ్యమును ప్రసాదించిన పద్మాక్షీదేవి యిట్లు వర్ణించబడినది.

" కాళి భయంకరాకార
దేవభూతవ్రాత దేదీప్యమాన

బేతాళ శాకినీ ప్రేత పరివార
వ్రాత రాక్షస యక్షవర పరివృతయు
నగుచున్న పద్మాక్షి .. ... "

ఈమెయే వెనుక పార్వతి యవతారమని చెప్పబడినది విద్యానాధుడు ప్రతాపరుద్రీయమున బహుశః ఈమెను గూర్చియే "కాకతీయ కుల దుర్గా దేవీ సమారాధనేన విజయ ప్రస్థానమంగళం కృత్వా" యనియు, రత్నాపణమునందు కుమారస్వామి సోమయాజి "కాకతిర్నామ దుర్గా శక్తి రేకశిలా నగరేశ్వరాణాం కులదేవతా" యని దెల్పియుందురు. తదుపరి విజయనగర శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడు నోరుగల్లునుండి తురుష్కులను పారద్రోలి స్వతంత్రముగ కొంతకాలము పరిపాలించిన బోయవంశజుడగు చిత్తాపఖానను సీతాపతిరాజా శంభుని గుడివద్ద గల శాసనమున నీమె శుంభ, నిశుంభ దానవ వంశనిర్మూలనకర్త్రి, కాకతి సామ్రాజ్య పీఠమునకు లక్ష్మి ప్రదమ్మైనట్టిదియు ననాది జగన్మాత యని వర్ణించబడెను

"దేవీ శుంభనిశుంభదానవ కుల ప్రోన్మూలనో జ్జృంభణా
రంభా కాకతిరాజ్యపీఠకమలానాదిర్జగన్మాతృకా "

దీనినిబట్టి కాకతీయుల కుపాస్య యైన దేవత కాకతి లేక పద్మాక్షి కేవలము దుర్గాపరమేశ్వరియే యని తెలియుచున్నది.

మాధవవర్మ పుత్రుడు, పద్మసేనుడు; పౌత్రుడు వెన్నమరాజట. వీరినిగూర్చి మనకు శాసనాధారము లేమియు లేవు. ఆ వెన్నమరాజు పుత్రుడుగ పోరంకి వెన్నమరా జిట్లు వర్ణించబడెను.

"వెనుకొని పోరంకి వెన్నమరాజా
పట్టాభిషిక్తుండై పరఁగ రాజ్యంబు
మట్టుగాఁ జేయుచు మరలబడ్డట్టి
కటకబల్లహుఁ ద్రుంచి గాదిలి వాని
కటకంబునకు రాజుఁగాఁ జేసి సుతుని
చేత సువర్ణంబు చేకొని కోట
లాతత బహుకీర్తు లంది దిగ్విజయ
మాతలి రాజుల నందఱి గెలిచి
మతిమీఱఁ బురముకు మగిడి తా వచ్చి
డెబ్బది మూడేండ్లు తెలిఁ గొప్ప భూమి
గబ్బునఁదా నేలికొని పెండ్లిగుండ
రాజుకు రాజ్యంబు రమణగాఁ గట్టి
తేజుఁడై పోరంకి దేవ వెన్నుండు
రాజు దా శివలోక తేజంబు నొందె "

గూడూరుశాసనమున నీతఁడే యనుపమ దుర్జయాన్వయమున ననేకుల రాజనందనుల తర్వాత నతిప్రసిద్ధుఁడై విరోధిమండలికి వెన్నుఁడు వలె పోరంటి వెన్ను డుద్భవించెనని చెప్పబడినది

"అనుపమ దుర్జయాన్వయ సుధాబ్ధి ననేకులు రాజనందనుల్
చనిన బోలింటి వెన్నఁడను సంభవుఁడయ్యె నతి ప్రసిద్ధుఁడై
వినత విరోధి మండలిక వెన్నుఁడు వెన్నుఁడ వోలె వానికిన్
ఘనుఁడగు నెఱ్ఱి భూపతి జగద్వినుతుం డుదయించెఁ గీర్తితోన్"

కాకతి గణపతిదేవుని కొలవెన్ను తామ్రశాసనమున గూడ నీ పోరంటి వెన్నమరాజు ప్రశంస గలదు

"దానే సూర్యసుతం ప్రతాపవిభవే శ్రీరామచంద్రం నృపం
ధైర్యే మేరు మహీధరం హిమకరం కాంత్యాం రవిం తేజసి
ఐశ్వర్యే ప్రమథాధిపం యమసుతం ధర్మే బలే వాయుజం
రూపే పంచశరం విదుః పోరంటి వెన్నక్ష్మాపతిం పండితాః"

పోరంకి వెన్నమరాజు పుత్రుఁడుగ పెండ్లిగుండమరాజు పేర్కొనబడెను వేంగి చాళుక్యరాజగు రెండవ అమ్మరాజ విజయాదిత్యుని మాగల్లు తామ్రశాసనమున పేర్కొనబడిన కాకర్త్యగుండన ఈతడే నని చరిత్రకారులు యూహించిరి. ఈ గుండరాజునకు యెఱుక దేవరాజని పుత్రుడొకడు గలడు. ఆతడు మిక్కిలి చిన్నవా డగుటచే వాని మేనత్త కుంతల దేవి సామ్రాజ్యంబు తా నేలుచుండి గుజరాష్ట్ర, మహారాష్ట్ర, ఘూర్జర, యవన రాజులపై దండెత్తి వారి నందఱిని జయించి యపారధనములు, అప్పనంబులు గొని జయస్తంభములు వేయించి యనుమకొండకు తిరిగి వచ్చు నంతలో బలాధికుడైన గటకబల్లహుడు పైబడుట యామె గంగిదేవుని సాయమున వానిని జంపి వాని పుత్రునట నిల్పి యెప్పటివలె మరల కప్పములను పొందెనని వర్ణించబడెను.

"ఎరుక దేవరరాజా డెంతయుఁ జిన్న
పరబాలకుఁడు గాఁగ వాని మేనత్త
కుంతలాదేవన సంతతధర్మ
పంతన చతురంత వార యానాది
కాంత దిగంత విశ్రాంత యెంతయును
నంత సామ్రాజ్యంబు దా నేలుచుండి
గుజరాష్ట్ర మహారాష్ట్ర ఘూర్జర యవన
రాజులపై దొడ్డరయమున వెడలి
వారి నోడించి యపారిత ధనము
లప్పనంబులు గొని యా జయస్తంభ
మొప్పఁగ వేయించి యొగి నన్మకొండ
విప్పగు వీధుల వేంచేసి మగిడి
చనుదెంచు నంతలో సరసత నపుడు
ఘనబలాధికుఁడైన కటకబల్లహుఁడు
మఱలంగఁ బడ్డఁ నా మనుజేశు నపుడు
కరిహయ భటులతో ఘనబలముఁ గూర్చి
రాణి గంగిదేవు రాణువునకును
నాణెంబుగా దళనాయకుఁ జేసి
పంపుటయును వాఁడు బల్లహుతోడ
చంపి దావుదుచేసి ? జగడంబు లపుడు
ఆరు నెలలు చేసి యాతని ద్రుంచి
బోరున నట వాని పుత్రుని నిలిపి
యెప్పటివలెఁ దమ యప్పనంబులును
కుప్పలుగాఁ దెచ్చి కుంతలదేవి
కిచ్చినంతట మెచ్చి పొచ్చెంబు లేక
పందొమ్మిదేండ్లు దా భరమూని రాజ్య
మందు నెరుకుదేవు కపుడు పట్టంబు
గట్టి తానును శివుఁ గలయంగఁ జనియె "

పైనుదహరించిన గూడూరు శాసనములోని ఈ క్రింది పద్యములో ఈవిషయమే వివరించబడినట్లు గాన్పించును

"అరుదగునట్టి ఎఱ్ఱినృపు నంగ నగామమసాని యొకమే
ల్గరుడని బేతభూవిభుని గాకతివల్లభు బింసవాని దా
బరగంగ జేతబట్టె ఘనుబల్లనవాయని యోగిజొచ్చి ఖా

స్కర విభు చక్రవర్తిగని కాకతి నిల్పుట గోటి సేయదే?
కారక కాలుడై పడసె గాడయ నాయకు జంపి సూర ద
వ్వేలుపుగొండ రవ్వనృపు వేలుపు గొండననిల్పి వానిచే
మేలుగ మూడ ముప్పయిని మేలుగ నేరెడు బోటి పాడునుం
మేలుగ ఓకు మావిడులు మేలుగ రెండెయరాజా సంగడుల్ ''

ఈ పద్యములకర్థము సరిగాలేదని పండితులు చరిత్రాకారులు యందరి పదములనుకూర్చి, మార్చి తలకొక విధమున తలంచియున్నారు నాకుతోచిన యర్థమేమన విరియాల ఎఱ్ఱనృపునిభార్య కామసాని కాకతి వల్లభుడగు ఆ పిన్న బేతరాజుని చేరదీసి భాస్కరవిభుని (సూరుడనువానిని) గనుటచే ఘనుడగు బల్లవ రాయునితో ప్రతిజ్ఞచేసి జయించి కాకతిరాజ వంశమును నిల్పుటకోటికాదా? రెండవ పద్యమున పై విరియాల కామాసాని, ఎఱ్ఱనృపుల పుత్రుడగు సూరుడు కారకకాలుడై కాటయ నాయకుని జంపి వేలుకొండ రవ్వనృపుని వేలువు కొండనే నిల్పి వానిచే నేరుడుబోటిపాడు, ఓకుమావిడులు, రెండెయరాజా సంగడులు మున్నగునవి మేలుగ పడసెను ఇందలి సూరడే పై పద్యమున భాస్కర విభువని చెప్పబడినాడు ఈపద్యములోని బొట్టు, పిన్న, రవ్వ యన్నియు కాకతి బేతరాజునకు విశేషణములు కామసాని ప్రతిజ్ఞచేసిన ఘనుడగు పల్లవ రాయడే క్రిందిపద్యమున ఆమెపుత్రుడు సూరుడు చంపిన కాడయనాయకుడు. దీనినిబట్టి బాలుడగు కాకతి మొదటి బేతరాజు ప్రబలమగు శత్రువులచే నెదిరించబడి చాల అసహాయస్థితిలో నుండగా విరియాల సూరుడు తానండగా నుండి యాతని శత్రువులను జంపి మరల వానిని రాజ్యమునందు సుస్థిరముగ నెలకొల్పెనని తెలియుచున్నది ఇట్టిసహాయము చేయుటకుగాను కాకతీయుల కును విరియాలవారికిని యెద్దియైన సంబంధము యుండవలెనుగదా! గూడూరుశాసనమున విరియాల వంశజుల మూలపురుషుడుగ పోరంటి వెన్నడు చెప్పబడెను గణపతిదేవుని కోలవెన్న తామ్రశాసనమున, ప్రతాప, సిద్దే శ్వర చరిత్రములయందు పోరంటి లేక పొలికి వెన్నమరాజు కాకతీయ వంశ మూలపురుషుడుగా వర్ణించబడెను ఇట్లు కాకతీయులు, విరియాలురుకూడ ఈ పోరంటి వెన్నమరాజునే తమతమ మూలపురుషునిగ బేర్కొనుటను బట్టి వా రిరువురకును గల నికట బంధుత్వము స్పష్టమగుచున్నది ఈ యంశ ములనుబట్టి సిద్ధేశ్వరచరిత్రములోని కుంతలదేవియే విరియాల కామసాని యనియు యెఱుక దేవరాజే మొదటి బేతరాజని యూహించవచ్చును

గూడూరు శాసనమున ''వేలుపుగొండ రవ్వనృపు వేలుపుగొండన నిల్పి'' యనుటచే కాకతిమొదటిబేతరాజు రాజధాని నగరము వేలుపుకొండ యనగా నిప్పటి వరంగలు తాలూకాలోని జఫర్‌ఘడ్ లేక సారుగుట్టయని దెలియుచున్నది ఖాజీపేట శాసనమునుబట్టి రెండవబేతరాజు కాలమున ననుమకొండ విషయ మును బాలించుటకు పొందినప్పుడు అనుమకొండ రాజధానియై యుండును. గణపతిదేవునికాలమున మరల యనుమకొండనుండి ఓరుగల్లునకు మార్చ బడినది

సిద్ధేశ్వరచరిత్రమున పేర్కొనబడిన భువనైకమల్లుడు త్రిభువనమల్లుడు వరుసగా మొదటిప్రోలరాజు, ఆతనిపుత్రుడు రెండవబేతరాజు అని గుర్తించిరి కాని ఖాజీపేట శాసనము, రుద్రుని యనుమకొండశాసనములనుచబట్టి త్రిభువన మల్లుడు రెండవబేతరాజు కాడనియు నాతనిపుత్రుడగు దుర్గరాజనియు, ఆత్రిభువనమల్లదుర్గరాజు పుత్రుడే రెండవ ప్రోలరాజనియు తెలియుచున్నది బహుశః సిద్ధేశ్వర చరిత్రమున నొక్కపురుషాంతరము విడిచి పెట్టబడినట్లున్నది

రెండవ ప్రోలరాజు స్వతంత్ర కాకతి సామ్రాజ్యమును స్థాపించినవాడు. ఈతడు కట్టించినవిగ వర్ణించబడిన శివాలయ, తటాకాదులు శాసనములను బట్టియు విదితమగుచున్నవి. కాళేశ్వర వాసులైన రామారణ్యుల గూర్చి ప్రథమమున నీతనికాలమున ప్రశంసించబడినది ఖాజీపేట, మాదిరెడ్డికుంట, వేయిస్తంభాలగుడి శాసనములలో పేర్కొనబడిన శ్రీ శైల మల్లికార్జున సురా చార్యులు, కాళాముఖ శైవసంప్రదాయమునకు చెందిన సుప్రసిద్ధ రామేశ్వర పండితు డీతడే నని స్పష్టము ఈ ప్రోలరాజునకు స్పర్శవేది లింగ వృత్తాంతమొకటి కల్పించబడినది ఇది దొంతి అల్లాడరెడ్డికి లభించిన నీచలోహములను బంగారముగ మార్చు పరుసవేది వృత్తాంతము వంటిది

ప్రోలునకు గాన్పించిన ఆ స్పర్శవేదిలింగమూర్తి యిట్లు వర్ణింప బడెను.

" . . . . దేదీప్య
మానతేజస్ఫూర్తి మహనీయ దివ్య
మానవ శరచ్చంద్ర మందారకంద
సూన సితాంభోజ సుందరాపార
తారహార పటీర ధాళధళ్య ప్ర
సార విస్ఫార కాంతుల నరస మగుచు
దివ్య మంగళమూర్తి తేజః ప్రపూర్తి
నవ్య పాండురమూర్తి నాలింగమూర్తి
బరుసవేది స్ఫూర్తి భక్తహితార్థి "

ఇదియే యాతనిచే ప్రతిష్ఠించబడి తదుపరి కాకతీయు లందరికిని కులదైవ మనబడు శ్రీ స్వయం భూదేవుడు ఆతని పుత్రుడు మొదటిరుద్ర దేవుని శాసనములలో 'శ్రీ స్వయంభూదేవ శ్రీపాద పద్మారాధక' యని గలదు. విద్యానాథుడు ప్రతాపరుద్రీయమున పలుమారు శ్రీ స్వయంభూదేవుని వారి కులస్వామిగ పేర్కొనుటయేగాక యాతడే కాకతిసామ్రాజ్యమంతటికిని మహారాజు లేక సార్వభౌముడనియు కాకతిరాజు లాతని సామంతులు మాత్రమే నని వచించినాడు

ప్రతాపరుద్ర —

''స్వయంభూస్తాత ఇత్యేతా వీశ్వరౌ దివ్యమానుషౌ
తయో రన్యతరో రాజా యువరాజోఽస్మి సర్వథా ''

మంత్రిణః—రాజపుత్ర! సాధారణోఽయం వినయః కాకతీశ్వరాణాం స్వయం భుని మహారాజే.

పరిజనః—కాకతీయకుల స్థవిర స్థత్రభవాన్ స్వయంభూదేవో ధురం ధారయతు. రాజపుత్రః పునః రాజ్యశ్రియ మంకే ఆరోపయతు

రత్నాపణ వ్యాఖ్యానమున కుమారస్వామిసోమయాజి కూడ అట్లే తెల్పినాడు

''తర్హి తావత్స్వయంభూదేవఏవ మహారాజోఽస్తుః పూర్వవ
దేవాహం యువరాజ ఏవేతి వచన భంగ్యా రాజ్య మంగీకరోతి ''

దీనికి తగినట్లు కాకతిరాజులశాసనములలో ''శ్రీ స్వయం భూదేవ దివ్య శ్రీపాద పద్మారాధకు''లని చెప్పబడినది ఇది పశ్చిమ చాళుక్యుల శాసన ములలో వారి సామంతులు, రాజకుమారులు వర్ణించబడు ''శ్రీమత్త్రిభువన మల్లదేవర దివ్య శ్రీపాద పద్మారాధక'' ము వంటిది ఇట్టి యాచారము పూర్వపు రాజవంశములలో గొన్నిట గాన్పించును తూర్పు గాంగ వంశపు రాజులు, వారి యనంతరము సింహాసనము నధిష్టించి అద్వితీయ బల పరా క్రమముచే నాటి హిందూదేశ సార్వభౌము లందరిలో నగ్రగణ్యుడైన గజ పతి కపిలేశ్వరుడు గూడ వారు పూరి జగన్నాథదేవుని సామంతు లనియు, నాతని దివ్యశ్రీపాద పద్మారాధకులని వారి శాసనములలో పేర్కొనిరి విజయ నగర రాజుల తామ్రశాసనములో చివర గాన్పించు 'శ్రీ విరూపాక్ష' కూడ ఇటువంటిదే

శాసనములలో దఱుచు గాన్పించు ప్రోలరాజు పుత్రులు రుద్ర, మహా దేవరాజు మాత్రమే బేర్కొనబడిరి అందు రుద్రుడు దుర్ముహూర్తమున జన్మించినట్లు, మహదేవరాజునకు మహాశ్వేతరోగము కలదని వర్ణించ

బడెను రుద్రుడు తండ్రిని చంపిన గాథ కేవలము కల్పితమే కావచ్చును. బహుశః ప్రోలుడు దీర్ఘకాలము పాలించుటచే తండ్రి కొడుకుల మధ్య నేర్పడ్డ యేదైన వివాదము సంభవించెనేమో! తండ్రిని చంపిన పాపమును బాపు కొనుటకు రుద్రుడు బ్రాహ్మణులను గాశికి పంపుట, వారిచే గంగాజలముల స్నానము, నైవేద్యము, పితృతర్పణములు చేయించెనని గలదు.

"నూర్వురు బ్రాహ్మల వేర్వేర పిలిచి
సర్వ సౌభాగ్యంబు సంప్రీతి నిచ్చి
కాశికిఁబంపించెఁ గాశి విశ్వేశు
వాసి గంగాంబులఁ జేసి మజ్జనము
లోసి పాపము లట్టుఁ బాసి చనంగఁ
జేసి నైవేద్యంబుఁ జేసి తర్పణము
జేసిరి పితృసమర్పణముగా ద్విజులు"

పితృదేవతల సంతర్పణార్థము కొంతమంది బ్రాహ్మణులను నిజముగ నీతడు కాశి, గయాది క్షేత్రములకు పంపియుండును గయలో దొరకిన రుద్రదేవుని శాసన మిందులకు తార్కాణము కాగలదు

రుద్రదేవుని పుత్రుడు గణపతి యని సిద్ధేశ్వరచరిత్రమున చెప్ప బడినది గణపతిదేవుని ఉప్పరపల్లి శాసనమున నాతడు రుద్రుని పుత్రు డనియే గలదు కాని గణపతిదేవుని, ఆతని సంతతివారి తదితర శాసనము లన్నిట నాతడు రుద్రుని తమ్ముడగు మహదేవరాజు, బయ్యమాంబల పుత్రు డనియే స్పష్టముగ నున్నది రుద్రదేవుడు తనకు సంతానము లేకపోవుటచే బహుశః తమ్ముని పుత్రుడగు గణపతినే వారసునిగా భావించి చిన్నతనము నుండియు అభిమానముతో పెంచియుండవలెను

రుద్రుడు తన తండ్రిని చంపి రాజ్యమునకు వచ్చెనని వర్ణించినట్లే మహదేవరాజు అన్నను జంపి రాజ్యమునకు రాదలంచెనని చెప్పబడినది హేమాద్రి వ్రతఖండమునుబట్టి రుద్రదేవరాజు జైతుగి చేతిలో మరణించినట్లు స్పష్టము.

త్రిలింగాధిపతేః యశోర్పివశనం రుద్రస్య రౌద్రాకృతేః
కృత్వా పూరుషమేధ యజ్ఞ విధినా లబ్ధ స్త్రిలోకీ జయః

రుద్రుని యనంతర మాతని తమ్ముడు మహదేవరాజు మూడేండ్లు పాలించినట్లు గలదు కుందవరము మున్నగు ననేక శాసనములలో గూడ నాతడు కొద్దికాలము రాజ్యము పరిపాలించినట్లే యున్నది.

తస్మా దనంతరం తస్య మహాదేవో మహీపతిః
అనుజో మనుజాకార మహాదేవో మహీమధాత్

శంభునిగుడివద్ద గల శాసన మొకదానిలో నీతడు దుర్లభము, సకల సమ్మత సంపదాఢ్యమునైన చతురన్త ధరాధిపత్యమును చిరకాలమునకు పొంది నప్పటికి దానిని తృణముగ భావించి సాంబశివుని శ్రీపాదపద్మ పరిపూజన తత్పరుడాయెనని యున్నది

లబ్ధ్వా చిరాయ చతురన్త ధరాధిపత్యం
యోదుర్లభం సకల సమ్మత సంపదాఢ్యం
మత్వా తృణాయ తదశేష మముష్య శంభోః
శ్రీపాదపద్మ పరిపూజన తత్పరోభూత్.

అట్టి ఈతడు రాజ్యమునకై అన్నను చంపెననుట తలంచరాదిగా నున్నది

మహదేవుని యనంతరము గణపతిదేవుడు రాజయ్యెను. ఓరుగంటికి రాతికోట కట్టించెననియు, పెక్కు శివాలయములు నిర్మించినట్లు గలదు. అనుమకొండనుండి రాజధాని నీతడే గిరిదుర్గమగు ఓరుగల్లునకు మార్చి వేసెను వెనుక తమతాత ప్రోలరాజుచే ప్రతిష్ఠించబడి తమకుల దైవమైన శ్రీ స్వయంభూదేవుని ఆలయముతో సమానమగు మహిమా వైభవములు గల వేరొక శివాలయమును దన పేరుతో గణపేశ్వరాలయమని యోరు గల్లులో నిర్మించినట్లు విద్యానాథుని ప్రతాపరుద్రీయమును బట్టి తెలియు చున్నది

"యస్త్వద్యోత్ర మహత్తరస్య జగతాం త్రాతు స్స్వయంభూ విభో
స్తత్తాద్యుక్తరితాద్భుతై ర్మహిమభి స్స్వీయై ర్ద్వితీయో భవత్
దేవోఽసౌ గణపేశ్వరః ప్రతికలం స్ఫార ప్రసాదోన్ముఖో
నప్తు స్తే కులమండనస్య మహతీం పుష్ణాతు రాజ్యశ్రియం"

గణపతిదేవుని యాస్థానమునకు తిక్కన సోమయాజి రాక, అక్కన బయ్యన లనువారు నెల్లూరి రాజ్యము నాక్రమించి మనుమసిద్ధి రాజును రాజ్యభ్రష్టుని జేసిరని యాతడు విన్నవించి, తమ రాజునకు మరల రాజ్యము ప్రసాదింపుమని వేడుట; గణపతిదేవుడు దక్షిణదేశముపై దండెత్తి అక్కన, బయ్యనలను పారద్రోలి మనుమసిద్ధిని మరల సింహాసనమునందు ప్రతిష్ఠ చేయుట వర్ణించబడినది గుంటూరుజిల్లా బాపట్లతాలూకా నాయనిపల్లిలోని కాకతి గణపతిదేవుని శిలాశాసనమును బట్టి ఇందలి యధార్థము గొంతవఱకు దెలియుచున్నది సుప్రసిద్ధ శైవాచార్యుడగు శ్రీ మల్లికార్జున పండితారాధ్యుల వద్ద గణపతిదేవుడు శివదీక్ష గైకొని నిత్య పూజాది విధులకు పదునొకండు గ్రామములను ధారవోసినట్లున్నది మార్కాపుర శాసనమున నాతడు గోళకి మఠాచార్యుడు ధర్మశంభుని పుత్రు డగు శ్రీ విశ్వేశ్వర శంభువు వద్ద దీక్ష గైకొనినట్లు తెలియుచున్నది.

త్వంగత్తుంగజటాకిరీట ముదయస్మేరారవిందాననం
ముక్తాకుండలతాడితాంసశిఖరం హారై ర్మనోహారిణం
విద్యా మండపవర్తినం గణపతిక్ష్మాపాల దీక్షాగురుం
శ్రీ విశ్వేశ్వర శంభు మీక్షితవతాం తే చక్షుషీ చక్షుషీ.

మరియు ననేక శాసనములలో శ్రీ విశ్వేశ్వర శంభువు 'రాజ గురువని' పేర్కొనబడినాడు మల్కాపురము మున్నగు శాసనములనుబట్టి గణపతి దేవుడు శివాలయముల కిచ్చిన యనేక గ్రామములు తెలియుచున్నవి

గణపతిదేవుని కాలమున సిద్ధు డొకడు యాతని వద్దకు వచ్చి యనుమ కొండ మాహాత్మ్యమును వివరించి కొన్నివే లేండ్ల నుండి తా నప్పటి బిలములో నుండి కొద్దికాలము క్రితము భూసంచారార్థమై బయలుదేరి సకల దేశము లను జూచి యిప్పుడే తిరిగి వచ్చినట్లు, యోగతాప మెక్కువగ నుండుటచే మంచి ఆవుపాలు త్రాగినగాని ఉపశమన మొంద దనుట, గణపతిదేవుడు వెంటనె నూరు ఆవుల పాలు పిండించి వానికిచ్చి యాతని దాహమును తీర్చె ననియు, తదుపరి ఆ సిద్ధుడు మిక్కిలి సంతసించి గణపతి దేవునకు ననుమ కొండ లోనిబిలము, కేదార తీర్థము మున్నగునవి జూపి తీర్థస్నానాదులను చేయించెనని వర్ణించబడెను రెండవ ప్రతాపరుద్రుని యాస్థాన విద్వాంసు లగు నృసింహ, విద్యానాథులు ప్రశంసించిన సిద్ధు డీతడే కావచ్చును

గణపతిదేవుని యనంతర మాతనిభార్య రుద్రాంబ సింహాసన మధి ష్ఠించెనని గలదు ఆమె యాదవుల యింటి ఆడుబిడ్డ యట కుమార స్వామి సోమయాజి రత్నాపణవ్యాఖ్యానమున మొదట ఆమె గణపతిదేవుని భార్యయని చెప్పినట్లే గలదు

"పురాకిల కాకతికులసంభూతే గణపతినామ్ని మహారాజే దుహితృమాత్ర సంతానే క దాచిద్దైవ యోగేన కాల పరిపాకముపేయుషి తన్మహిషీ రుద్రదేవీ నామరాజ్ఞీ బహూని వర్షాణి తద్రాజ్య మకంటకం పరిపాల్య పరిణతాసతీ దౌహిత్రే ప్రతాపరుద్రే రాజ్యధురా విదధే.'

విదేశీయుడగు మార్కొపోలో గూడ ఆమె గణపతిదేవుని విధవ భార్య యనియే దెల్పినాడు కాని గణపతిదేవుని యనంతరము సింహాసనము నధిష్ఠించిన దాతని పుత్రికయగు రుద్రమదేవి యనుటకు చాలినంత శాసన వాఙ్మయాధారము గలదు. కుమారస్వామి సోమయాజియే పై నుదహరించిన వ్యాఖ్యాన పంక్తుల క్రిందన, "రుద్రాంబాయాః పితరౌ సోమాంబా గణపతి దేవౌ. తయో రుమామహేశ్వరాత్మకత్వం లోకవిదితం" అని వచించినాడు ఇట్లు పరస్పర విరుద్ధమైన విషయముల నాతడెట్లు పేర్కొనెనో తెలియుట లేదు ఇది చరిత్రాంశములు తెలియని పరిష్కర్త లెవరో చేసిన పొరపాటని పించును శ్రీ ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనముగారు గణపతిదేవునకు రుద్రాంబ యను భార్య, పుత్రికయు గూడ యుండవచ్చునని సమన్వయము చేసిరి

రుద్రాంబ కాలమున నామె యోరుగల్లులో లేని సమయమున హరిహరదేవ, మురారిదేవు లనువారు యోరుగంటిపై బడ్డట్లు, రుద్రాంబ వారిని కఠినముగ శిక్షించెనని గలదు ప్రతాపచరిత్రమున వీ రామె సవతి సోదరులని యున్నది. గణపతిదేవుని ఏకామ్రనాథశాసనమున కాకతి రుద్రదేవునకు మహదేవరాజు గాక ఇంకను మరి మువ్వురు సోదరులు గలరని తెలియుచున్నది. ఈ హరిహరదేవ, మురారిదేవులు బహుశః వారి సంతతిలోని వారు కావచ్చును దేవగిరి యాదవరాజులతో రుద్రాంబ యుద్ధము వర్ణించబడినది. హేమాద్రి వ్రతఖండమును బట్టియు నిది స్పష్టము.

> అయం శిశు స్త్రీ శరణాగతానాం
> హంతా మహాదేవ నృపో న జాతు
> ఇత్థం వినిశ్చిత్య తతో ఽతిభీతై
> రంధ్రైః పురంధ్రీ నిహితా నృపత్వే

సిద్ధేశ్వర చరిత్రమున కాకతి రుద్రాంబ జయించినట్లు, హేమాద్రి వ్రతఖండమున యాదవులు జయము పొందినట్లును వర్ణించబడెను ఇరువురకు నేమైన సంధి జరిగియుండును

రుద్రాంబ గణపతిదేవుని భార్య యనినట్లే ముమ్మడాంబ యాతని కుమార్తె యనియు నామె భర్త చాళుక్య వీరభద్రుడనియు చాల విరుద్ధముగ సిద్ధేశ్వరచరిత్రకారుడు తెల్పినాడు

రుద్రాంబ తనకుమార్తె ముమ్మడాంబకు వంశ వర్ధనుడగు పుత్రు డుదయించవలెనని చేయించిన యొజ్ఞహోమము, ఇలవేల్పగు కాకతిదేవి కక్షయుంబగు జాతరులు, ఒడ్డెపల్లిలోని గణపతికి గుడపానకము, మోదకముల నివేదన, మొగిలిచర్లలోని ఏకవీరాదేవిని గొల్చుట, అనుమకొండ సిద్ధేశ్వరుని స్వర్ణపుష్పముల బూజించుట, పద్మాక్షీదేవికి నిత్యోత్సవ, సంతత జాతరులు, బ్రాహ్మణులకు సదా సమారాధనలు, వ్రతములు మున్నగునవి చాల చక్కగా వర్ణించబడినవి తదుపరి ముమ్మడాంబ దౌహృదలక్షణములు, ప్రతాపరుద్ర జననము కావ్యరీతిలో సర్వప్ప యద్భుతముగ వర్ణించెను అవ్వ రుద్రాంబ పురిటిల్లు సొచ్చి యా పొత్తుల బిడ్డనే యెత్తుకొని పోయి కాకతి సామ్రాజ్య సింహాసనమున బవ్వళింపజేసి యానందపరవశురాలైనదట.

> "తగరుద్రమాదేవి తగ పురుటింటి
> కొగి వచ్చి సుతుఁ జూచి .
> .. తెచ్చి సింహాసనంబు మీఁదటను
> తటుకునఁ బొత్తులఁ దగుఁ దానమర్చి
> పవ్వళింపఁగఁ బెట్టి యవ్వతా నపుడు
> నవ్వుచు నానంద రసమగ్న యగుచు "

ప్రతాపరుద్రునకు అన్నమదేవుడను తమ్ము డొకడు గలడని యున్నది బస్తరు రాజ్యమునందలి దంతేశ్వరాలయమున గల 18 వ శతాబ్ది శాసనములలో ఆ రాజులు తాము కాకతిరెండవ ప్రతాపరుద్రుని తమ్ముడగు అన్నమదేవుని సంతతివారమని పేర్కొనబడిరి.

సిద్ధేశ్వరచరిత్రకారుడు ప్రతాపరుద్రుని తల్లి ముమ్మడాంబ యని స్పష్టముగ చాలసార్లు పేర్కొనినాడే గాని తండ్రిని గూర్చి యంతగా తెల్పలేదు. రుద్రాంబ గణపతిదేవుని భార్య యనినట్లే యుమ్మక్కభర్త చాళుక్య వీరభద్రుడని తప్పుగా వచించినాడు ప్రతాపరుద్రునితండ్రిని గూర్చిన వివాదములు పెక్కు గలవు. ప్రతాపరుద్రీయమున విద్యానాథుడు ప్రతాపరుద్రుని తండ్రి మహదేవరాజనియు, తల్లి ముమ్మడాంబ యని కంఠోక్తిగనే చెప్పినాడు రత్నాపణ వ్యాఖ్యానమున కుమారస్వామి సోమయాజి కూడ దానినే సమర్థించినాడు శివయోగసారమున "అకుపిత రుద్రమాంబికకు నాత్మజనాఁ బొగడొందు ముమ్మడ, మ్మకు మహదేవరాజునకు నాత్మజుఁడై వ ప్రతాపరుద్రుఁడు" నియే గలదు. కాని ఈ మహాదేవరాజెవ్వడనునది తెలియుట లేదు మైసూరు రాష్ట్రమందలి తుముకూరులోని ముళుకుంటి యగ్రహారమునగల తామ్రశాసన మొకదానిలో నీ మహాదేవరాజు కాకతి వంశజుడుగ పేర్కొనబడెను

> "తాం పురీం హోరుగల్లాఖ్యా మావస ద్రాజ వల్లభః
> కాకతీయ మహారాజ వంశ దుగ్ధాబ్ధి చంద్రమాః
> మహాదేవ ఇతిఖ్యాతో రాజా సర్వ గుణాన్వితః
> సోవ్యుమాం శంభువత్కన్యాం ముమ్మడాంబాం మనోరమాం
> భూధరేంద్ర సుతాం స్నిగ్ధా ముపయేమే మహామతిః,
> తస్యామా విరభూ చ్ఛ్రీమా న్మహాదేవః ప్రతాపవాన్
> ప్రతాపరుద్ర రాజాసౌ కందర్ప ఇవ మూర్తిమాన్."

విద్యానాథుడు ప్రతాపరుద్రీయమున ప్రతాపరుద్రుని గూర్చి 'కాకతీయకుల ప్రదీపము, కాకతీయ ప్రసవ' మిత్యాదిగా వచించినాడు.

మరియు గణపతీశ్వరాలయ విద్వాంసుల యాశీర్వచన సందర్భమున ప్రతాపరుద్రుడు గణపతిదేవునకు ప్రపౌత్రుడని గూడ సూచించినాడు

"దేవో౽సౌ గణపేశ్వరః ప్రతికలం స్ఫారప్రసాదోన్ముఖో
నప్తుస్తే కులమండనస్య మహతీం పుష్ణాతు రాజ్యశ్రియం,"

కుమారస్వామి సోమయాజి రత్నాపణమున దానినే స్పష్టముగా నిట్లు వివరించినాడు "అసౌదేవః (గణపేశ్వరః) ప్రతికలం ప్రతి క్షణం, స్ఫారస్య ప్రభూతస్య ప్రసాదస్యో న్ముఖస్సన్ రాజ్ఞో దేవస్య చాభేదోపచారా ద్వీరరుద్రస్య నప్తృత్వ వ్యవహారః తస్య తే రాజ్యశ్రియం పుష్ణాత్వితి సంబంధః"—దీనిని బట్టి గూడ ప్రతాపరుద్రుని తండ్రి మహదేవరాజు కాకతివంశజుడే యని తెలియుచున్నది

తదుపరి ప్రతాపరుద్రుని బాల్యము, విద్యాభ్యాసము, విశాలాక్షీ మొద లగు రాజకన్యకల వివాహము వర్ణించబడినది సిద్ధేశ్వర చరిత్రమును బట్టి యాతడు పదారవయేటనే రాజ్యభారము వహించినట్లు తెలియుచున్నది. విద్యానాథుని ప్రతాపరుద్రీయమున గూడ అట్లే చెప్పబడినది

"ధర్మార్థౌ చ ఖిలీకృతో౽య మధునా క స్సంచరే దస్థలం
స్తన్నేష్టం కిల యౌవరాజ్యమపి మే బాల్యోత్సవే క్రీడతః"

దర్శి, మల్యాల, కళ్లేపల్లి, గణపవరము మున్నగు రుద్రాంబ కాలము నాటి శాసనములలోని మహామండలేశ్వర కుమార రుద్రదేవుడు యువరాజగు ప్రతాపరుద్రుడే యని గుర్తించబడినది

ప్రతాపరుద్రుని రాజ్యపాలనము, దిగ్విజయము కూడ చక్కగా వర్ణించ బడి గలవు ఆతనికి విశాలాక్షియందు విరూపాక్ష, వీరభద్రులను పుత్రులు పుట్టిరట దీనికి మనకు శాసనాధార మేమియు గానరాదు తదుపరి పెక్కు శివాలయములు, విష్ణు స్థానములు, మైలార, దుర్గ, భైరవ, గణపతి, వీర భద్రాలయములు మున్నగునవి పేర్కొనబడినవి నిజమున కిప్పటికిని తెలం గాణా ప్రాంతము ముఖ్యముగ నోరుగల్లు జిల్లాలోని యే గ్రామమున జూచి నను బ్రహ్మాండమైన పెద్ద శివలింగములు, పానవట్టములు, కాకతీయుల నాటి శిథిలాలయములు ననేకముగ మనకు గోచరించును. దీనినిబట్టి కాక తీయులనాడు కొన్నివేల శివాలయ నిర్మాణములు, లింగప్రతిష్ఠలు జరిగిన వనుట కేవల మతిశయోక్తి కానేరదు మైలారదేవు డొకడు కాకతీయులనా డారాధించ బడెడివాడు క్రీడాభిరామమున గూడ నీతని ప్రసక్తి గలదు వరం గల్లునకు సుమారు పదిమైళ్ల లోపున గల అయినవోలి గ్రామమున నేటికిని మైలారదేవుని గుడి కాన్పించును. అందలి శాసనమును బట్టి యాతడును గాకతీయులకు కులదైవమని తెలియుచున్నది.

సాన్నిధ్యవా నయ్యనవోలు నంజ్ఞే
నిత్యం కృతార్థీకృతభక్తసార్థః
మైలారదేవః కులదేవతా౽సౌ
రాజ్ఞాం సతా మేకశిలానగర్యాం.

పశ్చిమచాళుక్యులశాసనములలో గొన్నిట నీ మైలార దేవుడు, స్వయం భూనాథుడు పేర్కొనబడి యుండిరి. మొదట వారి సామంతులుగ నుండి తదుపరి స్వతంత్రసామ్రాజ్యమును స్థాపించిన కాకతీయులు వారి వరాహ లాంఛనముతోబాటు స్వయంభూదేవ, మైలార దేవులను గూడ గ్రహించి యుండవలెను

ప్రతాపరుద్రుని యాస్థాన జనము, దినచర్య, రాజ్యవైభవము, విద్యావినోదములు మున్నగున వెన్నియో వర్ణించబడినవి. అవి యా కాలపు సాంఘికచరిత్ర, నాగరికత తెలిసికొనుట కత్యన్తోపయోగకరమైనవి. మల్లి కార్జునభట్టు, కృష్ణమాచార్యులు, కుమ్మరమొల్ల, భాస్కరుడు, రంగ నాథుడు, పాలకుర్కి సోమనాథుడు, విద్యానాథుడు మున్నగుకవులు వారి ప్రభావములు పేర్కొనబడినవి. తదుపరి తురకలదండయాత్ర, ప్రతాపరు ద్రుని చెర, ఢిల్లీశ్వరు డాతనిని మిక్కిలి గౌరవించి విడిచిపెట్టుటయు గలదు కాని ప్రతాపరుద్రుడు మరల ఓరుగల్లు ప్రవేశింపక కాశీ మున్నగు ననేక తీర్థములు సేవించి గోదావరి యొడ్డునగల కాళేశ్వరమున పుత్ర, మిత్ర, బంధువర్గ మెల్లరు తనను గొలువ గోదావరీ పుణ్య జలంబుల తీర్థ మాచరించి విభూతి, రుద్రాక్ష, దుకూలాదులను ధరించి గోదావరీగర్భంబున గూర్చుండి శ్రీ శంభులింగమును దన హృదయమున ధ్యానము చేయుచు భౌతికదేహమును విడిచిపెట్టెనని వర్ణించబడినది దీనినిబట్టి తురుష్కులచే బంధిగా గొంపోబడిన ప్రతాపరుద్రుడు మరల యోరుగల్లున నడుగుబెట్ట లేదనియు, తన ఇష్టానుసారముననే నదీగర్భమున గలసి ప్రాణములు విడచె నని తెలియుచున్నది ముసునూరి ప్రోలయనాయకుని విలస తామ్రశాసన మున నాతడు ఢిల్లీకి గొనిపోవు సమయమున నర్మదా నదియొడ్డున ప్రాణ ములు విడచెనని స్పష్టముగ నున్నది

వీతి ప్రశస్తో౽పి బలాధికో౽పి
సహాయ యుక్తో౽పి చ వీరరుద్రః
భాగ్యక్షతే ర్మానుష మండలస్య
తురుష్కభర్తు ర్వశతా మయాసీత్.
స నీయమానో నగరీం స్వకీయాం
ఢిల్లీం ప్రయత్నా ద్యవనేశ్వరేణ
సోమోద్భవా యాః సరితః ప్రతీరే
దైవాదయాసీత్త్రిదశాధివాసం.

అనితల్లి కలువచేరు శాసనమున గూడ నాతడు తన ఇష్టానుసారము గనే స్వర్గమునకు బోయెనని గలదు ఇట్లు ఆంధ్రదేశము నంతటిని ఏక చ్ఛత్రాధిపత్యమున నేలిన గాకతిసామ్రాజ్యము ప్రతాపరుద్రభానునితోడ నస్తమించెను ఈతని సంతతివా రెవ్వరును రాజ్యము బాలించినట్లు శాసనాధా రము గానరాదు. శివదేవయ్య వాక్యముగ సిద్ధేశ్వరచరిత్రమున గూడ "మీ సింహాసనంబు మీ సంతతికి లేదు ఆశ ఉడుగుండ"ని గలదు.

ప్రతాపరుద్రుని పుత్రుడు వీరభద్రయ్య కొద్దికాలము పాలించి ఢిల్లీ సులతాను భృత్యులు చేయు కృత్యములు భరించలేక తాను సమస్త జనంబులతో పురము వెడలి కొండవీటనున్న రాయలను గలసెనని యున్నది. ఇది తాత్కాలికముగ నోరుగల్లు ఢిల్లీసామ్రాజ్యమున చేరిన దనుటయు, తదుపరి రెడ్డిరాజ్యము కొండవీట వెలసిన దనుటకు సూచన గాబోలు

చరిత్రకారు లందరకును సిద్ధేశ్వరచరిత్ర మమూల్యమగు గ్రంథ రాజము సర్వతోముఖముగ నాంధ్రదేశ చరిత్రము నభివర్ణించిన కాసె సర్వప్ప మనకు చిరస్మరణీయుడు.

నేను

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

కృతికి జీవగఱ్ఱగతి నుపదేశమ్ము,
తనువునట్లు కళయుఁ దనరుఁ గాన
జాతి కుపకరించు సందేశమును గళా
న్వితముగా వచించు మతము నాది

"ఇన్ని నీతులు సెప్పితి, నింత వెక్కి-
రించితిని ధర్మువున్ గికురించువారి,
నన్ను నే దిద్దుకొంటినా" యన్న మథన
మేను విడువ కించుక తలయెత్తఁగంటి

నిత్యసత్యవచననియతిమై బుధ సమా-
రాధనేచ్ఛమై నిరంత రేందు
మకుటచరణ భక్తిమైఁ గాక యలవోక
వినుతి కెక్కెనా కవిత్రయమ్ము?

శోకము శ్లోకంబయి వా-
ల్మీకి మహాకవిపదాన మెఱసె నటన్నన్
లోకమునార్తి నిజార్తిగ
నీకొనుకవి గెల్చు ననుటయే తేటపడున్

"మీ పద్య మొక్కటియు నా
లోపలి చీఁకటిని జీల్చి లోకక్షేమా
వ్యాపృతుని జేసె న"న్నని
తాఁ బొకరుఁడు తన్ను మెచ్చఁగా బ్రమాన్పడితిన్

వదలె నధికారవాంఛ, సంపన్మదమ్ము
వదలె, లోభాది వికృతులు వదలె, నితఁడు
కదలె భూదానకర్తగా గ్రామసేవ
మరగి మాల మెత్తుమనిసిగా మనసు పండి

* "వట్టికూటి"వారి వంశాన వేంకట
సుబ్బయాఖ్యనలరు సుకృతి యితఁడు
తెల్పఁజేసెనంట "క్రుళ్ళిన మొముకకై"
యనెడు పద్య మితని యవగడముల

---

* (ఈ పద్యము "అమరజ్యోతి" లోనిది).

కవిత కింతచేవ కలదె? యా నొకనాఁడు
తిక్కయజ్వ కాకతీయనృపతి
నాంధ్ర భారతోక్తి నలరించి కరఁగించి
నిజమహీశు పరువు నిలుపలేదె!

నిలు! నిలు! రాజా! తెఱచిన
యిలు సొచ్చెదుకుక్క వౌదువే?" యని యలనాఁ
డలసానిసుకవి పల్కిన
వెలవెలనై యొడ్డెఱేఁడు వెనుకకుఁ జనఁడే!

అదిర! శబ్ద మెంతయద్భుత మిది పైర
గాలివంటి దయ్యుఁ గన్నెకలువ
ఱేకువంటిదయ్యు లోకాల నడలించు
పిడుగు నడఁచికొట్టు పిట్టపిడుగు

ఎట్టి పిడుగైన నే మిది
పుట్టింపదు చెట్ట; దీని పోయిన బాటన్
నెట్టుకొని పొంగు నెయ్యము
చుట్టము లయ్యెదరు పగల స్రుక్కడివారున్

నిబిడ సంయమమ్ము నిశిత సత్యముగల
వాకు గెల్చు నెల్లలోకములను;
వాకుబలిమి లేనివాఁ డవివేకి యై
బాకుబలిమి కాసపడి యడంగు

సత్యానుచరము సాహితి;
నిత్యము నమృతాంశు వెంటనే కదలుచు సా
హిత్యము నిడి యజడ జడ
క్షిత్యవనము సేయు చాంద్రికిన్ సవ తిదియె.

నరుల సురలఁ జేసి నందనసుమనస్స
ముత్థసౌరభముల ముంచియెత్తుఁ
దత్త్వవిదులఁ జేసి తనియించు నక్షరా
నందపదముదెసకు నడిపి కవిత

బాహిరం బైన ప్రకృతికి భయద శాస
నము సృజించి భూపతి సమాజమును గాచు
నాంతరంబైన ప్రకృతికిఁ గాంతవోలె
హితము వినిపించి కవి ప్రోచు నీ జగమ్ము

చిత్రకళలో రాజపుత్రశైలి

శ్రీ వేలూరి రాధాకృష్ణ

భారతదేశపు చిత్రకళలో రెండు ప్రసిద్ధ శైలులున్నవి. అందులో మొగల్ శైలిఒకటి దానికన్న లతిముఖ్యమైన శైలి ఈ రాజపుత్ర శైలి స్వర్గీయ డాక్టర్ ఆనందకుమారస్వామి ఈ శైలిపై ఒక బృహద్గ్రంథాన్ని వ్రాసారు గ్రంథవిస్తరణకు వీలైన ఈ కళాచరిత్రనుగూర్చి సమగ్రంగానైనా తెలుసుకోవటం ఎంతైనా అవసరం

రాజపుత్రశైలి ముఖ్యంగా రాజపుత్రస్థానంలో సాధనచేయబడినది కాన దాని కాపేరు సార్థకమయింది తరువాత తరువాత ఇతర ప్రాంతాల్లో చిత్రకారులు ఆ శైలిలోనే సాధన చేసిఉండటం మూలాన, అది కేవలం రాజపుత్రస్థానానికే చెందింది కాక, అంతకుమించిన సువిశాలత్వాన్ని ఏర్పరుచ కున్నది ఉత్తర హిందూస్థానంనుంచి అటు ప్రాగ్దిశనున్న బుందేల్ ఖండ్‌వరకూ ఇటు గుజరాత్‌వైపుకూ ఈ శైలి ప్రాబల్యం ప్రాకింది ఈప్రాంతాలు రాజపుత్రరాజుల పాలనలో ఉండటంమూలాన వారి బలపరాక్రమాలూ, యుద్ధప్రీతీ, వారిలో ప్రత్యేకంగానున్న ధైర్య, వీర్య ప్రవృత్తులూ చిత్రకళను సజీవం చేసినవి

రాజపుత్రరాజులు మహమద్ ఘజినీ దండయాత్రతో ప్రారంభమై ముసల్మాను పరిపాలన కొన్ని శతాబ్దాలవరకూ నెలకొన్న సమయంవరకూ వారి శౌర్య ధైర్యశక్తులను సమయం వచ్చినప్పుడల్లా ప్రదర్శిస్తూనే వచ్చారు పశ్చిమ భారతపు చాళుక్యరాజ్యపాలన అంతమొందటంతోనూ 126' లో వైష్ణదేవి మృతితోనూ చిన్నచిన్న రాజపుత్రసంస్థానాలు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్నవి పశ్చిమ హిమాలయప్రాంతంలోని కొన్ని చిన్న చిన్న సంస్థానాలను రాజపుత్రరాజులు యుద్ధంలో గెలుచుకుని వాటిపై పలుకుబడిని సాగించారు


ఈ రాజకీయ స్వాతంత్ర్యం రాజపుత్రరాజులపై ఒక బాధ్యతను మోపింది సాంస్కృతికంగా ఆయాసంస్థానాల స్థాయినీ నాగరికతనూ ప్రశంసాపాత్రంగా వృద్ధిపొందించే అవకాశాన్నిచ్చింది ఆ సంస్థానాల రాజ్యపాలన ఆ రాజుల వంశపారంపర్యంగానే జరుగుతూ వచ్చింది ఆవిధంగా ఆ సంస్థానాల్లో పనిచేసిన చిత్రకారుల కళాసాధనకూడా వంశపారంపర్యంగానే వృద్ధిపొందుతూ వచ్చింది

ఆ సమయంలో, అనగా పదిహేనవ శతాబ్దంలో రెండు విషయాలు కళాసాధనలో ఒకవిధమైన విఘ్నానికి కారణభూతములైనవి ఒకటి, ఆయా ప్రదేశపు మాతృభాషాభివృద్ధీ, రెండు, తాటియాకుల స్థానే కాగితపు వాడుక ప్రాంతీయ భాషాభివృద్ధి జరపడానికి కారణం ఆ కాలంలోని హిందూరాజ్యాలన్నీ కూలిపోవడంతో సంస్కృతభాషకి పతనమేర్పడటం, తరువాత ఆ ప్రాంతీయ జనబాహుళ్యానికి వారి మాతృభాషలోనే మతవిషయక, సాంస్కృతిక ప్రచారం కావలసి రావడం ఆ విధంగా స్వామీ రామానందుని మతం ఆనాటి జనుల హృదయాల్లో వల్లమాలిన నమ్మకాన్ని కుదిర్చింది. దాని రహస్య మేమిటంటే రామానందుని మతం ప్రతి సామాన్యునికీ అర్థమయ్యే సుగమమార్గాన్ని చూపించింది ఆయనమతస్థులు ప్రత్యేకంగా 'మోక్షసిద్ధి'ని పొందినవారుగా పేరుబడ్డారు అప్పటి ఛాందసపు పండిత వర్యుల అత్యాచారాలవల్లనే జనానికి రామానందుని మతం అత్యుత్తమమైనదిగా తోచి యుంటుంది ఈ రామానందుని ప్రచారంకూడా ఎంతో హృద్యంగా ఉండేది. మన పురాణాల్లోని దైవకథలను ప్రాంతీయభాషల్లో కవులు గీతాలుగా వ్రాసి వాటిని వాడవాడనా పాడుకుంటూ పోయారు. జనం పరవశులయ్యారు ఆవిధంగా పదహారవశతాబ్దం ప్రారంభంకాగానే మత సంస్కర్తలకు బదులు కవులే 'సంస్కర్త'లయ్యారు అది కేవలం ఒక ప్రత్యేక దేవస్తుతిగా కేంద్రీకృతమైంది జనానికి ఆ దేవస్తుతిలో ఏకాగ్రతను కలిగించటంలోనే ఆ దేవుడు 'రాముడు' కానీ 'కృష్ణుడు' కానీ, ఆ కవులు ప్రత్యేకత చూపించారు ఆ విధంగా తులసీదాసు రామాయణం దేవస్తుతిగా జనాదరణనీ వారి అపార భక్తినీ చూరగొన్నది. చైతన్యదేవుని కృష్ణస్తుతీ, మీరాబాయి కృష్ణభక్తీ, ఈ రెండూగూడా జనాన్ని ఆనందాంబుధిలో ముంచివేసినవి



పూజారి - లినోకట్ చిత్రం : వేలూరి రాధాకృష్ణ

సీతారాములను గూర్చిన ప్రశంస విశ్వవిఖ్యాతిని గాంచింది. దానికి కారణం వారి స్తుతి, ముందర ప్రాంతీయభాషల్లో తయారయి, అది ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ ప్రచారం కావటమే. దానికి తోడుగా, దేవా



విరహ నాయిక, (కాంగ్రా శైలి); 19 వ శతాబ్ది

లయాల్లో శిల్పాలు, ప్రతిమలను, రాతి శిల్పాలనూ మలచారు చిత్రకారులు రామాయణాన్నంతనీ, చిత్రాలలో ప్రతిబింబించారు ఆవిధంగా పురాణ గాథలు, మతాన్ని విశ్వప్రచారం చేయటానికీ, ఖ్యాతిని సంపాదించటానికీ కారణభూతములైనవి ముఖ్యంగా రామాయణాన్ని రచించిన తులసీదాసు, ఉత్తమోత్తముడుగా మొగల్ చక్రవర్తులచేత కొనియాడబడినాడు !

సీతారాముల పురాణగాథాస్తుతితోపాటు రాధాకృష్ణుల విశ్వప్రేమ స్తుతి కూడా గానం చేయబడింది చిత్రీకరించబడింది ఆ గానసరళి లప్పటి నుంచీ, ప్రతి మానవుని నోట మృదుమధురంగా వినవచ్చింది ప్రేయసీ ప్రియుల కాదర్శమైన రాధాకృష్ణులగాథ చిత్రాకారులను భక్తివివశులను చేసి దివ్యానందాన్ని కలగజేసే చిత్రాలను సృష్టింపజేసింది కేవలం విష్ణ ప్రేమనే మూర్తీభవింపజేసినవారు 'పహాడీ' (పర్వత ప్రాంతపు) చిత్రకారులు కేవలం, ఒక గేయానికి చిత్రానుకరణ కాకుండా ఆ గేయ గీతాలలో ఉన్న సారాన్నంతా ఒకటిగా చేసి, నాయికానాయకుల చిత్రాలను తయారుచేశారు ఆ చిత్రాలలో కథ గ్రాహ్యంకావటంకన్న రసస్ఫురణే సువ్యక్తమయింది ఆ విధంగా ఉత్తమచిత్రాలకు దోహదమైన కావ్యరచన సాగించింది ప్రాచీన కవిపుంగవుడు బుందేల్‌ఖండ్ నివాసి శ్రీ కేశవదాసు ఆయన 'రసికప్రియ' అనే గ్రంథాన్నంతా తరువాత చిత్రకారులు సచిత్రం చేశారు ఈ కవికి దాతగా వర్తించింది, అప్పటి బుందేల్‌ఖండ్‌ను ఏలిన రాజా ఇంద్ర జిత్ సింగు అని తెలుస్తుంది. ఈ నాటికీ కేశవదాసు గీతాలు ఉత్తరహిందూ స్థానములో గానంచేయబడుతూనే ఉన్నవి

'రసికప్రియ' కనుకరణగా గీచిన సూక్ష్మాకార చిత్రాలు లెక్కగా నలభైరెండు మిగిలినవి, బాస్టన్‌లోని లలితకళా ప్రదర్శనశాలలో పొందు పరుపబడినవి ఆ చిత్రరచనలోని ప్రత్యేకత మొగలాయి శైలిలోని రంగుల పొందికకు ప్రాధాన్యమిస్తూ ఆనాటి గుజరాత్‌లోని జైనమతప్రచారానికి గాను రచించిన గుజరాత్ చిత్రకారుల రచనావిశిష్టతను కూడా జోడించి అసలు భావానికి తభావతు రాకుండా కాపాడి దివ్యప్రభావాన్ని తేవటమే


అసలు గుజరాత్ చిత్రశైలినిగూర్చి ప్రత్యేకంగా అనేకమంది భారతపాశ్చాత్య దేశాల పండితులు ప్రశంసాపూర్వకంగా రచనలు చేశారు. ఆ రచనల సారాంశ మేమిటంటే పన్నెండవశతాబ్దంలో తాటియాకులమీద చిత్రరచన ప్రారంభమయి, ఆ చిత్రాలలోనున్న ప్రత్యేకతను మొఘల్ పరిపాలనాసమయం వరకూ తదుపరి చిత్ర రచనలోనూ అతి నిపుణతతో నిలుపుకుంటూ వచ్చారు. అవి—ఆ రేఖలలోని శక్తి, వర్ణసంకలనంలోని జీవం, అలంకరణలోని నైపుణ్యం, ఇవన్నీ 12 వ శతాబ్దంనుంచీ 15 వ శతాబ్దంవరకూ అపంఖ్యాకమైన చిత్రాలలో చూపబడిన చిత్రకారుల ప్రతిభ ఎంతైనా కొనియాడ తగినది ఆ చిత్రరచనలో పర్షియన్ కళలోని సాంప్రదాయం కొద్దిగానైనా అవలంబింపబడినదని ఒప్పుకోవలసివస్తుంది గుజరాత్ పర్షియాలకు వర్తక వ్యాపార సంబంధం అనాదినుంచీ ఉంది పర్షియన్ వస్తువ్యాపారం చేసే, ముఖ్యంగా, గుజరాత్‌లోని వ్యాపారస్తులు కోటీశ్వరులయారు ఈ వ్యాపారసంబంధమే సాంస్కృతిక సంబంధానికికూడా దోహదమయింది. అందువల్లనే అక్బరు, గుజరాత్ చిత్రకారుల కళాప్రతిభను మెచ్చుకొని ఎక్కువమందిని తన ఆస్థానంలో నియమించాడు వారి చిత్రరచనే పర్షియన్ ప్రాతప్రతులలో గమనార్హం పూర్వంనుంచీ గుజరాతుకీ, పర్షియాకూ వర్తక వ్యాపార సంబంధం ఉండడం, ఆ తరువాత, ఎక్కువ మంది గుజరాత్ చిత్రకారులు అక్బరు ఆస్థానంలో నియమితులు కావటం గమనిస్తే, పర్షియన్ చిత్రశైలి కేవలం మొగల్ పరిపాలనలోనే తొలిగా అనుకరణ కాలేదనీ, అంతకు పూర్వమే, అనగా రాజపుత్రరాజుల పాలనలోనే గుజరాతులో ప్రారంభమయి, మొగల్ సామ్రాజ్యసమయంలో కూడా కొనసాగింప బడిందనీ విశదమవుతుంది అందువల్లనే రాజపుత్ర చిత్రరచన

లోనూ, మొగల్ చిత్రరచనలోనూ అతి నిశితవిమర్శవే చేస్తేగాని, ఎక్కువ భేదం కనిపించదు ఒక విధంగా చెప్పాలంటే, రాజపుత్ర శైలి అంతర్లీనమై ఉంది అందువల్లనే, ఈరెండు విశిష్ట శైలులకీ ఒక విధమైన అవినాభావసంబంధం ఉందనేది నిర్వివాదాంశం ..

ఇప్పటికి మిగిలిన రాజపుత్ర చిత్రాలనుబట్టి — అవి పదహారవ శతాబ్దానికి పూర్వం రచించినవి కావని చెప్పవలసివస్తుంది. నిజానికి పూర్వం ఉన్నవాటిని గూర్చిన వాస్తవిక చరిత్ర మనకు తెలియదు—లేదనికూడా చెబుతారు. కాని పదహారవ శతాబ్దానికి పూర్వపు చిత్రాలుగా పేర్కొన్న కొన్ని చిత్రాల సరళికీ 1591 నాటికి చెందిన ఒక సచిత్ర వ్రాతప్రతికీ రచనా విషయంలో ఎక్కువ పోలికలు కనిపిస్తున్నవని కొందరు విమర్శకు లంటున్నారు. ఈ అభిప్రాయానికి సాదృశ్యంగా కనిపిస్తున్నవి గీతగోవిందమును వర్ణిస్తూ రచించిన చిత్రాలు ఈ చిత్రాలలో నున్న గొప్పదన మేమంటే, ఎక్కువ అలంకరణ లేకుండా సువిశదమైన రెండుమూడు రంగుల్లో రచించిన చిత్రాలు—అనగా రెండుమూడు రేఖాచిత్రాల వెనుక సాదా నీలి రంగుకాని లేక అదేమాదిరి సాదాయైన మరో రంగుకానీ ఉండి, ఆ రేఖా చిత్రాలను తెల్లటి ఛాయలుగా ప్రదర్శించే పద్ధతి అది మామూలుగా తెల్లటి కాగితంమీద నల్లటి రంగుతో చిత్రాలను గీచినప్పుడు అవి 'నల్లటి' ఛాయా రూపాలుగానే కనిపించుతవి దానినే ఇంగ్లీషులో 'సిలువెట్' అని అంటారు. అట్లాంటి చిత్రాలు వెంటనే జనాన్ని ఆకర్షిస్తవి. అందులో చిత్రకారుని పనితనం ఎక్కువ కనిపించకపోయినా చమత్కారం గమనింపదగింది! పైన పేర్కొన్న ఆ ఛాయామాత్రపు గీతగోవింద చిత్రాలలోనున్న ఆకర్షణ కేవలం నిరాడంబరమైన రేఖా, వర్ణ సమ్మేళనం ఆ ప్రత్యేకత వాటికే దక్కింది ఆ తరువాత రచించిన చిత్రాలలో ఆడంబరం, అలంకారం ఎక్కువగా కనిపిస్తవి పదిహేనవశతాబ్దపు అవసానదశలోనూ, పదహారవ శతాబ్దపు ప్రారంభసమయంలోనూ, రచించిన చిత్రాలతో పోల్చదగినవి బిల్హణుని రచనయైన 'చౌర పంచశిక' ప్రేమగాధను వర్ణిస్తూ రచించిన అలంకారిక చిత్రాలు వాటిలో నున్న రంగుల మెరుపూ, అలంకారంలోని పనితనం, పదిహేను, పదహారు శతాబ్దాలలో రచించిన మొత్తం చిత్రాలతోనే గమనింపదగింది! ఆ చిత్రాలలో పొందుపరచిన మరో విశేష మేమంటే, గుజరాతు చిత్రాలలో అంతకుముందు లేని నాట్యభంగిమ, వర్ణనా. ఈ చిత్రాల తర్వాత పేర్కొనదగినవి మరి రెండు శీర్షికలలో పన్నెండు, పన్నెండు— మొత్తం ఇరవైనాలుగు చిత్రాలు (ఇవి ఇప్పుడు లాహోరు మ్యూజియంలో ఉన్నవి) అవి సంవత్సరంలోని పన్నెండు మాసాలకీ వర్తించే కథలతాలూకు చిత్రవర్ణన—'బారమాస' అని. అవి కేవలం ఋతువుల మార్పును సూచించే వర్ణన కాకుండా, వాటికి ఒక చక్కని ప్రేమగాధని కూడా జోడించి, చిత్రించినవి. 'చౌర—పంచశిక'' చిత్రాలలో 'వర్ణికాభంగం' లేకపోయినా, వర్ణనలో ఒక ప్రత్యేకత ఉంది వాటిని 'కృష్ణలీల' లను వర్ణిస్తూ రచించిన చిత్రాలతో పోల్చవచ్చును ఈ కృష్ణలీల చిత్రాలు బాస్టన్ మ్యూజియంలో నున్నవి. వీటిలో ప్రకృతి వర్ణన ఎక్కువగా కనిపిస్తుంది బొమ్మలు చందవు ఆటబొమ్మలవలెనే ఉంటవి ఏది ఎల్లా ఉన్నా, ఆ చిత్రాలలో అభివర్ణనా శక్తి, అనగా బొమ్మలద్వారా కథను నడిపింపజేసే శక్తి ద్యోతకం అవుతుంది. ఇదే, తరువాత తరువాత, కేవలం అలంకారికచిత్రాల సరళిలోనికి మారిపోయిందని పదిహేడవ శతాబ్దపు చిత్రాలను చూస్తే తెలుస్తుంది. ఈ చిత్రాలను రచించిన స్థలవివరణ మన కేమీ తెలియరాదు. ఈ చిత్రాలతో పోలికలుగల చిత్రాలు గుజరాతులో 1591 లో నున్న 'ఉత్తరధ్యాన సూత్ర' మనే గ్రంధంలోని చిత్రాలవలె మరి యెక్కడా కానరావు శైలినిబట్టి, ఈ చిత్రాలన్నీ రాజపుత్ర శైలి నవలంబించిన ఉత్తర దేశంకంటే పశ్చిమానికి చెందినవనే వాడుకను మనం కాదనలేము

పదహారవ శతాబ్దంలో మొగల్ సంస్థానంలో పనిచేసిన రాజపుత్ర చిత్రకారుల పనితనంమాత్రం వారి రచనాకౌశలం ద్వారా మనకు తేటతెల్లమవుతుంది వారే మొగల్ శైలి అనుసరణకి చేయి కలిపారనీ, వారి చిత్రశైలి అంతకుముందు మొగల్ శైలిలో లేనిది ప్రత్యేకం ఒకటి ఉందని కూడా తెలియరానంత ఏకత్వం మొగల్ శైలిలో పొందిందనీ సువిశద మవుతుంది. మొగల్ సంస్థానంలో చేరకముందు వారిలో ఎంతటి కుశలత లేకపోతే, వారు అక్కడ చేసిన పని అంతటి విన్నాణాన్ని పొందియుంటుంది! కొద్దిగా అంతకుపూర్వమే తమ శైలిలో పర్షియన్ ప్రాబల్యం ఉంటంమూలాన, మొగల్ సంస్థానంలో బహుముఖమైన అలంకారిక చిత్రణకి వారి పనితనం ఎంతో పాయపడింది. 'హమ్జనామా' అనే ఇస్లాం మతనాయకుని చరిత్ర చిత్రించటంలో వారు చూపించిన నిపుణత వేనోళ్ల కొనియాడదగింది. ఆ చిత్రాలలో రాజపుత్రశైలి అంతర్హితంగా ఉండనే ఉంది దానివలనకూడా, రాజపుత్ర శైలిలో కొంతమటుకు అనామకంగానే పదహారవశతాబ్దం మూడో పాదం వరకూ సాధన జరుగుతూనే ఉంది ఆ శైలి చివరికి మొగల్ శైలిలో లీనమైంది బహుశః రాజపుత్ర చిత్రాకారులు కొంతమంది కొంతకాలంపాటు మొగల్ సంస్థానంలో పనిచేసి, సూక్ష్మాకారంలో చిత్రరచన చక్కగా అలవాటు చేసుకొని, తరువాత 'రసకప్రియ' అనే గ్రంధాన్ని చిత్రించి యుండవచ్చును- (కొంతమంది విమర్శకులు ఈవిధంగాకూడా చెబుతారు) మొగల్ రాజ్య సమయంలోనే 'రసికప్రియ' గ్రంధం చిత్రీకరించటంవల్లనూ ఈ చిత్రాలలోని పనితనం ఒకేవిధంగా కనపడటంవల్లనూ, పైవిధంగా, విమర్శకులు భావించియుండవచ్చును అదేసమయంలో 'రాగామాలా' చిత్రాల రచన జరిగింది ఈ రాగామాలా చిత్రాలలో అభివర్ణించిన భావాలనే పదిహేడవ శతాబ్దం ఆఖరివరకూ చిత్రకారులు చిత్రీకరిస్తూ వచ్చారు సంగీతం, గానం, నృత్యం, మతప్రచారంలో అనగా, చైతన్యుని కృష్ణస్తుతిలో మిళితమయి, జనాన్ని సమ్మోదభరితుల్ని చేసినవి కావ్యమూ, చిత్రరచనా, చేదోడు వాదోడుగా నడిచినట్లే, కావ్యమూ, సంగీతమూ కూడా ఒకదాని నంటి ఒకటి అభివృద్ధి చెందినవి పూర్వం ఉన్న భావావేశాలకీ, మతావేశాలకీ, భక్తిప్రపత్తులకూ, గానసరళికీ అనుకూలంగా కావ్యరచన సాగింది. ఆ కావ్యాల ననుసరించి, చిత్రరచనకూడా అదే ఉద్వేగంలో జరిగింది ఆవిధంగా సేకరించిన గీతాలూ, చిత్రాలూ కలిసి, 'రాగమాల' లయినవి అందులో చిత్రించిన నాట్యభంగిమలు వాస్తవంగానే చూచి వేసినవని విమర్శకు లన్నారు ఆ భావముద్రలన్నీ తు చ తప్పకుండా తీసుకురాబట్టే వారు వాస్తవికతను అవలంభించారని మనం రూఢిగా నమ్మవచ్చును

తదుపరి చిత్రాలు అంత గొప్పవి కావని చెబుతారు అందులో సగం మొగల్ శైలి కొట్టవచ్చినట్లు కనపడుతూ స్వచ్ఛందమైన శైలిలేక రచించినవి కాబట్టే, ఆ మాదిరి విమర్శ వాటిపై వచ్చియుండవచ్చును ఈ తరగతికి చెందిన చిత్రాలను, ఒక పుస్తకరూపంలో ఆర్చిబిషప్ లాడ్ ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయానికి బహూకరించాడని తెలుస్తుంది ఆ పునకంపై ఒక విమర్శకుడు ఆ చిత్రాలతో పొందిక హాయిగాలేదనీ రేఖలలో లయా సాదృశ్యాలు కూడా నైపుణ్యంతో ప్రదర్శించలేదనీ వ్రాశాడు మరితరగతికి చెందిన ఒక చిత్రసంపుటిలో జహంగీర్ కాలంలో చూపిన పనితనం, వస్త్రధారణంలోనూ, లయా వర్ణికాభంగంలోనూ తేలికగా గమనింపవచ్చును పూర్వం మామూలు తాటియాకులమీద రచించిన చిత్రసరళిమాదిరి కాక, తరువాత జహంగీర్ ఆదేశంపై వ్రాసిన ప్రత్యేకరచన కూడా వాటిలో కాననగును. ఏది ఎట్లా ఉన్నా "చౌర—పంచశిక" గ్రంధానికి రచించిన చిత్రాల నాధారం చేసికొనే రాగామాలా చిత్రాలను రచించారనేది సత్యం ఈ రాగమాల తరగతిలోని మూడు చిత్రాలు మాత్రం బ్రిటిష్ మ్యూజియంలో నున్నవి. వీటిలో హావభావప్రదర్శన చిత్రకారులు ఎంతో నిగ్రహంతో చేసారు. మీదుమిక్కిలియైన అలంకారం లేకుండా కాగితంలోనున్న స్థలాన్ని ఎంతో నిగ్రహంతో వాడి, దాని కనువైన, పొందికైన రేఖలతో చిత్రించిన తీరుకూడా ప్రశంసార్హం. ఈ పద్ధతినే తరువాత చిత్రరచనలో కూడా గమనింపవచ్చును.



'శ్రావణమాసం'—పశ్చిమ భారతి శైలి ('బారమాసలో' ఒక చిత్రణ); 19 వ శతాబ్ది

కొంతమంది—అనగా గుజరాతుకు చెందిన కొందరు విమర్శకులు, రాజపుత్రశైలి కేవలం, గుజరాతులో ప్రవర్థిల్లిన చిత్రశైలిలోనే అనుకరించబడిందనీ, అదేకాక గుజరాతు చిత్రశైలియే రాజపుత్రస్థానం అంతా ప్రాకిందనీ, వారికి గర్వకారణంగా ఉండే—అభిప్రాయాలను వెలిబుచ్చారు అయితే గుజరాతీశైలిలోని పాటవమే, రాజపుత్రశైలిలో ఉందనేది సత్యం ఎన్ని విధాలుగా ఆలోచించినా గుజరాతీచిత్రశైలి పదిహేను, పదహారు శతాబ్దాలలో అత్యున్నతస్థాయిని పొందిందనీ, అదే రాజపుత్రశైలికి ప్రాకి కొద్ది కొద్దిగా పర్షియన్ శైలి నవలంబింపచేసిందనీ—చారిత్రకంగా తెలుస్తుంది. ఎంతైనప్పటికీ, రాజపుత్రశైలికి మొగల్‌శైలిక్రిందిస్థాయిలోనిదే కాని, దానితోపాటు పోల్చి చూచినప్పుడు దానికన్న ఉన్నతస్థాయి నివ్వ వీలుకాదు

మొగల్ సంస్థానంలోని ముఖరూప చిత్రరచనను రాజపుత్ర చిత్రకారులు అవలంబించక పూర్వమే, రాజపుత్రస్థానంలో, వందిమాగధులు, ఆయా రాజుల శౌర్యధైర్యాదులను గూర్చి పొగడుతూ వారి వ్యక్తిగత విశేషాలనుగ్గడిస్తూ స్తోత్రగానాలు చేస్తూనే వచ్చారు! అనగా ఇది పదిహేనవశతాబ్దికిపూర్వవిషయం పద్దెనిమిదవ శతాబ్దంలోనే రాజపుత్రరచనలో సంస్థానపు దృశ్యాలను రచించటం ప్రారంభం అయింది డాక్టర్ గోయెజ్, రాజపుత్ర స్థానంలోని కొన్ని పెద్ద సంస్థానాల్లో భద్రపరచిన చిత్రాలను బాగా పరిశీలించి, ఆ చిత్రాలు పదిహేనవ శతాబ్దంలోనివీ, ఆ తరువాత చిత్రించినవే కాని, అంతకు పూర్వపువి కావనీ, ఆ చిత్రాలలో మొగల్‌శైలి సాదృశ్యం



రాతిపై నాతి-లినోకట్ చిత్రం: వేలూరి రాధాకృష్ణ

ఎక్కువగా కనిపిస్తుందనీ అభిప్రాయపడినాడు అల్లాంటి చిత్రాలు, ముఖ్యంగా జైపూర్, జోధ్పూరు, సంస్థానాల్లో ఉన్నవట 1725 వరకూ రచించిన రాగమాలా చిత్రాలలోకూడా మొగల్ శైలి పొడసూపినదనికూడా అభిప్రాయపడినాడు. దీనినిబట్టి చూస్తే, శిల్పనిర్మాణంలోవలె, చిత్ర రచనలో కూడా, ఉత్తరహిందూస్థానంలో అంతటా, పద్దెనిమిదో శతాబ్దం వరకూ మొగల్ శైలి ప్రాబల్యం బాగా కలదని అభిప్రాయ పడవలసి వస్తుంది. పద్దెనిమిదవ శతాబ్దపు రెండవపాదంలో మంచి బలసమన్వితాలైన సంస్థానాలు 'జమ్మూ', 'కాంగ్రా' అనే విషయం సత్యం జమ్మూ పరిపాలకుడైన రంజిత్‌సింగ్ చాలా పెద్ద దేశాన్ని—అనగా బసోలీ సంస్థానాన్ని కూడా కలుపుకొని రాజ్య మేలాడు బసోలీ రాజైన లమ్రుత్‌పాల్, రంజిత్ అదుపులోనే ఉంటూ వచ్చాడు. కాంగ్రా సంస్థానంలోనే విశిష్టమైన చిత్ర రచన జరిగిందనీ, దానికి మొగల్ చిత్రాకారులు కూడా చేయూత నిచ్చారనీ తెలుస్తుంది. డాక్టర్ గొయజ్ అభిప్రాయం ప్రకారం కాంగ్రా చిత్రరచన ఘమండ్‌చంద్ పరిపాలనాసమయంలో ప్రారంభమయి సంసారచంద్ పాలనలో మంచి ఉన్నతస్థాయి నాక్రమించింది సంసార్‌చంద్ కాంగ్రా చిత్రరచనను చాలా ప్రోత్సహించి 'కాంగ్రా' నే ఒకవిశిష్ట సాంస్కృతిక కేంద్రంగా మార్చిన విషయం ఎంతో మెచ్చుకోతగింది ఈ కాంగ్రా చిత్రరచనా శైలియే, కాశ్మీరు, లాహోరు, ఘర్వాల్, చాంబా ప్రాంతాలవరకూ ప్రాకి, ప్రఖ్యాతిని గడించింది. సంసార్‌చంద్ తదనంతరం ఆ చిత్రరచన పతనమయినప్పటికీ, సిక్కు రాజుల పరిపాలనలో కూడా ఆ రచనాశైలి కొనసాగుతూ పంథొమ్మిదవ శతాబ్దం మధ్యవరకూ వచ్చింది.

మొత్తంమీద, రాజపుత్ర శైలిలో కాంగ్రా చిత్రములను అత్యుత్తమమైనవిగా డాక్టరు ఆనందకుమారస్వామి మెచ్చుకున్నారు వివిధశైలులన్నీ కలిసి ఒక జీవనదీప్రవాహంవలె రాజపుత్రశైలిని పునీతం చేసి, ఉన్నత స్థాయిని పొందినవని మ[illegible]రమూ మెచ్చుకొని తీరాలి!

(ఇందులోని రేఖాచిత్రాలు పురాణవర్ణచిత్రాలకు వా ప్రతికృతులు)

వాల్మీకి కోకిలము

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

'వల్మీక ప్రభవో యస్మాత్తస్మా ద్వాల్మీకి రిత్యసౌ'—వల్మీకమునుండి వచ్చిన వాఁడే వాల్మీకి పుట్టంబుట్టువని తెలుఁగు కవులు పెట్టిన పేరు అతఁడు కవితాశాఖ నెక్కి 'రామరామ' యని మధురాతి మధురముగా కూసెడి కోయిల యఁట కాకి గూఁటిలో పుట్టి పెరిఁగి కూఁతకు వచ్చిన కోకిలము రెక్కలు రాఁగానే కుహూకహూ యని కూయుచు మకాము మార్చుకొనునఁట. ఆటవికుఁడుగా పుట్టి బ్రతికిన ఒనానొకఁడు ఆది కవిగా మారిపోయెను ఒక నాఁటి ఘట్టములో పుట్టిన శోకమే శ్లోకముగా పరిణమించెను ఆ శ్లోకమే మహాకావ్యమునకు నాందియై మహాపురుషవృత్తాంతమునకు మూలమా యెను. ఇది యంతయు ఒక విచిత్రమైన పరిణామ ఘట్టము

లోకోద్ధరణార్థమై వేదార్థోపబృంహణము కావించినవారిలో వాల్మీకి మహర్షి మొదటివాఁడు. అతని రచనమే రామాయణము అదియే లోకములో ఆదికావ్యము వేదములోని ఉత్తరభాగమైన ఉపనిషదర్థమును బోధించుటకే 'ఇతిహాస—పురాణములు' పుట్టినవి అక్షర సంఖ్యనుబట్టి "పురాణేతిహాసము' లని పిలువవలసి యుండగా అభ్యర్హిత మగుటచే ద్వంద్వములో ఇతిహాసమే మొదటికి వచ్చినది ఇతిహాసమనుగా పూర్వరాజుల వృత్తాంతము రామాయణ భారతములా తెగలోనివే రామాయణమునకు కర్త వాల్మీకి కాఁగా—భారతమునకు కర్త వ్యాసుఁడాయెను

రామాయణ భారతములలో కాలమును బట్టి ఏది పూర్వము ఏది పరము అన్న వివాదము, ఇటీవలి చదువులలో ఉద్భవించినది భారతములో రామాయణగాథ ఉండుటఁజేసియు శ్రీరాముఁడు త్రేతాయుగమువాఁడగుటఁజేసియు పాండవులు ద్వాపరమువా రగుటఁ బట్టియు రామాయణ కాలము భారతకాలముకన్న పూర్వము గదా యని సనాతన సంప్రదాయ మున్నది భారతములోని రామాయణ కథను ఇటీవల చేర్చిరనియు, రామాయణము నాఁటి నాగరకత భారతకాలమునాఁటికి లేదనియు కావున రామాయణ కాలమే నవీనమనియు నవీనులలో కొందఱి వాదము అది ఏది యైనను వాల్మీకి ఆది కవియనియు రామాయణము ఆది కావ్యమనియు వాఙ్మయములో ఎందఱో నిర్ణయించి చూపిరి

'వాల్మీకి నాదశ్చ ససర్జ పద్యమ్'—అని అశ్వఘోషుఁడు

"స్వకృతిం గాపయామాస కవిప్రథమ పద్ధతిమ్'—కాళిదాసు.

'బభూవ వల్మీకభవః కవిఃపురా'—రాజశేఖరుఁడు

'అథ భగవాన్ ప్రాచేతసః ప్రథమం మనుష్యేషు శబ్ద బ్రహ్మణం తాదృశం వివర్తమితిహాసం రామాయణం ప్రణినాయ'—భవభూతి.

'భాస్వద్వంశవతంస కీర్తిరమణీరంగ ప్రసంగ స్వనద్వాదిత్ర

ప్రథమధ్వని ర్విజయతే వల్మీక జన్మామునిః,—జయదేవుఁడు.

'శుభ మతనుత కావ్యం స్వాదు రామాయణాఖ్యం

మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షిః'

—భోజుఁడు, ఇట్లే ఎందరో.

అనఁగా వేదములలో ఓంకారము వోలె మానవులలో మనువు వోలె కాలమును బట్టియే కాక, గుణమును బట్టి కూడ వాల్మీకియే మొదటివాఁడన్న మాట పూర్వులు నిర్ణయించిన బాట. లౌకికవాఙ్మయములో శ్రీకారము చుట్టినది వాల్మీకి రామాయణమని తేలుటచే ఆదికవి యనఁగా వాల్మీకి యనియు ఆది కావ్యమనఁగా అతని రామాయణ మనియు సిద్ధాంతము చేయువచ్చును

భారతముపంచమవేదము కాఁగా రామాయణము మహాకావ్యమైనది భారత కథానాయకుఁడగు శ్రీ కృష్ణమూర్తిని ఉపదేశబలమును బట్టి పండితులే గుర్తింపవలసి యుండుగా రామాయణ కథానాయకుఁడుగు శ్రీరామ చంద్రమూర్తిని అనుష్ఠాన పాటవముచే పామరులు సైతము సేవింపవచ్చునని యభిజ్ఞు లందురు ఎదుట నున్న వస్తువుమాత్రమే అద్దములో కన్పింపఁగా కాలాంతరమందున్నదంతయు కావ్యమునఁ గన్పట్టును విశ్వస్రష్ట కావించిన సృష్టి, అద్భుతము అనంతము కావచ్చునుగాని అది యొకనాఁడు జీర్ణమై పోవచ్చును ప్రళయమే పొందవచ్చు ఇఁక—కవిబ్రహ్మ సృషి కో జరామరణములే లేవఁట ప్రజాపతి సృష్టిలో శోకక్రోధములు కావలసినన్ని. వానివలన లోకమునకు రోఁత పుట్టవచ్చును భీతి కలుగవచ్చును కవి యొనర్చు సృష్టిలో అట్టి వన్నియు ఆనందరూపముగ పరిణమించి పరిఢవించును ఉదాత్తమైన నాయక వృత్తాంతమును బట్టియే కావ్యమున కీ ఘనత యేర్పడును 'కావ్యాలాపాంశ్చ వర్జయే' త్తన్నమాట అసత్కావ్యములను గూర్చియే యని నిష్కర్షచేసిరి కావ్యమున కెక్కిన మహారాజులు భౌతికముగా ఎన్నఁడో గతించునను చరిత్రలో వారిని బ్రతికించునది ఈ కావ్యమే. కావుననే కవిని కవిబ్రహ్మయని కవీశ్వరుఁడని వ్యవహరింతురు

వియద్గంగను భూమికి దించినవాఁడు భగీరథుఁడు కాఁగా ఆ భగీరథి నందరు స్నానపానములకై వాడుకొందురు ఆదికావ్యమును వాల్మీకి సృష్టించి ఈయఁగా అనంతర మందలి వస్తువునే తీసికొని కాళిదాసాదు లెందరో మనోహర కావ్యములుగా వ్రాసి మన కిచ్చిరి మధురాతి మధురముగా వాల్మీకి కోకిలము కూయుటకు క్రౌంచమిథునము కారణమైనది అకాండ ప్రాణిహింసను గన్నులారఁ గాంచిన వాల్మీకి మహర్షికి శోకము కలిగి ఉద్రేకము పొడమి ఛందోబద్ధముగా వాణివెడలి రామాయణముగా అవతరించెను — ఒకానొక ఆవేశము, ఆవేదన కలిగినప్పుడే నిజమైన కవిత్వ ముద్భవించు ననుటకింతకన్న సాక్ష్య మింకేమి కావలెను ? ఆ యావేశమే ఒక సత్సంకల్పమై మహాకావ్యముగా పరిణమించినది

వట్టి శబ్దార్థములే కావ్యము కానేరదు ఆ శబ్దార్థములలో సాహిత్య ముండవలెను. సర్వశాస్త్రముల సారమే సాహిత్యము సాహిత్య శబ్దము కావ్యప్రపంచమును జ్ఞప్తిచేయు చుండును ఏవం విధ లక్షణ లక్షితమైన వాల్మీకము మనకేమి బోధించినదో రవ్వంత చూతము

రామాయణ ప్రావిర్భావమునకుఁ గారణమైన క్రౌంచమిథున ఘట్టమువలన నిషాదుని చర్య అసహ్యమై ఆ మహర్షికి ఒకానొక ధర్మోపదేశము స్ఫురించినది ఏమని ! ఓయి వ్యాధుఁడా ! కామ మోహితమైన క్రౌంచమిథునములో ఒకదానిని జంపితివి కావున నీకు శుభము లేదు—అని ఈ భావముతోబాటు—ఓ రామయ్యా ! కామ మోహితుఁడైన రావణుః సంహరించిన నీవు శాశ్వత ప్రతిష్ఠ నందెదవు గాక—అన్న మరొక భావము కూడ స్ఫురించును. కావ్యార్థ సూచనగా సాగిన క్రౌంచమిథున ఘట్టమే రామాయణకావ్యమును లోకమున కిప్పించినది ఈ కథలో మనకు పిండార్థముగా రెండు విధాల ధర్మోపదేశము వ్యక్తమగును. 'రామాది వద్వర్

త్వ్యవన్—న రావణాదివత్' మంచి సెబ్బరలలో మనము రామరావణులను ఆదర్శముగా ఉంచుకొని సంచరింపవలెను ఇదే కావ్యోపదేశము. వేదశాస్త్రములు ప్రభుసమ్మితములు కాఁగా కావ్యము కాంతాసమ్మితమగునఁట ప్రియకాంత, సన్నిధిలో నుండి మెత్తని సూక్తులతో హృదయమున కత్తుకొను రీతి—ఇది మంచిది ఇది కాదు—అని హితోపదేశము చేసినట్లు, కావ్యము మనకు కర్తవ్యము నిరూపించి హితోపదేశము చేయునని శాస్త్రము చెప్పును కొన్ని యెడల పెడత్రోవను పట్టించు కావ్యములు కూడ ఉండవచ్చునన్న భావముతోనే 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అన్న కారిక పుట్టియుండును ఆకారికకు బొత్తిగా అన్వయింపని ఈ రామాయణ కావ్యము మనకు నేర్పిన అంశములు మన కలితములు గావు మనలో మనము నిచ్చలు ఆచరణములో ఉంచుకొనవలసిన అంశము లనేకములు మృదువుగా కథారూపముగా వాల్మీకి మనకు ఉపదేశించెను ఆ యుపదేశముల సారమును బట్టియే—ఆ రచనలోని మాధుర్యమును బట్టియే వేల తరబడి యేండ్లుగ ఈ దేశములో ఈ కావ్యమును భారతీయు లారాధించుచున్నారు రాముడు కేవలము జగదేకవీరుఁడని మాత్రమే కాదు మనము ఆరాధింపవలసినది అంతటి జనవత్త్వము లుండియు ఆతఁడు తండ్రిమాట జవదాఁటక లోకారాధనమే శ్రేయమని నమ్మి ధర్మసూత్రమునకుఁ గట్టుపడియున్నాఁడనియే మనము గుర్తింపవలెను సీతను మించిన సుందరీమణులు ఈ లోకములో ఎందఱో ఉండవచ్చును కాని, ఆమె శీలమువంటి శీలము అందఱిలో మనకుఁ గన్పింపదు. రామానుజులు మువ్వురుండుగా ఒక్క లక్ష్మణుఁడే రామానుజ పదవాచ్యుఁ డగుటలో అర్థమేమో మనము గుర్తింపవలెను గుణగణములో లక్ష్మణుని కన్న భరతుఁడే మేలన్నమాట రాముని నోటనే మనము వినుట వలన రాముని శీలములోని విలువయు స్పష్టముకాఁగలదు అసలు రామాయణ కథ లౌకికముగా జరిగెనో లేదో కాని వాల్మీకి చేతిలో ఈ మూర్తులు దివ్యమూర్తులుగా వెలసిరి

ఉత్తమ శ్లోక గుణాభివర్ణనమే కావ్యమునకు ముఖ్యమన్న సంప్రదాయమును వాల్మీకము మనకుఁ జెప్పినది రాజ శాసనముగా ప్రవర్తించు శాస్త్రముల జోలికిఁ బోలేనివారికి కాంతా సమ్మితమైన ఈ కావ్యము, మానవుల కుండవలసిన యుత్తమఁ గుణము లన్నియు బోధించినది సత్యము, ధర్మము, శౌర్యము, ధైర్యము, క్షమ, శాంతి, దాంతి దయ దాక్షిణ్యము—ఇట్టి వన్నియు రామాదుల పాత్రల మూలమున వాల్మీకి మనకు నేర్పెను. ఒక కుటుంబమును దీసికొని వారివారి వివిధమానసిక ప్రవృత్తులచే మనకు నేర్పవలసిన నీతు లన్నియు మనోహరముగ బోధించినది ఈ వాల్మీకము సీతవంటి భార్య, భరత, లక్ష్మణుల వంటి తమ్ములు, శ్రీరాముని వంటి బిడ్డ, లోకములో ఎందఱు ఉందురో పరిశీలించి చూచినచో రామాయణ కావ్యము మనకు అర్థమైనట్లే వేలకొలఁది యేండ్లకు మున్నే ఈ కావ్యములో నిర్మయించి చూపిన గృహస్థ ధర్మములే నేఁటికిని చెక్కు చెదరని రీతిలో కొంతవఱకు ఆచరణములో నున్న వనుటకు ఈ యాది కావ్యమే కారణము. కావచ్చును ఇందలి ఇరువదినాలుగువేల శ్లోకములలో ఒక్కొక్క వేయికి ఒక్కొక్క యక్షరముగా గాయత్రీ మంత్రమును ఆదికవి కూర్చెనన్నమాట మనకుఁ దెలియక పోవచ్చును వేద మంత్రములన్నియు గాఢముగ గూఢముగ ఈ కావ్యములో అన్వయింపవచ్చునన్నవిషయము మన మెఱుఁగకపోవచ్చు కాని, యుత్తమగుణములు గల మానవుఁ డెట్లు సంచరింపవలెనో నూటిగా ఈ కావ్యము వలన మనము గుర్తించి హాయిగా మెలఁగి చరితార్థుల మగుటకు మార్గము లున్నవి అదే, ఆదికవి ఆర్షకవియై మన కిచ్చిన మహాభాగ్యము! ఈ భాగ్యము చెక్కుచెదరక ఇన్ని యేండ్లుగా అనుస్యూతముగా మనకు దక్కుటచేతనే—ఇది విశ్వశ్రేయముగా మనము భావించుటకు కారణము లుండుటచేతనే కావ్యము విశ్వశ్రేయ మన్నమాట—ఋషి కానివాఁడు కవి కానేరఁడన్న సూక్తి మనము పాటింపవలసి వచ్చినది

సత్యవాక్పరతి సదుపదేశము పితృవాక్యపరిపాలనరూపధర్మాచరణము—ఐహిక భోగవిరక్తి స్వధర్మాచరణము—ఆశ్రిత సంరక్షణము ప్రజా విశ్వాసము, భ్రాతృవాత్సల్యము, పాతివ్రత్యమహిమము, లోకారాధనము—ఇట్టి యంశములచే రామాదులను ఉత్తమ పాత్రలనుగా చిత్రించి రామాయణమును మహాకావ్యముగా నిర్మించి వాల్మీకి మహాముని సర్వవాఙ్మయమునకు మార్గదర్శి అయ్యెను. రామాదులవలన వాల్మీకికి ఖ్యాతి గలిగెనో వాల్మీకి వలన రామాదులకు కీర్తి నిలిచెనో గుర్తింపవలసిన బాధ్యత మనది విశ్వస్థితికి రామ పరబ్రహ్మము కారణము కాఁగా ఆయన యునికికి వాల్మీకి హేతువాయెను సర్వసైన్యముతో సర్వాస్త్రములతో రాముఁడు ఒక్క రావణుని సంహరింపగా ఒక్క రామనామముతో వాల్మీకి అనంతమైన పాపములను అంతరింపజేయుచుట సర్వ రసానుభూతిని కావ్యములోఁ జూపి కవులకు వంశకర్తయైన వాల్మీకి శాంతిని విడనాడని వేదాంతియు నయ్యె వాల్మీకి హృదయ మెఱిఁగిన వారికి, వాల్మీకము చదువ నేర్చినవారికి ఇతర కవుల ప్రసక్తితో ఇతర కవుల కవనముతో పనిలేదఁట అది యెఱుఁగనివారికి ఇతరము లన్నియు నున్నను లేనట్లే లెక్క సామ్రాజ్యము కావలెనా, వాల్మీకి కావలెనా అన్న ప్రశ్నలో గుణముమబట్టి విలువనుబట్టి వాల్మీకియే నిలుచునఁట ఆ పరంజ్యోతి, స్వీయ చరిత్రను వర్ణింపవలెనని తలఁచి వాల్మీకిని వైకుంఠమునుండి దించెనేమో లేనిచో ఆతని కీడైనవాఁడు కవులలో ఇంతవరకు పుట్టలేదేమి!

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి

శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి

వివరింపన్ సకలంబు దుఃఖమగుచు న్వ్యాపారు లోకంబులోఁ
దివురున్ వ్యర్థముగాఁగజీవి సుఖముం దేఁగల్గునే సంసృతి
ప్రవణుండై చెడుగాక లోయెడఁదలోఁ బాలించు చిద్దీపమున్
శివమూర్తిం గనలేక నిన్ను జడుఁడై శ్రీ రాజరాజేశ్వరా!

వెనుకన్ భూతము మృత్యురూపమగుచు న్వెంటాడఁగా భావియున్
వెన్నుద్రోయన్ క్షణవర్తమానమగుచున్ ప్రేలాడు కాలంబులో
జనుడుం దాను సనుక్షణంబు బ్రతుకున్ సాగింప యత్నించెడున్
జెనసై కత్తెరవెట్టునం చెఱుఁగఁడే శ్రీ రాజరాజేశ్వరా!

అంతామిథ్య యటంచు వేజమతియేలా చెప్పలేశంబుకై
సంతోషించును తేపు గల్గునని యా సౌఖ్యంబు ప్రాపించి ని
ష్క్రాంతంబై చనుఁజూచుచుండఁ గరఁగున్ గాలంబులో సర్వమున్
జింతింపండిది సుంతయైన జడుఁడై శ్రీ రాజరాజేశ్వరా!

కాంతో పుత్రులో యర్థమో గళముపై కంతైన సంసార దు
శ్చింతల్ బెట్టుట గట్టిమానసమునం జీకట్లు నింపంగ ని
శ్చింత న్నిద్దురపోవుగాని వేఁగుం జింతింపఁ డావంతయుం
జింతారత్న మవంచు నిన్నెఱుఁగఁడున్ శ్రీ రాజరాజేశ్వరా!

మథియింపన్ బహుకామ భావనములున్ మర్దింప రోగమ్ములున్
బెదరింపన్ జర మిత్తి నోటికడిగా బ్రమింగన్ జ్వాలద్వహ్నిలోఁ
బ్రదహింపంబడు దేహమిందు మమకారం బెంత కల్పించితో
చిదరంతైనను జారిపోని యటులన్ శ్రీ రాజరాజేశ్వరా!

విసువేపుట్టద జీవితమ్మున నిసీ! వీసమ్ముగా నైన నే
మిసుఖమ్మున్నది మేసినట్లెకస వేమేయంగనభ్యస్తమా
పశునే మే గనిపించెదున్ పశుపతీ! పాలించు గౌరీపతీ!
అశనస్వాపన మైథునార్తుఁడు డనుండై రాజరాజేశ్వరా!

ప్రవహించుం గవగూడి దేనికదియై ప్రాజ్ఞత్వ మజ్ఞత్వ మా
ప్రవివేకంబది దైవగత్యవిహతిన్ భాషింప వెన్వెంటనే
యవివేకంబదె పోయెఁ బోయె నని దుఃఖాలాపముం జేయు నే
మి విచిత్రంబగు సృష్టి సేసితివి స్వామీ రాజరాజేశ్వరా!

అదియల్లేయగు నన్ననట్లయగుఁ దానద్దానివారింపగన్
విధియుం జాలఁడ యట్టివో జనుఁడు యత్నించుంగదా మూఢుఁడై
యది యజ్ఞానము గూటిపట్టు మొదలై యల్లెన్ జనుస్సంతుతుల్
మృదుచూడాశశివద్దరస్మితముఖా! శ్రీ రాజరాజేశ్వరా!

ఇదియేదో యటవీప్రయాణమున నిండీ మార్గమే మార్గమన్
పదమేమున్నది యేదొపట్టుకొని పోవంబోవ నే పల్లెయో
పదఁడో వచ్చుననంగ గమ్యమగుచుం బలించుచందాన నీ
వెదురై రావలె నాదుకోవలెను దండ్రీ! రాజరాజజేశ్వరా!

ఈ జన్మంబుల నెత్తియెత్తి విసువై యేకారితిన్ ధూర్జటీ!
రాజద్రాజకళాకిరీట! రమణీరమ్యార్ధ దేహా! శివా!
ధీజాడ్యంబు దొలంచి నాయెడఁద నీ తేజంబు నిండింపవే!
యీ జన్మంబుల గోడడంపవె! పురారీ! రాజరాజేశ్వరా!

సిగలో జాబిలిలేదు లేదుతలపై సింగారి గంగమ్మయున్
సగమంగంబున గౌరు లేదు మెడలో సర్పేంద్రుడున్ లేడహో
తిగకంటన్ బెనుమంటయొండె ప్రభువై దీపించు చూడాశశీ!
అగజానాయక! సర్పహార! ధృతగంగా! రాజరాజేశ్వరా!

దాసరుల పరిభాష: "పల్నాడు"

శ్రీ శ్రీ వాత్సవ

ఆంధ్రదేశంలో చిరకాలంనుండి స్థిరనివాసం ఏర్పరుచుకొన్న పరదేశీ సైనికులు కొందరున్నారు వీరు కాకతీయుల నాటినుండి, విజయనగర రాజుల కాలమునుండి మనదేశమునకు దండెత్తి వచ్చిన మూకలలో చేరినవారై చివరకు ఇచ్చటనే నిలిచిపోయి, ఆంధ్ర దేశస్థులుగా మారిపోయినవారున్నారు శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్ర వ్రాయుటకుముందే పల్నాటి యుద్ధము జరిగినదికదా! అప్పటికే ఈ దాసరులు పల్నాటి సైన్యములోచేరి ఏదో యొక పక్షమున యుద్ధముచేసియుందురు. నాయకురాలు, బ్రహ్మనాయుడు పెత్తనము నెరపిన రోజులలో 'చాపకూడు' పరిపాటి అయినది చెన్నకేశ్వరస్వామి ఆలయంలో కుల మత భేదములు పాటించని ఆచారములు ప్రవర్తిల్లినవి. వైష్ణవ భక్తులయిన కొందరు తమిళ దేశమునుండి, మహారాష్ట్రమునుండి, కన్నడ ప్రాంతములనుండి వచ్చి, యుద్ధముచేసినట్లు గ్రహించవచ్చును యుద్ధకౌశకాలము, రణనీతి అంతగా తెలియనివారు, సైన్యమునకు సాహాయ్యముగానుండు దళములలో వంట చేయువారుగా, చిన్నపనులు చేయువారుగా పల్నాటిదండులో వీరు చేరినట్లు అప్పటి చరిత్ర పరిశోధించినచో గ్రహించవచ్చును వీరందరు దాసరులే వైష్ణవ భక్తులే ముందు 'పోరగాళ్ళ'గాచేరి, తరువాత భజనకీర్తనలుపాడు దాసరులుగా దేశ మంతటా పర్యటనము చేసియున్నారు అంతేకాక,వీరు వివిధవృత్తులతో జీవిస్తూ ఒక్కచోట స్థిరనివాసం అని లేకుండా వూరూర తిరిగి పొట్టపోసికొన్నారు పైగా కొందరు పాటలుపాడేవారు మరికొందరు ఆటలు ఆడేవారు కొందరు జట్టులుగా కూడి నాటకాలు వేసేవారు వీరిలో కొందరు వీరశైవము మతముగా స్వీకరించి, జంగమ దేవరలుగా ఊరూర తిరిగి, శివనామ సంకీర్తనలు చేసేవారు శివభక్తి ప్రచారముచేయువారు జంగములు దారి జంగములు పాట వీరశైవము ఉప్పొంగచేసే వీరగాథగానో, శివలీలగానో ఉండేది వైష్ణవ సంకీర్తనలు చేసేవారు దాసరులుగా పేరుపొంది, భజనలు చేసేవారు పాటలు పాడేవారు కొమ్మ దాసరులుగా కొమ్మలెక్కి ఊరూర సంచారంచేసి, ఉంఛవృత్తిచేత జీవించేవారు కొందరు కలిసి ఒకజట్టుగా ఏర్పడినపుడు వీధినాటకములు వేసేవారు వానిలో హెచ్చు భాగవతములోని గాథలే యగుటచేత, ఇదివేసేవారికి వీధి భాగవతులని పేరు వచ్చినది ఇట్టి భాగవతులలో మాలదాసరులు, మాల భాగవతులు, యానాది భాగవతులు, గొల్లభాగవతులు ఉండేవారు గొల్లలలో యెఱ్ఱిగొల్లలు, కన్నడ, మరాటీదేశాలనుండి వచ్చిన గోపాలకులు వీరు మందలుగా ఆవులను తోలి, తెచ్చి సైన్యమునకు వెనుక బలంగా ఉండేవారు కొందరు గూఢచారులుగా యుద్ధవర్తమానములను అందజేసేవారు. ఆ కారణంచేతనే వారిలో ఒక పరిభాష ఏర్పరచుకొని, ఆ సంకేతములతో తమ అభిప్రాయాలు గోప్యంగా వెల్లడి చేసేవారు అది—ఆ జట్టులో వారికి తప్ప, ఇతరులకి తెలిసేది కాదు ఈ పరిభాష, "పల్నాడు" అనే పేరుతో తెనుగుదేశంలో ప్రచారంలోకి వచ్చినది పల్నాటిసీమలో పుట్టిన కారణంచేత యీ పరిభాషకు "పల్నాడు" అని పేరు వచ్చినదేమో! ఇది ఏడెనిమిది వందలయేండ్లనుండి తెనుగు దేశంలో నలుమూలల వ్యాపించి యున్నది ఇది మాటలాడేవారు దేశద్రిమ్మరులయిన గొల్లల 'దాసరులు ఎఱ్ఱిగొల్లలు, కొమ్మ దాసరులు, విప్ర వినోదులు, వీరముష్టివాళ్ళ, ఇటువంటివా రెందరో వాడుకునేవారు. ముఖ్యంగా వీధిభాగవతాలువేసే ఎఱ్ఱిగొల్లలు తమభాగవతాలు ప్రదర్శించే సమయంలో ముందు వెనుక వాడేవారు. అందుచేతనే నాటకాలకు చెందిన పరిభాషా పదాలు ఈ "పల్నాడు"లో కనిపిస్తున్నాయి ముందు సైన్య రక్షణదళాలలోనూ, గూఢచారులలోను, తరువాత పశువర్ధకదళాలలోను చేరిన యీ యెఱ్ఱిగొల్లలు—క్రమ క్రమంగా భాగవతులుగా మారి, భాగవత మేళా ప్రదర్శనమే తమ జీవన వృత్తిగా మార్చుకొన్నారు. ఇటీవల అర్ధశతాబ్దినుండి ఆ వీధిభాగవతాలకు కూడ తగిన ఆదరణలేక—ఈ యెఱ్ఱిగొల్లలు వ్యవసాయమువంటి వృత్తిచేపట్టి, ఏదో మరొక జీవనోపాధి చూచుకొన్నారు కాని, నేటికిని కొందరు చక్కని నాటకాలు కట్టి పల్లెటూళ్ళలో ప్రచారం చేస్తున్నారు అదొక సరదా! అదొక కాలక్షేపం

నేటికిని యీ యెఱ్ఱిగొల్లలు పశ్చిమ గోదావరి జిల్లా, తణుకుతాలూకా దాసుళ్ల కుముదవల్లి గ్రామములో వీరున్నారు ఈ గ్రామంలోనే దాసరులున్నారు వీరే యెఱ్ఱిగొల్లలు పూర్వం ఈ గ్రామమంతా దాసుళ్లే ఉండేవారట అందుకే "దాసళ్ల కుముదవల్లి" అని పేరు ఈ గ్రామానికి వచ్చింది అంటారు ఇంకా చుట్టుప్రక్కల గ్రామాలయిన గణపవరంలోను, పెంటపాడులోను, మండపాక, వీర వాసరం, ఆకివీడు, తిరుపతిపురం మొదలయిన ఊళ్లలో చెల్లా చెదరుగా ఉన్నారు వీరిలో కొందరు నేటికీ నాటకాలు ప్రదర్శిస్తున్నారు. వాటికి నాటకామేళాలనిపేరు వారు ప్రదర్శనయిచ్చేవానిలో భామాకలాపం, చెంచు నాటకం, గొల్లకలాపం మొదలైనవి యెన్నోయున్నవి వీ రందరూ జట్టులుగా చేరి, ఒక్కొక్కజట్టుదారుడు ఒక్కొక్క ఊరుకాని, కొన్ని ఊళ్ల మండలముకాని తనకి ప్రత్యేకించుకొని ఆ ప్రాంతములలో ప్రదర్శన లిచ్చేవాడు అలాగ ప్రదర్శనలిచ్చేటప్పుడు ఒకరిమీద ఒకరికి పోటీలేదు వీరు పాడగలరు, ఆడగలరు మంచి వేషాలు కట్టగలరు దానికి కావలసిన దుస్తులు పరికరాలు సేకరించి ఒక నాయకుడు ఈ యెఱ్ఱి గొల్లలకు తగిన తరిఫీదునిచ్చి సంసిద్ధులను చేసేవాడు ఆ జట్టు నటకులు ఒక మేళంగా ఏర్పడి ఊరూర ప్రదర్శన లిచ్చేవారు. ముందు ఏ గ్రామానికి బయలుదేరివెళ్తున్నారో, అచ్చటి పెద్దల గుట్టు రహస్యాలు తెలికొనేవారు నాటకంలో సందర్భమున్నా, లేకపోయినా సమయ సముచితంగా స్థానిక విషయాలను చొప్పించేవారు దానితో అచ్చటి సభాసదులకి ఎంతో ఆనందంగా ఉండేది ఈ లాంటి నాటకాలు వేయుటలో క్రోసూరి ముత్యం అనే జట్టు నాయకుడు చాల కీర్తి నార్జించాడు ఆతడు రాజవేషాలు ధరించి మంచిరీవితో, దర్పంతో ఒప్పిందేవాడు అంటారు ప్రహ్లాదలో హిరణ్యకశ్యపుడు వేసినా, సారంగధరలో రాజరాజు వేసినా అతడే వెయ్యాలి అని ఉభయ గోదావరిజిల్లాలలో అతనిపేరు ఊరూర మ్రోగిపోయింది నేటికీ తిరుపతిపురంలో ఉయ్యూరు వెంకన్న ఆధ్వర్యంక్రింద గొల్ల భాగవతులు నాటకాలు ప్రదర్శిస్తున్నారు అయితే వీరందరూ వృద్ధు లయిపోయారు ఈ కాలంవారికి నాటకాలయెడల తగిన ఆదరాభిమానాలు లేక వారు మానివేశారు. మండపాక పైడిమర్రు గ్రామాలలో లక్ష్మీపతి, అరదాలు అనేవారు ఇప్పటికీ కొన్ని పౌరాణిక గాథలు తీసికొని, అక్కడక్కడ నాటకాలుగా ప్రదర్శిస్తున్నారు. పండుగ

ంకి పబ్బాలకీ, తీర్థాలకీ, తిరునాళ్లకు ఈ నాటకాలు ఆరు బయట వేసిన పందిరిలో ప్రదర్శిస్తున్నారు పెద్ద తెరలూ అవీ ఉండవు. వేషాలు మామూలే పాటకు వంతపాట, హార్మోనియమ్ శ్రుతి రాగములు దరువులు పూర్వ పద్ధతిలో ఉంటాయి పాత్ర ప్రవేశించినా, నిష్క్రమించినా దరువులు నృత్యములు మధ్య మధ్య హాస్యానికి సుంకర కొండయ్యవంటివాళ్లవచ్చి కాలక్షేపం చేస్తూ ఉంటారు. కొన్నికొన్ని సందర్భాలలో హాస్యం సభ్యతమీఱి ముతక హాస్యంలాగ పరిణమించడం కూడకద్దు. అయితే—మొత్తంమీద యీ యెఱ్ఱిభాగవతులు రాత్రి తెల్లవారులూ నాటకంఆడి, పండిత పామరులను మెప్పించగలరు ఈ నాటకాలు ప్రదర్శిస్తున్నప్పుడు, ప్రదర్శనానంతరం చందాలు దండుకునేటప్పుడు ఇతరులకు తెలియకుండాఉండే నిమిత్తం తమలోతాము ఒక విధమైన సాంకేతిక భాష వాడుకొంటారు. ఆ పరిభాషనే "పల్నాడు భాష"గా పలుతావుల వ్యవహరిస్తున్నారు.

వీరందరు రామానుజ మతస్థులే. కొందరు దాసరి పాటలు పాడుకొంటూ, భిక్షాటనం చేసికొంటారు. కొందరు—పిట్టలను కొట్టడంలో ప్రవీణులు మరికొందరు గాలంవేసి చేపలను పట్టుకొని జీవిస్తారు వీరందరికీ కుల పెద్ద ఉంటాడు. సమాజ విషయాలలోకాని, ఆర్థిక విషయాలలోకాని ఆతడు చెప్పిన తీర్పే న్యాయము పెళ్ళికూతురును తెచ్చుకునేటప్పుడు కన్యాశుల్కం చెల్లించడం వీరిలో సంప్రదాయం అయిదు వరహాలు ఇస్తే పెళ్ళికూతురును తెచ్చుకోవచ్చును వీరిలో భర్త పోయిన తరువాత భార్య వైధవ్యం అనుభవించ నక్కరలేదు. తిరిగి వివాహం చేసికొంటే, కులములో తప్పులేదు. కాని కుల పెద్ద దానికి అనుమతి యివ్వాలి కొంత రుసుము చెల్లిస్తే ఆ యనుమతి లభిస్తుంది వారు మనువులున్నవి ఏదైనా తప్పుచేస్తే కులపెద్ద ఒక శిక్ష విధిస్తాడు దాని ప్రకారం కొంత సొమ్ము అపరాధముగా చెల్లించవలసి యుంటుంది వివాహ పద్ధతి వైదిక మర్యాద ననుసరించి బ్రాహ్మణ పురోహితులే చేయిస్తారు కాని అంత్యకర్మలు, అశుచిక్రియలు మాత్రం చాత్తాద వైష్ణవులు(సాతానులు) చేయిస్తారు. వీరికి—కొన్ని గ్రామాలలో స్థిర నివాసంకంటె, దేశాటనంవలన ఊరూర తిరిగి రావడమే ఎక్కువ పరిపాటి కొందరు తోలుబొమ్మలాట వేస్తారు. మరికొందరు కీలుబొమ్మలాట వేస్తారు ఇంకొందరు రంగస్థలంమీద వేషాలుకట్టి—రకరకాల భాగవత మేళా ప్రదర్శనలిస్తూ ఉంటారు వీరందరూవాడే పరిభాష, పల్నాడులో, కొన్ని పదములు ఇపుడు పరిశీలన చేద్దాం

ఈ భాష ఎఱ్ఱి గొల్లలు, మందులవాళ్ళు, గంగిరెద్దుల వాండ్లు—కొమ్ము దాసరులు మొదలయినవారు వాడుతూ ఉంటారు కొన్ని పదములు గమనిస్తే, సంస్కృత శబ్దాలే వీరు వాడుకొన్నట్లు గ్రహింపవచ్చును. మరికొన్ని శబ్దముల ఉత్పత్తి చిత్రంగా ఉంటుంది. ఈ పదజాలములో విశేష్యములు, విశేషణములు కలవుకాని, క్రియాపదములు హెచ్చు లేవు క్రియాపదములు కారకములు తెలుగువే ప్రయోగిస్తూ ఉంటారు వాక్య విన్యాసములో తెనుగు భాషకు తప్పిన ప్రయోగాలుండవు. చూడండి మచ్చుకి కొన్ని పదాలు, వాటికిగల తెనుగు అర్థములున్ను—

గొన్ని —రూపాయి.
అర్ధగొన్ని:—అర్ధ రూపాయి.
సిటికం.—పావలా.
సిలప సిటికం.—బేడ.
నాగన్న కంచికాలు:—అణాలు.
తొడల కంచికాలు —అర్ధణాలు.
కంచికం.—నాణెమ్ము, సొమ్ము.
కాజాలు.—చేపలు.
కరేమద్దు:—మాంసం.
కొక్కడం:—కోడి
మబ్బన్నగాడు —కొంగ.
కావురుగాడు.—కాకి.
పుల్ల గరటాలు.—చింతకాయలు.
గరటాలు.—కాయలు.
వచ్చం —పొగచుట్ట.
నిప్పెక్కె:—అగ్గి పెట్టె.
నాగడం:—నోరు. మాట.
మరిసుం:—తల
నైనాలు:—కళ్ళు.
నాసకం:—ముక్కు.
పాద కష్టాలు:—చెప్పులు.
హస్తాలు —చేతులు
హస్తం గొన్ని —అయిదు రూపాయలు.
కొంద —బట్ట. వస్త్రములు
నాగన్న కొంద:—చిరిగిపోయిన బట్ట.
బడిసాలు.—దూడలు.
జినటాలు:—ధాన్యం.
అమర్త పళ్ళు:—బియ్యం.
తిరిచుట్లు —పిండివంటలు.
పానం —నీళ్ళు
కవట —కల్లు, మద్యం.
గందెం:—సారాయి.
కైపుతుం:—త్రాగుడు.
పుచ్చం.—స్త్రీ మర్మావయవం.
కొంకణం:—పురుష మర్మావయవం.
మిరువుగరటం —కారం.
ఉపా ముద్దు.—ఉప్పు
బొల్లి దొడుపుం —మజ్జిగ.
తైరు.—నూనె, నెయ్యి.
మంతాడు —మగవాడు.
కాంత —స్త్రీ.
చారకోటి —ఆడుది.
మలప చారకోటి —విధవరాలు.
నాగన్న చారకోటి —వ్యభిచారిణి.
బీరు —గొప్పది, మంచిది; యోగ్యమైనది.
బీరు చారకోటి:—గొప్పింటి స్త్రీ.
పింకుడు:—పిల్లవాడు
పింకి —పిల్ల.
చిలపింకుడు:—చిన్న పిల్లవాడు.
దడికించడం:—చూచుట.
దడికించు:—చూడు.
కంజిపో:—వెళ్ళిపో.
జావితా:—దగ్గరకుతా.

దావుకురా·—తీసికొనిరా.
దావు·—ఇయ్యి.
కరం.—ఇల్లు.
కరం బీరు గానే ఉంది:—ఇల్లు గొప్పగానే ఉంది.
బిచ్చం దావటం లేదు:—బిచ్చం వేయడంలేదు.
చెత్త్రం:—పొలము. చెట్టు.
ఇరిపుం:—కత్తి
గాతం —పాట.
బంది పెలడం —పాడడం.
గాతం బీరుగా బందిపెలు —పాట బాగా పాడాడు.
పచ్చు —మాటలాడకు. నోరుముయ్.
పచ్చు పచ్చురా నాగన్న పద్దు —మాటలాడు: ...నికిమ లినవాడా !
నాగన్న·—వెఱ్ఱి నాగన్న. పనికి మాలినవాడు.
కరపాలు:—కాయలు.
మేసం·—మేక.
వరనం.—కత్తి.
గురపాలు·—చల్ల.
పేసిం —వల (చేపలను పట్టేది)
ద్రైవులాడతం:—దెబ్బలాట లాడుట.
గుయ్యం గంజడం —విరుగగొట్టుట.
క్రైతీలు:—కుక్కలు.,
గుంజటం:—రమించుట.
సీలాలు —పాలు
కటకం —మంచం
బడిసాయిళ్ళు:—పశువులు కాసేవాళ్ళు.
కీనగాళ్ళు:—మాలలు
కొందలోళ్ళు·—చాకలివాళ్ళు.
కడ్డోళ్ళు:—ఈడిగవాండ్రు కల్లుగీత గీసేవాళ్ళు.
సిట్లగాళ్ళు:—రాజులు.
బొల్లి తాటగాళ్ళ —బ్రాహ్మణులు.
బొడిశాలోళ్ళ.—కుమ్మరులు.
బొడిశం:—కుండ.
పిరిపాలోళ్ళు:—మంగలివాళ్ళు.
ఎలికోళ్ళు:—కాపులు.
గాతగాళ్ళు:—ఎఱ్ఱి గొల్లలు; భాగవతులు.
గాతగాడు:—పాట పాడేవాడు.
కుంచోళ్ళు:—అలగాజనం; పాటకజనం.
గొంట్లగాళ్ళు:—కోమట్లు; పాహుకార్లు.
పాదులోళ్ళు:—సేనాపతులు —చేనేతగాండ్రు.
ముతకారుడు:—మునలివాడు.

ఇలాగ యెన్నో పదములు చూపవచ్చును. రాను రాను నశించిపోతూ వున్న యీ భాషగూర్చి ఎవరైనా పరిశోధనచేసి, దీనిని సేకరించి భద్రపరుస్తే ఈ వృత్తివలన జీవించేవారి ఆచార వ్యవహారములు సంగతి సందర్భములు తెలిసి కొనవచ్చును. ఈ పదజాలములో నాగన్నవంటి పదములు వెఱ్ఱివాళ్లనుగూర్చి 'వెఱ్ఱి నాగన్న' అని పేర్కొనుట తెనుగు దేశములో ఉన్నది. దానిని విశేష్యము గాను, నామవాచకముగానేగాక విశేషణముగా సర్వ నామముగా వాడుట గమ నించవచ్చు. అలాగే "కాడు", "గాడు" అనునవి పురుష వాచకముగా ప్రయో గించి, జాతిని, కులమును సూచించు శేషవిభక్తిక ప్రత్యయముగా వాడినట్లు చూడవచ్చును మనదేశ—నాటక చరిత్రలో భాగవత మేళా ప్రదర్శనలో ఈ యెఱ్ఱి గొల్లలు నిర్వహించిన పాత్ర నిరుపమానమైనది వారు మన భాషకు మన సాహిత్యానికీ, మన నాటక కళకు, రంగస్థలాలకు సమర్పించిన కానుక అనల్ప మైనది తెలుగు రంగస్థలసమీక్ష చేయుదలచినవారు ఈ యెఱ్ఱి గొల్లలు, దాస రులు చేసిన సేవ గుర్తించుటయేకాక—వారు సమకూర్చుకొన్న భాషా విషయములో కూడ పరిశోధన చేయవలసి యున్నది ఇది—మన సాహిత్య అకాడమీవంటి సంస్థలుకాని, విశ్వ విద్యాలయ పరిశోధనా సంస్థలుకాని, ప్రభుత్వ విద్యాశాఖవారు కాని చేపట్టి చేయుస్తే, మాటు మణిగిన నాటి పుట్టురత్నముల నెన్నిటినో పైకి తీయవచ్చును

ఈ వ్యాసము రచించుటలో—పదములు పరిభాష సేకరించి, ఎఱ్ఱిగొల్లల ఆచార వ్యవహారముల గూర్చి నాకు తోడ్పడినవారు పశ్చిమ గోదావరిజిల్లా కోడ వల్లి గ్రామవాస్తవ్యులు దాసం గోపాలకృష్ణగారు వారి సహకారం లేకపోతే ఈ వ్యాసరచన సంభవమయ్యేదికాదు వారికి నా కృతజ్ఞత.

వాలి హృదయము

శ్రీ వావిలాల సోమయాజులు

[బాణోపహతుఁడైన వాలి నేలవ్రాలి కట్టెదుర సమ్మోహనరూపముననున్న శ్రీరామచంద్రునితో.]

ఎన్నోమారు లెదిర్చి, యోడి, గిరులం దేమూలనో దాఁగి, వాఁ
డున్నాఁడన్నదె మాసిపోవఁ, బ్రతుకెట్లో యీడ్చు సుగ్రీవుఁడు
ద్యన్నవ్యార్భటి బొబ్బవెట్టి నను నాహ్వానింప, నిం దెద్దియో
యున్నట్లున్న దటంచు నెంచియును నే యుద్ధంబు నీవచ్చితిన్.

సరియే నా యనుజన్ముఁ డెన్నఁడును భాస్వత్సత్త్వసంపత్తి నా
కరయన్, వానిని గీటడంచు టొకయాశయందు నెవ్వేళ, సో
దర సౌహార్దముచే వధించుటకుఁ జిత్తం బొప్పుకోకున్న, నే
వఱకున్ దేలనిపోరు సల్పి, తరుమన్, వాఁడిట్లు జీవించెడిన్.

తరుమూలమ్మున దాఁగి చోరునిగతిన్, ద్రాఘిష్ఠ చాపాన భీ
కర నారాచముఁ దొడ్గి, మద్విపులవక్షశ్శైలముం జీల్చు దాఁ
కరయ న్నీజతనమ్ము, శాత్రవుఁడ నెట్లైనాఁడ నయ్యా!, భవ
త్పరమ క్షాత్ర విచిత్ర రూపమును మున్ దర్శింపనే యెన్నఁడున్!

కట్టిన వల్కలమ్ములకు గౌరవమున్ గలిగింపఁగోరి చే
పట్టితె వీరకార్ముకము, వంచనమైఁ బగవాఁడఁ గాని నన్
నెట్టన నిట్టు కూల్చి యవని న్మహనీయ పృషత్క విద్యకుం
బట్టముఁ గట్టుకోఁ దలఁచి ఖండనపండిత! యిట్లొనర్చితే!

ఇట్టు లధర్మ చేష్టను వధించి ననున్ జఱునవ్వు లొల్కుచుం
దిట్టతనాన మించి గడిఁదేఱిన వాఁడవు వోలె నిల్చు నీ
వెట్టి విశిష్ట సత్కులమొ! ఎయ్యది దేశమొ! ధర్మమేమొ! నీ
యట్టిఁడు లుబ్ధకుండొ, మహితాత్ముఁడొ కావలయున్ బ్రవీరుఁడా!

ఎదురుగ నిల్చి గెల్చుటకు నెవ్వఁడు పూనిన వాని శక్తిసం
పద నొకయర్ధభాగ మెడఁబాసి తమిన్ ననుఁ జేరు, నెప్పు డీ
య్యది యగు నాదు జీవితరహస్యము—దీని నెఱింగి యుంటచేఁ
గదనముఁ గోరవా? నిజముగాఁ గనుపట్టెడి నిట్టి యూహయే!

వాలి హృదయము

అవు నా జీవితమర్మ మిది తెలుఁగు దయ్యా! శోక వంచింప నీ
కవునా! క్షాత్రము మూర్తిఁదాల్చినటు లున్నావు నీవు, జ్యాఘోషమున్
వివిధాశాస్త్రప్రవిభేదకస్వనమహావిస్ఫూర్తి విన్పించినాఁ
డవు; నీ వెక్కటిశౌర్యసాగుఁడవు, గాఢప్రక్రియ న్నమ్మెదన్.

తలఁపునకు వచ్చుచున్న యది దాసులు తొల్త నెఱింగి చెప్పినా
రట రవితేజుఁడౌ నొకఁడు రాజ్యరమ న్విడనాడి తమ్ముఁడున్
జెలియును వెంటరా విపినసీమలలో మునివేషధారియై
మెలఁగుచునుండెనంచు నలమేటివి నీ వగుదా మహాశయా!

ఆవల వింటి నాతఁ డగు నా రఘువంశజుఁ డంచు రక్తియై
యీ వనభూమి 'పంచవటి' నింతియు నాతఁడు నున్నవేళ నా
రావణుఁ డేఁగుదెంచి నిజరాక్షసమాయలఁ జూపి ధీరుఁడై
యా వనితామణిం గొని శతాంగముపైఁ బయనించెనం చొగిన్.

ఆతఁడ వీవె? ఆ దశరథావని నాథునియాత్మజుండవా?
ఆ తపస్వియకీర్తి కగునయ్య యనామయు? మాదినుండి య
త్యాతతభక్తి యున్నయది యాయవనీపతి యన్న నాకు; నీ
వాతని పుత్రకుండవ మహాత్తరమూర్తి, రఘూద్వహుండవా!!

కాదన నీవు రాఘవునిగా గ్రహియింతును నిన్ను; కాని మీ
రాదట ధర్మరక్షయె మహార్థముగా గయికొన్న దొడ్డ భూ
మీదయితుల్ గదా! ఇలకు మేటివె? నే డిటు మాయచేత రా
జా! దయఁదప్పి నన్నుఁ దెగటార్చుటలోఁ గల సూక్ష్మమెద్దియో!

'మధువన'వీథులన్ ప్లవగమానవతీజనతామనోజదు
ర్వ్యథలను దీర్చుటల్ మధుసురారససేవనకేళిలోలతా
కథనములు న్మదీయ గుణగౌరవభంగము సేయ నీచపు
న్నిధనము నిచ్చినావె, యవి నీ తుఁడు పీఁడని నమ్మి నీమదిన్?

ధర్మము నుద్ధరింప వసుధన్ రఘువంశమునందుఁ గేశవుం
డర్మిలిఁ బుట్టునంచును మహాత్ములు మౌనులు పల్క వింటి నో
నిర్మలచిత్త!; యా ప్రభుఁడ వీవగుదేమొ!! వనేంద్ర నీతికిన్
ధర్మముగాని కృత్యము లొనర్పను నే మదమత్సరోన్నతిన్.

యమఘంటానినదోపమం బయిన సింహధ్వానముం జేసి యా
హిమవంతుం గని ధిక్కరించి కదనం బెవ్వాఁడు కాంక్షించె వాఁ

డమితోత్సాహుఁడు, యాతుధానుఁడును; నే నా దుందుభిన్ జంపి దో
స్సమరంబందునఁ, గాలఁ జిమ్మి, యిల నా శ్వాసించితిన్ మేటినై.

దెసలం గెల్చితి నన్న గర్వమున సంధీభూతుఁడై రావణుం
డసి సాహాయ్యమె మెచ్చి, వచ్చి యొకనాఁ "డాయోధనక్రీడ నా
కొనఁగన్ శక్తుఁడవే" యటన్న "చెడె దోహా!" యంచు సూచించి వె
క్కసమౌ మల్లవిశేషబంధమున ఘాకంగొట్టి నిర్జించితిన్.

ఆవిర్భావము నొందినాఁడ దివిజాధ్యక్షప్రభన్; దీర్ఘ బా
హా విక్రాంతబలాతిరేకమున సర్వారాతిదోర్గర్వమున్
ద్రావన్ శాత్రవులైరి మిత్రులు—సదా రాజ్యప్రజాపాలన
ప్రావీణ్యంబునఁ గీర్తికెక్కితిని; చంపంజెల్లునే నన్నిటుల్.

ధర్మత్యాగమొనర్ప నెన్నఁడును; సత్యప్రీతిఁ బాలింతు నేఁ
గర్మిష్ఠుండను, సర్వసంధ్యలను శ్రీకంఠాంఘ్రికంజాత స
న్మర్మాభిజ్ఞుఁడనై ద్విరేఫగతి నస్మచ్ఛీర్షము జేర్తు నో
ధర్మార్థప్రభవిష్ణు! విష్ణు!! ఎటులే దండ్యుండ నైనాఁడనో!

ఆదిత్యప్రభవమ్ము, భవ్య మని నా కత్యంత తాత్పర్య మ
య్యా! దీవ్యద్భవదీయవంశ మన స్వర్గానర్ఘముల్ దీర్పఁగా
నా దేవేంద్రుఁడె మిమ్ముఁ గోరు కథనన్ జిన్నప్పుడే వింటి- ని
ర్వేదం బెన్నఁడు మీకుఁ గూర్చుగతి వర్తింపన్ సురుద్యోగి నై.

అంగదువల్ల వింటిని బలాఢ్యుఁడు, క్షత్రియవీరమూర్తి, స
ర్వాంగమనోహరుం, డొకఁ డహస్కరఘ్నుతుని మైత్రిఁ గోర స
త్సంగమునందు వహ్నిఁ గొని సంగడికిన్ శపథ మ్మొనర్చి యు
త్తుంగసుఖోపగూహనముతోఁ జెలువొంది రటంచు మొన్న నేఁ.

ఆమాయావిని రూపుమాపుటకె మాయాద్రినమాయాంగలీ
[illegible] శేఁ గడఁగి పోరప్రక్రియన్ [illegible]
శన్ మా సుగ్రీవుఁడె ద్రోహియై [illegible] రాజ్యంబుఁ గైకొన్నాఁ
డ మాయావియె నీకు మైత్రి కయినాఁడ! సత్యధర్మప్రియా!

అన్నయె చచ్చె నాదనుజుఁ డహవకేళిని గెల్చె బాహుసం
పన్నత నన్న యూహ వాడమన్ గపిరాజ్యమునందు నంగదు
న్మన్నన నిల్పి నాసచివమండలికె న్గను పెద్దయాచుఁ దా
నున్న మనోజ్ఞకీర్తియును నూర్జితధర్మము నబ్బియుండదే.

అట్టి కిష్కింధకు నొక్కమా ఱయిన రా వాతిథ్య మిప్పించి యు
త్కటహార్దాంబుధి నోలలార్చి ప్రజచేతం గాన్క వెట్టించి ని
షటువిశ్రాంతికిఁ దగ్గ యర్హణము దేవా! యేన కావింపనే!
యిటు లీక్రూరనిశాతసాయకముచే నన్నేల శిక్షించితో!

కామాంధుం డయి పంక్తికంఠుఁడు నినున్ గైకోక మోసమ్మునన్
భామారత్నము నోర్చి పట్టికొనిపోవన్ వాని శిక్షింప నీ
వీమార్గమ్ముల మెట్టుచుంట విని దండ్రీ! దర్శనం బిచ్చి నన్
క్షేమం దీర్పఁగఁ గార్యము న్బిలుతువం చెంతేని యూహించితిన్.

నీకుం దృప్తిగఁ గింకరుండ నయి వానిం బట్టి తెప్పించి దే
వా! కంజాతమనోజ్ఞతావకపద ద్వంద్వంబు పట్టించి నీ
తా కాంతామణి నిచ్చునట్లొనరుపన్ దైవారఁ గాక్షించు నా
కో కాకుత్సమణీ యనుగ్రహము కర్పో, నిగ్రహం బబ్బెనే!

అయినఁ బులస్త్యజుండు కడు నద్భుతవిక్రముఁ డర్థిఁ గొల్చు వా
రయి యనుజన్ములున్ సుతుఁడు నాహవదోహలు లున్నవార లె
మ్మెయి గెలువంగఁ జాలు నని మిత్రసుతుండు తదీయమైత్రియున్
రయమునఁ గొంటివయ్య! అగునా యిది నీ సతి నొందు మార్గమున్.

తగు నె యదగ్రవైర మిటు తమ్మునితో నని తార సెప్పినన్
మగఁటిమి నమ్మి యా పలుకు మన్నన సేయఁగ నైతి; తత్ఫలం
బగుపడె నేఁటి కీగతిని-అయ్యును నంతన మాను వంచనన్
బగతుఁడు గెల్చెగాని నిజబాహుబలంబున గెల్వ నేర్చెనే!

ఉరుతరసత్త్వసంపదను నూర్జితమూర్తివె యైన నేమి? ఆ
చిరవిరహంబుచేఁ దనువు చిక్కెను; క్రూరవియోగశక్తి నీ
వెఱఁగియుఁ దార కేటికి విధించితి తీరని విప్రయోగమున్
విరహి కిరాతుఁడేని కవ వీడఁగఁ జేయఁడుగా మహాశయా!

అనుపమ సాధ్వి, నాహృదయహార్మ్యమహత్తరతార, తార, స
ద్గుణఖని, సుందరాంగి, సుమకోమలచిత్త, గడించి నెమ్మది
న్నను దన దేవదేవుగ ననారతమున్ భజియించు, నా మృతి
న్వాని యది గుండియల్ ప్రిదిలి వ్రీలక యెట్లు భరింపనేర్చునో!

ఎంతగ నిందసేసినను నేమియు నీ నగుమోమునందు నొ
క్కింతయు లేదు మ్లానత, యహీనము, శుద్ధము, ధర్మసూక్ష్మ మ

త్యంతము నుండు నన్నుఁ బరిమార్చినలీల నటించుఁ దోఁచు; నీ
వింతగు మార్గముం గొనఁగఁ బ్రీతికి హేతువు తెల్పవే ప్రభూ!

ఆతతవిక్రమోజ్జ్వలుఁడ వయ్యును హైన్యము నీకు నిచ్చి వి
ఖ్యాతిని నాకుఁ గూర్చు తెఱఁ గారసి, యిట్టు లపూర్వ లీల జీ
వాతువు నాహరించి ప్రభువా! నను ధన్యునిఁ జేసినాఁడ వీ
వో తపనీయధామ! ఇది యుజ్జ్వలమైన యనుగ్రహమ్మె యౌ!

వ్యగ్రంబైన మనంబుతో వదనమం దార్తిచ్ఛటల్ గ్రమ్మ నో
సుగ్రీవా! యిటు లుంటి వేమి? యెదలో సుంతైనఁ జింతింప కే
నగ్రభ్రాతను జంపుకొంటి నని, నా కయ్యెన్ శుభం బిందుచే
నుగ్రారుల్ గలవాఁడ నెష్డా యని నా కున్నట్టిదే మృత్యువున్.

ఆదటఁ బూర్వపుణ్యమున నబ్బె రమావిభుమైత్రి నీకు-ని
న్గాదనఁ గల్గువార లిలఁ గల్గరు, రక్తిని రామకార్యమ
ర్యాదను దీర్చి నిల్చి కపిరాజ్యయశోలతికాంకురమ్ములన్
బాదుకొనంగ నద్దెనలఁ బాలన సేయుము నీవె సోదరా!

అంగదుఁ డన్న నీ హృదయమందున హార్ద్రితయున్న దెన్నఁడున్
భంగము రాదు; వాఁడు ననువర్తన నిగ్గొలువంగలాఁడు; స
త్సంగము వాని కిచ్చి యను తాపముఁ దీర్పుము-తండ్రినైన నా
కుంగల మైత్రిచే నిటులఁ గోరెదఁ గాని యెఱుంగు దెల్లయున్.

ఒక గర్భమ్మునఁ బుట్టి ఋక్షవిరజుం డుద్గాఢవాత్సల్యమున్
ప్రకటింపన్ దమి నొక్కచోఁ బెరిగి, సర్వం బొక్కచో నేర్చి మా
నక విశ్వాసముతోఁ గవల్వలెను మన్నామయ్య! రాజ్యంబుకై
యకటా! వైరము వచ్చె, తీరినది యన్నా! కౌఁగలింపంగదే!

సందియమెల్లఁ దీరినది, సర్వమయుండవు నీవు రామ! నా
వందన మిద్ది గైకొని భవచ్ఛరకర్షణకైతవాన నా
నందముఁ గూర్ప నొక్కపరి నా తనువున్ స్పృశియింపుమయ్య! ఆ
క్రందిత మీ కపిప్రతతి; కానఁగలే నిఁకఁ గన్నుమోడ్చెదన్.

ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేది, ఏ క్షణం ఎలావుండేది
తెలియని ఈ రోజులలో

★ అగ్ని ★ మోటారుకారు ★ కార్మిక నష్టపరిహారం
నౌకా ★ ఫైడలిటీ గ్యారంటీ మొదలైన భీమాలకు

మాతో సంప్రదించండి:

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జెనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్

"బాంబే లైఫ్ బిల్డింగ్సు"

9, బాడ్వే - మద్రాసు-1

Telephones: 21378 & 21379 ★ Telegrams: "UNIGEN"

బ్రాంచీలు:

విజయవాడ - బెంగుళూరు - బొంబాయి - కలకత్తా - న్యూఢిల్లీ - పాట్నా - కొలంబో - సింగపూర్.

కవిత్వ తత్త్వము

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

కవి, తత్త్వవేత్త, ప్రవక్త · వీరి ధర్మములను ప్రతి జిజ్ఞాసువు గ్రహింపవలెను

కవి ప్రకృతిని పరిశీలించును అందలి సౌందర్యమును చూచి ఆనందించును మనసును పీడించు దృశ్యములనుగాంచి, దుఃఖపడును సుఖ దుఃఖ బంధురమైన జగతి ఒక పర్యాయ మాతనిని నవ్వించను వేరొక పర్యాయము ఏడ్పించును కవి ఎప్పుడును తన గుండెను వజ్రపుశిలను జేసికొనలేడు అది సదా కుసుమసదృశ్యమై యుండును. భావమున కది పుట్టినిల్లు రసమునకు నిధానము ఎట్టి నిమిత్తమైనను—అది దొడ్డది కావచ్చును చిన్నది కావచ్చును కవి మనస్సును కదల్చివేయును సంయమ గుణమును ప్రదర్శించుటకై అతడు ముందునకురుకడు సక్రమ మార్గమున తనకు స్వతస్సిద్ధమైన ఉద్వేగమును నడుపుటకు ఉబలాటపడుచు, ఈ యాశయసిద్ధికి వలసినంత ఆత్మ సంయమమును ఆతడు వినియోగించును కాని సంయమీంద్రులం దున్నత పీఠము నలంకరింపవలెనను లక్ష్యమాతని దృష్టియం దుండదు ఉండుచో కవి ప్రపంచమునుండి దూరస్థుడై తత్త్వవేత్త పీఠమునో, ప్రవక్త పీఠమునో అలంకరించును తాను చూచినది, తాను వినినది, తాను ప్రత్యక్ష పరిశీలనము కలన నెఱిగినది స్వకీయ భావనమువలన తెలిసికొనినది నైసర్గిక ప్రతిభతో, నవ నవోన్మేషశాలినియైన ప్రజ్ఞతో, రస బంధర శైలిలో, ఔచిత్య సమన్విత—రచనలలో, వ్యంగ్య భూయిష్ఠ వరళిలో తెలుపుట కవి కర్తవ్యము తీవ్రానుభూతి తన గుండెను చీల్చినప్పుడు హృదయమందలి తన రసోద్రేకమును పరిత హృదయమందును బుట్టించి, వాని గుండెను కూడ చీల్చివేయును ఇట్టి శక్తిని కావ్య ప్రపంచమున ప్రదర్శించిన కవులు సాహిత్య సామ్రాజ్యములో సార్వభౌములను ప్రశస్తిని వడయుదురు వాల్మీకి, వ్యాస, కాళిదాసాదుల కృతులను పరిశీలింపుడు సీత శకుంతలాది రమణీమణుల జీవితములను వారెట్లు చిత్రించిరో పరిశీలింపుడు నిక్కంపు జగతిలో వీరెట్టి యిక్కట్టులు అనుభవించిరో ఎరుంగము వీరి ప్రత్యక్ష జీవితమును ఈ కవులు చూచియే యుండరు వీరి పాత్ర చిత్రణమున భావన ఎక్కువపని చేసినది. భావనను గ్రాసు పరీక్ష చేయువారెవరు? దాని రెక్కలు విఱుచు వారెవరు? దానికిగల స్వాతంత్ర్యము ఔచిత్య పరిధి నతిక్రమింపకున్నంతవరకు, నిరంకుశమైనది కావున రస జలధి ఉత్తాల తరంగ సంకులమై, వీరి హృదయమందును, రచనలోను విజృంభించును. సీత వనవీధులందు ఏకాకినియై, వెండుచూలాలై అంగలార్చినది శకుంతల పతిచే గుర్తింపబడక సాంద్ర కాంతారమందు వన్య పశువులందు మసలినది సీతా శకుంతలలు భయంకర వనములందు ప్రసవించిరి వారి భర్తలు లోకారాధ్యులు కాని ప్రాకులాడగా, మునులయండ వారికి దొరికినది మేనక వీడిన పసిబిడ్డను పక్షులు పెంచినవి ఈ పనులు కావ్య ప్రపంచమున సుసాధ్యములైనవి. ప్రత్యక్ష ప్రపంచమున ఇట్టి దృశ్యములు గోచరించె ననుటకు ఎందును రుజువు అగపడదు. శ్రుతిమించిన రసోద్రేకము అందమైన అబద్ధమునే వలచి కావ్య ప్రపంచమున మహత్తరపాత్ర సృష్టియందు స్వీకరింపబడుచున్నది.

ఆంగ్ల వాఙ్మయమున షేక్స్పియరాదు లీ కర్తవ్యమును నిర్వహించిరి. అతని విషాదాంత నాటకములందీ కర్తవ్యము విశేషముగా అగపడుచున్నది. షేక్స్పియరు తన కృతులకు వలసిన ఇతి వృత్తములను ఒరుల గ్రంథములనుండి గైకొనెను ఆతడు గైకొనిన మాతృకలు అంతగా రస భరితములని తెలుపలేము. దుమ్మును చేపట్టి షేక్స్పియరు బంగారు చేసినాడు అందలి కథలను చదివిన షేక్స్పియరు హృదయ సముద్భవ రససింధువున దేలియాడి తన కృతులను రసప్లావితము లొనరించినారు 'ఒథెల్లో' నాటకమును పరిశీలింపుడు షేక్స్పియరు గ్రహించిన మాతృకలో ఒథెల్లో డెస్డిమోనాను చంపినట్లులేదు కాని షేక్స్పియరు భర్తచే భార్యను చంపించినాడు తరువాత తాను చంపుకొనినాడు. షేక్స్పియరు భావనమున, సృష్టియైన ఘట్టములు అసత్యమని విషయము తేలిన యెడల కథాశక్తి చచ్చును కావ్యము రస రహితమే యగును. ప్రత్యక్ష రంగమున దృశ్య కావ్యము ప్రదర్శింపబడినపుడు సత్య సంఘటనమే దృగ్గోచరమగుచున్నదని ప్రేక్షకులు గ్రహించి, పాత్రలవలె తామును ఏడ్తురు తామును నవ్వుదురు వట్టి నాటకమనిన, దొంగయేడు పనిన, రసానుభూతినందువారెవరు? కార్డీలియా లియరుల దుర్దశను పరిశీలింపుడు ఇది తీవ్రమైన ఆవేగమును సృష్టింపదా?

ప్రతికూల శక్తుల సంఘర్షణము లేనిదే కావ్యసృష్టియేలేదు. రామాయణమందొకవైపున సీతారాములు, హనుమంతుడు, లక్ష్మణ భరతులు గలరు. ఎదుటివైపున రావణ కుంభ కర్ణాదులు, శూర్పణఖ ప్రభృతులు నున్నారు దైవీశక్తి, అసుర శక్తుల పరస్పర యుద్ధము రామాయణ కావ్యమున కవసరమైనది. భారతమున కురు పాండవుల యుద్ధమున వ్యతిరేక శక్తుల విజృంభణములేదా? షేక్స్పియరు శిష్టుల పాత్రలను సృజించి, దుష్టులతో వారి సంఘర్షణ మెట్లు చెలరేగించెనో ఎరుగమా? ఐయాగో, ఎడ్మండ్, మూడవ రిఛార్డు, గానరిల్, రీగాన్ లేడీ మేగ్‌బేత్—దుష్టులసృష్టి ఆతనికి మిగుల అక్కరాయెను మెఫిస్టఫిల్స్ రాజరుల సృష్టి గెటెషిల్లరులకు ఆవశ్యకమైనది దుష్టులు శిష్టులను పాలయింపజాలిరి.

భారత కవులీ చెట్టకు పూనుకొనరు నాటకమును వీరు విషాదాంతముచేయలేరు వీరి చేతిలోని ఇతివృత్తము, కొండొకవడి గుండెలను దడదడ లాడించినను, రుధిర ప్రవాహమున కడముట్టదు విషాదఘట్టమును మాపు జేయుటకై అతిలోక శక్తులు, దివ్య శక్తులు ముందంజ వేయును. పరమశివుడు ప్రత్యక్షమై హరిశ్చంద్ర జీవితఘట్టమును సుఖాంతము చేయలేదా? ఒక్కొక్కప్పుడు కత్తిదెబ్బ పూల దండగా మారలేదా? ఇది ప్రాచీన భారతీయకావ్యప్రథ దీని ననుసరించి కావ్యవీధులు ముల్లోకములందు విస్తరించినవి దివినుండి భువికి దిగివచ్చినవారును, భువినుండి దివిమీదికి పోయిన వారును మనకు పరిచితులే! మేనక దిగి రాకున్న యెడల, శకుంతల ఎట్లు జనించును? శాకుంతల మెట్లు సృష్టి అయ్యెడిది? కాళిదాసు కృతిలోని ఊర్వసి ఎచ్చటి స్త్రీ? అప్పుడప్పుడింద్రుడు స్వర్గమునుండి నిలమీదికి దిగిరాపేదా? ఇంద్రసభలోకదా వశిష్ఠ విశ్వామిత్రులకు వాదము పొసగినది! సమకర్తి వీరబాహుడగుట, మసనము నవనవాటికయగుట మన కావ్యవీధులందు సుసాధ్యములు. భయంకరమైన అగ్ని జ్వాలలు మంత్ర పురశ్చరణమువలనగాని, జానకీ సంస్పర్శ వలనగాని చల్లారలేదా? మన పతివ్రతల ప్రభావము మనమహర్షుల సమక్షమున

పంచభూతములు ప్రచ్ఛన్న వేషములతో మసలినవి. కొండొకవడి స్వశక్తులను గోలుపోయినవి. తాత్కాలికముగ వేలు సత్త్వ మందినవి

ఆధునిక కవులు ఈ రీతి విద్ధూరములను తమ కృతులందు చేర్చలేరు. నేటి దృక్పథమువేఱు నేటి విశ్వాసము వేఱు వెనుకటి విశ్వాసము నవ్యజీవనపు ఇతివృత్తులందు ప్రవేశింపలేదు. ఆ విశ్వాసముతో నేటి కవులు కావ్యములను రచింపనుద్దేశించిరేని, వెనుకటి కథలనే ఆశ్రయింపవలెను. కావున నేటి కవులు రామాయణాది గ్రంథములను మరల వ్రాయుచున్నారు

"నవ జీవన సమస్య లెన్నెన్నో యుండగా వెనుక చూపేల?" అని ఆధునికులు ప్రశ్నింతురు? నవ జీవనమును చిత్రించుట పాడియే! చిత్రించుట ఆవశ్యకము కూడ మన మెఱిగిన ఘట్టములందు, మనకు ప్రత్యక్షమైన పరిస్థితులందు వాస్తవికతకే ఎక్కువ చోటు కలదు కావున ఆధునిక సాహితిలో వాస్తవికతకు, అతి వాస్తవికతకు విశేష స్థానము కలదు శరశ్చంద్రాది నవలా రచయితలు వాస్తవిక జీవితమునే చిత్రించిరికదా!

మతములు, మనసారస్వతములు వరిఢవిల్లు నంతకాలము—ఇవి సృష్టి తుదముట్టువరకు ఉండునవే!—నిశిత యోచనను అధికరించు భావనము మనస్యాంతరంగమున విజృంభించు సన్నివేశములు జీవితమున పొడసూపునంత కాలము పౌరాణిక పాత్రలును, ఇతివృత్తములును కవుల కలములను ఆశ్రయింపక తప్పదు

వాస్తవికత కేవలము ప్రత్యక్ష జీవితమునకే సంబంధించినదికాదు ఆంతరంగిక జీవనమునకుకూడ సంబంధించినది మనుష్య మానసగ్రథనమునకు ప్రతికవి అనగతుడై యుండవలెను చింతాశక్తి, భావనాశక్తి, సంకల్పశక్తి మనసుకు స్వతస్సిద్ధములు ఇంద్రియములకు మనస్సునకు అవినాభావ సంబంధముగలదు. మనసునుమించిన శక్తి, బుద్ధిశక్తి బుద్ధియోగము నభ్యసించనినాడు ఒక్కొక్కప్పుడు బుద్ధిరహితునికంటె అధముడై, దారుణానుభూతులకు గురియగును బుద్ధినిమించిన శక్తి బోధ లేక ఆత్మ. కఠోపనిషత్తులో వర్ణింపబడినట్లు, శరీరము రథమని, రథమునకు గట్టబడిన హయము లింద్రియములని, వీనికి గట్టబడిన పగ్గము మనస్సునియు, దానిని చేబూనిన సారథిబుద్ధియనిగుర్తించితిమేని జీవనరథ మీ సారథివలన నడుపబడుచో, అది వక్రమముగ నడచును బ్రతుకులో నొడు దుడుకు లుండవు అవు డితివృత్తములులేక కావ్య ప్రపంచము మరుభూమి యగును ఆంతరంగిక శక్తులందు, సమన్వయము లేనపుడు సముచిత నక్రమాభివృద్ధి లేనపుడు, విప్లవములు, విషాదములు ఘటించుచుండుట తప్పదు తన కృతులందు షేక్స్పియరు మహాకవి ఈ విషయమును చక్కగా దృష్టాంతీకరించెను ఐయాగోకు మేధాశక్తి కలదు అతడు హృదయములేని పిశాచము డెస్డిమోనా ఒథెల్లో లియరులుహృదయశక్తిగలవారు చింతాశక్తి అంతగా వీరికిలేదు కావున వారి జీవనము విషాదాంతమైనది హేమ్లెట్కు విశేష మేధాశక్తి కలదు కాని సంకల్పశక్తిలేదు మెక్బెత్ లేడీమేక్బెత్లకు హృదయము లేదు కావున దుష్క్రియకు గడంగిరి అతిథియైన స్కాట్లండు యేలిక డంకను నిదురించుచుండగా, హత్య జేసిరి కాని ఈ దుష్టుల చేతికి కవి విజయ పతాకమునందింపలేదు వారును తమ చేత లొగ్గిన యుచ్చులందు తమ కుత్తుకలు జొప్పించిరి—అట్లు చొప్పింపక తప్పినదికాదు "King Lear" నాటకములోని ఎడ్మండ్ "Julius Caesar" నాటకములోని, కేసియస్ "Political Jago", దుర్గతియందు గూలబడలేదా?

నిర్దుష్టాంతరంగిక జీవితసూత్రముల ననుసరించి బాహ్యజీవనము నడచిన యెడల అది మిత్రురపల్లములందు బోర్లగిల పడదు.

మానవుడు స్వతస్సిద్ధముగా దేవుడే! తన్ను దాను గుర్తింపనితరి ఇతడు పశువువలెనో, దానవునివలెనో ప్రవర్తించును కావున వీరు దుష్క్రియలు చేతురు వీరిలోని అసురశక్తి చెలరేగును అట్లనిన వీరి యందలి దైవీశక్తి నమసిపోయినదని తలపజెల్లదు "Cloister and Hearth" అను నవలలో భయంకరముగ విజృంభించిన వ్యక్తి కథలోనిఒకానొక ఘట్టములో కారుణ్య శరధి కాలేదా? రవీంద్రుడు సృజించిన "కాబులీవాలా" కథలోని అంతరార్థ మేమి? అతడు చోరుడు. కారాగృహములో కొంతకాలముండి బయలుబడినాడు. ఒక బాలికను వీక్షించినాడు ఆమెతో ఆటలాడినాడు సప్తరాగ సందీప్తమైన వియత్తలము నవలోకించి—ఆశ్చర్యాన్వితుడైనాడు గగన సౌందర్యమును ప్రశంసించినాడు. తన యంతరంగమందలి సౌందర్యమును వ్యక్తీకరించినాడు తన హృదయము నుండి ఈశ్వర సామ్రాజ్యము బహిష్కరింపబడలేదని తన ప్రవర్తనవలన దృఢపరచినాడు

మనుష్య మానసమునకు ప్రతీకారము సహజమైనది కాదని, ప్రసన్నత నైసర్గికమైనదని తమ పాత్రసృష్టిలో మహా కవులనిరూపించిరి. పశ్చాత్తాప మెరుగని పాపిలేడు పశ్చాత్తాపము సత్యజ్యోతిని చూపజాలును అంతరంగమందలి అమృతసరస్సును వ్యక్తమొనరింపగలదు అనుకంపను, అనురాగమును వ్యక్తమొనరింపజాలును అనుతాపమందు జీవాత్మపరమాత్మల సన్నిహిత సన్నివేశము దృగ్గోచరమగును కదా!

ఉద్వేగభావనముల విధానము హృదయము దైవశక్తి అలంకరించిన పూజాపీఠము కూడ హృదయమే కవితా పూరము గంగోత్తరివలె అందే యుదయించును. ఈ పూరము రెండుగట్టులనడుమ ప్రవహింపవలెను కావ్యమందు నిరోధము ఉద్రేకము ననుసరించును కావున ధునీపూరము కోయిల కుత్తుక నుండి వెలారు గానఝరివలె మాధుర్యసహితమై యొప్పును ఆంగ్ల రాజ్యాంగములోని నిరోధ విధానమువలె కవిత్వశైవలిని వెలయును. ప్రేమయయనుడు, భక్తియనుడు హృదయము దుద్భవించును కవిత్వము, గానము, నృత్యము ఇవి తమ సంయుక్త శక్తివలన (పురుటింటిలో డింభకుడైన శ్రీరాముని చేబట్టిన ముగురమ్మలవలె) భావోద్వేగమును తమయందు జేర్చుకొనును ఈ దివ్య సృష్టి నవలోకించి ముల్లోకములు పులకితగాత్రములతో నుర్రూత లూగును. దిక్కామినులు హాసన్ముఖులగును చండీదాసు, విద్యానాథ, కాశీనాథ, కృత్తివాస, జయదేవ, నర్సీ మెహతా, అభంగ గాయక శ్రేష్ఠులు,

మీరాబాయి, ఆళ్వారులు, పోతరాజు, త్యాగరాజు, రామదాసు, సూరదాసు ప్రభృతు లిట్టి కవులు. వీరి కవిత్వము పూర్వోక్తరీతిని త్రిగుణాత్మకమైనది. ప్రపంచ మహా కవులు కృతులు ఇట్టి యుదాత్త లక్షణములు కలిగి రససిద్ధినందిన మనకవు లిట్టివారు. యోగులకు సంయమశక్తి కలదు కదా. ఇది వీరి తన్మయత్వమునకు సహపాఠి. రెండింటి సంయుక్త ప్రభావము మధురగాన మూర్ఛనమువలె, మంజుల నృత్య భంగిమముమాడ్కి వ్యక్తమగును. ఈ సృష్టికి దీటైనది నటరాజ నృత్యమే! బృందావన విహారి నృత్యమే! కమలభవుని నర్తనమే! చైతన్య ప్రభువు నృత్యమే!!

మన భక్తులను పోలు వ్యక్తు లితర దేశములందు ఎందరున్నారు? లేరేమో! అయినను మహిమాన్వితులు అందును గలరు డాంటే మహాకవి అనురాగము బియాట్రిస్ దిక్కుగా దివ్యవిహగమువలె పరలోకమును స్పృశింపలేదా? పుణ్య జీవియైన మిల్టన్ కవిత్వము గంభీర వైదుష్య భరితమై, ఉత్తాల తరంగ సంకులమైన ఉదధివలె ఉప్పొంగి, వియత్తలమును మహిత భావ ప్లావిత మొనరింపలేదా? హోమరు భక్త శ్రేణిలోనివాడుకాడు అతని రచనలో వీరరసము, అదేదత్పే కమును రేకెత్తించు కల్పనము, ఆవేగ చలిత పద తరంగనర్తనము 'ఓహో!" అనిపించవా? షేక్స్పియరు నాటకములందు ఇందును, అందును సానెట్సులోను ఈ రీతి శక్తి వ్యక్తమగును షెల్లీ, కీట్సు, వర్డ్స్‌వర్త్, రవీంద్రులు సృజించిన శకుంతములను పరిశీలించి, వాని ప్రత్యేక ప్రభావమునుగురించి వేయి పుటలను వ్రాయజాలని వారెవరు? షెల్లీ పక్షి (స్కైలార్క్) మహోత్సాహముతో చుక్కల నందుకొనుటకో యన గగనమున నెగయును కీట్సు విహంగము, సౌందర్యసృష్టి— సృష్టికి దృష్టాంతము వర్డ్స్‌వర్త్ సృజించిన వికిరము తాత్త్విక చింత గలది. మేఘవీధులందు అల్ల నల్లన ప్రాకుచు, భువిమీద తరు శాఖలలోని కులాయమందలి తన నిసుంగుల నవలోకించుచుండును ఐహికాముష్మికాశయముల సమన్వయము నాతని శకుంతము సూచించును క్రైస్తవుని దృష్టి, ఊర్ధ్వముగ దిరుగును. భారతీయుల దృష్టి అంతరంగములోనికి మరలును అంతర్యామికి, సర్వాంత ర్యామికి అతని హృదయము సపరిచితమైనది రవీంద్రుని విహంగము నందీ భావములు వ్యక్తమగును వ్యక్తి శక్తినుండి సంప్రదాయశక్తి చెదరిపోదని వ్యక్తి గత కవిత ప్రకటింపదా?

వంగ వైష్ణవ కవులందలి భక్తి పూరమును మనసార గ్రోలిన అదృష్ట వంతుడు రవీంద్రుడు "సాత్వస్మిన్ పరమ ప్రేమరూప" అను సూత్రమును పురశ్చరణ మొనరించి, తన కవితకు రవీంద్రుడు పరమ ప్రేమ రూప మొసగి నాడు నారద భక్తిసూత్రములను షెల్లీ కవి పఠించెనని తెలుపలేము కాని కవి హృదయము విశ్వవిస్తృతమైనదికదా! కవి హృదయమునుండి, భక్తుని హృదయమునుండి వ్యక్తమైన సూక్తులు సూత్రములగునుగదా! వియత్తలము దిగ్వలయముల ధాత్రిని చుంబించినపుడును, రవికిరణములు కుసుమ సీమంతినిని ముద్దాడినపుడును, కౌముది సంస్పర్శ కల్వ చెల్వను పక్కున నవ్వించినపుడు అను రాగ ముప్పొంగదా! "ప్రేమ తత్త్వము" అను తన పద్యమున షెల్లీ కవి విశ్వ మంతయు ప్రేమ బంధురమని వర్ణింపలేదా?

"అమృత స్వరూపాచ". భక్తిరసము అమృతమగుటవలన భక్తులైన కవుల హృదయములు సుధాపూరితములైనవి. కావున సూక్తిసుధానిధులు మనకు సువరి చితులైరి

"యల్లబ్ధ్వా పుమాన్ సిద్ధోభవతి అమృతోభ వతి తృప్తోభవతి " రస సిద్ధి, ప్రేమసిద్ధి, అమృతసిద్ధినందిన మహా భక్తులైన మహా కవులు లలిత భావ కృత వాగ్వల్లి డోలికలం దుర్రూతలూగిరి

"యత్ప్రాప్య నకించిత్ వాంఛతి నశోచతి
న ద్వేష్టి న రమతే నోత్సాహీ భవతి"

ప్రాకృత వాంఛలను కాలదన్ని అమృత సరస్సున నీదులాడు కలహంసలైన కవులు తమ తన్మయత్వమందే తనియుచుందురు కదా!

"యజ్ఞాత్వా మత్తో భవతి స్తబ్ధో
భవ త్యాత్మారామో భవతి"

భక్తి యోగ, జ్ఞాన యోగ సంయుక్త ప్రజ్ఞనందిన మహా కవులు వాల్మీకి వ్యాసాది కవులు, పురందరదాసు, త్యాగరాజు, నారాయణతీర్థ, శ్యామాశాస్త్రి, దీక్షి తార్ మున్నగు గాయక శిఖామణులు మకరందమును గ్రోలిన మత్తద్విరేఫముల

వారి మన్ననలు పొందిన రసజ్ఞుల చిత్తములను తమ కవితావంక్తులందు రాగించు టెట్లు గమా?

సుందరమై, ఉదాత్తమైన భావము అందచందాల యల్లికలో కనక వసన సుందరియై, కావ్య రంగమున గోచరించును ఆభాస, భావనము కవితకు ఆయువు వంటివి. అర్థ గౌరవముగల పదములందు దివి వ్యక్తమగును రసౌచిత్య వ్యంగములు కావ్య వాఙ్మయమునకు స్వతస్సిద్ధములై యుండును ఇందలి భావము జ్యోతిర్మయమై వెలయును. కావ్యసృష్టి కెట్టి ప్రతిభ యవసరమో, ఆ సృష్టి యందలి మహత్త్వమును గుర్తించుటకును అట్టి ప్రతిభ యవసరము. రుచు లందును, వ్యత్యాస ముండరాదు ఇవి వేరైనయెడల విమర్శకుడు కావ్య విభూతిని, కవితా సంపదను వక్ర దృష్టితో వీక్షించును వర్డ్స్‌వర్త్ మెకాలే లిరువురును ఆంగ్ల సాహితీ సామ్రాజ్యమున ప్రముఖ వ్యక్తులే! కాని వారి దృక్పథములందు కొంత వ్యత్యాసము గలదు వర్డ్స్‌వర్త్ కృతులను పరిశీలించి, ఆతనిని గురించి మెకాలే తన డైరిలో ఇట్లు వ్రాసికొనెను "వర్డ్స్‌వర్త్ విరక్తి పుట్టించు వ్యక్తి. వంచకుడు, ఎలుక" వర్డ్స్‌వర్త్ కవి రచనలో అధికాక్షరములందు అల్పార్థముగల విషయము కొంత యుండుట నిక్కమేకాని అల్పాక్షరములందు అధికార్థముగల పంక్తులను గూడ విశేషముగా నాతడు రచించెను. కావున మెకాలే దుర్విమర్శ కాతడు గురి కారాదు. ఎల్లరకు తెలిసిన భాషయందు శైలి యుండవలెనని అనేకులందురు ఈ "యెల్లరు" కావ్య రస నారాధించి కావ్య మహిమను గ్రహింపజాలు జిజ్ఞాసువులై యుండవలెను ఒక్కొక్క రసము ఒక్కొక్క రీతి శైలిని వలచును ఇది లలితమై, సరళమై యుండవచ్చును పాఠకుని హృదయము దీని మెచ్చుజాలునదై యుండవలెను షేక్స్‌పియరు శక్తిని బెన్‌జాన్ ప్రభృతులు మెచ్చినను, గ్రీన్ మున్నగు సమకాలికులు మెచ్చలేదు ఇటీవలి టాల్‌స్టాయ్ షేక్స్‌పియరు మహా కవిని ప్రశంసింపలేక పోయెను

కవి తాత్త్వికుడు కావచ్చును భావ వ్యక్తీకరణములో ఇరువురకును వ్యత్యాసము కలదు అంతరార్థమును తన వ్యాఖ్యానమందు స్పష్ట మొనరించువాడు తత్త్వవేత్త. కవి వ్యాఖ్యానములోనికి, దిగరాదు ఉపన్యాస ధోరణి కవిత్వమునక్కగిట్టదు

ప్రవక్త "జీవిత మిట్లుండవలెను ప్రవర్తన మటుండవలె"నని తెలుపును. ఈ వైఖరి ఈ ధోరణి కవి కుండరాదు. తాత్వకవిభూతి, ప్రవక్త గుణాతిశయము కవి సృష్టిలో రసానుకూలముగ వ్యక్తమగుట పాడి కవి యంతరంగమున బ్రహ్మాండమంతయు నిండియుండగా, జగదీశుడే అందు తన పీఠమును నెలకొలుపుకొని యుండగా తాత్వికునకును, ప్రవక్తకును అందు చోటులేదని తెలుపు వారెవరు? తన యద్భుత సృష్టివలన తాను పరితృప్తినంది, తన కవితా తపస్సులో కవిత్వ తత్త్వ ప్రదర్శనమున ముముక్షువై అమరజీవియై కవి మోక్ష లక్ష్మీ సాక్షాత్కారము నందగలడు

పదిఏండ్ల ఆంధ్రరాజకీయాలు

శ్రీ పి. వి. నరసింహారావు

గడచిన పది సంవత్సరాలలో ఆంధ్రజాతి చరిత్రలో చీకటి వెన్నెల, మంచి చెడు, ఔన్నత్యము అధఃపతనము—అన్నీ వున్నాయి ఏబది సంవత్సరాలుగా కలలు కని కని ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన ఉజ్వల సంఘటన ఈ పది ఏండ్లలోనూ జరిగింది ఇందుకు ఒక నిష్కామయోగి త్యాగము అవసరమైనా, దాని వెంట అధికార దాహంగూడా ప్రజ్వలించింది ఒక వైపున వాచా గాంధీ సిద్ధాంతాల పురశ్చరణం సాగుతున్నట్టే, ఆ సిద్ధాంతాలను ప్రతారించటంగూడా వుంది. ఐకమత్యం వుంటేగాని అభ్యున్నతిలేదని ఆడంబరాలను ఆలపించడంతోపాటు, జాతిని అధఃస్థితికి తీసుకుపోయే అనైక్యతను కులతత్వాల ద్వారా, పదవీ వ్యామోహం ద్వారా, ప్రాంతీయ దురభిమానం ద్వారా దారివేయడం వుంది. ఆంధ్రరాష్ట్రం రాగా విశాలాంధ్రకోసం కలలుకంటూ, ఆంధ్ర, రాయలసీమ, సర్కారు ప్రాంతాలని రాష్ట్రాన్ని మనసా విభజించి, సిద్ధించిన విశాలాంధ్రలో, అర్థములేని వ్యర్థమైన స్పర్థలను ప్రోదిచేయడం వుంది దూరదృష్టి కల్గి వ్యవహరిస్తున్నట్లు నటిస్తూ, ఆచరణలో హ్రస్వదృష్టిని ప్రదర్శించడం, ఆపద్ధర్మంగా ఎప్పుడో చేసుకున్న ఒడంబడికలను పాలించని పక్షంలో రాష్ట్ర నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి పూనిక వహించడం, విశాలాంధ్రావతరణకు అట్టి ఒప్పందాన్ని ఒకదాన్ని చేసుకొని, దాన్ని మట్టిపాలు చేయడం, ఇది అంతా స్వార్థం కోసం చేస్తూ, రాష్ట్రంకోసం, రాష్ట్ర ప్రజలకోసం చేస్తున్నామని అపలపించడం వుంది రాష్ట్రం అభ్యుదయాన్ని గమనించక, విశాలాంధ్ర ఏర్పడనున్న సమయంలో వైయక్తిక లాభ కాంక్షతో, కర్నూలులో ప్రజా ధనాన్ని రాజధాని నిర్మాణం పేర దుర్వినియోగంచేసి రాష్ట్రం అంతటా రాజకీయంగా రభరభలు పెంచడంవుంది. పార్టీ ప్రతిష్టనుగూర్చి, పార్టీ గొప్పతనాన్ని గూర్చి ప్రసంగాలుచేస్తూ, ఆ పార్టీ తనకు ఉపయోగపడనప్పుడు దానికినీళ్లు తోడటం ఒక వైపునా, పార్టీ పేరుతో స్వార్థాన్ని, మరో విజయాన్ని పండించుకుంటూ వుండడం ఇంకోవైపునా, వ్యక్తి కంటే సంస్థ గొప్పదనడం ఒకవైపునా, వ్యక్తికోసం సంస్థను ఉపయోగించుకోవడం ఇంకోవైపునా, హరిజనుడు ముఖ్యమంత్రి అయినందుకు నకిలీ సంతోషం ఒక వైపునా, ఆ హరిజనుణ్ణి కూలద్రోసే సవర్ణ దురహంకారం ఇంకోవైపునా, కమ్యూనిస్టువిజృంభణను అరికట్టటంలక్ష్యం అనడం ఒకవైపునా, స్వార్థలాభం కోసంవేసే ఎత్తులతో రాష్ట్రంలో లుకలుకలు పెంచి, కమ్యూనిస్టు విజయానికి ప్రోదిచేయడం ఇంకోవైపునా, ఆశ్రిత పక్షపాతము, బంధుప్రీతి, కులాభిమానములు తగదను ధర్మోపదేశములు ఒకవైపునా, బంధువులను, ఆశ్రితులను, స్వకులస్థులను అందుబాటులోవున్న ప్రతిపదవికి పైకి ఎత్తడం మరొకవైపునా, నీతిఒకవైపునా, అవినీతి మరొకవైపునా ఈ పది సంవత్సరాలలో విశృంఖలంగా రాష్ట్రంలో ఏలుబడి సాగించాయి విచిత్రం ఏమంటే, ఇది అంతా సంస్థ పేరున వ్యక్తులు నడిపిన నాటకం; ఇది చరిత్ర, చరిత్రయొక్క ఆభాస.

చరిత్రలో సంస్థలు ఎప్పుడూ గొప్పవిగానేవుంటాయి. కాని, ఆ సంస్థలను చేపట్టి నిర్వహించే వారు, ఎంత గొప్పగా వ్యవహరిస్తున్నారన్నదే, ఆసంస్థల కీర్తిప్రతిష్ఠలకు, నాయకత్వంవిశిష్టతకు గీటురాయి అవుతుంది అందువల్లనే వ్యక్తుల మంచిచెడ్డలనుబట్టి, సంస్థలు పెరగడం, తరగడం సంభవిస్తూ వుంటుంది కనకనే వ్యక్తిగతమైన వ్యవహారాలు రాజకీయాలకు కీలకమౌతున్నాయి 1952 నుంచి 62 వరకు, పదేళ్ల ఆంధ్ర రాజకీయాలను పర్యాలోకన చేయడంలో కూడా, రాజకీయనాయకులుగా రంగంలో నిలిచినవారు ఆ యా సందర్భాలలో ఎలా వ్యవహరించారనేది పరిశీలనాంశం కావలసివుంది.

అది అదృష్టమనండి దురదృష్టమనండి ఆంధ్రలోని నాయకులకు ఆరంభంనుంచి వ్యక్తిగతమైన భేషజాలే హెచ్చుగా వుంటూ వచ్చాయి ఏ విషయంలోను వారు రాజీ పడడమనేది ఎరగరు అపజయాలకు జంకరు. చిత్తశుద్ధికి లోపం రానివ్వరు ఏదో ఒకవిధంగా ప్రజలను తమ మార్గాన కొనిపోవడానికి ప్రయత్నిస్తారు అవసరమైతే మాతృసంస్థలను కూడా ధిక్కరిస్తారు శ్రీప్రకాశం, శ్రీరంగా రాజకీయాల చరిత్ర ఇందుకు నిదర్శనం.

ఆంధ్రులు ఎదుర్కొన్న ప్రతిప్రధాన సమస్యలోను, నాయకత్రయంగా చెల్లిన ప్రకాశం—పట్టాభి—రంగాగార్లు తాముపిశ్వసించిన మార్గాలనే ముక్కుకు సూటిగా అనుసరించారు మద్రాసురాష్ట్ర ముఖ్యమంత్రి పదవినుంచి, అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షపదవివరకు, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణంనుంచి విశాలాంధ్రావతరణవరకు, జమీందారుల రద్దునుంచి సహకారవ్యవసాయాభివృద్ధివరకు, రాజధాని నిర్ణయంనుంచి రాష్ట్ర మంత్రివర్గ నిర్మాణంవరకు ఆయా సమస్యలపై, ఆ యా సమయాలలో ఈ నాయకత్వం ఉమ్మడిగా కలిసి, మెలిసి వ్యవహరించిన నిదర్శనం ఎక్కడా కనిపించదు అలా అని ప్రజలు వీరిని అనుసరించలేదని చెప్పడానికి వీలుపడదు ప్రజాపార్టీ, ప్రజా సోషలిస్టుపార్టీ, లోకపార్టీల ద్వారా శ్రీ ప్రకాశం, శ్రీ రంగాగార్లు తమకుగల విభిన్నత్వాలను చూపుకున్నారు జాతి జీవితంలో చెలగాటలాడారు

శ్రీ పట్టాభిగారు అలాకాదు ఆయన మేధావంతుడు రాజకీయ చతురత తెలిసినవాడు ప్రజానాయకులుగా తనకు అండగా నిలవగలవారిని తయారుచేసుకున్నారు వారి ద్వారా స్థానికంగా బలం పెంచుకొని, అఖిల భారత నాయకత్వాన్ని స్థిరపరచుకున్నారు ఒకవైపున బ్యాంకులు, భీమా సంస్థలు, చరఖా సంఘాలతోపాటు, మరొకవైపున జిల్లాల స్థాయిలో యువక నాయకులను పెంచారు ఆవిధంగా సంస్థలను, నాయకులను పెంచిన కీర్తి ఆయనకు దక్కింది. వ్యక్తిగతంగా ఆయనలో బలహీనతలు చూపేవారు కూడా ఈ విషయాలను హృదయపూర్వకంగా అంగీకరిస్తారు

ఇక శ్రీ ప్రకాశంగారు ఇలాకాదు ఆవేశపరుడు సంకల్పబలం కలవారు. ప్రజలను, పార్టీలను తనకు లొజ్జుగా చేసుకున్నవారు చివరకు అఖిల భారత కాంగ్రెసు నాయకత్వాన్ని కూడా ధిక్కరించారు అందువల్లనే ఆయన పెంచిన

నాయకత్వం, ఆయన పెట్టిన సంస్థలు మిగలలేదు. తానే ఒక సంస్థగా ఆయన వ్యవహరించడంతో ఆయన అనుచరులు, ఆయన పెట్టిన పార్టీలు ఆయనతోనే పతనమైపోయాయి ఆయన మహాశక్తికి జోహార్లు చెప్పేవారు కూడా, లోలోపల ఈ సంగతే చెప్పుకుంటారు

మిగిలిన శ్రీ ఎన్. జి రంగా మమ్మూర్తులా శ్రీ ప్రకాశంగారి లక్షణాలు కలవారే కాకపోతే ఒకరు ప్రజా నాయకులు మరొకరు రైతు నాయకులు. శ్రీ ప్రకాశంగారిని, ఆయన అనుచరులు ధిక్కరించలేరు. కాని శ్రీ రంగాను ధిక్కరించగలరు ఉభయులూ పార్టీలు పెట్టారు. ప్రతి కక్షలను కొట్టారు. కక్ష తీర్చుకోగలిగారేకాని, స్వపక్షాలను మిగుల్చుకోలేకపోయారు.

నాయకత్వం నిలబెట్టుకోవాలంటే నమ్మినబంట్లుగా పనిచేసేవారు కొందరు వుండాలి అలా కేవలం బంట్లుగావున్నా చాలదు అలాంటివారంతా తమ నాయకునికోసం ప్రాణమివ్వడానికి సిద్ధపడాలి నేటి రాజకీయరణరంగాలలో ప్రాణమివ్వవలసిన అవసరం వుండదు కాని, వున్న పదవులను వదులుకొనడానికి మాత్రం తయారుగా వుండాలి అలాంటి నమ్మకస్తులు అందరి నాయకులకు దొరకరు. ఒకవేళ దొరికినా, వారిని సక్రమపద్ధతులలో వినియోగించుకొనడం అందరి నాయకులకు చేతకాదు

శ్రీ ప్రకాశంగారికి నమ్మినబంట్లు కొందరు వున్నారు ఆయనకోసం వారు అనేక త్యాగాలు చేశారు. తమనాయకుడు ప్రజానాయకుడు అనిపించుకున్నారు. శ్రీ ప్రకాశంగారు కూడా వారిని తనకు కావలసిన మేరకు వినియోగించుకున్నారు అంతే అందుకనే ఆయన తర్వాత ఆయనక్రింద పెరిగిన వారికి నాయకత్వం దక్కలేదు ఆంధ్ర రాజకీయాలలో ఆయన ఘట్టం ఆయనతోనే ముగిసింది

ఇక శ్రీ రంగాగారు మాత్రం శ్రీ ప్రకాశంవలెనే రాష్ట్రంలో పెత్తనమూ కోరారు డాక్టరు పట్టాభిగారివలె అఖిలభారత నాయకత్వాన్నీ వరించారు. శ్రీ రంగాలో ఈ ద్వంద్వప్రవృత్తి వున్నందువల్లనే ఆయన అనుచరులు ఎప్పటికప్పుడు స్థిరత్వాన్ని కోల్పోతూ వచ్చారు. నమ్మినబంట్ల సంఖ్యతగ్గిపోతూ వచ్చింది శ్రీ రంగా అంటే రాజకీయాలలో రంగులరాయుడనే అపకీర్తి తెచ్చుకున్నారు అటు రాష్ట్రనాయకత్వమూ లభించలేదు ఇటు అఖిలభారత నాయకత్వమూ దూరమైపోయింది చివరకు రెండింటికీ చెడిన రేవడి చందమైంది శ్రీ రంగా రాజకీయం

డాక్టరు పట్టాభిగారు మాత్రం స్థిరంగా నిలిచారు రాష్ట్రస్థాయిలో తీరని కోరికలువున్నా, తన తర్వాత రాష్ట్రంలో పెత్తనం తన వారుగావున్నవారికి వచ్చేటట్టు చేశారు. అఖిల భారత నాయకులుగానే పండిపోయారు అరముగ్గిన పండువలె రాలిపోయారు

ఆంధ్ర దేశానికి ఏనాడూ ఏక నాయకత్వంలేదు. ప్రతి సందర్భంలోను ప్రత్యర్థి వుండడం, ఆ ప్రత్యర్థికూడా పరిగణించదగినవాడుగా వుండడం, మన రాజకీయ చైతన్యాని కొక నిదర్శనం అందువల్లనే ఆంధ్రనాయకుల మధ్య రాజకీయ జూదాలు అంతూ పంతూ లేకుండా సాగుతూ వున్నాయి నాయకత్వంకోసం ఎత్తులకు పై యెత్తులు నిరంతరం నడుస్తూ వున్నాయి సమయం చిక్కినప్పుడు ఏదో ఒక వ్యూహం పన్నడం, ఎంతో కొంత కథ నడపడం, ఆ తర్వాత అందరూ కలిసి పోయినట్టు, ఏమీ జరగనట్టు నటించడం మన నాయకులకు పరిపాటి. ఎందుకోసం ఇంతగా అల్లరి పడుతున్నారో ఆలోచించుకుంటే, చివరకు సహేతుకమైన కారణం కనిపించదు. స్వప్రయోజనాలు, స్వాతిశయాలు, పదవి ప్రలోభాలు మాత్రం పుష్కలంగా వెల్లడౌతాయి. రాజకీయంగా ఆనాడు, ఈనాడు కూడా మనకు ఎప్పటికప్పుడు ఈ పోటీలు వున్నందునే ఏకనాయకత్వంకాక, బహు నాయకత్వం సాగుతూ వచ్చింది

ఆ తరంలో ప్రకాశం, పట్టాభి, సాంబమూర్తిగార్ల నాయకత్వమనుకుంటే, ఈనాడు గోపాలరెడ్డి, వెంకటరావు, చంద్రమౌళిగార్ల రాజకీయ నాటకాలు సాగాయి. ఇలాటి త్రిమూర్తుల సంప్రదాయం మనది పరిస్థితులను బట్టి, వీరికి అండగా మరికొందరు చేరుతూ వచ్చారు అలా చేరేవారుకూడా ఇద్దరు ముగ్గురుగా వుంటారు. దీనితో రాష్ట్రానికి పంచ పాండవుల నాయకత్వం తయారైంది.

అందువల్లనే ఈ తరంలో ఆరంభదశలో ఆంధ్ర నాయకులు అయిదుగురు—గోపాలరెడ్డి, వెంకటరావు, చంద్రమౌళి, సంజీవరెడ్డి, సత్యనారాయణరాజు—వీరందరూ కలిసి ప్రజా నాయకుడుగావున్న ప్రకాశాన్ని ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో గద్దెదింపారు ఆ తర్వాత ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసును హస్తగతం చేసుకొనడానికి రైతునాయకుడనిపించుకున్న శ్రీ రంగాను పతనం చేశారు. పంచ పాండవులవలె రాష్ట్ర రాజకీయాలు నడిపారు అయితే వీరిలో వీరికి అంతరంగికమైన విభేదాలు వున్నమాట నిజం కాని, ఒక జట్టుగా వ్యవహరిస్తూ వచ్చారు. చివరి నిముషంలో ఒకరి కొకరు అండగా నిలుస్తూ వచ్చారు వీరందరూ శ్రీ పట్టాభిగారి శిష్యులు వీరందరిమధ్య సూత్రధారి శ్రీ కళావెంకటరావు


ఈ అయిదుగురిని విడిదీయాలనే ప్రయత్నాలు చాలా సందర్భాలలో విఫలమైనాయి కాని, 1952 ఎన్నికలలో ప్రకాశం—రంగాలు కలిసి, చిత్తుగా వీరిని ఓడించారు తూర్పు కోస్తాకు కొట్టిన ఎన్నికల తుపానులో తలగల నాయకులందరూ పడిపోయారు సర్కారు జిల్లాలలో కమ్యూనిస్టులు తలెత్తారు. రాష్ట్ర రాజకీయాలలో పెద్ద గండిపడింది నాయకుల జాతక చక్రాలు తలక్రిందులైనాయి

ఆనాడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘానికి అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి కార్యదర్శి శ్రీ అల్లూరి వారి అధ్వర్యంలోనే 1952 ఎన్నికలలో కాంగ్రెసు దెబ్బతినిపోయింది. గోపాలరెడ్డి, కళా, చంద్రమౌళి వగైరాలు ప్రజా ప్రతినిధులు కాలేకపోయారు కేవలం 43 మంది మాత్రమే ఉమ్మడి మద్రాసు శాసన సభకు ఆంధ్ర సభ్యులు వచ్చారు వారినుంచే శ్రీయుతులు శంకరరెడ్డి, సంజీవయ్య, పట్టాభి రామారావు ప్రభృతులు మంత్రులైనారు ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి రాజాజీ ముఖ్యమంత్రిగా నిలిచారు

అప్పటికి శ్రీ సంజీవరెడ్డి యువకుడు ఈ తరం యువక నాయకులకు తలమానికం వంటివాడు సంకల్పబలం, అందుకు తగిన చతురత వున్నవ్యక్తి. ఆంధ్ర రాజకీయ రంగంలో అంతకు మూడు నాలుగు సంవత్సరాలనుంచి ఆయన చూపిన సాహసం సాటిలేనిది—రాజకీయంగాచూస్తే మద్రాసులో మంత్రి పదవికి రాజీనామాచేసి, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షపదవిని చేపట్టడంకంటె, అందుకు కావలసిన హంగులన్నింటినీచేసిన కళాప్రభృతులను కాదని నెహ్రూ—టాండన్ వివాదంలో, శ్రీ నెహ్రూ నాయకత్వాన్ని సమర్థించడంలో, కార్యదర్శి శ్రీ అల్లూరితో కలిసి వేసిన ఎత్తు అమోఘంగా పనిచేసింది ఆయనను అఖిల భారత రాజకీయ రంగంలోకి తీసుకు వెళ్ళింది కాంగ్రెసు కార్యవర్గ సభ్యత్వమిప్పించింది

కాని, ఆ తరువాత ఆయన ఆ ప్రతిష్ఠను ఉపయోగించుకున్న తీరు ఆయన అంతస్తును చూపించింది. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ సమస్యలో ఆయన అనుసరించిన విధానం కేవలం రాయలసీమ నాయకుని హోదాలోనే ఆయన వుండిపోయాడని పెద్దలకు కూడా ధృవపరచింది ఆంధ్ర రాష్ట్ర తొలి మంత్రి వర్గ నిర్మాణానికి అటు లోక పార్టీని దెబ్బతీస్తూ, ఇటు ప్రకాశంగారికి దగ్గరగా చేరుతూ అనుసరించిన పద్ధతులు కూడా ఆయన కీర్తిని పెంచలేదు కాగా మనిషిలోవున్న సత్తాను బయపెట్టాయి నివురు కప్పిన నిప్పు అనిపించాయి.

అప్పుడు ఒక వైపున శ్రీ పొట్టిశ్రీరాములుగారి పూర్ణాహుతి ఫలితంగా ఆంధ్రరాష్ట్రం రూపొందనున్నది మరొకవైపున ఆంధ్ర ప్రాంతంనుంచి ఎన్నికై వచ్చిన కాంగ్రెసుప్రతినిధులబలం తక్కువగా వున్నది శ్రీ రంగా అధ్వర్యాన లోక్‌పార్టీ, శ్రీ ప్రకాశం అధ్వర్యాన ప్రజాపార్టీ కాంగ్రెసు బలాన్ని పంచుకొని వున్నాయి కమ్యూనిస్టులు ఒక పార్టీగా కాంగ్రెసుతో సరితూగుతూ నిలిచారు. ఈ పరిస్థితులలో ఆంధ్ర కాంగ్రెసు శాసనసభాపక్షం నాయకుని ఎన్నిక అవసరమైంది అందుకోసం శ్రీ సంజీవరెడ్డివర్గం, అప్పటి మంత్రి శ్రీ నాయకంటిశంకరరెడ్డివర్గం జోరుగా ప్రచారం చేసుకున్నారు బలం పరిసమాన మనుకున్నారు శ్రీ శంకరరెడ్డిగారిపేరును మంత్రి శ్రీ పట్టాభి రామారావు ప్రతిపాదించే ఏర్పాటు గూడా రాజాజీ చేశారన్నారు. శ్రీ సంజీవయ్య మాత్రం గట్టిగా శ్రీ సంజీవరెడ్డి తరఫున నిలిచారు పోటీకి అన్నీ ఏర్పాట్లు పూర్తి అయిన తర్వాత శ్రీకాకుళం, విశాఖపట్టణం, తూర్పు గోదావరిజిల్లా సభ్యులలో తిరుగుబాటు వచ్చింది. అది విన్న శ్రీ శంకరరెడ్డి వెంటనే


FDS/HH/4 TE

కాస్మాపొలిటన్ క్లబ్బులోవున్న శ్రీ గోపాలరెడ్డిగారిని కలుసుకొని, పోటీ విరమించు కొనే సలహాపొంది, అస్త్రసన్యాసంచేసి, అయిదు నిముషాలు ఆలస్యంగా పార్టీ సమావేశానికి వచ్చారు. అప్పుడు శ్రీ కళావారు బహుపరాక్ అన్నారు శ్రీ ప్రకాశం చిరునవ్వు నవ్వారు శ్రీ సంజీవరెడ్డి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘ అధ్యక్ష పదవితోపాటు రాష్ట్ర శాసనసభా కాంగ్రెసుపక్ష నాయకత్వాన్ని కూడా స్వీక రించారు. రాష్ట్ర భవిష్యత్ నాయకుడుగా స్థిరపడిపోయారు. గత పది సంవత్స రాలుగా రాష్ట్ర రాజకీయాలను ఏకధాటీని నడిపిస్తున్నారు

ఏర్పడుతున్నది ఆంధ్రరాష్ట్రం కాని తాము ఆంధ్రులమనే జాతీయ భావం అప్పటిరంగంలో నిలబడివున్న నాయకులలో ఏ ఒక్కరికీలేదు. సర్కారు, రాయలసీమ, శ్రీకాకుళం అనే ప్రాంతీయ భావమే ఆ సమ యంలో పెల్లుబికింది. చివరకు రాజధాని నిర్ణయంలో శ్రీ ప్రకాశంగారు శోచ నీయమైన పాత్రను నిర్వహించారు. ముఖ్యమంత్రి పదవికి, రాజధాని నిర్ణ యానికి లంకెపెట్టిన కారణాన ఆంధ్రకేసరి కేవలం రాయలసీమ కేసరిగా మారినట్లు లోకం గ్రహించింది. తమ ఏకైక నాయకుడని గర్వంగా చెప్పు కొని మురిసిపోయే సర్కారుజిల్లాలవారిని శ్రీ ప్రకాశంగారు ఒక మొట్టి కాయవేశారు. ఆంధ్రకేసరి తప్పటడుగు ఆంధ్రజాతిని తప్పు మార్గాన పట్టిం చింది ఆ నాటి ఆంధ్ర రాజకీయాలను కురు పాండవయుద్ధంతో పోల్చు కుంటే, ధృతరాష్ట్రుని పాత్ర శ్రీ ప్రకాశంపతులు గారిది దుర్యోధనుడు శ్రీ సంజీవరెడ్డి మిగిలిన కౌరవబలం ప్రజాస్వామ్య పక్షాలన్న నామధారణ చేసిన అన్ని పార్టీలు. పాండవులు ఎవ్వరంటే, ప్రజలు ఆంధ్రజాతి పాండవ సంతతి కనక ఈ పోలిక సరైనదే కాగలదు

రాయలసీమలో, తెలంగాణా సరిహద్దుల్లోవున్న కర్నూలు పట్టణాన్ని తాత్కాలిక రాజధానిగా ఆంధ్ర శాసన సభ్యులు నిర్ణయించారు శ్రీ బాగ్ ఒడం బడికలోని మొదటి షరతు ప్రకారం రాయలసీమకు రాజధానియిచ్చినట్లు అయింది అయితే ఇలా రాజధాని ఇచ్చినందున రాయలసీమ—సర్కారు విభేదాలు తరిగినవా, పెరిగినవా అని పరిశీలిస్తే, పెరిగినవనే చెప్పాలి అంతేకాదు ఇంతవరకు సర్కారు రాయలసీమ విభేదాలు వున్నవి ఇప్పుడు సర్కారు—విశాఖ తగా దాలు కూడా ప్రారంభమైనాయి శ్రీబాగ్ ఒడంబడికను విజయవాడ గుంటూరు నాయకులు చేశారని, తమ విశాఖపట్నం ఆంధ్ర రాజధాని కాకుండా పోవడానికి సర్కారు జిల్లాలవారు కారణమని శ్రీయుతులు తెన్నేటి విశ్వనాధం, శ్రీ గౌతు లచ్చన్న ప్రభృతులు నిందించారు. తాము నీతికి నిలబడి రాయలసీమకు రాజ ధానిని ఇస్తున్నామంటూ, రాయలసీమ నాయకత్వంతో నేస్తం కట్టారు మంత్రి పదవులు పొందారు

తెలుగు నాయకులలో మేధావంతుడని చెప్పుకోనదగిన వ్యక్తి శ్రీ తెన్నేటి విశ్వనాధం. ఆయన ఆంధ్రుడుగా జన్మించడం ఆయన దురదృష్టమనుకొనేవారు కూడా కొందరు వున్నారు. ఆంధ్రుడుగా జన్మించడంకాక, ఆంధ్ర కేసరి అడుగు జాడలలో నడవడం ఆయన దురదృష్టమనే వారు కూడా లేకపోలేదు ఒక నాయ కునికి పరమ భక్తుడుగా వుండడంలో తప్పులేదు కాని, ఆ పరమ భక్తిలో కూడా తన ఆదర్శమూర్తిని కొంతవరకే తనలో భాగం చేసుకోవాలి తన అవ సరం కూడా ఆయనకు వుంటుందనే గుర్తు కలగజేయాలి అలా చేయనందునే శ్రీ విశ్వనాధంగారు కేవలం ప్రకాశంగారికి డిఫెన్సు లాయరుగా తయారై నారు. ఆత్మ విరుద్ధంగా కర్నూలు ఆంధ్ర రాజధానికావాలనే తీర్మానాన్ని అసెం బ్లీలో ప్రతిపాదించారు ఆంధ్రరాష్ట్రానికి తొలి ఆర్థికమంత్రి అనిపించు కున్నారు

"కావని వాని మాతగొని కావనివాడు విశిష్ట వస్తువుల్ కావని భంగి" కృషి కార్ లోక్‌పార్టీవారు ఆంధ్రరాజధాని నిర్ణయసమస్యలో అడుసు త్రొక్కారు లోకంలోని అన్ని పార్టీలకు నాయకుడనదగిన శ్రీ రంగా దీనికి నాయకుడు. అఖిల భారత సంచారం ద్వారా సిద్ధించిన అఖిల భారత నాయకత్వానికి తోడు అప్పు డప్పుడు రాజకీయ అజ్ఞాతవాసంచేసి, పార్టీల సిద్ధాంతాలు వల్లించి, కొత్త నినాదం, కొత్త అభిప్రాయ పరంపరలతో రంగంమీదికి వచ్చి బహుపాత్రాభి నయం చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. రాజకీయ దశవతారాల అనంతరం విశ్వరూపధర అవతారం రాజాజీ మంత్రివర్గంతో అతురూప సహకారం. కాని, రాజధాని నిర్ణయ రభసలో లోక్‌పార్టీ తమలోకానికిచెందినది కాదన్న వాతావరణం, సర్కారు జిల్లాలలో ఏర్పడడంతో, వీరి ఆలోచనలలో మార్పు ప్రారంభమైంది. విశాలాంధ్రమూలేదు. హైదరాబాదూ రాదు పొమ్మన్నారు కాని ఈపార్టీకి ఉపనాయ కుడుగావున్న శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు సార్థక నామధేయులు. రాంగే యుల రామదండును చీల్చారు రాజధాని సమస్యమీదనే లోకపార్టీ మంత్రిగా వున్న శ్రీ లచ్చన్నకు పతనం తెచ్చారు రాజధాని వ్యవహారంలో నడిచిన నడతకు తగిన మూల్యాన్ని ఆ పార్టీ నాయకులు అలా చెల్లించారు

ప్రకాశం మంత్రివర్గానికి లోకపార్టీ సహకారం లోపించినా రెండుమంచి అయిదు ఓట్ల మెజారిటీతో అది బడ్జెట్టు పద్దులను ఆమోదింపజేసింది. రాజధాని సమస్యను మినహాయిస్తే అసెంబ్లీలో బలాబలాలు 70—76 గా వున్నాయి రాజకీయ దృష్ట్యా పరిస్థితులు శోచనీయ స్థితికి వచ్చాయి నాయ కులమధ్య సరసాలు తగ్గి, విరసాలు పెరిగాయి ఎప్పటి కెయ్యది ప్రస్తుతమో అప్పటికి ఆమాటచెప్పి కాలం వెళ్లబుచ్చే స్థితివచ్చింది తెగతెంపులకు సమయం కోసం ఎదురుచూస్తూ వుండగానే మద్యనిషేధ సమస్యమీద శాసనసభలో మంత్రి వర్గం వోడిపోయింది అందుకు ప్రధాన భాగస్వాములు మాజీ కల్లుగీతవారి నాయకుడుగా శ్రీ గౌతు లచ్చన్న. మంత్రిపదవి రాలేదన్న కోపంతోవున్న మాజీ మంత్రి శ్రీ నాయకంటి శంకరెడ్డి మొత్తంమీద అందరూ కలిసి ఆంధ్రరాష్ట్ర నికి గవర్నరుపాలన తెచ్చారు

కారణాలు ఏవైనప్పటికి 1952 ఎన్నికల ఫలితంగా ఆంధ్రరాష్ట్ర నికి కమ్యూనిస్టు ప్రమాదమనేది ఒక పెనుభూతంగా రంగంమీదికి వచ్చింది. అదొక రాజకీయ ప్రతిపక్షంగా నిలిచిపోయింది 1955 వరకు రాజకీయ నాయకుల అనైక్యత అనేది మరొక సమస్యగా తలెత్తింది ఈ పరిస్థితులలో ఆంధ్రరాష్ట్రంలో ఎన్నికలు వచ్చాయి. 1952 లో ఓడిపోయిన అగ్రనాయకు లందరూ తిరిగి రంగంలో ప్రవేశించే అవకాశం లభించింది సంజీవరెడ్డి, గోపాలరెడ్డి, కళా, చంద్రమౌళి, అల్లూరి నాయకత్వం తిరిగి ప్రజల మధ్యకు వచ్చింది వీరిలో మొదటి నలుగురిని గురించి ఒక ప్రతీతివుంది "కలిసి వ్యవ హరించినంతవరకు వీరు శిష్ట చతుష్టయం. కాని విడిపోతే మాత్రం దుష్ట చతుష్టయం" 1955 ఎన్నికల అనంతరం వీరు విడిపోయారేకాని, కలిసి వ్యవహరించలేదు

ఈ నలుగురు నాయకులలోను శ్రీ గోపాలరెడ్డికి ఆదినుంచి విడిగా గ్రూపు అనేది ప్రత్యేకంగాలేదు అనుచరులు కూడా చాలా తక్కువే కాని, అభిమానులు మాత్రం చాలామంది వున్నారు అందువల్లనే మిగిలిన ముగ్గురు మధ్య వచ్చిన వివాదాలలో "రాజీగా" వుండడానికి పనికి వచ్చేవాడు ఆ కార ణాన్నే శ్రీ సంజీవరెడ్డి తర్వాత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడైనాడు. లోకపార్టీని, ప్రజాపార్టీని కలిపి యునైటెడ్‌ఫ్రంటును సాధించాడు ఇందు లోనే శ్రీ గోపాలరెడ్డి తన భవిష్యత్తుకు కావలసిన పునాదులు వేసుకున్నాడు

ఆంధ్రరాష్ట్రానికి కమ్యూనిస్టు ప్రమాదాన్ని తప్పించాలనేది 1955 ఎన్నికలలో ప్రత్యేక నినాదమైంది రాష్ట్రంలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని భద్రపరచుకొనడానికి ఒక ఉద్యమం ఉప్పెనలాగ బయలుదేరింది దానికి బ్రహ్మాండ మైన ప్రజా విజయం కలిగింది ఈ ఎన్నికలలో ప్రజలచేత కాంగ్రెసుకు ఓటు చేయించిన శక్తి "కొన్ని సమస్యల"ది కాని, "కొందరు నాయకులది" మాత్రంకాదు అందులోను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకొనడానికి, జాతీయ మైన ఒకపార్టీని పెంచుకొనడానికి మధ్యతరగతులు ఆవేశంతో కృషిచేశాయి. కనకనే కాంగ్రెసు ఘన విజయాన్ని పొందింది తిరిగి రాష్ట్ర నాయకులందరూ రంగంమీదికి వచ్చారు మామూలు ఆటలు సాగించారు

రాష్ట్ర శాసనసభలో కాంగ్రెసు, లోక్, ప్రజా పార్టీలతో కూడిన ఐక్య కాంగ్రెసుపక్షం ఏర్పడింది దీని నాయకత్వానికి శ్రీ సంజీవరెడ్డి—శ్రీ గోపా లరెడ్డిగార్లమధ్య పోటీ వచ్చింది బలా బలాలు సమీకరించుకున్నారు కాని, చివరి నిముషంలో కాంగ్రెసు అధిష్టానవర్గం సలహాను శ్రీ సంజీవరెడ్డి అంగీకరించి, శ్రీ గోపాలరెడ్డిగారు నాయకత్వం వహించడానికి అవకాశమిచ్చారు ఆ నాడ శ్రీ ప్రకాశంగారికి, ఈ నాడు శ్రీ గోపాలరెడ్డికి పార్టీ నాయకత్వపు అవకాశ మిచ్చారనే కీర్తి తెచ్చుకున్నారు. కాంగ్రెసు అధిష్టానవర్గం అభిమానాన్ని, ఆశీ

ర్వచనాన్ని పొందారు. సమయస్ఫూర్తిగల నాయకుడనే ప్రతిష్ఠ ప్రజలలో తెచ్చు కున్నారు ఉప ముఖ్యమంత్రిగా, పార్టీ వ్యవహారాలలోను, మంత్రుల నియామకాల లోను కరుకుతనం చూపారు. తెరచాటున నిజమైన నాయకుడుగా వ్యవహ రించారు నానాటికి బలపడుతూ వచ్చారు.

ఇక శ్రీ గోపాలరెడ్డిగారు పార్టీ నాయకుడుగావున్న పన్నెండు నెలలలోను బలహీనుడనిపించుకున్నారేకాని, బలంకలవాడనిపించుకోలేదు. తనకు అండగావున్న మాజీ—లోక్‌పార్టీవారికి శ్రీ సంజీవరెడ్డిగారికి మధ్య వచ్చిన వివాదాలతో విసిగి పోయారు. ఈ వ్యవహారాలలో పానకంలో పుడకలాగా తేలారు శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి. శ్రీ సంజీవరెడ్డి ఎంతగా ప్రయత్నించినా, ఆయనను శ్రీ గోపాల రెడ్డి మంత్రివర్గంలో చేర్చలేకపోయారు ఆ అవకాశం చివరకు లభించింది శ్రీ కందుల ఓబులరెడ్డికి. అక్కడితో మంత్రివర్గ నిర్మాణ వివాదాలు అంత మైనాయి.

కాని, ప్రదేశ్ కాంగ్రెసు వ్యవహారాలు మరొక రకంగా మారాయి. అప్ప టికి మూడేళ్ల కిందట శ్రీ సంజీవరెడ్డి నాలుగుఓట్ల మెజారిటీతో శ్రీ రంగాను ఓడించి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడైనారు ఆ తర్వాత శ్రీ గోపాలరెడ్డి ఆ పదవిని స్వీకరించి ఎన్నికలు నిర్వహించి జయంపొందారు ఆ తర్వాత ఆ పదవిని శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు తొమ్మిదిఓట్ల మెజారిటీతో తిరిగి శ్రీ రంగాను ఓడించి గెలిచారు. ఈ పోటీలో శ్రీయుతులు గోపాలరెడ్డి, చంద్రమౌళి ప్రభృ తులు మంత్రులుగావుండి శ్రీ రంగాను బలపరచినా, ప్రయోజనం లేకపోయింది ఆ విధంగా శ్రీ గోపాలరెడ్డి నాయకత్వం తొలి అపజయాన్ని పొందింది రాష్ట్రానికి గల యువక నాయకులు రెండుగా చీలిపోయారు. శ్రీ అల్లూరి, శ్రీ సంజీవరెడ్డి నాయకత్వం ఒక వైపున, శ్రీ గోపాలరెడ్డి శ్రీ చంద్రమౌళి ప్రభృతులు మరొకవైపున నిలిచారు.

ఈ దశలో కాల ప్రవాహం కదలింది భాషా రాష్ట్రాల నిర్మాణం నిజ మైంది హైదరాబాదు సంస్థానం భాషా ప్రయుక్తంగా విభజన జరిగింది. ఆంధ్రుల చిరకాలవాంఛ విశాలాంధ్ర నిర్మాణం తథ్యమైంది ఈ పరిణామా లలో శ్రీ అల్లూరి నాయకత్వాన ఆంధ్ర కాంగ్రెసు ఆంధ్ర ప్రజా వాంఛకు అగ్రగామిగా నిలిచింది. తెలంగాణావాదుల వాదాలను ఎదుర్కొన్నది. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ సమయంలోకంటె, ప్రముఖమైన, ప్రశంసనీయమైన పాత్రను విశాలాంధ్రావతరణ సమయంలో ఆంధ్ర కాంగ్రెసు నిర్వహించింది. ఆ కీర్తి ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ అల్లూరికి, ఉప ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డికి దక్కింది. ఆ కృషి సహజపరిణామంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు శాసన సభా పక్ష నాయకుడుగా శ్రీ సంజీవరెడ్డి ఎన్నికైనారు విశాలాంధ్రకు తొలి ముఖ్యమంత్రి అనిపించుకున్నారు.

అటు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు, ఇటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా శ్రీ నీలం సంజీవరెడ్డి నాయకత్వాన విజయం పొందిన ఆంధ్రప్రదేశ్ రాజకీయ శక్తులు హైదరాబాదు కోటలో పాగా వేశాయి రాష్ట్రరాజకీయాలలో రకరకాల పాచికలు వేశాయి.

శ్రీ సంజీవరెడ్డి, శ్రీ అల్లూరి విభిన్నమైన ప్రవృత్తులు కలవారు వీరి తత్వాలు విభిన్నమైనవి. ప్రతిపక్షలను దగ్గరకు రానివ్వకుండా విభజించి— పాలించాలనే గ్రామపెత్తందారుతత్వం శ్రీ సంజీవరెడ్డిది. దగ్గరకు చేర్చి, పద వులలోవుంచి, అవసరమైన ప్రయోజనాలు సాధించాలనే లక్షణం శ్రీ అల్లూరిది. అయినా ఆనాడు వీరిద్దరికీ జట్టు కలిసింది ఒకరి లోపాలు మరొకరిద్వారా సరిదిద్దబడుతూ, రాష్ట్ర రాజకీయాలు కొంతకాలం సాఫీగా నడిచాయి.

సంజీవరెడ్డి బలహీనతలు అల్లూరికి తెలును అల్లూరి లోగుట్టు సంజీవ రెడ్డికి పరిచితం. ఏ వ్యవహారాన్ని అయినా అల్లూరి అయిసా—పైసాగా అయిదు నిముషాల్లో తేల్చి వేస్తాడు ఏ వ్యవహారాన్ని అయినా సంజీవరెడ్డి తెగ నివ్వడు దాట్లు వేస్తాడు నాన పెడతాడు వీరిద్దరి పోకడల్లోను ఈ వ్యత్యాసం వున్నందునే అయిదేళ్ల ఆంధ్ర రాజకీయాలు వీరిమధ్య దోబూచులాడాయి.

నిజానికి వీరిని ఎదుర్కొనవలసినవాడు, వీరి ఆట కట్టించడానికి ప్రయ త్నించవలసినవాడు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి. ఆయనకు రాజకీయంగా అవసర మైన అర్థబలం, స్థానబలం, అంగబలం వున్నాయి. కాని వానిని సరిగా వినియో గించగలిగిన దక్షత, రాజకీయానికి అవసరమైన కరుకుతనం, పార్టీని కట్టడానికి కావలసిన తెగువ ఆయనలో లోపించాయి. మనిషి ఎంత మెత్తనో, మనసు కూడా అంతకంటె మెత్తన. పదిమంది కలిసి పెద్దరికమిస్తే స్వీకరించడానికి మాత్రం సిద్ధపడతారు అలా సిద్ధించిన పెద్దరికాన్ని స్థిరపరుచుకోవాలని, చరితార్థం చేసుకోవాలని కూడా ప్రయత్నించని పెద్దమనిషితరహా ఈ నెల్లూరు బిడ్డది.

అందువల్లనే ఆంధ్రప్రదేశ్‌లో సంజీవరెడ్డి మంత్రివర్గ నిర్మాణం, సంజీవరెడ్డి రాజకీయాలు నల్లేరుమీద బండిగా సాగిపోయాయి. ఐక్య కాంగ్రెసు లోని ప్రజాపార్టీ ప్రతిపత్తిని గుర్తించ నిరాకరించారు. లోక పార్టీమీద విభ జించి—పాలించే నీతిని తీవ్రంచేశారు చివరకు శ్రీ కళా వెంకటరావులాంటి "గురువును" మంత్రివర్గంలో చేర్చుకున్నా, ఆయన కొక అవరోధంగా తూర్పు గోదావరి జిల్లాలో శ్రీ పట్టాభి రామారావును పెంచుతూ వచ్చారు. శ్రీ చంద్ర మౌళిని దూరంగా కొట్టినా, లోక్‌పార్టీ నాయకులకు నిలయమైన గుంటూరు జిల్లాను ఆకట్టడానికి శ్రీ గౌతు లచ్చన్నకు ప్రత్యామ్నాయంగా శ్రీ అనగాని భగ వంతరావును రంగంమీదకు తెచ్చారు రాయలసీమలో శ్రీ ఓబులరెడ్డి ప్రభృతు లకు ఎదురుగా శ్రీ తిమ్మారెడ్డిని పెంచారు. చివరకు శ్రీ గోపాలరెడ్డి కూడా, ఒక్క సహచరుడైనా లేకుండా, కేవలం నెల్లూరుజిల్లా ప్రతినిధి హోదాలో ఆలస్యంగా సంజీవరెడ్డి మంత్రివర్గంలో చేరడంతో, ఆంధ్ర ప్రాంతంలో రాజ కీయపు పాచికలు చరమ దశను అందుకున్నాయి

ఇక తెలంగాణాలో పరిణామాలు కూడా ఇదే గాడిని నడిచాయి ఇక్కడ తెలంగాణావాదులని, విశాలాంధ్రవాదులని రెండు వర్గాలవారు వున్నారు తెలం గాణా వాదులకు పితామహుడు శ్రీ కొండా వెంకట రంగారెడ్డి. తెలంగాణాలో చరిత్రకల మనిషేకాని, చరిత్రను నిర్మించగల వ్యక్తిత్వం తక్కువ తాలూకా కోర్టు ప్లీడరు తత్వంగల నాయకుడు, అనుచరులను కాదనలేడు వారిచేత ఒప్పిం చనూలేడు. అందువల్లనే ఆయననుంచి స్వతంత్రులుగా తయారైనారు శ్రీయుతులు జె వి. నరసింగరావు, డాక్టరు మర్రి చెన్నారెడ్డి విశాలాంధ్ర వాదు లలో ప్రముఖుడు శ్రీ వల్లూరి బసవరాజు. ఈయన కేవలం రాజధాని రాజ కీయవేత్త. శ్రీ రంగారెడ్డికి తెలంగాణాగ్రామాలలోవున్న జనబలం ఈయనకు లేదు. కాని తెలంగాణా అంటే హైదరాబాదు, సికిందరాబాదు వగరాలే నన్న దశను ఆ ప్రాంతం అనుభవిస్తున్నందున రాచరికం చేయగలిగాడు ఈ రాజు

ఇలాంటి రాజకీయవేత్తలకు నిలయంగావున్న తెలంగాణాలో నీలం— అల్లూరిద్వయం చక్కని పద్మవ్యూహం పన్నారు. విశాలాంధ్రవాదులను చేతిలో వుంచుకొని తెలంగాణావాదులను చీలగొట్టారు. విశాలాంధ్రావతరణ సమయంలో తెలంగాణాతో చేసుకున్న పెద్దమనుష్యుల ఒడంబడిక ప్రకారం ఉపముఖ్యమంత్రి పదవి తెలంగాణావారికి ఇవ్వాలి. కాని ఇది ఎవ్వరికి దక్కుతుందనే విషయంలో తెలంగాణా నాయకుల మధ్యవున్న ఆశలను, అనుమానాలను చక్కగా వినియోగించు కున్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి అనేది నిరుపయోగకరమైన ఆరవవ్రేలువంటిది కనక ఆ పదవి వలదని వారిచేతనే అనిపించారు ఆంధ్ర—తెలంగాణాల భావ— సమైక్యతకు ఇది తొలి సోపానంగా చిత్రించారు

పెద్దమనుష్యుల ఒడంబడిక ప్రకారం మంత్రివర్గంలో మూడు—రెండు నిష్పత్తిలో ఆంధ్ర—తెలంగాణాలవారు పదవులు పంచుకోవాలి కాని తెలంగాణాలో వున్న మూడువర్గాలను దగ్గరకు తీసుకొని అయిదు మంత్రి పదవులు మాత్రమే ఇచ్చారు. ఆరవ పదవిని పొందవలసిన శ్రీ నూకల రామచంద్రారెడ్డికి ప్రదేశ్ కాంగ్రెసులో పదవిని ఇచ్చారు

తెలంగాణా అభివృద్ధికి విడిగా అభివృద్ధి సంస్థ అవసరమని తెలంగాణా వారు కోరగా, విడి సంస్థ అనేది అవరోధమేకాని, అసలు పని జరగనివ్వదని రాయల సీమ ప్రతినిధిగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తాను పొందిన అనుభవాన్ని ఉదాహ రించారు శ్రీ సంజీవరెడ్డి. తెలంగాణా మంత్రులందరూ తమ ప్రాంతం అభి వృద్ధికి శ్రద్ధ చూపుతూవుంటే తాను కాదన నన్నారు కాని ఆచరణలో వారు చూపిన ప్రత్యేక శ్రద్ధ లేదనిపించారు.

ఈ విధంగా ఆంధ్రరాష్ట్ర నిర్మాణసందర్భంలో శ్రీ బాగ్ ఒడంబడి కను పట్టుదలగా అమలు జరిపించుకున్న రాయలసీమ నాయకుడైన శ్రీ సంజీవ రెడ్డి, తెలంగాణాతో జరిగిన పెద్ద మనుషుల ఒడంబడిక అమలు అనవసరమని

తెలంగాణావాదులు అనేటట్టు చేశారు రాయలసీమ ప్రతినిధిగా తెలంగాణావారిని కలుపుకుంటూ ఆంధ్రప్రదేశ్ భావ సమైక్యతను సాధించారన్న కీర్తిని పొందారు.

ఈ పరిణామాలన్నింటిలోను నీలం—అల్లూరి నాయకద్వయం ఏకంగానే వ్యవహరించింది వీరి వ్యూహాలు, నిర్ణయాలు ఎదురు లేకుండా సాగిపోయాయి కాంగ్రెసు పార్టీలోనా ప్రతిఘటనలేదు ప్రజాపార్టీ, లోకపార్టీ వగైరాలు కాంగ్రెసునుంచి వైదొలగాయి మంత్రివర్గంలో సంజీవరెడ్డి—గోపాలరెడ్డి—కళా "త్రయం" కలయిక సంజీవరెడ్డి నాయకత్వానికి బిగువు తెచ్చింది ముఖ్యమంత్రిగా శ్రీ సంజీవరెడ్డి దక్షులన్న ప్రసిద్ధి పొందుతూ వచ్చారు

ఇలా కథా నాయకుడు శ్రీ సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా బలపడుతూ వుండగా, ఉప కథానాయకుడు శ్రీ అల్లూరి సంస్థ స్థాయిలో ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా స్థిరపడిపోయారు కాని, ప్రాగ్జ్యోతిషపుర కాంగ్రెసులో అధ్యక్షుడు శ్రీ ధేబర్ తన ప్రధాన కార్యదర్శులలో ఒకరుగా శ్రీ అల్లూరిని నియమించుకొనడంతో ఆంధ్ర రాజకీయాలలో కొత్త ఘట్టం ప్రారంభమైంది ఇక్కడ నుంచే నీలం—అల్లూరి తగాదాలు ప్రముఖంగా తలెత్తాయి

అఖిల భారత కాంగ్రెసు కార్యదర్శి పదవీ స్వీకారంతో శ్రీ అల్లూరి కొత్త సమస్యను శ్రీ సంజీవరెడ్డికి తెచ్చిపెట్టారు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఎవ్వరిని వుంచుకోవాలన్నదే ఆ సమస్య మరొక సమస్య శ్రీ గోపాలరెడ్డి కేంద్రంలో మంత్రి పదవికిని స్వీకరించడం అలా ఆయన అఖిల భారత రంగంలోకి తప్పుకొనడంతో మంత్రివర్గంలో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయవలసి వుండడం ఇలా రాష్ట్రస్థాయిని ఆడవలసిన చదరంగంలో అటు కాంగ్రెసు సంస్థలోను, ఇటు మంత్రివర్గంలోను రెండు పావులు లోపించాయి

ఈ పావులను భర్తీ చేయటంలో శ్రీ సంజీవరెడ్డి అనుసరించిన విధానాలతో రాష్ట్ర రాజకీయాలలో కొత్త నాయకులు తలెత్తారు దీనిలో తొలి అంకం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి ఉప ముఖ్యమంత్రి పదవిని రద్దు చేశారు కనక అది తెలంగాణాకు చెందాలనే వాదన వచ్చింది కాని అందుకు అభ్యర్థి ఎవ్వరనే దానిలో అప్పటికి మంత్రులుగావున్న తెలంగాణా ప్రముఖ నాయకులు ఏకీభవించలేదు ఏ పదవి ద్వారా తమలో ఎవ్వరు పైకి పోగలరోనన్న ఈర్ష్యాభావాలు వారి రాజకీయాలకు కీలకంగా వున్నాయి. శ్రీ బాగ్ ఒడంబడిక ప్రకారం చూస్తే ముఖ్యమంత్రి రాయలసీమవారు కనక ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి సర్కారు జిల్లాలకు రావాలి అల్లూరి కూడా సర్కారు జిల్లాలవాడే కాని తెరచాటున జరిగిన సమాలోచనలలో శ్రీ పిడతల రంగారెడ్డి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగాను, శ్రీ నూకల రామచంద్రారెడ్డి ప్రధాన కార్యదర్శిగాను వచ్చారు. అంటే ముఖ్యమంత్రి పదవి, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి రాయలసీమవారు స్వీకరించారు. అవసరాన్నిబట్టి సర్కారు జిల్లాల ప్రతినిధులు కూడా ఆనాడు తలలువంచారు.

ఇక మంత్రివర్గంలో శ్రీ గోపాలరెడ్డి స్థానం కాళీగా మిగిలింది. అది చివరవరకూ భర్తీ కాలేదు. దీనికి అభ్యర్థిగా నిలిచినవారు శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి. కాని శ్రీ సంజీవరెడ్డి హయాంలో వారికి మంత్రి పదవి లభించలేదు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవీ రాలేదు ఆ విధంగా నెల్లూరుతోసహా సర్కారు జిల్లాలలో ఒక రకమైన రాజకీయ అసంతృప్తి లోలోపల ప్రజ్వరిల్లుతూ వచ్చింది. అంతలోనే శ్రీ కళా వెంకటరావుగారు అస్తమించారు. ఆ సమయానికే తెలంగాణా ప్రముఖ నాయకుడు డాక్టరు చెన్నారెడ్డి, శ్రీ సంజీవరెడ్డి పాలనను విమర్శించారని ప్రదేశ్ కాంగ్రెసు క్రమశిక్షణ చర్య తీసుకుంది ఎన్నికలలో అవినీతి చర్యలు కొనసాగించారనే కారణాన శ్రీ వల్లూరి బసవరాజు మంత్రివర్గంనుంచి నిష్క్రమించారు.

ఈ పరిణామాలవల్ల శ్రీ సంజీవరెడ్డి ఏకాకిగా నిలిచారు శ్రీయుతులు గోపాలరెడ్డి, కళాలతో కట్టుకున్న పునాది సడలింది అల్లూరితో నేస్తం పూర్వపు స్థాయిలోలేదు. మంత్రివర్గంలో ఏర్పడిన మూడు శాఖలను (గోపాలరెడ్డి, కళా, వి బి రాజులవి) భర్తీ చేయకుండా, వాటిమీద చూపు పెట్టుకొనివున్నవారందరినీ దూరంగా ఆశలతో వుంచుతూ, వాగ్బంధం చేశారు శ్రీ సంజీవరెడ్డికి తిరుగు లేదనిపించుకున్నారు చివరకు తోటి మంత్రుల శాఖలను మారుస్తున్నట్టు టెలిఫోనులలో పిలిచి చెప్పే స్థితికి వచ్చారు

వరకు ఆంధ్రప్రదేశ్ శాసన సభలో కాళహస్తి ప్రతినిధిగానే వున్నారు. పెద్ద పదవిలోవున్నా, ఆయన చూపిన చిన్నబుద్ధి ఇది.

అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా వెడుతున్న శ్రీ సంజీవరెడ్డికి రాష్ట్ర కాంగ్రెసుపార్టీలోని స్థితిగతులు, దానిలోని ప్రముఖుల లోపాలు, బలహీనతలు పూర్తిగా తెలుసు కనకనే ముఖ్యమంత్రిగావుండి, వారిని ఎంతగా కట్టుదిట్టాలలో వుంచారో కాంగ్రెసు అధ్యక్షులుగా వున్నప్పుడు కూడా, సంస్థ శ్రేయస్సుకోసం, అంతకంటె ఎక్కువ కట్టుదిట్టాలలో వారిని వుంచవలసింది. కాని, ఆయన ఆ పని చేయలేదు అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని ఆంధ్ర రాజకీయాలను కల్లోలపరచడానికి వినియోగించారు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ సమయంలో ఆంధ్ర కాంగ్రెసును ఏవిధంగా రాయలసీమ అవసరాలకు వినియోగించారో, అఖిల భారత కాంగ్రెసును కూడా తన రాష్ట్ర నాయకత్వవాంఛకు ఉపయోగించారు అనువుగా 1962 ఎన్నికల అనంతరం పరిణామాలు ఈ విషయాన్ని ధ్రువపరచాయి

శ్రీ సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా వెళ్ళిన తర్వాత శ్రీ సంజీవయ్య మంత్రివర్గ నిర్మాణంలో తగాదా కనిపించలేదు నలుగురూ అనుకున్నవారే మంత్రులుగా వచ్చారు అజ్ఞాతవాసంలోవున్న శ్రీ పళ్లంరాజు శ్రీ చంద్రమౌళి, శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి ప్రభృతులు, కొత్తగా కాంగ్రెసులో చేరిన శ్రీ పి. వి. జి రాజు కూడా మంత్రిత్వం కలిగారు మొత్తంమీద సంజీవయ్య హయాంలో రాజకీయాల నడక సవ్యంగానే ప్రారంభమైన దనుకున్నారు శ్రీ సంజీవరెడ్డి ద్వారా వచ్చిన అసంతృప్తి తొలగిపోయిందని భావించారు.

తెలంగాణాకు ఉపముఖ్యమంత్రి పదవిని పునరుద్ధరించి శ్రీ కె వి. రంగారెడ్డికి దానిని ఇచ్చారు ఇందులో తెలంగాణాను సంతృప్తి పరచాలనే వ్యూహం వుండవచ్చు కాని నాలుగేళ్లనాడు విస్మరించిన పదవిని పునరుద్ధరించడంలో దూరదృష్టి లేదనిపించింది. అంతకంటె పెద్దమనుష్యుల ఒడంబడిక ప్రకారం తెలంగాణాకు ఆరవ మంత్రి పదవిని ఆనాడే శ్రీ జె. వి నరసింగరావువంటివారికి ఇచ్చి వుంటే ఆ తర్వాత ప్రమాదాలను సంజీవయ్య మంత్రివర్గం ఎదుర్కొనవలసి వచ్చేదికాదు.

ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ పిడతల రంగారెడ్డిస్థానే శ్రీ నూకల నరోత్తమరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకొనడంతో రాజకీయాలలో కొత్త రవరవలు బయలుదేరాయి తెలంగాణాకు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి అంటూ శ్రీ అల్లూరి చేసిన వాదన సర్కారు జిల్లాలలో అసంతృప్తి తెచ్చింది. ఆ నాడు రాయలసీమ నాయకులను పెంచి, అన్యాయం చేశారు. ఈ నాడు తెలంగాణాను పెంచి, తమ స్వప్రయోజనాలు చూచుకుంటూ, సర్కార్లలో మిగిలి వున్న నాయకులకు అవకాశాలు తగ్గిస్తున్నారనే విమర్శలకు శ్రీ అల్లూరి గురి అయ్యారు పోతే తెలంగాణాలో కూడా తమ ప్రతినిధి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడయ్యాడనే సంతృప్తి, సంతోషం కనిపించలేదు శ్రీ నూకల రామచంద్రారెడ్డి మంత్రి అయిన తర్వాత, ఆయన సోదరుడు శ్రీ నరోత్తమరెడ్డినే ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షునిగా చేయాలా అన్న ప్రశ్న వినవచ్చింది. ఇలా ప్రశ్నించిన వారిలో శ్రీ వి బి. రాజు, శ్రీ కె. వి రంగారెడ్డి, శ్రీ జె వి. నరసింగరావువంటి తెలంగాణా ప్రముఖ నాయకులు అందరూ వున్నారు. సంజీవరెడ్డి హయాంలో నూకల వారికి ప్రాధాన్యమివ్వలేదు సంజీవయ్య హయాలంలో వారికి ప్రాధాన్య మివ్వడంతో, తెలంగాణా రాజకీయాల్లో సంజీవరెడ్డి చేసిన తప్పులను, మరొక రూపంలో అల్లూరి కూడా చేస్తున్నాడనే నింద వచ్చింది అది సర్కారు జిల్లాలలో కేంద్రీకృతమైంది

అదీకాక సంజీవయ్య మంత్రివర్గంలో తూర్పుగోదావరి (ఇద్దరు మంత్రులు) గుంటూరు (ఇద్దరు మంత్రులు), కర్నూలు (ఇద్దరు మంత్రులు) రాజకీయ ప్రాబల్యం, ప్రాతినిధ్యం కొత్త పరిణామాలు తెచ్చింది సంజీవయ్య మంత్రివర్గాన్ని వ్యతిరేకించే శక్తులు కూడా ఈ జిల్లాలనుంచి, ఈ జిల్లాలమీద ఆధారపడుతూ విస్మరించిన కృష్ణా, చిత్తూరు జిల్లాలనుంచి పెరిగాయి. కాని వెంటనే పొంగలేదు ఇహ పదవులు రాక కక్షను పెంచుకున్నవారు, పదవుల

ఈ దశలోనే శ్రీ సంజీవరెడ్డి తన ఆంతరంగికులుగా ఒకరిద్దరిని చేర్చుకున్నారు. అందులో ముఖ్యులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి రెండవవారు శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మూడవవారుగా ఆ యా సందర్భాలనుబట్టి, శ్రీ పట్టాభి రామారావు, శ్రీ జె. వి నరసింగరావు, శ్రీ కె వి రంగారెడ్డి ప్రభృతులు వీరందరి ద్వారా రాష్ట్ర పాలన ఏకధాటీగా కొనసాగించారు శ్రీ సంజీవరెడ్డి

కాంగ్రెసు సంస్థ స్థాయిలో జిల్లా కాంగ్రెసు సంఘాలకు ఎన్నికలు జరిపించారు వానికి కూడా వీరు కోరుకున్నవారే చాలవరకు జిల్లా నాయకులుగా ఎన్నికైనారు. ఇలా కాంగ్రెసు సంస్థ నిర్మాణంలో శ్రీ పిడతల రంగారెడ్డి, శ్రీ నూకల రామచంద్రారెడ్డి ప్రముఖపాత్ర వహించి, కొత్త నాయకులుగా రూపొందారు వీరి ద్వారా ప్రదేశ్ కాంగ్రెసు అనేది ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం వ్యవహరించే అనుబంధ సంస్థగా తయారై పోయింది అక్కడ అఖిల భారత కాంగ్రెసులో కార్యదర్శిగా శ్రీ అల్లూరి వుండడంవల్ల అటు సంస్థ ద్వారాకాని, ఇటు పార్టీ ద్వారాకాని వ్యతిరేక శక్తులు తలెత్తడానికి వీలులేకుండా పోయింది అందరూ గుంభనగా వుండిపోయారు సమయంకోసం వేచి చూస్తున్నారు

ఇలా అంతర్గతంగావున్న శక్తులు ఒక కొనకు రావడానికి కాంగ్రెసు సంస్థలో వచ్చిన ఎన్నికలు ఒక అవకాశాన్ని కలిగించాయి అప్పటికి అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ ధేబర్‌స్థానే తాత్కాలికంగా శ్రీమతి ఇందిరాగాంధి వచ్చారు కార్యదర్శి పదవిలో శ్రీ అల్లూరి అక్కడ కొనసాగుతూ వచ్చారు కొత్త అధ్యక్షుని ఎన్నిక రానున్నదనుకుంటున్న రోజులవి అప్పుడు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు కాదగినవారుగా మంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య, శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగార్ల పేర్లను ముఖ్యమంత్రిగా శ్రీ సంజీవరెడ్డి సూచించారు శ్రీ సంజీవయ్యగారు రాష్ట్ర నాయకుని హోదాకు తగుదురన్నమాట ముందుగా వినిపించింది అప్పుడే శ్రీ సంజీవయ్యవుంటే తనకు అభ్యంతరం లేదన్నారు శ్రీ అల్లూరి కాని శ్రీ సంజీవయ్య పరిస్థితుల ప్రభావాన్ని గ్రహించి, ఆ భారాన్ని నిర్వహించలేనని తప్పుకున్నారు అప్పటికి ఎటూ తెగక శ్రీ పిడతల రంగారెడ్డి గారినే ఇంకా కొంతకాలం ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా వుంచాలనే తీర్మానం జరిగింది ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి అనేది వివాదాంశమై పోయింది

ఈ సందర్భంలోనే ఒకటి రెండు సూచనలు వచ్చాయి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదు కనక తెలంగాణావారిని ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నుకోవాలన్నారు కాని, అందుకు అభ్యర్థి ఎవ్వరనేది అక్కడి వర్గాలను బట్టి చిక్కు సమస్య అయింది పోతే సర్కారు జిల్లాలవారిని ఎన్నుకోవాలన్నారు అప్పుడు ఆలోచనలోకి వచ్చిన పేర్లు శ్రీ పళ్లంరాజు, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య వీరు కేవలం వ్యక్తులుకాదు రాష్ట్ర కాంగ్రెసు చరిత్రకు ప్రతినిధులు ఒకరిది తూర్పు గోదావరిజిల్లా రెండవవారిది కృష్ణాజిల్లా స్థానిక సమస్యలవల్లను, రాష్ట్ర రాజకీయ వలయాలవల్లను పేరుకు పెద్దలుగా గౌరవించబడుతున్నవారేకాని, అందుకున్న పదవులు లేనివారు ఇలాంటి వయో వృద్ధులువున్నా, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నికను వాయిదా వేశారు అల్లూరి—నీలం ఏకాభిప్రాయంలేదన్నది అప్పుడు అందరికీ బహిరంగంగా తెలియవచ్చింది కాంగ్రెసునుంచి పోయినవారు పోగా, మిగిలినవారిమధ్య కీచులాట ప్రారంభమైనదని ప్రజలు నవ్వుకున్నారు

మొత్తంమీద శ్రీ సంజీవరెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవులుకాని, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికాని, చివరకు జిల్లా కాంగ్రెసు నాయకత్వాలుకాని అందరూ అనుకున్నవారికి, నలుగురూ ఆశించినవారికి లభించలేదు శ్రీ సంజీవరెడ్డి ఏకధాటీగా సాగించిన పాలనలో అటు పార్టీలోను, ఇటు సంస్థలోను ఒక రకమైన భీతి, శ్రీ సంజీవరెడ్డి అంటే భయం జనింపజేశాయి ఎప్పటికి ఏ పరిణామం సంభవం కాగలదో అనుకుంటూ వుండగానే, ఇక ఆట్టే కాలం ఆయన ఏకచ్ఛత్రాధిపత్యం సాగదనుకుంటున్న సమయంలోనే, హఠాత్తుగా ఆయనకొక సదవకాశం లభించింది అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని స్వీకరించడానికి రమ్మనే పిలుపు వచ్చింది

శ్రీ సంజీవరెడ్డి దీర్ఘసూత్రుడు ఆయన చూపులో నిర్ణీతలక్ష్యంకంటె ప్రక్కచూపులు అధికం పరిస్థితులనుబట్టి లక్ష్య నిర్ణయం ఆయన పద్ధతి పరిస్థితుల సానుకూలతనుబట్టి జయాప జయాల మదింపు ఆయన అనుసరించే మార్గం రాష్ట్రంలోని పరిస్థితులు ఆయనకు పూర్తిగా తెలుసు ఎన్నికలకు రెండేళ్ల వ్యవధి వున్నది కనక, ఆలోగా తాను ఎదుర్కొనవలసిన క్లిష్ట పరిస్థితులు ఎలాటివో ఆయన గుర్తించారు చివరకు పార్టీలో విశ్వాస రాహిత్య తీర్మానంవచ్చినా రావచ్చు కనక ఈ రెండేళ్లు ఢిల్లీలోవుంటే మంచిదని భావించారు అయితే ఆ తర్వాత సంగతి సందర్భాలను గురించి కూడా వూహించారు కనకనే రాష్ట్ర రాజకీయాలను తన చేతులలోనే వుంచుకొన దలచారు అందుకు తగిన వ్యూహాన్ని పన్నారు

రాష్ట్రంలో తనకు ప్రత్యర్థిగా నిలవగలిగిన వ్యక్తి శ్రీ అల్లూరి పైగా ఆయన అఖిల భారత కాంగ్రెసు కార్యదర్శి కనక ఆయన ఆట కట్టించే ఏర్పాట్లు ముందుగా యోచించారు అందులో మొదటి ఏర్పాటు సోషలిస్టుగా వుంటున్న శ్రీ పి వి జి రాజును కాంగ్రెసులో చేర్చుకొనడం విజయనగరం రాజును, జిన్నూరు రాజుకు (అల్లూరి) పోటీగా పెంచదలచారు కాని రాజకీయ చపలత్వం కల విజయనగరరాజు ఆశించినట్టుగా ఆదిహో వ్యవహరించలేదు కాని, చివరకు అనుకున్న ప్రకారం తన అవసరం తీర్చారు రెండవ ఏర్పాటు అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా వెడుతున్నప్పటికి, పట్టుదలగా జిల్లా పరిషత్తులకు అధ్యక్షుల ఎన్నికలు జరిపించారు తాను కోరుకున్నవారిని జిల్లా నాయకులుగా నిలిపారు ఇలా అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని స్వీకరిస్తూనే, రాష్ట్రం, జిల్లా స్థాయిలలో కొత్త శక్తులను పెంపొందజేశారు శ్రీ సంజీవరెడ్డి చివరకు ఆ శక్తులే, రెండు సంవత్సరాల అనంతరం తిరిగి ముఖ్యమంత్రి పదవిని శ్రీ సంజీవరెడ్డి స్వీకరించడానికి మార్గాన్ని సుగమం చేశాయి

జిల్లాల స్థాయిలో కొత్త నాయకులను సృష్టించారు కనక, వారి ద్వారా తాను కోరిన వారిని ముఖ్యమంత్రిగావుంచి, "పాదకా పట్టాభిషేకం" చేయించాలని శ్రీ సంజీవరెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు అందుకు కొంత వ్యవధి అవసరమైంది దానికి అనువుగా శ్రీ సంజీవరెడ్డిని ఇంకా కొంతకాలం ముఖ్యమంత్రిగా వుంచాలనే సన్నాహాలు జరిగాయి కాంగ్రెసు శాసనసభా పక్షంలో ఇందుకు తీర్మానం శ్రీ సంజీవరెడ్డి అంగీకారంమీదనే జరిగింది ఆ తీర్మానమే శ్రీ సంజీవరెడ్డి సంధిగ్దస్థితిని నవ్వులపాలు చేసింది చివరకు తప్పనిసరిగా అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని స్వీకరించడానికి శ్రీ సంజీవరెడ్డి వెళ్లవలసివచ్చింది

రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి తానుగా ఎవ్వరి పేరును శ్రీ సంజీవరెడ్డి సూచించకుండావుంటే బాగుండేది అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని స్వీకరిస్తున్నవారికి అలాంటి విశాలదృష్టి వుండడం సహజం ఫలానావారు తగరు, ఫలానావారు తగుదురు లంటూ పేర్లు పెట్టకుండా, పార్టీ నిర్ణయానికి, అవసరమైతే పార్టీలో పోటీకి వదిలిపెట్టివుంటే, రాజకీయ పరిణామాలు మరొక రకంగా వుండేవి అది ప్రజాస్వామ్య పద్ధతి అనిపించుకొనేది కాని ముఖ్యమంత్రిగా అల్లూరి తగడనో, శ్రీ బహ్మానందరెడ్డి తగుననో, శ్రీ కె వి రంగారెడ్డి ఎందుకు కాకూడదనో అంటూ పార్టీ నాయకుని ఎన్నిక వ్యవహారాన్ని ఆయన క్లిష్టం చేశారు. శ్రీ సంజీవరెడ్డిపట్ల వ్యతిరేకతకల వారందరూ చివరకు ఒక్కదఫాగా విజృంభించారు శ్రీ అల్లూరిని ముఖ్యమంత్రిగా సూచించారు కాని శ్రీ సంజీవరెడ్డి అందుకు అంగీకరించలేదు ముఖ్యమంత్రిగా తన స్థానాన్ని శ్రీ అల్లూరి ఆక్రమిస్తే, తనకిక రాష్ట్రంలో స్థానం లేకుండా చేస్తాడన్న నమ్మకం ఆయనకువుంది అఖిల భారత స్థాయిలో తనకు వుండగల స్థానం సంగతి కూడా శ్రీ సంజీవరెడ్డికి తెలుసు కనకనే పెద్ద పదవిలోకి పోతున్నా, చూపు మాత్రం స్వస్థలంమీదనే వుంచారు అల్లూరినికాదంటూ, రాజీగా శ్రీ సంజీవయ్య ముఖ్యమంత్రిగా వుండడానికి అంగీకరించారు ఆ విధంగా అప్పటికి అల్లూరిని ముఖ్యమంత్రి కాకుండా చేశారు శ్రీ సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవిలో శ్రీ సంజీవయ్యవున్నా, శ్రీ అల్లూరి ప్రధాన కథానాయకుడుగా మార్పు చెందారు

శ్రీ సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని స్వీకరించినా, ఆయన మనస్సు రాష్ట్ర రాజకీయాలలోనే లగ్నమైవుంది తను ఉన్నత పదవిలో వున్నా, ఆ పదవికంటె శాసన సభ్యత్వమే మిన్న అని భావించారు కాంగ్రెసు సంస్థలో పదవులు నిర్వహించేవారు శాసన సభ పదవులు వదులు కొనాలనే నిబంధనవుంది ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగావుండి శ్రీ అల్లూరి, శ్రీ నరోత్తమరెడ్డిగార్లు రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు కాని, శ్రీ సంజీవరెడ్డి మాత్రం చివరి

ంది అసంతృప్తి చెందినవారు, సమయంకోసం పొంచివున్నారు. ఇలాంటివారు దో ఒక ప్రాంతంలోను, జిల్లాలలోనుకాదు రాష్ట్రం నలుమూలలా వ్యాపించి న్నారు

ఈ పరిస్థితులలోనే ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘ నిర్మాణ సమస్య చ్చింది. దీనికి ఏకగ్రీవంగా ఎన్నికలు జరుపుకోవాలనే ప్రయత్నంలో శ్రీ ఎ. సి. బ్బారెడ్డి మినహాయింపు, ఆయన తిరుగుబాటు, మంత్రివర్గంనుంచి నిష్క్రమణ, పొంచివున్న వర్గాలకు ఒక నాయకత్వాన్ని ఇచ్చాయి తగాదా పడడానికి తగిన అవకాశాన్ని చూపాయి నిజానికి ఇది సంస్థ స్థాయిలో జరగవలసిన వ్యవహారం కాని, తాను చేసిన రాజీని ఎ. సి. కాదన్నాడనే వైఖరిని ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య అవలంబించడంతో ఈ తగాదా మంత్రివర్గ స్థాయిని అందుకున్నది. తిరిగి రాజకీయ బలప్రదర్శనాలు ప్రారంభమైనాయి

శ్రీ ఎ సి శక్తివంతుడు స్థానబలం కలిగిన వ్యక్తి ఆలోచనకంటె, ఆవేశం హెచ్చు. స్వశక్తిమీద ఆధారపడి వ్యవహరించే తత్త్వం కనక అందరూ తనవంటి వారే అనుకుంటారు కాని తన్ను పావుగా ఇతరులు వినియోగించు కుంటున్నారనేది గుర్తించరు అదీకాక నెల్లూరు జిల్లానుంచి శ్రీ గోపాలరెడ్డి నాయకత్వం రాష్ట్రానికి సమకూరినంతవరకు రాష్ట్ర రాజకీయాలలో ఎ. సి కీలకం కాలేకపోయారు అయినా ఇతరుల కార్య సాధనకు పదునుగల కత్తిగా రూపొందారు

ఈ ఘట్టంలోనే అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ సంజీవరెడ్డి రాష్ట్ర రాజకీయాలమీద పిడికిలి బిగించారు. ముఖ్యమంత్రిని ధిక్కరించిన ఎ సి. ని శాఖలులేని మంత్రిగా చేసినా, ఆయన పదవిలో వుండేటట్టు చేశారు శ్రీ ఎ సి. అప్పీలును స్వీకరించి, వ్యవహారాన్ని పార్లమెంటరీ, సంప్రదాయాలకు వ్యతిరేకం, కాంగ్రెసు ప్రతిష్ఠకు విరుద్ధం అయినా, స్వరాష్ట్రంలో కాంగ్రెసు రాజకీయాలను రచ్చకెక్కనిచ్చారు అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షుని హోదాలోవున్న శ్రీ సంజీవరెడ్డి ఇలా తనకు అవసరమైన రాజకీయసుడిగుండాన్ని రాష్ట్రంలో సృష్టించడానికి అంగీకరించింది కాంగ్రెసు అధిష్ఠానవర్గం

శ్రీ ఎ. సి కి మంత్రిపదవిపోయింది సంజీవయ్య మంత్రివర్గంలో తిరిగి పదవి లభ్యంకాని పరిస్థితులు ఆయనను చుట్టు ముట్టాయి పార్టీలో వుండి, పాలక వర్గానికి వ్యతిరేక శక్తిగా నిలవకతప్పని పరిస్థితులను సృష్టించుకున్నారు శ్రీ ఎ సి సుబ్బారెడ్డి అక్కడితో ఆ పరిణామాన్ని ఆపలేదు అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులు కాంగ్రెసు ఎలక్షను కమిటీ ఎన్నికను నిబంధనావళి ప్రకారం జరగలేదన్న సాకుతో రద్దు చేయించారు కొత్తగా ఎలక్షను కమిటీ ఎన్నికను జరిపించమని పైనుంచి ఆదేశాలు పంపారు. రాష్ట్రం నలు మూలలా పొంచివున్న శక్తుల కేంద్రీకరణకు ఇది సదవకాశాన్ని ఇచ్చింది ఎ సి ఉదంతంతో పెరిగిన ఉద్రేకాలు చల్లారేవరకు ఈ ఎన్నికను వాయిదావేసివుంటే, పరిణామాలు మరొక రకంగా వుండేవి కాని, అవి మరొక రకంగా కావడం అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులకు అయిష్టం

ఈ లోగానే రాజధాని రాజకీయాలు కొత్తరూపాన్ని ధరించాయి. హైదరాబాదు—సికిందరాబాదు నగరాల విలీనంతో మునిసిపల్ ఎన్నికలు జరపవలసి వచ్చింది. దీనికి మంత్రి శ్రీ పి. వి. జి రాజా అధ్యక్షతను సివిక్‌బోర్డు ఏర్పడింది మునిసిపల్ ఎన్నికలకు అభ్యర్థుల నిర్ణయంలో తెలంగాణా ప్రముఖులు శ్రీ వి బి రాజా, శ్రీ జె. వి. నరసింగరావులు, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడుగావున్న శ్రీ నరోత్తమరెడ్డి తగాదా పడ్డారు సివిక్ బోర్డు సూచించిన పేర్లు కొన్ని ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు మార్పు చేయడంతో పి వి జి రాజా—నరోత్తమరెడ్డి వివాదం హెచ్చింది ఈవిధంగా తెలంగాణాలో జె వి—వి బి—పి వి జీలు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నరోత్తమరెడ్డికి వ్యతిరేకంగా చేతులు కలిపే నాటికి ఎలక్షను కమిటీ రద్దు వ్యవహారాన్ని వివాదాంశంగా అందజేశారు అఖిల భారత కాంగ్రెసు అధిష్ఠానవర్గంవారు

శ్రీ ఎ. సి. ద్వారా వచ్చిన వివాదంకంటె తెలంగాణాలో ఏర్పడిన అసంతృప్తి రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసింది తెలంగాణావారే తెలంగాణా ప్రతినిధిగావున్న ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నరోత్తమరెడ్డిమీద ధ్వజమెత్తారు. సర్కార్లు రాయలసీమలలో అంతవరకు పొంచివున్న వ్యతిరేక శక్తులన్నీ ఒక దఫా విజృంభించాయి. తెలంగాణామీద అతిగా మొగ్గిన అల్లూరి వ్యూహాలు విఫలమైనాయి కాంగ్రెసు సంస్థా స్థాయిలో ఆయన బలహీనుడని ఎలక్షన్ కమిటీ ఎన్నికల పోటీ రుజువు చేసింది ఆ విధంగా అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షుల తక్షణ లక్ష్యం నెరవేరింది

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి శ్రీ నరోత్తమరెడ్డి రాజీనామా చేశారు ఉభయుల మధ్య రాజీగా శ్రీ మల్లిపూడి పళ్ళంరాజా అధ్యక్ష పదవిని స్వీకరించారు ఆయన సర్కార్లలో జాతీయ వాదానికి ప్రతినిధి. కాకలుతీరిన వృద్ధ కాంగ్రెసు నాయకులు. ఆయనను ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి రప్పించడంలో శ్రీ సంజీవరెడ్డి విజయాన్ని సాధించారు సంస్థలో రెండవ రాష్ట్ర కాంగ్రెసు సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం తనకు అనువైనవిగా చేసుకోగలిగారు సంస్థ స్థాయిలో అల్లూరి అపజయాన్ని ధ్రువపరచారు

ఇక మంత్రివర్గ స్థాయిలో వ్యూహాలు ప్రారంభమైనాయి ఎ. సి ని బయటికి పంపిన ఖాళీ ఒకటి. శ్రీ పళ్ళంరాజు రాజీనామా చేసిన ఖాళీ రెండవది. ఈ రెండు ఖాళీలు మంత్రివర్గంలో భర్తీ చేయడమనే సమస్య మిగిలింది. అందుకోసం రాజీ సమాలోచనలు సాగాయి. రాష్ట్ర స్థాయినివున్న నాయకులకు మంత్రి పదవులు స్వీకరించడం ఇష్టం కాని అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షునికు అది ఇష్టంలేదు కనక ఎవ్వరిని తీసుకోవాలి ఎందరిని తీసుకోవాలనే దానిమీద సుదీర్ఘ సమాలోచనలు, అంతులేని వాదోపవాదాలు సాగాయి. చివరకు వృథా ప్రయాసేకాని, కుదిరిన పరిష్కారంలేదు కాని ఈ సందర్భంలో కూడా శ్రీ అల్లూరి తనవ్యూహం మార్చుకొనక రాజకీయంగా నష్టపోయారు 'బలవంతుడు నాకేమనే, ధోరణిలో వ్యవహరించారు పార్టీలో తనకు తగ్గిన బలాన్ని చూచుకోలేదు ప్రత్యర్థుల బలహీనతను, పదవులపట్లగల ప్రలోభాన్ని అసరాగా చేసుకొని, వారిని చీల్చాలని ప్రయత్నించారు విఫలమైనారు మొత్తానికి మంత్రివర్గ స్థాయిలో ప్రతిష్టంబన యధాతథంగా కొనసాగింది అలా కాకుండా అప్పుడే ఇద్దరిని మంత్రివర్గంలోకి తీసుకుంటే, ఆ తరువాత పరిణామాలు మరొక రకంగా వుండేవి

కాని కాలం కూడా కలిసి రాలేదు 1962 ఎన్నికలు దగ్గర పడ్డాయి. అందరూ ఎన్నికలకు సిద్ధపడవలసివచ్చింది అప్పుడే అందరి బలహీనతలు బయట పడ్డాయి ఎన్నికల అనంతరం కొత్త ముఖ్యమంత్రి ఎవ్వరనే యోచనలు ప్రారంభమైనాయి అందరి వ్యూహాలకు, అది కీలకంగా తయారైంది ఎవ్వరికి వారు జాతకాలు చూపించుకున్నారు ఎవ్వరి ఎత్తులు వారు వేశారు అప్పటినుంచే రంగంమీదికి వచ్చారు ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య

శ్రీ సంజీవయ్య పేరుకు ముఖ్యమంత్రేకాని, అసలు ముఖ్యమంత్రి శ్రీ అల్లూరి అనే ప్రతీతి అంతవరకూవుంది కాంగ్రెసుసంస్థ వ్యవహారాలలోకాని, మంత్రివర్గ నిర్మాణ సమస్యలలోకాని, అది నిజమనిపించింది అల్లూరి వ్యూహాలు విఫలం కావడంతోపాటు శ్రీ సంజీవయ్య బలపడుతూ వచ్చారు సరసుడూ, సజ్జనుడు అనిపించుకున్నారు అల్లూరి చేతిలో కీలుబొమ్మ కాదన్న నమ్మకం కలిగించారు సందర్భం, సమయంవస్తే స్వతంత్రించి, వ్యవహరించగలడని, తన సత్తా చూపగలడని ఆచరణలో నిరూపించుకున్నారు దీనితో అల్లూరి—సంజీవయ్యల ఏకాభిప్రాయం లేదన్న వాతావరణం ఏర్పడింది శ్రీ సంజీవయ్య స్వతంత్ర శక్తిగా నిలబడ్డారు

శ్రీ సంజీవయ్య స్వతహాగా సరుకుగల మనిషి కాని, జన్మించినది హరిజన కుటుంబంలో. యుక్త వయస్సు వచ్చేవరకు అనుభవించింది అష్ట కష్టాలను. అదృష్టం అంటూ అబ్బింది రాజాజీ పుణ్యమాఅని వరసగా రాజాజీ, ప్రకాశం, గోపాలరెడ్డి, సంజీవరెడ్డి మంత్రివర్గాలలో పదేళ్ళు మంత్రిగావున్నా, ఆయన ఎంతగా నివురుకప్పిన నిప్పో ఎంతోమందికి తెలియదు ఆయన ప్రతిభ పదిమందికీ తెలిసే అవకాశం లభించలేదు జన్మతహావున్న బలహీనతవల్ల తనకు తానుగా ఆయన రాజకీయాలలో పైకి రావడానికి అవసరమైనట్టుగా ముందడుగు వేయలేకపోయారు

ఆయనకు రాష్ట్ర కాంగ్రెసు నాయకుడనిపించుకొనే అవకాశం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవిని శ్రీ పిడతల రంగారెడ్డినుంచి పొందే పరిస్థితు

లలో లభించింది ఆయన దానిని వలదన్నారు. మంత్రి పదవిలో వుండడానికే ఇష్ట పడ్డారు. ఇది ఆయన బలహీనతగా అప్పుడు భావించారు

బహుశా ఆ అవకాశాన్ని వదలినందునే కాబోలు, అల్లూరి—నీలం మధ్య రాజీగా ముఖ్యమంత్రి కాగలిగారు ఆ పదవి వచ్చినంత మాత్రాన ఆయన తన పద్ధతి మార్చుకోలేదు. రాజకీయాలకు తెరవెనకగానే వుంటూ వచ్చారు. స్వశక్తి తెలుసుకొనక, పరిస్థితుల ప్రభావం గుర్తించినవాడు కనక, అనుకూలు రకు, వ్యతిరేకులకు సమానమైన అవకాశం ముఖ్యమంత్రిగా ఇచ్చారు. అందరికీ వినియోగపడ్డారు అందరినీ ఆకర్షించారు అది ఆయన చేతిలోవున్న పదవిద్వారా సుసాధ్యమైంది కాని ఆ పదవి పదిలంగా వుండాలంటే, రాజకీయమైన శక్తి మరికొంత కావాలి దానిని ఆయన సంపాదించుకొనడం ఆయనను పెద్దచేసినవారికే ఇష్టంలేకపోయింది. అవతలివారి చులకనతోపాటు, ఇవలివారి నిర్లక్ష్యం కూడా పెరిగింది చివరకు వారూ—వీరూ కలిసి పద్మవ్యూహం పన్నుకుంటూ వచ్చారు.

1962 ఎన్నికలకు కాంగ్రెసు అభ్యర్థుల నిర్ణయంలో ఈ కొత్త పరిణామం బయటపడింది రాష్ట్రస్థాయిని రాజీగా కాంగ్రెసు అభ్యర్థుల జాబితాను తయారు చేశారు అందులో అల్లూరి—బ్రహ్మానందరెడ్డి—ప్రముఖపాత్ర వహించారు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ పళ్లంరాజు మధ్యవర్తిత్వం నెరపారు. రాష్ట్ర ఎన్నికలసంఘంనుంచి కాంగ్రెసు అభ్యర్థుల జాబితా బయటకు రావడంతోనే శ్రీ సంజీవయ్యను త్రోసివేశారన్నారు అంతేకాదు అల్లూరి—సంజీవరెడ్డి తిరిగి కలిసిపోయారనే ప్రచారం సాగింది.

ఈ దశలోనే శ్రీ సంజీవయ్య విజృంభించారు రాష్ట్ర ఎన్నికల సంఘం జాబితాకు సవరణ పెట్టారు స్వశక్తిమీద ఆధారపడి, అఖిల భారత కాంగ్రెసు సంఘానికి అప్పీలు చేశారు. అక్కడితో అంతమైనాయి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌లోని అంతర్నాటకాలు అక్కడినుంచి ప్రారంభమైనాయి కాంగ్రెసు అధిష్ఠానవర్గం ఆదేశాలు

కాంగ్రెసు అధిష్ఠానవర్గంఅంటే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు వ్యవహారాలకు సంబంధించినంతవరకు అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి. అది ఆయన స్వంత రాష్ట్రం కనక ఆయనమాట కాదనడం సంప్రదాయ విరుద్ధం. అందువల్ల దాని వ్యవహారాలు ఆయన అభీష్టం ప్రకారం జరగాలి ఆయనలో విశాలదృష్టి లేదంటే, ఆయన మురాతత్వంతో వ్యవహరిస్తున్నాడంటే, అది ఆ రాష్ట్రం దురదృష్టం. అదీకాక, అక్కడివారితో పూర్వం ప్రకాశంగారివలెనే ఆయన మొదటినుంచి చెబుతున్నారు తాను లేనప్పుడు తన రాష్ట్రంలో తగాదాలు తప్పవని తాను కోరుకుంటున్నది కేంద్రంలో పదవులనుకాక, స్వరాష్ట్రంలో పెద్దరికాన్ని మాత్రమేనని కేంద్రానికి చేరిన పెద్దలలో ఇలా అనేవారు ఎందరు వున్నారు? అదీ అధిష్ఠానవర్గంలోని వాతావరణం అవీ అక్కడి రాజకీయాలు.

అంతేకాదు అక్కడ రాజకీయాలు మరికొన్ని వున్నాయి అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిఅంటే చిన్నదికాదు. కాంగ్రెసు సంస్థకు దేశంలోవున్న చరిత్ర దృష్ట్యా అది చాలా ఉన్నతమైన పదవి. ఆ పదవిని నిర్వహించినవారు అఖిల భారత నాయకుల శ్రేణికి చెందుతారు. అలాగే చెల్లుతారు కాని దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట ఆ పదవికి ఆ సంప్రదాయం తప్పింది ఆచార్య కృపలానీ, శ్రీ పురుషోత్తందాస్ టాండన్, శ్రీయుతులు ఎన్ ధేబర్, శ్రీమతి ఇందిరాగాంధీలు ఈ పదవిని నిర్వహించారు. ఆంతరంగికమైన కారణాలవల్ల ఆ పదవులనుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత తర్వాత మరొక పదవిని స్వీకరించలేకపోయారు అందుకు సంబంధించిన సమస్య వారివల్ల కాంగ్రెసు అధిష్ఠానవర్గానికి ఉత్పత్తిల్లలేదు

కాని శ్రీ సంజీవరెడ్డిగారి విషయంలో అలా జరగలేదు. ఆయన వారికొక సమస్యగా నిలిచారు అయితే ఆయనను కాంగ్రెసు అధిష్ఠానవర్గంవారు తమ సమస్యగాకాక, ఆంధ్రప్రదేశ్ సమస్యగా భావించారు. ఆంధ్రుల ప్రతినిధిగా కేంద్రంలోనే వుంచుకొని గౌరవించలేకపోయారు. ముఖ్యమంత్రిగా వున్నవారిని అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా తీసుకువచ్చాము కనక ముఖ్యమంత్రిగానే

తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు పంపాలనే నిర్ణయానికి వచ్చారు. అది అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షపదవిని నిర్వహించినవారిని గౌరవించడం అవునో కాదో వారికే తెలియాలి ఆంధ్రులకు సంబంధించినంతవరకు అదెన్నటికీ గౌరవించడం మాత్రం కాబోదు.

శ్రీ సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు ముఖ్యమంత్రిగా తిరిగి రాకూడదని ఎవ్వరూ అనరు. కాని, అలా రాదలచినవారు అనుసరించవలసిన పద్ధతులు కొన్ని వున్నాయి. మనది ప్రజాస్వామిక వ్యవస్థ అని భావించినప్పుడు ఆ పద్ధతులను అనుసరించడం భావ్యం. కాని కాంగ్రెసు అధిష్ఠానవర్గం ఆపని కూడా చేయలేదు పైగా కాంగ్రెసు చరిత్రలో కొత్త సంప్రదాయాన్ని సృష్టించింది కాంగ్రెసు అధ్యక్షులు శాసన సభ్యుడుగా వుండడమే అపూర్వమనుకుంటే, కాంగ్రెసు అధ్యక్షుడు శాసన సభకు పోటీ చేయడానికి కూడా అంగీకరించి, ఆశ్చర్యం కలిగించారు ఇలా చేయవలసిన అవసరం ఏమిటనిపించారు అవును. ఇందులో ఎవరి అవసరాలు ఎలాంటివో ఆంధ్ర ప్రజలకు తెలియక పోలేదు.

అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ సంజీవరెడ్డి, మరి ఎనిమిది నెలలు వుండవలసిన అవసరం వున్నది. అవసరమైతే, మరొకదఫా ఆయననే అధ్యక్షులుగా ఎన్నుకొనడానికి అడ్డంకి లేదు. కాని, కాంగ్రెసు అధిష్ఠాన వర్గానికి అలాంటి యోచనలు కలగలేదు. ఆయనను తమ మధ్య వుంచుకొనే అవసరమూ కనిపించలేదు.

శ్రీ సంజీవరెడ్డిని గురించి ఇంత మున్నితమైన అభిప్రాయాలు కాంగ్రెసు అధిష్ఠానవర్గానికి వున్నప్పుడు, పాట్నా కాంగ్రెసు మహాసభలోనే కాంగ్రెసు అధ్యక్షులుగా ఆయనకు వీడ్కోలు చెప్పవలసింది మాజీ—కాంగ్రెసు అధ్యక్షుని హోదాలో శాసన సభకు పోటీ చేయనివ్వవలసింది. అందరు శాసన సభ్యులకు వలెనే, పార్టీ నాయకత్వానికి పోటీ చేసే అవకాశాన్ని ఇవ్వవలసింది కాని కాంగ్రెసు అధిష్ఠానవర్గానికి అలా చేయవలసిన అవసరం కనిపించలేదు. పైగా అంతకు విరుద్ధమైనవిధంగా వ్యవహరించింది "కాంగ్రెసు అధ్యక్షుడు పార్టీ నాయకత్వం స్వీకరించదలచినప్పుడూ, ఏకగ్రీవంగా ఎన్నుకోకపోవడం అపసవ్యం" అనే వాదన చేసింది. అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షుని హోదాలో శ్రీ సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసనసభా కాంగ్రెసు పక్షం నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే వాతావరణాన్ని సృష్టించింది.

ఇందులో రాజకీయమైన ఒక విశేషాన్ని కూడా కాంగ్రెసు అధిష్ఠానవర్గం గుర్తించలేదు అవతల ఇంతవరకు ముఖ్యమంత్రిగావున్న శ్రీ సంజీవయ్య హరిజనుడు గాంధీజీ ఆశించిన విధంగా హరిజనుని పట్టం కట్టారని ఆంధ్రప్రదేశ్‌కు కీర్తి తెచ్చినవాడు. సిద్ధాంతరీత్యా కాంగ్రెసు సంస్థ ప్రతిష్ఠను పెంచినవాడు. అలాంటి ప్రసిద్ధి తెచ్చిన రాజకీయ ప్రయోజనాన్ని కూడా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు అధిష్ఠానవర్గం త్రోసిరాజన్నది. "రెడ్డివచ్చె మొదలాడు" అన్న సామెతను నిజం చేసింది. రాజకీయంగా అప్రతిష్ఠ తెచ్చుకుంది. ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత శ్రీ సంజీవరెడ్డి తన మంత్రివర్గ నిర్మాణంలో చూపిన దృక్పథం ద్వారా ఈ ప్రతిష్ఠను ఇంకా పెంచారు

మరి, ఆంధ్ర కాంగ్రెసు నాయకులకు ఈ సంగతులు తెలియవా, రాష్ట్రం సంగతి సందర్భాలు అధిష్ఠానవర్గానికి చెప్పలేకపోయారా అని ఆలోచిస్తే, ఇవన్నీ వారికి తెలిసినా, తెలియనట్లేనని భావించాలి. అంతా అయిపోయిందని అస్త్ర సన్యాసం చేయడం రాజకీయంకాదు. కనుక ఆడవలసిన నాటకాలు అన్నీ ఆడడం, ఆడించడం ముఖ్యం. అప్పుడుకాని, రాజకీయం రసవత్తరంగా రక్తి కట్టదు. సందర్భానుసారంగా ముక్తి లభించదు.

ఇందులో మొదటి నాటకం ఆడింది అల్లూరి—పళ్లం ద్వయం వీ రిద్దరి బలం సర్కారు జిల్లాలలో కేంద్రీకరించబడివుంది. వేర్వేరుగాచూస్తే అప్పటి పరిస్థితులలో ఇద్దరూ బలహీనులే. కాని కలిసివుంటే బలదర్పం కనిపిస్తుంది. అందుకే ఒకరికి ఒకరు ఆసరగా వుంటూ వచ్చారు స్వయంకృతాపరాధాలే చేశారు. శ్రీ సంజీవయ్యను బలహీన పరచారు. తాము బలహీనులయ్యారు. చివరకు ఎవరికివారే యమునాతీరే అనిపించారు.

రెండవ నాటకం ఆడింది కాంగ్రెసు అధిష్ఠానవర్గం. సంజీవయ్య పాలన సాగిన రెండేళ్లు, కాంగ్రెసు అధ్యక్షుని పాక్షిక ప్రవర్తనకు అధిష్ఠానవర్గం ఆమోద ముద్ర వేసింది. సామరస్య సాధనకు సరైన ప్రయత్నమే చేయలేదు. పైగా శ్రీ సంజీవరెడ్డి వస్తేనేకాని, మీ రాష్ట్ర వ్యవహారాలు సవ్యంగా నడవవనే తీర్పు చెప్పింది.

తీర్పు చెప్పవలసిన జడ్జి ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చివున్నప్పుడు న్యాయమెలా జరుగుతుంది? అందువల్ల 1962 ఎన్నికలకు కాంగ్రెసు అభ్యర్థుల నిర్ణయంలో సుమారు 80 మందిని ఏకపక్షంగా స్థిరపరచింది. రాష్ట్రస్థాయిని సమైక్యతతో సిఫారసు చేసిన జాబితాను చిందర వందర చేసింది కేవలం శ్రీ సంజీవరెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్న తలంపుతో అభ్యర్థులను ఖరారు చేసింది రాజకీయమైన ఆశలతో వ్యవహరించిన రాష్ట్ర నాయకులందరికీ శృంగభంగం కలిగింది.

అయితే మనది ప్రజాస్వామిక వ్యవస్థ. అధిష్ఠానవర్గం అనేది "కనిష్ఠ వర్గం"గా వ్యవహరించడాన్ని బ్రతకనేర్చిన రాష్ట్ర నాయకులు సహించినా జరుగుతున్నవి సార్వత్రిక ఎన్నికలు కనుక, తాలూకా, జిల్లా స్థాయిలోని కాంగ్రెసువాదులు అంగీకరించలేకపోయారు. దాదాపు నూరుమంది ఎదురు తిరిగి స్వతంత్రులుగా పోటీ చేశారు క్రమశిక్షణ చర్యలకు గురిఅయినారు తాముగా ఓడిపోయారు. తమ పార్టీని ఓడించుకున్నారు. ఆవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు సంఘం మరొకదఫా అధిష్ఠానవర్గం ఆదేశాలకు, అసమర్థతకు బలిఅయిపోయింది. 1962 ఎన్నికల ఫలితంగా తిరిగి ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు పెనుభూతం ప్రత్యక్షమైనదనిపించారు ఆంధ్రప్రదేశ్‌లో మూడవ ముఖ్యమంత్రిగా అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ నీలం సంజీవరెడ్డి అధికార స్వీకారం చేశారు. శ్రీ సంజీవయ్యను, శ్రీ అల్లూరిని అజ్ఞాతవాసంలోకి పంపారు.

1952 లో శ్రీ సంజీవరెడ్డి ఆంధ్ర కాంగ్రెసు సంఘం అధ్యక్షులుగా వున్నప్పుడు ఆంధ్ర జిల్లాలలో కాంగ్రెసు దెబ్బతిన్నది. అయితే అది రాయలసీమలోకంటె సర్కార్లలో హెచ్చుగా నష్టపోయింది అది శ్రీ సంజీవరెడ్డి నాయకత్వం స్థిరపడడానికి అవకాశ మిచ్చింది. 1962 లో శ్రీ సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులు అయినప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు అపజయం పొందింది. అయితే అది సర్కార్లలోకంటె, రాయలసీమలో హెచ్చుగా జరిగింది. అయినా శ్రీ సంజీవరెడ్డి తిరిగి రాష్ట్ర నాయకత్వం చేపట్టారు. 1952 అనంతరం శ్రీ సంజీవరెడ్డి శాసనసభ్యుడు కాకుండానే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘాధ్యక్షుడుగా ఆంధ్ర కాంగ్రెసు శాసనసభా పక్షం నాయకుడుగా ఎన్నికైనారు 1962 లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యుడుగా ఎన్నికై, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు శాసనసభా పక్ష నాయకత్వం స్వీకరించారు. ఆనాడు సర్కారు జిల్లాల నాయకుల అండ దండలతో రాష్ట్ర నాయకులైనారు. ఈనాడు కాంగ్రెసు అధిష్ఠానవర్గం ఆశీర్వచనాలతో ముఖ్యమంత్రి కాగలిగారు. కనకనే అంటారు, అదృష్టవంతుణ్ణి చెడగొట్టే వారెవ్వరని. గత పదేళ్ల ఆంధ్ర రాజకీయాలలోను శ్రీ నీలం సంజీవరెడ్డికి పట్టిన అదృష్టం మరే రాష్ట్రంలోను, మరే నాయకునికి పట్టలేదు.



కపోత కుటుంబము —శ్రీ మాధవపెద్ది గోఖలే

నన్నయభట్టు

శ్రీ శాస్త్రి వెంకట నరసయ్య

నన్నయభట్టు తెల్గు కవి నాథుల కందఱ కాద్యుఁడై సునం
పన్నత సంస్కృతాంధ్రములఁ బండిన భారతమాంధ్రజాతికన్
వెన్నతిగా నొసంగి సుమపేశలమైన కవిత్వచంద్రికన్
గ్రొన్నెలవోలె వెల్గెడిని కోర్కులు పండగ సాహితీ దివిన్

వైదికధర్మమే జగతి పావనమైన దటంచుఁ దెల్ప న
మ్మోదము మానసంబునను ముప్పిరి నొందగ వ్రాసె నాతఁడా
సుందర సత్యమంగళ సుశోభిత భారత'మాంధ్ర శారదా
వందన కల్పవృక్ష మగునా' యని సన్నుతిఁ జేయఁగా బుధుల్

సౌశీల్యంబును జక్కదిద్ది జనతా సౌభాగ్యమున్ గూర్పగా
రాశీభూత సమస్తభవ్య నియమారంభమ్ములన్ వెల్గుచున్
దేశీయంబగు సంస్కృతిన్ సరసతన్ దెల్పంగ శ్రీ భారతం
బాశాజ్యోతియుఁబోలె నొప్పె భువిలో నాంధ్రాళి భండారమై

పూవుతావియు మిళితమై పొదలునట్లు
చంద్ర చంద్రికలేకమై సాగునట్లు
తెనుగువారును నన్నయ్య దివ్యకావ్య
పఠన లన్యోన్య మిత్రతఁ బఱఁగుగాత.

పోతన తిక్కన కవితా
పూతుని శ్రీ నన్నయార్యు పూజింతుగదా!
ఆతతలాభము రచనల
చేఁతలచే నాంధ్రి కిచ్చు సిద్ధుల రగుటన్.

చుకూజ భారతంగీతం నన్నయార్య పికో తరా
ఆంధ్రజాత్యభివృద్ధ్యర్థం కళాశిల్పేన పూరితం.

నన్నయభట్టు అనెడు కోయిల సారస్వతమనెడు మామిడి చెట్టునందు కూర్చొని ఆంధ్రులను అభ్యుదయ మార్గమున నడిపించుటకు కళాశిల్పముతో నిండిన భారతమను గీతమును పాడెను.

భారతదేశంలో దార్శనిక చింతన

ప్రొఫెసర్ కె. సచ్చిదానందమూర్తి

ఒకే సంస్కృతికి చెందిన వివిధ దర్శనాలకు సామాన్యమైన ప్రతిభ ఒకటి ఉంటుంది.

పాశ్చాత్య దేశాల్లో దర్శనశాస్త్రం అంటే ఏకరూపమైన భావం ఏమీలేదు: దర్శనశాస్త్రాన్నిగురించి గ్రీకులకున్న భావానికీ కాంట్‌కున్న భావానికీచాలా వ్యత్యాసంవుంది అలాగే కాంట్ దార్శనిక చింతనకూ 'ఏయర్' వంటి దార్శనికుని చింతనకూ ఏమాత్రం సాదృశ్యంలేదు అయితే, ఐరోపీయ సంస్కృతిలోని దర్శనశాస్త్రానికీ, హైందవ చైనీయ సంస్కృతులలోని దర్శన శాస్త్రాలకీ విలక్షణమైన స్థూల లక్షణాలుకొన్ని ఉన్నవి ఉదాహరణకు, జర్మనీ, ఇటలీ, స్పెయిను దేశాల్లో ఊహించబడ్డ దార్శనికశాస్త్రానికీ బ్రిటన్, స్కాండినేవియన్ దేశాల్లో వికసించిన దర్శనశాస్త్రానికీ చాలావ్యత్యాసం ఉన్నదని మనం చెప్పవచ్చును అయితే, నిశ్చయంగా దీనికి అపవాదాలున్నాయి బ్రిటన్‌లో బ్రాడ్లే, వైట్‌హెడ్‌లు ఉద్భవించారు, కీర్కెగార్డ్ డెన్మార్కులో ఉద్భవించాడు. అయినా, ఒక సంప్రదాయానికి మరో సంప్రదాయానికీ వ్యత్యాసం చూపే టటువంటిది ఒకటివున్నదని భావించడంలో మరి తప్పేమీలేదు ఈవ్యత్యాసం అనివార్యమైనది ఎందుచేతనంటే దార్శనిక చింతన శూన్యంలోగాక ఒకానొక చారిత్రక సాంప్రదాయంలో జరుగుతుంది. ఒక దేశ భూగోళపరిస్థితులు, దానిలో స్థిరపడిన జాతి సాంస్కృతిక సాంప్రదాయాలూ ఆదేశ చరిత్రపై ప్రభావాన్ని కలిగిఉంటవి అలాగే ఒక దేశంలోని చింతనా రీతులలోనూ, ఆచార విధానాలలోనూ ఇతర దేశప్రభావాలు చిరకాలం ఉండే గాఢమైన మార్పులను కలగజేస్తవి. ఒక ఉదాహరణ చూపాలంటే, కాలెరిడ్జ్, కెయిర్డ్, గ్రీన్‌లలో ప్రవహించే జర్మను ప్రభావంసహాయం లేకుండా బ్రాడ్లే, బొసాంకేల చింతనను అర్థం చేసుకోలేము.

కాబట్టి, ఒక సాంప్రదాయంలోని దర్శనశాస్త్రాన్ని స్వంతమైన విశేష ప్రజ్ఞగల చారిత్రకమైన, అవిరతమైన, బహుశా ఒక ప్రత్యేకమైన గమ్యంగల భూతార్థంగా మనం గ్రహించవచ్చుననే విషయాన్ని నేను సిద్ధ విషయంగా గ్రహిస్తున్నాను

నేను చెప్పే చాలా విషయాలు అన్ని భారతీయ దర్శనాలకూ వర్తిస్తాయి అయితే కొన్ని విషయాలు హైందవ సంప్రదాయంలోని దర్శనాలకు మాత్రమే వర్తిస్తాయి "హైందవ సంప్రదాయం" అంటే నా అర్థం మొహంజోదారో, హరప్పాల ప్రజలూ, వైదిక ఆర్యులూ, వారి సంతతిలోనే తరువాత తరాలవారూ ప్రతిపాదించి, రూపొందించిన సభ్యత, నాగరికతలు ఇతర సంస్కృతుల దర్శనాలకు భిన్నంగా భారతీయ దర్శనాలకు విశిష్టమైన లక్షణాలను ఇప్పుడు నేను వివరించ ప్రయత్నిస్తాను.

అనంతత్వదృష్టి : ఆవర్త సిద్ధాంతము

భారతదేశాన్ని భావుకతతో అర్థం చేసుకున్న వ్యక్తికి ప్రథమంగా కనబడే విషయం అది ఒక విభిన్న శీతోష్ణస్థితులు కల్గిన విశాలమైన భూఖండం అని—సోవియట్ మధ్యఆసియాను ఒకమూల తాకుతూ, రెండో మూల సింహళం వరకు విస్తరించి, సముద్రత్రయ ముద్రితమై బహు విశాలంగా ఉంది. పర్వతప్రాంతాలలోనూ, లోయలలోనూ మనకు అతి సుందరమైన దృశ్యవైభవం కనబడుతుంది. అరణ్యాలలోనూ, ఎడారుల లోనూ ప్రకృతిలో విలీనమైన మానవుని బాధాకరమైన ఏకాంతతా, వేరుపాటూ, మనకు గోచరిస్తవి. భూకంపాలూ, కుంభవర్షాలూ, వినాశకరమైన వరదలూ వంటి భయంకరమైన ప్రకృతిశక్తులు భారతదేశంలో అతి సామాన్యం అద్భుతశక్తి గల అటవీ మృగాలూ, విరుగుడులేని విషాన్ని గక్కే సర్పాలూ, ఈ దేశంలో మానవుని సహవాసులు. భారతదేశంలో దేనికీ పరిమితులు లేవని చెప్పవచ్చు. ఉష్ణమండల సూర్యుని కాంతీ, వేడీ, వడగాలీ, అనంతం. ఆ సూర్యుడు కాలుస్తాడు, నీరసపరుస్తాడు కాని అతనే పోషిస్తాడు కూడా. కాంతివంతమూ, అతి నిర్మలమూ అయిన ఆకాశం మైదానాల్లో నివసించే మానవుణ్ణి విభ్రాంత పరుస్తుంది ఈ విధంగా అవధుల్లేని వస్తువుల మధ్య నివసిస్తూ భారతీయుడు అనంతత్వదృష్టిని అలవర్చుకుంటాడు మానవునికిగానీ, ప్రకృతికిగానీ, దేనికీ అంతులేదు ఎందువల్లనంటే చాక్రికమైన (cyclic) విశ్వప్రక్రియ మానవుని దృష్టిలో అనంతంగా కనబడుతుంది ప్రాణదాయకమైన వసంతమూ, దాని తరువాత తపింపజేసే వేసవీ, దాని తరువాత హిమవత్పర్వతాల నుంచి వీచే శీతగాలులతో శీతాకాలం, ఒకదాని తరువాత ఒకటి, పునరావృత్తం అవుతవి అవి రాకనూ మానవు వచ్చి పోకనూ మానవు ఋతం, క్రమం, వాటిస్వరూపంగా కనబడతవి ఇలాంటి రాకపోకలూ, జనన మరణాలూ మొత్తం ప్రపంచ విషయంలోనే నిజం కాకూడదా ? తాను అల్పుడనీ, నిస్సహాయుడనీ అనిపింపజేసే బ్రహ్మాండమైన ప్రపంచము మానవుడికి అమితముగానూ, అనాదిగానూ కనబడుతుంది. ఇలాంటి గొప్ప వస్తువుకు అంతం ఎలా ఉంటుంది ? త్వరితంగా విచ్ఛిన్నమవుతూ, అయితే తనలోని ఒకానొక ఆంతరనియమం ద్వారా నిరంతరం పునః పునః జీవిస్తూ ప్రపంచం అనంతంగా ఉంటుంది ఈ అనంతత్వ దృష్టే విశ్వసృష్టిలయాల పునరావృత్తి సిద్ధాంతానికి కారణం ఈ విశ్వాసం పురాణాల్లోనూ దర్శనశాస్త్రంలోనూ కూడా గ్రహించబడింది. భారతీయ దర్శనాలన్నీ ప్రపంచప్రక్రియ అనంతమనే భావిస్తవి అది అనంతం అంటే అర్థం, అది ఉద్భవిస్తూ, నశించుతూ, పునరుద్భవిస్తూ, ఉంటుందని అయితే ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది 'మీమాంస' అనే ఒకే ఒక భారతీయ దర్శనం ప్రపంచం నిత్యమని వాదిస్తుంది. ప్రపంచం ఇప్పు డెలా ఉందో గతంలో కూడ అలాగే ఉంది. ఇప్పు డున్నట్లే భవిష్యత్తులో కూడ ఉంటుంది సృష్టిక్రమనిర్ణయాన్ని అంగీకరిస్తే ఇదే పర్యవసానమని మీమాంసకుల వాదన నైతిక నియమం లాగానే, భౌతిక ప్రపంచంలో దానికి సమానమైన భౌతిక నియమం కూడా అనుల్లంఘనీయం కాబట్టి, ప్రపంచం నిత్యంమాత్రమే కాగలదు ఈవిధంగా సింధు లోయలోని పశుకాపరుల జాతి చైతన్యంలో ఆవిర్భవించిన అనంతత్వదృష్టి సృష్టి పునరావృత్త సిద్ధాంత రూపంలో అన్ని భారతీయ దర్శనాలకూ అంగీకారంగా ఉంటూనే వచ్చింది.

ఆత్మమహిమ : మానవుని ప్రతిష్ఠ (గొప్పతనము)

హైందవ దర్శన శాస్త్రంలో మరొక విచిత్రమైన లక్షణం, మానవుని యెడల దానికి గల గౌరవదృష్టి భారతీయ చింతనలో మానవుడు నిస్సందేహంగా అనంత విశ్వంలో ఒక అణువు మాత్రమే అయినప్పటికీ, ఆ చింతనలో అతనికి దివ్యమైన గమ్యమూ, గొప్పతనమూ ఉన్నవి. అతనికి సృష్టికర్త ఎవరూ లేరు. అతని కొక నియంతా లేడు. మానవుని కంటె శ్రేష్ఠతరమైన వస్తువు మరొకటి లేదు. ఇదే గొప్ప రహస్యమని మహాభారతం చెబుతోంది ("గుహ్యం బ్రహ్మ తదిదం బ్రవీమి నహి మానుష్యాత్ శ్రేష్ఠతరం హి కించిత్"—శాంతిపర్వం—180. 12)

భారతీయ దర్శనశాస్త్రానికి ఆత్మసృష్టి నిషిద్ధ విషయం. సృజించబడ్డ వస్తువేదీ నిత్యం కాలేదు అలాగే సృజించబడ్డ వస్తు వేదీ తన కర్మకు తానే కర్త కాలేదు కాబట్టి, ఆత్మలు సృజించబడలేదనీ, అవి నిత్యాలనీ, భౌతిక ద్రవ్యం మాత్రం వస్తుమయ జగత్తుగా మలచ బడుతుందనీ అన్ని భారతీయ దార్శనిక ప్రస్థానాలూ విశ్వసిస్తవి సాంఖ్యము వంటి కొన్ని దర్శనాలు దీనిని అంగీకరించవు సాంఖ్య దర్శన దృష్టిలో విశ్వ నాటకానికి రంగభూమిని చేకూర్చడానికి ప్రాథమిక భౌతిక ద్రవ్యము (ప్రకృతి) తనకు తానే పరిణమించింది. ఒకేఒక అప్రధాన హైందవదర్శనం మాత్రం ఆత్మలు సృజించబడినవని వూహించింది ఇది భాగవత మతం అయితే దీనికి ఎన్నడూ ప్రముఖస్థానం లేదు ఈ నాడు దీనిని అనుసరించేవారూ లేరు క్రైస్తవ సంప్రదాయంలోని ఏ దర్శనమూ కూడా ఆత్మలు నిత్యాలని అంగీకరించదు. ఇలాంటి ముఖ్యమైన వ్యత్యాసం మనో స్వభావాల్లో ప్రధానమైన భేదాలను తీసుకొని రావలసిందే తీసుకువచ్చింది కూడాను ఆత్మను స్వయం సమృద్ధంగానూ, నిత్యంగానూ పరిగణించే ఏ దర్శనమైనా ఆత్మను సర్వప్రధానమైన వస్తువుగా గణించక తప్పదు అలాంటి దర్శనంలో ఆత్మను గురించిన మననం ప్రధాన విషయంగా ఉంటుంది ఆత్మను నిత్యంగానూ, పూర్తిగా స్వతంత్రంగానూ భావించడంవల్ల ఆత్మలు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా దేనికది కేవలంగా ఉంటవనే భావం పర్యవసిస్తుంది అటువంటి సందర్భంలో పరస్పరం సహకరించే ఆత్మల సమాజమూ ఉండదు సుసంగతమైన ప్రజాతంత్ర రాజ్యం అసలే ఉండదు ఆత్మలకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం ఉన్నదనే భావం పటిష్ఠతలేని సామాజిక బంధాలకూ, సామాజికైక్యతకూ, స్వార్థ ఆధ్యాత్మిక పురోగతే అత్యంత ప్రధాన విషయమనేభావనకు త్రోవ తీస్తుంది. ఆత్మకు నియంతా, సృష్టి కర్తా లేకపోవడంవల్ల దానికి వివపరీతమైన బాధ్యత ఏర్పడుతుంది తత్ఫలితంగా ఆత్మకు దానిబయటనుంచి ఏ సహాయం రాదనే భావన ఏర్పడుతుంది అది తన సంగతి తనే చూసుకోవాలి లేకపోతే నశించిపోవాలి. కరుణామయుడైన ఒకసృష్టికర్త ప్రసాదం గానీ, త్యాగమూర్తి అయిన ఒక రక్షకుని విమోచనం గానీ దానికి సహాయపడవు దీని ఫలితంగా తను చాలా ముఖ్యుడనే దృష్టి, తన బాధ్యతనుగురించి వూరికే ఆలోచిస్తూ కూర్చోవడమూ అధిక మవుతవి "నేను ఎలా పవిత్రంగా ఉండగలను ? ఆత్మకు సహజాధికారాలైన పవిత్రతనూ, ఆనందాన్నీ నేను రక్షించుకోవడంగానీ, తిరిగి సంపాదించుకోవడం కానీ ఎలా ?" ఇదే భారతీయ మోక్షశాస్త్రంలో నిరంతర చర్చావిషయం ఆత్మ అసృష్టమనే భావం చాలా గొప్పదైనా అది చాలా సాహసంతో కూడిన కల్పన దీని పర్యవసానాలు విషాదకరంగానూ, గొప్పగానూ కూడా ఉన్నవి న్యాయం, రామానుజవేదాంతం వంటి సేశ్వర దర్శనాల్లో కూడా ఆత్మలు సృజించబడవు వారి కర్మాకర్మలకు అవే బాధ్యులు వాటి మోక్షాన్ని అవే సంపాదించుకోవాలి "ఆత్మకు ఆత్మే మిత్రుడు ఆత్మకు ఆత్మే శత్రువు" భారతీయ ఆస్తిక దర్శనాల్లో ఈశ్వరుడు నైతిక నియమాన్ని పరిపాలించడం మాత్రమే చేస్తాడు ఆత్మలతోగాని, వాటి అదృష్టాలతో గాని అతనికిజోక్యం లేదు

నైతిక స్వేచ్ఛ: "కర్మ"

పాపం, అసమానత—వీటిసమస్య దర్శనశాస్త్రం అంతటిలోను చాలా విసుగును కలిగించే సమస్యలలో ఒకటి అయితే అన్ని భారతీయ దర్శనాలూ దీని విషయమై ఒకే విధమైన పరిష్కారాన్ని అనుసరిస్తవి ప్రపంచం అనంతమనే భారతీయుని భావం శూన్యంలోనుంచి సృష్టి జరుగవచ్చుననే తలపును అతని మనస్సులోనికి రానీయదు మానవుడికి ప్రతిష్ఠ (Degnity) ఉన్నదని, అతని ఆత్మకు విలువా, కేవలతా, ఉన్నవనీ భావించే భారతీయుని దృష్టి ఆత్మ సృజింపబడినదనే భావాన్ని దగ్గరికి రానీయదు. పై రెండు భావాలూ కర్మసిద్ధాంతానికి త్రోవతీస్తవి ప్రపంచం అపరిపూర్ణమనీ, అందులో అసమానత లున్నవనీ, అందులో దుఃఖం ఉన్నదనీ ప్రతివానికీ తెలుసు. కానీ, ఒక బాహ్యశక్తి వీటిని ఆత్మలో ప్రవేశబెట్టలేదు గనుక, ఇవి ఆత్మ స్వకర్మఫలితాలే అయిఉండాలి ప్రపంచం అనాది ఆత్మలు అనాది అవి ఇప్పు డనుభవిస్తూన్న వాటికి కారణాలు వాటి కర్మలే అయి ఉండాలి. మరేశక్తీ, అది దివ్యమైనది గానీ, రాక్షసమైనది గానీ, ఆత్మలను నియంత్రించలేదు. వాటికి అసమానతనూ దుఃఖాన్నీ కలగచేయనూ లేదు. ప్రపంచంలోని అన్ని వస్తువులలోనూ ఆత్మ శ్రేష్ఠతమమైనదీ, దుర్గ్రాహ్యమైనదీ అన్నది హైందవబుషుల ప్రత్యక్ష జ్ఞానవిషయం తాము ఇప్పు డనుభవిస్తూన్న అసమానత, దుఃఖము ఆత్మలకు వరము వంటిది ఎందుకంటే, ఆత్మకు సహజాధికారమైన ప్రతిష్ఠ నుండి దానికి కల్గిన పతనాన్నుంచి అది తిరిగి కోలుకుంటున్నది ఆత్మలు తమ సహజ ప్రతిష్టనుంచీ, పవిత్రత నుంచీ ఎప్పుడు పతనం చెందినవి ? అనే ప్రశ్నకు సమాధానం అనంతమైన కాలగతిలో కలసిపోయింది ఆత్మలు తమ పతన ఫలితాన్ని నిర్మూలించుకొన్నప్పుడు అవి తిరిగీ మరొకసారి విముక్తలవుతవి ఈ విముక్తి గత పాప దుఃఖాల్నించే గాక, వాటికి కావాలంటే పునః పతనాన్నించి కూడా జరగొచ్చు హైందవ దర్శనశాస్త్రంలో ఆత్మలకు తమ కిష్టం వచ్చినట్లు చేయడానికి సంపూర్ణ స్వాతంత్ర్యమున్నది వాటికి యిష్టం వచ్చిన నరకానికి ఇష్టమైన విధంగా అవి వెళ్లవచ్చు తిరిగి జాగరూకులై, నిలబడి, అజ్ఞాన దుఃఖ బంధాలను ఛేదించి నిత్యం వాటికొరకు ఎదురుచూచే మహత్వాన్ని తిరిగి అవి చేరుకోవచ్చు క్లుప్తంగా ఇదే కర్మ పునర్జన్మల సిద్ధాంతం ఆత్మలు ఎవరిప్రోద్బలంచేతా ఆవిర్భవించలేదని హైందవ దర్శనశాస్త్రం చెబుతుంది. ఆత్మలకు జన్మించాలనే ఇచ్ఛ కలిగింది, అందుకని అవి జనించినవి; జనించాలి; కర్మ చేయాలి, కర్మ ఫలితాల్ని అనుభవించాలి—అనే వాంఛ కొన్ని ఆత్మలలో కలుగుతుంది. కాబట్టి అవి మర్త్యలోకంలోకి అవరోహిస్తవి. ఈ జన్మలోనూ, గత జన్మలోనూ అవి చేసిన, సంకల్పించిన అన్ని కర్మల ఫలాల్నీ అనుభవించినంతవరకూ, మృత్యువు నుంచి అమృతత్వంలోకి తమని తాము ఉద్ధరించుకోవాలని సంకల్పించనంత వరకూ అవి ఇక్కడే ఉంటవి ఇది నియతివాద దర్శనం (Determinism) కాదు స్వేచ్ఛావాద దర్శన మనేది స్పష్టం

విషాదదృష్టి

జీవితం ఎడల విషాదదృష్టియొక్క ఛాయ ఒకటి భారతదేశదర్శనాల మీద పడింది వ్యాధి, వార్ధక్యం, మృత్యువు భారతదేశ దార్శనికవీధులలో స్వైరవిహారం చేసినవి ప్రతి మలుపులో ఈ భూతాలు కనబడుతవి సుమారు క్రీ పూ 600 ప్రాంతాలలో భారతీయులకు జీవితం మరీ విషాదకరంగా కనబడింది వేదాలలో మనకు అమాయకత్వమూ, జీవితం అంటే ఉత్సాహమూ కనబడతవి అనేక వైదికబుక్కులలో "నూరు శరదృతువుల వరకూ మేము జీవించుగాక" అనే కోర్కె కనబడుతుంది వైదిక కాలంలో జనాభా పరిమితంగా ఉండేది గొర్రెలు, ఎద్దులు, గుర్రాలు సమృద్ధిగా ఉండేవి గంగా, సింధూ మైదానాల్లో వేలాది ఎకరాల తరబడీ గోధుమపండే ఫలవంతమైన ప్రదేశాలు విస్తరించి ఉండేవి ప్రాణదాయకమైన సోమరసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేది వైదిక జనానికి జీవితం ఒక భావుకుని స్వప్నం వలె ఉండేదంటే ఆశ్చర్యం ఏమీ లేదు అది ఎంత ఎక్కువైతే అంత మంచిది తెగకూ తెగకూ మధ్య యుద్ధాలు, కొత్త తెగలు ప్రవేశించడం, క్షామం, వరదా, మహామారి, ఉష్ణమండలాల్లోని శక్తిహీనతా భారతదేశంలోని ఆశావాదాన్ని నిర్మూలించినవి జీవితమే ఒక యుద్ధమైంది ఇలాంటి పరిస్థితులలోనే ఉపనిషదృషుల, బుద్ధుని సృజనాత్మకమైన శతాబ్దం అవతరించింది ఉపనిషత్తులలో మనకు కొంత నిరాశావాదం కనబడుతుంది దైనందిన విధులతోనూ, జీవితం ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉండడంవల్ల జనించే విసుగుతోనూ, అనివార్యమైన మృత్యు ముఖదర్శనంతోనూ జనం మోహం మొత్తిపోయారు ఇలాంటి పరిస్థితుల్లోనే విషాదమయమనదగిన దర్శనాలు అవిర్భవించినవి మృత్యువు అనివార్యము క్షణికమైన ఒకటి రెండు సుఖాలను చవిచూడ్డంవల్ల మనకు ఏం ప్రయోజనం? కాలం, అనవరోధనీయమైన తన ప్రవాహంలో మన పాదముద్రలను తుడిచివేస్తుంది దేనిని సాధించినా ఏం ప్రయోజనం? వాస్తవంగా జీవితం శుష్కమైనదే ఆ నాటి ఆలోచనాత్మక వ్యక్తులలో కొందరి మనోభావం ఇలాంటిది బుద్ధునిలోనూ, మహావీరునిలోనూ, శంకరునిలోనూ ఇలాంటి మనోభావం మనకు కనబడుతుంది అయితే ఈ దర్శనాల్లో కూడా దుఃఖాన్నీ, మృత్యువునూ ఎలా జయించడ మనేదే ప్రశ్న అందుకని భారతదేశంలోని ఆ నాటి విషాదదృష్టి అచేతనమైన నిస్సహాయమైన దృష్టి కాదు మానవ జీవితం రసహీనమైనదనీ, మానవుని గమ్యం సహారా ఎడారి వంటిదనీ ప్రకటించటంతో తృప్తిపడి వారు వూరుకోలేదు అందుకని ఆ దృషి సచేతనమైనదే "నిర్జీవమైన, రసహీనమైన ఈ జీవిత చక్రాన్ని ఆనందమయమైన ఆత్మగానంగా ఎలా మార్చుదాం?"—అదీ వారి సమస్య మానవునికి మృత్యువు ఒక్కటే తథ్యంగనుక, ఈలోగా అతనికి ఏదైనా చేయడానికి స్వేచ్ఛ ఉంది గనక, దాన్ని అతను చేయడమే మంచిదని 'హైడగర్' వంటి ఆధునిక దార్శనికులు చెప్పే దానికీ, దీనికీ ఎంతో వ్యత్యాసం ఉంది పురాతన హైందవులు అలవర్చుకొన్న విషాదదృష్టి ఇటువంటిది కాదు వారు మృత్యువు నెదుర్కొన్నారు, అయితే, వారు దాన్ని జయించగోరారు అధిగమనమే వారి లక్ష్యం సృష్టి అంతా విషాదమయమైంది కాదనీ, ఎందువల్లనంటే వేదాంతం దృష్ట్యా బ్రహ్మ ఆనందం అనీ, సర్వ భారతీయ దర్శనాల నిస్సందిగ్ధమైన సమాధానం

హైందవదర్శనశాస్త్రలక్ష్యం: సంపూర్ణమానవుడు

హైందవ జీవితదర్శనశాస్త్ర దృష్టిలో నాలుగు పురుషార్థాలను (ధర్మం, అర్థం, కామం, మోక్షం) సాధించినవాడే సంపూర్ణ మానవుడు వాత్స్యాయనుడిదృష్టిలో విషయాలకు గల మనను సంతృప్తిపరచే శక్తికి అనుకూలంగా వాటిని అనుభవించటమే కామం (విషయేషు అనుకూల్యతః ప్రవృత్తిః కామః) ఈ నాలుగు పురుషార్థాలకు అనుగుణంగా జీవితంలో నాలుగు దశ లున్నవి. (ఆశ్రమాలు). (1) బ్రహ్మచర్యం (పవిత్రత, బ్రహ్మచర్యం అధ్యయనం—వీటివల్ల జ్ఞానమూ, పరిణతి లభిస్తవి) (2) గార్హస్థ్యం (వైవాహిక జీవిత దశ—దీనిలో మానవుడు తన విధులను తాను సక్రమంగా నిర్వర్తించడంవల్ల అతనికి సౌఖ్యమూ భాగ్యమూ లభిస్తవి) (3) వానప్రస్థం (వార్ధక్యపు సూచనలు కనబడగానే, కొడుకులూ, కుమార్తెలూ జీవితంలో బాగా స్థిరపడగానే, అటవీ ఆశ్రమాలకు పోయి అక్కడ విశ్రాంతిగా కాలం గడపటం) (4) సన్యాసం (పరిత్యజించే కాలం దీనివల్ల సంపూర్ణమైన రాగ రాహిత్యమూ, వాంఛా రాహిత్యమూ, ఐహిక విషయబంధ విమోచనమూ, ఆత్మైకత సాధించగలగడం) ఆత్మ పరిపూర్ణుడై ప్రపంచం నుండి నిర్మోహితుడై శరీరాన్నుండి విముక్తుడవడంకొరకు కాలానికి లోబడి ఉంటూ, ఈ ఆశ్రమంలో మానవుడు రాగద్వేషాలూ, భయ వాంఛలూ లేకుండా ఉంటాడు భీష్ముడు చెప్పినట్లుగా, వ్యాధి, శక్తిహీనత, వార్ధక్యాలచే పీడింపబడ్డ తరవాతనే మానవుడు ఈ దశలోనికి పోవాలి పురాతన హిందూ సంప్రదాయం వీటిల్లో ఏ ఒక్క ఆశ్రమాన్నీ వదలివేయడానికి అంగీకరించలేదు దేవాస్తను డనే ఋషి యుధిష్ఠిర మహారాజుతో చెప్పినట్లు ఈ దశలు నిచ్చెనమెట్ల వంటివి వీటిలో ఒక మెట్టును వదిలినవాడు క్రింద పడవచ్చు సన్యాసం పిల్లలకూ, యువకులకూ లేదు యౌవనంలో దైవం, ప్రకృతి—వీటిని గురించిన సత్యాన్ని తెలుసికోలేము తత్త్వజ్ఞానాన్ని పొందలేము సన్యాసానికీ, పరిత్యాగానికీ అతి ప్రాధాన్యాన్నిచ్చి వాటిని సర్వసామాన్యం చేసింది బౌద్ధ సాంప్రదాయమూ, తరువాతి శంకరమతమూ మాత్రమే పురాతన హైందవ సంప్రదాయానికి అలా గాక త్రివర్గమైన ధర్మార్థ కామాల ప్రాముఖ్యతలోనూ, ఆవశ్యకతలోనూ, విశ్వాసం ఉంది సుఖభాగ్యాల క్షణికతను గ్రహించడమే వివేకమనే మాట నిజమే గాని, ఆత్మనిరాకరణ పూర్వకమైన దారిద్ర్యం, కఠినమైన విషయ విరక్తి—వీటితో కూడిన నీచమైన జీవితాన్ని నడపడం కూడా అవివేకమే భరద్వాజుడు, అత్రి, వశిష్ఠుడు, వ్యాసుడు వంటి మహా ఋషులలో ఎవరూ కూడా ఇలాంటి జీవితాన్ని నడపలేదు అన్ని సౌకర్యాలూ ఉన్న ఆశ్రమాల్లో వారు సుఖమయమైన జీవితాన్ని గడిపారు జీవితంలోని దుఃఖాన్నీ, విషాదాన్నీ పురాతన హైందవ దర్శనాలు నిస్సందేహంగా ఎత్తి చూపినవి కాని, సౌందర్యాన్నీ, కామాన్నీ అణచిపెట్టమని అవి ఎన్నడూ కోరలేదు అయితే కేవలం ఇవే మానవ అస్తిత్వానికి ప్రేరణ శక్తిగా ఉండకూడదని మాత్రం చెప్పినవి. వాస్తవంలో, విషాద దృష్టి, "సుఖం సర్వం క్షణికం" అనే చింతనా, నిజమైన హైందవుని జీవితానికీ, ప్రేమకూ, ఒక అద్భుతమైన బిగువు నిచ్చినవి. ఉపనిషత్తు లుపదేశించినట్లు "తేనత్యక్తేన భుంజీథ" అంటే "రాగరాహితంగా ప్రతిదానినీ త్యజించి ఆనందించు" అని, అంగరిష్ట—కమండకోపన్యాసానికి ఉపోద్ఘాతంగా భీష్ము డన్నట్లు ఫలాపేక్ష లేకుండా త్రివర్గాల ననుభవించడం మోక్షానికి త్రోవ తీస్తుంది

సాంప్రదాయికత

హైందవదర్శనాల మరొక విశిష్ట లక్షణం—అవన్నీ "సాంప్రదాయికమైనవి వాటిల్లో ఏదీ కూడా నవీన ప్రాతిపదికతో బయలుదేరదు అన్నీ కూడా తాము పురాతన సత్యాలను తిరిగి కనుక్కుంటున్నామనే చెప్తవి కాబట్టి సంప్రదాయముతో సన్నిహిత సంబంధ మున్నట్లు అవన్నీ భాసిస్తవి ప్రజల ఆలోచనారీతులకు, అలవాటుకూ పరాయిగా ఉండడానికి వాటిలో ఏదీ సాహసించలేదు తాము కొత్త భావాలను ప్రతిపాదించినప్పుడు కూడా హైందవ దార్శనికులు అవి పురాతన గ్రంథాల్లో ఉన్నట్లుగానే చెప్పేవారు. దేన్నీ ఒక కొత్త సిద్ధాంతంగా ప్రతిపాదించేవారు కారు. ఈ విధమైన దార్శనిక కల్పనకు ఒక విధంగా సబబు కూడా ఉంది సంపూర్ణంగా నూతనమైన దాన్ని ఎప్పటికీ రూపొందించలేము అది విజ్ఞాన శాస్త్రంలో గానీ, సంగీతంలోగానీ, దర్శన శాస్త్రంలోగానీ వర్తమానం, భూతకాలంపైన నిర్మిత మవుతుంది పురాతనసత్యాన్ని గ్రాహ్యం చేసుకుని పునరాలోచన చెయ్యడంలో క్రొత్తసత్యం ఉద్భవిస్తుందని హైందవ చింతకులు విశ్వ

సించారు తర్వాతి తరాలవారు నిర్మించి, మార్చి, పునర్నిర్మించి, తిరిగి రంగు వేసే యూరప్‌లోని మధ్య యుగపు ప్రార్థనాలయాల వంటి ఉపరి నిర్మాణమే హైందవ సాంప్రదాయంలోని దర్శన శాస్త్రం దాని దృష్టిలో దర్శన శాస్త్రం ఒక బృహత్తరమైన సంఘయత్నం వ్యక్తులు దానికి నిస్సంకోచంగా దోహదం చేస్తారు కాని నదిని చేరి, అనామకంగా, అయితే, ఉపయోగకరంగా ఉండే అసంఖ్యాకమైన సెలయేళ్ల వంటివారు, వారు

దర్శనశాస్త్రం-ఒకశక్తి-ఒక అధికారమూ

ఈ సాంప్రదాయికతకు ఒక ఫలితం, దర్శనశాస్త్రాన్ని ఒక అమూల్యమైన వారసత్వంగా పరిగణించడం పాశ్చాత్యదేశాల్లోవలె గాకుండా, ఇక్కడ దర్శన శాస్త్రం, బంగారంలాగా ఆదరించి, పోషించి, బహుజాగ్రత్తతో రక్షించి, తరవాతి తరాలవారికి అందజేయాల్సిన వస్తువు ఎంతో కష్టంతోనూ ప్రయాసతోనూ జనం దర్శన శాస్త్రాన్ని సంపాదించిన కథల్ని అసంఖ్యాకంగా మనం ఉపనిషత్తులలో చదువుతాం దీనికి కారణం అది కలిగినవారు తమ విశ్వాసానికి పాత్రులైనవారూ, స్వంత కుమారులూ—లేదా చిరకాలంగా ఉన్న శిష్యులూ వంటి బహుకొద్ది మందికి మాత్రమే దాన్ని వెల్లడి చేసేవారు ప్రాచీన గ్రీకులకు గూడా దర్శన శాస్త్రం విషయమై ఇటువంటి అభిప్రాయమే ఉండేది ఆర్ఫిక్, ఎల్యూసినియన్ వంటి రహస్య జ్ఞాన మతస్థుల నటుంచి, పితగోరియన్లు, నవీన ప్లేటో వాదులు—వీ రందరికీ వారివారి రహస్య సమాజా లుండేవి బయటివారికి వారు దేనినీ వెల్లడి చేసేవారు కారు ఇలాంటి ప్రవృత్తి హైందవ దర్శనాలలో అనేకమైన వాటిల్లో కన్పిస్తుంది అధికార మనేది ఒకటి ఉన్నది గదా, జన్మ శిక్షణల ననుసరించి దర్శన శాస్త్రాన్ని గ్రహించడానికి అధికార మేర్పడుతుంది

శ్రద్ధద్వారా దర్శనశాస్త్రాన్ని స్వంతం చేసుకోవాలి

దీని ఫలితాలలో ఒకటి హైందవ దార్శనిక ప్రస్థానాలకు విశిష్టమైన దార్శనిక శిక్షణ భావము భారతదేశంలో దర్శన శాస్త్రం తరచూ బహిరంగంగా ఉండదు ప్రతివాడూ తొంగిచూచి, తాకి, వదలివేయదగిన వస్తువు కాదది తన ఎకాడమీ (విద్యా సంస్థ) ద్వారం మీద ప్లేటో "గణిత శాస్త్రం రానివాడు దీనిలో ప్రవేశించకూడదు" అని రాశాట్ట అదేవిధంగా పురాతన భారతదేశంలో సర్వ శాస్త్రాలకు దర్శన శాస్త్రం రాజ్ఞి వంటిది వ్యాకరణం, పవిత్ర శాస్త్రాలూ, రాజ్యాంగం, యుద్ధ నీతి వంటి శాస్త్రాలను మొదట క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత ఉత్తమోత్తమ శాస్త్రమైన పరావిద్యకై అన్వేషించాలి ప్రముఖ ఋషి నారదుడు 'వాక్కును' (ఉపదేశాన్ని) గ్రహించటానికై సనత్కుమారుడి దగ్గరికి వెళ్లే ముందు చాలా అధ్యయనం చేసి వయోధికు డయ్యాడు శ్వేతకేతువనే ఋషి తన విద్య నంతటినీ పూర్తి చేసిన తర్వాతనే తన తండ్రి వద్ద దర్శన శాస్త్రంలో ఉపదేశాన్ని పొందాడు భారతదేశంలో దార్శనిక శిక్షణ అంటే తార్కిక విమర్శ కాదు సిద్ధాంతాలను విశ్లేషణాత్మకంగా అనుశీలన చెయ్యడమూ కాదు అమూల్యమైన ఉపదేశాన్ని శ్రద్ధతో గ్రహించాలి ధ్యానం ద్వారా దానిని స్వంతం చేసుకోవాలి సహాధ్యాయులతోను, ఉపాధ్యాయునితోనూ చర్చల ద్వారానూ, ప్రశ్నించడం ద్వారానూ దాన్ని పరిశీలించాలి ఆ విధంగా దాని సత్యాన్ని గ్రహించాలి తార్కిక వివాదమంతా తాను గ్రహించిన సత్యాన్ని దృఢపరచుకోడానికి, అపనమ్మకాలూ, కువిమర్శలూ అనే కంటకాలను తొలగించడానికీను గౌతముని (న్యాయం) పురాతన గ్రంథంలో మనకు కనబడే తర్కం ఉపయోగం ఇది

సంస్కృతిని పరిరక్షించే శక్తి-దర్శనశాస్త్రం

దీనిఫలితంగా భారతదేశంలోని దర్శనశాస్త్రం సంస్కృతినీ, సంప్రదాయిక చింతనను, జీవనరీతుల్ని పరిరక్షించే ఒక శక్తిగా తయారయింది పాశ్చాత్య దేశాల్లో దర్శనశాస్త్రం అతఃపూర్వపు చింతననూ, జీవన విధానాన్నీ విమర్శించేది. దర్శనాలు తరచుగా అశ్వ మక్షికాల వలె ఆచరించి సభ్యతా పురోభివృద్ధికి త్రోవ దీసేవి అయితే, భారతదేశంలో, విమర్శ ప్రతిపక్ష సిద్ధాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది స్వసిద్ధాంత విమర్శ గానీ, హైందవ జీవనవిధానానికి ఆధారమైన పూర్వ గృహీత విషయాలపై విమర్శ గానీ జరగలేదు దీనివల్ల కొన్ని నష్టా లున్నవి వేలాది సంవత్సరాల తరబడి "కర్మ" వంటి విశ్వాసాలూ, వర్ణాశ్రమంవంటి జీవనాభ్యాసాలూ సవాలు చేయబడటం అటుంచి, చివరకి తీవ్రంగా విమర్శించబడును కూడా లేదు. ఎక్కడైనా తీవ్రంగా వీటిని దురుపయోగపరచటం జరుగుతే, దానిని వెంటనే సంస్కరించడానికీ, పరిస్థితుల కనుగుణంగా మార్చడానికీ ప్రయత్నాలు జరిగేవి కాబట్టే భారతీయ—చింతనలోగాని, భారతీయ జీవనంలో గాని విప్లవాలు ఎన్నడూ సంభవించలేదు తక్కిన అన్ని దేశాల్లోనూ పురాతన సభ్యతలు విచ్ఛిన్నమై నశించిపోగా, భారతదేశంలో పురాతన సభ్యత ఏ విధంగా నిరాఘాటంగా కొనసాగిపోయిందో అర్థంచేసికోవడం సులభం ఈ రోజున గ్రీకు, రోమన్, బైజాంటైన్, అజీటెక్ సభ్యతల శిథిలాలు మాత్రమే మిగిలి ఉన్నవి భారతదేశంలో అలాకాక, రామాయణం, కాదంబరి, లేదా అర్థశాస్త్రంవంటి గ్రంథాలలో భారతీయ జీవనాన్నిగురించీ, ఆచారాల్నిగురించీ వర్ణనలు చదివినట్లయితే ఈ నాడు గ్రామాల్లో జనం నడిపే జీవితానికీ దానికీ ముఖ్య విషయాల్లో తేడా లేదని మనకు కనబడుతుంది ఈ విధమైన సభ్యతా పరిరక్షణకు సమానమైన ఉదాహరణకు మనకు ఒక్క చైనాలోనే కనబడుతుంది అయితే నేడు కమ్యూనిజం (సామాజిక వాదం) దానిని విచ్ఛిన్నం చేసింది ఈ విధంగా సభ్యతకొనడానికి మరొక కారణం ఏమిటంటే, సాధారణంగా భారతీయ చింతకుల సిద్ధాంతాలని పరస్పరం తీవ్రంగా విమర్శించు కున్నప్పటికీ అన్ని సిద్ధాంతాల ఎడలా వారు సహనం చూపారు అయితే, వర్ణాశ్రమాలను ఆచరణలో అనుసరించినంత కాలం జనం శాంతంగా వదిలివేయబడ్డారు కాని సాంప్రదాయికమైన జీవన విధానాన్ని స్వల్పంగా నైనా వైదొలగి పోయినపుడు వారు ఆగ్రహించబడి, నాశనం చేయబడ్డారు సిద్ధాంత విషయాల్లో అసహనం చూపుతూ ఆచరణ యెడల ఉపేక్ష చూపిన సెమిటిక్ సంస్కృతుల మనోస్వభావం దీనికి వ్యతిరేకంగా ఉంది

అనుభవిక విజ్ఞాన శాస్త్రానికి దూరంగా ఉండడం

భారతదేశంలోని దర్శన శాస్త్రానికీ, పాశ్చాత్య దేశాల్లోని దర్శన శాస్త్రానికీ ముఖ్యమైన వ్యత్యాస మేమంటే భారతీయదర్శన శాస్త్రానికి ప్రాకృతికవిజ్ఞానశాస్త్రంతో సన్నిహితమూ, బలవంతమూ అయిన సంబంధము ఎన్నడూ లేదు ప్రాచీన గ్రీసువలెనే ప్రాచీన భారత దేశానికి కూడా విజ్ఞానశాస్త్రం ఉండేది గణిత శాస్త్రంలోనూ, ఖగోళ శాస్త్రంలోనూ, చివరికి వైద్యశాస్త్రం, శస్త్ర చికిత్సలలో కూడా క్రీస్తుశకం రెండవ శతాబ్దం నాటికే గణించదగ్గ ఫలితాల్ని భారతీయులు సాధించారు విదేశ ప్రయాణం సర్వసామాన్యమై భారతీయులు దూరప్రాచ్యంలో వలసలు స్థాపించుకొన్న తరువాత కూడా వారు వారి జీవన విధానంలోకి మార్పులు తేవడానికి ప్రయత్నం చేయలేదు తక్కిన దేశాల మతాలలో తమ భారతీయ మతాన్ని పోలుస్తూ ఎలాంటి అనుశీలనలనూ వారు ప్రారంభించనూ లేదు తమ సభ్యతాసందేశంలోనే విశ్వాసం కలిగి ఎల్లప్పుడూ ఇతరుల్ని అనాగరికులుగా పరిగణించిన రోమనుల వలెనే భారతీయులు కూడా భూమిపై గల ప్రతి ఇతర జాతికన్న కూడా తామే గొప్పవారమని భావించేవారు అలా చెప్పుకొనేవారు కూడా ఉదాహరణకు, ఈ దేశంలోని అగ్రకులాలవారు విధించిన ప్రమాణాల ననుసరించే ప్రపంచంలోని మానవు లందరూ తమ జీవితాల్ని క్రమబద్ధం చేసుకున్నారని మనువు అన్నాడు ప్రసిద్ధ మహమ్మదీయ పండితుడైన అల్–బెరూని భారతీయుల ఈ లక్షణాన్ని గురించి రాశాడు అనేక భారతీయ గ్రంథాలలో పరాయి దేశస్థులు—అరబ్బులు, పారసీకులు మొదలైనవారు—మ్లేచ్ఛులని పిలవబడ్డట్లు కనబడుతుంది ఒక్కొక్కప్పుడు వీరు జంతువులతో పోల్చదగిన వారని కూడా చెప్పబడింది అదేవిధంగా ఆర్యభట్టారకుడి వంటి

భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు భూభ్రమణాన్నీ, గ్రహణాల వాస్తవకారణాన్నీ కనుగొన్నప్పటికీ, వైద్యశాస్త్రగ్రంథాలు శరీరనిర్మాణాన్ని ప్రక్రియలను సరిగానే వివరించినప్పటికీ వారు భారతీయ దర్శనశాస్త్రంపై ఎటువంటి ప్రభావాన్ని నెరపలేదు. బ్రూనో, గెలీలియోలవలె వారు భారతదేశంలో ఎలాంటి సంచలనాన్నీ తేలేకపోయారు దీనికి కారణం భారతీయ దర్శన శాస్త్రమూ, మతమూ, ఎన్నడూ భూమిని కేంద్రంగా చేసుకొని ఉండక పోవడమూ, విశ్వంలో మానవుడే ప్రధానమైన విషయంగా భావించక పోవడమూ కావచ్చు. కాబట్టి ఖగోళ శాస్త్రజ్ఞులు భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని చెప్పినప్పుడు ఎవరూ నిర్ఘాంత పోలేదు బహుశ బహుకొద్దిమంది విశ్వసించి ఉంటారు. తత్ఫలితంగా, ఉన్న కొద్ది విజ్ఞాన శాస్త్రాన్ని లెక్క చేసినవారు లేకపోయారు అది ఉపేక్షవల్ల నశించింది ఈవిధంగా పురోభివృద్ధి చెందే విజ్ఞానశాస్త్రంతో సంబంధం లేకపోవడంవల్ల మతం చెలిమితో భారతీయ దర్శన శాస్త్రం తృప్తిపడి పూరుకోవలసి వచ్చింది కొన్ని దర్శనాలు నిస్సందేహంగా అన్ని విధాలైన ఆస్తికవాదాల్ని తీవ్రంగా విమర్శించినవి. కాని అవి కూడా మతసంబంధమైనవిగానే ఉండిపోయినవి భారతదేశంలో మానవుల జీవనానికి ఆధారభూతమైన విశ్వాసంగానే దర్శనశాస్త్రం ఎల్లప్పుడూ ఉంది విశ్వాసాన్ని అది ఎన్నడూ విమర్శించలేదు పురాతనమైన విశ్వాసాన్ని విమర్శించిన కొద్ది సందర్భాల్లోనూ అది ఒక నూతన విశ్వాసాన్ని సృజించి పురాతనవిశ్వాసం స్థానంలో ఉంచింది ఈ విధమైన పోకడకు బౌద్ధ దర్శనం ఒక నిదర్శనం

దర్శనశాస్త్రం వ్యాఖ్యానం

ఇతరత్రా దర్శనశాస్త్రం నిర్మాణాత్మకంగా ఉండగా, ఈ విధమైన లక్షణాలన్నింటి కారణంగా భారతదేశంలోని దర్శనశాస్త్రం వ్యాఖ్యాన ప్రధానం ఉంది. అరిస్టాటిలు, 'కాంట్' వంటి దార్శనికులు వారి పూర్వీకులకు చాలా బుణపడి ఉన్నారని మనకు తెలుసు అయితే, అదే చేతితో వారికి పూర్వం ప్రతిపాదింపబడిన దాని నెంతటినో వారు నాశనం చేశారు ఆ శిథిలాలపైన, కొంతవరకూ పాతఇటుకలతోనే, ఒక నూతన భవంతిని నిర్మించడానికి వారు ప్రయత్నించారు అయితే, అలాంటి అన్ని ప్రయత్నాలలోనూ వాస్తువు వ్యక్తికల్పితమే. ఒక దార్శనికుని చేతిపనిలో ఆతని ప్రజ్ఞ యొక్క స్పష్టమైన ముద్ర స్పష్టంగా కనబడుతుంది పాశ్చాత్య దేశాలలో ఉన్నంత గొప్ప మేధావులు భారతదేశంలో కూడా అవతరించారు కాని, అంతకు పూర్వం చెప్పబడిన దానిలోని సారాంశాన్ని బయటికి తేవడానికే వారు ప్రయత్నించారు. అయితే ఒక మేలేమంటే ప్రమాణంగా గ్రహించబడ్డ గ్రంథాలు విషయ వైచిత్రిని, చింతనా పటిమను కలిగిఉన్నవి ఇవి ప్లేటో సంవాదాలకు (Dialogues) కు తీసిపోవు. ఒక్కొక్కప్పుడు వాటిని మించిపోతవి కూడా దర్శన శాస్త్రాన్ని వ్యాఖ్యానంగా గ్రహిస్తే ఒక లాభం ఉంది పురాతనాచార్యుల నుండి సంక్రమించిన చింతనను ఎర్ర మాత్రవలె మింగ నవసరం లేకుండానూ, చెత్త కుప్పవలె పారవేయ నవసరం లేకుండానూ అది గ్రహిస్తుంది భారతదేశంలోని దార్శనికుడు మధ్యవర్తిగా ఆచరించి, పురాతన గ్రంథాల ఆంతర్యంలోకి చొరబడి తిరిగి స్వంత విధంగా వాటిని వ్యక్తం చేయాలి ఉపనిషత్తులు, గీత వంటి గ్రంథాల్లోని అనేక విధాలుగా వ్యాఖ్యానించ వీలయే అనుభవమూ, భావుక సౌందర్యమూ, అన్నీ, ఆ గ్రంథాలపై ఆధారపడ్డవే ననీ చెప్పబడే అనేక విధాలైన ప్రస్థానాలను సమర్థులైన వ్యక్తులు నిర్మించడానికి వీలు కలుగజేసినవి.

దర్శనశాస్త్రం మోక్ష విద్య

భారతీయ దర్శనశాస్త్రంలోని మరొక ముఖ్య లక్షణం అది ప్రయోజనాత్మకం (Practical) కావడం. భారతదేశంలోని ఏ దర్శనమూ బౌద్ధిక పరిశ్రమ ఫలంగా ఆవిర్భవించలేదు. ఏ భారతీయ దర్శనమూ సౌందర్య కాంక్షను తృప్తిపరచుకొనుటకొరకై సృజింపబడలేదు. భారతీయ దర్శన శాస్త్రం ఆత్మ సంక్షోభము నుంచి, శారీరక బాధల నుంచి జన్మించింది భారతీయ దర్శనాలన్నీ తమ అనుయాయులకు సంపూర్ణ సత్యాన్ని వాగ్దానం చేస్తవి ఈ సత్యాన్ని గ్రహించిన ఎడల వారు అమృతత్వానికి పొందగలరని అవి చెబుతవి ప్రాచీన భారతీయ లోకోక్తి ఒకటి విముక్తి దోహదం చేసేదే జ్ఞానమని చెబుతుంది కూడాను ("సవిద్యాయ విముక్తయే") ఈ సందర్భంలో ముక్తి అంటే తిరిగి జన్మ లేకుండా ఐహిక జీవితం నుంచి విముక్తి భారతీయ దర్శనశాస్త్రంలో ఈ ప్రాయోజనికత (Practical Character) అన్ని దర్శనాలపైనా తన ముద్రను వేసింది భారతీయ దర్శనాలన్నీ మోక్ష విద్యలే దీని అవశ్య పర్యవసానం ఏమంటే భారతీయ దర్శనాలు తమ అనుయాయులలో ఒక పరిణామాన్ని తేవడానికి ప్రయత్నిస్తవి. పునర్జన్మించిన మానవుడే నిజమైన ద్రష్ట అట్టి వానిలో ఐహికాసక్తులూ, స్వార్థాన్వేషణా గల "పూర్వ" మానవుని ఛాయ లుండవు కాబట్టే భారతదేశంలో దర్శనశాస్త్రం సన్యాసంతోనూ, ఆత్మనిరాకరణంతోనూ, ప్రపంచంలో ఎట్టి విధమైన పురోభివృద్ధినైనా నిరసించడంతోనూ చెలిమి చేసింది. అయితే దీనికి వ్యతిరేకంగా చాలా ముఖ్యమైన, ప్రబలమైన పోకడలు కూడా ఉన్నవి వేదాలలోనూ కొన్ని ఉపనిషత్తులలోనూ కనబడే దర్శనాలు ఉత్సాహభరితంగానూ, క్రియాత్మకంగానూ ప్రపంచం ఉండాల్సిందేనని చెప్పేవిగానూ ఉన్నవి అయితే, అన్ని దర్శనాలూ, అవి హిందూ దర్శనాలు గానీ, హైందవేతర దర్శనాలు గానీ, వాటి ప్రధాన చర్చనీయ విషయం మోక్షం అనే అర్థంలో అవి ప్రయోజనాత్మకమైనవనీ, మోక్ష విద్యను గరుపుచున్నావనీ చెప్పుకుంటున్నవి గనక అవి శాస్త్రీయమైనవని మనం నిర్భయంగా చెప్పవచ్చు అవన్నీ మోక్ష శాస్త్రాలే

దర్శనశాస్త్రం-సమీక్షాశాస్త్రం-లేదా అన్వీక్షకీ!

ఆంగ్లంలో 'Philosophy' అనే పదానికి సరిగా సమానమైన పదం సంస్కృత భాషలో లేకపోవడం విచిత్రమే అరబ్బీ భాషలో కూడా ఇంతే. అయితే గ్రీకు సభ్యతా ప్రభావం వల్ల గ్రీకు పదాన్నే అరబ్బులు గ్రహించారు 'ఫిలాసఫియా' అనేది యిప్పుడు అరబ్బీ పదం ఈ పదానికి కొంత వరకైనా సమానంగా ఉండే రెండు సంస్కృత పదాలు ఆన్వీక్షికీ, దర్శనం అనేవి ఆన్వీక్షికీ అంటే అసలు అర్థం 'సమీక్ష చేసేది' అని మొదట ఈ పదాన్ని తర్కశాస్త్రం ఉపయోగించుకుంది ఎందుకంటే తర్కశాస్త్రంలో యుక్తులను పరీక్షించడం, అవి ప్రామాణిక మైనవో అప్రామాణిక మైనవో నిర్ణయించడం జరిగేది తర్కశాస్త్ర సహాయంతో మనం వివిధ దర్శనాలూ, దార్శనికులూ ప్రతిపాదించిన వాక్యాల్ని విశ్లేషించి, పరీక్షించవచ్చు. వీటిని సమీక్షించి వాటిలో ఉత్తమోత్తమైన దానిని స్వీకరించవచ్చు ఈ అర్థంలోనే ప్రాచీన కాలంలో ఆన్వీక్షికీ సర్వ జ్ఞానానికీ మకుటంగానూ, అన్ని ఫలితాల్ని సాధించటానికి సాధనంగానూ, అర్థశాస్త్రానికీ ఆధారంగానూ పరిగణించబడ్డది అయితే ఆన్వీక్షికీని విమర్శించినవారు లేకపోలేదు ఏలనంటే ఈ విద్యలో శిక్షితులైన వ్యక్తులు అంతులేని వివాదాల్లో చిక్కుకొని ప్రతిదానినీ విమర్శించి, సంశయాన్ని అధికం చేసేవారు. ఈ కారణాలవల్ల కొన్ని హైందవ పురాణాల్లో అన్వీక్షికీని నిరసించడం మనకు కనబడుతుంది. అందువల్లనే కౌటిల్యుని కాలంలోని రాకుమారులకు కూడా తప్పనిసరి అయిన విద్య అయినప్పటికీ రానురాను ఇది ఆదర్శాన్ని కోల్పోయింది

దర్శనశాస్త్రం ఒక దృక్పథం?

ఆన్వీక్షికీకి ప్రత్యామ్నాయంగా ఉపయోగింపబడి, బహుళ ప్రచారాన్ని పొందిన పదం "దర్శనం". దీనికి సాధ్యమైనంత సమీపంగా ఉన్న ఐరోపీయపదం "వెల్టాన్‌షేంగ్". (Weltanchanung) "ప్రపంచ దృక్పథం" అని దీని అర్థం దర్శనం అంటే మానవుడు, ప్రకృతి, దైవము— వీటిని గురించిన అపరోక్షజ్ఞానం. మరింత సహనంగల జయంతుడు న్యాయ దర్శనం) సిద్ధసేనుడు (జైన దర్శనం) అభినవ గుప్తుడు (కాశ్మీర

శైవం) వంటి అనేక దార్శనికులకు ఇతర సిద్ధాంతాలయెడల ఆశ్చర్యకరమైన ఉదారదృష్టి ఉండేది అభినవగుప్తుని ఒక శ్లోకానికి ఈ క్రింది అనువాదం దీనికి ఒక ఉదాహరణగా ఉపయోగ పడుతుంది "వారి బుద్ధితో వారు వూహించినపుడు వారు "ఇది సత్యం, ఇది సత్యం" అంటారు. వాస్తవంలో అది అంతా సత్యమే. నీ (ఈశ్వరుడు) కు భిన్నంగా ఏదీ లేదు. పండితుల ఈ వివాదం పేర్లనుగురించి మాత్రమే." ఒకే సత్తును వర్ణిస్తూ పరస్పరం ఖండించుకొని సమానమైన అనేక దృక్పథాలను అర్థం చేసుకొనే ప్రయత్నం మనకు ఈ ప్రార్థనలో కనబడుతుంది. రచయిత అద్వైతి. అయితే యీ దృష్టి అతనికి మాత్రమే ప్రత్యేకం కాదు. ఈ క్రింది శ్లోకం గుణరత్న డనే జైనుడు సమ్మతితో పేర్కొన్నది. "బుద్ధుని విశ్వాసాన్ని వినాలి; జినుడి విశ్వాసాన్ని ఆచరించాలి; వేదంలోని విశ్వాసాన్ని అనుసరించాలి" సత్తు అజ్ఞేయ మైనదనే భావంపైనా; దాని రహస్యాన్ని మానవుని బుద్ధి ఛేదించలేదనే భావంపైనా, ఏ దర్శనమూ సర్వ సమర్థంగానీ, సర్వ ప్రామాణికంగానీ కాదనే భావంపైనా ఈ దృష్టి ఆధారపడి ఉంది.

దర్శనశాస్త్రం సత్యాన్వేషణ

భారతీయ దర్శనాలన్నీ సత్యాన్ని అన్వేషించి వివరిస్తున్నామని చెప్పుకుంటవని ఇదివరకే చెప్పాను అయితే భారతీయ దర్శనశాస్త్రం అన్వేషించే సత్యం విజ్ఞానశాస్త్ర సంబంధమైన యదార్థసత్యం కాదు 'సత్యం నీకు విమోచనం కలిగిస్తుంది' అని బైబిలు చెప్పే సజీవ సత్యం ఇది విజ్ఞాన శాస్త్రజ్ఞుల్ని సత్యాన్వేషకులని మనము తరచూ అంటుంటాం, ఇది అనేకమైన శాస్త్రజ్ఞుల విషయంలో నిజమైనట్టు జ్ఞానానికీ, సత్యానికీ గల భేదాన్ని మనం గమనించాలి భూతార్థాల్ని (Facts) కూడబెట్టడం జ్ఞానం కాని సత్యం దేనినో కూడపెట్టగా వచ్చింది కాదు. సత్తుయొక్క ఒక అంశంతో సంబంధం ఏర్పరచుకోవడమే సత్యం సత్యగ్రహణము మానవుని మొత్తం జీవితాన్నీ, మనోదృష్టినీ మార్చాలి. సత్యం మానవుని తలక్రిందులుగా చేస్తుందని మనం చెప్పవచ్చు ఉదాహరణకు భూగోళాన్ని నేర్చుకొనే ఒక పిల్లవాడు భూతార్థాలను తన బుర్రలోకి ఎక్కించడంతో తన విద్యను ప్రారంభిస్తాడు. దేశాల, పట్టణాల, నదుల పేర్లను గ్రహిస్తాడు. వానిని ఉపయోగించగలడు. దేశ పటంపై వాటిని గుర్తించగలడు. వాటిని గురించి మాట్లాడటం లాంటి పనులు చేయగలడు. అయితే ఈవిధంగా అతని భూగోళజ్ఞానం అధిక మవడం అతనిలో ఏ మార్పును తీసుకొని రాదు. అతని స్వరూపంలో ఏ సంచలనాన్ని తీసుకొనిరాదు కాని ఒకడు దీర్ఘమైన ప్రయాణం చేసి వచ్చి, తన భార్య వ్యభిచారం చేస్తూండగా ఆమెను పట్టుకుంటే, ఆమె యెడల అతనికి గల దృష్టిని అది మార్చివేస్తుంది అది అతని జీవితంలో ఒక తుఫానును తెస్తుంది. అతని పూర్వజీవనవిధానాన్ని సంపూర్ణంగా మార్చివేస్తుంది. సత్తుయొక్క ఒక అంశంతో అతనికి ఇప్పుడొక కొత్త విధమైన సంబంధం ఏర్పడింది. సరిగా చెబితే ఈవిధమైన సంక్షోభకారకమైన శక్తినే మనం 'సత్యం' అనాలి "ఆథో మానవ వానరాల్నించి మానవుడు పరిణమించాడు." "భూమి తన చుట్టూ తా తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతోంది" వంటి శుష్క విజ్ఞాన శాస్త్రీయ భూతార్థాలకు మానవుడి జీవన విధానాన్ని మార్చేంత శక్తి లేదు కాని, మనము పైన పేర్కొన్నటువంటి వైయక్తికానుభవానికి (Subjective experience) మానవుడి అంతరాంతరాళాల్లోనించి సమాధానం వస్తుంది. భారతదేశంలోని దర్శనశాస్త్రం ఉద్దేశించిన సత్యం ఇటువంటిదే ధ్యానం చేయమనీ, ఆత్మసాక్షాత్కారాన్ని సాధించమనీ, వేదాంతం మనకు ఉపదేశించడంలోనూ, ప్రపంచం గురించి గాఢంగా ఆలోచించి అది క్షణికమైనదనీ, దుఃఖమయమైనదనీ గ్రహించమని బౌద్ధమతం మనకు ఉద్బోధం చేయడంలోనూ, మనం ప్రపంచాన్ని పూర్తిగా నూతనమైన విధంలో

కూడాలనీ, ఒక విమాత్న జీవితంలోకి మనం ప్రవేశించాలనీ అవి ఆకాంక్షిస్తున్నవి

సృష్టిసంస్థితమైనదనేభావం (Organicism)

ఇతర దేశాల్లోని అనేకదర్శనాల్లో మానవుడికీ ప్రకృతికీ మధ్య విభజన కనబడుతుంది. భారతీయ దర్శనాల్లో అలాంటి విభాగం ఏమీలేదు. భారతీయ దర్శనశాస్త్రం దృష్టిలో సృష్టి సంస్థితమైనది. కర్మ, ఋతం అనే నియమాలవల్ల సర్వవిశ్వంలోనూ సుందరమైన ఒక సంగతి (Harmony) దానికి కనబడుతుంది. మనం ఇదివరకే చెప్పినట్లు మానవునికి పూర్తి స్వేచ్ఛ ఉంది. అతని అదృష్టానికి అతనే కర్త. అతని ప్రవృత్తికి (Activity) ప్రకృతి ఒక క్షేత్రంగా మాత్రమే ఆచరిస్తుంది. కొందరు మానవులు తెలివి తక్కువవారై ఈ బ్రహ్మాండమైన యంత్రానికి బానిసలైనప్పటికీ ఇది మానవునికి ఉపకరణమైన ఒక యంత్రం మాత్రమే. తెలిసినవారు దాని నధిగమించగలిగి, సర్వకాలాలకూ, సర్వసత్తకూ సాక్షీభూతులుగా ఉండగలుగుతారు. ఈ కైవల్యాన్ని (Aloofness) అలవర్చుకొని అస్తిత్వం అనే ఈ విషచక్రాన్నుంచి తప్పించుకోలేనివారు నిస్సహాయులు అవుతారు. ఇదే ప్రకృతి సంస్థితమైనదనే భావం. ఈ దృష్టి సర్వ సృష్టి నాటకాన్నీ పరస్పర వ్యతిరేకమైన శక్తుల అర్థరహితమైన విలయతాండవంగా గాక ఏకైక క్రమము, సుందరమైన సంగతి (Coherence) గలదానినిగా పరిగణిస్తుంది. ఈ దృష్టి మానవుణ్ని ప్రకృతి కనుగుణంగా తనను తాను మలచుకోనేట్లు గానూ, దాని యెడల సమరసభావంతో మెలిగేట్లుగానూ చేస్తుంది. హైందవుడు సృష్టిలో భయంకరమైన సంక్షోభం, దుఃఖం, బాధా చూస్తాడు. కానీ దానివల్ల అతను భయపడి పోడు, నిశ్చేష్టుడూ కాడు. దానివల్ల అతడు విభ్రాంతుడై విశ్వము అర్థహీనమైనదని, హాస్యాస్పదమైనదనీ సార్త్ర్ వలె ప్రకటించలేదు. విశ్వంలోని ప్రయోజనాన్ని హైందవుడు స్వయంగా చూడలేక పోవచ్చు కాని, తరతరాలుగా పాతుకొని పోయిన ఆలోచనాచరణ రీతులు అతని అవ్యక్త చైతన్యంలో ప్రవేశపెట్టిన అచంచలమైన విశ్వాసం అతని జీవితానికి ఊతగా ఆచరిస్తుంది. పాశ్చాత్య దేశాల్లోని కొందరు హైందవుని నమ్రతా స్వభావాన్ని హేళన చేశారు. కాని అతని నమ్రతే దుఃఖంలో జీవితాన్ని గడపటానికి అతనికి సహాయ పడుతుంది. అయితే దీనికి మూలం నిస్పృహ కాదు. చివరికి అన్ని విషయాలూ సక్రమంగానే జరుగుతాయనీ, సృష్టి అర్థరహితమూ, హాస్యాస్పదమూ కాదనీ అనే నిరంతరమైన విశ్వాసమే దీనికి ఆధారం. సృష్టి సంస్థితమైనదనే ఈ దృష్టి ఏక సమాజ భావానికీ, సాంప్రదాయిక ఆచరణ ప్రమాణాల పరిరక్షణకూ, చైనా గోడ కట్టుకోవడం ద్వారా కాకుండా, ఆత్మీకరణ ద్వారా పరాయి సంస్కృతుల అఘాతానికి తట్టుకోవడానికీ దోహదం చేసింది. అన్ని రకాల విషయాలనూ గ్రహించి జీర్ణం చేసుకొన్న హైందవ మతం యొక్క ఈ చంపినా చావని లక్షణాన్ని, ఈ దృష్టి ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు. సృష్టి సంస్థితమనే ఈ దృష్టిని ఆచరణరీతులు కూడా కదలించలేక పోయినవి. ఐరోపీయ సంపర్కం కూడా భారతదేశ స్వరూపాన్ని మార్చలేకపోయింది. పాశ్చాత్య సభ్యత, విజ్ఞాన శాస్త్రీయరీతులు భారతదేశంయొక్క ఉపరితలాన్ని మాత్రమే స్పృశింప గలిగినవి. పాశ్చాత్య దేశాలనుంచి భారతదేశం ఎన్నో విషయాలను గ్రహించినప్పటికీ ఆనందమయ జీవన రహస్యంకొరకు మాత్రం అది తన సాంప్రదాయిక దర్శన శాస్త్రాన్నే అర్థిస్తుంది. ఉదాహరణకు, లక్ష్యాలకూ, ఆదర్శాలకూ, శక్తికీ, వైచిత్రికీ భారతదేశం తన వేదాంతాన్నో, జైనమతాన్నో, మరొక మతాన్నో అర్థిస్తుంది. అయితే బాహ్య జీవనం విషయంలో మాత్రం అది పాశ్చాత్య దేశాల్ని అనుకరిస్తుంది. సృష్టి సంస్థితమైనదనే దాని దృష్టి వల్లనే, ఆధునిక కాలంలో విజ్ఞానశాస్త్రం వల్లనూ, పారిశ్రామిక సభ్యత వల్లనూ, పాశ్చాత్య చింతనలోనూ, జీవనంలోనూ జనించిన సంక్షోభం భారతదేశానికి తెలియను కూడా తెలియదు.

భారతీయ దర్శనశాస్త్రానికి స్వంతప్రజ్ఞ ఒకటివున్నది

ప్రతి సంస్కృతిలోని దర్శనాలకూ, తక్కిన సంస్కృతులలోని దర్శనాలకు భిన్నంగా, విశిష్టమైన కొన్ని ముఖ్య లక్షణాలు ఎల్లప్పుడూ ఉంటవి. అయితే ఒకే సాంస్కృతిక సాంప్రదాయంలో పరస్పరం కలహించుకొనే చాలా దర్శనాలూ, తక్కిన వాటితో సంవదించడానికైనా ఆస్కారంలేని కొన్ని దర్శనాలు కూడా ఉండొచ్చు. అయినా, వా టన్నింటికీ సామాన్యంగా చాలా మూలభావాలు ఉంటవి. దీనిని మనం సాధారణ రచన (General frame-work) అనవచ్చు. దీనిలోనే అనేకదర్శనాలు పనిచేస్తవి. అయితే వాటిలో ఏదీ కూడా ఈ రచన యొక్క ప్రామాణికతను ప్రశ్నించదు. ఉదాహరణకు, వ్యక్తి స్వేచ్ఛాభావము, సోదర మానవుల యెడల మానవునికి ఒక విధి ఉన్నదనే గుర్తింపూ—ఈ రెండు భావాలూ అన్ని దర్శనాలకు సామాన్యమైనవి. ఇవి గ్రీకు, హిబ్రూ చింతనా ధోరణిపై ప్రభావాన్ని నెరపినవి. అదే విధంగా దాదాపు అన్ని ఆధునిక పాశ్చాత్య దర్శనాలకు క్రమమూ, పురోభివృద్ధి అనే భావాలు అనివారిత పూర్వగ్రహిత విషయాలు. మనం భారతదేశంలోని కొన్ని ప్రబలమైన లక్షణాల్ని విడదీసి వివరించవచ్చునని నా వాదం. అన్ని దర్శనాల్లోనూ అన్ని క్షణాలూ ఒకే మేరకు సామాన్యంగా ఉండవు. కొన్ని దర్శనాల్లో కొన్ని లక్షణాలు అసలే లేకపోవడం కూడా సాధ్యమే. అలాగే నేను పేర్కొనని కొన్ని లక్షణాలు వాటికి ఉండవచ్చు కూడాను. ఈ పరిమితుల్ని గుర్తులో ఉంచుకొని, భారతదేశంలో దర్శన శాస్త్రం ఒక ప్రత్యేక ప్రజ్ఞ యొక్క ఫలం అనీ, కొన్ని విశిష్ట లక్షణాలు గల ఒక ప్రజ్ఞ యొక్క ప్రేరణల ఆధ్యాత్మికాభివ్యక్తి (Expression) ఈ దర్శన శాస్త్రం అని మనం చెప్పవచ్చు.

భారతదేశ విదేశాంగవిధానం: ఒక పరామర్శ

శ్రీ ఆంగిరస్

భారత ప్రధాని శ్రీ నెహ్రూ మేల్కొనివుండే కలలుకంటూవుంటారు. 1954లో అటువంటి కలఒకటి కన్నారు టిబెట్టు విషయంలో చైనాతో ఒప్పందం చేసుకోవడమే ఆకల అది కలగాబట్టి, అందులో కలలోకల్లే సుఖానుభవం లాంటి సిద్ధాంతాలు కొన్ని గుది గూర్చబడినాయి శ్రీ నెహ్రూ ఆ సిద్ధాంతాలకు, అతి ప్రేమతో,—"భారతదేశం పుట్టిన వాళ్లందరిలోకీ గొప్ప వాడైన" (ఆయన గూడా ఈయనకు మల్లేనే చాలా కలలు కన్నాడు) బుద్ధుని పరిభాషను స్వీకరించి, "శీల" నామధేయం వుంచారు అవి అయిదు సూత్రాలు కాబట్టి, వాటికి "మొత్తంమీద" పంచశీల అని బారసాల చేయించారు వచ్చిన తిప్పలేమిటంటే, ఈ వ్యవహారంఅంతా, ఇటువంటి సూత్రాలలోను, సిద్ధాంతాలలోను నమ్మకంలేని దేశంతో జరిగిన ఒప్పందంలో ఇది చేర్చ బడింది తాను ఈ ఒప్పందం దగ్గర నిష్కామకర్మచేస్తే, తాను అనుకున్న ఫలితం కల్గుతుందని శ్రీ నెహ్రూ అనుకున్నారు. కాని నిష్కామకర్మలో కర్మ ఫలాపేక్షలేకుండా చేయవలసింది ఇక్కడ ఫలాపేక్షవుంది మనం టిబెట్టుమీద సర్వాధికారాలను చైనాకు అప్పగించివేస్తే, చైనాతో ఏవిధమైన తగాదా అంటూ రాకుండా వుండటమేగాక, భారతదేశం—చైనా సరిహద్దులను, వున్నవాటిని వున్నట్లు చైనా అంగీకరించి వేస్తుందని శ్రీ నెహ్రూ అనుకున్నారు.

ఇట్లా అనుకోవడం శ్రీ నెహ్రూ సోషలిస్టు సిద్ధాంతాలకు సరిపోవచ్చు. కాని, కమ్యూనిస్టు చైనా వున్నదంటే, దానితో వ్యవహారంఅంతా "డైలెక్టిక్సుతో" కూడి వుంటుంది. "బిగ్‌లీప్"లతో పెనవడి వుంటుంది కాబట్టే, చైనా, ఆ "డైలెక్టిక్సు"ను, ఆ "బిగ్‌లీప్"ను ఉపయోగించి, టిబెట్టును గూర్చిన ఒప్పందం కుదిరిన మొన్నాటినుంచి, దురాక్రమణ ప్రారంభం చేసింది అంటే, శ్రీనెహ్రూగారి "పంచశీల"ను హిమాలయశిఖరాగ్రంలోపాతివేసింది. అప్పుడు శ్రీ నెహ్రూకు "పంచశీల" పోయి, "పంచశీల" భ్రాంతి మాత్రం మిగిలింది

శ్రీ నెహ్రూగారికి గురుస్థానీయుడైన సౌగత మేధావి గూడా శీలాలను, వ్యక్తి జీవితానికేగాని, రాజ్యాల మధ్య సంబంధాలకు అనుశాసించలేదు. నిజానికి అట్టి సూత్రాలను ఒక్క బుద్ధుడేగాక, బుద్ధుడికి పరంలో, అపరంలోనువున్న తాత్వికులు, దార్శనికులు, మేధావులు అంతా చెబుతూనేవచ్చారు వైయక్తిక జీవిత విషయంలో అవి ఇప్పుడు గూడా చెల్లవచ్చు మహాత్మాగాంధి తన వైయక్తిక, సాంఘిక జీవనానికి, పతంజలి చెప్పిన "అస్తేయా"ది అష్ట సూత్రాలను ప్రాతిపదికలు చేసుకున్నారుకాని, రాజకీయాలకు వాటిని పట్టించబోతే అవి విఫలం అయినాయి. అవి పనిచెయ్యలేదు. అట్లాగే ఇప్పుడు "పంచశీల" గూడా వైయక్తిక జీవితస్థాయిని విడిచి అంతర్జాతీయ రాజకీయ సూత్రాలక్రింద, సిద్ధాంతంక్రింద, రూపాంతరం ధరించవలసిన అవసరం వచ్చేప్పటికి, అస్థానపతితమైన ధర్మంలాగా వృథా అయిపోవడమేగాక, అనవసరమైన చిక్కులను, ప్రతిబంధకాలను తెచ్చి పెట్టింది. కాని, పంచశీల భ్రాంతిలోపడిపోయివున్న, ప్రధాన మంత్రికి, ఇది ఇట్లా అయినట్లు తెలిసిందో, లేదో తెలియదు కాని, ఆ భ్రాంతిమాత్రం వదిలి పెట్టలేదు.

శ్రీ ఎస్ నటరాజన్ భారత విదేశాంగ విధానాన్ని పరామర్శిస్తూ, ఈ మధ్య, ఇదే అర్థాన్ని అభివ్యక్తం చేస్తూ, ఇట్లా వ్రాశారు "1961 సంవత్సరం ప్రధానమంత్రి శ్రీ నెహ్రూకువున్న అన్ని భ్రాంతులను చాలావరకు వదిలించి వేసింది. ముఖ్యంగా పంచశీల విషయంలో చైనావారు తమ ప్రవర్తనవల్ల-ప్రపంచంలో ఏ దేశంగాని, తానైనా, ఈ పంచశీలను ఆచరించటం అసాధ్యం—అన్పి తేలివేశారు. అది ఆచరణ సాధ్యమేనన్న అభిప్రాయానికి వీరివల్ల తీరని అఘాతం కల్గింది. దురాక్రమణకు దిగకుండా వుండడం, ఇతరుల భూభాగాలను ఆక్రమించుకోకుండా వుండటం, ఒకరి ఆంతరంగిక వ్యవహారాలలో మరిఒకరు ప్రమేయం పెట్టుకోకుండా వుండటం, పరస్పర సమానత్వాన్ని, మర్యాదను గౌరవించడం, సహజీవన సూత్రాన్ని అనుసరించడం—ఈ మొదలుగాగల సూత్రాలు నిజానికి నడవడికకు సంబంధించిన సూత్రాలుగాని, రాజ్య విధానాలకు సంబంధించిన సూత్రాలుకావు. ఇది ఇట్లా అని గ్రహించకపోవడంవల్ల మన ఆలోచనలన్నీ అల్లకల్లోలం అయిపోతున్నాయి. నడవడికకు సంబంధించినంతవరకు అవి ఎంతో మంచి నిబంధనలు అయినంతమాత్రంచేత, వాటికి సిద్ధాంతస్థాయి, సూత్రస్థాయి లభిస్తున్నట్లు అనుకోరాదు. ఈ విషయంలో ఒక్క చైనాయేగాక, పాకిస్తాన్ గూడా, ఈ రకమైన ధర్మసూత్రాలు, అంతర్జాతీయ రంగంలోనేగాక, వైయక్తికమైన సంబంధాలలో గూడా తిరుగులేనివి కావని శ్రీ నెహ్రూ రుజూ చేసిపెట్టింది. అయినా ప్రధానమంత్రి శ్రీనెహ్రూమాత్రం ఈ పంచశీలను పట్టుకొని వదిలిపెట్టడంలేదు. అది వృథాఅయిపోయినా, వృథాకాలేదన్న వాదాన్ని లేవదీస్తున్నారు. ఏదో ఒక దేశం ఆ సూత్రాలను అనుసరించనంతమాత్రంచేత, ఆ సూత్రాలు దెబ్బతినిపోయినట్లుగాని,ఆ సూత్రాలు సరియైనవి కావని రుజూ అయినట్లుకాని చెప్పడానికి వీలులేదు అంటున్నారు."

ఇది యేమిటంటే, మనం నమ్ముకున్న ఒక ధర్మం కళ్లముందే తల్లక్రిందులయిపోతూ, అట్లు అయిపోతున్నట్లు స్పష్టంగా కన్పిస్తున్నా, అది తల్లక్రిందులు కావడం ఏమిటి? నీకేమన్నా అట్లా కన్పిస్తున్నదేమో, అది చెదరకుండా కుండానేవుంది అన్న ధోరణి వ్యక్తం అవుతున్నట్లువుంది. ఇప్పుడు చైనా, ఈ పంచశీలను పాతి పెట్టినందువల్ల, పరిస్థితిఅంతా పూర్తిగా తల్లక్రిందులై పోయినా, దానిని అట్లా గుర్తించకపోవడం కన్పిస్తున్నది. అనగా, అసలు మనిషిని వదిలిపెట్టి, నీడను పట్టుకుని వ్రేళ్లాడుతున్నట్లువుంది. అయితే నిజంగా, ఈ పరిస్థితులలో వచ్చిన మార్పును శ్రీ నెహ్రూ గ్రహించలేదా అంటే, అట్లా అనడానికి గూడా వీలు కన్పించడంలేదు. నసుగుతూనో, నణుగుతూనో జరపవలసిన పనులు జరుపుతూనే వున్నారు. పరిస్థితి మారినందువల్ల, ఏ రకమైన సర్దుబాట్లు అవసరం అవుతున్నాయో, వాటిని, బహిరంగంగా కాకపోయినా, రహస్యంగానైనా, చేస్తున్నారు. కాని, పైకి మాత్రం పరిస్థితిలో వచ్చిన మార్పు ఏమీ లేదంటూ, తెచ్చి పెట్టుకున్న భ్రమలోంచి బయటికి రాలేకపోతున్నారు. ఇది ఇట్లా జరుగుతున్నందువల్ల, ఒక్క ప్రమాదం ఏర్పడుతున్నది. అది రెండు విధాలుగా సిద్ధం అవుతున్నది. (1) పాతపడిపోయిన పద్ధతులను, వదులుకోలేకపోవడంవల్ల ఆలోచనలకు ఒక ప్రతిబంధకం ఏర్పడుతున్నది (2) మారిన పరిస్థితులకు అనుగుణంగా తగిన ధోరణిని, వైఖరిని, బహిరంగంగా వహించకపోవడంవల్ల అసలు పరిస్థితి ఒకటి, లోపలి పరిస్థితి ఒకటి అయి, ఇది అంతా కలిసి, భారత వైదేశిక నీతి అనే శరీరానికి పుట్టుకురుపువలెగా తయారవుతున్నది.

భారత విదేశాంగ నీతి—శ్రీ నెహ్రూ చెబుతున్నదానినిబట్టి—మూడు ముఖ్య ధర్మాలు ఆధారంగా నడుస్తున్నది (1) అన్ని సమస్యలను శాంతియుతంగా పరిష్కారం చేసుకోవలసి వుండటం, (2) ఏ సందర్భంలోనూ యుద్ధానికి దిగకపోవడం, (3) అంతర్జాతీయరంగంలో ఏర్పడివున్న ముఠాలతో ప్రమేయం పెట్టుకోక్క

తటస్థంకాని తాటస్థ్యాన్ని అవలంబించి, ప్రపంచ శాంతికి దోహదం ఏర్పడే విధంగా వ్యవహరించడం— ఈ మూడు సూత్రాలకు పైన పేర్కొన్న పంచశీల ప్రాణం వంటిది. అవడంచేత, అది అవుడోలుగా తేలిపోయిన వెంటనే, తక్కినవి గూడా నామమాత్రావశిష్టాలయి పోయినాయి. ఇవిఇట్లా అయిపోయినట్లు గోవా సమస్యను భారతదేశం పరిష్కరించిన పద్ధతి మూలంగా తేలిపోయింది. గోవా మొదలైన స్థావరాలు—నీవు అవునన్నా, కాదన్నా—మొన్నటివరకు పోర్చుగీసుల ఏలుబడిలో వున్నాయి. భారతదేశంలో వలసలువున్న ఇతర ఐరోపియ రాజ్యాల పద్ధతిని అనుసరించి, ఆ స్థావరాలను వదిలి పెట్టకపోగా, అవి పోర్చుగల్లులో రాష్ట్రాలు అని సాలజార్ ప్రభుత్వం ప్రకటించింది ఇది ఇప్పుడు జరగలేదు ఎప్పుడో జరిగింది ఆ జరిగిన తర్వాత గూడా, శ్రీ నెహ్రూ ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించగలమనే చెబుతూ వచ్చారు ఇట్లా 14 సంవత్సరాలు నడిచింది. ఆ తర్వాత హఠాత్తుగా ఒక రోజున, భారత సైన్యాలు గోవాను, ఇతర పోర్చుగీసు స్థావరాలను ఆక్రమించుకున్నాయి ఈపని చేయడం గోవాకు, ఇతర పోర్చుగీసు—స్థావరాలకు విముక్తిని సంపాదనచేసి పెట్టడము, భారతదేశంలో స్వతస్సిద్ధమైన భాగాలైన ప్రాంతాలను, తిరిగి భారతదేశంలో కలుపుకోవడము కావచ్చు కాని ఈపని ఇట్లాచేయడం అంతర్జాతీయ ధర్మాలకు, భారత ప్రధాని ప్రకటించిన వైదేశిక నీతికి ఎంతవరకు అనుకూలమైన విషయము—అన్నదే ఇక్కడ ప్రశ్న. డా సాలజార్ ఎంత కాలానికీ లొంగకపోవడం అన్నది, ఇక్కడ ఈపని చెయ్యడానికి కారణం అయ్యేందుకు వీలులేదు. ఆయన అట్లా లొంగేవాడు కాదని తెలిసే, భారత ప్రధాని విదేశాంగనీతి ఏర్పాటైంది. మరి మన నౌకలమీద, మన జనంమీద, మన ప్రాంతంమీద, అఘాయిత్యాలు చేయడంవల్ల, పోర్చుగల్ తాలూకు ఈ వలసలపై సైన్యాన్ని నడిపించవలసి వచ్చింది అంటే, ఈ రకమైన చిల్లర తగాదాలు, చిల్లర సంఘటనలు, ఒక్క పోర్చుగల్ మాత్రమే భారతదేశంమీద జరపడంలేదు. పాకిస్తాన్‌తో ఇట్టి చిల్లరతగాదాలు ఎప్పుడూ జరుగుతూనే వున్నాయి. చైనావల్ల గడించుకుంటున్న అనుభవం సంగతి చెప్పనే అక్కరలేదు అందువల్ల, ఈ చిల్లర కారణాలను పురస్కరించుకొని, గోవాలోకి సైన్యాన్ని నడిపించడం వల్ల ప్రతి సమస్యను శాంతియుతంగాను, ప్రతి సమస్యను యుద్ధంతో నిమిత్తం లేకుండాను, పరిష్కారం చేసుకోవాలని పెట్టుకున్న ప్రధాన సిద్ధాంతం వమ్మయిపోయింది. అంతేగాక, ఆ పని అట్లా జరగడంవల్ల, ఇతరమైన విపరిణామాలు గూడా కొన్ని ఏర్పడ్డాయి. అందులో అంతర్జాతీయంగా భారతదేశంఅంటే పూర్వం అక్కడున్న గౌరవం కొంతవరకు తగ్గడం ప్రధానమైంది

విచిత్రం ఏమిటంటే, ఇంతవరకు అన్ని సమస్యలను శాంతియుతంగాను, యుద్ధంతో నిమిత్తం లేకుండాను, పరిష్కారం చేసుకోవాలి—అని వాదించిన ప్రధాన మంత్రి—ఇప్పుడు దురాక్రమణ అంటూ జరిగితే—దాన్ని తొలగబెట్టడానికి అన్ని మార్గాలూ విఫలం అయిపోయినప్పుడు—బల ప్రయోగం చెయ్యవచ్చుననే వాదానికి దిగారు అయితే, గోవాలో పోర్చుగల్ దురాక్రమణ జరిపిందా అంటే—అందుకు శ్రీ మీనన్—వలసతత్వం అనేది శాశ్వత దురాక్రమణ అని సమాధానం చెప్పారు. అందువల్ల, గోవాపై ఈ జరిగిన చర్యను దురాక్రమణను తొలగబెట్టడం క్రింద తేల్చివేశారు.

అనభిజ్ఞులకు ఈవాదం ఎంతైనా రుచించవచ్చు. కాని, ఇక్కడ రెండు ముఖ్య విషయాలను గమనిస్తే, ఈ వాదంలోవున్న లోపం ఏమిటో తేలిపోతుంది. (1) గోవా సమస్య అంటూ క్రొత్తగా ఏర్పడలేదు. అది స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుండీ అట్లాగేవుంది అట్లావున్నదానిని బల ప్రయోగంతో పరిష్కరించడం తగునని చాలామంది ప్రభుత్వాన్ని కోరిగూడా వున్నారు. కాని ప్రభుత్వం అప్పుడు అట్లా చెయ్యలేదు. గోవా, మొదలైన వలసలకు ఆ ప్రాంతాలలో ప్రజలే స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలిగాని, భారతదేశంమీద ఆధారపడి లాభంలేదని ప్రధాన మంత్రి, ప్రభుత్వము గూడా చెబుతూ వచ్చారు. (2) ఒకసారి భారతీయులు కొందరు గాంధీగారి పద్ధతులలో నిరాయుధులై గోవా సరిహద్దులను అతిక్రమించినప్పుడు, పోర్చుగీసు సైన్యంవారిని నిర్దాక్షిణ్యంగా కాల్చివేసింది. అప్పుడు, తాము, ఆ విషయంలో ప్రమేయం పెట్టుకోకపోవడానికి శ్రీ నెహ్రూ చెప్పిన కారణాలలో—అందువల్ల అంతర్జాతీయంగా చాలా విపరిణామాలు, విష ఫలితాలు సంఘటిల్లుతాయి—అన్నది. కాని 1961 లో ఆ వైఖరి అంతా మారిపోవడానికి కారణం ఏమిటి? ఇప్పుడు ఆ విషపరిణామాలు, విషఫలితాలు ఏమీ వుండవనా?

అప్పుడు శ్రీ నెహ్రూ మనస్సులో పెట్టుకున్న రకం పరిణామాలు వుండకపోవచ్చు కాని, వేరే రకమైన పరిణామాల సందర్భ పడటానికి ఎక్కడా ఆస్కారం కన్పించడం లేదా! ఉదాహరణకు—ఇప్పుడు చైనా—హిమాలయ ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాలపై మన హక్కును కాదంటున్నది. చైనా దృష్టిలో, ఆ ప్రాంతాలను, భారతదేశం, బ్రిటన్ ఏలుబడిలో వుండగా, అప్పటి పాలకులు ఆక్రమించుకున్నారు. అవి నిజానికి తనకు చెందినవి. ఇప్పుడు భారతదేశం ఆ ప్రాంతాలపై అధికారం చలాయిస్తున్నా, వాటిపై తనకు హక్కు వున్నదన్నా—శ్రీ కృష్ణ మీనన్ దురాక్రమణకు ఇచ్చిన నిర్వచనం ప్రకారం—అది దురాక్రమణ అవుతుంది. అటువంటిదురాక్రమణను గోవాలో, బలప్రయోగంతో భారతదేశం తొలగ బెట్టుకున్నప్పుడు, తాను మాత్రం ఎందుకు, ఆ ప్రాంతాలలో, భారతదేశం' "దురాక్రమణను" అదేవిధంగా తొలగబెట్టుకో కూడదు అని చైనా వాదించి, మనం గోవాలో చేసిన పనినే, హిమాలయ ప్రాంతపు సరిహద్దులలో చేస్తే, మనం ఏమి చేస్తాము. ఈ పరిస్థితి ఇట్లా రూపుపొందడం గ్రహించే, పాకిస్తాన్ చైనాకు సన్నిహితం అవుతున్నది ఈ రెండు రాజ్యాలు, భారతదేశంతో తమకు వున్న తగాదాలను, భారతదేశం పోర్చుగల్‌తోవున్న తగాదాను తీర్చుకున్నట్లే, తీర్చుకోదలిస్తే అప్పుడు పరిస్థితి ఏమిటి? గోవాపై భారతదేశం చర్యలను చైనా అభినందించడంలోవున్న అర్థం ఏమిటి?

ఈ ప్రశ్నతో మనం, భారత విదేశాంగ విధానం తాలూకు రెండవ మాత్ర పరామర్శలో ప్రవేశిస్తున్నాము. ఏ సందర్భంలోను యుద్ధం పనికిరాదని, యుద్ధంవల్ల ఏ సమస్యా పరిష్కారం కాదనీ—గదా— శ్రీ నెహ్రూ వాదము. ఇప్పుడు అన్ని ప్రయత్నాలు విఫలం అయిపోయిన తర్వాత—అది అణ్వస్త్ర యుద్ధానికి దారి తీయకుండావుంటే—ఒక సమస్యను పరిష్కరించుకోడానికి యుద్ధం సాధనం కావచ్చు అని శ్రీ నెహ్రూ క్రొత్త సిద్ధాంతాన్ని ప్రవచించారు ఇది చైనావారి ఆలోచనా పద్ధతికి చాలా సన్నిహితమైంది. అయితే వారు ఈ విషయాన్ని ఇంకా గట్టిగా చెబుతున్నారు కుండబద్దలుకొట్టి చెబుతున్నారు. వారి వాదం ఇది యుద్ధాలు రెండు రకాలు, ఒకటి ధర్మయుద్ధం రెండు అధర్మ యుద్ధం ధర్మ యుద్ధాన్ని సహజీవన సిద్ధాంతం వెలివేయదు. అందువల్ల యుద్ధం అవశ్యం భావికాదన్న వాదం చెల్లదు ధర్మ రక్షణంకోసం యుద్ధం తప్పక పోవచ్చు. ఈ వాదమే కొంచెం మృదువుగా, కొంచెం మారువేషంలో శ్రీ నెహ్రూ, గోవా పట్ల అనుసరించిన విధానంలో కన్పించే సరికి, చైనా శ్రీ నెహ్రూను, ఆయన చర్యను అభినందించింది అంటే శ్రీ నెహ్రూ ధర్మ పన్నములలో వచ్చిన మార్పును గమనించి, ఆ మార్పు తాము అనుసరిస్తున్న విధానానికి సన్నిహితం అయినందువల్ల, "సెభాష్! నెహ్రూ!"' అంది

ఇది చాలా పెద్ద మార్పు. ఇంతవరకు అంతర్జాతీయమైన అన్ని తగాదాలను శాంతియుతంగానే పరిష్కరించుకోవాలంటూ వచ్చిన భారతదేశం, ఇప్పుడు కొన్ని కొన్ని సమస్యల పరిష్కారానికి యుద్ధం గూడా మార్గం కావచ్చునంటున్నది. అనగా పాశ్చాత్యులు చెబుతున్న "పరిమిత యుద్ధ" సిద్ధాంతానికి, కమ్యూనిస్టు రాజ్యాల "ధర్మ యుద్ధ సిద్ధాంతానికి"—దీటయిన ఇంకో రకపు యుద్ధ సిద్ధాంతాన్ని శ్రీ నెహ్రూ ఈ సందర్భం మూలంగా ప్రవచించవలసి వచ్చింది అనగా, లక్ష్యములు, ఆ లక్ష్యసాధన మార్గములు ఒకే విధంగా పవిత్రంగా వుండాలనే సిద్ధాంతంపోయి, కొన్ని కొన్ని సందర్భాలలో, లక్ష్యాన్ని సాధించడానికి, పవిత్రేతర మార్గాలను గూడా అనుసరించవచ్చు నన్న సిద్ధాంతం ఇక్కడ అంగీకర్యమై ఒప్పుతున్నది. ఇది శ్రీ నెహ్రూగారు ప్రవచిస్తున్న అసలు సూత్రాలకు పూర్తిగా విరుద్ధం

శ్రీ నెహ్రూ విదేశాంగనీతిలో నేమి, రాజనీతిలోనేమి, ఇట్లా లక్ష్యలకు, లక్ష్యసాధన మార్గాలకు విసంవాదం ఏర్పడిన సందర్భాన్ని నిరూపించడానికి గోవా మొదలైన మాజీ పోర్చుగీసు స్థావరాలమీద భారత ప్రభుత్వం నడిపించిన సైనిక చర్యనే దృష్టాంతంగా గ్రహించవచ్చు అంతేగాక, ఒక లక్ష్యాన్ని సాధించదలచుకున్నప్పుడు, ఆ లక్ష్య సాధనమునందుగల అభినివేశం, తాత్సాధన మార్గాలను ఏవిధంగా రూపు పొందిస్తున్నదీ, ఆ సాధన మార్గాలకు, చెప్పే సిద్ధాంతాలకు ఎట్లా సంబంధం లేకుండా పోతున్నదీ గూడా ప్రదర్శించవచ్చు. గోవాలోను, ఇంకా ఇతరత్రా భారతదేశంలో తనకు వుండివున్న వలసలలోను, పోర్చుగల్ సైనిక బలాన్ని పెంచడం, ఈ స్థావరాలపై అవలంబించిన చర్యలకు ఒక కారణంగా శ్రీ నెహ్రూ ప్రభృతులు పేర్కొంటున్నారు. కాని, గోవా మొదలైన ప్రాంతాలలో పోర్చుగల్ ఆ బలాన్ని, అప్పుడు అట్లా పెంచడానికి, భారత ప్రధాని, ఈ సమస్యా పరిష్కారం నిమిత్తం, అవసరమైతే సైనిక బలాన్ని ప్రయోగించగలమని స్పష్టంగా ప్రకటించిన తర్వాతనే జరిగిందని మనం గుర్తుపుంచుకోవాలి. ఈ విషయాన్ని శ్రీ నెహ్రూ గూడా భగ్యంతరంగా ఒప్పుకున్నారు. గత అక్టోబరులో పోర్చుగీసు వలసలను గురించి జరిగిన చర్చా పరిషత్తులో తాను చేసిన ప్రకటనమే, పోర్చుగల్, గోవా మొదలైన స్థావరాలలో సైన్యాన్ని పెంచడానికి కారణం అయితే కావచ్చునని ఆయన ఒప్పుకున్నారు. అనగా గోవాలో, ఇంకా ఇతర స్థావరాలలో పోర్చుగల్ సైనిక బలాన్ని పెంచితే, అది ఆసరాగా చేసుకొని, దెబ్బ తీయవచ్చునన్న ఆలోచన, తెలిసిగాని, తెలియకగాని, ఆయన మనులో జరిగిందనే విశదం అవుతున్నది. ఆ పద్ధతిని, తన రాజనీతికి, విదేశనీతికి ప్రధాన సూత్రంగా ప్రకటించిన శ్రీ నెహ్రూ ఇప్పుడు ఈ పని చేశారంటే, ఇక్కడ లక్ష్యం ప్రధానమై, లక్ష్య సాధన మార్గం అప్రధానమై పోయిందని అంగీకరించవలసి వస్తున్నది. ఇట్లా అని గోవాకు విముక్తిని కల్పించడం తప్పనిగాని, ఆ విముక్తిని కల్గించినందుకు భారత ప్రభుత్వాన్ని విమర్శించడంగాని, నా అభిప్రాయం కాదు. ఈ జరిపిన చర్యలో దెబ్బతిన్న నీతి సూత్రాలు మాత్రమే ఇక్కడ పరిశీలించబడుచున్నవి. అంతేగాక, ఈ ఉదంతంవల్ల, మన నీతి సూత్రాలలో తోచిన పరిణామం ఎట్టిదో గూడా ప్రదర్శింపబడుతున్నది.

ఇప్పుడు ఈపైన పేర్కొన్న ఉదంతంవల్ల, యుద్ధాన్ని గురించి శ్రీ నెహ్రూ వైఖరిలో వచ్చిన మార్పువల్ల, మన విదేశాంగ విధానంలో ఇంకో మూలస్థంభం దాదాపుగా కూలిపోయింది. దురాక్రమణను ఎదుర్కొనేందుకు యుద్ధానికి దిగడం, అనగా ఆత్మరక్షణకోసం యుద్ధానికి దిగడం సబబైనప్పుడు, ఆ దురాక్రమణను ఎదుర్కొనడానికి, ఆ దురాక్రమణ భయం లేకుండా చేసుకోడానికి రక్షణ కూటములలో చేరినా, రక్షణ కూటములను కట్టుకున్నా, తప్పులేదు. ఎందుకంటే, ఈ రెండింటి అర్థము దాదాపు ఒకటే అయితే, ఒకటి· ఏమీ లేకుండా, దురాక్రమణ జరిగితే, ఆ దురాక్రమణను తొలగబెట్టడానికి అన్ని ప్రయత్నాలుచేసి, చివరకు యుద్ధానికి దిగుతానంటుంది. మరొకటి:అట్టి దురాక్రమణజరగకుండా చూచుకోడానికి, ముందుగానే, దురాక్రమణ జరిగేపక్షంలో, ఇది జరగబోతుంది గాబట్టి, జాగ్రత్తగావుండండని దురాక్రమణదారులకు హెచ్చరికచేస్తూ, హెచ్చరికగా వుంటుంది. ఇది ఒక భేదం. ఇంకో భేదం ఏమిటంటే, పెద్ద ఎత్తు దురాక్రమణని తట్టుకోలేని రాజ్యాలు, తమ అశక్తతను తెలుసుకొని, వాస్తవ పరిస్థితులేమిటో గ్రహించి, సైనిక కూటాలలో చేరుతున్నాయి. వాటిని కాందంటున్న మనం, ఆ యా రాజ్యాల అండమీద ఆశలు పెట్టుకొని, వాస్తవానికి దూరమైన భావ లోకంలో విహరిస్తూ, సైనిక కూటాలు కట్టడం, వాటిల్లో చేరడం పాపం అని ధర్మోపన్యాసాలు చేస్తున్నాము. ఇక్కడ ఒక్కవిషయాన్ని ఆలోచించవలసివుంటుంది. కమ్యూనిస్టు చైనా, భారతదేశం సరిహద్దులపై సైనిక బలాన్ని ప్రయోగం చేస్తుంది అనుకుందాము. శ్రీ నెహ్రూ పార్లమెంటులో అంగీకరించిన దాన్నిబట్టే, ఆ ధాటిని తట్టుకోగల శక్తి మనకు అంతగాలేదు. అందువల్ల—ఒకవేళ చైనా ఎత్తివస్తే—మనం చేసేదేమిటి?—ఈ ప్రశ్నకు భారత ప్రభుత్వాన్ని నడుపుతున్నవారి ఆలోచన ఈవిధంగా వున్నట్లు కన్పిస్తున్నది.—చైనా—రష్యాలకు పడటంలేదు. సిద్ధాంతాలలోను, ఇంకా ఇతర విషయాలలోను కూడా ఈ రెండు దేశాలూ తలపట్లుపట్టుకుంటున్నాయి అందువల్ల, భారతదేశం స్నేహాన్ని ఆకాంక్షిస్తున్న రష్యా, చైనా గనుక ఆపని చేస్తే, అడ్డుపడుతుంది చైనా దురాక్రమణ చికీర్షతను అదమాయిస్తుంది— ఈరకంగా ఆలోచిస్తున్నట్లు తోస్తుంది. కాని ఈ వూహ అంతగా ఆశలు పెట్టుకోవలసిన వూహగా కన్పించదు. అందుకు బహు కారణాలు వున్నాయి. (1) భారతదేశంపై చైనా జరిపిన దురాక్రమణని, రష్యా ఇంతవరకు గట్టిగా ఖండించలేదు. (2) చైనా సాగించిన ఈ దురాక్రమణ ప్రయత్నాలను ఆపలేకపోయింది. (3) ఈ దురాక్రమణ విషయంలో చైనా వైఖరిలో మార్పును తెచ్చిపెట్టలేకపోయింది. (4) అన్నింటికిమించి, ఇంతవరకు రష్యా, చైనాకు వ్యతిరేకంగా, భారతదేశం పక్షం వహించి వ్యవహరించలేకపోయింది. (5) కమ్యూనిస్టు దేశాలు తమలో తాము ఎంతో పోట్లాడుకున్నా, యుద్ధము, శాంతి మొదలైన సమస్యలు తటస్థపడ్డవేళకు వారి బుద్ధులు ఒక్కటిగానే పని

చేస్తాయి. (6) చైనా, రష్యా తగాదా ఆసియాలోని కమ్యూనిస్టులపై ఎవరి "హెజిమని" చెల్లాలన్న విషయాన్ని గురించి సాగుతోంది ఇందులో భారత కమ్యూనిస్టుపార్టీతో సంబంధం వుంటుందిగాని, భారతదేశాన్ని అంతటిని గురించి, రష్యా పెద్దగా ఆలోచిస్తుందనుకొనడం, ఎండమావుల దగ్గరకు నీళ్ళ కోసం పరుగెత్తుస్నట్లే వుంటుంది

ఇవిగాక, ఇంకో ముఖ్యకారణం గూడా ఇక్కడ వున్నట్లు అనుమానించవలసి వస్తున్నది భారతదేశం తాను తటస్థ రాజ్యాన్ని అంటున్నది ఇటువంటి రాజ్యాలు ఇంకా కొన్ని ప్రపంచంలో తల ఎత్తుతున్నాయి ఈ రాజ్యాలలోకల్లా భారతదేశం పెద్దది ఇది ఒక కూటమిగా ఏర్పడే పక్షంలో, కమ్యూనిజం వ్యాప్తికి కొంత అవరోధం కల్గుతుంది ఎందుచేతనంటె, ఈ రాజ్యాలన్నీ, జాతీయవాదంతో సోషలిజాన్ని మిళితంచేసి, వ్యవహరిస్తున్నాయి ఈ రకం సోషలిజాన్ని ఐరోపియ సామ్యవాద పరిభాషలో మొదట సోషల్ డెమోక్రసీ అన్నారు తర్వాత డెమోక్రాటిక్ సోషలిజం అన్నారు లెనిన్—ఐరోపీయ సోషల్ డెమాక్రసీని "యెల్లో సోషలిజం" అని విమర్శించారు ఆ విమర్శ ప్రకారం ఇప్పుడు కొన్ని కొన్ని తటస్థ దేశాలు, ముఖ్యంగా భారతదేశం అనుసరిస్తున్నపద్ధతిసామ్యవాదం విధిగా "యెల్లో సోషలిజం" కావాలి ఇట్టి సోషలిజంను అనుసరిస్తున్న దేశాలలో భారతదేశం పెద్దది, శక్తివంతమైనది గనుక, దానిమీద ఒత్తిడిని తెచ్చిపెడితే, ఆ తాటస్థ్యం పసందే గాక, ఆ సోషలిజం పసందు, ఆ సోషలిజంను అంగీకరిస్తున్న రాజ్యాల పసందు గూడా బయటపడుతుంది! అనగా ఈ సిద్ధాంతంతో, భారతదేశం ఎన్ని రాజ్యాలను కట్టుకోగల్గుతుంది అన్నది తేలిపోతుంది కాబట్టి చైనా ఆ విషయాన్ని తేల్చడానికి పూనుకుంది అందుకు ఈ సరిహద్దు తగాదాకన్నా మంచి తగాదా ఇంకొకటిలేదు భారతదేశాన్ని అనుసరిస్తున్నట్లు ప్రపంచం భ్రమిస్తున్న రెండు రాజ్యాలు, ఈ సరిహద్దు తంత్రంలో ఇరుక్కొని వున్నాయి ఈ తగాదా రేపితే, ఇందులో ఎన్ని దేశాలు భారతదేశం వెనక నిలుస్తాయి? 1954 అనంతరం చరిత్ర పరిశీలిస్తే, ఏ దేశమూ నిల్వలేదని తేటతెల్లం అవుతుంది బర్మా దారిని బర్మా, నేపాల్ దారిని నేపాల్, సరిహద్దులను గురించి చైనాతో ప్రత్యేక సమాధానాలు వ్రాసుకున్నాయి. అందుకు చైనా వారికి కితాబు గూడా ఇచ్చింది ఒక్క భారతదేశం ఒక్కటే ఈవిషయంలో మొండిగా వ్యవహరిస్తున్నదని చైనా ప్రకటన గూడా చేసివుంది అనగా, ప్రజాస్వామ్య సోషలిజం ద్వారా కట్టుకోవచ్చుననుకున్న సహవాసం భారత దేశానికి కలిసిరాలేదు. పైగా ఈ తటస్థ దేశాలన్నవి కలిసి కట్టుగా వ్యవహరించగల రాజ్యాలు కావని, వేటి అవసరంకొద్దీ, అవి వ్యవహరిస్తూ వుంటాయనీ తేలిపోయింది

ఇక భారతదేశం అనుసరిస్తున్న తాటస్థ్యాన్నిగాని, ఇతర దేశాల తాటస్థ్యాన్నిగాని, చైనా ఎంతమాత్రం విశ్వసించడంలేదు ఈ తాటస్థ్యం అన్నది ఒక పెద్ద "నాటకం" అని చైనా అభిప్రాయం—రష్యా అభిప్రాయం గూడా అదేగాని, ఆలోచనలో మాత్రం కొంత తేడా వుంది "సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పని చేస్తేనే తటస్థ రాజ్యాల అవసరం, లేకపోతే లేదు" అని ఒకానొక కమ్యూనిస్టు నాయకుడు అన్నాడు రష్యా ప్రధాని శ్రీ కృశ్చేవ్ అభిప్రాయం గూడా ఇందుకు ఎంతమాత్రం భిన్నంగాలేదు "మీరు సోషలిజంను వాంఛిస్తున్నారా? కమ్యూనిజం అంటే వ్యతిరేకిస్తున్నామని అనకూడదు" అని శ్రీ కృశ్చేవ్ ఒకప్పుడు తన్ను కలుసుకున్న ఈజిప్షియన్ ప్రతినిధివర్గంతో అన్నారు అంటే అర్థంఏమిటి? జాతీయ వ్యవహారాలలోనూ, అంతర్జాతీయ వ్యవహారాలలోను, కమ్యూనిస్టు వ్యతిరేక వైఖరిని అవలంబించకుండా వున్నంతవరకే, ఈ తటస్థ రాజ్యాలు కమ్యూనిస్టు రాజ్యాలకు ప్రయోజనకారులవుతూ వుంటాయి. అందుకే రష్యా ప్రభృతి రాజ్యాలు భారతదేశంవంటి తటస్థ రాజ్యాలను చాలా విషయాలలో బలపరుస్తున్నట్లు నటిస్తున్నాయి అట్లా బలపరచినందువల్ల వారికి వచ్చిన నష్టం ఏమీలేదు ముఖ్యంగా వలస రాజ్యాధికార విధాన ఖండన, సైనిక కూటముల నింద, ఆఖరికి నిరాయుధీకరణ మొదలైన సమస్యల విషయంలో కమ్యూనిస్టు రాజ్యాలు భారతదేశాని బలపరిచడంలోను భారత

దేశం ప్రతిపాదనలను అభినందించి, అట్టి ప్రతిపాదనలు చేసినందుకు సంతోషించడంలోను ఆశ్చర్యపడవలసింది ఏమీలేదు ఎందుచేతనంటే భారతదేశం తాను చేసే ప్రతిప్రతిపాదన రష్యాకు కోపం రాకుండా వుండేవిధంగా చేయవలసివుంది. ఇంతవరకు సమితిలోగాని, ఇతరత్రాగాని చరిత్ర అట్లాగేవుంది హంగరీ సమస్య వచ్చినప్పుడు, భారతదేశంఈ వైఖరి బాగా విద్యమానం అయింది నిరాయుధీకరణం విషయంలోను, అణ్వస్త్ర పరీక్షల వ్యవహారంలోనూ, గూడా తన ప్రతిపాదనలవల్ల, మాటలవల్ల రష్యాకు కోపం రాకుండా చూచుకునే ధోరణి గోచరం అవుతున్నది. ఇందుకు ప్రత్యామ్నాయంగా రష్యా మనకు చేస్తున్న మేలు ఒక్కటే వుంది. అది అవసరమైనప్పుడు, అనగా కాశ్మీర్ సమస్య చర్చకు వచ్చినప్పుడు సందర్భోచితంగా విటోను ఉపయోగిస్తున్నది ఇంతమాత్రంచేత భారతదేశం అంటే రష్యా ప్రేమ ఒలికిపోతున్నదనిగాని, తటస్థ దేశాలంటే వల్లమాలిన గౌరవం చూపిస్తున్నదనిగాని అనుకోడానికి వీలులేదు అట్లా వీలులేదని, బెల్గ్రేడ్ తటస్థ రాజ్యాల సమావేశానికి ముందు, భారతదేశం, ఇంకా ఇతర తటస్థ రాజ్యాలు, అణ్వస్త్ర పరీక్షలను వ్యతిరేకిస్తున్నాయి అని తెలిసి గూడా, రష్యా, ఆ పరీక్షలు కొనసాగించింది ఆ తర్వాత సమితిలో ఆ పరీక్షలను ఖండిస్తూ జరిగిన చర్చలలో మనం నిర్వహించినపాత్ర అంత ఉన్నతంగా ఉన్నదని చెప్పడానికి వీలు లేదు

ఇందుకు కారణం ఏమిటి? మన తాటస్థ్యం గూడా తాటస్థ్యం కాని పరిణామాన్ని చెందింది. సరిహద్దులలో చైనాతో తగాదా మూలంగా, రష్యాను అంటకాగాలన్న భావం ఒకటి మన అధినేతల మనస్సుయొక్క అంతరాంతరాలలో మెదులుతూవున్న కారణంచేత, ఆ ఒక్క ఆలోచనే మన అన్ని ఆలోచనలపీద ఏలుబడి సాగించే స్థితిలోకి వచ్చివేసింది రష్యాకు కోప కారణం అయ్యే ఏ పని చేసినా, అది చైనాతో మనకువున్న తగాదాలో, మనల్నిగాక, చైనానే బలపరుస్తుందేమోనన్న మనస్థితి ఏర్పడ్డ కారణంవల్ల, మన సర్వమైన ఆలోచనలు తదభిముఖంగా కొనసాగుతున్నాయి 1960 లో సమితి సమావేశం అగ్ర నాయక స్థాయిలో జరగాలని రష్యా సూచించినప్పుడు, ఈమధ్య జనీవాలో 18 రాజ్యాల నిరాయుధీకరణ సమావేశం గూడా అధినాయక స్థాయిలో జరగాలని రష్యా సూచించినప్పుడు, ఇతర రాజ్యాల అభిప్రాయాలతో, ఆలోచనలతో, లేకపోతే అప్పటి అంతర్జాతీయ పరిస్థితులతో సంబంధం లేకుండా, భారత ప్రధాని ఆ ప్రతిపాదనలను బలపరచడం జరిగింది అనగా, ఈరకం సూచనలతో ఏకీభవించని రాజ్యాలను ఇరుకున పెట్టడం జరిగింది అందువల్ల, ఆ ఇతర రాజ్యాలు, భారతదేశం ఈ తాటస్థ్యం రష్యాకు అనుకూలంగా మాత్రమే పని చేస్తున్నదిగాని, ఇంకోవిధంగా పని చేయులేకపోతున్నది అంటే, అందులో తప్పు ఎంత మాత్రం కన్పించడంలేదు

ప్రతిదేశం విదేశాంగ విధానమూ, ఆదేశం యోగ క్షేమాలను దృష్టిలో పెట్టుకొని, వాటిని కాపాడుకుంటూ, ప్రపంచంయొక్క సుస్థితిని కాపాడుకుంటూ వుండటానికి రచింపబడుతూ వుంటుంది అగ్రరాజ్యాలు అన్నవి తమ యోగ క్షేమానుగుణంగా సకల ప్రపంచము నడుచుకుంటూ వుండాలని అనుకుంటూ వుంటాయి ఇది ఇట్లా జరుగుతూ వుండటాన్ని మనం చూస్తూనే వున్నాము అయితే, ఇంకా వెనకబడివుండి, ప్రపంచ రాజకీయాలలో గట్టి ముద్రను వేయడానికి తగిన ఆర్థికసోమత్తుగాని, సైనికబలంగాని లేని రాజ్యాలు, ముఖ్యంగా ముందు తమ క్షేమాన్ని, తర్వాత ప్రపంచ క్షేమాన్ని చూచుకోవలసి వుంటుంది ఇందులో ప్రపంచ క్షేమం విషయంలో ఈ రకం రాజ్యాలు చేయగల్గింది ఆట్టే ఏమీ వుండదు ఆ భారం అంతా బలంవున్న రాజ్యాలమీద వుంది ఆ రాజ్యాలు ఏపని చేయతలపెట్టినా, ఈ రాజ్యాలు ఆపలేవు ఈ విషయం గూడా ఇటీవలి చరిత్ర రుజు చేస్తూనేవుంది పోతే ప్రపంచం ఇంకా వున్నది వున్నట్లుగావుంది అంటే, అందుకు ఈ అల్ప రాజ్యాలు ఎంతమాత్రం కారణంకాదు ఒక అగ్ర రాజ్యంమీద ఇంకో అగ్రరాజ్యం అంకుశంగా వున్నందువల్లనే, ప్రపంచం ఇంకా బ్రతకగల్గుతున్నది ప్రపంచం మనుగడలోవున్న అసలు రహస్యం ఇది ఇందులో తమ అవసరంకొద్దీ, ఆ యా అగ్ర రాజ్యాలు, ఈ అల్ప రాజ్యాలను, అవి ఏ రకంవి అయినా, వాడుకుంటూ వుంటాయి ఇట్టి పనులకు భారతదేశం బాగా ఉపయోగపడుతున్నది ప్రపంచంలో ఎక్కడ "యుద్ధ విరమణ" అన్నా, మనం తయారు. మన సైన్యం తయారు. ఇంతకు మించి అంతర్జాతీయ రంగంలో మనం సాధించింది ఏమీలేదు ఇంతకీ భారతదేశంవంటి రాజ్యాలు, అగ్ర రాజ్యాల తగాదాలలో తాటస్థ్యం వహించివుంటే, కొంత సుఖంవుంది అన్న వాదం ఒకటి వుంది కాని, అది ఈ ప్రపంచంలో అంతగా సాసగే విషయంకాదు కాబట్టి మరో రకమైన తాటస్థ్యాన్ని అనుసరించడం జరుగుతున్నది అగ్ర రాజ్యాల లంపటాలలో తల దూర్చకుండా, ఎప్పుడు ఏ సమస్యవస్తే, అప్పుడు దాని బాగు వోగులనుబట్టి, ఈరకం రాజ్యాలు తమ విధానాన్ని నిర్ణయించుకుంటాయన్నదే, ఈ రకం తాటస్థ్యం అర్థం అందువల్ల, ఈ రకం తాటస్థ్యం ఒక పద్ధతి, ఒక క్రమంలేక 'ఎప్పటి కెయ్యది ప్రస్తుత, మప్పటికా మాటలాడి—" అన్న సుమతీశతకకారుని అవకాశవాదంక్రిందకు దిగజారిపోతోంది అంతేగాక, మనం ఆ యా దేశాలలో బలపరుస్తున్న "యుద్ధ విరమణ" వ్యవహారం లాగానే, ఈవిధానం గూడా నిలకడలేనిది, ప్రయోజనకారికానిది అవుతున్నది అంటే విఫలం అవుతున్నది

ఈ విధానంవల్ల ప్రపంచంలో మనకు మిత్రులు అని చెప్పుకోతగినవారు ఎవ్వరూ ఏర్పడలేరు కాని, ఈ విచిత్రస్థితే, ప్రపంచంలో అంతా మన మిత్రులే అనే అజాతశత్రుత్వ వాదానికి దారితీసి, మనం నిజంగా అట్టి వాళ్ళమే కావుల్ను అనే భ్రాంతిలో పడవేసి, ఆ విధానమూ నిష్ప్రయోజకమౌతున్నది, మనల్ని నిష్ప్రయోజకులను చేస్తున్నది కారణం ఏమంటే, తగినంత బలం వున్నప్పుడు అనుసరించవలసిన విధానాలను, మనం ఆ బలం లేకుండా అనుసరిస్తున్నాము అందువల్ల, అది వేళ్ళతన్నిచెట్టులాగా తయారై, తాను నిల్వలేక, ఇతరులను నిల్వలేక, సవమతంఅవుతున్నది ఏ సమస్యవచ్చినా, స్పష్టమైన ఆలోచన చేయడంగాక, మధ్యమ మార్గంలో ఆలోచన చేయడం, మధ్యమ మార్గపు పరిష్కారాలను సూచించడం జరుగుతున్నది విచిత్రమేమంటే, అదే రకం సమస్యలను మనమై ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు, ఆ మధ్యమ మార్గాలు మనకు పనికి రావడం లేదు ఇట్టి విరుద్ధ లక్షణాలతో నిండివున్నందువల్లనే, ఈరకం తాటస్థ్యంతో మనం ఏమీ సాధించలేకపోతున్నాము

అసలు ఈ విధానం వెనుకవున్న తాత్వికధార ఏమిటో ఎక్కడిదో అర్థం చేసుకునే పక్షంలో, ఇది ఇట్లా ఎందుకు వుంటున్నదో, దీని పర్యవసానం ఏమిటో అర్థం అవుతుంది మొదట ఈమధ్యమ మార్గాన్ని జీవన ధర్మంగా ఆలోచించినవాడు బుద్ధుడు తనది మధ్యమ మార్గం అని ఆయనే చెప్పుకున్నాడు ఆ మధ్యమ తత్వంలో గూడా, ఇప్పుడు మనం అనుసరిస్తున్న తటస్థ పద్ధతినే అనుసరించడం వుంది తాత్విక విషయాలలో ఎట్లావున్నా, రాజకీయాలకు సంబంధించినంతవరకు బుద్ధుడు ఇట్టి వైఖరి—అనుసరించాడు అప్పుడు ఉత్తర భారతంలో వివిధ ప్రాంతాలను ఏలిన రాజులు—బింబిసారుడు, ప్రసేనజిత్తు, ఇంకా ఇతరులు— వున్నారంటే వారిలో ఒకరంటే ఒకరికి పడేదికాదు ప్రతి ఒక్కరు ఏకచ్ఛత్రాధిపత్యం కోసమే ప్రయత్నం చేశారు అందుకోసం యుద్ధాలూ చేశారు బుద్ధుడు ఈ యుద్ధాల విషయంలో, ఈ రాజుల తగాదాల విషయంలో గూడా మధ్యమ మార్గాన్నే అనుసరించాడు ఆ మధ్యమ మార్గం 'వజ్జియ' గణ రాజ్యం, బింబిసారుని పుత్రుడు, అజాతశత్రుని చేతుల్లో నాశనం అయిపోడానికి గూడా కారణం అయింది ఈ ఉదంతం "మహా పరినిబ్బాణ సూత్రం"లోను, జైనుల కథలలోను చెప్పబడివుంది ఇప్పుడు ఆ మధ్యమ మార్గ సిద్ధాంతాలే మన విదేశాంగ నీతికి కొంతవరకు ఆధారం అవడంచేత, దానికి వలెనే, ఇది గూడా నిర్వీర్యము, నిష్ప్రయోజకము, పైపెచ్చు, ప్రమాద భూయిష్టముగా తయారవుతున్నది అక్కడ ఆ ప్రమాదం ఎవరివల్లనో, ఎవరికో వచ్చింది ఇక్కడ ఆ ప్రమాదం, మనవల్ల, మనకే వచ్చేట్టువుంది ఇంతే తేడా

పండిత జవహర్‌లాల్ నెహ్రూగారికి, తాను బుద్ధుడంత కాకపోయినా, అశోకుడంత అవుదామనన్నా వుంది ప్రపంచంలో శాంతి తనవల్ల ఏర్పడింది అన్న పేరు తెచ్చుకోవాలన్న అభిలాషవుంది అట్లా వుండటం మంచిదే గూడాను కాని ఇది అశోకుడినాటి కాలంగాని, బుద్ధుడినాటికాలంగాని కాదు ఆ కాలానికి సరిపోయిన ధర్మాలు ఈ కాలానికి సరిపోవు అందుకే అవి పని చెయ్యవు అశోకుడిలాగా లోకాన్నీ దిద్దాలి అంటే, పరిస్థితులన్నీ, అశోకుడి కాలంనాటివిలాగా వుండాలి. అవి అట్లా లేనందువల్ల, మనం చేసే ఆలోచనలకు అప్పటి ఆలోచనలు ఆధారం కావడంవల్ల, అవి కాలానికి పట్టక, పరిస్థితులకు అనుకూలంకాక, మనల్ని, మన దేశాన్ని గూడా స్వప్నంలో విహరింప జేస్తున్నాయి.

రాజవాహనవిజయం

శ్రీ బులుసు వేంకటరమణయ్య

లలిత లలితాలైన దేశ్య పదాలతోపాటు, అన్యదేశ్య పదాలను గుప్పించి, రసవంతంగా ప్రబంధాలు రచించిన తెలుగుకవులలో కాకమాని—మూర్తికవి ప్రసిద్ధుడు ఇతడు పాంచాలీ పరిణయం, రాజవాహన విజయం, బహుళాశ్వ చరిత్ర అనే మూడు ప్రబంధాలను రచించాడు. వీటిలో మొదటి రెండూ లభించినవి. లక్షణ గ్రంథాలలో ఉదాహరణంగా ఇచ్చిన పద్యాలుతప్ప, బహుళాశ్వ చరిత్రం లభించినట్లు కానరాదు

మూర్తికవి పాంచాలీ పరిణయాన్ని శ్రీరంగనాథునికీ, రాజవాహన విజయాన్ని శ్రీ వేంకటేశ్వరునికీ అంకితం ఇచ్చాడు. పాంచాలీ పరిణయంలో కృతిభర్త తన్ను గూర్చి పలికినట్లు చెప్పికొన్న

"అల్లసానివాని యల్లిక బిగిసొంపు
ముక్కు తిమ్మనార్యు ముద్దుపలుకు
పాండురంగవిభుని పద్యంబు హొరువును
కాకమానిరాయ! నీకె కలవు"

అనే పద్యాన్నిబట్టి సుప్రసిద్ధ ప్రబంధ కవుల పోకడల నన్నిటినీ మూర్తి కవి అలవరించుకున్నట్లు తెలుస్తున్నది

ఇతని కాలాన్ని స్పష్టంగా నిర్ణయించడానికి తగిన ఆధారాలు లేవు కాని, శ్రీ కృష్ణదేవరాయలకాలంనాటి అల్లసాని పెద్దనను, ముక్కు తిమ్మనను, తెనాలి రామకృష్ణునీ పేర్కొనుటవల్ల వారి తర్వాతివాడని విశ్వయించవచ్చు. రాజవాహన విజయం పంచమాశ్వాసంలోని "చేతికైదేసి మేల్ శివరాయల వరాల, నెల కట్టడల పటాణీల్ గరీబులు"(ప—16) అనే చోట ఉన్న 'శివ రాయల వరాల' వల్ల సదా శివరాయల కాలంలో చెలామణిలోవున్న వరహాలను గ్రహించవలసి వున్నదనీ, దానినిబట్టి కాకమాని మూర్తికవి క్రీ శ 1568 కి తర్వాతివాడై ఆయివుండవచ్చునని దీని పీఠికలో శ్రీ నందిరాజు—చలపతిరావుగారు తెలియజేసి ఉన్నారు

ఈ కవి తన గ్రంథాన్ని భగవంతుడగు వెంకటేశ్వరునికి అంకితం యిస్తూ, రాజులు చాలా క్రూరాత్ములనీ, ధనంకోరి వారిని ఆశ్రయించినా ప్రయోజనం వుండదనీ వివరిస్తూ,

'వ్యాళస్వాంతు లశాంతు లజ్ఞ సతతై
కాంతుల్ మహా చేటికా
శ్రీలోపద్రవనవ్య పత్రికులు భూ
రిప్రాజ్ఞ విజ్ఞాపనా
వేళా కల్పిత రక్త వక్త్రులు కళా
విజ్ఞాన నిర్భాగ్యు లీ
కాల క్ష్మాతలనేతలం బొగడుటల్
కష్టంబు లర్థార్థికిన్?'

అని చెప్పియున్నాడు. దీనినిబట్టి మూర్తికవి రాజులను ఆశ్రయించి, వారికి గ్రంథాన్ని దేనినయినా కృతియిచ్చి, ధనాన్ని సంపాదించదలచినట్లూ, తన కోరిక సఫలం కాకపోగా, ఆ రాజులమీద కోపంతో యిలా చెప్పినట్లూ వూహించడానికి వీలుంది ఇలాంటి సంకల్పమే లేకపోతే 'కాలక్ష్మాతలనేతలం బొగడుటల్ అర్థార్థికి కష్టంబులు' అని చెప్పి వుండడు ఇలాటి సంఘటనవల్ల వైరాగ్యం కలిగి అతడు తన గ్రంథాలను భగవదంకితాలుగా చేసి వుండవచ్చును

రాజవాహన విజయం అయిదాశ్వాసాల ప్రబంధం. దీనిలోని కథాంశం యిదీ—

కుసుమపురం ముఖ్యపట్టణంగా మగధదేశాన్ని రాజహంసుడనేరాజు పాలిస్తూ వుండెను అతని భార్య వసుమతి ఆ దంపతులకు చాలాకాలంవరకూ సంతానం కలగలేదు ఒకనాటిరాత్రి భగవానుడగు శ్రీకృష్ణుడు వసుమతీదేవికి స్వప్నంలో ప్రత్యక్షమై సంతాన ఫలాన్ని ప్రసాదించగా, ఆమె గర్భాన్ని ధరించి సుపుత్రుని ప్రసవించింది ఆ బాలునికి రాజవాహనుడని పేరు పెట్టబడింది.

రాజవాహనుడు దినదినాభివృద్ధిపొందుతూ, పెరిగి పెద్దవాడై సమస్త విద్యలూ నేర్చుకొన్నాడు అస్త్రవిద్యలో ఆరితేరి మహా వీరుడనీ, అరి భయంకరుడనీ పేరు సంపాదించాడు తండ్రి, అతనికి బంధువర్గంలోని ఉత్తమవంశ జాత అయిన కన్యనిచ్చి వివాహంచేసి, యౌవరాజ్య పట్టం కట్టాడు తర్వాత తనకు కట్టవలసిన కప్పం కట్టకుండా ఉపేక్షించిన పాండ్యరాజుపైకి రాజహంసుడు సైన్యంతో కూడా కుమారుని పంపాడు. భర్తయొక్క ప్రతాపాన్ని కళ్లారా చూచి, ఆనందించడానికి యువరాణి కూడా బయలుదేరినది. ఆమెకు అంగరక్షకుడుగా ఆమె సోదరుడూ ఆమె ననుసరించాడు.

రాజవాహనుడు సమస్త సైన్యాలతోనూ, దిగ్విజయంకోసం ఉత్తర దిక్కునకుబయలుదేరివెళ్ళి, పరాక్రమం చూపి, చాలామంది రాజులను ఓడించి, వారి దుర్గాలను స్వాధీనం చేసుకున్నాడు కుంతల, సింధు, సౌరాష్ట్ర, గంధార, గౌడ, మత్స్యదేశాధిపతులూ, కాశీరాజూ అతనిని శరణుజొచ్చినారు రాజవాహనుడు వారందనీ అనుగ్రహించి, వారివల్ల కప్పములను గ్రహించి, శాండిల్య మహాముని ఆశ్రమానికి వెళ్లి, ఆ మహామునిని దర్శించి, ఆతని ఆతిథ్యం స్వీకరించి, ఆ రాత్రి అక్కడే గడిపాడు

మరునాడు ఉదయమే ఒక చెంచుదొర ప్రార్థించగా అడవిలోనికిపోయి, క్రూరమృగాలను వేటాడి, విశ్రాంతికై అక్కడికి సమీపంలోవున్న ఒక ఉద్యానవనానికి వెళ్లాడు. అది మాళవ దేశాధీశ్వరుడైన మానసారుడిది. అప్పుడు ఆ పూలతోటలో లోకోత్తర సౌందర్యవతిఅయిన రాజకుమార్తె—అవంతిసుందరి చెలికత్తెలతో కూడా విహరిస్తూ ఉన్నది. ఆమె రాజవాహనుణ్ణి చూచింది ఇతడూ ఆమెను తిలకించాడు. ఇద్దరికీ పరస్పరానురాగం అంకురించినది. ఇంతలో తల్లివచ్చి పిలవగా, అవంతి సుందరి ఆ స్థలం విడవలేక విడవలేక వెనుకకు మరలి చూస్తూనే అంతఃపురానికి వెళ్లినది.

తర్వాత రాజవాహనుడూ, అవంతి సుందరీ కూడా విరహవేదనతో మిక్కిలి బాధపడ్డారు. అవంతీసుందరి చెలికత్తె బాలచంద్రిక రాజవాహనునివద్దకు వచ్చి తనచెలి వృత్తాంతాన్ని వివరించినది. రెండు, మూడు దినాలలో తన ప్రతాపాన్ని మాళవరాజుకు చూపి, అతన్ని లొంగదీసుకుని అవంతి సుందరిని స్వీకరిస్తానని రాజవాహనుడు సమాధానమిచ్చి, బాలచంద్రికను సత్కరించి పంపివేశాడు.

తర్వాత రాజవాహనుడు సేనలు కూర్చుకుని మాళవరాజుమీదికి వెళ్లగా, ఆ రాజు తన కుమారుడైన దర్పసారుని యుద్ధానికి పంపాడు కొంతసేపు పోరు ఘోరంగా జరిగింది. దర్పసారుని సైన్యం వెనక్కు తగ్గినది. రాజవాహనుడు అతనిని కోటదాకా తరిమి, మర్నాడు "సర్వలగ్గ" అని ప్రకటించాడు ఈ సంగతి మాళవరాజు తెలుసుకుని "యిక లాభంలే" దనుకుని మైత్రిని ప్రకటిస్తూ, రాజవాహనునివద్దకు రాయబారులను పంపాడు రాయబారం తెచ్చిన మంత్రులు తొలుత కానుకలు యిచ్చి, వినయ విధేయతలు ప్రకటించి, జరిగిన సంఘటనకు గ్రహగతి తప్ప మరొకటి కారణం కాదనీ, తమ రాజు తన పుత్రిక అవంతిసుందరిని మగధయువరాజునకు యిచ్చి, వివాహం చెయ్యాలని యెప్పుడో సంకల్పించుకున్నాడనీ, ఈ సంగతి తెలుపుటకు మీకు వార్త పంపాలని అనుకొంటూవుండగా, మీరే రావడం ఎంతో మేలనీ చెప్పి, పంచవిహాటి

రాత్రికి వివాహ ముహూర్తమని, అప్పటికి సర్వ సన్నాహంతో తప్పక దయచెయ్యాలని ప్రార్థించినారు. అనుకొన్న ముహూర్తానికి అవంతిసుందరీ రాజ వాహనులకు వైభవంగా వివాహం జరిగింది. తర్వాత రాజవాహనుడు అవంతిసుందరితో తన బనకువచ్చి, నిదాఘకాలం సుఖంగా అక్కడనే గడిపి, ఉత్తర వార్ధికడ జయ స్తంభము నిలిపి, నిజకాంత సైన్యములతో కూడా రాజధానికివచ్చి, తలి దండ్రులకు ఎంతో ఆనందాన్ని కలిగించాడు. ప్రజలు మెచ్చుకోగా రాజ్యాన్ని పాలిస్తూ, సుఖంగా ఉండినాడు.

ఈ కథాంశాన్ని గూర్చి శ్రీ వంపతిరావుగారు పీఠికలో "ఇందలి యితి వృత్తము స్వకపోలకల్పితమువలె కానుపించుచున్నది. దీనికి సంస్కృత మాతృక కానుపింపదు. సామాన్య నైసర్గిక విషయములనే గైకొని యత్యంత రమణీయమైన కథా శరీరమును గల్పించి సాహిత్య రసపిపాసువులకు నితాంతానందమును సమకూర్చుటలో నీ కాకుమానికవి చూపిన భావనాశక్తి కళావైదగ్ధ్యము అతిలోక రమ్యముగా నున్నది"అని వ్రాసినారు కాని, దీనికి మూలం లేకపోలేదు దండి మహాకవి సంస్కృతంలో రచించిన దశ కుమార చరిత్రలోని ప్రధానకథే దీనికి మూలం దీనికి సంబంధించినంతవరకూ ఆ మూల గ్రంథంలోని కథ యిది—

"పుష్పపురం అనే పట్టణం రాజధానిగా మగధదేశాన్ని రాజహంసుడనే రాజు పాలిస్తూవుండెను. ఆయన భార్య వసుమతి ఒకప్పుడు మాళవరాజైన దర్ప సారుడితో రాజహంసునికి యుద్ధం సంభవించింది. అందు మాళవ రాజు వోడిపోయి, బంధింపబడెను. రాజహంసుడు దయతలచి, అతని రాజ్యాన్ని ఇచ్చివేసినాడు.

రాజహంసుడు సంతానంకోసం భగవంతుడైన నారాయణుని పూజింపగా, తదనుగ్రహంవల్ల వసుమతీదేవి గర్భాన్ని ధరించినది.

అవజయ వరాభూతుడైన మానసారుడు శత్రువుపై పగసాధించడం కోసం మహేశ్వరుని గురించి గొప్ప తపస్సుచేసి, గొప్ప గదను సంపాదించి మగధ రాజుపైకి వచ్చి, అతనిని ఓడించి, రాజ్యాన్ని ఆక్రమించాడు. రాజహంసుడు ససైన్యంగా అడవులపాలు కావలసివచ్చింది. రాజహంసుడు తపస్సుచేసి, శత్రువును సాధించవలెననే తలపుతో వామదేవుడనే మహామునికి తన అభిప్రాయాన్ని తెలియజేశాడు శరీరాన్ని శుష్కింపజేసే తపస్సువల్ల ప్రయోజనంలేదనీ, వసుమతీదేవి గర్భంలోఉన్న కుమారుడే శత్రువులందరినీ ఓడించగలడనీ, విచారించవద్దనీ హితబోధ చేశాడు. అదే సమయంలో ఆకాశవాణి కూడా ఆ విధంగానే పలికినందువ, రాజునకు కొంత ఊరట కలిగింది. తర్వాత ఒక శుభదినంలో వసుమతీదేవి సుపుత్రుని కన్నది. ఆ బాలుడే రాజవాహనుడు. ఆ శిశువు దినదినాభివృద్ధిపొంది, సకల విద్యలూ అభ్యసించి మహా వీరుడుగా తయారయ్యాడు. ఆ బాలుడు తలిదండ్రులకూ, తక్కిన వారికీ ఎంతో ఆనందాన్ని కలిగించాడు

ఒకప్పుడు వామదేవమహాముని రాజహంసునివద్దకువచ్చి, కుమారుని దిగ్విజయార్థం పంపవలసిన సమయం యిదే అని చెప్పాడు రాజు సరే అని సహవాసులైన మంత్రి పుత్రులతో కూడా రాజవాహనుని పంపాడు. రాజవాహనుడు మిత్రులతోకూడా వింధ్యాటవిలో ప్రవేశించి, మాతంగుడనే విప్రుని చూచినాడు. అతడు రహస్యంగా రాజకుమారునికి తన వృత్తాంతం చెప్పి, తనకు సహాయపడాలని కోరినాడు. అతనికోరికను నెరవేర్చడంకోసం రాజవాహనుడు నిద్రపోతూవున్న తన తొమ్మండుగురు మిత్రులనూ, అర్ధ రాత్రిలో విడిచిపెట్టి, మాతంగునికి సాయంగా అతనివెంట పాతాళలోకానికి వెళ్లి, అసురరాజపుత్రిక అయిన కాళిందివల్ల ఆకలిదప్పుల శ్రమలు లేకుండా చేసే మణిని బహుమతిగాపొంది, తిరిగి భూలోకమునకు వచ్చినాడు. వచ్చి, దేశాలుతిరుగుతూ, మిత్రులకోసం వెతుకుతూఉండగా పుష్పోద్భవుడనే మిత్రుడు అవంతీపుర ప్రాంతంలో కనిపించాడు. పుష్పోద్భవుడు తన వృత్తాంతాన్ని వివరంగా చెప్పి, రాజకుమారుడిని తనగృహానికి తీసుకునివెళ్ళి ఎంతో భక్తితో పరిచర్యలు చేస్తూ వుండేవాడు. అతనిభార్య బాలచంద్రిక' మిగిలిన బంధువులు ఎంతో గౌరవంగా చూచేవారు. రత్నోద్భవుడు తన మిత్రుడిని "అన్ని కళలూ తెలిసిన బ్రాహ్మణుడు" అని ప్రచారంచేసి నమ్మిక పుట్టించాడు.

అప్పటికి మాళవరాజైన మానసారుడు వృద్ధుడైనాడు. అతడు తన కుమారుడైన దర్పసారుడికి రాజ్యం అప్పగించాడు. దర్పసారుడు తన మేనత్త కొడుకులయిన చండవర్మపైనీ, దారువర్మపైనీ రాజ్యభారాన్ని వుంచి, తపస్సు చేయడానికి రాజగిరికి వెళ్లాడు. క్రూరుడైన దారువర్మ అన్నమూ, మేనమామనూ లక్ష్యంచెయ్యక విశృంఖలంగా ప్రవర్తిస్తూ, ప్రజాకంటకుడైవుండినాడు. అవివాహితగా ఉన్నప్పుడు బాలచంద్రికను దారువర్మ బలవంతంగా వివాహం చేసుకోదలచినాడు. కాని, ఆమెను ప్రేమించిన పుష్పోద్భవుడు దారువర్మను మాయోపాయంచేత సంహరించినాడు.

ఒకనాడు రాజకుమార్తె అవంతిసుందరి, తన ప్రియసఖి అయిన బాలచంద్రికతో కలిసి పట్టణానికి చేరువనున్న ఉద్యానవనంలో విహరిస్తూఉండగా, రాజవాహనుడు పుష్పోద్భవునితో కూడా అక్కడికి వెళ్లడమూ, అవంతిసుందరీ రాజవాహనులు ఒకరినొకరు చూసుకొనడమూ, వారిద్దరికీ పరస్పరానురాగం అంకురించడమూ జరిగింది. ఇంతలో అవంతిసుందరి తల్లివచ్చి కుమార్తెను తీసుకుని వెళ్లింది. అవంతిసుందరి విరహవేదన పడుతూవుండగా, బాల చంద్రిక ఆమెను వూరడించి, ఆమె వృత్తాంతాన్ని రాజవాహనుడికి తెలియజేసింది. అతడు, ఒకటి రెండు రోజుల్లో తగిన ఉపాయం ఆలోచించి అంతఃపురానికి రాగలననీ, ధైర్యంతో వుండవలెననీ తిరిగి వార్త పంపాడు.

రాజవాహనుడు తగిన ఉపాయాన్ని ఆలోచిస్తూవుండగా, ఇంద్రజాల విద్యలో ఘటికుడైన విద్యేశ్వరుడనే బ్రాహ్మణుడు వచ్చాడు. అతనితో ఆలోచించి, చండవర్మకు తన యింద్రజాల విద్యను చూపే నెపంతో తన కార్యాన్ని నెరవేర్చుకో దలచాడు. విద్యేశ్వరుడు తనవిద్యను ప్రదర్శిస్తూ, ఆ సందర్భంలో అవంతి సుందరీ, రాజ వాహనులకు వివాహం జరిపించాడు. తర్వాత "ఇంద్రజాల పురుషులందరూ వెళ్లిపొండి" అని అతడు చెప్పగా, రాజవాహనుడున్నూ, అవంతి సుందరితో అంతఃపురానికి వెళ్లిపోయి తన భార్యతో అక్కడే సుఖంగా కాలం గడపసాగాడు

కొన్నాళ్ళు జరగగా, శాప వశాన రాజవాహనుని కాళ్లకు వెండి సంకెళ్లు తగులు కొన్నవి. వెంటనే అవంతి సుందరి పెద్ద గోలచేసినది. ఆ వార్త అంతఃపురం అంతటా అల్లుకొని పోయింది. అంతఃపురద్రోహి అని భావించి చండవర్మ రాజవాహనుడిని వెంటనే చంపింపదలచెను. కాని తపస్సు చేసుకొంటున్న దర్పసారుడికి తెలపడ● ధర్మమని, అతనివద్దకు వార్తాహరుని పంపాడు. ఆ ద్రోహిని ఏనుగుచేత త్రొక్కించాలని కోపించిన చండవర్మ ఆజ్ఞయిచ్చాడు పిదప ఏనుగువద్దకు శృంఖలాబద్ధుడైన రాజవాహనుడు తీసుకొని రాబడ్డాడు తక్షణమే శాపం తీరి, అతని సంకెళ్లు వీడిపోయి, ఒక అప్సరసగా మారిపోయాయి. రాజవాహనుడు దానిపైకి ఉరికి, మావటివాణ్ణి తోసివేసి, ఆ ఏనుగును రాజభవనంవైపు పోనిచ్చాడు

సింహవర్మ కుమార్తె అంబాలికను మోహించి, బలవంతంగా వివాహం చేసుకోడానికి సిద్ధపడిన చండవర్మను, హఠాత్తుగా అక్కడికి వచ్చిన రాజవాహనుని మిత్రుడు అపహారవర్మ చంపివేసి, మిత్రునికి ఆశ్చర్యాన్ని, ఆనందాన్నీ కలిగించాడు"

ఇలా చెప్పుకొనిపోతూవుంటే ఎంతో కథవుంది. ప్రస్తుతానికి యీ కథే ఎక్కువ దీన్నిబట్టిచూస్తే మూర్తికవి దశకుమార చరిత్రను బాగా ఎరుగుననీ, అందులోని కథనే కొంత గ్రహించి తనకు తోచినట్లు మార్చి యీ ప్రబంధాన్ని వ్రాశాడనీ చెప్పవలసి వున్నది. దండి సంస్కృత కావ్యాన్ని కాకపోయినా, కేతన గ్రంధాన్నయినా చూచి వుండాలి. తెలుగు కవులలో కవిత్రయాన్ని తక్క తక్కిన వారి నెవ్వరినీ ప్రస్తుతించని మూర్తికవి కేతనను పేర్కొనక పోవడం వింతకాదు.

దశకుమార చరిత్రలోని కథ చాలా రసవంతంగా ఉన్నది. రాజహంసుని రాజ్యభ్రష్టతా, వామదేవమహాముని యిచ్చిన సలహా, రాజవాహనుని విజయప్రస్థానం అవంతిసుందరీ వివాహసన్నివేశం, రాజవాహనుని ధైర్యసాహసాలూ అతి మనోహరంగానూ, సముచితంగానూ కూర్చబడినవి. ఇటువంటి మూల గ్రంధాన్ని ఆధారంగా ఉంచుకొని కూడా మూర్తికవి సంఘటనలను రసవంతంగా కూర్చలేకపోవడం పెద్ద లోపమే! అది అలా వుండగా—ఇందులోని సంఘటనలు కొన్ని అనుచితంగా కూడా ఉన్నవి ఈ క్రిందివి వాటిలో కొన్ని

(1) రాజహంసుడు కుమారుడికి యువరాజ పట్టం కట్టిన తర్వాత 'చుట్టవు, నృపాలుర యిండ్లను పెండ్లిచేసి' అని బంధువులలో ఒకరి పిల్లను తెచ్చి

పెండ్లి చేసినట్లు మూర్తికవి చెప్పినాడు. ఇతని వ్రాతనుబట్టి అవంతి సుందరి రాజవాహనునికి చిన్నభార్య అగును. ఈ విషయం మూలంలోలేదు. మూర్తికవి యింతలో పూరుకోక, యువరాజు దండయాత్రకు బయలుదేరినప్పుడు పెద్ద భార్య కూడా అతనివెంట వచ్చినట్లు వర్ణించాడు. అవంతిసుందరి వివాహ సందర్భంలో ఆమె ప్రసక్తియే కానరాదు. ఆమె తనతో కూడా వచ్చినప్పుడు, యువరాజు ఆమె కీ విషయం చెప్పడంగాని, లేదా, ఆమెయే అతని కోరికను తెలుసుకుని, తన సమ్మతిని తెలపడంగాని అవసరము. అలా జరిగితేనే కథలో రసభంగం ఉండదు. ఇందులో ఈ రెండింటిలో ఏదీలేదు. పంచమాశ్వాసము చివర 103 వ పద్యంలో "నిజకాంతా సైన్యసంయుక్తుడై, జంభారి క్రియజేరి యాత్మపురి" అని వుండడంబట్టి—కాంతా శబ్దంచేత ఇద్దరు భార్యలనూ గ్రహించే అవకాశం వుండడంవల్ల, పెద్దభార్య కూడా అతనితో రాజధానికి మరలి వచ్చిందని ఊహించవలసి ఉన్నది. అంతేగాని, ఆమెనుగురించి మీరేమీ కానరాదు.

(2) కథా సన్నివేశాలనుబట్టి, యిది పురాణ కాలానికి సంబంధించిన కథ అని తెలుస్తూ వున్నది తదనుగుణంగా ఆశ్రమాది వృత్తాంతం ఇందులో కూర్చబడి ఉన్నది. ఇలాంటి స్థితిలో రాజవాహనుని దండయాత్రలో యవనులు కూడా వున్నట్లునూ, వారితో బీబీలు కూడా బయలుదేరినట్లునూ వర్ణించడం వింతగానే ఉన్నది ఈ విషయంలో ద్వితీయాశ్వాసంలోఉన్న 52వ పద్యంలోని 'కంభాణికావలి కందోలి సలాముజేసె యవన వ్రాతంబు భూభర్తకున్' అనేదీ, 60—వపద్యంలోని 'బిబ్బీగబ్బిమిటారు లెక్కుతురగీ బృందంబు చిందెన్నడల్'అనేదీ తార్కాణాలు.

(3) రాజహంసుడు సాటిలేని బలపరాక్రమాలు కలవాడు. సామంతులందరూ అతనికి కప్పం కట్టుతూ ఉండిరి. పాండ్యులు ' ఏ పట్టున లోగక, ఉద్వృతిని కప్పము గట్టకున్కి' వారిపయి దండయాత్రకు అతడు కుమారుని ససైన్యంగా పంపాడు మగధ దేశానికి పాండ్యదేశం దక్షిణంగా ఉన్నది. కాని ఉత్తర దిశలోలేదు. ఒక్క మగధ దేశానికేకాదు. భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ కూడా పాండ్యదేశం దక్షిణ దిశలోనిదే! పాండ్యులను సాధించదలచిన రాజవాహనుడు తన సేనలను దక్షిణానికి నడిపించక ఉత్తరానికే నడిపించడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది

'క. ఇత్తెరగున దండెత్తి, నృపోత్తంసు డుదాత్త వృత్తి మత్తర ధరణీ
భృత్తతుల కోట కొత్తళమత్తళి దుత్తుమురుఁజేసె నత్యుద్ధతుఁడై'

అని యీ సందర్భంలో కవి వ్రాకుచ్చాడు యువరాజు కుంతల, సింధు, సౌరాష్ట్ర, గాంధార, గౌడ, మత్స్య, కాశీరాజులను లొంగదీసుకున్నాడు పాండ్యదేశం ఉత్తరాన లేనందున, దాన్ని లొంగదీసుకునే ప్రసక్తి రాలేదు ఒకవేళ, అతడు ఉత్తర దిక్కున జైత్రయాత్రను ముగించుకొని, దక్షిణ దిక్కుకు రాదలచినాడో, ఏమో, గ్రంథంలో మాత్రం పాండ్యులను లొంగదీసుకున్న విషయం లేనేలేదు. రాజవాహనుడు అవంతిసుందరిని వివాహంచేసుకుని, మాళవంలో కొన్ని నెలలు గడిపినాడు వర్షాకాలంవస్తే ప్రయాణం చెయ్యడం కష్టమని యెంచి,

అంభోధి ప్రియ సంభవాన్వయుఁ డతం డత్యుగ్రుఁడంతన్ జయ
స్తంభం బుత్తర వార్ధి నిల్పి నిజకాం తాసైన్య సంయుక్తుఁడై
జంభారిక్రియఁ జేరి యాత్మపురి నిచ్చల్ తల్లి దండ్రుల్ ప్రజల్
సంభాషింప సమస్తరాజ్యపదవీసౌఖ్యంబు జెందెన్ దగన్'

(ఆ 5. ప 103)

దీనితో అతని ఉత్తర జైత్రయాత్ర పూర్తి అయింది కప్పం కట్టక ఎదురు తిరిగిన పాండ్యులమీదికి పోనేలేదు. రాజ్య సుఖాలనుభవిస్తూ, భార్యలతో కూడి, తల్లిదండ్రులయొక్కయూ, ప్రజలయొక్కయు, భూషణలను పొందుతూ ఉండెను. దీనివల్ల తండ్రి ఆదేశం నెరవేరినట్లులేదు. ఉత్తరరాజ్యాలు జయించి వచ్చినందున, తండ్రి తృప్తిపడ్డాడేమో తెలియదు.

(4) ఈ సందర్భములోనిదే మరొక వింత సంగతి! భారత దేశానికి ఉత్తర సరిహద్దుగా హిమాలయ పర్వతా లున్నాయి. రాజవాహనుడు లోబరచుకొన్నట్లు చెప్పిన దేశాలన్నీ హిమాలయాలకు దక్షిణంగా ఉన్నవే! ఉత్తర సముద్రం ఎన్నో వేల మైళ్లదూరంలో సాధారణంగా మానవులు చేరరాని స్థలంలో ఉన్నది. కవి వర్ణించిన దానినిబట్టి, రాజవాహనుడు హిమాలయాలవరకయినా వెళ్లినట్లు కానరాదు ఇట్టి స్థితిలో ఉత్తరవార్ధి దగ్గర అతడు జయస్తంభాన్ని నిల్పినట్లు వ్రాయడం ఏమాత్రమూ ఉచితంగాలేదు. ఇది నమ్మదగిన విషయమూ కాదు.

(5) ఉత్తరదేశ దండయాత్రను ముగించుకొన్నతర్వాత రాజవాహనుడు శాండిల్య మహాముని ఆశ్రమానికి వెళ్లినాడు. ఇతడువస్తాడని ఆ మునికి ముందుగా తెలియనే తెలియదు. అప్పుడు మధ్యాహ్న పూజా సమయమూ, భోజన సమయమున్నూ. రాజవాహనుడు సపరివారంగావచ్చి మహామునికి నమస్కరించగా, ఆయన క్షేమసమాచారాలు అడిగి, భోజనానికి ఆహ్వానించెను. మునియొక్క ఛాత్రులు బంగారు పళ్లేరాలూ, వాటి చుట్టూ అరటాకులూ వేసి, నీళ్ళ వల్లగా, యువతీమణులు వివిధపదార్థాలనూ వడ్డించారు ఆ భోజనం మహారాజుల యిండ్ల భోజనంవలె వర్ణించబడింది. ఆ పళ్లేరాలూ మొదలైనవి రాజవాహనుడు తెచ్చినవో, లేక ఆశ్రమంలోనే ఉన్నవో తెలియదు. ఇది ఆకాలపు ఆశ్రమాల పద్ధతికి చాలా విపరీతంగా కానవస్తున్నది. ఇంతేకాక, వడ్డన చేస్తున్న యువతుల శృంగార వర్ణన అనౌచిత్యానికి చక్కని ఉదాహరణగా ఉన్నది దేశ, పాత్రానుగుణంగా ఇట్టి వర్ణనను మూర్తికవి ఎందుకు కూర్చాడో?

(6) రాజవాహనునికి అవంతిసుందరి యవస్థను ఆమె చెలికత్తెయైన బాల చంద్రిక వివరించి తెల్పగా, అతడు—మూడునాలుగు దినాలలో మాళవరాజునకు తన పరాక్రమాన్నిచూపి, అవంతి సుందరిని పరిగ్రహిస్తానని చెప్పాడు. ఇందులోఉన్న కథనుబట్టి మగధ, మాళవరాజులకు ఎలాటి విరోధమూలేదు. ఇలాటి స్థితిలో రాజవాహనుడు రాయబారి మూలంగా తన కోరికను మాళవాధిపతికి తెలపడం మేలు అతడు దానికి అంగీకరించనప్పుడే దాడి వెడలడం ధర్మం. అంతేకాని, మొదటనే యుద్ధానికి సిద్ధపడడం విరసతనే కలుగ జేస్తుంది ఈ సందర్భంలో మాళవరాజు చేసిన పని కూడా సరిగా తోచదు. "అందితే జుట్టూ, అందకపోతే కాళ్లూ' అనే పద్ధతిలో అతడు మొదట యుద్ధానికేసిద్ధమై, అపజయ సూచనలు కానరాగా, ప్రాధేయపడుతూ, రాజవాహనునికి తన కన్యనిచ్చి వివాహం చేస్తానని రాయబారం పంపడం బాగులేదు ఆ రాయబారాన్ని మొదటే పంపివుంటే బాగా వుండేది

మూర్తికవి ప్రాచీనప్రబంధాల ధోరణిలో వర్ణన ప్రధానంగా గ్రహించి యీ ప్రబంధాన్ని రచించడంవల్ల, ఇందులో కథాంశాన్ని గురించీ, ఔచిత్యాన్ని గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోలేదనీ, అందువల్లనే యిలాటి విషయాలు గ్రంథానికి ఎక్కినవనీ మనం భావించాలి. ఇలాటి అనౌచిత్యాలను ఒక ప్రక్కకు త్రోసి వేసి చూస్తే, రాజవాహన విజయం చక్కని ప్రబంధమని చెప్పవచ్చును

మూర్తికవి పీఠికలో చెప్పుకున్నట్లు వివిధకవుల కవితాపద్ధతులు ఇందులో ప్రతిఫలిస్తూ ఉన్నవి. తత్సమ సుదీర్ఘసమాసాలను కూర్చడంలోనూ, దేశీయాలను గుప్పించడంలోనూ కూడా అందె వేసిన చెయ్యి సమకాలికులు బహుళంగా వాడుతూఉన్న అన్యదేశ్యాలు ఇందులో అధికంగా కానవస్తున్నవి ఆధునిక నిఘంటుకారులు తాము సంప్రతించిన గ్రంథాలలో ఈ రాజవాహన విజయాన్ని పేర్కొన్నా, ఇందలి చాలా పదాలు ముఖ్యంగా కొన్నిదేశ్యాలూ, అన్యదేశ్యాలూ, వాటిలో కానరావడంలేదు. శ్రీనందిరాజు—చలపతి రావుగారి లఘుటీక కొంత వరకూ ఉపయోగిస్తుంది. దీన్ని సమగ్రంగా అర్థం చేసుకోడానికి కొంత విపులమైన టీక ఎంతో అవసరం. కొన్ని పదాలకు అర్థం, ఎంతో ఆలోచించి వ్రాయవలసి ఉన్నది

ఇప్పుడీ రాజవాహన విజయ ప్రతులు లభించడం కష్టం! ఇదివరకు ముద్రితమైన ప్రతిలో అచ్చు తప్పులు అధికంగా దొరలిఉండడంవల్ల అర్థావగతి కష్టతరంగా ఉంటుంది కొన్నిచోట్ల పద స్వరూప నిర్ణయాలకే తికమకలు పడవలసి వుంటుంది వాఙ్మయాభిమానులైన ఉదారులూ, ప్రకాశకులూ, భాషాసేవకై పాటుపడుతూవుండే సంస్థలూ ఈ ప్రబంధాన్ని సరియైన రీతిలో—విపుల టీకతో ప్రకటిస్తే వాఙ్మయానికి ఎంతో మేలు!

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



పడవలరేవు —శ్రీ ఎం. రెడ్డెప్పనాయుడు

మూడవ పంచవర్ష ప్రణాళిక (1961-66)

ఒకదశాబ్దంపాటు అహోరాత్రాలు కష్టించిపనిచేసిన తరువాత భారతదేశం ఆత్మవిశ్వాసముతో స్వయంసమృద్ధమైన ఆర్థికవిధానాన్ని రూపొందించుకోవాలనే ఆకాంక్షతో మూడవప్రణాళిక ప్రాంగణంలో అడుగుపెట్టబోతూంది. ఈ మూడవ ప్రణాళిక ప్రధానలక్ష్యాలు ఇవి :

(1) జాతీయ ఆదాయంలో సాలీనా 5% అభివృద్ధిని సాధించడం

(2) ఆహారధాన్యాలలో స్వయంసమృద్ధిని సాధించి, మన పరిశ్రమల అవసరాలకు చాలినంత వ్యవసాయోత్పత్తులను పెంచి, ఆపైన ఎగుమతిచేయడం.

(3) ఉక్కు, ఇంధనం, విద్యుచ్ఛక్తి, రసాయనికపరిశ్రమలవంటి కీలకపరిశ్రమలను విస్తృతపరచి, మనదేశపు యంత్రనిర్మాణ సామర్థ్యానికి సుస్థిరమైన పునాదులువేసి, మనదేశములోనే లభ్యమయ్యే సాధన సంపత్తితో రాబోయే పది సంవత్సరాల కాలంలో మనదేశం పారిశ్రామికముగా పురోభివృద్ధిని సాధించేటట్లు చూడటం.

(4) మనదేశపు మానవశక్తిని పూర్తిగా వినియోగించుకోవడం; ఉద్యోగావకాశాలను తగినంతగా విస్తృతపరచడం.

(5) అందరికీ ఇతోధికమైన సమానావకాశాలను కల్పించడానికి తగిన ఏర్పాట్లు చేయడం. రాబడిలోనూ, సంపదలోనూ సాధ్యమైనంతవరకూ తేడాలనుతగ్గించి, దేశసంపదను అందరికీ అనుభవయోగ్యంగా చేయడం. ఆర్థికసంపదను దేశవ్యాప్తముగా వినియోగించుకొనేటట్లు చేయడం

వీటికి అమలుపరచే వివిధ కార్యక్రమాలకయే ఖర్చు మూడవ పంచవర్షప్రణాళికాకాలంలో పబ్లిక్‌రంగంలో రూ 8000 కోట్లు అనీ, ప్రైవేటురంగంలో రూ. 4,100 కోట్లు అనీ అంచనావేయబడింది పబ్లిక్‌రంగములో శారీరకమైన సంపద కాకుండా, ఆర్థికముగా ఖర్చుఅయ్యేమొత్తం రూ. 7,500 కోట్లు. వివిధ రంగాలలో—

వివిధ రంగాలు	ఖర్చుఅయే మొత్తం (కోట్లసంఖ్యలో రూపాయలు @)	మొత్తం ఖర్చులో శాతం
వ్యవసాయం, సాంఘికాభివృద్ధి	1068	14
నీటిపారుదల, విద్యుచ్ఛక్తి	1662	22
గ్రామీణ పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు	264	4
పరిశ్రమలు, ఖనిజాలు, రవాణా, రహదార్లు	3006	40
సాంఘికసేవ, తదితరములు	1300	17
ఇన్వెంటరీలు	200	3
	7500	100

@ 1 కోటి = 10 మిలియన్లు.

ఆహారధాన్యాల ఉత్పత్తి నాటికి 32 వంతు వరకూ ఎక్కువకాగలదు అంటే 1960-61 లో ఆహారధాన్యాల ఉత్పత్తి 76 మిలియను టన్నులైతే 1965-66 నాటికి ఇది 100 మిలియన్ల టన్నులవుతుంది ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఇంకొక 2 కోట్ల యకరాలకి అదనంగా నీటిపారుదల సౌకర్యాలు కలిగించవలసి ఉంటుంది. అనగా, మొత్తం 9 కోట్ల యకరాలకి నీటిపారుదల సౌకర్యాలు కలిగించినట్లవుతుందన్నమాట. రసాయనికపు టెరువులు, తదితర ఎరువులను ఇతోధికముగా వాడటం, శాస్త్రీయమైన పద్ధతులలో వ్యవసాయ విధానాలను అమలుజరపడం, అధికాహారోత్పత్తికి సాధనాలుగా ఉపయోగింపబడతాయి

గ్రామీణప్రాంతాల అభివృద్ధికి ఒకగ్రామం ఒక ప్రాథమికయూనిట్‌గా తీసుకొని, సహకార సేవాసంఘాలను ఏర్పాటుచేసి, గ్రామీణ ఆర్థికవ్యవస్థను పటిష్టంగాచేయడానికి కృషి జరుగుతుంది

ఈ ప్రణాళికలో ప్రధానమైన పారిశ్రామిక పథకాలలో గనుల అభివృద్ధి, అన్వేషణ; పారిశ్రామిక యంత్రనిర్మాణం, యంత్రపరికరాలు, ఎరువులు, ప్రధాన రసాయనికద్రవ్యాలు, ముఖ్యమైన మందులు, పెట్రోలియాన్ని శుద్ధిచేయడం చాలాముఖ్యమైనవి

వాడకానికి సిద్ధంచేయబడిన ఉక్కు ఉత్పత్తి 1960-61 లోని 2 2 మిలియను టన్నులనుంచి 1965-66 నాటికి 6 8 మిలియను టన్నులకు పెరుగుతుంది.

1965-66 సంవత్సరాంతానికి సరఫరాకాగల విద్యుచ్ఛక్తి 5.7 మిలియన్ల కిలోవాట్లనుండి 12 7 మిలియను కిలోవాట్లకు పెరుగుతుంది రవాణా, రహదార్ల అభివృద్ధిలోకూడా మూడవప్రణాళిక చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించగలదు

మూడవ ప్రణాళిక కాలంలో విద్యారంగం బహుముఖంగా ప్రగతిని సాధించగలదు 6-11 సంవత్సరాల మధ్యవయస్సు గల వారికి ఉచిత నిర్బంధ ప్రాథమికవిద్య, విస్తృతముగా స్కాలరు షిప్పులు మంజూరు చేయడం చెప్పుకోదగిన అంశాలు,

పరిసరపరిశుభ్రత, అంటువ్యాధుల నిరోధక చర్యల విషయంలో మూడవ ప్రణాళిక కాలంలో ఇతోధికమైన చర్యలు తీసుకుంటారు ప్రజారోగ్యం, కుటుంబనియంత్రణం, వైద్య, ఆరోగ్యశాఖల సిబ్బందికొర్పను, త్రాగడానికి స్వచ్ఛమైన మంచినీటి సదుపాయాల విషయంలో ఇతోధికమైన శ్రద్ధ వహిస్తారు

మూడవ ప్రణాళిక కాలంలో కార్మికరంగంలో నిరుద్యోగమంటూ వుండరాదని భావించబడుతూంది.

ప్రణాళికకోసం చిన్న మొత్తాల పొదుపు

పంచవర్ష ప్రణాళికలు జయప్రదముగా కొనసాగించడానికి భారీయెత్తున సొమ్ము వెచ్చించవలసి ఉన్నది. మనలో ప్రతి ఒక్కరూ కక్కుర్తిపడకుండా పొదుపు చేయగలిగినప్పుడే ఇది సాధ్యమవుతుంది. పొదుపు చేయడం చిన్న మొత్తాలలోనైనా, పెద్ద మొత్తాలలోనైనా ప్రతి ఒక్కరూ "చిన్నమొత్తాల పొదుపు పథకంలో ఈ మొత్తాన్ని దాచుకుంటే అటు దేశానికి, ఇటు మనకీ ఉభయతారకంగా వుంటుంది

1. 12-సంవత్సరాల నేషనల్ ప్లాన్ సేవింగ్స్ సర్టిఫికేట్లు : ఇవి రూ 5, రూ 10, రూ 50, రూ 100, రూ 500, రూ 1000 విలువలలో దొరుకుతాయి. 12 సంవత్సరాల తరువాత వీటినుండి వరుసగా రూ 8.25, రూ 16.50, రూ. 82.50, రూ 165, రూ 825, రూ 1650 పొందవచ్చును.
2. 10-సంవత్సరాల ట్రెజరీసేవింగ్స్ డిపాజిట్ సర్టిఫికేట్లు : వీటిద్వారా సాలీనా 4% వడ్డీ లభిస్తుంది. ఇవి 50 రూపాయల లగాయతు 25,000 రూపాయల వరకూ (ఇవి 50 గుణకాలలో వుంటాయి.) దొరుకుతాయి.
3. క్యుములేటివ్ టైమ్ డిపాజిటు పథకం · ఈ పథకంలో రూ 5, రూ 10, రూ 20, రూ 50, రూ 100, యూనిట్లలో ప్రతిమాసం పొదుపు చేసుకోవచ్చును. నిర్ణీతమైన గడువుకాలం 5 సంవత్సరాలు కాని 10 సంవత్సరములు కాని దాటిన తరువాత చక్కని ఆదాయం లభిస్తుంది.
4. పోస్టాఫీసు సేవింగ్సుబ్యాంకి అకౌంటు : రూ.10,000 సేరవరకూ పొదుపు చేసిన డబ్బు మీద సాలీనా 2½%, అంతకు మించిన నిలవలమీద 2% వడ్డీ లభిస్తుంది. జాయింటు అకౌంటు ఉన్నప్పుడు ఈ మొత్తానికి రెట్టింపు సొమ్ము వరకూ ఈ వడ్డీ.
5. భారత ప్రభుత్వ బహుమతి పత్రాలు 1965 : ఇవి రూ 5, రూ 100 విలువలలో, రిజర్వుబ్యాంకి, స్టేట్ బ్యాంకుల ఆఫీసులలోనూ, ప్రభుత్వ ట్రెజరీలలోనూ, ప్రభుత్వ హెడ్ పోస్టాఫీసు లేక సబ్ పోస్టాఫీసులలోనూ లభిస్తాయి. ప్రతి మూడు నెలలకి ఒక పర్యాయం బహుమతుల నిర్ణయానికి 'డ్రా' జరుగుతుంది. బహుమతిగా పొందిన సొమ్ముమీద ఇన్కంటాక్సు వుండదు. ఈ బహుమతి పత్రాల కొన్న ధరకు 1965 మార్చి 1 వ తేదీ తరువాత తిరిగి మనకి వచ్చివేస్తుంది.

మెట్రిక్ పద్ధతి కొలమానాలు

మనదేశమంతటా సులభముగా అందరికీ అర్థమయ్యేరీతిని, ఒకేపద్ధతి తూనికలు, కొలమానాలు వుండాలనే విషయం అందరికీ ఆమోదయోగ్యమైన చక్కని పద్ధతిగా అంగీకరింపబడింది. ఈ పథకంలో మొదటి మెట్టు మెట్రిక్ తూనికలను ప్రవేశపెట్టడం. మనదేశంలో కొన్ని నిర్ణీతప్రదేశాలలో మెట్రిక్ తూనికల వాడకం విధిగా ప్రవేశపెట్టబడింది. కొన్ని ప్రదేశాలలో ఇచ్ఛికంగా వీటిని వాడడానికి 2 సంవత్సరాలగడువు ఇవ్వబడింది. ఈ సంధికాలం 1962 మార్చినెలతో అంతమౌతుంది. ఆతరువాత ఒక్క జమ్మూ, కాశ్మీరులలోతప్ప తక్కిన ప్రదేశాలలో విధిగా మెట్రిక్ తూనికలను వాడితీరాలి.

ఈ సంస్కరణలో రెండవఘట్టం మెట్రిక్ పద్ధతి కొలతలను ప్రవేశపెట్టడం. ఈ పథకంకూడా అప్పుడే ప్రజలలో వ్యాప్తి చెందుతోంది. నూలుపరిశ్రమ 1960 ఏప్రిల్ 1-వ తేదీనుంచి మెట్రిక్ పద్ధతిని అవలంబించింది. దానందిన కార్యకలాపాలకి ప్రజలు వీటిని ఉపయోగించడం 1961 ఏప్రిల్ మాసంనుంచీ అనుమతింపబడింది. ఈ తేదీనుంచీ ఒక్క సంవత్సరం వరకూ పాతకొలమానాలుకూడా వీటితోపాటు ఉపయోగించుకోవచ్చును.

ఈ మెట్రిక్ పద్ధతి తూనికలు, కొలమానాలూ క్రమేపీ దేశవ్యాప్తంగా ఉపయోగింపబడతాయి. 1963 ఏప్రిల్ 1-వ తేదీ నుండి దేశంలో ఒక్క మెట్రిక్ పద్ధతి తూనికలూ, కొలమానాలూమాత్రమే ఉపయోగంలో ఉంటాయి.

వివరకాలు, పరిమాణాలు

మెట్రిక్ కొలమానాలు మూడురకాలుగా ఉంటాయి. కొపాకృతికలవి, వంచుకొనేరకం, ముంచుకొనేరకం. ఈ కొలతల మూలపరిమాణం లీటరు. దీనిలోని విభాగం మిల్లీలీటరు.

ఉపయోగంలో ఉండే మెట్రిక్ కొలమానాల పరిమాణాలు ఇవి :

కోణాకారంలో వుండే రకం		వంచుకొనే రకం		ముంచుకొనే రకం	
లీటరు కొలతలు	మిల్లీ లీటరు కొలతలు	లీటరు కొలతలు	మిల్లీ లీటరు కొలతలు	లీటరు కొలతలు	మిల్లీ లీటరు కొలతలు
20	500	2	500	1	500
10	200	1	200		200
5	100		100		100
2			50		50
1			20		20

1 లీటరు=1000 మిల్లీలీటర్లు. పూర్వపు కొలమానాలలో చెప్పవలసివస్తే ఇంచుమించుగా అవి యీ క్రిందివాటికి సమానం అవుతాయి :

1 లీటరు = ¼ గేలను (ఇంచుమించుగా)
1.1 సేర్లు (ఇంచుమించుగా)
3 పావులు (ఇంచుమించుగా) [సేరకి]
4.5 అరాకులు (దాదాపుగా) మద్రాసు

సౌలభ్యానికీ, సారూప్యానికీ, మెట్రిక్ పద్ధతి

శ్రీరస్తు - శ్రీ త్రిపురసుందరీ పరశివాభ్యాం నమః

శ్రీ శుభకృన్నామ సంవత్సర పూర్ణశాస్త్రీయ (ఆంధ్రపత్రికా) పంచాంగమ్

బ్రహ్మశ్రీ శ్రీమత్పిడప ర్తి చినపూర్ణార్యసిద్ధాన్తినః ద్వితీయ పుత్రేణ సుబ్రహ్మణ్యశాస్త్రిణా ప్రణీతమ్

సహచరయుతౌతౌ. తత్తనయౌ చినకృష్ణమూర్తిశాస్త్రీ, సుబ్రహ్మణ్యశాస్త్రీచ

విఘ్నేశ విధిమార్తాండ చంద్రేంద్రోపేంద్ర వందిత। నమో గణపతే తుభ్యం బ్రహ్మణాం బ్రహ్మణస్పతే.

వేదమయీం నాదమయీం పరపదోద్య బిందుమయీం

మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం.

గమనిక

ఈ సంవత్సరమున రాజు గురుడు, మంత్రి శుక్రుడు. సర్వసస్యసముదాయమగు ౧౬ వీసము లలో ౧౪ వీసముల పంట ఫలించును. శ్రీకృష్ణుడు పశుపాలకుడగుటచే పశువులు తృణ క్షీర సమృద్ధి గలవి యగును. రాత్రియం దార్ద్రాప్రవేశము 4 కుంచముల వర్షము. ఫాల్గున శుద్ధ ౧౧ బుధ వారం 8-50 మొ॥ గోవిందద్వాదశియను అలభ్య యోగ పుణ్యకాలం. ఫాల్గునశుద్ధ ౧౨ గురువాస రమున ప్రణీతానదీ పుష్కర ప్రవేశము. ఆంధ్ర ప్రదేశమున కనుపడు గ్రహణములు లేవు. విఘ్నే శ్వరచతుర్థీ నిర్ణయం 22-వ పేజీలో చూడుడు.



మౌఢ్యములు

కార్తిక శు ౮ సో॥ ప్ర॥ బ ౮ శ॥ పర్యం తం శుక్ర మౌఢ్యము. ది ౨ 3-3-1963 లగాయతు 4-4-1963 వర్కు గురు మౌఢ్యం.

కల్యాద్యబ్దాః	౫౦౬౩
శాలివాహనశకః	౧౮౮౪,౮౫
ఫసలీసన్	౧౩౭౨,౭౩
హిజరీసన్	౧౩౮౨,౮౩
క్రీస్తుశకం	1962,63
భారత స్వాతంత్ర్య శకః	15.16

ఆంధ్రపత్రికా కార్యాలయము, మద్రాసు-1.

పంచాంగ పద్ధతి వివరణము

ఇందు కాలమానము తిథినక్షత్ర వర్జ్య మహాపాతలు ఘటికలలోను, గంటలలోను కూడ చూపబడినవి. యోగ-కరణ-అమృత గ్రహప్రవేశములు ఘటికలలో మాత్రము చూపబడినవి శుభముహూర్తములు, దుర్ముహూర్తములు గంటలలో మాత్రం చూపబడినవి. భారత ప్రభుత్వముచే నియమింపబడిన కాలెండరు రిఫార్మ్ కమిటీ వారి నిర్ణయము ననుసరించి ప్రకటించబడిన ఇండియన్ ఎఫెమెరిస్—అండ్ నాటికల్ ఆల్మనాకునకు సరిపడునట్లు చూపబడినవి. నూతన వేధశాలలయందు కనుగొనబడిన భూకేంద్రమునకు సరిపడు వాస్తవిక రవి చంద్రులచే సాధించబడిన తిథ్యాదికము-గ్రహసంచారము ఇందు ప్రధానముగ చూపబడినవి. ఈ తిథ్యాది గ్రహ సంచారములే పంచాంగమున వ్రాసినట్లు ఆకసమున సరిపడుచున్నది. పూర్వపద్ధతి పంచాంగముకూడ ఇందు సంగ్రహముగ చూపబడినది. ప్రతిదినమందును లగ్నాంతకాలములును చూపబడినవి. నిరయన గ్రహస్ఫుటములును చూపబడినవి. ఇందు తిథ్యాది ఘటికలు-ఉదయాస్తమయములు - శుభముహూర్తములు విజయవాడకు చూపబడినవి. ఇందివ్వబడిన దేశాంతర చక్రముల ననుసరించి తత్తన్నగరవాసులు సంస్కరించుకొనినచో ఆచటకును సరిపడును-అట్లు గ్రహించగోరెదను. ఇందు వేదాంగ జ్యోతిషమున సూచించబడిన అశ్వ్యాదిని గ్రహించి పంచాంగ రచన చేయుటచే వైదికము. నూతనముకూడ యగుచున్నది. 10 అక్షాంశ లగాయతు, 30 అక్షాంశవర్కు లగ్నప్రమాణములివ్వబడినవి. శాస్త్రమునకు-ప్రత్యక్షమునకు సముచితమై యొప్పు ఈ పంచాంగమును గ్రహించి శ్రౌతస్మార్తాది సత్కర్మల నాచరింప గోరుచున్నాము.

దేశాంతర చక్రము

	చైత్ర మేష	వైశాఖ వృషభ	జ్యేష్ఠ మిథున	ఆషాఢ కర్కాట	శ్రావణ సింహ	భాద్ర కన్యా	ఆశ్వయుజ తులా	కార్తీక వృశ్చిక	మార్గశిర ధను	పౌష మకర	మాఘ కుంభ	ఫాల్గుణ మీన
మైసూరు	—౩౯	—౪౯	—౫౬	—౫౯	—౫౬	—౪౯	—౩౯	—౩౦	—౨౩	—౨౦	—౨౩	—౩౦
బెంగుళూరు	—౩౦	—౩౮	—౪౪	—౪౭	—౪౪	—౩౮	—౩౦	—౨౨	—౧౬	—౧౪	—౧౬	—౨౨
అనంతపురం	—౩౦	—౩౪	—౩౭	—౩౯	—౩౭	—౩౪	—౩౦	—౨౬	—౨౩	—౨౧	—౨౩	—౨౬
బళ్లారి	—౩౭	—౪౦	—౪౩	—౪౪	—౪౩	—౪౦	—౩౭	—౩౪	—౩౨	—౩౧	—౩౨	—౩౪
కర్నూలు	—౨౬	—౨౭	—౨౮	—౨౯	—౨౮	—౨౭	౨౬	—౨౪	—౨౩	—౨౨	—౨౩	—౨౪
హైదరాబాదు	—౨౧	—౨౦	—౧౮	—౧౮	—౧౮	—౨౦	౨౧	—౨౩	—౨౫	—౨౫	—౨౫	—౨౩
వరంగల్లు	—౧౦	— ౭	— ౪	— ౩	— ౪	— ౭	—౧౦	—౧౩	—౧౬	—౧౭	—౧౬	—౧౩
తిరుపతి	—౧౩	—౧౯	—౨౪	—౨౭	—౨౪	—౧౯	—౧౩	— ౭	— ౨	+ ౦	— ౨	— ౭
నెల్లూరు	— ౬	—౧౧	—౧౪	—౧౬	—౧౪	—౧౧	— ౬	— ౨	+ ౨	+ ౪	+ ౨	— ౨
కుంభకోణం	—౧౨	—౨౪	—౩౪	—౩౮	—౩౪	—౨౪	—౧౨	— ౦	+ ౯	+౧౩	+ ౯	— ౦
కాంచీపురం	— ౯	—౧౭	—౨౪	—౨౬	—౨౪	—౧౭	— ౯	— ౧	+ ౬	+ ౮	+ ౬	— ౧
మద్రాసు	— ౪	—౧౧	—౧౭	—౨౦	—౧౭	—౧౧	— ౪	+ ౪	+౧౦	+౧౨	+౧౦	+ ౪
భద్రాచలం	+ ౩	+ ౫	+ ౭	+ ౮	+ ౭	+ ౫	+ ౩	+ ౦	— ౨	— ౩	— ౨	+ ౦
బందరు	+ ౫	+ ౫	+ ౪	+ ౪	+ ౪	+ ౫	+ ౫	+ ౬	+ ౭	+ ౭	+ ౭	+ ౬
రాజమండ్రి	+౧౧	+౧౩	+౧౩	+౧౪	+౧౩	+౧౩	+౧౧	+౧౦	+ ౯	+ ౯	+ ౯	+౧౦
విజయనగరం	+౨౮	+౩౨	+౩౪	+౩౬	+౩౪	+౩౨	+౨౮	+౨౪	+౨౧	+౨౦	+౨౧	+౨౪
బరహంపురం	+౪౨	+౪౮	+౫౩	+౫౫	+౫౩	+౪౮	+౪౨	+౩౬	+౩౧	+౨౯	+౩౧	+౩౬

సూచన

విజయవాడనుండి భారత ప్రభుత్వము వారిచే నిర్ణయింపబడిన చైత్రాది మాసారంభము (అనగా మేషాది సాయన మాసారంభము) ల యందు కలుగు దేశాంతర విఘటికలు యీ పై చక్రమునందు చూపబడినవి. స్వగ్రామమునకు సమీపమందున్న పట్టణమునకు అభీష్ట మాసాదియందు గల విఘటికలను యీ చక్రమననుసరించి విజయవాడకు పశ్చిమదేశములయందుండువారు యీ పంచాంగమందలి తిథ్యాదులలో తీసివేయగాను, ప్రాగ్దేశములవారు కలుపగాను స్వస్థానమునకు సూర్యోదయాది తిథ్యాదికాలము లగుచున్నవి. యీ విజయవాడ యామ్యోత్తరరేఖకు సమీపమందుగల దక్షిణోత్తరదేశములవారు ఇందు ఆయామాసములలో చూపిన +,– ధనర్ణ చిహ్నములను గురించి సంస్కరించుకొనవలయును. ఇందు చూపిన విఘటికలు మాసాదియందు చూపబడినవి. మాసమధ్యయందు త్రైరాశికముచే దేశాంతరమును గ్రహించి సంస్కరించినచో సూర్యోదయాది స్ఫుటతిథ్యాది కాలములగును. ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలు పై ప్రకారము దేశాంతర విఘటికల కగు నిమిషములను ఈ విజయవాడ కగు సూర్యోదయ గంటలలో ధనర్ణ చిహ్నములకు వ్యత్యస్తముగా (అనగా విజయవాడకు పశ్చిమదేశమం దుండువారు కలుపగను, ప్రాగ్దేశవాసులు తీసివేయగను) సంస్కరించినయెడల స్టాండర్డ్ టైము ననుసరించి ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలగును; ఈ ప్రకారము సూర్యాస్తమయ కాలమును చేయదగును.

లగ్నాంతర సారణియందు దేశాంతర చక్రము

	మీన	మేష	వృష	మిథు	కర్కా	సింహ	కన్య	తుల	వృశ్చి	ధను	మక	కుంభ
మైసూరు	+19	+22	+24	+23	+20	+17	+13	+10	+ 8	+ 9	+11	+15
బెంగుళూరు	+14	+17	+19	+18	+16	+13	+10	+ 7	+ 5	+ 6	+ 8	+11
అనంతపురం	+13	+15	+15	+15	+14	+12	+11	+ 9	+ 9	+ 9	+10	+21
బళ్లారి	+16	+17	+17	+17	+16	+15	+14	+13	+12	+13	+13	+15
కర్నూలు	+11	+11	+12	+11	+11	+10	+10	+ 9	+ 9	+ 9	+10	+10
హైదరాబాదు	+ 8	+ 7	+ 7	+ 7	+ 8	+ 8	+ 9	+10	+10	+10	+ 9	+ 9
వరంగల్లు	+ 3	+ 2	+ 1	+ 1	+ 2	+ 4	+ 5	+ 6	+ 7	+ 6	+ 5	+ 4
తిరుపతి	+ 7	+ 9	+11	+10	+ 8	+ 6	+ 3	+ 1	— 0	+ 0	+ 2	+ 5
నెల్లూరు	+ 4	+ 5	+ 6	+ 6	+ 5	+ 3	+ 1	— 1	— 1	— 1	+ 0	+ 2
మదరాసు	+ 4	+ 6	+ 8	+ 7	+ 5	+ 2	— 1	— 4	— 5	— 4	— 2	+ 1
కుంభకోణం	+ 9	+13	+15	+14	+11	+ 6	+ 1	— 3	— 5	— 4	— 1	+ 4
కాంచీపురం	+ 6	+ 9	+10	+10	+ 7	+ 4	+ 1	— 2	— 3	— 3	— 0	+ 3
భద్రాచలం	— 3	— 3	— 3	— 3	— 2	— 1	— 0	+ 1	+ 1	+ 1	+ 0	— 1
బందరు	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 3	— 3	— 3	— 3	— 2
రాజమండ్రి	— 5	— 5	— 5	— 5	— 5	— 5	— 4	— 4	— 4	— 4	— 4	— 4
విజయనగరం	—12	—14	—14	—14	—13	—12	—10	— 9	— 8	— 8	— 9	—11
బర్హంపురం	—19	—21	—22	—22	—20	—17	—15	—13	—11	—12	—14	—16

ఇందు చూపబడిన లగ్నాంతకాలములు స్టాండర్డు టైము ననుసరించి విజయవాడకు లగ్నాంతకాలము లగుచున్నవి. ఇతరదేశములవారు, ఈ చూపబడినదేశాంతర చక్రము ననుసరించి, ఆయాలగ్నాంత కాలములకు చూపబడిన నిమిషములను, విజయవాడకు పశ్చిమదేశమున నుండు వారలు ఆయా కాలములలో కలుపగాను, ప్రాగ్దేశములయం దుండువారు తీసివేయగను, స్టాండర్డు టైముననుసరించి ఇష్టమగు ఆయా నగరములకు లగ్నాంత కాలము లగును.

భారతదేశమున అ. యా. అక్షాంశ ప్రదేశములకు మేషాది నిరయణ రాశి ప్రమాణములు — ఘటికలు-విఘటికలు-పరలు.

అక్షాంశ	మేషము	వృషభము	మిథునము	కర్కాటకము	సింహము	కన్య	తుల	వృశ్చికం	ధనుస్సు	మకరం	కుంభం	మీనం
	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.
10	౪-౩౫-౧౬	౫- ౮-౧౦	౫-౨౮-౧౧	౫-౨౦- ౧	౫- ౨-౧౯	౪-౫౭-౫౧	౫-౧౧-౧౩	౫-౨౭-౨౧	౫-౨౦-౫౧	౪-౫౦-౧౬	౪-౨౨-౧౭	౪-౧౬-౧౪
11	౪-౩౩-౨౬	౫- ౭-౧౦	౫-౨౮-౩౫	౫-౨౧-౩౨	౫- ౪-౨౨	౪-౫౯-౫౯	౫-౧౩- ౪	౫-౨౮-౨౦	౫-౨౦-౨౮	౪-౪౮-౪౪	౪-౨౦-౧౪	౪-౧౪- ౬
12	౪-౩౧-౩౪	౫- ౬-౧౧	౫-౨౮-౫౭	౫-౨౩- ౫	౫- ౬-౨౬	౫- ౨- ౮	౫-౧౪-౫౫	౫-౨౯-౨౦	౫-౨౦- ౫	౪-౪౭-౧౨	౪-౧౯-౧౦	౪-౧౧-౫౭
13	౪-౨౯-౪౧	౫- ౫-౧౧	౫-౨౯-౨౦	౫-౨౪-౩౮	౫- ౮-౩౧	౫- ౪-౧౮	౫-౧౬-౪౭	౫-౩౦-౨౧	౫-౧౯-౪౨	౪-౪౫-౩౮	౪-౧౬- ౫	౪- ౯-౪౮
14	౪-౨౭-౪౮	౫- ౪- ౯	౫-౨౯-౪౪	౫-౨౬-౧౨	౫-౧౦-౩౮	౫- ౬-౨౮	౫-౧౮-౪౧	౫-౩౧-౨౧	౫-౧౯-౧౯	౪-౪౪- ౪	౪-౧౩-౫౯	౪- ౭-౩౭
15	౪-౨౫-౫౩	౫- ౩- ౯	౫-౩౦- ౭	౫-౨౭-౪౭	౫-౧౨-౪౫	౫- ౮-౩౯	౫-౨౦-౩౬	౫-౩౨-౨౩	౫-౧౮-౫౫	౪-౪౨-౨౯	౪-౧౧-౫౨	౪- ౫-౨౫
16	౪-౨౩-౫౮	౫- ౨- ౭	౫-౩౦-౩౦	౫-౨౯-౨౩	౫-౧౪-౫౩	౫-౧౦-౫౩	౫-౨౨-౩౧	౫-౩౩-౨౫	౫-౧౮-౩౧	౪-౪౦-౫౩	౪- ౯-౪౩	౪- ౩-౧౨
17	౪-౨౨- ౧	౫- ౧- ౩	౫-౩౦-౫౫	౫-౩౧- ౧	౫-౧౭- ౨	౫-౧౩- ౮	౫-౨౪-౨౮	౫-౩౪-౨౮	౫-౧౮- ౭	౪-౩౯-౧౬	౪- ౭-౩౪	౪- ౦-౫౭
18	౪-౨౦- ౩	౪-౫౯-౫౯	౫-౩౧-౨౦	౫-౩౨-౩౯	౫-౧౯-౧౩	౫-౧౫-౨౪	౫-౨౬-౨౭	౫-౩౫-౩౨	౫-౧౭-౪౨	౪-౩౭-౩౭	౪- ౫-౨౩	౩-౫౮-౪౧
19	౪-౧౮- ౩	౪-౫౮-౫౪	౫-౩౧-౪౫	౫-౩౪-౧౯	౫-౨౧-౨౬	౫-౧౭-౪౧	౫-౨౮-౨౭	౫-౩౬-౩౭	౫-౧౭-౧౭	౪-౩౫-౫౮	౪- ౩- ౯	౩-౫౬-౨౪
20	౪-౧౬- ౧	౪-౫౭-౪౮	౫-౩౨-౧౦	౫-౩౬- ౦	౫-౨౩-౪౧	౫-౨౦- ౧	౫-౩౦-౨౮	౫-౩౭-౪౨	౫-౧౬-౫౩	౪-౩౪-౧౬	౪- ౦-౫౫	౩-౫౪- ౫
21	౪-౧౩-౫౮	౪-౫౬-౪౧	౫-౩౨-౩౬	౫-౩౭-౪౩	౫-౨౫-౫౭	౫-౨౨-౨౨	౫-౩౨-౩౧	౫-౩౮-౪౯	౫-౧౬-౨౭	౪-౩౨-౩౩	౩-౫౮-౩౯	౩-౫౧-౪౪
22	౪-౧౧-౫౨	౪-౫౫-౩౪	౫-౩౩- ౨	౫-౩౯-౨౭	౫-౨౮-౧౫	౫-౨౪-౪౫	౫-౩౪-౫౬	౫-౩౯-౫౭	౫-౧౬- ౧	౪-౩౦-౪౯	౩-౫౬-౨౧	౩-౪౯-౨౧
23	౪- ౯-౪౫	౪-౫౪-౨౫	౫-౩౩-౨౮	౫-౪౧-౧౪	౫-౩౦-౩౫	౫-౨౭-౧౦	౫-౩౬-౪౩	౫-౪౧- ౭	౫-౧౫-౩౩	౪-౨౯- ౩	౩-౫౪- ౧	౩-౪౬-౫౬
24	౪- ౭-౩౭	౪-౫౩-౧౪	౫-౩౩-౫౫	౫-౪౩- ౨	౫-౩౨-౫౮	౫-౨౯-౩౭	౫-౩౮-౫౩	౫-౪౨-౧౭	౫-౧౫- ౬	౪-౨౭-౧౫	౩-౫౧-౩౯	౩-౪౪-౫౮
25	౪- ౫-౨౫	౪-౫౨- ౨	౫-౩౪-౨౩	౫-౪౪-౫౨	౫-౩౫-౨౨	౫-౩౨- ౬	౫-౪౧- ౩	౫-౪౩-౨౯	౫-౧౪-౩౯	౪-౨౫-౨౫	౩-౪౯-౧౪	౩-౪౧-౫౯
26	౪- ౩-౧౧	౪-౫౦-౪౮	౫-౩౪-౫౨	౫-౪౬-౪౪	౫-౩౭-౫౦	౫-౩౪-౩౮	౫-౪౩-౧౭	౫-౪౪-౪౩	౫-౧౪-౧౧	౪-౨౩-౩౨	౩-౪౬-౪౭	౩-౩౯-౨౭
27	౪- ౦-౫౪	౪-౪౯-౩౪	౫-౩౫-౨౦	౫-౪౮-౩౯	౫-౪౦-౧౯	౫-౩౭-౧౩	౫-౪౫-౩౪	౫-౪౫-౫౮	౫-౧౩-౪౧	౪-౨౧-౩౮	౩-౪౪-౧౭	౩-౩౬-౫౩
28	౩-౫౮-౩౫	౪-౪౮-౧౭	౫-౩౫-౫౧	౫-౫౦-౩౫	౫-౪౨-౫౨	౫-౩౯-౫౦	౫-౪౭-౫౩	౫-౪౭-౧౪	౫-౧౩-౧౨	౪-౧౯-౪౧	౩-౪౧-౪౪	౩-౩౪-౧౫
29	౩-౫౬-౧౪	౪-౪౬-౫౮	౫-౩౬-౨౧	౫-౫౨-౩౫	౫-౪౫-౨౭	౫-౪౨-౩౧	౫-౫౦-౧౫	౫-౪౮-౩౩	౫-౧౨-౪౧	౪-౧౭-౪౧	౩-౩౯- ౯	౩-౩౧-౩౪
30	౩-౫౩-౪౮	౪-౪౫-౩౮	౫-౩౬-౫౨	౫-౫౪-౩౮	౫-౪౮- ౬	౫-౪౫-౧౪	౫-౫౨-౪౦	౫-౪౮-౫౪	౫-౧౨-౧౦	౪-౧౫-౩౯	౩-౩౬-౨౮	౩-౨౮-౫౧

N. B. పది అక్షాంశ ప్రదేశమున గల ఉత్తర ప్రాంతములు మొదలు ముప్పది అక్షాంశ ప్రదేశమున గల పట్టణ ప్రాంతములవరకు ఈ చూపిన నిరయణ మేషాది లగ్న ప్రమాణములను స్వీకరించవచ్చును. భారతదేశమున చాలాభాగము వరకు ఈ లగ్న ప్రమాణములను చూచి ఉపయోగించుకొనవచ్చును.

విజయవాడ ప్రాంతములకు మేషాది నిరయన లగ్న ప్రమాణములు—పుష్కరలు

లగ్న ప్రమాణములు			పుష్కర ప్రమాణములు		
మేషము	౪-౨౩	గం 1-45	మేషము	౩- ౪	గం 1-14
వృషభము	౫- ౨	గం 2- 1	వృషభము	౨-౨౦	గం 0-56
మిథునము	౫-౩౦	గం 2-12	మిథునము	౪-౨౪	గం 1-46
కర్కాటకము	౫-౩౦	గం 2-12	కర్కాటకము	౧-౧౮	గం 0-31
సింహము	౫-౧౬	గం 2- 6	సింహము	౩-౪౧	గం 1-28
కన్య	౫-౧౨	గం 2- 5	కన్య	౨-౨౬	గం 0-58
తుల	౫-౨౪	గం 2-10	తుల	౪-౧౯	గం 1-44
వృశ్చికం	౫-౩౪	గం 2-14	వృశ్చికం	౧-౧౮	గం 0-31
ధనుస్సు	౫-౧౯	గం 2- 7	ధనుస్సు	౩-౪౩	గం 1-29
మకరం	౪-౪౦	గం 1-52	మకరము	౨-౧౧	గం 0-53
కుంభం	౪- ౮	గం 1-39	కుంభము	౩-౧౮	గం 1-19
మీనం	౪- ౨	గం 1-37	మీనము	౦-౫౬	గం 0-22

గత లగ్నాంతకాలములో ముహూర్తలగ్న సంబంధమైన పుష్కర గంటలను కలిపిన ఆ ముహూర్త లగ్నమందు పుష్కర సమయము వచ్చును.

రాజమండ్రి ప్రాంతములకు మేషాది నిరయన రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౨	తులాయాః	౫-౨౪
వృషభస్య	౫- ౧	వృశ్చికస్య	౫-౩౫
మిథునస్య	౫-౩౦	ధనుషః	౫-౧౮
కర్కాటకస్య	౫-౩౦	మకరస్య	౪-౩౯
సింహస్య	౫-౧౭	కుంభస్య	౪- ౯
కన్యాయాః	౫-౧౩	మీనస్య	౪- ౧

విజయనగర ప్రాంతములకు మేషాది నిరయన రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౦	తులాయాః	౫-౨౨
వృషభస్య	౫- ౦	వృశ్చికస్య	౫-౩౬
మిథునస్య	౫-౩౦	ధనుషః	౫-౧౭
కర్కాటకస్య	౫-౩౩	మకరస్య	౪-౩౯
సింహస్య	౫-౧౮	కుంభస్య	౪- ౫
కన్యాయాః	౫-౧౬	మీనస్య	౩-౫౮

అయనాంశలు { ఇండియా ఆల్మనాకు ప్రకారం 23°-19'-43" (వేదాంగజ్యోతిషోక్త ధనిష్ఠాది చైత్రపక్షప్రకారం 23°-18'-31" అయనగతి 50", 26

మీ	మే	వృ	మి
ర చం బు	శు		
గు కు	వర్షలగ్నం		రా
శ కే			
ల			

మీ	మే	వృ	మి
శు బు	ర కు		
గురు	జగల్లగ్నం		చం రా
శ కే			
ల			

